# యాత్రాచరిత్రలు – చారిత్రక, సాంస్కృతికాంశాల పరిశీలన

పిహెచ్. డి పట్టం కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి

సమర్పించిన సిద్ధాంత గ్రంథం


పరిశోధన

ఉద్యా రమ్యజ్యోతి

(Reg. No. 10HTPH09)

పర్యవేక్షణ

ఆచార్య జి. అరుణకుమారి

తెలుగుశాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500046


ఫిబ్రవరి – 2018

# Yatracharitralu–Charithraka Saamaajika Samskruthika Pariseelana

Thesis submitted to the Department of Telugu
University of Hyderabad for the degree of

DOCTOR OF PHILOSOPHY

BY
**UDHYA RAMYA JYOTHI**
**(Reg No.10HTPH09)**

**Research Supervisor**
**Prof. G. ARUNAKUMARI**

DEPARTMENT OF TELUGU
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDERABAD
HYDERABAD- 500046

February- 2018

# DECLARATION

I, **Udhya Ramya Jyothi** hereby declare that this Thesis entitled **"Yatracharitralu – Charithraka Saamaajika Samskruthika Pariseelana"** submitted by me under the supervision of **Prof.G. Arunakumari** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodhganga/INFLIBNET.

**Date** **Name: Udhya Ramya Jyothi**

**Signature of the Student**
**Reg. No. 10HTPH09**

# CERTIFICATE

This is to certify the Thesis entitled **“Yatracharitralu – Charithraka Saamaajika Samskruthika Pariseelana”** submitted by **Mrs. Udhya Ramya Jyothi,** bearing **Regd. No.10HTPH09** in partial fulfillment of the requirements for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafide work carried out by her under my supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

**A. Published in the following publications:**

Parts of this thesis have been (NOT EXACT PARTS. Issues discussed in the following papers have been presented elaborately.)

1. **"Telugulo Yatracharitralu Vyvidhyam"**(ISBN 978-93-87540-03-3), Vyasa Ratnalu (Telugu Sahithya Vyasalu), Rotion Publications, Visakhapatnam, 2017.
2. **"Athreya Natakalu-Vastu Vyvidhyam"** (ISBN 978-81-9216580-6), Aadhunika Telugu Natakam- Sahithyam- Prayogam, Department of Telugu, University of Hyderabad, 2013

And

**B. Presented in the following conferences:**

1. **"Kavya Nayika Nayakula Sahaya Patralu Telugu Kavyala Samanvayam (UGC National Seminar, Telugu language, Literature & Journalism)",** 9-10th February, 2011, Department of Telugu, Andhra University, Visakhapatnam.
2. **"Rasani Kathalalo Girijana Jeevitha Chitrana”,(UGC National Seminar)**10-11th November-2014, Department of Telugu, Sri Venkateswara Arts College, Tirupati.

Further, the Student has passed the following courses towards fulfillment of coursework requirement for Ph.D./ was exempted from during coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses passed during her M.Phil program and the M.Phil degree was awarded.

| **Course Code** | **Name** | **Credits** | **pass/fail** |
|---|---|---|---|
| 1. HT600 | Research Methodology | 5.00 | PASS |
| 2. HT601 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT602 | Studies in Specialized Area | 3.00 | PASS |
| 4. HT603 | Broad Field | 4.00 | PASS |

**Prof. G. Arunakumari**
**Research Supervisor**

**Prof. T. Ramakrishna**
**Head, Dept. of Telugu**

**Prof. Panchanan Mohanty**
**Dean, Humanities**

# కృతజ్ఞతాభినందనలు

ఆసక్తి గల అంశంపై పరిశోధన చేసేందుకు అంగీకరించి అడుగడుగునా నాకు సలహాలు, సూచనలిస్తూ ప్రోత్సహించే గురువులు, మాతృతుల్యులు మరియు పర్యవేక్షకులు ఆచార్య జి.అరుణకుమారి గారికి మనఃపూర్వక పాదాభివందనాలు.

పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన గురువులు, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

పాఠాలు చెప్పడంతో పాటూ, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసిన అధ్యాపకులు ఆచార్య పరిమి రామనరసింహం, ఆచార్య ఎన్.ఎస్.రాజు, ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి, ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, డా. పమ్మి పవన్ కుమార్, డా. డి. విజయలక్ష్మి, డా. బాణాల భుజంగరెడ్డి, డా. విజయ కుమారి గార్లకి నమస్కారాలు.

అకడమిక్ విషయాల్లో సహకరించిన తెలుగు శాఖ ఆఫీస్ సిబ్బంది భవానీ శంకర్, రాంబాబు గార్లకు కృతజ్ఞతలు.

వెలకట్టలేనంత విలువైన పుస్తకాలను సేకరించి, మాకందిస్తున్న హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ గ్రంథాలయం వారికి, ఉస్మానియా విశ్వవిద్యాలయ గ్రంథాలయం, ఎస్.వి. యూనివర్శిటీ గ్రంథాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయ గ్రంథాలయం, అన్నమాచార్య గ్రంథాలయం (గుంటూరు) మరియు సి.పి. బ్రౌన్ గ్రంథాలయం (కడప) వారికి ధన్యవాదాలు.

నా పరిశోధనా గ్రంథాన్ని వేగంగానే కాక, స్పష్టంగా కూడా టైప్ చేసిన కృష్ణమోహన్ గారికి కృతజ్ఞతలు.

విశ్వభాష 'ఎస్పెరాంతో'ను నేర్పించి, విదేశీయుల ద్వారా నా పరిశోధనాంశానికి సమాచారాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించిన గురువులు, తిరుమల తిరుపతి దేవస్థాన మ్యూజియం అధికారి ప్రొఫెసర్ పొత్తూరి రంగనాయకులు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

అడిగిన వెంటనే తన యాత్రాచరిత్రల్ని ఇచ్చి వాటికి సంబంధించిన వివరాలను తెలియచేసిన ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపీ గారికి కృతజ్ఞతలు.

తన యాత్రాచరిత్ర గురించి విలువైన మనోభావాలను తెలియచేసిన ముదిగంటి సుజాతారెడ్డి గారికి ధన్యావాదాలు.

'షంఘై నింగిలో' అనే యాత్రా పుస్తకానికి సంబంధించిన వివరాలను తెలియచేసిన ఆచార్య రెడ్డి శ్యామల గారికి కృతజ్ఞతలు.

పరిశోధనలో నాకు వచ్చిన అనుమానాలను నివృత్తి చేసిన ఆచార్య మేడిపల్లి రవికుమార్, ఆచార్య శివుని రాజేశ్వరి మరియు డా. రాసాని గార్లకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

యాత్రాచరిత్రల పట్ల, వాటి పఠనం పట్ల స్ఫూర్తి కలిగించి, తన అమూల్యమైన పుస్తకాన్ని నాకందచేసిన ఆచార్య ఎమ్. ఆదినారాయణ (పాద యాత్రికులు) గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

జపాన్ చరిత్ర మరియు సంస్కృతిని గురించి వివరాలను తెలిపిన హోరి యసూవో (HORI YASUO)(జపాన్) గారికి,

నిరంతరం మా శ్రేయస్సును ఆకాంక్షించే విశాల హృదయులు, పితృసమానులు వెదిరె చైతన్య కరణ్ రెడ్డి గారికి కృతజ్ఞతాభివందనాలు.

నా పరిశోధనా యాత్రలో అడుగడుగునా సహకరించిన జూనియర్ మిత్రుడు కొల్లేటి రవిబాబు (పరిశోధక విద్యార్థి)కి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. పరిశోధన పుస్తకాల సేకరణలో సహకరించిన నా విద్యార్థి జి. వెంకటేష్ కు ధన్యవాదాలు మరియు ఆశీస్సులు.

నాలో ఎప్పటికప్పుడు పఠనాసక్తిని ప్రేరేపించే సోదరులు డా. కరణం శ్రీనివాసులు రెడ్డి, డా. చెన్నకేశవులు గార్లకు ధన్యవాదాలు.

ఎన్ని ఇబ్బందులున్నా, మమ్మల్ని ఉన్నత చదువులు చదివించిన నా తల్లిదండ్రులకు ఏమిచ్చినా ఋణం తీర్చుకోలేను.

అడుగడుగునా వెన్నుదన్నుగా నిలుస్తూ నాకు కొండంత ధైర్యాన్నిచ్చే నా జీవిత భాగస్వామి డా. లక్కినేని రాజీవ్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు.

వెలకట్టలేనంత ప్రేమను చూపిస్తూ, తమ చిలిపి అల్లరితో నా జీవితాన్ని నవ్వులమయం, రంగులమయం చేసే చెల్లెళ్ళు భార్గవి, దివ్యలకు ఆ ఆశీస్సులు.

తన రాకతో మా జీవితాన్ని ఆనందమయం చేసిన మా చిన్న పాపాయి 'ఆద్య' కు ముద్దులు మరియు ఆశీస్సులు.

**ఉద్యా రమ్యజ్యోతి**

# ముందుమాట

"సైర్‌కర్ దునియాకి గాఫిల్ జిందగానీ ఫిర్ కహాఁ

జిందగీ అగర్ కుచ్ రహీతో నౌ జవానీ ఫిర్ కహా!"

"ఓయీ! ప్రపంచమంతా తిరిగిరా జీవితం మళ్ళీ ఉండదు. ఒకవేళ కొంత మిగిలినా యవ్వనం తిరిగి రాదు" ప్రఖ్యాత సూఫీ గురువు ఖాజామీర్ దర్ద్ గజల్ లోని మాటలివి.

అనాది కాలం నుండీ మానవుడు సంచార ప్రియుడు. తన కాళ్ళనే రెక్కలుగా చేసుకుని తన చుట్టూ ఉండే లోకాన్ని చుట్టి రావాలని, సృష్టిలోని మధువును ఆస్వాదించాలనుకుని తపించే యాత్రా పిపాసి. **'తెలుగులో యాత్రాచరిత్రలు-చారిత్రక, సాంస్కృతికాంశాల పరిశీలన'** అనే అంశంపై పరిశోధన చేయడానికి కూడా నాలో ఉన్న ఆ సంచార ప్రియత్వమే కారణం. మొత్తం భారతదేశాన్నే కాదు, ప్రపంచం మొత్తాన్ని దర్శించాలనేది నా కోరిక. అయితే నేను చూడలేని, మరియు చూడాల్సిన ప్రాంతాలను గురించి తెలుసుకోవాలనే కుతూహలం నాకు మెండు. అందుకే యాత్రల పట్ల ఆసక్తితో అనేక యాత్రాచరిత్రల్ని చదివాను. ఆ యాత్రాచరిత్రల ద్వారా నేను చూడాలనుకున్న ప్రాంతాలను రచయితల కళ్ళతో దర్శించాను, వారి అనుభూతులతో మమేకం అయ్యాను. యాత్రా చరిత్రల పఠనం వల్ల ఉన్నచోటి నుండే అన్ని ప్రాంతాలను సందర్శించిన అనుభూతి కలిగింది.

అయితే యాత్రా చరిత్రల్ని చదివేటప్పుడు ఈ ప్రక్రియపై ఎక్కువగా పరిశోధనలు జరగలేదనే విషయాన్ని గమనించాను. తెలుగు పరిశోధనారంగంలో స్త్రీల యాత్రాచరిత్రలపై ఇంతవరకు పరిశోధనే జరుగలేదు. అందుకే నేను **'స్త్రీల యాత్రాచరిత్రలు-పరిశీలన'** అనే అంశంపై పరిశోధన చేసి, 2010వ సంవత్సరంలో తెలుగుశాఖ, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుండి M.Phil. పట్టాను పొందాను. అయితే నా పరిశోధన కంటే ముందే 1989లో 'తెలుగులో యాత్రాచరిత్ర'లు అనే పేరుతో మచ్చ హరిదాసుగారు

మొట్టమొదటిసారిగా యాత్రాచరిత్రలపైన పరిశోధన చేశారు. 2016వ సంవత్సరంలో ప్రొఫెసర్ ఎమ్. ఆదినారాయణగారు యాత్రాచరిత్ర ప్రారంభం నుండి వచ్చిన యాత్రా గ్రంథాలన్నింటినీ కలిపి,**'తెలుగు వారి ప్రయాణాలు'** పేరుతో సంకలన గ్రంథంగా ప్రచురించారు. ఇవి మినహా తెలుగు యాత్రా సాహిత్యాన్ని స్పృశించే పరిశోధనలు రాలేదనే చెప్పాలి. మచ్చహరిదాసుగారు 1989 వరకు గల యాత్రాచరిత్రలపై పరిశోధన చేశారు. నేను 1990 నుంచి 2017 వరకు అంటే దాదాపు 27 సంవత్సరాల మధ్యకాలంలో తెలుగులో వెలువడిన యాత్రాచరిత్రల్ని నా పరిశోధనకు తీసుకున్నాను. యాత్రాచరిత్రల్లో కన్పించే చారిత్రక, సాంస్కృతిక అంశాలపై ప్రత్యేకంగా పరిశోధన జరగాల్సిన ఆవశ్యకత ఉన్నందున '**తెలుగులో యాత్రాచరిత్రలు – చారిత్రక, సాంస్కృతికాంశాల పరిశీలన**' అనే అంశాన్ని నా పరిశోధనకు ఎంచుకున్నాను.

పరిశోధనా సౌలభ్యం కోసం **'తెలుగులో యాత్రాచరిత్రలు – చారిత్రక, సాంస్కృతికాంశాల పరిశీలన'** అనే పరిశోధనాంశాన్ని నాలుగు అధ్యాయాలుగా విభజించాను. అందులో మొదటిది, '**యాత్రలు-యాత్రాచరిత్రలు-స్వరూప స్వభావాలు**'. ఇందులో యాత్ర అనే పదానికి గల వివిధ అర్థాలు, యాత్రికుని లక్షణాలు, యాత్రా ప్రయోజనాలను వివరించాను. మొదటి యాత్రా చరిత్ర ఏది అనే అంశాన్ని చర్చించడం జరిగింది. యాత్రాచరిత్రల వర్గీకరణ దాని వికాస పరిణామాలను కూడా వివరించాను.

రెండవ అధ్యాయం **'తెలుగు యాత్రారచయితలు – యాత్రా చరిత్రలు పరిచయం'**. ఇందులో 1990 తర్వాత తెలుగులో వచ్చిన యాత్రా చరిత్రల్ని గురించి, ఆ యాత్రా రచయితల్ని గురించి పరిచయం చేశాను. '**యాత్రాచరిత్రలు-చారిత్రకాంశాలు**' అనే మూడవ అధ్యాయం నా పరిశోధనలో ప్రధానమైన భాగం. ఇందులో యాత్రా చరిత్రల్లో కన్పించే చారిత్రక అంశాల్ని వివరించాను. ఇందులో భాగంగా యాత్రాచరిత్రలో పేర్కొన్న కట్టడాలు నాటి చరిత్రకు ఎలా దర్పణం పడుతున్నాయో విశ్లేషించాను.

నాలుగవ అధ్యాయం '**యాత్రాచరిత్రలు - సాంస్కృతికాంశాలు**'. ఇందులో యాత్రా రచయితలు సందర్శించిన ప్రాంతాల యొక్క సంస్కృతులని విశ్లేషించాను. అందుకుగాను

యాత్రాకారులు తమ యాత్రాచరిత్రల్లో పేర్కొన్న స్థానిక పండుగలు, ఆచార–సంప్రదాయాలు, ఆహారం, మతం, నమ్మకాలు, కళలు మొదలైన అంశాలను ఆధారంగా చేసుకుని ప్రపంచంలోని వివిధ ప్రాంతాల యొక్క సంస్కృతీ వైవిధ్యాన్ని వివరించే ప్రయత్నం చేశాను.

1990 నుండి 2017 వరకూ ముద్రింపబడిన ఎనభై యాత్రాచరిత్రల్ని సేకరించాను. అందులో అరవై ఏడు యాత్రా గ్రంథాలు పురుషులు రాసినవి కాగా, మిగతా పదమూడు స్త్రీలు రాసినవి. వీటిలో నా పరిశోధనాంశ పరిధిలోకి వచ్చే నలభై ఐదు యాత్రాచరిత్రల్ని గ్రహించి, నా పరిశోధనా గ్రంథంలో విశ్లేషించాను.

# విషయసూచిక

**అధ్యాయం – 1** 1-29

1.0. యాత్ర – యాత్రాచరిత్ర – పరిచయం

1.1. యాత్ర – అర్థ వివరణ

1.2. యాత్ర – నిర్వచనాలు

1.3. యాత్రలు చేయడానికి గల కారణాలు

1.4. యాత్రికుడు – యాత్రా రచయిత – లక్షణాలు

1.5. యాత్రా ప్రయోజనాలు

1.6. యాత్రా చరిత్ర

1.7. తెలుగు సాహిత్యంలో మొదటి యాత్రాచరిత్ర – నిర్ణయం

1.8. యాత్రాచరిత్రల వర్గీకరణ

1.8.1. పద్య యాత్రా చరిత్రలు

1.8.1.1. ఆదిభట్ల నారాయణదాసు : కాశీయాత్రా చరిత్ర

1.8.1.2. కోలాశేషాచల కవి : నీలగిరి యాత్రా చరిత్ర

1.8.1.3. రామసుబ్బారాయుడు : కాశీయాత్ర

1.8.1.4. చివుకుల పెద్ద వేంకటాచలపతి : నా శ్రీశైల యాత్ర

1.8.1.5. ఆవంత్స సోమసుందర్ : ఆంగ్ల సీమలో ఆమని వీణలు

1.8.2. గద్య యాత్రా చరిత్రలు

1.8.3. స్వదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు

1.8.4. విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు

1.8.5. పురుషులు రాసిన యాత్రాచరిత్రలు

1.8.6. స్త్రీలు రాసిన యాత్రాచరిత్రలు

**అధ్యాయం – 2** 30-75

2.0. తెలుగు యాత్రారచయితలు – యాత్రా చరిత్రల విశ్లేషణ

2.1. ఎండ్లూరి సుధాకర్ – 'ఆట'జని కాంచె

2.2. కసిరెడ్డి వెంకట రెడ్డి – శివమెత్తిన చికాగో

2.3. కందేపి రాణీ ప్రసాద్ – విహారం

2.4. కేకలతూరి కృష్ణయ్య – దేశవిదేశీయాత్రా విశేషాలు

2.5. కురుగంటి శ్రీలక్ష్మి – షంఘై నింగిలో

2.6. కె. కుసుమారెడ్డి – కన్యాకుమారి దీపకళిక

2.7. దాశరథి రంగాచార్య – యాత్రాజీవనం

2.8. దేవులపల్లి కృష్ణమూర్తి – మా యాత్ర

2.9. ఎన్. గోపీ – జర్మనీలో కవితా యాత్ర

2.10. పరవస్తు లోకేశ్వర్– సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర

2.11. పాటిబండ్ల వెంకటపతి రాయలు – నా దక్షిణ భారత యాత్రా విశేషాలు

2.12. పెండ్యాల సత్యనారాయణ శర్మ – యాత్రా కమలాకరం

2.13. పి.వి. రంగనాయకులు – జపాన్ – ఒక నాగరక జైత్రయాత్ర

2.14. మల్లాది వెంకట కృష్ణమూర్తి – ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్

2.15. మండలి బుద్ధప్రసాద్ – నా జర్మనీ యానం

2.16. ముత్తేవి రవీంద్రనాథ్ – మా కేరళయాత్ర

2.17. ముదిగంటి సుజాతారెడ్డి – నైలునదీ నాగరికత

2.18. ఎమ్. ఆదినారాయణ – భ్రమణ కాంక్ష

2.19. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ – పాకిస్థాన్‌లో పది రోజులు

2.20. లావణ్య – సంపూర్ణ భారతదేశ యాత్రాదర్శిని

2.21. వాడ్రేవు చినవీరభద్రుడు – నేను తిరిగిన దారులు

2.22. వేమూరి బలరామ్ – రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు

2.23. వేమూరి రాజేష్ – మా ఐరోపా యాత్ర

2.24. వి. అశ్వనీ కుమార్ – దూర తీరాలలో

2.25. మంచికంటి – నా సైకిల్ యాత్ర దర్శనం

**అధ్యాయం – 3** 76-163

3.0. యాత్రా చరిత్రలు – చారిత్రకాంశాలు

3.1. చరిత్ర – నిర్వచనాలు

3.2. చారిత్రక ఆధారాలు – యాత్రాచరిత్రలు

3.2.1. కట్టడాలు

3.2.1.1. కోటలు

3.2.1.1.1. టవర్ ఆఫ్ లండన్

3.2.1.1.2. అజెంగో కోట

3.2.1.1.3. శ్రీరంగపట్నం కోట

3.2.1.1.4. చిత్తోడ్‌గఢ్ కోట

3.2.1.2. రాజ ప్రాసాదాలు (ప్యాలెస్‌లు)

3.2.1.2.1. టాప్‌కపీ పేలస్

3.2.1.2.2. వర్సైల్స్ రాజభవనం

3.2.1.2.3. కుదిర మాళిగ ప్యాలెస్

3.2.1.2.4. కనక కున్ను ప్యాలెస్

3.2.1.2.5. పద్మనాభపురం ప్యాలెస్

3.2.1.2.6. డచ్చి ప్యాలెస్

3.2.1.3. ఆలయాలు

3.2.1.3.1. ఫిలే దేవాలయం

3.2.1.3.2. కర్నాక్ దేవాలయం

3.2.1.3.3. అపోలో దేవాలయం

3.2.1.3.4. అక్రోపోలిస్ దేవాలయం

3.2.1.3.5. అనంత పద్మనాభ దేవాలయం

3.2.1.3.6. బృహదీశ్వరాలయం

3.2.1.3.7. సింహాచలం

3.2.1.4. చర్చిలు

3.2.1.4.1. సెయింట్ పీటర్ బసీలికా

3.2.1.4.2. సెయింట్ వైటస్ కెథడ్రిల్

3.2.1.4.3. హాజియా సోఫియా

3.2.1.4.4. సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్

3.2.1.4.5. పరదేశీ సినగాగ్

3.2.1.5. మసీదులు

3.2.1.5.1. బ్లూమాస్క్

3.2.1.5.2. డోమ్ బాబ్‌రా

3.2.1.5.3. కాంకేర్ మసీదు

3.2.1.5.4. అల్ ఫతే మసీదు

3.2.1.6. బౌద్ధారామాలు

3.2.1.6.1. లుంబిని

3.2.1.6.2. సారనాథ్

3.2.1.6.3. బుద్ధగయ

3.2.1.6.4. వెన్‌శూ ఆలయం

3.2.1.6.5. లీషాన్

3.2.1.6.6. గ్వాన్‌యిన్ బౌద్ధాలయం

3.2.1.6.7. నరోబుద్ధ

3.2.1.7. సమాధులు

3.2.1.7.1. ఈజిప్ట్ పిరమిడులు

3.2.1.7.2. కెటామాంబ్స్

3.2.1.7.3. చిత్నా సమాధులు

3.2.1.7.4. డచ్ స్మశానవాటిక

3.2.1.7.5. హోలోకాస్ట్ మెమోరియల్

3.2.1.7.6. గోరీ అమీర్

3.2.1.8. వస్తు ప్రదర్శన శాలలు (మ్యూజియమ్స్)

3.2.1.8.1. టెర్రకోటా సైనికుల మ్యూజియం

3.2.1.8.2. ఐన్‌స్టీన్ మ్యూజియం

3.2.1.8.3. మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం

3.2.1.8.4. కాపిటొలినె మ్యూజియం

3.2.1.8.5. నేపియర్ మ్యూజియం

3.2.1.9. క్రీడా మైదానాలు (స్టేడియం)

3.2.1.9.1. గ్లాడియేటర్స్ కలోజియం

3.2.1.9.2. సర్కస్ మాక్సిం

3.2.1.9.3. హెరోడియాన్ స్టేడియం

3.2.1.10. గోడలు

3.2.1.10.1. చైనావాల్

3.2.1.10.2. బెర్లిన్ గోడ

3.2.1.11. స్థూపాలు

3.2.1.11.1. ఈఫిల్ టవర్

3.2.1.11.2. బురానా టవర్

3.2.1.11.3. థియోడిసియస్ ఓబ్లిస్క్ (డికిలిటాస్)

3.2.1.11.4. ఓరియంటల్ పర్ల్ టవర్

3.2.1.11.5. లీనింగ్ టవర్ ఆఫ్ పీసా

3.2.1.12. ఇతర కట్టడాలు

3.2.1.12.1. అన్నేఫ్రాంక్ హౌస్

3.2.1.12.2. కాన్సన్‌ట్రేషన్ కాంప్స్

3.2.1.12.3. బ్రాన్‌డెన్‌బెర్గ్ గేట్

3.2.1.12.4. ట్రాఫాల్గర్ స్క్వేర్

3.2.1.12.5. సెక్రటేరియట్

3.2.1.12.6. చార్లెస్ బ్రిడ్జి

3.2.1.12.7. ఉలుగ్ బేగ్ మదర్సా

**అధ్యాయం – 4** 164-242

4.0. యాత్రాచరిత్రలు – సాంస్కృతికాంశాలు

4.1. సంస్కృతి–నిర్వచనాలు

4.2. పండుగలు

4.2.1. పండుగలు–నిర్వచనం

4.2.1.1. మతసంబంధమైన పండుగలు

4.2.1.2. ఋతుసంబంధమైన పండుగలు

4.2.1.3. జాతీయ పండుగలు

4.2.1.4. ఆధునిక దినోత్సవాలు

4.3. ఆచార–సాంప్రదాయాలు

4.4. ఆహారం

4.5. నమ్మకాలు

4.6. మతం

4.7. కళలు

4.7.1. కళ–నిర్వచనం

★ ముగింపు

★ ఆధార గ్రంథాలు

★ అనుబంధం

# మొదటి అధ్యాయం

# యాత్ర – యాత్రా చరిత్రలు – పరిచయం

# 1.0. యాత్ర – యాత్రా చరిత్ర - పరిచయం

## 1.1. యాత్ర-అర్థ వివరణ

సంస్కృతాంధ్ర నిఘంటువు యాత్ర అంటే తరలిపోవడం అనే అర్థాన్ని సూచిస్తుంది. తెలుగు వ్యుత్పత్తి పదకోశం ప్రయాణం, తీర్థానికి పోవటం అనే అర్థాలనిచ్చింది. సూర్యరాయాంధ్ర నిఘంటువు సేన వెడలుట, దాడి వెడలుట, తీర్థమునకు పోవుట, కాలము గడుపుట, జాతర, మహోత్సవము, ఉపాయము, దోవ, సాధనము అనే అర్థాలనిచ్చింది. శబ్ధరత్నాకరం యాత్ర అంటే పుణ్యక్షేత్రముల గురించి పోవుట, కాలము పుచ్చుట, జాతర అనే అర్థాలనిచ్చింది. ఆచార్య జి.ఎన్.రెడ్డి గారి నిఘంటువు యాత్ర అనగా జీవనోపాయము, వృత్తి, దారి, జాడ, త్రోవ, దిక్కు, పొలము, బడి, మార్గము, శవసానము, సంచారము, రహదారి సంక్రమణమనే పర్యాయ పదాలను సూచించింది.

ఆచార్య కేతువిశ్వనాథ రెడ్డి గారి వాడుక తెలుగు పదకోశం యాత్ర అంటే వివిధ ప్రాంతాలకు, పుణ్యక్షేత్రాలకు పోవటం, జాతర అనే అర్థాలను సూచించింది. యాత్రలకు పర్యాయ పదంగా 'యానం'ను కూడా మనం ఉపయోగిస్తున్నాము. విశ్వనాథరెడ్డిగారు 'యానం' అంటే పోవటం, దండెత్తి పోవటం, వాహనం, జనులెక్కిపోయే ఓడ అనే అర్థాలను ఇచ్చారు. శబ్దార్థ చంద్రికలో యాత్ర అంటే పుణ్యక్షేత్రాలకు పోవడం, కాలము పుచ్చడం, ఉత్సవము, మార్గము, దండు నడుచుట, ప్రయాణము, ముట్టడి, వాడుక, సంత, జీవనాధారము అనే అర్థాలున్నాయి. "జ్యోతి హిందీ – తెలుగు కోష్" యాత్ర అనే పదం సంస్కృత విశేష్య ఆకారాంత స్త్రీలింగమని, ప్రయాణము, తీర్థయాత్ర, మార్గము, ఉత్సవము అనే అర్థాలను కూడా సూచించింది. అమరకోశం యాత్రలకు ప్రజ్య, అభినిర్యాణం, ప్రస్థానం, గమ్యం అనే అర్థాలనిచ్చింది.

పైన నిఘంటుకర్తలు యాత్రకిచ్చిన అర్థాలను గమనించినట్లయితే యాత్ర అంటే ఆ కాలంలో వ్యాపార, వినోద, విజ్ఞాన, విహారయాత్ర కాదు, తీర్థయాత్రే అని తెలుస్తుంది. నిజానికి యాత్ర అంటే ఒకచోటి నుండి మరొకచోటికి వెళ్ళడం. కానీ సామాన్యార్థంలో

ఉత్సవము, జాతర, ప్రయాణము, దారి, మార్గము అనే అర్థాలు కూడా యాత్రకు కనిపిస్తున్నాయి. యాత్రికుడంటే సూర్యరాయాంధ్ర నిఘంటువులో బాటసారి, తీర్థవాసి, తీర్థయాత్రలు చేయువాడు అనే అర్థముంది.

మనిషి జీవితాన్ని కూడా జీవితయాత్ర, జీవన యాత్ర, జీవయాత్రగా పేర్కొంటాము. అలాగే చనిపోవడం అనే అర్థంలో దేహయాత్ర చాలించడం, వైకుంఠయాత్ర, కైలాస యాత్ర అనే పదాలను కూడా వాడుతూ ఉంటాము. చనిపోయిన తర్వాత శవానికి కర్మకాండలు నిర్వహించడానికి స్మశానానికి తీసుకుపోవడాన్ని 'శవయాత్ర' అంటారు. నిర్యాణాన్ని వైకుంఠయాత్ర అంటారు. అందుకే, "నీ చేతి మాత్ర వైకుంఠయాత్ర" అనే నానుడి వచ్చింది.

రాజరిక వ్యవస్థ అమలులో ఉన్న కాలంలో యాత్ర అంటే యుద్ధానికి సైన్యంతో సహా వెళ్ళడం. ఒక రాజ్యంపైకి దండెత్తి పోవటాన్ని కూడా దండయాత్ర అని మనం వ్యవహరిస్తున్నాం.

శంకరనారాయణ తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు యాత్రకు Going, Moving, Traveling, Tour, Journey, March, Voyage, Piligrimage, a festival అనే అర్థాలను సూచించింది. పాశ్చాత్యులు సాధారణంగా యాత్రకు పై పదాలన్నింటిని సమానార్థకాలుగా ఉపయోగిస్తున్నారు. కానీ ఈ పదాల మధ్య కూడా కొంత అర్థభేదం వుందని బ్రౌన్ పేర్కొన్నాడు. Excursion అంటే విహారమని అంటే విహారయాత్ర అని, Journey అంటే ప్రయాణమని, Tour అంటే సరదాగా తిరిగిరావడమని, మళ్ళీ మళ్ళీ తిరగడమని, Travel అంటే దుఃఖము, శ్రమము, వెళ్ళుట అని, Travels అనే బహువచనంలో దేశాంతరం పోవడం అనే అర్థాలనిచ్చాడు. Traveler అంటే దేశాంతరం పోయేవాడు, బాటసారి, పథికుడు, దేశము తిరుగువాడు అనే అర్థాలనిచ్చాడు. Voyage అంటే సముద్రం మీద ఓడ ఎక్కి పోవడం అనే అర్థాలనిచ్చాడు.

మన ప్రాచీన కాలంలో యాత్ర అంటే జైత్రయాత్ర, దండయాత్ర, విజయయాత్ర, దేహయాత్ర, శవయాత్ర అనే అర్థంలో వాడేవారు. తర్వాతి కాలంలో తీర్థయాత్ర అనే అర్థంలో వాడబడింది. యాత్రలు చేసొచ్చాము అంటే తీర్థయాత్రలకు వెళ్ళొచ్చాము అనే

మనం అర్థం చేసుకుంటున్నాము. కానీ ఆధునికకాలంలో యాత్ర అంటే తీర్థయాత్ర నే పరధి చెరిగిపోయింది. నేటి మానవునికి ఎప్పటికప్పుడు అవసరాలు పెరిగిపోతున్నాయి. తమ అవసరాలను తీర్చుకోవడానికి వ్యాపారరీత్యా, ఉద్యోగరీత్యా సుదూర ప్రాంతాలకు వెళ్ళాల్సి వస్తుంది. ఇలాంటి లక్ష్యంతో చేసే ప్రయాణాన్ని కూడా మనం నేడు యాత్రగానే పరిగణిస్తున్నాము. అయితే నేడు వినోదం కోసం, విజ్ఞానం కోసం యాత్రలు చేయడం కన్పిస్తుంది. అంటే నేడు యాత్ర అంటే తీర్థయాత్ర మాత్రమే కాదు, వినోద, విహార, విజ్ఞాన యాత్ర కూడా.

## 1.2. యాత్ర-నిర్వచనాలు

1. "చదువుతున్న అక్షరాలను ఆచరణలోకి అనువదించుకోవటమే యాత్ర. అక్షరాల అడుగుజాడలను అన్వేషించడమే యాత్ర" – పరవస్తు లోకేశ్వర్

2. "యాత్ర అంటే సంగడు అద్దంకి పోనూ పొయ్యాడు, రానూ వచ్చాడు అన్నట్టు కాదు. వెళ్ళిన వారి కళ్ళ ద్వారా ఆ అనుభవాలు, ఉద్వేగాల ద్వారా కొత్త ప్రదేశాల ప్రయాణ విశేషాల గురించి వివరించడమన్న మాట" – ఎన్.గోపి

3. "యాత్ర అంటే పయనం – ప్రయాణం – సాగడం. ప్రయాణానికి యానమే జీవితం. కదలిక, చేతన యానం జీవితం" – దాశరథి రంగాచార్య

పై నిర్వచనాలు గమనించినట్లయితే సందర్శనా కాలంనాటి అనుభవాల, స్పందనల సమాహారమే యాత్ర అని తెలుస్తుంది. ఆస్వాదన లేని యాత్ర ప్రయాణమవుతుందనే తప్ప, అనుభవాల మాలిక కాలేదు. జీవితం నిరంతరం చేతన స్థితిలో ఉంటుంది. ఆ చేతనలో యాత్రలు కూడా భాగం కావాలి. అసలు మనిషి జీవితమే ఒక యాత్ర. అందుకే జీవనయానం అనే పదం ఏర్పడింది.

"తేనెల తేటల మాటలతో

మనదేశ మాతనే కొలిచెదమా!

భావం, భాగ్యం చూసుకుని

సహజీవన యానం చేయుదమా" అనే దేశభక్తి గీతంలో ఈ జీవనయానం అనే పదాన్ని గమనించవచ్చు. మానవుడు నిర్వహించే అనేక మంచి పనులలో యాత్రలు కూడా ఒకటి. అందుకే దాశరథి రంగాచార్య గారు "యాత్రలు సక్రమంగా చేస్తే సత్కార్యాలు అవుతాయి. యాత్రలు మాత్రమే సత్కార్యాలు కావు. యాత్రలు కూడా సత్కార్యాలు" (యాత్రా జీవనం, పుట-56) అని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కూడా సమస్యలతో, బాధలతో సతమతమవుతుంటాడు. వీటి నుండి మనసుకు, మెదడుకు ప్రశాంతతను కలిగించి, ఆనందంగా జీవించడానికి కావల్సిన ఉత్తేజాన్ని యాత్రలు కలిగిస్తాయి.

## 1.3. యాత్రలు చేయడానికి గల కారణాలు

యాత్ర అంటే ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి వెళ్ళడం. యాత్రలు మానవ జీవన స్రవంతిలో ఒక ముఖ్యభాగం. తన జీవితకాలంలో ఒక్కసారి కూడా యాత్రలు చేయని మనిషి ఎవరూ ఉండరు. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో యాత్రలు చేసి ఉంటారు. వేరే ఊర్లో ఉంటే బంధువులను కలవడంతో, ఏదైనా పని నిమిత్తమో, ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా, లేదా తమ లక్ష్యం కోసమో, ప్రపంచంలోని వింతలను, విశేషాలను తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనో, పవిత్రమైన దేవాలయాలను దర్శించడం కోసంగానీ, ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు గాలి మార్పు, ప్రశాంతత కోసం, ఇలా ఏదో ఒక ఉద్దేశ్యంతో ఎప్పుడో ఒకప్పుడు ప్రతివ్యక్తీ యాత్రలు చేయక తప్పదు. ఆధునికకాలంలో వ్యాపారరీత్యా, ఉద్యోగ రీత్యా మాత్రమే కాదు, చదువుల కోసం కూడా సుదూర ప్రాంతాలకు వెళ్ళడం కన్పిస్తుంది.

యాత్రలు మానవునికి కావల్సిన సంతోషాన్నీ, ఆనందాన్నీ, ప్రశాంతతను కలిగిస్తాయి. ప్రతీ మనిషికి కూడా యాత్రలు చేయాలనే కోరిక వుంటుంది. ప్రపంచమంతా పర్యటించకున్నా పవిత్ర స్థలాలనైనా దర్శించాలనే కనీస కోరిక మనిషికి ఉంటుంది. ఉదా:- ముస్లింలు మక్కాకు, క్రిస్టియన్లు జెరుసాలెం, రోమ్‌లకు, హిందువులు కాశీ వంటి పుణ్యస్థలంలకు తమ జీవితకాలంలో ఒక్కసారైనా వెళ్ళాలని తపన పడుతుంటారు.

"యాత్రలు మానవ నాగరికతలో భాగం. యాత్రకు, మానవునికి ఉన్నంత ఇతిహాసం వుంది" (యాత్రాజీవనం, పుట-56). నాగరికత ఏర్పడే కాలానికి ముందే యాత్రలు జన జీవన స్రవంతిలో ఒక భాగమయిపోయాయి. ఈ భూమి మీద మానవుని ఉనికి ఎప్పుడు ప్రారంభమయిందో, యాత్ర కూడా అప్పుడే ప్రారంభమయి ఉంటుంది. ఆదిమ మానవులు తమ మనుగడ కోసం, ఆహారం కోసం ఎప్పుడూ సంచరిస్తూ ఉండేవారు. వీరి సంచారమే యాత్రలు చేయడానికి పునాది వేసింది. మనిషి చదవు, సంస్కారలను అలవరుచుకుని, నాగరికతను పొందిన తర్వాత అనేక ప్రాంతాలను చూడాలని, ఆ విశేషాలను తెలుసుకోవాలని కుతూహలపడుతూ వచ్చాడు. అతని కుతూహలమే యాత్రలు చేయడానికి ప్రేరణ కల్పించి ఉంటుంది. బాబిలోనియా, ఈజిప్టు నాగరికత కాలం నుండే విశ్రాంతి కోసం యాత్రలు చేయడం కన్పిస్తుందని చరిత్రకారుల అభిప్రాయం. ఈజిప్టియన్లు తమ దేవాలయాలపై చిత్రించబడిన శిల్ప సౌందర్యాలను, నిర్మాణాల విశిష్ఠతలను తెలుసుకునేందుకు క్రీ.పూ.600కు ముందు నుండే యాత్రలు చేసేవారట. గ్రీకులు ప్రముఖ నగర రాజ్యమయిన ఏథెన్స్‌లో జరిగే ఆటల పోటీలు, యుద్ధ విన్యాసాలను దర్శించాలని ఎక్కువగా అక్కడికి వెళ్ళేవారట. అంతేకాక మొట్టమొదటగా యాత్రానుభవాలను అక్షరబద్ధం చేయటం కూడా ఈ కాలం నుండే కల్పిస్తుంది. గ్రీకు రచయిత అయిన హెరడోటస్ ప్రపంచంలో మొట్టమొదటి యాత్రా రచయిత అని చరిత్రకారుల ఉద్దేశ్యం.

ఇక మధ్యయుగాల నాటికి ఒక లక్ష్యంతో యాత్రలు చేయటం కన్పిస్తుంది. ముఖ్యంగా జ్ఞానతృష్ణతో వివిధ నూతనాంశాలను తెలుసుకోవాలనే ఆసక్తితో చేసిన అన్వేషణా యాత్రలు ఈ కాలంలో కనిపిస్తున్నాయి. ఈ కాలంలోనే యూరోపియన్లు సముద్ర మార్గాలను కనిపెట్టారు. తద్వారా తమ వ్యాపార, వాణిజ్య ఆలోచనలకు ఈ అన్వేషణా యాత్రలు పురుడు పోసాయి. అంతేగాక మిషనరీలు, మత బోధకులు అనేక ప్రాంతాలకు యాత్రలు చేసి, క్రైస్తవ మత వ్యాప్తికి తమ వంతు కృషిని చేశారు.

ఆంగ్లేయుల పాలనా కాలంలో అనేకమంది క్రైస్తవమత ప్రచారకులు మన దేశానికి వచ్చారు. వారు దేశంలోని అనేక ప్రాంతాలను పర్యటించి, క్రైస్తవ మతాన్ని ప్రచారం

చేశారు. ఇవికూడా యాత్రలే. వీటిని మత ప్రచార యాత్రలనవచ్చు. పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచివారు, ఆంగ్లేయులు మొదలైన వారు వ్యాపారార్థం భారతదేశానికి వలస వచ్చారు. వలస రావటం అంటే ఒకరకంగా దానిని కూడా యాత్రగానే పరిగణించవచ్చు.

బ్రిటిషు వారి పరిపాలనా కాలంలో జరిగిన రైల్వేల నిర్మాణం భారతదేశ చరిత్ర గతిని మార్చిందని చెప్పటంలో సందేహం లేదు. ఈ రైల్వేల రాకతో నేడు యాత్రలు చేసే వారి సంఖ్య పెరిగింది. నేడు ప్రపంచీకరణ ఫలితంగా ఏ ప్రాంతానికైనా వెళ్ళడం సులభసాధ్యం. పైగా ఈ ప్రపంచీకరణ వల్ల వ్యక్తికి ఆర్థిక భరోసా కలుగుతోంది. దాంతో ఆధునిక కాలంలో భారతీయులు కూడా విరివిగా ప్రయాణాలు చేయడం, యాత్రలు చేయడం కన్పిస్తుంది.

ప్రాచీన భారతీయ సాహిత్యంలో కూడా యాత్రా సంబంధ విశేషాలను కవులు వర్ణించటం గమనించవచ్చు. ప్రాచీన కాలంలో విద్యాభ్యాసంలో యాత్రలు చేయడం కూడా ఒక భాగంగా ఉండేది. అందుకే రాకుమారులు, మంత్రి కుమారులు ఎక్కడో తమ రాజ్యానికి దూరంగా ఉన్న గురుకులాలకు వెళ్ళి, తమ విద్యాభ్యాసం ముగిసిన తర్వాత లోకజ్ఞానాన్ని అలవరచుకునేందుకు అనేక దేశాలు చుట్టివచ్చి, తమ దేశాటన వివరాలను స్నేహితులతో చర్చించడం మనం జానపద కథల్లో చదువుకొనే ఉంటాం. పూర్వకాలంలో వ్యక్తులు గృహస్థాశ్రమం ముగిసి, తమ బాధ్యతలన్నీ తీరిపోయాక, ప్రశాంతత కోసం, ముక్తి కోసం అడవులకో, హిమాలయాలలో వానప్రస్థం పేరుతో తరలి వెళ్ళేవారు. ఈ వానప్రస్థం కూడా ఒకరకంగా యాత్రే. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీ, నెహ్రూ, బాలగంగాధర్ తిలక్, రాజారామ్మోహన్‌రాయ్ వంటి స్వతంత్ర్యోద్యమకారులు ఆంగ్లేయులకు వ్యతిరేకంగా భారతీయులలో దేశభక్తిని ప్రేరేపించడం కోసం దేశమంతా అనేక యాత్రలు చేశారు. చిలకమర్తి లక్ష్మీ నరసింహరావు, గరిమెళ్ళ సత్యనారాయణ మొదలైనవారు అందుకు ఉదాహరణ. 19వ శతాబ్ది కాలంలో సమాజంలో ప్రబలిన అనేక మూఢాచారాలను, మూఢ నమ్మకాలను పారద్రోలటానికి ప్రజలలో వాటివల్ల అవగాహనను పెంపొందించేందుకు ఎందరో మహానుభావులు చైతన్యపూరిత యాత్రలు చేశారు.

పోతులూరి వీరబ్రహ్మంగారు, వేమన ఆంధ్రదేశంలోని అనేక ప్రాంతాలను పర్యటించి, తమ తత్వాలను, తాత్వికతను ప్రజలకు అందించారు. హిందువులు, ముఖ్యంగా బ్రాహ్మణులు సముద్రయానం చేయటాన్ని అపరాధంగా భావించే ఛాందస కాలంలోనే వివేకానందుడు అమెరికా దేశాన్ని పర్యటించి, తన వాక్చాతుర్యంతో అక్కడి ప్రజలలో భారతదేశం పట్ల, హిందూ ధర్మం పట్ల పవిత్రమైన భావం కలిగేటట్లు చేశాడు. 'నానా రాజ సందర్శనం' పేరుతో తిరుపతి వేంకట కవులు సాహిత్య యాత్రలు చేశారు. ఇదే స్ఫూర్తితో సాహిత్య యాత్రలు చేసిన కవి పుంగవులెంతమందో ఉన్నారు.

ఆదిశంకరాచార్యులు, గౌతమబుద్ధుడు, నేటి కాలంలో చిన్నజీయర్ స్వామి వంటి వారు మతోద్ధరణ కోసం యాత్రలు చేశారు, చేస్తూ ఉన్నారు. మౌర్యుల కాలంలో అశోకుని కూతురైన సంఘమిత్ర, కొడుకైన మహేంద్రవర్మలు బౌద్ధ మత వ్యాప్తి కోసం యాత్రలు చేసినట్లుగా చరిత్ర ద్వారా తెలుస్తుంది.

నేడు మన దేశనాయకులు ఇతర దేశాలకు, ఇతర దేశాల నాయకులు మనదేశానికి రావటం కన్పిస్తుంది. దీనివలన రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయి. ఇటువంటి రాజకీయ యాత్రల వల్ల రెండు దేశాల మధ్య పరస్పర సహకారం, మైత్రి కలుగుతాయి. దీనివల్ల యుద్ధ నివారణ సాధ్యమవుతుంది. తద్వారా దేశంలో శాంతి నెలకొంటుంది. అలాగే విదేశాల అభివృద్ధిని, వారి ఆర్థిక ప్రణాళికలను గురించి తెలుసుకోవడానికి కొందరు పరిశీలక యాత్రలు చేస్తుంటారు. ఉదా: మాలతీ చందూర్ గారు (నవభారతి)

మెడికల్ రిప్రజెంటేటివ్ వంటి ఉద్యోగులు తమ ఉద్యోగ రీత్యా ఎప్పుడూ అనేక ప్రదేశాలకు వెళుతూనే ఉంటారు. కొందరు వ్యాపార రీత్యా యాత్రలు చేస్తుంటారు. కొలంబస్, వాస్కోడి–గామా, అమెరిగో వెస్పుకి వంటి పాశ్చాత్యులు అనేక ప్రదేశాలను కనుగొనటం కోసం అన్వేషణ యాత్రలు చేశారు. నేడు విజ్ఞానం కోసం, వినోదం కోసం విరివిగా యాత్రలు చేయటం కన్పిస్తుంది. అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు ప్రశాంతత కోసం ఆరోగ్యకరమయిన వాతావరణం అవసరమని డాక్టర్లు చెబుతుంటారు. ఆరోగ్యం

కుదుట పడటానికి కూడా యాత్రలు ఉపకరిస్తాయి. పిల్లలకు వేసవి సెలవులు, సంక్రాంతి సెలవులు ఇచ్చినప్పుడు ఆటవిడుపు కోసం సరదాగా, వినోద యాత్రలు చేయడం కూడా మనం గమనిస్తున్నాము. పాపాలు నశించి, పుణ్యఫలాన్ని దక్కించుకోవాలని తీర్థయాత్రలు చేస్తుంటారు. అలాగే నదులకు పుష్కరాలు వచ్చినప్పుడు అధికశాతం పుణ్యక్షేత్రాలకు యాత్రలు చేయడం మనకు తెలిసిందే.

సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ ఆధునికకాలంలో రోదసీ యాత్రలు, చంద్రమండల యాత్రలు కూడా కనిపిస్తున్నాయి. కొందరు ఎవరూ చేయని సాహసాలు చేయాలని, తమకంటూ ఒక గుర్తింపు ఉండాలని కోరుకుని సాహస యాత్రలను చేస్తున్నారు. దీనికి కారణం నేడు యాత్రికుల ఉద్దేశ్యాలు, వారి లక్ష్యాలు మారుతుండటమే. యాత్రలు చేయడంలో మానవుడు ఎప్పటికప్పుడు తన సృజనను చాటుతున్నాడు. కొత్త, కొత్త లక్ష్యాల కోసం యాత్రలు చేస్తున్నాడు. అయితే యాత్ర ఏ ఉద్దేశ్యంతో చేసినా మనిషికి ఆనందాన్నిస్తుంది. కొత్త విషయాలను తెలుసుకునేందుకు తోడ్పడుతుంది. “ఋతువుల పరివర్తనం, విభిన్న దేశాల, ప్రాంతాల విభిన్న స్వరూపాలు, ప్రకృతిలోని విభిన్నతలు, సౌందర్య వైచిత్రి, జనుల ఆచార వ్యవహారాలు మొదలైనవి మానవునికి ఎనలేని ఆనందాన్ని, కుతూహలాన్ని కల్గిస్తాయి. సౌందర్య దృష్టి నుంచి పొందిన ప్రేరణ అతని యాత్రా ప్రవృత్తికి దోహదం చేస్తుంది” (తెలుగులో యాత్రాచరిత్రలు, పుట-14). మనిషి ఎప్పుడూ కొత్తదనాన్ని, ఇతరులతో సత్సంబంధాలను కోరుకుంటాడు. యాత్రలు ఈ లక్ష్యాలను నెరవేర్చడంలో ముందుంటాయి.

ఈ విధంగా భిన్న కారణాలతో యాత్రలు చేయడం మనం చూస్తున్నాము. యాత్రలు చేసే యాత్రికుల సంఖ్య నేడు గణనీయంగా పెరిగింది. రవాణా సౌకర్యాల అభివృద్ధి చెందటమే కాక, వాటి ధరలు సామాన్య మానవునికి కూడా అందుబాటులో ఉండటమే అందుకు కారణం. అయితే ఆధునికకాలంలో ఉన్నన్ని సౌకర్యాలు పూర్వం లేవు. పూర్వకాలంలో యాత్రలు చేయాలంటే నడకే శరణ్యం. గుర్రపు బండ్లు, ఎద్దుల బండ్లు వంటివి ఉన్నా, అవి ధనవంతుల వరకే పరిమితం. అందువల్లనే అప్పుడు “కాశీకి యాత్ర

చేస్తే కాటికి పోయినట్లే" అని అనుకునేవారు. అప్పట్లో ప్రయాణ సాధనం కేవలం నడకే. నడక ద్వారా కాశీకి వెళ్తే వారు తిరిగి ఇంటికి వచచే వరకూ నమ్మకం ఉండేది కాదట. దారిలో అడవులను దాటుకుంటూ ప్రయాణం చేయాల్సి వచ్చేది. దొంగలభయం, అడవి మృగాల భయం, తిండి, నీళ్ళు దొరకకపోవడం, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం ఇలాంటి ఎన్నో ఇబ్బందులను యాత్రికులు తట్టుకోవాల్సి వచ్చేది. ఆధునిక కాలంలో సాంకేతికత పెరిగి, రవాణా సౌకర్యాలు పెరిగి వాహనాల వలన ప్రయాణం చేయడం చాలా సులభమయింది. ఎక్కడికి వెళ్ళాలన్నా తొందరగా వెళ్ళవచ్చు. అందువల్ల రోజు రోజూకీ యాత్రలు చేసే వారి సంఖ్య పెరిగిపోయింది. రైళ్ళు, బస్సలు వంటి వాహనాలు తక్కువ ఖర్చుతోనే అనేక ప్రాంతాలను చూపిస్తున్నాయి. అనేక ప్రదేశాలకు యాత్రలు చేయించడం కోసం ప్రత్యేకంగా టూరిస్టు బస్సులు కూడా నడపబడుతున్నాయి. ఈ మధ్య కాలంలో రైల్వేలు, RTC కూడా యాత్రల కోసం కొన్ని బస్సులను ప్రత్యేకంగా నడుపుతున్నాయి. దీనిని బట్టి యాత్రలంటే మనిషికి ఎంత ఆసక్తి వుంటుందో అర్థమవుతుంది. పూర్వకాలంలో కాలినడకన ప్రయాణం చేస్తే ఎన్ని ప్రమాదాలున్నాయో, అన్ని ప్రమాదాలు వాహనాల ద్వారా కూడా జరుగుతున్నాయి. రైళ్ళల్లో దొంగతనాలు జరగడం, బోగీల్లో మంటలు చేలరేగి ప్రయాణీకులు ప్రమాదాల పాలవటం, మనం చూస్తూనే ఉన్నాం. 2009 సెప్టెంబర్ 2వ తేదీన అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ డా|| వై.యస్.రాజశేఖర్ రెడ్డిగారు హెలికాప్టర్‌లోని సాంకేతిక లోపాల వల్ల హెలికాప్టర్ క్రాష్ అయి దుర్మరణం చెందారు. కాలినడక ప్రయాణం చేసినప్పుడు మనిషి ప్రాణానికి భద్రత లేదు, ఆధునిక కాలంలో అన్ని సౌకర్యాలున్నా, సాంకేతికత, విజ్ఞానం, అభివృద్ధి చెందినా ప్రాణానికి భద్రత లేదు.

## 1.4. యాత్రికుడు – యాత్రా రచయిత – లక్షణాలు

ఒకవ్యక్తి యాత్రలు చేయాలన్నా తన అనుభవాలను, అనుభూతులను యాత్రాచరిత్రలుగా అక్షరీకరించాలన్నా, అతనికి కొన్ని లక్షణాలుండాలి. పరిసర పరిశీలన దృష్టి యాత్రలు చేసేవారికి ఉండవల్సిన ప్రధాన లక్షణం సహేతుకమయిన దృష్టితో

అభ్యాసం చేయాలి. అందుకే ఈ రోజుల్లో పిల్లలకు పాఠశాలలో ఐదు నిమిషాలు సమయాన్నిచ్చి, తమ తరగతి గదిలోని వస్తువులను ఒక సెకండులో చెప్పే పరిశీలనాత్మక పరీక్షలను పెడుతున్నారు. ఇది పరిసర పరిశీలనా దృష్టిని పెంపొందించటానికి చేసే ప్రయత్నం. దీని వలన ధారణాశక్తి పెరుగుతుంది. ఈ లక్షణం యాత్రలు చేసే వారికి, ముఖ్యంగా యాత్రా చరిత్రలు రాసే వారికి అవసరం.

1. యాత్రికునికి పరిశీలనా దృష్టి ఉండాలి.

2. కొత్త విషయాలను తెలుసుకోవాలనే కుతూహలం ఉండాలి.

3. తన అనుభూతులను అక్షరబద్ధం చేయగల నేర్పు ఉండాలి.

4. తన యాత్రానుభవాలను లిపిబద్ధం చేసేటప్పుడు స్పష్టత, విశ్లేషణా శక్తి అవసరం.

5. ప్రజలతో కలిసిపోయే తత్త్వాన్ని కలిగి వుండాలి.

6. సమయానుకూల ప్రవర్తన అవసరం.

7. విభిన్న భాషల మీద అవగాహన ఉండాలి.

8. వాస్తవిక దృష్టి ముఖ్యం

9. యాత్రా రచనలో అలంకారయుక్తి, అతిశయోక్తి ఉండకూడదు.

10. ఏ యాత్రికునికైనా అనుభవం, అనుభూతి ముఖ్యం.

11. ముఖ్యంగా యాత్రికుడు సహనాన్ని, ఓపికను కలిగి ఉండాలి.

యాత్రికుడు చరిత్రకారుడైతే ఒక ప్రాంతంలోని చారిత్రక అంశాలన్నింటినీ లిపిబద్ధం చేస్తాడు. అదే సాహిత్యకారుడైతే సాహిత్యాంశాలను తన యాత్రాచరిత్రలో పొందుపరుస్తాడు. విజ్ఞాన శాస్త్రవేత్త అయితే అక్కడి సాంకేతిక పరిజ్ఞానాన్ని ముఖ్యంగా వివరిస్తాడు. కానీ వీటన్నింటి కంటే సాహిత్యకారుడు చేసే యాత్రే మనోహరంగా ఉంటుంది. “సాహిత్యకారుడు చేసే యాత్ర సమ్మోహకంగా సుకుమార ప్రవృత్తిని కలిగి వుంటాడు. సామాన్యులకు ఈ గొడవలేమీ పట్టవు. సామాన్యులు ఎన్ని ప్రదేశాలు దర్శించినా, వాటి బాహ్య దూరా భారాలనే గ్రహిస్తారు. కానీ సాహిత్యకుల్లా ప్రతిస్పందించలేరు. పవృత్తమైన హృదయంతో ప్రతీదాన్నీ పరిశీలిస్తారు. కాబట్టి సాహిత్యకుల పరిభ్రమణంలో యాత్ర

పరిపూర్ణ సాఫల్యం పొందుతుంది. స్థాయిలోనే కాక, సాహిత్యకులకు,ఇతరులకు మౌలికంగా దృష్టి కోణంలో కూడా తేడా వుంటుంది. సామాన్య యాత్రికుడు కేవలం భ్రమణమాత్రుడై, దాన్ని సంపూర్ణ యాత్రగా భావిస్తాడు. కానీ సాహిత్యకుడు ఆ యాత్రను ఆంతరంగికంగా అనుభవించి, దానిని ఒక క్రమపద్ధతిలో లేఖనబద్ధం చేసి, ప్రజలకందిస్తాడు. అది లోతుగా అనుభవించింది కావటం వల్ల సుదీర్ఘమైన, సార్ధకమైన జీవనయాత్రగా మిగుల్తుంది" (తెలుగులో యాత్రాచరిత్రలు, పుట-17). అందుకే సాహిత్యకుడు రాసిన అనుభవాలను చదువుతుంటే ప్రత్యక్షంగా మనమే యాత్ర చేశామన్న అనుభూతి కలుగుతుంది. సామాన్య యాత్రకులకీ, సాహిత్య యాత్రికుల మధ్య ఉన్న ప్రధాన భేదం అదే. కవిగానీ, రచయిత కానీ రాసిన యాత్రాచరిత్రల్లో అనుభూతి స్పర్శ ఎక్కువగా ఉంటుంది. అందుకే వారి స్వీయానుభవాలను చదివిన పాఠకుడు కూడా రచయితతో సమానమయిన అనుభూతిని, ఉద్వేగాన్ని పొందుతాడు.

అయితే చరిత్రకారుల యాత్రలు, యాత్రానుభవాలు కూడా ఆసక్తిదాయకంగా, విజ్ఞానదాయకంగా ఉంటాయి. ప్రాచీనకాలంలో పాశ్చాత్య యాత్రికులు అనేకమంది భారతదేశాన్ని దర్శించి, మనదేశంలో మన దేశస్థులకు కనపడని సూక్ష్మ విషయాలన్నింటిలో తమ యాత్రాచరిత్రల్లో పొందుపరిచారు. వీరి యాత్రాచరిత్రల వలన ఆనాటి భారతదేశ పరిస్థితులను తెలుసుకోవచ్చు. పాశ్చాత్య యాత్రికులందరిలోనూ ఒక సామాన్య గుణం కనిపిస్తుంది. వారు ఎన్ని యాత్రలు చేసినా, అన్నింటినీ లిపిబద్ధం చేసి, ప్రపంచానికి అందించారు. వీరి యాత్రాచరిత్రల్లో భారతదేశానికి సంబంధించిన విలువైన అంశాలను పొందుపరిచే క్రమంలో కొన్నిసార్లు ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకోకుండా, స్థలకాలాదుల ఆంతర్యాన్ని గమనించకుండా, కొన్ని అంశాలను తమదైన దృష్టికోణం లోంచి చూసి, విమర్శనాత్మకంగా కొన్ని అంశాలను పేర్కొన్నారు. ఒకదేశ సాంప్రదాయం మరొక దేశానికి సంస్కారహీనంగా కన్పించవచ్చు. కాబట్టి వీరి యాత్రా చరిత్రల్లో కొంత విమర్శనాత్మక శైలి కన్పిస్తుంది.

## 1.5. యాత్రా ప్రయోజనాలు

యాత్రల యొక్క పరమ ప్రయోజనం మనల్ని మనకు చేరువ చేయటమే. యాత్రలు మనిషి మనసును, సేదతీర్చి మెదడుకు విశ్రాంతినిచ్చి తనలోకి తాను అంతఃపయనం చేసేందుకు, స్వీయ విశ్లేషణకు అవకాశం కల్పిస్తాయి. సామాజిక సంబంధాలను సత్సంబంధాలుగా ఎలా మార్చుకోవాలో యాత్రలు నేర్పిస్తాయి. యాత్రికుడు అనేక ప్రాంతాలను పర్యటించే క్రమంలో భిన్న భాషలతో అతనికి పరిచయం ఏర్పడుతుంది. తోటివారితో కలిసిపోయే తత్త్వం, ఇతరులకు సహాయం చేసే గుణం అలవడతాయి. యాత్రికులకు మార్గం మధ్యలో అడ్డంకులు, అవాంతరాలు ఎదురయినప్పుడు వాటిని పరిష్కరించుకోగల సామర్థ్యం అలవడుతుంది. అందుకే యాత్రాచరిత్రలపై పరిశోధన చేసిన డా॥ మచ్చహరిదాసుగారు యాత్రా ప్రయోజనాలను ఈ విధంగా పేర్కొన్నారు. "గ్రంథ పఠనం వల్ల లభించే జ్ఞానం కేవలం సిద్ధాంత ప్రాయమయితే, దేశయాత్ర ఆ జ్ఞానికొక విధమయిన ప్రయోగం వంటిది. అంటే బడి చదువు విద్యార్థులను అర్థమానవులను చేస్తే, దేశాటనం సమగ్ర మానవులను చేస్తుంది" (తెలుగులో యాత్రాచరిత్రలు, పుట-43).

ఉదాహరణకు రవీంద్రనాథ్ టాగోర్ తన 11వ ఏట తండ్రితో దేశాటనం చేసాడు. తత్ఫలితంగా అతని మనసులో పడిన ముద్రకు ప్రతిరూపమే శాంతినికేతన్. ముఖ్యంగా యాత్రలు విద్యావ్యవస్థలో భాగమయినట్లయితే, అవి విద్యార్థుల సంపూర్ణాభివృద్ధికి బాటలు వేస్తాయి. "విజ్ఞానయాత్ర వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఆవిష్కరించబడటమేగాక, వారిలో సమయస్ఫూర్తి, కలుపుగోలుతనం, కష్టసహిష్ణత, స్నేహశీలత, లౌకిక పరిజ్ఞానం, విజ్ఞానం మొదలైన అంశాలు పెంపొందుతాయి. విషయజ్ఞానంతో పాటు, ప్రకృతి సౌందర్యాన్ని కూడా ఆస్వాదించగలరు. వివిధ సంస్కృతి, సాంప్రదాయాలు, చారిత్రక విశేషాలు, ఆచార-వ్యవహారాలు, వివిధ దేశ పరిస్థితులు గ్రహించగలుగుతారు" (కన్యాకుమారి దీపకళిక, పుట-ముందుమాట).

జీవితానికి సంపూర్ణతను ఇచ్చేవి యాత్రలే అని అనటంలో సందేహంలేదు. యాత్రలు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్నిస్తాయి. మనిషిని సేదతీర్చి, ప్రశాంతతనిచ్చి,

అతని ఆయుష్షును పెంచుతాయి. సృష్టిలోని ప్రకృతి వైవిధ్యాన్ని దర్శించేందుకు యాత్రలు చేయటం అత్యంత ఆవశ్యకం. అంతేకాక శతాబ్దాల సంస్కృతిని, కళలను, దర్శించి, తరించేందుకు, వాటి విలువలను తెలుసుకునేందుకు యాత్రలు తోడ్పడుతున్నాయి. మనోవికాసానికి, మేధో వికాసానికి ఇవి బాటలు వేస్తున్నాయి. "ఎటువంటి వివేక హీనునికైనా దేశాటనం వల్ల విజ్ఞానం కలుగుతుంది... యాత్రలు లౌకిక విషయ విజ్ఞానానికి విద్యా సముపార్జనకు ముఖ్య సాధనాలు" (తెలుగులో యాత్రాచరిత్రలు, పుట-42). యాత్రలు చేయటం వల్ల మనసు విశాలమవుతుంది. ప్రాకృతిక ప్రదేశాలను సందర్శించినప్పుడు మనసుకు ఆహ్లాదం, ప్రశాంతత లభిస్తాయి. తీర్థయాత్రలు చేస్తే పుణ్యఫలం, ముక్తి దక్కుతుందనే విశ్వాసం మనకు ముందు నుండీ ఉన్నదే. అందుకే "తీర్థయాత్రలు మనిషిని ఓదారుస్తాయి. మనుసుకు విశ్రాంతిని కలిగిస్తాయి. ఎండకు డస్సిన వానికి చెట్టు నీడా, చేదబావి వంటివి ... బావి నీళ్ళు చేదుకుని కాళ్ళమీద పోసుకుని, తల తడపుకుని, చెట్టు నీడన పడుకుంటే ఎంత హాయి!" అంటూ దాశరథిగారు భావుకతతో వివరించారు. దాశరథి గారు తీర్థయాత్రలనే పేరుతో పై అభిప్రాయాన్ని చెప్పినా, ఏ యాత్రకైనా ఈ అభిప్రాయం సరిపోతుంది.

యాత్రలు మన చరిత్ర పట్ల, సంస్కృతి పట్ల అవగాహనను పెంచుతాయి. విజ్ఞానాన్ని, వినోదాన్ని కలిగించటమే గాక, మనలో సృజనాత్మకతను కూడా పెంపొందిస్తాయి. యాత్రల వల్ల యాత్రాకాలం నాటి సామాజిక, రాజకీయ, ధార్మిక, సాంస్కృతిక పరిస్థితులు అవగతమై, తరువాతి తరాలకు ఒక గొప్ప ప్రేరణ లభిస్తుంది. యాత్రికుడు అనేక ప్రాంతాలను పర్యటించినప్పుడు ఆయా ప్రాంతాల ప్రజల వేషభాషలు, ఆహారపు అలవాట్లు, పంటలు, భౌగోళిక, సాంస్కృతిక పరిస్థితులు ఒక ప్రాంతానికి, మరొక ప్రాంతానికి భిన్నంగా ఉండటం గమనిస్తాడు. వీటిని అవగతం చేసుకునే క్రమంలో అతనికి ప్రపంచజ్ఞానం అలవడుతుంది.

యాత్రలు కావ్య నిర్మాణానికి కూడా తోడ్పడతాయి. సంస్కృత గద్యకావ్య రచయిత అయిన దండి స్వస్థలం కంచి. ఇక్కడ స్వదేశీ, విదేశీ వ్యాపారం జోరుగా జరిగేదట.

అందుకోసం వివిధ దేశాల నుండి వ్యాపారార్థం అక్కడికి విడిది చేసిన యాత్రికులు తమ స్వీయగాథల్ని, కథల్ని తోటి ప్రయాణీకులతో చెప్పుకునేవారట. ఇలాంటి తాను విన్న ఎన్నో కథలకు కాల్పనిక ప్రతిభను అద్ది, దండి దశకుమార చరిత్రను రచించాడు. కాబట్టి యాత్రానుభూతి ఒక మంచి కావ్య నిర్మాణానికి దోహదపడుతుంది.

అలాగే పాల్కురికి సోమన పండితారాధ్య చరిత్రలో

"ఆదట గంధర్వ విద్యాధరాదులై

పాడెడు నాడెడు వారు"

అని తాను శ్రీశైలాన్ని సందర్శించినప్పుడు అక్కడి ప్రజలు యక్షగానాలు ఆడుతున్నారని తెలిపాడు. ఇతడు శ్రీశైలానికి యాత్ర చేశాడు కాబట్టే ఈ విషయాలను తన కావ్యంలో పొందుపరిచాడు. దీనివలన యక్షగాన ప్రాచీనతను గురించి పరిశోధకులు తెలుసుకునే అవకాశం కలిగింది.

శ్రీనాథుడు కూడా అనేక రాజస్థానాలను సందర్శించి, ఆశువులుగా కొన్ని చాటువులను చెప్పాడు. తెలుగు సాహిత్యంలో అతని చాటువులకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఇతని యాత్రలను సాహిత్య యాత్రలనవచ్చు. ఆడిదం సూరకవి కాశీయాత్రకు, ఉత్తర భారతదేశయాత్ర, జగన్నాథ యాత్రలకు వెళ్ళారని, సంవత్సరంలో ఐదారు మాసాల పాటూ దేశాటనం చేసి, పుణ్యక్షేత్రాలను, పండితోత్తములను దర్శించుకుంటూ తిరిగి చీపురుపల్లిలో ఉన్న తన గృహానికి వచ్చి, తన అనుభవాలను గ్రంథాలుగా రాసి, ధనం సంపాదించుకునే వాడని, 'ఆడిదం సూరకవి – జీవితం' అనే పుస్తకం ద్వారా తెలుస్తుంది.

స్వయంగా కవులు, రచయితలు చేసిన యాత్రలే కాక, యాత్రల ప్రస్తావన ఉన్నవారి గ్రంథాలు కూడా తెలుగు సాహిత్యంలో ఉన్నాయి. మనుచరిత్ర ప్రబంధంలో ప్రవరునికి యాత్రలు చేయడం పట్ల ఆసక్తి ఉన్నట్లుగానూ, అతడు హిమాలయాలకు యాత్ర చేసినట్లుగా వర్ణించాడు పెద్దన. ప్రబంధాల్లోనే కాక, నవలలు, కథలల్లో కూడా యాత్రల ప్రసక్తి కన్పిస్తుంది. తెలుగు సాహిత్యంలో వచ్చిన కొన్ని నవలల్లో, కథల్లో కూడా నాయకుడు గానీ, ఇతర పాత్రలు గానీ యాత్రలు చేసినట్లుగా, వర్ణించిన సందర్భాలున్నాయి. మొక్కపాటి వారు

తన బారిష్టర్ పార్వతీశం నవలలో నాయకుడు ఇంగ్లాండ్‌కు ప్రయాణమైనట్లు, అతని ప్రయాణ సన్నాహాలను, ప్రయాణపు ఇక్కట్లను చమత్కారంగా చిత్రించాడు.

కందుకూరి గారు 'రాజశేఖరచరిత్ర' నవలలో నాయకుడైన రాజశేఖరుడు కుటుంబ సమేతంగా ధవళేశ్వరం నుండి కాశీయాత్రకని బయలుదేరినట్లుగా ఉంది. దారిలో ఆ కుటుంబం ఎదుర్కొన్న సమస్యలను కూడా వర్ణించాడు. అలాగే సత్యరాజా పూర్వదేశ యాత్రలలో సత్యరాజాచార్యులు ఆడుమలయాళ దేశానికి, శ్రీలంకకు వెళ్ళినట్లుగా కల్పించారు కందుకూరిగారు. ముళ్ళపూడి వెంకట రమణగారు ఇంగ్లీష్‌లో జూల్‌స్‌వెర్న్ రాసిన "Around the world in 80 days" అనే నవలను "80 రోజుల్లో భూ ప్రదక్షిణం" అనే పేరుతో తెలుగులోకి అనువదించాడు. ఇందులో కథానాయకుడు తన మిత్రులతో 80రోజుల్లో భూమిని చుట్టి వస్తానని పందెం కాస్తాడు. అతడు ఓడలు, ఏనుగులు, నావలు, రైళ్ళు మొదలైన ఎన్నో సాధనాల ద్వారా ప్రయాణిస్తాడు. నాయకుడు ఎలా ఎనభై రోజుల్లో భూమిని చుట్టివచ్చాడో ఆసక్తికరంగా రాశాడు రచయిత.

అంపశయ్య నవీన్ 'అమెరికా-అమెరికా' అనే యాత్రానవలని రాశారు. అలాగే తాను విద్యార్థులతో చేసిన యాత్రకు సంబంధించిన తన అనుభవాలను 'ప్రయాణంలో ప్రమదలు' అనే పేరుతో నవల రూపంలో పొందుపరచారు. ఇందులో నవీన్ గారే నాయకుడు. తనతో పాటు యాత్రకి వచ్చిన విద్యార్థులనే ఇందులో పాత్రలుగా మలిచాడు. ఇక కథల విషయానికి వస్తే భానుమతి రామకృష్ణ 'అత్తగారి జపాను యాత్ర' పేరుతో హాస్య కథలను రాసింది. శ్రీనివాస శిరోమణి రాసిన 'ఏకాకి' కథలో నాగేశ్వరరావు తన భార్యను సంసారానికి ఇంటికి తీసుకురాలేక, తీర్థయాత్రల పాలవుతాడు. పి.సత్యవతి రాసిన "గాంధారి రాగం" అనే కథలో కొత్త దంపతులు మహాబలిపురం, బెంగుళూరు, తిరుపతిలకు విహారయాత్రలకు వెళ్ళినట్లుగా రచయిత్రి వర్ణించింది.

ఈ విధంగా ఎన్నో నవలల్లో, కథల్లోని పాత్రలు యాత్రలు చేసిన సంఘటనలున్నాయి. వాటిలో మచ్చుకు కొన్ని మాత్రమే ఇక్కడ పేర్కొనడం జరిగింది.

## 1.6. యాత్రాచరిత్ర

యాత్రాచరిత్రను ఆంగ్లంలో "Travelogue" అని, "Travel writings" అని వ్యవహరిస్తున్నారు. హిందీలో యాత్రా వృత్తాంత్ అని అంటారు. 'The New Lexicon' అనే ఇంగ్లీష్ నిఘంటువు 'Travelogue' అంటే 'A lecture on a journey illustrated by slides' అని పేర్కొనింది. 1978లో ముద్రింపబడిన జి.ఎన్.రెడ్డిగారి ఇంగ్లీష్–తెలుగు నిఘంటువు 'Travelogue' అంటే సాహసయాత్రలను సోదాహరణంగా లేదా సచిత్ర ఉపన్యాస కథ, ఇట్టి కథలు గల రచన అనే అర్థాలనిచ్చింది. 2000 సంవత్సరంలో పునర్ముద్రించబడిన ఇదే నిఘంటువు పైన పేర్కొన్న అర్థంతో పాటూ, యాత్రాచరిత్ర, యాత్రా కథ అనే అర్థాలనిచ్చింది. మొదట ముద్రింపబడిన నిఘంటువు Travelogueకు యాత్రాచరిత్ర అనే అర్థాన్ని సూచించలేదు. అంటే 1978 నాటికి 'Travelogue' కు యాత్రాచరిత్ర అనే సమానార్థక పదం స్థిరపడలేదని తెలుస్తుంది.

నేడు తెలుగులో యాత్రాచరిత్ర ఒక సాహిత్య ప్రక్రియగా గుర్తింపును పొందుతుందని చెప్పవచ్చు. యాత్రాచరిత్ర రచనకు అనుభవం, అనుభూతి ముఖ్యం. యాత్రికులు తమ యాత్రా అనుభవాలకు, అనుభూతులకు అక్షరరూపమిస్తే, అది యాత్రా చరిత్రగా రూపొందుతుంది.

యాత్రికుడు

↓

వివిధ ప్రాంతాల సందర్శనం

↓

యాత్రా విశేషాల రచన

↓

పాఠకుడు

ఒక యాత్రికుడు వివిధ ప్రాంతాలను సందర్శించి తన అనుభవాలకు అక్షర రూపమిచ్చినప్పుడు అది పాఠకులకు చేరుతుందనే విషయాన్ని పై పటం ద్వారా క్లుప్తంగా వివరించడం జరిగింది. ఏ యాత్రికుడయితే తన యాత్రను సంపూర్ణంగా అనుభవిస్తాడో,

అతడు రాసిన యాత్రా చరిత్రలు హృదయాలను స్తంభింపచేస్తాయి. అయితే ఈ యాత్రానుభూతి అనేది వ్యక్తిగతమైంది. సార్వజనీనమైనది కాదు. యాత్రాకాలంలో తనకు ఎదురైన సంఘటనలను, వ్యక్తులను, ఆయా ప్రాంత విశేషాలను యాత్రికుడు యాత్రాచరిత్రల్లో పొందుపరచవల్సి ఉంటుంది. యాత్రాచరిత్రల్లో ఒక వ్యక్తి జీవితంలోని కొంతభాగం లేదా కొన్ని సంఘటనలు మాత్రమే ప్రతిబింబిస్తాయి.

## 1.7. తెలుగు సాహిత్యంలో మొదటి యాత్రాచరిత్ర - చర్చ

19వ శతాబ్ది ప్రథమార్థం నుండి తెలుగులో యాత్రా సాహిత్య ప్రక్రియ మొదలైనదని చెప్పవచ్చు. ఈ కాలంలో మేలిముత్యాలనదగిన యాత్రాచరిత్రలు వెలువడ్డాయి. వీటిలో మొదటగా చెప్పుకోవల్సింది ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్రాచరిత్ర. తెలుగు సాహిత్యంలో యాత్రాచరిత్రల రచనకు ఏనుగుల వీరాస్వామిగారే ఆద్యుడని చెప్పవచ్చు. ఇతడు 1830లో కాశీయాత్రచేసి, యాత్రాచరిత్ర రాశాడు. ఇతని తర్వాత 1846లో కోలా శేషాచలకవి నీలగిరి యాత్రాచరిత్ర రచించాడు. ఇవి రెండూ తెలుగువారు తెలుగులో రాసిన తొలినాటి యాత్రాచరిత్రలు.

కానీ వీరిద్దరి కంటే ముందే వెన్నెలకంటి సుబ్బారావు గారు 1822-23లో యాత్ర చేశారు. కానీ తన యాత్రను తన జీవితంలో ఒక భాగంగా చెప్పుకున్నాడే తప్ప, ప్రత్యేకించి యాత్రాచరిత్రేమీ రాయలేదు. అంతేగాక "A life journey of V. Soob row" అనే పేరుతో తన జీవయాత్రా చరిత్రను ఇంగ్లీష్‌లో రాసాడు. కాబట్టి సుబ్బారావు గారు తెలుగువాడే అయినా, అతడు ఇంగ్లీష్‌లో యాత్రా చరిత్ర రాశాడు. కనుక ఇది తెలుగు సాహిత్య పరిధిలోకి రాదు. అందువలన ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్ర చరిత్రే తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి యాత్రాచరిత్రగా పరిగణించబడుతుంది.

యాత్రాచరిత్ర ప్రక్రియ పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్లనే తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. అయితే పాశ్చాత్య సాహిత్యంలో యాత్రాచరిత్రను ప్రాచీనమయిన ప్రక్రియగా చెప్పవచ్చు. కానీ తెలుగులో యాత్రాచరిత్రల రచన 19వ శతాబ్దం మొదటి భాగం నుండి

ప్రారంభమయింది. తెలుగులో యాత్రాచరిత్ర ఆధునిక ప్రక్రియ. నవల, నాటకం, కథానిక, యాత్రాచరిత్ర ఇవన్నీ కూడా తెలుగు 19వ శతాబ్దంలో ప్రారంభమైనప్పటికీ, నవల, నాటకం, కథానిక ప్రక్రియలంత వేగంగా యాత్రాచరిత్ర ప్రక్రియ అభివృద్ధి చెందలేదు.

19వ శతాబ్దం నుండి నవలలు, కథానికలు, కోకల్లలుగా వచ్చాయి. కానీ యాత్రాచరిత్రలు చెప్పుకోదగ్గ సంఖ్యలో వెలువడలేదు. నవ, కథ, నాటకం అనేవి సృజనాత్మకత ప్రక్రియలు. వీటిని సృజనకారులు, సాహిత్యకారులు మాత్రమే రాయగలరు. కానీ యాత్రాచరిత్ర సామాన్య ప్రక్రియ. యాత్రలు చేసొచ్చిన ఏ వ్యక్తి అయినా తన యాత్రానుభవాలను యాత్రాచరిత్రగా రాయవచ్చు. అటువంటప్పుడు నవలలు, కథలు, నాటకాల కంటే యాత్రాచరిత్రలే ఎక్కువగా కన్పించాలి. లోకంలో యాత్రలు చేసినవారు, చేస్తున్నవారు ఎంతోమంది వున్నారు సృజనాత్మక యాత్రాచరిత్రలు ఎక్కువగా వచ్చి వుండాలి. కానీ అలా జరగడంలేదు. దీనికి కారణం ఎంతోమంది యాత్రలు చేసొచ్చినా, తమ అనుభవాలకు అక్షర రూపం ఇవ్వలేకపోవడం, అక్షరరూపం ఇచ్చిన యాత్రాచరిత్రలను ప్రచురించి, ప్రజలలోకి తీసుకురాకపోవడం.

ప్రారంభంలో వచ్చిన యాత్రాచరిత్రలన్నింటిలోనూ దాదాపుగా సరళ గ్రాంథిక భాష కన్పిస్తుంది. ఏనుగుల వీరాస్వామిగారి కాశీయాత్రా చరిత్ర, కోలా శేషాచల కవి నీలగిరి యాత్రాచరిత్ర మొదలైన యాత్రాచరిత్రలు సరళ గ్రాంథిక భాషలో రాయబడ్డాయి. క్రమ క్రమంగా యాత్రాచరిత్రలను వచనంలో రాయడం ప్రారంభమైంది.

## 1.8. యాత్రాచరిత్రల వర్గీకరణ

ఏ రంగంలోనైనా, ఏ విషయంలోనైనా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపించాలనుకునే వ్యక్తులు కొందరుంటారు. అదేవిధంగా యాత్రా వాఙ్మయాన్ని రచించడంలో తమదైన ప్రత్యేకతను చూపించినవారున్నారు. కొందరు పద్యంలోనూ, గద్యంలోనూ, చంపూలోనూ, వచనంలోనూ యాత్రాచరిత్రలు రాసి, కొత్తదనాన్ని చాటారు.




యాత్రా చరిత్రల్ని స్థూలంగా ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

ప్రక్రియను బట్టి 1) పద్య యాత్రా చరిత్రలు

2) గద్య యాత్రా చరిత్రలు

దేశాన్నిబట్టి 3) స్వదేశీయులు, విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు

4) విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు

వ్యక్తులను బట్టి 5) పురుషులు రాసిన యాత్రాచరిత్రలు

6) స్త్రీలు రాసిన యాత్రాచరిత్రలు

### 1.8.1. పద్య యాత్రా చరిత్రలు

సాహిత్య చరిత్రలు రాసినవారు యాత్రాచరిత్రలు వచన వాఙ్మయ వికాసానికి తోడ్పడిన తొలినాటి వచన ప్రక్రియగా పేర్కొన్నారు. యాత్రాచరిత్రలు చాలా వరకు వచనంలో రాయబడ్డాయి. అయితే పద్యంలో వున్న యాత్రాచరిత్రలు కూడా లేకపోలేదు.

### 1.8.1.1 ఆదిభట్ల నారాయణదాసు : కాశీయాత్ర

హరికథా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన ఆదిభట్ల నారాయణదాసు గారు 1914వ సంతవత్సరంలో కాశీ యాత్ర చేసి తన అనుభూతులను సంస్కృత శ్లోకంలో, శతక

రూపంలో రాశారు. అదే కాశీ శతకమ్. ఈ శతకంలో శ్లోకాలున్నాయి. అనుష్టుప్ ఛందస్సులో రాయబడింది. నారాయణదాసు గారు తెలుగువాడే అయినా, ఆయన యాత్రాచరిత్రను సంస్కృతంలో రాయడం గమనార్హం.

### 1.8.1.2. కోలా శేషాచల కవి: నీలగిరి యాత్రా చరిత్ర

19వ శతాబ్ది ప్రథమార్థంలో యాత్రాగ్రంథం ఇది. శేషాచల కవి ఈ గ్రంథాన్ని మూడు ప్రకరణాలుగా రాసారు. అవతారికలో “నీలగిరికి నేగిన చరిత్రమెల్ల ‘వచన రచన’ నెరుకపరుతు” అంటూనే కృతిపతి ప్రశంసలో “నిఖిలజన సుఖబోధనంబగు వచన కావ్యంబుగా నియ్యాత్ర రచియించి” అని వచన కావ్యంగా చెప్పుకున్నాడు. ఇందులో షష్ఠ్యంతాలు, గర్భగత కందాలు, ద్వర్థి పద్యాలు, సీసమాలికలను చేర్చారు. మొత్తం మీద శేషాచల కవి ఒకే పుస్తకంలో గద్యరచనతో పాటూ పద్య రచన కూడా చేశాడు.

### 1.8.1.3. రామసుబ్బారాయుడు: కాశీయాత్ర

బ్రహ్మశ్రీ వాజపేయయాజులు రామసుబ్బారాయుడుగారు తన యాత్రానుభవాలను కాశీయాత్ర అనే పేరుతో 1934వ సంవత్సరంలో కావ్యంగా రాశాడు. తన భావాలను ఛందోబద్ధమయిన పద్యభాగంలో ఇమిడ్చి రాశాడు. అయితే ఇది యాత్రా సమయంలో రాసింది కాదు, స్మృతి రూపకమయిన యాత్రారచన.

### 1.8.1.4. చివుకుల పెద వేంకటాచలపతి: నా శ్రీశైలయాత్ర

1950లో ఈ కావ్యం మొదటి ముద్రణను పొందింది. ఇందులో మొత్తం 170 పద్యాలున్నాయి. తన కుమారుడు మరణించినందువల్ల మరల సంతానం కోసం ఈ తీర్థయాత్ర చేసినట్లుగా చెప్పుకున్నారు.

### 1.8.1.5. ఆవంత్స సోమసుందర్: ఆంగ్ల సీమలో ఆమని వీణలు

ఆవంత్స సోమసుందర్ గారు 1983లో ఇంగ్లాండుకు యాత్ర చేశారు. ఈ యాత్రలో తాను పొందిన అనుభూతులను కవిత్వంలో పొందుపరిచారు. 'ఆంగ్లసీమలో ఆమని వీణలు' అనే ఈ యాత్రాచరిత్ర 26 కవితల సంపుటి. అదేవిధంగా ఎండ్లూరి సుధాకర్ గారు కూడా తన అమెరికా యాత్రా విశేషాలను 'ఆటజని కాంచె' అనే పేరుతో కవిత్వంలో రాశారు.

### 1.8.2 గద్య యాత్రాచరిత్రలు

యాత్రాచరిత్రలు ఎక్కువగా గద్యంలోనే రాయబడ్డాయి. ఆధునిక కాలంలో గద్యానికి వచనానికి భేదం లేదు. తెలుగులో మొట్టమొదటి యాత్రాచరిత్ర అయిన ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్రాచరిత్ర గద్యంలోనే రాయబడింది. రచయిత అనుభవాలకు అనుభూతులకు శ్రమ ఉండదు. పైగా సులభంగా అర్థమవుతుంది.

సినారె 'సోవియట్ రష్యాలో పదిరోజులు', భరద్వాజ 'ఇనుపతెర వెనుక' ......, శ్రీశ్రీ రష్యాయాత్ర, చైనాయానం, అక్కినేని వారి నేను చూసిన అమెరికా, దాశరథి అమెరికా సందర్శనం, ఆరుద్ర 'అమెరికా పర్యటన అనుభవాలు', ఉప్పల వారి బతుకు పుస్తకం, ఎ.బి.కె. గారి 'పశ్చిమ జర్మనీ యాత్రా విశేషాలు' మొదలైనవన్నీ కూడా వచనంలో రాయబడ్డ యాత్రాచరిత్రలే. దాదాపుగా యాత్రా చరిత్రలన్నీ వచనంలోనే రాయబడ్డాయి.

### 1.8.3. స్వదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు

భారతీయులలో ఎంతోమంది యాత్రలు చేసి, అనేక యాత్రా గ్రంథాలను రాశారు. వారిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గ అద్భుత యాత్రికుడు రాహుల్ సాంకృత్యాయన్. ఇతడు "మేరీ టిబెట్ యాత్ర, మేరి లద్దాక్ యాత్ర, టిబెట్ మే సవావర్షే, చైనామే కమ్యూన్, చైనా మే

క్యా దేఖా, యాత్రా కె ఫన్నె, కిన్నెర దేశ్‌మే అనే యాత్రా గ్రంథాల్ని రాసి, హిందీలో యాత్రా సాహిత్యాన్ని పోషించాడు."

ఇంకా శివప్రసాద్ గుప్త "పృథ్వీ ప్రదక్షిణ", భగవతశరణ్ ఉపాధ్యాయ "కలకత్తా సే పెకింగ్, సాగర్ కి లహరోం పర్, వహ దియా మే, రామధారి సింహ దినకర్ దేశ-విదేశ, మేరి యాత్రామే, ప్రభాకర్ మాచవే "గోరి నజరోం మే హమ్", బ్రజ్‌కిషోర్ నారాయణ "నందన్ సే లండన్", అమృతా ప్రీతమ్ "ఇక్కీస్ పత్తియోం కా గులాబ్" శ్రీకాంత్ వర్మ "అపోలో కా రథ్", శివాని, "యాత్రిక" ఇవన్నీ హిందీ సాహిత్యంలో వచ్చిన ప్రసిద్ధ యాత్రా గ్రంథాలు.

తెలుగు సాహిత్యంలో యాత్రాచరిత్ర అనగానే గుర్తుకువచ్చే పేరు ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్రాచరిత్ర, కోలా శేషాచలకవి నీలగిరి యాత్ర, నాయని కృష్ణకుమారి గారి కాశ్మీర దీపకళిక. తెలుగు సాహిత్యంలో ఎన్నో యాత్రాచరిత్రలు వచ్చినా, వాటన్నింటికీ కూడా రానంత పేరు ప్రఖ్యాతులు పై మూడు యాత్రా చరిత్రలకు వచ్చాయి.

భారతీయుడైనప్పటికీ డా॥ సచ్చిదానంద మొహంతి గారు ఇంగ్లీష్‌లో "Travel writing and colonialism" అనే యాత్రాచరిత్ర రాశారు.

## 1.8.4. విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు

సృజనాత్మక సాహిత్య ప్రక్రియలైన నవల, నాటకం, కథానిక, వ్యాసం, స్వీయ జీవిత చరిత్రలవంటి ప్రక్రియల్లాగే యాత్రా చరిత్ర ప్రభావం వలన తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. ప్రపంచాన్ని చుట్టి వచ్చిన యాత్రికుల్లో ఎక్కువమంది పాశ్చాత్యులే. పాశ్చాత్యులలో యాత్రలు చేయడమేకాక, యాత్రానంతరం తమ అనుభవాలను యాత్రాచరిత్రలుగా రాసి, యాత్రా సాహిత్యాన్ని ప్రోత్సహించి, పోషించారు కూడా. ఏదేమైనప్పటికీ యాత్రాచరిత్ర ఒక ప్రక్రియగా నిలబడటంలో పాశ్చాత్యుల కృషి ఎంతగానో ఉంది.

ప్రాచీనకాలం నుండి మన దేశానికి ఎంతోమంది రాయబారులుగా, మత గురువులుగా, యాత్రికులుగా, పరిపాలకులుగా, భాషా శాస్త్రజ్ఞులుగా, చరిత్రకారులుగా అనేకమంది పాశ్చాత్యులు భారతదేశానికి వస్తూనే ఉన్నారు. వారు రాసిన యాత్రా చరిత్రలు ఆ కాలంనాడు మనదేశంలో ఉన్న పరిస్థితులను తెలియజేస్తున్నాయి. భారతదేశం యొక్క ప్రాచీన చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. భారతదేశాన్ని సందర్శించిన మొదటి విదేశీ యాత్రికునిగా 'మెగస్తనీసు'ను చెప్పుకుంటారు. అతడు 'ఇండా' అనే గ్రంథాన్ని రాశాడు. ఇంకా:

1. ఫాహియాన్ – A Record of Buddhist kingdoms

2. వర్తిమా – Forgotten Empire

3. టవెర్నియర్ – Travel in India

4. మార్క్‌ట్వైన్ – Following the Equator

5. కెప్టెన్ బేసిల్ హాల్ – Travels to India, Cylone, Borneo

6. స్టీవెన్సర్ – Travels with a Donkey in the Cevennes

7. J. లాక్‌మెన్ – Travels of the Jesuits

8. Judith Okely – Traveler – Gypsies

9. Alberto Grando – Traveling with Che-Guevara: The making of Revolutionary

10. Jane Rabinson – Unsuitable for Ladies

పాశ్చాత్యుల్లో పురుషులే గాక, స్త్రీలు కూడా యాత్రా చరిత్రలు రాసి, యాత్రా సాహిత్యాన్ని పెంపొందించారు. భారతీయ స్త్రీల 19వ శతాబ్దం నుండి యాత్రాచరిత్రలు రాయడం ప్రారంభిస్తే, విదేశీ స్త్రీలు 18వ శతాబ్దం నుండి యాత్రాచరిత్రలు ఈ ప్రక్రియాభివృద్ధిలో ముందంజలో ఉన్నారు. ఈ కింద విదేశీ స్త్రీలు రాసిన కొన్ని యాత్రాచరిత్రల్ని పేర్కొనడం జరిగింది.

1. మేరీ వోర్ట్‌లీ మారటింగ్ – Embassy to constantople

2. నీనా మజూషెల్లీ – The Indian Alps and how we Crossed them

3. అన్నీ టేలర్ – Diary of Miss Talor's Journey Through Tibet

4. మూడ్ పారిష్ – Nine pounds of Luggage

పాశ్చాత్యులలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా యాత్రలు చేయడం, యాత్రాచరిత్రలు రాయడం కన్పిస్తుంది. ఈ ధోరణి భారతదేశంలో కూడా రావల్సి ఉంది. భారతీయ స్త్రీలు యాత్రాభ్రమణంలో ముందడుగు వేసి, యాత్రా సాహిత్యాన్ని వృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది.

### 1.8.5. పురుషులు రాసిన యాత్రా చరిత్రలు

తెలుగులో యాత్రా వాఙ్మయాన్ని అభివృద్ధి పథంలో నడిపే విషయంలో స్త్రీలకంటే పురుషులే ముందంజలో ఉన్నారు. యాత్రాచరిత్రల రచన ప్రారంభమయిన నాటినుండి తెలుగు సాహిత్యంలో ఎక్కువగా పురుషులు రాసిన గ్రంథాలే కన్పిస్తాయి. మొట్టమొదట యాత్రాచరిత్రల రచనకు ఆద్యుడు కూడా పురుషులే. 1831లో ఏనుగుల వీరాస్వామి గారు కాశీయాత్రా చరిత్రని రచించి తెలుగులో యాత్రా వాఙ్మయ శాఖను ప్రారంభించారు.

1. కోలా శేషాచలకవి – నీలగిరి యాత్రాచరిత్ర

2. బులుసు వేంకట రమణయ్య – నా దక్షిణ దేశయాత్రలు, నా ఉత్తర దేశ యాత్రలు

3. సూరాబత్తుల సుబ్రహ్మణ్యంగారి – కళ – ప్రకృతి

4. ముమ్మనేని లక్ష్మీ నారాయణ – హంపీ విహారయాత్ర

5. మల్లంపల్లి సోమశేఖర శర్మ – నెల్లూరు మండల యాత్ర

6. జొన్నలగడ్డ సత్యనారాయణ – నా మహారాష్ట్ర యాత్ర

7. కొడాలి వెంకటేశ్వరరావు – అంతా కలిస్తే అమెరికా

8. దాశరధి గారి – విపులాచ పృథ్వీ

9. పాటిబండ్ల వేంకటపతిరాయలు – మా ఉత్తర భారత యాత్రలు

మా దక్షిణ భారత యాత్రలు

10. నా జర్మనీయానం – మండలి బుద్ధ ప్రసాద్

11. రాష్ట్రపతి, ప్రధానులతో – నా విదేశీ పర్యటనలు – వేమూరి బలరామ్

12. నా అమెరికా యాత్ర – ఎన్.గోపి.

పైన పేర్కొన్నవన్నీ కూడా పురుషులు రాసిన యాత్రా చరిత్రల్లో ప్రసిద్ధి చెందినవి. ఇవేకాక ఇంకా ఎన్నో యాత్రాచరిత్రలు తెలుగులో ఉన్నాయి. మచ్చుకు కొన్నింటిని మాత్రమే ఇక్కడ పేర్కొనడం జరిగింది.

## 1.8.6. స్త్రీలు రాసిన యాత్రాచరిత్రలు

భారతీయ స్త్రీలు 19వ శతాబ్ధి చివరిభాగం నుండి యాత్రా సాహిత్యాన్ని రాయడం ప్రారంభించారు. అయితే 19వ శతాబ్దం కంటే 20వ శతాబ్దంలో కొంచెం ఎక్కువగా స్త్రీల యాత్రాచరిత్రలు వెలువడ్డాయి. కృష్ణకుమారి గారు అచ్చమైన తెలుగులో సరళంగా, అందంగా, తన యాత్రానుభవాలను, కాశ్మీర దీపకళికలో పొందుపరిచారు. ఆవిడ కాశ్మీర్‌లోని ప్రకృతిని వర్ణిస్తూ వుంటే, ఆ ప్రదేశాన్నంతా మనమే స్వయంగా చూస్తున్నామన్న అనుభూతి కలుగుతుంది దానికి కారణం సాహిత్యకారుల స్పందన, వారి వర్ణన అంత అందంగా ఉండటమే, హృదయాన్ని హత్తుకుంటాయి. 19వ శతాబ్దిలో వచ్చిన కొన్ని స్త్రీయాత్రా చరిత్రలను ఈ క్రింద పేర్కొనటం జరిగింది

1. తాడూరి రమణబాయమ్మ – సింహళ ద్వీపయాత్ర

2. ముళ్ళపూడి కమలాదేవి – మా ఉత్తరభారత యాత్ర

3. పి. రుక్మిణమ్మ – నా అమెరికా యాత్ర

4. మాలతీ చందూర్ – నవ భారతి

5. వాసా ప్రభావతి – రష్యాకు స్నేహచరిత్ర

6. డి. కామేశ్వరి – నా విదేశీయాత్రానుభవాలు

7. ముదిగంటి సుజాతరెడ్డి – నైలునదీ నాగరికత

8. కె.కుసుమారెడ్డి – కన్యాకుమారి దీపకళిక

9. కూరగంటి శ్రీలక్ష్మి – షంఘై నింగిలో

మొట్టమొదటి విదేశీయాత్రలు చేసిన తొలి తెలుగు మహిళగా పోతం జానకమ్మగారిని పేర్కొంటారు. ఈవిడ 1860లో ఇంగ్లండ్‌కు యాత్ర చేసింది. అయితే ఆవిడ తన యాత్రా వివరాలను "Pictures of England" అనే గ్రంథంలో ఆంగ్లంలో పొందుపరిచింది. మొట్టమొదట స్త్రీలు యాత్రాచరిత్రలు రాయడం ఈమెతోనే మొదలైందని చెప్పవచ్చు.

ఆధునిక కాలంలో ఎంతోమంది స్త్రీలు యాత్రలు చేసి, యాత్రాచరిత్రలు రాశారు. నేడు యాత్రలు చేసే స్త్రీల సంఖ్య కూడా పెరిగింది. యాత్రలు చేసొచ్చిన స్త్రీలు కొందరు తమ యాత్రా విశేషాలను యాత్రాచరిత్రలుగా, యాత్రా వ్యాసాలుగా రాసి, పత్రికల ద్వారా ప్రజలకి అందజేయటం హర్షించదగ్గ విషయం. యాత్రా చరిత్రల రచనలకు సంబంధించిన మరికొన్ని విశేషాలను, వివరాలను ఈ క్రింద ఇవ్వడం జరిగింది.

1. యాత్రలు చేసేటప్పుడు ఏ రోజు విశేషాలను ఆ రోజు లిపిబద్ధం చేసేవారు కొందరు. (డైరీలు, ఉత్తరాల రూపంలో) ఆ డైరీలు, ఉత్తరాలను ఆధారంగా చేసుకొని, యాత్రాచరిత్రలు రాసిన వారున్నారు. ఉదా: సుబ్బారెడ్డి గారి సీమలో స్టీమరుకు, అదేవిధంగా ఏనుగుల వీరాస్వామి గారు యాత్రచేస్తూ, దినచర్య రాసుకుంటూ, తన మిత్రుడైన కోమలేశ్వరం పిళ్లైకు ఉత్తరాలు రాసి పంపేవాడట. వీటన్నింటినీ శ్రీనివాస పిళ్ళైగారు 1938లో 'కాశీ యాత్రాచరిత్రను' ముద్రింపచేశారు. అదేవిధంగా నాయని వారు కాశ్మీర దీపకళికను డైరీ ఆధారంగా రూపొందించారు.

2. యాత్రలు చేసి తిరిగి వచ్చిన తర్వాత, వెంటనే ఆ యాత్రానుభవాలను యాత్రాచరిత్రలుగా రాసినవారు కూడా ఉన్నారు. ఉదాహరణకు కొడాలి వెంకటేశ్వరరావు గారు అమెరికా యాత్రచేసి, యాత్రానంతరం తన పర్యటనానుభవాలను 'అంతా కలిస్తే అమెరికా' అన్న గ్రంథంలో వివరించారు.

3. యాత్రలు చేసొచ్చిన కొంతకాలం తర్వాత యాత్రా చరిత్రలు రాసినవారు కూడా వున్నారు. ఉదాహరణకు

చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారి కాశీయాత్రా చరిత్ర,

వాజపేయయాజుల రామసుబ్బారాయుడు గారి కాశీయాత్ర,

డా॥ వాసా ప్రభావతి గారి 'రష్యాలో స్నేహయాత్ర'

సినారె – 'పాశ్చాత్య దేశాల్లో 50 రోజులు'

4. ఒక కాలంలో తమ యాత్రానుభవాలను రాసినప్పుడు కొంతకాలం తర్వాత పుస్తక రూపాన్ని పొందిన యాత్రాచరిత్రలు కూడా ఉన్నాయి. నాయని వారి కాశ్మీర దీపకళిక, కొడాలి వెంకటేశ్వరరావుగారి 'అంతా కలిస్తే అమెరికా'.

5. తమ యాత్రానుభవాలను మొదట పత్రికల్లో వ్యాసరూపంలో ప్రచురించిన తర్వాత, కొద్దికాలానికి అవి పుస్తక రూపంలోకి వచ్చిన యాత్రాచరిత్రలు కూడా ఉన్నాయి. మాలతీ చందూర్ గారి 'నవభారత యాత్ర', సినారె 'సోవియట్ రష్యాలో పదిరోజులు'.

6. యాత్రాచరిత్ర రచనకు ప్రాతిపదిక వాస్తవం. అంటే యాత్రాకాలంలో జరిగిన విశేషాలను, సంఘటనలనే యాత్రాచరిత్రల్లో రాయాలి. కానీ యాత్రాచరిత్రకు సొంతకవిత్వం, కొన్ని కల్పనలు జోడించి, యాత్రా రచన చేసినవారున్నారు – మూర్తి రాజు గారి "నవవెన్నెల మధ్యధర".

7. యాత్రాకాలంలో జరిగిన విషయాలను మిత్రులు, ఆత్మీయులకు లేఖల రూపంలో తెలియజేసి, ఆ తర్వాత లేఖలే యాత్రా గ్రంథంగా రూపుదిద్దుకున్నవి యాత్రాచరిత్రలు కూడా కొన్ని వున్నాయి. 'భూ ప్రదక్షకుడు భార్యకు వ్రాసిన లేఖలు – అత్యం నరసింహమూర్తి గారు. ఎల్.ఎన్.రావు గారి 'గాలిమేడల అమెరికాలో'.

8. యాత్రాచరిత్రలో ఇతరులకు అంకితం ఇవ్వడం కూడా కన్పిస్తుంది. ఉదాహరణకు కోలాశేషాచలకవి "నీలగిరి యాత్ర". Should mention that to whom he dedicate the book.

ఒకవిధంగా కైఫియత్తులకు కూడా యాత్రాచరిత్రలుగా చెప్పవచ్చు. ఈ విషయాన్ని ఎ.బి.కె. ప్రసాద్‌గారు ఈ విధంగా సమర్థించారు. “కాశీయాత్రా చరిత్ర అనే ట్రావెలాగ్ ను ఏనుగుల వీరాస్వామి కైఫియత్తుల స్ఫూర్తితో రచన చేశాడని చెప్పవచ్చు. ఆయన ప్రయాణించిన మార్గంలో మజిలీ చేసిన గ్రామాల స్థితిగతులను చెప్పేటప్పుడు ఈ కైఫియత్తులలోని వివరాలు మనకు గుర్తుకువస్తాయి. కైఫియత్తులు వరుసగా చదువుకుంటూ పోతే ఒక మహాయాత్ర గ్రంథం చదివిన అనుభూతి కలగుతుంది. అయితే అది పాఠకుడు చేసే యాత్ర అవుతుంది” (సాహిత్యకీయాలు-నిబద్ధాక్షరి-3, పుట-149). కైఫియత్తుల్లో ఒక గ్రామ సమకాలీన సమాజ స్థితిగతులు, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులు మొదలైనవి ఇమిడి ఉంటాయి. దాదాపుగా ఇవే అంశాలు యాత్రాచరిత్రల్లో కూడా గోచరమవుతాయి. అయితే యాత్రాచరిత్రల రచన వైయక్తిక అనుభవాలను ఆధారంగా చేసుకుని జరిగితే, కైఫియత్తుల రచన సమకాలీన గ్రామీణ స్థితిగతులను ప్రధానంగా చేసుకుని జరుగుతుంది. అంటే కైఫియత్తుల రచన సామూహిక వ్యక్తుల కృషి ఫలమయితే, యాత్రాచరిత్రల రచన పూర్తిగా వైయక్తికం మరియు స్వతంత్రం కూడా.

పాశ్చాత్యులు భారతదేశాన్ని పాలించడం వల్ల వారి సాహిత్య ప్రభావం భారతీయ భాషలన్నింటి పైనా పడింది. యాత్రాచరిత్ర రచన కూడా భారతీయ భాషలన్నింటిలోనూ దాదాపుగా కన్పిస్తుంది. కానీ “క్షేత్రమహాత్మ్య కావ్యములు యాత్రాచరిత్రలు, చారిత్రక కావ్య రచనలు కన్నడంలో కనిపించవు” అని 1969లో నిడదవోలు వేంకటరావుగారు పేర్కొన్నారు (ఆంధ్రకర్నాట సారస్వతములు- పరస్పర ప్రభావము, పుట-39). దీనిని బట్టి కన్నడ సాహిత్యంలో యాత్రాచరిత్రలు 20వ శతాబ్ది పూర్వార్థం వరకూ రాలేదని చెప్పవచ్చు. 20వ శతాబ్ది ఉత్తరార్థం తర్వాత యాత్రా వ్యాసాల పరంపర కన్నడ సాహిత్యంలో కూడా మొదలైంది. అయితే తెలుగులో యాత్రాసాహిత్యం 19వ శతాబ్దంలోనే ప్రారంభమయినా, రావల్సినంత గుర్తింపు ఈ ప్రక్రియకు రాలేదు. తెలుగువారు యాత్రలు చేస్తున్నా, వాటిని లిపిబద్ధం చేయకపోవడమే దానికి కారణం. “తెలుగులో యాత్రాసాహిత్యం తక్కువ. ఇతర సాహిత్య శాఖలన్నీ పూలభారంతో ఒంపులు తిరిగి, ఉయ్యాలలూగుతుంటే యాత్రాసాహితీ

శాఖ మాత్రం చాలా అరుదుగా పుష్పిస్తూ ఉంది.” అని పాదయాత్రికుడు ఆదినారాయణగారు పేర్కొన్నారు. వీరు చెప్పనట్లుగా అనేక ప్రక్రియలు పాశ్చాత్య సాహిత్యం నుంచి తెలుగులోకి ప్రవేశించినా అవన్నీ ప్రక్రియలు ప్రజాదరణ పొందడమేకాక, రాశిలో కూడా ఎక్కువగా కన్పిస్తున్నాయి. కానీ యాత్రాచరిత్రలు మాత్రమే తక్కువగా కనిపిస్తున్నాయి. కథ, నవల మొదలైనవి సృజనాత్మక ప్రక్రియలు. వాటిని సృజనాత్మకత కలిగిన కొద్దిమంది మాత్రమే రాయగలరు. కానీ యాత్రాచరిత్రను యాత్రలు చేసొచ్చిన ప్రతీ ఒక్కరూ కూడా తమ అనుభవాలను యాత్రాచరిత్రలుగా రాయగలరు. దీనికి సృజనాత్మకతతో సంబంధంలేదు. తెలుగులో నవల, కథ మొదలైన ప్రక్రియలు, అభివృద్ధి చెందినంత వేగంగా యాత్రాచరిత్రలు అభివృద్ధి చెందకపోవడం, ఆదరణకు నోచుకోకపోవడం శోచనీయం. ఒక వ్యక్తి తన యాత్రానుభవాలను రాసినప్పుడు వాటిని చదివిన వ్యక్తులు తాము కూడా యాత్రలు చేయాలనీ, తన యాత్రానుభవాలకు అక్షరరూపం ఇవ్వాలనే ఆసక్తిని పెంచుకుంటారు. ఇలా యాత్రికులందరూ తమ అనుభవాలకు అక్షర రూపమిస్తే తెలుగులో యాత్రా సాహిత్యం అభివృద్ధి చెందుతుందనటంలో సందేహం లేదు.

# రెండవ అధ్యాయం

# తెలుగు యాత్రా రచయితలు –

# యాత్రా చరిత్రల  విశ్లేషణ

## 2.0. తెలుగు యాత్రా రచయితలు – యాత్రా చరిత్రల విశ్లేషణ

ఆది మానవుని కాలం నుండే మనిషిలో సంచారతత్వం, చలనత్వం సహజ గుణాలుగా కనిపిస్తాయి. తన చుట్టూ ఉండే లోకాన్ని చూడాలని, కొత్త కొత్త ప్రదేశాలను దర్శించాలని, అక్కడ నివసించేవారి జీవన విధానాలను తెలుసుకోవాలనే కుతూహలం మనిషికి స్వభావసిద్ధం. ఈ కుతూహలమే మానవుణ్ణి యాత్రలు చేయడానికి ప్రోత్సహిస్తోంది. నాగరికత నేర్చిన మానవులు కేవలం భ్రమణానికే పరిమితమవ్వక, తన యాత్రానుభవాలను అక్షరీకరించే ప్రయత్నం చేశారు. తద్వారా ఒక కొత్త ప్రక్రియ ప్రారంభానికి పునాదులు పడ్డాయి. ఆ ప్రక్రియే యాత్రాచరిత్ర. యాత్రల వల్ల తాము పొందిన అనుభూతిని అక్షరాల్లో బంధించాలనే తపన మరియు యాత్రల వల్ల తాము తెలుసుకున్న విషయాలను ఇతరులకు కూడా తెలియచేయాలనే ఉత్సాహమే యాత్రాచరిత్ర ప్రకియ ఆవిర్భావానికి కారణాలుగా కనిపిస్తున్నాయి.

యాత్ర చేసిన ప్రతి వ్యక్తీ యాత్రికుడనిపించుకోడు. యాత్ర అనేది ఒక అనుభవం. ఈ అనుభవం ఇప్పటి వారికి నడుస్తున్న చరిత్ర. భవిష్యత్తరాలకు గత చరిత్ర. యాత్ర చేయడం వల్ల వ్యక్తి జీవితానికి పరిపూర్ణత కలుగుతుంది. అటువంటి యాత్ర ఒకచోట ఆగేది కాదు. అది నిరంతర స్రవంతి. దాన్ని అభివ్యక్తం చేసేవారే యాత్ర చరిత్రకారుడు అవుతాడు (తెలుగులో యాత్రాచరిత్రలు, పుట–17) అని మచ్చహరిదాసు గారి అభిప్రాయం. తెలుగులో కూడా ఇటువంటి యాత్రా చరిత్రకారులకు కొదవ లేదు. తెలుగు సాహిత్యంలో వచ్చిన యాత్రాచరిత్రలను, యాత్రా చరిత్రకారులను ఇక్కడ పరిచయం చేస్తున్నాను. అయితే 1989 వరకు వచ్చిన యాత్రాచరిత్రలపై మచ్చ హరిదాసుగారు పరిశోధన చేయగా, 1990 నుండి 2017 వరకు వచ్చిన తెలుగు యాత్రాచరిత్రలపై నేను పరిశోధన చేయదలిచాను. అందుకే 1990 తర్వాత రాయబడిన యాత్రాచరిత్రల్ని మరియు యాత్రా రచయితల్ని పరిచయం చేయడం ఈ అధ్యాయం ముఖ్య ఉద్దేశ్యం.

## 2.1. 'ఆట'జని కంచె : ఎండ్లూరి సుధాకర్

ఆధునిక తెలుగు సాహిత్యంలో పరిచయమవసరం లేని పేరు ఎండ్లూరి సుధాకర్. కవిగా, కథకుడిగా, వక్తగా, సంపాదకునిగా వీరు సుప్రసిద్ధులు. వర్గీకరణీయం, నల్లద్రాక్ష పందిరి మొదలైన రచనలతో బహుళ పాఠకాదరణ పొందిన కవి ఎండ్లూరి. ఎన్నో ప్రముఖ సాహిత్య సంస్థల నుండి పురస్కారాలు అందుకున్న వీరు వృత్తిరీత్యా అధ్యాపకుడు. ప్రస్తుతం రాజమండ్రిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆచార్యలుగా పనిచేస్తున్నారు.

తన 'నల్లద్రాక్ష పందిరి' అనే కవితల పుస్తకాన్ని ఆవిష్కరించటానికై, అమెరికాలోని 'ఆటా' సభలకు వెళ్ళి తాను అక్కడ విన్న, కన్న అనుభవాలతో రాసిన యాత్రాచరిత్రే 'ఆట జనికాంచె'. కంటికి కనిపించే ప్రతీ విషయాన్ని కవిత్వీకరించగలిగే "నవయువ వచన కవితా చక్రవర్తి" ఎండ్లూరి సుధాకర్ గారు. అందుకేనేమో అమెరికా యాత్రా విశేషాలు కూడా సుధాకర్ గారి కవితా సంకెళ్ళకు బానిసవ్వక తప్పలేదు. అమెరికా వెళ్ళడానికి కావాల్సిన పాస్‌పోర్ట్ కోసం పడిన కష్టాల దగ్గర నుండి డల్లాస్ నగరంలో జరిగిన 'ఆట' సభల ముగింపు సమావేశాల వరకు ప్రతీ సంఘటనను కవిత్వాక్షరాల్లో బంధించారు.

2002 సంవత్సరంలో అమెరికాలోని 'డల్లాస్' నగరంలో 'ఆటా' సభల కోసం అమెరికా వెళ్ళిన ఎండ్లూరి గారు తమ యాత్రా విశేషాలను కవిత్వ రూపంలో వివరించారు. ఈ కవితా సంపుటి చదువుతున్నంత సేపు అమెరికా నగరంలో ప్రత్యక్షంగా పర్యటిస్తున్నట్లనిపిస్తుంది.

విమానంలో ప్రయాణిస్తూ, ఆకాశంలో పక్షిలా ఎగిరే విమానాన్ని చూసి ఆనందించిన చిన్నప్పటి రోజులను ఒక కవితలో గుర్తుచేసుకున్నారు ఎండ్లూరి గారు. మేఘాల మధ్య ప్రయాణం చేస్తున్నప్పుడు తన తండ్రిని గుర్తు చేసుకుంటూ,

"మేఘరథం మీద/వాయుపథం మీద
నా తండ్రిని తీసుకొస్తావా
ఒక్కసారి చూపిస్తావా

కిటికీ దగ్గరే కూర్చున్నాను

ఇంతెత్తుకు ఎదిగిన

కవి కుమారుణ్ని చూసి

ఎంత మురిసిపోతాడో

మా నాయన .....”

అని చెప్పిన కవిత హృదయానికి హత్తుకునే విధంగా ఉంది.

విమానంలో ఎక్కినప్పటి నుండి ఎయిర్ హోస్టెస్‌లను గురించి, ఫ్రాంక్‌ఫర్ట్ నగరం, డల్లాస్ నగర వీధులు, అక్కడి నిర్మాణాలు, ప్రజల తీరుతెన్నులు, వారు పాటించే పర్యావరణ పరిశుభ్రతను గురించి, ఆహారపు అలవాట్లను, అమెరికన్ల మనస్తత్వాలను, వారి సమయపాలనను గురించి, అమెరికాలో స్థిరపడ్డ భారతీయుల ప్రాబల్యం గురించి, అది ఇది అని కాకుండా అమెరికా యాత్రలో తాను చూసిన, విన్న అనేక విషయాలను స్పృశించారు ఎండ్లూరి గారు. ట్విన్ టవర్స్ దాడుల గురించి, లాడెన్ గురించి అమెరికా ప్రజలు మరచిపోలేదని తన కవితల్లో రాశారు.

అమెరికాలో కూడా వదలని ఆంధ్రా తెలంగాణా ఫీలింగ్స్‌ని గురించి, అమెరికన్లు స్త్రీల కిచ్చే గౌరవాలను గురించి, ప్రవాసాంధ్రులకున్న సాహిత్యాసక్తులను గురించి అద్భుతంగా రాశారు. సుధాకర్ గారు దళితకవి కావడం వలన అమెరికాలోని బ్రాహ్మనిజం కూడా ఆయన కవితా కళ్ళ నుండి తప్పించుకోలేపోయింది. అందుకేనేమో

“అనుకోక పోతే

ఒక చాప నిజం

అమెరికాలోనూ కనబడుతుంది

అచ్చమైన బాపనిజం

లేదనగలడా బేరా

కాదనగలడా చేరా” అంటూ రాశారు.

వీరి సహయాత్రికుడైన మధురాంతకం నరేంద్ర గారు చివరగా 'దళిత ప్రవరుడితో 'ఆట'జని కాంచలో....' చెప్పిన అంశాలు చాలా ఆకట్టుకున్నాయి.

"అబ్బో

అమెరికోడికి

బో బలుపు"

అనే కవితలో అమెరికన్లకు నల్లజాతివారి మీద కోపం ఎక్కువని, ఇతర దేశాల మత సంస్కృతులను కించపరుస్తారని వివరించారు. వైట్ హౌస్‌కి బ్లాక్ పెయింట్ వేస్తే భలే ఉంటుంది అని చెప్పే కవితలో కొంత అంతరార్థం దాగి వున్నదనిపించింది. అంటే నల్లజాతీయుడు అధ్యక్షుడైతే బాగుంటుందని కావచ్చు.

"అమెరికా

నిజంగా

భూతల స్వర్గమే ..."

అనే కవితలో అమెరికా అభివృద్ధి చెందింది నల్లజాతీయులు, వలస దారుల వల్లనేనని పేర్కొన్నారు. అమెరికాలో మనవాళ్ళు చేసే చాకిరీలను ఒక కవితతో పేర్కొన్నారు. అలాగే అమెరికాలోని తెలుగు సంఘాల్లో బయటకి కనిపించినంత సఖ్యత లేదని కొన్ని వర్గాల వారిదే అధికారం అని రాశారు.

ఎండ్లూరి గారు రాసిన కవితల్లో ఎక్కువ శాతం తన అమెరికా అనుభవాలను గురించి రాశారు. అమెరికాను గురించి, అక్కడ ప్రదేశాలను, అమెరికా చరిత్రను గురించి, ఆ దేశ స్థితిగతులను గురించి వివరించవలసిన ఆవశ్యకత కనిపించింది.

అయితే ఎండ్లూరి గారు చిన్న, చిన్న కవితల్లో అందంగా తన యాత్రానుభవాలను పేర్కొన్నారు. ప్రతీ కవిత కూడా స్పష్టంగా, సంక్షిప్తంగా మనస్సుకు హత్తుకునేలా ఉంది. ఈ పుస్తకాన్ని పాఠకుడి చేత మరీ మరీ చదివించేదిలా ఉంది.

## 2.2. శివమెత్తిన చికాగో : కసిరెడ్డి వెంకటరెడ్డి

కసిరెడ్డి వెంకటరెడ్డి గారు ఎనిమిదవ ఆటా సభల్లోని సాహిత్య సదస్సులో పాల్గొనేందుకు చికాగో వెళ్ళారు. ఆ సందర్భంలో రాసిన యాత్రాచరిత్రే 'శివమెత్తిన చికాగో'. చికాగోలో స్వామి వివేకానందుడు ఉపన్యసించిన స్థలాన్ని చూడాలనేది వెంకటరెడ్డి గారి కోరిక. అంతేకాక ఆయన వివేకానందుని భావాలను 'వివేక గీత'గా రాసి, అక్కడి వారికి పంచాలని అనుకున్నారు. ఆ కోరిక ఈ యాత్ర వల్ల నెరవేరిందని ఈ పుస్తకంలో పేర్కొన్నారు.

2004 జూన్ 14 నుండి వీరు 2004 జూలై 24 వరకు చికాగోలో ఉన్నారు. ఈ మధ్య కాలంలోనే 'శివమెత్తిన చికాగో' పేరుతో తన యాత్రానుభవాలను రాశారు. తనకు ఎదురైన ప్రతీ సన్నివేశాన్ని, సంఘటనని, ఆనంద క్షణాలని, అవేశం కలిగిన సందర్భాలను ఇలా అన్నింటికీ అక్షర రూపమిచ్చారు.

ఇందులో మొట్టమొదట 1893లో చికాగోలో స్వామి వివేకానందుడు చేసిన ప్రసంగాల సారంశాన్ని పొందుపరిచారు. ముఖ్యంగా అమెరికన్లను గురించి తెలియచేయడానికి ఆదిమ మానవులు అనుసరించిన పద్ధతులతో పోల్చి చెప్పారు. తల్లీ-పిల్లల సంబంధాలు, ఆహారపు అలవాట్లు, వస్త్రధారణ, ఆరోగ్య విషయాలు, అలవాట్లు, అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైన అనేక విషయాలను ఆదిమ మానవునికి అమెరికన్లకు ముడిపెట్టి వివరించారు.

అంతేకాకుండా అమెరికాలోని ప్రసిద్ధి గాంచిన రాష్ట్రాలు, వాటి రాజధానులు, వాటి భౌగోళిక పరిస్థితులు, ప్రత్యేకతలు, అవి ప్రసిద్ధి చెందడానికి గల కారణాలను వివరించారు.

వీరు ఆటా సభలో పాల్గొనడానికి పూర్వమే తన కూతురు, అల్లుడు, మనవడు, మనవరాలితో కలిసి చికాగో చుట్టు ప్రక్కల ప్రదేశాలను చూశారు. కసిరెడ్డి గారు నయాగరా జలపాతాన్ని కూడా చూశానని పేర్కొన్నారు. రచయిత 'నయాగరా' కవితా సంపుటిని గురించి, నయాగరా జలపాతాన్ని గురించి వర్ణిస్తూ. "నయాగరా జలపాతంలో వున్న దూకుడు ఈ తెలుగు నయాగరా కవుల్లోనూ కన్పిస్తుంది" (శివమెత్తిన చికాగో, పుట-117)

అని పేర్కొన్నారు. అలాగే పిట్సుబర్గ్‌లోని జైన మందిరాన్ని, వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని దర్శించినట్లుగా పేర్కొన్నారు. వివేకానందుడు తిరిగిన ప్రదేశాలను, సియర్స్ టవర్స్‌ను కూడా చూసినట్లుగా రాశారు.

ఆటా సభలో జరిగిన సహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను చూశానని, జి.వి.సుబ్రహ్మణ్యం, మలయవాసిని, వల్లంపాటి వెంకట సుబ్బయ్య, నిడదవోలు మాలతి మొదలైన అనేకమంది సాహితీవేత్తలు ఈ సాహిత్య సభల్లో ప్రసంగించారని, ఆచార్య సి. నారాయణరెడ్డి గారు, మాడ్గుల నాగఫణిశర్మగారు కూడా పాల్గొన్నారని వివరించారు. రచయిత తన కుటుంబ సభ్యులతో గడిపిన సందర్భాలను ఎక్కువగా ప్రస్తావించడం కంటే తాను సందర్శించిన ప్రాంతాల విశిష్టతని, విశేషాలను తెలిపి వుంటే తన రచనకు పూర్ణత్వం సిద్ధించేది.

## 2.3. విహారం : కందేపి రాణీప్రసాద్

కందేపి రాణీప్రసాద్ గారి భర్త అయిన శ్రీ ప్రసాద్ రావు గారు చిన్నపిల్లల వైద్యుడుగా పనిచేస్తున్నారు. పిల్లల వైద్య నిపుణుల జాతీయ సమావేశానికి తన భర్తతో పాటూ రాణీప్రసాద్ గారు, వారి పిల్లలు కూడా హాజరయ్యారు.

ఈ జాతీయ సమావేశం ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క రాష్ట్రంలో జరుగుతుంది. ఇలా అనేకసార్లు రాణీప్రసాద్ గారి కుటుంబం అనేక రాష్ట్రాలలో జరిగే జాతీయ సమావేశాలకు హాజరవుతూ వుండటం వలన ఆయా రాష్ట్రాలలోని ముఖ్యమైన ప్రాంతాలను, దేవాలయాలను మ్యూజియంలను, చారిత్రక ప్రదేశాలను దర్శించే అవకాశం వారికి దొరికింది. వీరు కర్ణాటకలోని మైసూర్, బెంగుళూరు, భువనేశ్వర్, పూరీ, ముంబై, కలకత్తా, మద్రాస్ రాష్ట్రాలలో జరిగిన పిల్లల వైద్య నిపుణుల జాతీయ సమావేశాలకు వెళ్ళి, ఈ ప్రాంతాలను కూడా పర్యటించారు.

అంతేకాక "సింగపూర్ తెలుగు సమాజం" వారి ఆహ్వానంతో సింగపూర్‌ను దర్శించారు. అలాగే 2007లో రాణీప్రసాద్ గారి చిన్నబ్బాయికి మణిపాల్ యూనివర్సిటీలో

సీటు రావడం వలన ఆ కాలేజీ వాతావరణం, దాని పరిసరాలను చూసి రావడానికి వీరి కుటుంబం మణిపాల్‌ను పర్యటించారు. మణిపాల్ నుండి ఉడిపి, గోవా కూడా దర్శించారు.

రాణీప్రసాద్ గారు తాను చూసిన ఒక్కొక్క ప్రాంతాన్ని గురించి ఒక్కో యాత్రా వ్యాసం రాశారు. ఈ యాత్రా వ్యాసాలు ఈనాడు, వార్త వంటి దినపత్రికలలో, బాలతేజం వంటి మాస పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ముఖ్యంగా చిన్నపిల్లల కోసం తమ యాత్రా వ్యాసాల్ని వారికి అర్థం అయ్యే విధంగా 'వార్త' దినపత్రికలోని 'మొగ్గ' అనే బాలల పేజీల ద్వారా పిల్లలకు అందించారు. ఇలా దినపత్రికలలో, మాస పత్రికల్లో ప్రచురించబడిన ఈ యాత్రావ్యాసాలన్నింటినీ కలిపి 'విహారం' అనే పేరుతో యాత్రా కథనంగా రూపొందించారు.

ముఖ్యంగా ఇందులోని వ్యాసాలన్నీ పిల్లలు చదువుకోవడం కోసం ఉద్దేశింపబడినవి. అందువల్లనే 'విహారం' పుస్తకానికి "బాలల యాత్రా కథనాలు" అనే ఉపశీర్షిక పెట్టారు రచయిత్రి. అంతేకాక తన ఈ పుస్తకాన్ని డాక్టర్లందరికీ అంకితం చేశారు.

మొదట ఈ పుస్తకంలో 'సింగపూర్'కు చేసిన యాత్రను గురించి వివరించారు. ఈ వ్యాసంలో సింగపూర్ రోడ్ల అందాలను వర్ణించారు రచయిత్రి. "రోడ్ల అందాలను చూస్తూ వాటికి బీట్ కొడుతూ అశ్చర్యంగా రోడ్లపక్క కదలక మెదలక నిలబడి పోయినట్లున్నాయి వీధి దీపాలు" అన్న రచయిత్రి మాటల్లో భావకవితా స్ఫూర్తి కన్పిస్తుంది.

రాణీప్రసాద్ గారు కవయిత్రి, రచయిత్రి. ఈమె ఈ యాత్రాకథనం రాయడానికంటే ముందే పూలతోట, హరివిల్లు, నెలవంక అనే కవితా సంకలనాలు, నందివర్ధనాలు అనే నానీలను రాశారు. ఈమె రచనలు కొన్ని ఇంగ్లీష్‌లోనూ, హిందీలోనూ అనువదించబడ్డాయి.

ఈ పుస్తకం పిల్లలను ఉద్దేశించి రాయడం జరిగింది కాబట్టి వారికి అర్థమయ్యే శైలిలో రచయిత్రి రచన సాగించారు. ఈమె రాసిన వ్యాసాల్లో ఒక కథా రచయిత్రి శైలి కన్పిస్తుంది. అంటే పిల్లల కోసం రాశారు కాబట్టి, వారికి ఆసక్తి కలిగే విధంగా చిన్న, చిన్న విషయాలను కూడా కథలు చెప్తున్నట్టుగా రాశారు.

పిల్లలతో సంభాషించినట్లుగా వీరి వచనం ఉంది. ముఖ్యంగా వీరు పిల్లలలతో కలిసి యాత్ర చేసింది కాబట్టి, వినోదాన్ని కలిగించే ప్రాంతాలనే ఎక్కువగా దర్శించి, ఆయా వినోద కార్యక్రమాలను వివరించారు. ఈమె పిల్లలతో కలిసి, వినోదమే ప్రధానంగా యాత్ర చేసింది కాబట్టి, తన పరిధి వరకు యాత్రానుభవాలును యాత్రాచరిత్రగా రాయడంలో సఫలమయ్యారు.

ఒక ప్రాంతానికి వెళ్ళినప్పుడు ఏదో మొక్కుబడిగా వచ్చాము అని కాకుండా ఆయా ప్రదేశాల చరిత్రను, వాటి విశేషాలను సూక్ష్మ దృష్టితో పరిశీలించి వివరించారు. ప్రతీ ప్రాంతానికి సంబంధించిన భౌగోళిక పరిస్థితులను, ఆ ప్రాంతాల ప్రత్యేకతలను పేర్కొన్నారు.

అంతేగాక ఈమె స్వయంగా కవయిత్రి, రచయిత్రి కాబట్టి తన యాత్రా విశేషాలను కేవలం వ్యాస రూపంలోనే గాక చదివే పాఠకులను ఆకర్షించే విధంగా తన అనుభూతులను కవిత్వంలోనూ, నానీల రూపంలోనూ పొందుపరిచారు.

## 2.4. దేశీ విదేశీ యాత్రా విశేషాలు : కేకలతూరి క్రిష్ణయ్య

కేకలతూరి క్రిష్ణయ్య గారు రాష్ట్ర విద్యుత్ శాఖలకు (ఎన్.టి.పి.సి) పవర్ గ్రిడ్ లకు కాంట్రాక్టర్‌గా పనిచేశారు. అంతేకాక సైట్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేశారు. క్రిష్ణయ్య గారి కుమారుడు ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. కంపెనీ తరఫున తన కుమారుడితో పాటు క్రిష్ణయ్యగారు, అతని శ్రీమతి మూడు మాసాలు విదేశాలు చుట్టి వచ్చే అవకాశం దొరికింది. 2002 మే 20వ తేదీ నుండి 19 అగస్టు 2002 వరకు జర్మనీ, హాలెండు, ఆమ్‌స్టర్‌డామ్, బ్రసెల్స్, పారిస్, హేగ్, ఇటలీ, రోమ్, వెన్నిస్, దుబాయ్‌లను పర్యటించారు.

క్రిష్ణయ్యగారు అంతకు ముందు 1998వ సంవత్సరంలో టాటా కంపెనీ వారి ప్రాజెక్టు కోసం నేపాల్ వెళ్ళారు. తర్వాత 1998 జనవరి 15న మరొకసారి నేపాల్, ఖాట్మండు, హిమాలయాలలోని ముక్తినాథ్ క్షేత్రాన్ని, 2002లో మలేషియా, సింగపూర్,

శ్రీలంకలకు యాత్రలు చేసి, ఆ యాత్రావిశేషాల్ని ఇందులో పొందుపరిచారు. 2003లో కేరళ, తమిళనాడులకు విహార యాత్రకు వెళ్ళారు. ఈ యాత్రా విశేషాలను కూడా ఇందులో పేర్కొన్నారు.

తాను వెళ్ళిన ప్రాంతాలకు సంబంధించిన రక్షణ వ్యవస్థ, శిక్షలు, వారి వారి విద్యావిధానం, భవన నిర్మాణం, ఆయా దేశాల్లోని సాంకేతికత వీటన్నింటినీ, కూలంకషంగా వర్ణించారు. అదే విధంగా ఆయా దేశాలలోని ముఖ్యమైన పట్టణాలను, దేవాలయాలు, మ్యూజియంలు, వాటి చరిత్ర, ప్రాముఖ్యతను చర్చించారు. వెళ్ళిన ప్రతీ ప్రాంతానికి సంబంధించిన ఫోటోలను కూడా పొందుపరిచారు. వివిధ దేశాలలోని సామాజిక, సాంస్కృతిక పరిస్థితులను చక్కగా వివరించారు.

## 2.5. షంఘై నింగిలో : కురుగంటి శ్రీలక్ష్మి

కురుగంటి శ్రీలక్ష్మి గారు వ్యాసకర్త, విమర్శకురాలు, పరిశోధకురాలు. వీరు జానపద సాహిత్యంపైన పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి పట్టాను పొందారు. జానపద సాహిత్యం పైన అనేక వ్యాసాలు రాశారు. 'కన్యాశుల్కం లో తిట్లు' అనే పుస్తకాన్ని కూడా రాశారు. వీరు ప్రసిద్ధ సాహితీవేత్తలైన మృణాళిని గారికి, రావి ప్రేమలత గారికి స్నేహితులు. అందుకే 'షంఘై నింగిలో' అనే శ్రీలక్ష్మిగారి యాత్రాచరిత్రకు వీరిద్దరూ ముందు మాటలను రాశారు.

శ్రీలక్ష్మిగారు, వారి అబ్బాయి, కోడలు, మనవరాలితోనూ, తన కొడుకు స్నేహితుడైన చేతన్ కుటుంబంతోనూ, తన కొడుకు ఆఫీసు పని నిమిత్తం షంఘైలో ఉండటానికి వెళ్ళారు. 2004 జూన్ 9వ తేదీన వీరు షంఘైకు ప్రయాణమయ్యారు.

రచయిత్రి బృందం ఆఫీసు పని నిమిత్తం మూడు రోజుల పాటు హాంకాంగ్‌లో బసచేసిన తర్వాత, షంఘైని చేరుకున్నారు. హాంకాంగ్‌లో ఉన్న ఒక సౌత్‌ఇండియన్ హోటల్‌కి వెళ్ళారు. అక్కడ వారు హిందీలో 'క్యా చాహియే' అని పలకరించేసరికి, మన బంధువులు ఇక్కడ ఉన్నారనే సంతోషం కలిగిందని రచయిత్రి ఉద్వేగంతో తెలిపారు.

హాంకాంగ్‌లో గల పీక్ టవర్‌ని దర్శించారట. పీక్‌టవర్‌లోని 'వాక్స్' మ్యూజియంలో అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులు గాంచిన అన్ని దేశాల నేతల్ని మన పక్కన మసలే మనుషులుగా నిర్మించారని, ఇది ఎంతో ఆకట్టుకుందని, ఈ బొమ్మలు మన కళ్ళను మోసం చేస్తాయని తెలిపారు.

షంఘైలోని ఒక హోటల్‌లో చేరాక, రచయిత్రికి వేణ్ణీళ్ళు అవసరమయ్యాయట. వేరే భాష గనుక చెప్పడానికి తలప్రాణం తోక కొచ్చిందని, ఇక్కడ చైనీస్ తప్ప, ఇంగ్లీష్ మాట్లాడే వాళ్ళు తక్కువ అని వివరించారు.

షంఘైలో అడుగుపెట్టిన దగ్గర నుండి నిలదొక్కుకోవడానికి నెలరోజులు పట్టిందని, క్రమంగా మేమున్న చోటును పరిశీలించే అవకాశం కలిగిందంటూ, తాముంటున్న ప్రాంతాన్ని గురించి వర్ణించారు. చైనాలో వీరుంటున్న ప్రాంతాన్ని 'మాన్డరిన్ సిటీ' అని అంటారు. ఇక్కడ టాక్సీ వాళ్ళు చాలా నిజాయితీపరులని అభినందించారు రచయిత్రి. ఈ మాన్‌డరిన్ సిటీలో కావల్సిన వస్తువులు అన్నీ చౌకగా దొరుకుతాయని పేర్కొన్నారు.

చైనా వారు ఎక్కడికి వెళ్ళాలన్నా సైకిళ్ళనే వాడుతారని, మన దేశంలో లాగా స్కూటర్లు, మోటారు సైకిళ్ళు పైన ఆధారపడరని వివరించారు. ఇక్కడ ప్రజల జీవనం సాఫీగా జరిగిపోతుందని, ఒక పద్ధతిగా పనులన్నీ చేసుకుంటారని, ఏ విధమైన ఒత్తిడి లేకుండా నిర్భయంగా జీవితాన్ని గడుపుతారని తెలిపారు.

చైనాలో మొదటి దశలో మాతృస్వామిక వ్యవస్థ ఉండేదని, అందుకే ఆడవారిని ఇంటిపేరుతో, మగవారిని పెట్టిన పేరుతో పిలిచేవారని, ముఖ్యంగా వీరి జానపద గేయాల్లో స్త్రీకి పురుషుడి కంటే ఉన్నత స్థానం కన్పిస్తుందని వివరించారు. షంఘైలో ఉన్న ఇళ్ళు ఎక్కువగా ఆడవాళ్ళ పేరు మీదే ఉన్నాయట. ఆఫీసుల్లో, క్లబ్బుల్లో స్త్రీలే ఎక్కువగా రాజ్యమేలుతుంటారని, విద్యావంతులైన స్త్రీల శాతం ఇక్కడ ఎక్కువని చాకచక్యంతో పనిచేసే వాళ్ళు ఎక్కువగా స్త్రీలేనని, చుట్టుపక్కల వాతావరణాన్ని పరిశీలించి ఈ విషయం గ్రహించానని రచయిత్రి వివరించారు.

శ్రీలక్ష్మీగారి అబ్బాయి స్నేహితుడైన చేతన్ కుటుంబం ఇండియాకు వెళ్ళడంతో రచయిత్రి కూడా మనదేశాన్ని చూడాలనే ఉబలాటం కలిగిందని, మూడేండ్లు ఉండటానికి వచ్చిన రచయిత్రి ఎనిమిది నెలలకే భారత్‌కు తిరుగు ప్రయాణమయ్యానని చెప్పుకున్నారు.

“నా అనుభవాల్ని కాగితం మీద పెట్టి, షంఘైలో నేను జూన్ నుండి జనవరి దాకా గడిపిన రోజులు, వాటి తాలూకు జ్ఞాపకాలు, అందరితో పంచుకుని పర్యాటక కేంద్రంగా షంఘై చూడదగ్గ ప్రదేశమని చాటాలనుకున్నాను” అని “షంఘై వెళ్ళిన తర్వాత అక్కడ ఆ ఊరు, ఆ వ్యక్తులు, పరిసరాలు, అక్కడి విశేషాలు పరిచితులుగా, వాళ్ళ సంస్కృతిలో నాకు ఎదురైన అనుభవాలు, నేర్చుకోదగిన మంచి, వాటి ప్రయోజనాలు అందరికీ ఉపయుక్తాలనే భావన, వాటిని ఇతరులతో పంచుకోవాలనే ఆలోచన కలిగాయి. వాటితో రాసిన ముచ్చట్లివి” అని రచయిత్రి తాను ఈ యాత్రాచరిత్ర రాయడానికి గల కారణాలను వివరించారు.

శ్రీలక్ష్మగారు సరళమైన శైలిలో ఈ పుస్తకాన్ని రాశారు. ప్రపంచంలోనే అతి ప్రాచీనమైన సంస్కృతులైన భారతీయ, చైనా సంస్కృతుల మధ్య ఉన్న ఆచార సాంప్రదాయాల మధ్య గల పోలికలను పరిశోధనాత్మక దృష్టితో వివరించారు. ముఖ్యంగా చైనీయుల పర్వదినాలు, వారి ఆచార, సాంప్రదాయాలు, సాంస్కృతిక స్థితిగతులను వివరించారు.

రచయిత్రి చైనాకు సంబంధించిన సంస్కృతిని తెలుసుకోవాలనే ఉద్దేశంతో చైనా భాషను నేర్చుకోవడం అభినందించాల్సిన విషయం. చైనా భాషను గురించి ఒక భాషా శాస్త్రవేత్త లాగా మనకు అర్థం అయ్యేవిధంగా చాలా అద్భుతంగా వివరించారు. రచయిత్రి పరిశోధకురాలు, వ్యాసకర్త, విమర్శకురాలు కాబట్టి, చైనీయుల సంస్కృతిని, భాషా సాహిత్యాలను, చరిత్రను విమర్శనా దృష్టితో, పరిశోధనాత్మకంగా విశ్లేషించి, వాటిని క్లుప్తంగా అందమైన మాటలతో వివరించారు.

జానపద సాహిత్యంలో పరిశోధన చేసిన శ్రీలక్ష్మిగారు చైనాలోని జానపద కథలను కూడా సేకరించి తన యాత్రా చరిత్రలో చర్చించడం అభినందించదగ్గ విషయం. చైనా

ప్రాచీన చరిత్రను, చైనాలోని బౌద్ధమతాన్ని వివరించి వీటిని చదివిన పాఠకులకు చైనాను గురించి ఒక ఉన్నతాభిప్రాయం కలిగేలా చేశారు. 'టీ' కి సంబంధించిన చరిత్రను కూలంకషంగా ఆసక్తిదాయకంగా వివరించారు.

రచయిత్రి రచనా శైలి అద్భుతం. ప్రతీ అంశాన్ని ఆసక్తి దాయకంగా, 'కథ'లు చెప్పినట్లుగా ఉంది. తన యాత్రా చరిత్రను ఏకబిగిన ఒకే విధంగా రాయకుండా కొన్ని ప్రకరణలుగా విభజించి, రాశారు. ఏదేమైనా ఆధునిక కాలంలో వచ్చిన యాత్రాచరిత్రల్లో శ్రీలక్ష్మిగారి 'షంఘై నింగిలో' అనే ఈ పుస్తకానికి యాత్రాసాహితీ ప్రియులు ప్రముఖ స్థానాన్ని ఇస్తారని చెప్పవచ్చు.

## 2.6. కన్యాకుమారి దీపకళిక: ఆచార్య కె. కుసుమారెడ్డి

ఆచార్య కుసుమారెడ్డిగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖకు అధ్యక్షులుగా పనిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంవారు, తెలుగు ఎం.ఏ విద్యార్థులకు విజ్ఞాన యాత్రను పాఠ్యాంశంలో ఒక భాగంగా నిర్ణయించారు. తమ విద్యా ప్రణాళికలకు అనుగుణంగా 2005-07 విద్యాసంవత్సరంలో ఎం.ఏ చదువుతున్న విద్యార్థులు దక్షిణదేశ యాత్రలు చేయాలని నిర్ణయించారని, వారి వెంట పర్యవేక్షకురాలిగా వెళ్ళాలని కుసుమారెడ్డి గారు ప్రారంభంలో చెప్పుకున్నారు.

ఇది పదిరోజుల యాత్ర. 2007 మార్చి 6న ప్రారంభమై 15.03.2007 వరకు వీరి యాత్ర సాగింది. ముఖ్యంగా వీరు దక్షిణ భారతదేశంలోని వివిధ ఆలయాలను, చారిత్రక ప్రదేశాలను, ప్రదర్శన శాలలను ఎంచుకుని ఈ విజ్ఞాన యాత్ర చేయడం జరిగింది. "16, 17 శతాబ్దాలలో తమిళనాడులో చాలా ప్రాంతం తెలుగు నాయక రాజుల పాలనలో వుండేదని, వారి కళాపోషణ, సాహిత్యసేవ తెలుసుకునే అవకాశం ఈ యాత్ర వల్ల విద్యార్థులకు కలిగింది" అని రచయిత్రి పేర్కొన్నారు. కుసుమారెడ్డి గారు ఈ యాత్రా చరిత్రను రాయమని విద్యార్థులకు చెప్పారు. అందులోని ఒకరిద్దరు ఆసక్తి గల విద్యార్థులు

తాము చూసిన ప్రదేశాల గురించి రాశారని, ఈశ్వర్ అనే విద్యార్థి చాలా కష్టపడి రాసిన యాత్రా విశేషాలు ఈ గ్రంథ రచనకు ఉపయోగపడ్డాయని తెలిపారు.

ఆచార్య నాయని కృష్ణకుమారి గారు విద్యార్థులతో తాను చేసిన విజ్ఞాన యాత్రను "కాశ్మీర దీపకళిక" అనే పేరుతో గ్రంథస్థం చేశారు. అలాగే భారతదేశానికి దక్షిణపు కొన అయిన కన్యాకుమారి వరకు జరిగిన ఈ విజ్ఞాన యాత్రను "కన్యాకుమారి దీపకళిక" అనే పేరుతో ముద్రింపచేయాలని విద్యార్థులు ఆశపడ్డారని, అందుకే ఈ పేరు పెట్టడం జరిగిందని వివరించారు. అలాగే "కన్యాకుమారి ముక్కు ఒక దీప కళిక వలె ప్రకాశిస్తూ వుండటం వల్ల ఈ పుస్తకం పేరు సార్థకమౌతుందని భావిస్తున్నా" అని రచయిత్రి పేర్కొన్నారు.

కుసుమారెడ్డి గారు అధ్యాపకురాలు, సాహితీవేత్త కావడం వల్ల ఏ ప్రాంతానికి వెళ్ళినా ఆ ప్రాంతంలోని సాహిత్యాంశాలను, కవులను గురించి తన పుస్తకంలో పేర్కొన్నారు. అలాగే చారిత్రక ప్రదేశాలకు వెళ్ళినప్పుడు ఆయా చారిత్రక విశేషాలను పొందుపరిచారు.

ముఖ్యంగా ఈ బృందం ఆలయాలను ఎక్కువగా దర్శించారు. ఆలయాల్లోని శిల్ప సంపదలను చూసి, వాటి అద్భుతాన్ని, అందాన్ని చక్కని వాక్యాలలో వివరించారు. తాము చూసిన ప్రాంతాలను గురించి, వాటి ప్రాముఖ్యతలను గురించి, సూటిగా, స్పష్టంగా వివరించారు. ముఖ్యంగా సాహిత్యాంశాలు, చారిత్రకాంశాలను ఎక్కువగా వివరించారు.

ఏ ప్రాంతానికి, ఏ దేవాలయానికి వెళ్ళినా, వాటి స్థల పురాణాలను, ప్రాచీన గాథలను, చరిత్రను లిపిబద్ధం చేశారు. అలాగే రచయిత్రి తాము ప్రయాణించేటప్పుడు దారిలో కన్పించిన ప్రకృతిని కూడా చక్కగా వర్ణించారు.

## 2.7. యాత్రా జీవనం – దాశరథి రంగాచార్య

దాశరథి రంగాచార్య విప్లవవాది, కవి, రచయిత, యాత్రికుడు, బహుభాషావేత్త, అనువాదకుడు. వీరు 1928 ఆగస్టు 24న వరంగల్ జిల్లా చినగూడూరులో దాశరథి

వెంకటాచార్యులు, వెంకటమ్మలకు రెండో సంతానంగా జన్మించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని పలికిన దాశరథి కృష్ణమాచార్యులకు ఈయన స్వయానా తమ్ముడు. నిజాం ప్రభువుల పాలనలకు వ్యతిరేకంగా పోరాడిన దాశరథి గారు బి.ఎ., ఎల్.ఎల్.బి., పూర్తి చేశారు.

కొద్దికాలం ఉపాధ్యాయునిగా, మున్సిపల్ విభాగంలో అనువాదకునిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి అంచెలంచెలుగా ఎదిగి సహాయ కమీషనర్‌గా 1988లో పదవీ విరమణ పొందారు. ఒకవైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు సాహిత్య ప్రక్రియను కూడా కొనసాగించారు. మోదుగపూలు, చిల్లర దేవుళ్ళు, శరత్పరం, మానవత, దేవదాసు ఉత్తరాలు, జనపదం, పావని, మాయజలతారు, రానున్నది ఏది నిజం, నల్లనాగు అనే రచనల్ని చేశారు. జీవనయానం పేరుతో వీరు ఆత్మకథను రాశారు. ఉర్దూ, ఇంగ్లీషు భాషల నుండి నవలల్ని, కథలను అనువదించారు. వ్యాసాలు, సంకలనాలు మొదలైనవెన్నింటినో రాశారు. నాలుగు వేదాలను తెలుగులోకి అనువదించి, అపర వ్యాసుడనే బిరుదును పొందారు. బ్రాహ్మణాలను, ఉపనిషత్తులను, రామాయణ, భారతాన్ని, భాగవతాన్ని సరళసుందరమైన తెలుగులో వ్యాఖ్యాన సహితంగా అనువదించారు. 1969లో వీరి చిల్లర దేవుళ్ళు రచనకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది.

దాశరథిగారు తాము దర్శించిన ఆలయాలను, దివ్యక్షేత్రాలను, వాటి అనుభూతులను 'యాత్రా జీవనం' పేరుతో గ్రంథస్థం చేశారు. ఇది అరవైయవ గ్రంథం. ఈ యాత్రా రచనను 22.11.2002 నాడు ప్రారంభించి 06.10.2006 నాడు పూర్తిచేశారు. యాత్రా జీవనం 'భక్తి' మాసపత్రికలో జనవరి సంచిక నుండి ధారావాహికగా ప్రచురితమయింది. డెబ్బై తొమ్మిది సంవత్సరాల వయస్సులో అనారోగ్యంతో ఉండి కూడా ఈ యాత్ర జీవనాన్ని పూర్తిచేశారు.

ఈ యాత్రా చరిత్రలో మొదట తన జీవితాన్ని గురించి వివరించాడు. భారతదేశంలో గల దాదాపు అన్ని ప్రధాన క్షేత్రాలను, ఆ వివరాలను ఇందులో పొందుపరిచారు. దాశరథిగారు 2002లో యాత్రా రచన ప్రారంభిస్తే, వారికి 2005లో గుండెకు ఆపరేషన్,

తర్వాత న్యూమోనియా ఇలా వెంటవెంటనే ఆరోగ్య సమస్యలు రావడం వలన 'యాత్రాజీవనం' రచన మధ్యలోనే ఆపేశాడట. దాశరథి గారి ఒక డాక్టర్ తన చేతి వణుకు తగ్గించి, యాత్రా జీవనాన్ని పూర్తి చేయించాడని దాశరథిగారు ఈ పుస్తకంలో రాసుకున్నారు..

కేవలం తాను దర్శించిన ప్రాంతాల అనుభూతులను మాత్రమే కాక, యాత్ర అనే పదానికి గల నైఘంటిక అర్థాన్ని యాత్రలు చేసేటప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తల్ని, యాత్రల వల్ల కలిగే ప్రయోజనాన్ని వివరించారు. అంతేకాకుండా వేదాల్లో, పురాణాల్లో, ప్రబంధాల్లో, బ్రాహ్మణాల్లో, ఉపనిషత్తుల్లో, వాల్మీకి రామాయణంలో, భారతంలో గల యాత్రల్ని గురించి, యాత్రా వృత్తాంతాల గురించి వివరించి ప్రాచీన కాలంనుండి మానవ జీవితంలో యాత్రలకు గల ప్రాధాన్యతను వివరించారు.

ఈ గ్రంథంలో వాల్మీకి వృత్తాంతాన్ని ధనుర్దాసు హేమసుందరిల మధ్యగల ప్రేమను, శ్రీరంగనాథుని వైపు మళ్ళించిన శ్రీమద్రామానుజుల వృత్తాంతాన్ని, హిరణ్యకశప-ప్రహ్లాదుల వృత్తాంతాన్ని, విష్ణుచిత్తుని వృత్తాంతాన్ని, ఆదిశంకరాచార్యుల వృత్తాంతాన్ని, అలెగ్జాండర్-పురుషోత్తముల వృత్తాంతాన్ని, ఇలా ఎన్నో విషయాలను కూడా పొందుపరిచారు. ఈ యాత్రా గ్రంథంలో మొత్తం 239 ప్రదేశాలకు సంబంధించిన యాత్రానుభవాలు లిపిబద్ధం చేయబడి ఉన్నాయి. ముఖ్యంగా ఈ పుస్తకంలో పేర్కొన్న యాత్రలన్నీ కూడా తీర్థయాత్రలే. తన జీవితకాలంలో సందర్శించిన అన్ని పుణ్యక్షేత్రాలకు సంబంధించిన అనుభూతుల సమాహారమే ఈ యాత్రాజీవనం.

దాశరథిగారు భారతదేశంలోని ప్రముఖ దేవాలయాలనన్నింటినీ కుటుంబ బంధుమిత్ర సపరివారంగా దర్శించారట. తాను దర్శించిన ప్రతి క్షేత్రానికి సంబంధించిన గాథను, దేవాలయాల గొప్పదనాన్ని, అక్కడి నదుల విశిష్టతను, ప్రాంతాల చరిత్రను అన్నింటినీ లిపిబద్ధం చేశాడు. అంతేకాక యాత్రలు చేసే వారికి కొన్ని సూచనలు చేశారు. శైవ, వైష్ణవ ఆలయాల ప్రశస్తి ఇందులో కన్పిస్తుంది.

దాశరథి గారి యాత్రాజీవనం యాత్రాచరిత్ర రూపమైన ఆత్మకథ. తాను చూసిన ప్రతీ క్షేత్రాన్నీ సూక్ష్మదృష్టితో పరిశీలించి, ఆ వివరాలను అక్షరబద్ధం చేసి, యాత్రా జీవనాన్ని సమగ్రంగా రూపొందించారు. అక్కడక్కడ భారత రామాయణాల్లో వేదాలలో గల సూక్తులను, మంత్రాలను ఉటంకించారు. దాశరథి గారి యాత్రాజీవనం ఆధునిక యాత్రాచరిత్రల్లో ఒక గొప్ప స్థానాన్ని అలంకరిస్తుంది.

"యాత్రాజీవనం" ఒకరకంగా ఆత్మకథయే. నేను చేసిన యాత్ర వివరించడమే అని పేర్కొన్నారు. ఇలా "రెండు ఆత్మకథలు వ్రాసిన రెండవవాడు లేడనుకుంటా" అని దాశరథిగారు తెలిపారు.

## 2.8. మా యాత్ర – దేవులపల్లి కృష్ణమూర్తి

'ఊరువాడ బతుకు' అనే రచనతో తెలుగు పాఠకులకు పరిచయమైన రచయిత దేవులపల్లి కృష్ణమూర్తిగారు. వీరు మండల రెవెన్యూ అధికారిగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి, 1998వ సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. నల్గొండ జిల్లా నకిరేకల్ వాస్తవ్యుడయిన కృష్ణమూర్తి గారు తన పదవీ విరమణానంతరం టూరిస్టుగా ఇరవై రోజుల పాటు ఉత్తర భారతదేశాన్ని చుట్టివచ్చి, తన పర్యటనానుభవాలను 'మా యాత్ర' పేరుతో అక్షరీకరించారు.

బాసర, షిర్డీ, అజంతా, ఎల్లోరా, దౌలతాబాద్, ఉదయ్‌పూర్, మౌంట్ అబూ, అజ్మీర్ దర్గా, జైపూర్, ఢిల్లీ, నైనిటాల్, ద్వారక, ఖజురహో, అయోధ్య, వారణాసి, కలకత్తా, భువనేశ్వర్, కోణార్క్, శ్రీకాకుళం, అరసవిల్లి సూర్యదేవాలయం, సింహాచలం, విశాఖపట్నం, అన్నవరం, భద్రాచలం మొదలైన భారతదేశంలో ప్రసిద్ధి చెందిన ముప్పై ప్రదేశాల్ని సందర్శించారు.

తాను దర్శించిన ప్రతీ యాత్రా స్థలాన్ని గురించి తన యాత్రాగ్రంథంలో వివరించే క్రమంలో తెలుగు సాహిత్యంలోని ప్రసిద్ధ పద్యాలను, గేయాలను, కవితా పంక్తులను ఉటంకిస్తూ చెప్పాలనుకున్న విషయానికి మరింత వన్నె తెచ్చారు. తద్వారా ప్రాచీన కవుల్ని,

మరియు ప్రసిద్ధ రచయితల్ని మరొకసారి మన స్మృతిలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. యాత్రానుభవాల్ని వివరించడంలో వీరిది ప్రత్యేక శైలి.

యాత్ర చేయడం వల్ల వీరి యాత్రారచన అనుభూతి స్పర్శతో అలరారుతుంది. 'మా యాత్ర' అనే రచన చదివాక రచయిత అనుభవంతో పాఠకుడు మమేకమవుతాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## 2.9. జర్మనీలో కవితాయాత్ర – డా. ఎన్. గోపీ

రెప్పల చాటున పడుకున్న
నిప్పును లేపకండి
తలలెత్తే ఆగ్రహానికి
తలుపులు తీయకండి అంటూ

ఉద్యమించిన తెలంగాణ కవి డా॥ యన్. గోపీ వీరిని విమర్శకునిగా, అధ్యాపకునిగా, పరిశోధకునిగా, నానీల సృష్టికర్తగా, యాత్రికునిగా, యాత్రాచరిత్రల రచయితగా భిన్నకోణాల్లో పరిచయం చేయవచ్చు. ముఖ్యంగా వేమన పైన వీరు చేసిన పరిశోధనల వల్ల సాహిత్యలోకంలో, పరిశోధనా రంగంలో 'వేమన గోపీ'గా ప్రఖ్యాతిని ఆర్జించారు. 1976వ సంవత్సరంలో మొదలైన వీరి రచనా ప్రస్థానం నిరంతర వాహికగా ఇప్పటివరకూ ప్రవహిస్తూనే వుంది. వీరి కలానికి వయస్సును చెప్పలేము, అది రాసే గాఢతను మాత్రమే చెప్పగలము. వీరి మొదటి రచన తంగెడుపూలు. వీరు రాసిన కాలాన్ని నిద్రపోనివ్వను, జలగీతం అనే కవితలు సాహితీ జగత్తులో ప్రసిద్ధాలు.

వీరి 'కాలాన్ని నిద్రపోనివ్వను' అనే కవితను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. ఆ తరువాత 2002లో రాసిన 'జలగీతం' కావ్యం ద్వారా ఉత్తమకవిగా వినుతికెక్కారు. వ్యాసపంచమి, గవాక్షం వంటి విమర్శా గ్రంథాలను 'ప్రజాకవి వేమన', వేమన పద్యాలు పారిస్ (ప్రతి క్రీ.శ.1730) మొదలగున పరిశోధనా గ్రంథాలను, ఐదు యాత్రాచరిత్రలను ఇంకా ఎన్నో రచనలను చేశారు. వీరి రచనలు 23 భాషల్లోకి

అనువదించబడ్డాయి. వీరి రచనల్లో మానవ జీవితంలోని నిసర్గ సౌందర్యం, మానవ జీవితంలోని సంఘర్షణ కనిపిస్తూ వీరి రచనల్లోని వస్తువు వాస్తవం అనిపించే విధంగా వుంటాయి. తెలుగు సాహిత్యంలో 'నానీ'లు అనే ఒక కొత్త ప్రక్రియను సృష్టించి, 'నానీల నాన్న'గా, నానీల త్రివిక్రముడిగా కీర్తి సంపాదించుకున్న రచయిత డా.ఎన్.గోపీ. వీరు రాసిన 'గోవాలో సముద్రం' అనే రచన యాత్రాకవిత్వం అనే నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. "కవిత్వం రాయడం ఒక సృజనాత్మక ప్రక్రియ. అయితే దానికొక శీర్షిక పెట్టడం ఔచిత్యకళ. గోపీగారు ఈ కళలో మరింత ముందుంటారు" (గోపీ సాహిత్య వివేచన, పుట-225) అని డా॥ ఎస్ రఘు గారు పేర్కొన్నారు.

"గోపీ కవిత ఆవేశభరితం కాదు, ఆలోచనాత్మకం, వివాదపూరితం కాదు వివేకచాలితం – ఉధృత జలపాతం కాదు, గంభీర నదీ ప్రవాహం. ఆర్ధ్రత దాని లక్షణం. మానవీయత దాని స్వభావం. మనుషుల మనో మాలిన్యాలను తొలగించి పరిశుభ్రం చేయటం దాని నైజం" (గోపీ సాహిత్య వివేచన, పుట-111) అంటూ గోపీ గారి కవితా తత్వాన్ని వెల్లడించారు డా. పాపినేని శివశంకర్ గారు అయితే పాపినేని గారు చెప్పినట్లుగా పై లక్షణాలు కేవలం వారి కవిత్వానికే పరిమితం కాదు, వారు రాసిన యాత్రాచరిత్రల్లో కూడా కొన్ని లక్షణాలు మనం గమనించవచ్చు.

గోపీగారు ఇప్పటి వరకు ఐదు యాత్రారచనల్ని రాశారు. మొదటి యాత్రాచరిత్ర 1996లో రాసిన 'నేను చూసిన మారిషస్', తరువాత 2001 లో నా సైప్రస్ యాత్ర, 2002లో అమెరికాలో తెలుగుయాత్ర, 2004లో ఇంగ్లండ్‌లో ఇరవైఐదు రోజులు, 2015లో 'జర్మనీలో కవితాయాత్ర' అనే యాత్రచరిత్రల్ని రచించారు. మారిషస్, అమెరికా, ఇంగ్లండ్ దేశాలను సందర్శించే యాత్రికులు ఎక్కువ. అంతేగాక తెలుగులో ఈ దేశాల గురించి రాసిన యాత్రాచరిత్రలు విరివిగానే కన్పిస్తాయి అయితే జర్మనీని దర్శించి, ఆ అనుభవాలతో జర్మనీ గురించి యాత్రాచరిత్రలు రాసేవారు చాలా అరుదుగా వుంటారు. అందుకనే నేను ఇక్కడ 'జర్మనీలో కవితాయాత్ర' అనే యాత్రాచరిత్రలోని గోపీగారు స్పృశించిన వివిధ అంశాలను చర్చించదలిచాను.

కేంద్రసాహిత్య అకాడమీ మరియు భారత విదేశాంగ సహకారంతో కొద్దిమంది రచయితలకు జర్మనీయాత్ర ఖరారయ్యింది. రచయితల బృందానికి గోపీగారే నాయకత్వం వహించారట. హిందీ కవి పాత్రికేయుడైన డా|| చందర్‌త్రిఖ, బెంగాలీ కవి, మరియు అధ్యాపకుడైన డా॥ అంశుమన్‌కార్, పంజాబీ కవి, మరియు పంజాబ్ యూనివర్సిటీ ఆచార్యుడైన సతీష్ వర్మలతో రచయిత ఈ యాత్రాచరిత్రను సాగించారు. వీరు 2014 మే-5న జర్మనీ నగరాన్ని పర్యటించి జర్మనీలో తాను గమనించిన అంశాలను క్రమానుగతంగా చెప్పుకుంటూ వచ్చి తాను చెప్పాలనుకున్న విషయాలను పాఠకుడికి సులభంగా చేరేలా సరళశైలిలో ఈ యాత్రాచరిత్రను రచించారు. రచయిత తన హృదయాన్ని స్పృశించిన అంశాలు కవితలుగా అల్లి, యాత్రాచరిత్రను కూడా కవిత్వీకరించారు.

ఈ పర్యటనలో తాను అనుభూతి చెందిన అంశాలకు కవిత్వీకరించే సందర్భంలో వీరు ప్రయోగించిన పదబంధాలు పాఠకుణ్ణి ఆహ్లాదంలో ముంచెత్తి ఆహా! అనిపిస్తాయి. జర్మనీలో విమానం దిగగానే

"నేను తలకు చుట్టుకొచ్చిన
ఇండియా మబ్బులు
ఇక్కడి మేఘాలతో సంభాషిస్తున్నాయి" అంటూ

ఒక గొప్ప వ్యక్తీకరణను ప్రయోగించారు. జర్మనీలోని హ్యాంబర్గ్‌లో రచయిత బృందం బస చేసినప్పుడు, తెల్లవారుఝామునే సూర్యోదయాన్ని చూస్తూ ఆ సూర్యుణ్ణి

"కొండచాటు నుంచి
ఉదయించే సూర్యుడు
మరో పుస్తకంగా విచ్చుకుంటాడు" అంటూ

హృదయానికి హత్తుకునే ఒక కొత్త ఉపమానంతో వ్యక్తీకరించాడు.

బెర్లిన్ గోడ చరిత్రను వివరించే సందర్భంలో ఈ గోడ మనుషులను వేరు చేసిందని, అయినా వారి మధ్య వుండే బంధాలు, బంధుత్వాలు, ప్రేమలు నశించలేదని చెబుతూ 'బెర్లిన్ గోడ' అనే కవితలో

"పువ్వులను అడ్డుకోగలిగారు కానీ

పరిమళాలను ఆపగలిగారా" అంటూ ఆవేదన చెందారు.

అంతేగాక

"చరిత్ర ఘనీభవించి

గోడగా రూపు కట్టింది"

అంటూ బెర్లిన్ గోడ పట్ల తనకు గల వ్యతిరేక భావాన్ని వ్యక్తపరిచారు.

గోపీగారు యాత్రికునితో పాటూ కవి, భావకుడు కూడా కావడం వల్ల వీరు రాసిన ఈ యాత్రాచరిత్ర మూడు నానీలు – ఆరు కవిత్వాలతో సంపూర్ణంగా అలరారుతుంది. పాఠకులకు నచ్చే – వారు మెచ్చే యాత్రాచరిత్రల్లో గోపీగారి జర్మనీలో కవితాయాత్ర కూడా ఒకటి అవుతుందని చెప్పటంలో సందేహంలేదు. ఇవేగాక మారిషస్, సైప్రస్, అమెరికా, ఇంగ్లండ్ దేశాలను పర్యటించి రాసిన యాత్రాగ్రంథాలు కూడా తెలుగు యాత్రా సాహిత్యంలో వెలువడ్డాయి.

## 2.10. సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర – పరవస్తు లోకేశ్వర్

యాత్రను విహారంగా కాక, అధ్యయనానికి, జ్ఞాన సంపాదనకు సాధనంగా భావించే నిరంతర అన్వేషి పరవస్తు లోకేశ్వర్. వీరు రచయిత, కవి, చరిత్రకారులే కాక నిరంతర యాత్రికుడు. అనేక ప్రాంతాల్ని పర్యటించాలని కలలు కనడమే గాక, వాటిని నిజం చేసుకుంటున్న యాత్రా పిపాసి. అంతేగాక తన యాత్రానుభవాలనన్నింటినీ అక్షరబద్ధం చేయగల నేర్పరి. 2009, 2011 సంవత్సరాల్లో ఛత్తీస్‌ఘడ్‌కు రెండుసార్లు స్కూటర్ యాత్ర చేసి, తన అనుభవాలను "ఛత్తీస్‌ఘడ్ స్కూటర్ యాత్ర" పేరుతో అక్షరబద్ధం చేశారు. "నేనొక సాహస యాత్ర చేయాలని, అది వినూత్నంగా, విభిన్నంగా వుండాలని దృఢ నిశ్చయం తీసుకున్నాను. సాహసం సమక్షంలో మృత్యువు ఒక లెక్కకాదు అన్న దేశదిమ్మరి కళాతపస్వి సంజీవ్‌దేవ్ మాటల్ని పదే పదే మననం చేసుకున్ననాను. యద్భావం తద్భవతి ఫలితమే స్కూటర్‌పై ఛత్తీస్‌ఘడ్ సాహసయాత్ర. పదిరోజులలో 1943 కి.మీలు పర్యటించిన

యాత్రా కథనం" (ఛత్తీస్‌ఘడ్ స్కూటర్ యాత్ర, పుట-1) అంటూ తన యాత్రా లక్ష్యాన్ని వివరించాడు.

ఛత్తీస్‌ఘడ్ ఒక నూతన రాష్ట్రంగా ఏర్పడటానికి కారణమయిన పరిస్థితులను తెలుసుకుంటే అవి తన తెలంగాణా ఉద్యమానికి ఎలా సమన్వయం చేసుకోవచ్చో అవగతం చేసుకునేందుకు ఈ యాత్రను చేశాడు. రచయిత తనతో పాటూ తన మిత్రుడైన సతీష్ గారితో ఈ అధ్యయన యాత్రను సాగించారు. ఛత్తీస్‌ఘడ్ స్కూటర్ యాత్ర ఉద్వేగంతో, ఉత్సుకతతో, ఆసాంతం చదివింపజేసే స్ఫూర్తివంతమైన, చైతన్యవంతమైన యాత్రాగ్రంథం.

తరువాత 2012లో ఒంటరిగా రెండు నెలలు యూరపు, ఆసియా దేశాల మధ్య ఒకనాడు వారధి ఉపయోగపడిన సిల్కు రోడ్డులో పర్యటించారు. అరవై రెండు సంవత్సరాల వయస్సులో ఒంటరిగా 14,612 కిలోమీటర్లు పర్యటించి, తన యాత్రాపిపాసను కొంతమేర తీర్చుకోగలిగారు లోకేశ్వర్ గారు. మొత్తం 55 రోజులు యాత్ర ఇది. ఇందుకు గానూ వీరికి అయిన ఖర్చు మూడున్నర లక్షల రూపాయలు.

పదిహేనేళ్ళ ప్రాయంలో తాను చదివిన చెంఘిజ్ ఖాన్ నవలే ఈ యాత్రకు ప్రేరేపించిందని రచయిత పేర్కొన్నాడు. చెంఘిజ్‌ఖాన్ నవలలోని ప్రదేశాలలో పర్యటించాలనే మధ్య ఆసియా దేశాల సంచారానికి సిద్ధమయ్యాడు. "చెంఘీజ్ ఖాన్ నవలలో వర్ణించబడిన మంచుకొండలు, మైదానాలు, ఎడారి ఇసుకలో పరిగెత్తే గుర్రాలకోసమే, వాటి గిట్టల పద ఘట్టనల లయబద్ధమయిన చప్పుడు వినటం కోసమే కదా నేను ఇట్లా మధ్య ఆసియా దేశాల సంచారానికి దేశదిమ్మరిగా వచ్చింది" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర-పుట-116) తాను ఈ ప్రాంతాల్లోనే ఎందుకు పర్యటించాడో వివరించాడు రచయిత.

ఉజ్బెకిస్తాన్ దేశంలోని బుఖారాలోని మదర్సాలుతో మొదలైన వీరి యాత్ర బీజింగ్ లోని కన్ఫూషియస్ విశ్వవిద్యాలయం వద్ద ముగిసింది. ఐదువేల సంవత్సరాల ప్రాచీన నాగరికత కలిగిన భారతదేశం నుండి బయలుదేరిన లోకేశ్వర్ గారు ఘనమయిన ఐదు వేల సంవత్సరం నాగరికత కలిగిన చైనా చేరడంతో ఈ యాత్ర ముగిసింది. భాష,

సంస్కృతి, సంప్రదాయాలు, జీవనవిధానం అంతా ఏమాత్రం సంబంధం లేని ప్రాంతంలో పర్యటించడం అంత సులభమయిన విషయం కాదు. అలాంటిచోట్ల సౌకర్యాల కోసం ఆలోచించకుండా వీలున్నంత వరకు అన్ని ప్రాంతాలను పర్యటించి, వాటిని అక్షర రూపంలో అమర్చి, పాఠకులకు 'సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర' పేరుతో అక్షరాల విందును అందించారు లోకేశ్వర్ గారు. అందుకే ఈ యాత్రా చరిత్రకు యాత్రా సాహిత్యంలో ఒక ప్రత్యేక స్థానముంది. 2014 సంవత్సరంలో యూరపులోని తొమ్మిది దేశాలను పర్యటించి 'కలల దారులలో యూరపు యాత్ర' పేరుతో అక్షరీకరించారు. ఒకప్పుడు తాను చదువుకున్న రోమన్, గ్రీసు ప్రాచీన నాగరికతలు, బ్రిటిష చరిత్ర, విప్లవోద్యమాలు, కవులు, కళాకారుల, రాజకీయ నాయకుల జీవిత చరిత్రలు తాను ఈ యాత్ర చేయటానికి ప్రేరేపించాయని తెలిపారు. రాహుల్ సాంకృత్యాయన్ రచనల నుంచి సంక్రమించిన సంచారతత్వం కూడా ఈ యాత్రకు ప్రోత్సహించిందంటూ తన యాత్రాగ్రంథంలో పేర్కొన్నారు.

మనల్ని మనం తెలుసుకోవాలంటే, మనలోపలి నిగూఢ శక్తులను బహిర్గతం చేసుకోవాలనుకుంటే ఇటువంటి యాత్రల్ని చేయాలనిపించిందని, అందుకే ఇంత సాహసోపేతమైన యాత్రల్ని చేశానని చెప్పుకున్నారు లోకేశ్వర్ గారు. వీరి మూడు యాత్రా చరిత్రలు అనుభూతి దృష్టితో రాయడం వల్ల కవితాత్మకతతో వెలుగొందుతుంటాయి.

## 2.11. నా దక్షిణ భారత యాత్రా విశేషాలు – పాటిబండ్ల వెంకటపతి రాయలు

పాటిబండ్ల వెంకటపతి రాయలు గారు అధ్యాపకులుగా పనిచేశారు. వీరికి దేశాటనం అంటే చాలా ప్రీతి అని అందుకే భారత దేశమంతటా దర్శించానని ముందు మాటలో చెప్పుకున్నారు. కాలినడకన దేశమంతా తిరిగి రావాలని అనుకునేవారట. కానీ కుటుంబ బాధ్యతలు, ఆర్థిక పరిస్థితుల కారణంగా తన యవ్వన కాలంలో యాత్రలు చేయలేకపోయారు. ఈయన తన 71వ సంవత్సరాల వయస్సులో యాత్రలు చేశారు. 2000 సంవత్సరం నాటికి భారతదేశాన్ని మొత్తం పర్యటించారు. భారతదేశంలో అతడు

చూసిన వింతలను, విశేషాలను గ్రంథంగా రాయాలనే ఆలోచన కలిగిందని, అయితే భారతదేశ యాత్రా విశేషాలన్నింటినీ ఒకే గ్రంథంగా రాస్తే పెద్ద పుస్తకమవుతుందని భావించి, రెండు గ్రంథాలుగా రాశానని పేర్కొన్నారు. అవే 'నా దక్షిణ భారతయాత్రా విశేషాలు', 'ఉత్తర భారత యాత్రా విశేషాలు'. 'మొదటి నా దక్షిణ భారత యాత్రా విశేషాలు' అన్న గ్రంథంలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, కర్నాటక, గోవా రాష్ట్రాలలోని విశేషాలను పొందుపరిచాడు. నా ఉత్తర భారత యాత్రా విశేషాలు అనే గ్రంథంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, జమ్మూ–కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్, బీహార్, నేపాల్, పశ్చిమ బెంగాల్, సిక్కిం, అస్సాం, మేఘాలయా రాష్ట్రాలలోని విశేషాలను తెలియజేశారు.

ప్రతీ రాష్ట్రంలోని, ప్రతీ జిల్లాను సందర్శించి, ఆయా ప్రాంతాల స్థల పురాణాలను, చారిత్రక గాథలను వివరించారు. ప్రతీ ప్రాంతానికి సంబంధించిన చరిత్రను ఇందులో పొందుపరిచారు. ఆయా ప్రాంతాలకు ఆ పేర్లు ఎందుకు ఎలా వచ్చాయో పేర్కొన్నారు. ముఖ్యంగా దేవాలయాలను, మ్యూజియంలు, గ్రంథాలయాలు, చారిత్రక ప్రదేశాలు వంటివి ఆయా ప్రాంతాలలో ఏమేమి వున్నాయో వాటన్నింటినీ చూసి, ఇందులో ఆయా విశేషాలను వివరించారు.

వెంకటపతి రాయలు గారు తన యాత్రాగ్రంథాన్ని అచ్చంగా కైఫియత్తుల లాగా రాశారు. మనం భారతదేశంలోని ఏ ప్రాంతానికి, ఏ రాష్ట్రానికి వెళ్ళాలనుకున్నా, వాటికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఈ గ్రంథం నుంచి పొందవచ్చు.

## 2.12. యాత్రా కమలాకరం: పెండ్యాల సత్యనారాయణ శర్మ

సత్యనారాయణ శర్మగారు ఢిల్లీ నివాసితులు. వీరు ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాలు, పంచారామాలు, అష్ట వినాయక క్షేత్రాలను సందర్శించి, ఆ వివరాలన్నింటినీ "యాత్రా కమలాకరం" అనే పుస్తకంలో పొందుపరిచారు. ఈ యాత్రా గ్రంథం 2008 జూలైలో ముద్రింపబడింది.

భారతదేశంలోని అనేక ప్రాంతాలను సంచరించినందువలన, ఆయా రాష్ట్ర ప్రజల జీవన విధానాన్ని, సంస్కృతీ సాంప్రదాయాల్ని కొంతవరకు తెలుసుకోగలిగానని రచయిత పేర్కొన్నారు. సత్యనారాయణగారు, అతని మిత్రుడు సూర్యనారాయణశర్మగారు కలిసి ఈ యాత్రలు చేశారట. వీరి తీర్థ యాత్రానుభవాల సమాహారమే 'యాత్రా కమలాకరం'.

అయితే వీరు యాత్రలు చేయాలనుకున్నప్పుడు ఆయా క్షేత్రాలకు ఎలా వెళ్ళాలి? వసతి సౌకర్యాలు, ప్రయాణ సౌకర్యాల గురించి, పుస్తకాలు చూసినా సరైన సమాధానం లభించలేనందున ఇబ్బంది పడ్డారట. అందువలన వారి లాగా ఎవరైనా యాత్రలు చేయాలనుకుంటే వారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో తాము చూసిన ప్రాంతాలన్నింటికీ సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. అంతేకాక ప్రతీ క్షేత్రానికి సంబంధించిన పురాణ గాథలని, దేవాలయాల విశిష్టతను ఇందులో లిపిబద్ధం చేశారు సత్యనారాయణగారు. తరువాతి యాత్రికులకు ఈ పుస్తకం ఒక యాత్రా మార్గదర్శిగా ఉపయోగపడుతుంది.

తీర్థయాత్రలు చేయటం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని, సమస్యలను, ఒత్తిళ్ళను ఎదుర్కోవటానికి రెట్టింపు శక్తి లభిస్తుందని, క్షేత్రాలలో ఉన్న ప్రకృతిని ఆస్వాదించటం వలన మానసిక ఉల్లాసాన్ని, ఆయురారోగ్యాలను పొందవచ్చని పేర్కొన్నారు. అందుకే ఈ ప్రయోజనాల కోసం సత్యనారాయణగారు తీర్థయాత్రలు చేసి వుంటారు.

## 2.13. జపాన్ – ఒక నాగరక జైత్రయాత్ర – పి.వి. రంగనాయకులు

ఒక భాషను సాధనంగా చేసుకుని ప్రపంచ దేశాలను చుట్టి రావడం అత్యంత అరుదైన విషయం. 'ఎస్పెరాంతో' అనే విశ్వభాష ఆధారంగా 34 సంవత్సరాల్లో 32 దేశాలను చుట్టివచ్చిన యాత్రా పిపాసి ప్రొఫెసర్ పొత్తూరు వెంకట రంగనాయకులు గారు. వీరు వృత్తి రీత్యా ఆయుర్వేద వైద్యులు, ప్రవృత్తి రీత్యా నిరంతర యాత్రికుడు. ప్రపంచాన్ని చూడాలని, అనేక విషయాలను అన్వేషించాలనే ఉద్దేశంతో విద్యార్థి దశలోనే ఎస్పెరాంతో

భాషను నేర్చుకుని, తన కలలను సాకారం చేసుకున్న స్వాప్నికుడు. అంతేకాక తిరుపతిలోని ఎస్.వి. ఆయుర్వేద కళాశాలలో ప్రొఫెసర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే, చరిత్ర మీద మక్కువతో చరిత్రను అభ్యసించటమే కాక చరిత్ర పరిశోధనలోనూ అగ్రగణ్యులుగా కీర్తి ప్రతిష్టలందుకుంటున్నారు. వీరు ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం మ్యూజియం డైరెక్టరుగా పదవీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

చైనాలోని షంఘై విశ్వవిద్యాలయం ఆహ్వానంపై అక్కడ భారతీయ ఆయుర్వేదంపై ఎస్పెరాంతో భాషలో ఉపన్యసించారు. 1994లో టోక్యోలో జరిగిన ప్రాచీన వైద్య విధానాల సదస్సుకు హాజరయ్యి, భారతీయ ఆయుర్వేద శాస్త్ర విశిష్టతను తన ఉపన్యాసాల ద్వారా చాటి చెప్పారు. అంతేగాక ఉక్రెయిన్, కొరియా దేశాల్లో కూడా ఆయుర్వేద చికిత్స గురించి ఉపన్యాసిలివ్వటమే కాక, ఆయుర్వేద చికిత్సా పద్ధతులను ఆయాదేశాల వైద్యులకు నేర్పించారు. జపాన్‌లోని వైద్య విధానాల సదస్సుకు హాజరైన క్రమంలో షావోలిన్ టెక్నిక్ పై ఆధారపడిన యుమైహా అనే జపాన్ వారి వైద్య చికిత్సా విధానాన్ని అభ్యసించారు.

1983వ సంవత్సరంలో మాంచెస్టర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆయుర్వేద చికిత్సా పద్ధతులను బ్రిటిష్ వారికి పరిచయం చేయటానికి వీరిని ఇంగ్లండ్‌కు ఆహ్వానించింది. అంతేకాక స్కాట్లాండ్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి, మాంచెస్టర్ విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులకు కూడా వీరు ఆయుర్వేద పాఠాలను బోధించారు. ఆంగ్లభాషలో ఆయుర్వేద నిఘంటువును రూపొందించారు. వీరు రేడియో ఐర్లండ్, బి.బి.సి ఛానల్లో ఇంటర్వ్యూ చేయబడ్డారు. నెదర్లాండ్స్ దేశంలోని రోటర్‌డామ్‌లోగల ఎస్పెరాంతో ప్రధాన కార్యలయంలో పనిచేసిన మొదటి ఆంధ్రుడు రంగనాయకులు గారు. అంతేకాక 'ఎస్పెరాంతో' అనే అంతర్జాతీ మాసపత్రిక సహ సంపాదకునిగా కూడా వీరు వ్యవహరిస్తున్నారు.

రంగనాయకులు గారు యాత్రా ప్రియులే కాక సాహస ప్రియులు కూడా. వీరు జపాన్‌లో ప్రసిద్ధి చందిన అగ్నిపర్వతమైన 'ఫుజీ' పర్వతాన్ని అధిరోహించారు. హిమాలయాల్లో త్రిశూలి నదిలో 'రివర్‌రాఫ్టింగ్' అనే సాహస క్రీడలో పాల్గొన్నారు. యూరప్‌ను సందర్శించిన సమయంలో రోటర్‌డామ్ జర్మనీలోని హామ్బర్గ్ నగరం వరకూ

దాదాపు 300 కిలోమీటర్లు దాదాపు సైకిల్ పై యాత్రచేసిన సంచారజీవి రంగనాయకులు గారు. అంతేకాక దేశవిదేశాలలో కొండచరియల్లో ట్రెక్కింగ్ చేశారు. వీరు ఐరోపా దేశాలతో పాటు అమెరికా, జపాన్, చైనా, కొరియా, ఉక్రెయిన్ మొదలైన దేశాలను పర్యటించిన సమయాల్లో ఆయాదేశాల్లో తాను చూసిన వింతలను, విశేషాలను, తన అనుభవాలను యత్రావ్యాసాల రూపంలో, గ్రంథాల రూపంలో ప్రకటించారు.

రంగనాయకులు గారు జపాన్‌ను సందర్శించి, ఆ పర్యటనానుభవాలను 'జపాన్–ఒక నాగరిక జైత్రయాత్ర' అనే పేరుతో ముద్రించారు. తెలుగు యాత్రా సాహిత్యంలో జపాన్‌కు సంబంధించిన యాత్రాచరిత్రలు చాలా తక్కువగా వచ్చాయి. వాటిలో అగ్రస్థానంలో నిలిచే యాత్రాచరిత్ర వీరి జపాన్–ఒక నాగరక జైత్రయాత్ర.

జపాన్‌ను సందర్శించాలనే కోరిక రచయితకు చాలా కాలం నుండి వుందని, అందుకు అవకాశం మాత్రం 1994లో వచ్చిందని పేర్కొన్నారు. 1994 ఆగస్టులో జపాన్‌లోని టోక్యోలో జరగబోయే ప్రాచీన వైద్య విధానాల సదస్సులో పరిశోధనా పత్రం సమర్పించేందుకు వారి నుండి ఆహ్వానం రావడం మరియు 1994లో జూలై చివరి వారంలో కొరియా రాజధాని సియోల్‌లో జరిగే ఎస్పెరాంతో అనే భాషా సదస్సులో ఆయుర్వేదం గురించి ఉపన్యసించడానికి కూడా ఆహ్వానం వచ్చింది. అందుకుగానూ కొరియా, జపాన్ దేశాలను సందర్శించారట. అయితే జపాన్ వైద్యవిధానాల సదస్సు పూర్తయాక ఇంకో 3 వారాల పాటూ అతిథిగా వుండి జపాన్‌లోని వివిధ విశ్వవిద్యాలయాలలో ఉపన్యసించమని టోక్యోలోని జపాన్ ఎస్పెరాంతో ఇన్‌స్టిట్యూట్ వారు ఆహ్వానించారట. 'యుమోహో' అనే ఒక ప్రత్యేక విధానాన్ని జపాన్‌లో ఆవిష్కరించిన డా॥ మసయూకి రంగనాయకులు గారిని ఈ 'యుమైహా' వైద్య విధానాన్ని అధ్యయనం చేయటానికి ఆహ్వానించారట. ఆహ్వానాలు ఒకేసారి రావడంతో జపాన్‌కి ప్రయాణమయ్యానని చెప్పుకున్నారు.

అంతేకాక "జపాన్ దేశాన్ని చూడాలని, అక్కడి ప్రజల జీవితాన్ని అధ్యయనం చేయాలని, వారి వేగవంతమైన ప్రగతి వెనుక కారణాలను తెలుసుకోవాలని నాకు

చిరకాలంగా ఉన్న కోర్కెలు తీరే సమయం వచ్చింది... ఒకరి అనుభవం నుంచి మరొకరు పాఠాలు నేర్చుకోవడం అలాగే ఒక దేశం నుంచి మరొక దేశం అనుభవసారాన్ని గ్రహించి భవిష్యత్తును బాగు చేసుకోవటం అనే పద్ధతి సత్ఫలితాలనిస్తుందని నేను విశ్వసిస్తాను. అందుకే జపాన్ చూడటానికి, ఆ విషయాలను తెలుగు వారికి విన్నవించటానికి నేను ప్రయత్నించాను" (జపాన్, ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-ఉపోద్ఘాతం) అంటూ రచయిత తాను ఈ యాత్ర వెనుక గల ఉద్దేశ్యాలను తెలిపారు. అంతేకాక భారతదేశంలోని రుగ్మతలకు పరిష్కారాలను చూపించటమే కాక, ఎన్నో సందేహాలకు సమాధానమిచ్చిందని, వాటన్నింటినీ చర్చించటమే తన ముఖ్య ఉద్దేశ్యమని రచయిత పేర్కొన్నారు.

జపనీయుల చరిత్ర, సంస్కృతి, జీవన విధానాలు అన్నీ కూడా ఈ యాత్రాచరిత్ర చదవటం వల్ల పాఠకుణ్ణి ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. పుస్తకంలో వివరించిన జపాన్ వారి వేగవంతమైన జీవితాలను అంతే వేగంగా తన రచనా శైలితో ఆసాంతం చదివింపచేశారు రచయిత. అంతటి ప్రగతిపథంలో పయనించే దేశాన్ని చూడాలని ఈ యాత్రాచరిత్రను చదివిన వారెవరూ అనుకోకుండా వుండలేరు.

## 2.14. ట్రావెలాగ్ ఈస్ట్రన్ యూరప్ – మల్లాది వెంకట కృష్ణమూర్తి

వెంట తీసుకెళ్ళి చూపించినంత విపులంగా యాత్రానుభవాలని రాయడంలో అందెవేసిన చెయ్యి మల్లాదివారిది. తెలుగునాట నవలా రచయితగా వీరు సుప్రసిద్ధులు. మల్లాది వారి కలం నుండి జాలువారిన రచనలు కథలు, బహుళ పాఠకాదరణ పొందాయి. పర్యటనల పట్ల ఆసక్తిగల వీరు తన ప్రతీ యాత్రానుభవాన్నీ అక్షరీకరించారు.

వీరు 1990లో మొదటిసారి అమెరికాని దర్శించి, తన యాత్రానుభవాలను 'ట్రావెలాగ్ అమెరికా' పేరుతో ప్రచురించారు. అమెరికన్ల జీవన విధానం, వారి ఆలోచనా రీతిని విశ్లేషణాత్మకంగా వివరించే యాత్రాచరిత్ర ఇది. మల్లాదివారి అమ్మాయి అమెరికాలో చదువుకుంటూ ఉండటంతో కొన్ని నెలలు అమెరికాలో గడిపే ఉద్దేశ్యంతో అమెరికా వెళ్ళి, తీరిక వేళల్లో అమెరికాలోని ప్రముఖ ప్రాంతాలను పర్యటించారు. ఆ యాత్రానుభవాలను

'అమెరికాలో మరోసారి' అనేపేరుతో అక్షరీకరించారు. "విద్యార్థులు కాని, ఉద్యోగరిత్యా కాని, అక్కడి బంధుమిత్రులతో గడిపి రావడానికి కాని, అనేకమంది తెలుగువాళ్ళు అమెరికాకి తరచూ వెళ్ళి వస్తున్నారు. అలాంటి వారికి అక్కడి జీవన విధానం పరిచయమైతే ఏది ఆశించవచ్చో, ఏది దొరకదో కొంతదాకా తెలియజేయాలన్న ఉద్దేశ్యంతో దీన్ని రాస్తున్నాను" (అమెరికాలో మరోసారి – రచయిత మాట) అని తెలిపారు.

అలాగే 2009లో దుబాయ్, టర్కీ మరియు గ్రీస్ దేశాలను దర్శించి 'ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్' అనే పేరుతో పర్యటనానుభూతులను పంచుకున్నారు. ముందుగా దుబాయ్‌ని సందర్శించిన సమయంలో దుబాయ్‌లోని సన్‌డౌన్ టూర్, ఫ్యుజైరా కోట, మ్యూజియం గురించి వివరించారు. టర్కీ జాతిపిత ముస్తఫా కెమెల్ అటా టర్క్ గురించి, థియోడోసియన్ ఓబ్లిస్ అనే స్థూపం, బ్లూమాస్క్ అని వ్యవహరించే అహ్మెద్‌కెమీ మసీదు, హాజియా సోఫియా చర్చ్, పదిహేనవ శతాబ్దంలో ఏర్పడ్డ గ్రాండ్ బజార్, టప్‌కలీ పేలస్ వంటి టర్కీలోని చారిత్రాత్మక కట్టడాలను గురించి విశేషమైన సమాచారాన్ని ఇందులో పొందుపరిచారు. గ్రీసు నగర చరిత్రపై వారికి గల నమ్మకాలు, మత విషయాలు, మొదలైన అంశాలు 'ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్' అనే యాత్రాచరిత్రలో విశ్లేషణాత్మకంగా వివరించారు. ముఖ్యంగా గ్రీకు, టర్కీ ద్వీపాలలో మీరు చేసిన యాత్రానుభవాలు పాఠకులను విశేషంగా ఆకర్షిస్తాయి.

మల్లాది వెంకట కృష్ణమూర్తిగారి మరొక యాత్రాగ్రంథం ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్. 2012వ సంవత్సరంలో ప్రచురించబడిన ఈ పుస్తకంలో యూరప్‌లోని తూర్పు దేశాలైన జర్మనీ, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, ఆస్ట్రియా, హంగరీ పోలెండ్ దేశాల యాత్రానుభూతులను అక్షరీకరించారు. యూరప్ సంస్కృతిని, చరిత్రను ప్రధానంగా వివరిస్తూ రాయబడిన యాత్రాచరిత్ర ఇది. అందువల్ల 'ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్' అనే యాత్రాగ్రంథం యాత్రా పిపాసులకే కాక, పోటీ పరీక్షలకు సంసిద్ధులయ్యే విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

ఇవేగాక ట్రావెలాగ్ యారప్, ట్రావెలాగ్ సింగపూర్ మొదలగు యాత్రా గ్రంథాల్ని రచించి యాత్రా సాహిత్యాభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తున్నారు.

## 2.15. నా సైకిల్ యాత్రా దర్శనం – మంచికంటి

కవిగా, రచయితగా పేరొందిన మంచికంటి వారి అద్భుత పర్యటనానుభవాల మౌలిక 'నా సైకిల్ యాత్రా దర్శనం'. శాంతివనం ప్రకాశం జిల్లా శాంతి చైతన్య యాత్ర పేరుతో జరిగిన ఈ యాత్ర ప్రకాశం జిల్లా అంతటా ముప్పై మండలాలు, నూటయాభై గ్రామాల్లో సాగింది. వెయ్యి కిలోమీటర్ల సాగిన ఈ యాత్రను రచయిత సైకిల్ పై చేయటం విశేషం. వీరి శాంతివనం అనే సంస్థను స్థాపించారు. తెలుగు భాషాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, గ్రంథాలయాల అభివృద్ధి, గ్రామీణ కళల పునరుద్ధరణ, మరియు బాలల హక్కులకై ఈ సంస్థ కృషి చేస్తుంది. ఈ శాంతివనం సంస్థ ఆదర్శాలను, లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని, యువతను చైతన్య పరచడానికి మరియు సమాజంలో శాంతిని సాధించేందుకై ప్రకాశం జిల్లా అంతటా వెయ్యి కిలోమీటర్ల పాటూ ప్రయాణించాడు రచయిత. ఆయన అనుభవాల సమాహార ఫలితమే నా సైకిల్ యాత్రాదర్శనం.

"నిరంతరం పత్రికలలో చదివే ఎంతోమంది కాళ్ళు లేని వాళ్ళు, చేతులు లేనివాళ్ళు, కళ్ళు లేని వాళ్ళు, నడవలేని వాళ్ళు చేసే సాహసాలను చదివిన తరువాత వాళ్ళు సృష్టించిన గొప్ప గొప్ప విన్యాసాలను చూసి తర్వాత, వాళ్ళ చరిత్రలు చదివిన తర్వాత అన్నీ సక్రమంగా ఉన్న మనం ఏమైనా చేయ్యొచ్చని ఋజువు చెయ్యాలనుకునేందుకు చేసిన సైకిల్ యాత్ర" (నా సైకిల్ యాత్రాదర్శనం, పుట–8) అంటూ తన యాత్రా ప్రేరణను గురించి తెలిపారు రచయిత. యాత్రా నిర్వహణలో, రచనలో ఒక భిన్నత్వాన్ని చూపే యాత్రాచరిత్ర ఇది.

## 2.16. నా జర్మనీ యానం : మండలి బుద్ధ ప్రసాద్

శ్రీ మండలి బుద్ధప్రసాద్ గారు అవనిగడ్డ నియోజకవర్గానికి చెందిన మాజీ శాసన సభ్యుడు. తెలుగు సాహిత్యం, సంస్కృతి, భాష, కళలు, మొదలైన అన్ని రంగాలలోనూ వీరు కృషి చేశారు, చేస్తున్నారు. ఇతడు 2005 సెప్టెంబరులో జర్మన్ దేశంలోని అట్లాన్స్‌బర్గ్ నగర్ మేయర్ శ్రీ గుజ్జల రవీంద్రగారి ఆహ్వానంపై జర్మన్ దేశాన్ని పర్యటించారు. ఇది పదిరోజుల యాత్ర. బుద్ధప్రసాద్ గారి యాత్రానుభవాలు మొదట ఆంధ్రజ్యోతి, ఈనాడు, స్వాతి, ఆంధ్రప్రదేశ్, ఉషశ్రీ, వెలుగు పత్రికల్లో వెలువడ్డాయి.

తన యాత్రా గ్రంథాన్ని యాత్రా మార్గదర్శిలా కాకుండా, జర్మనీ దేశంలో అతను చూసిన సామాజిక, సాంస్కృతిక అంశాలను తెలియజేశాడు. ఆ దేశంలోని మంచి, చెడులను మన తెలుగు వారు గ్రహించాలనే ఉద్దేశ్యంతో ఈ రచనలకు పూనుకున్నాడు. బుద్ధప్రసాద్ గారు ఒక ప్రజాప్రతినిధిగా జర్మనీ దేశాన్ని సందర్శించారు. ఇంతకు ముందు ప్రాచ్య దేశాలలో శాసన సభ్యుడిగా పర్యటించి, 'ప్రజలు-ప్రగతి' అనే ఒక గ్రంథాన్ని వెలువరించాడు.

బుద్ధప్రసాద్ గారు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో, విద్య, ఆరోగ్య రంగాలలో వృద్ధుల సంక్షేమ పథకాల్లో జర్మనీ సాధించిన అభివృద్ధిని ఈ గ్రంథంలో వివరించాడు. అలాగే కళా సాహిత్య, సాంస్కృతిక రంగాలకు జర్మన్‌లు ఎంత ప్రాముఖ్యమిస్తారో, ఇందులో తెలిపాడు. వేదాలను ప్రపంచానికి పరిచయం చేసిన మాక్స్‌ముల్లర్, తెలుగులో మొట్టమొదటి అచ్చు పుస్తకాన్ని ముద్రించిన బెంజిమెన్ షుల్జ్, రామాయణ, మహాభారత, భగవద్గీతలను ఎంతగానో అభిమానించిన గెథె, ఐన్‌స్టీన్, ఇలా ఎంతో మంది కూడా జర్మన్‌లే. వీరందరికీ భారతదేశంతో సత్సంబంధాలున్నాయని పేర్కొన్నాడు.

జర్మనీలోని అట్లాన్స్‌బర్గ్ నగరానికి మేయర్‌గా గుజ్జుల రవీంద్ర అనే భారతీయుణ్ణి 1993లో జర్మన్‌లు ఎన్నుకున్నారట. ఇది భారతీయులకే గర్వకారణమని బుద్ధ ప్రసాద్ గారు వర్ణించాడు. ప్రాచీన సాంస్కృతిక వారసత్వ సంపదలను కాపాడుకోవడటంలో జర్మనీ

ఎంత శ్రద్ధగా వ్యవహరిస్తుందో తెలిపి, ఎంతో ప్రాచీన చరిత్ర గల మన దేశాన్ని, దేశ సంపదను కాపాటడంలో భారతీయులకు శ్రద్ధ లేదని విచారాన్ని వ్యక్తం చేశాడు.

ఈ పుస్తకంలో బెర్లిన్ గోడని, ఐన్‌స్టీన్ మ్యూజియం, జర్మనీలోని సాంస్కృతిక విధానాలను, విద్యావిధానాన్ని ఎన్నికలు మొదలైన అనేక విషయాలను ప్రస్తావించారు. ఈ గ్రంథాన్ని గురించి డా॥ సి. నారాయణరెడ్డిగారు "పరమ పఠనీయ శైలిలో ఉన్న ఈ యాత్రాకథనం, యాత్రా చరిత్రల్లో గణనీయ స్థానం పొందుతుందని ఆశిస్తున్నానని పేర్కొన్నాడు" (నా జర్మనీయానం – అభినందన).

## 2.17. మా కేరళ యాత్ర – ముత్తేవి రవీంద్రనాథ్

కేరళ రాష్ట్రానికి సంబంధించిన సమగ్ర స్వరూపాన్ని సాధికారికంగా వివరించే యాత్రా చరిత్ర 'మా కేరళ యాత్ర' రచయిత ముత్తేవి రవీంద్రనాథ్ గారు. వివిధ పత్రికల్లో వీరి వ్యాసాలు తరుచూ ప్రచురితమవుతుండటంతో వీరి సమకాలీన పాఠకలోకానికి సుపరిచితులనే చెప్పాలి. వాణిజ్య పన్నుల అధికారిగా పదవీ విరమణ చేసిన వీరు అనేక సంవత్సరాలు డివిజన్ మరియు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధికారిగా అవార్డులు పొందారు.

పద్దెనిమిది రోజులపాటు కేరళ పర్యటించి ఆ విశేషాలతో రూపొందించబడిన యాత్రాచరిత్ర ఇది. మలయాళీల ఆచార వ్యవహారాలు, ఆహారపు అలవాట్లు, అక్కడి పలు ప్రదేశాల ప్రత్యేకతలు, అక్కడి ప్రముఖ వ్యక్తులు, కులాలు, మతాలు, వారు జరుపుకునే పండుగలు, చారిత్రక కట్టడాలు మొదలైన ఎన్నో అంశాలను గురించి సవిస్తరంగా పేర్కొన్నారు. ఇంకా కేరళ వృక్ష వైవిధ్యం, సరస్సులు, బ్యాక్ వాటర్స్ ఏర్పడే విదానం, స్థల పురాణాలు, కేరళలో వివిధ దశలలో జరిగిన ఉద్యమాల తీరుతెన్నులు వంటి అంశాలను సందర్భానుసారంగా ఈ యాత్రాచరిత్రలో సమగ్రంగా వివరించారు.

ఈ యాత్రా గ్రంథానికి ముందుమాట రాస్తూ ప్రముఖ రచయిత ఎల్.ఆర్.స్వామి గారు దాని విశిష్టతను గురించి ఇలా పేర్కొన్నారు. "ఒక మలయాళీ వ్యక్తిగా కేరళ చరిత్ర (సాంఘిక, సాహిత్య చరిత్ర), అక్కడి జానపదాలు, ఇతిహాసాలు, కళారూపాలు పూర్తిగా

జీర్ణించుకున్న వ్యక్తిగా నేను చేప్పేదేమంటే ఈ యాత్రాస్మరణలో రచయిత చేసిన ప్రస్తావనలు ప్రసక్తంగానూ, వాస్తవాలుగానూ నాకు అనిపించాయి. మిత్రులకు ఒక కథ చెప్పిన రీతిలో రచయిత వ్రాయటం కూడా బాగుంది. కేరళ గురించి తెలుసుకోవాలని అనుకునేవారికి ఈ యాత్రాస్మరణ నిస్సందేహంగా ఒక 'ప్రాథమిక కరదీపిక' గా పనిచేస్తుంది" (మా కేరళయాత్ర – యాత్రాస్మరణ).

'దక్షిణ భారతదేశపు స్వర్గంగా', God's own Country గా పేరొందిన కేరళ రాష్ట్రంలో పర్యటించాలనుకునే వారి, ఆ రాష్ట్రంలోని సుందరమైన పర్యాటక ప్రదేశాల గురించి సమగ్రంగా తెలుసుకోవాలనుకునే వారికీ ఈ పుస్తకం ఒక దిక్సూచి కాగలదు.

## 2.18. నైలునదీ నాగరికత – ముదిగంటి సుజాతారెడ్డి

ముదిగంటి సూజాతారెడ్డి గారు అనగానే ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర, సంస్కృత సాహిత్య చరిత్ర గ్రంథాలు గుర్తుకొస్తాయి. ఆంధ్రుల సంస్కృతి సాహిత్య చరిత్రలో తెలుగువారి సంస్కృతి, చరిత్రతో పాటూ, సాహిత్య చరిత్రను కూడా పొందుపరిచారు. ఇది బి.ఎ. డిగ్రీ వారికి పాఠ్యగ్రంథం కూడా.

అలాగే సంస్కృత సాహిత్యాన్ని గురించి తెలుసుకోవాలనే వారికి 'సంస్కిత సాహిత్య చరిత్ర' ఎంతగానో ఉపయోగపడుతుంది. సుజాతారెడ్డిగారు ఏది రాసినా సంపూర్ణంగా, స్పష్టంగా వుంటుంది. పదిమందికి ఉపయగపడే విధంగా ఉంటుంది. అలాగే ఈవిడ రాసిన "నైలునదీ నాగరికత" అనే యాత్రాకథనం యాత్రాచరిత్రల మీద పరిశోధన చేసే నాకు ఎంతగానో ఉపయోగపడింది.

సుజాతారెడ్డిగారు ఈ యాత్రా కథనంలో 'నైలునదీ నాగరికత' అనే ఈజిప్టు యాత్రాకథనంలో పాటూ, లద్దాఖ్ (లడఖ్) కు చేసిన యాత్రా వివరాలను కూడా పేర్కొన్నారు. ఈజిప్టును ఒక టూరిస్టుగా చూసే అవకాశం రావడం వల్ల ఈ యాత్ర చేశానని చెప్పుకున్నారు. "నా యాత్రాభవాలను, చరిత్ర జ్ఞాపకాలను ఇతరులతో పంచుకోవాలనే తపనే నా యాత్రా కథనానికి ప్రేరణనిచ్చింది" అని రచయిత్రి పేర్కొన్నారు.

రచయిత్రి తన యాత్రలో అలెగ్జాండ్రియా నగరం నుండి ఆస్వాన్ వరకు వ్యాపించిన ఈజిప్టును సందర్శించానని చెప్పుకున్నారు. అంటే అలెగ్జాండ్రియా, లక్షర్, ఆస్వాన్, ఈజిప్ట్ ప్రాంతాలను దర్శించారు. "ఈజిప్టును సందర్శించాలని, ప్రపంచ అద్భుత కట్టడాలయిన పిరమిడ్లను భవ్యమయిన దేవాలయాలను చూడాలని కోరికగా ఉండేదని" (నైలునదీ నాగరికత, పుట-14) పేర్కొన్నారు. వీరు జనవరి 2006 తేది నుండి 21 వ తేదీ వరకు ఈజిప్టు యాత్ర సాగింది. సుజాతారెడ్డిగారు తమకు తెలిసిన కొద్దిమంది వ్యక్తులతో సమూహంగా ఈ యాత్ర చేశారు. ఇది మొత్తం పదకొండు రోజుల యాత్ర.

సుజాతారెడ్డిగారు ఈజిప్టులో తొమ్మిది రోజులు ఉన్నారట. ఈ తొమ్మిది రోజులు ఈజిప్టులో చూడాల్సిన స్థలాలన్నింటినీ గైడ్ సహాయంతో చూసానని రచయిత్రి తెలిపారు. ఈజిప్టుకు వెళ్ళక ముందు ఈజిప్టుకు సంబంధించిన చరిత్ర గ్రంథాలను, వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసిన సమాచారాన్ని చదివానని రచయిత్రి తెలిపారు. ఏ వ్యక్తైనా ఒక ప్రాంతానికి యాత్రకు వెళ్తున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన సమాచారాన్ని ముందుగా తెలుసుకోవాలి. ఇదే ఉత్తమ యాత్రికుని లక్షణం.

తన నైలునదీ నాగరికత అనే గ్రంథంలో ఈజిప్టు యాత్రా విశేషాలనే కాక, లద్దాక్ (లఢఖ్) కు చేసిన యాత్రా వివరాలను కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు. సుజాతారెడ్డిగారు తన స్నేహితురాళ్ళైన స్యారా క్రిస్టియన్, జయంతి, సుజాతారెడ్డి, కోడలు అస్మిత, మనవరాలు మాళవికతో పాటూ ఈ యాత్రను చేశారు. తన కుమారుడు ఉదయనరెడ్డికి లద్దాఖ్ లేహ్‌లో సైన్యంలో కల్నల్‌గా పోస్టింగ్ రావడం వీరు లద్దాఖ్‌కు యాత్ర చేయడానికి గల కారణమని రచయిత్రి పేర్కొన్నారు. రచయిత్రి తాను ఈజిప్టు గురించి తెలుసుకున్న విషయాలను, ఈజిప్టులో తాను స్వయంగా చూసిన విషయాలను రెండింటినీ కలిపి ఈ యాత్రాకథనం రాశారు.

రచయిత్రి ఈజిప్టుకు సంబంధించిన చారిత్రక పరిస్థితులను ముఖ్యంగా పేర్కొన్నారు. అలాగే సామాన్య ప్రజల జీవన విధానాన్ని, వారి సాంఘీక పరిస్థితులను కూడా

వివరించారు. ఈజిప్టులోని పరిస్థితిని, ప్రజల ఆచారాలను, వీటన్నింటినీ కళ్ళకు కట్టినట్లుగా చూపించారు.

ఈజిప్టులోని భౌగోళిక పరిస్థితులను, విద్యా వ్యవస్థను గురించి ఆర్థిక పరిస్థితులను గురించి వివరించారు. పాఠకుడికి విసుగును కల్పించకుండా, చదివే కొద్దీ ఆసక్తిని కలిగించేవిధంగా, వర్ణనలను చొప్పిస్తూ ఆయా అంశాలు వివరించారు. ముఖ్యంగా రచయిత్రి శైలిలో స్పష్టత కన్పిస్తుంది. చెప్పాల్సిన విషయాన్ని సూక్ష్మంలో మోక్షంలా వివరించారు.

నేను పరిశోధన చేసిన యాత్రా చరిత్రల్లో 'కాశ్మీర దీపకళిక' తర్వాత అంతగా నన్ను ఆకర్షించిన యాత్రాచరిత్ర ఈ 'నైలు నదీ నాగరికత' ఎందుకంటే ఒక సాహిత్య విద్యార్థిగా నాకు ఈ పుస్తకంలోని చారిత్రక విషయాలు, కళలకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడం వలన నా పరిజ్ఞానం విస్తృతమైనది అని నేను భావిస్తున్నాను.

సుజాతారెడ్డి గారు రాసిన అద్భుత చైనా యాత్ర అనే మరొక ట్రావెలాగ్ కూడా యాత్రా సాహితీ శాఖకు పూసిన పువ్వు వంటిది. ఈ యాత్రాచరిత్రలో తాను చైనాకు, జపాన్‌కు చేసిన పర్యటనానుభవాలను పొందుపరిచారు. మరియు బ్యాంకాక్, టర్కీ, గ్రీసు, అమెరికా దేశాల సందర్శనానుభవాలను కూడా పేర్కొన్నారు. ఈ యాత్రాచరిత్రలో వివరించిన యాత్రా కథనాలన్నీ 'వార్త' ఆదివారం అనుబంధంలో ప్రచురింపబడ్డాయి. అయితే వీటన్నింటినీ కలిపి 2011లో యాత్రావైభవంగా ప్రచురింపచేశారు.

చైనా, జపాన్ దేశాలను సందర్శించాలని ఎప్పట్నుంచో కుతూహలంగా వుండేదని, అందుకే ఆ దేశాలను పర్యటించానని తెలిపారు రచయిత్రి. వీరిది మొత్తం 18 రోజుల యాత్ర. చైనా, జపాన్ దేశాల్లో గల వారి ఆచార సాంప్రదాయాలు, పండగలు, కళలు, మత పరిస్థితులను గురించి కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా ఈ రెండు దేశాల్లో ప్రసిద్ధి చెందిన చారిత్రక కట్టడాలను గురించిన విషయాలనేకం ఈ అద్భుత చైనా యాత్రలో గమనించవచ్చు. అంతేగాక ఈ రెండు దేశాలు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో, ఆర్థిక రంగంలో ఎందుకు ముందుంటున్నాయో వివరించారు.

రచయిత్రి రచనా శైలి అద్భుతంగా ఉంది. ఒక సాహితీవేత్తగా, చరిత్రకారిణిలా, విజ్ఞాన వేత్తగా, చైనా, జపాన్‌కు సంబంధించిన విషయాలను చర్చించి, పాఠకునికి సులభంగా అర్థం అయ్యే విధంగా అద్భుత చైనాయాత్రను రాశారు. ఈ యాత్రాచరిత్రను చదివితే చైనా, జపాన్‌లకు సంబంధించిన పూర్తి అవగాహన మనకు కలుగుతుందని చెప్పడంలో సందేహం లేదు.

## 2.19. భ్రమణకాంక్ష – ఎమ్. ఆదినారాయణ

ముప్పై ఐదు వేల కిలోమీటర్లు పాదయాత్రలు చేసిన సంచారజీవి ఆదినారాయణగారు. ఆరు ఖండాల్లో పద్నాలుగు దేశాలలో పర్యటించిన భ్రమణకారుడు. అధ్యాపకత్వం ఆయన వృత్తి, సంచారతత్వం ఆయన ప్రవృత్తి. ఆదినారాయణగారు ఆంధ్రా యూనివర్సిటీలో Fine arts Department లో ఆచార్యులుగా పదవీ బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. తెలుగులో మొదటి పాదయాత్రా రచయిత వీరే. 1993 నుండి 1994 దాకా వీరు చేసిన మూడు పాదయాత్రల్ని కలిపి 'భ్రమణ కాంక్ష' అనే పేరుతో యాత్రాగ్రంథాన్ని ముద్రించారు. ఇదే వీరి మొదటి రచన.

తాను యాత్రలు చేస్తున్నప్పుడు రాసుకున్న డైరీ ఆధారంగా ఈ యాత్రా గ్రంథాన్ని రాశారు. ఈ పుస్తకంలో అతడు చూసిన ప్రదేశాలు, విన్న సంగతులు, తనకు తారసపడిన వ్యక్తులను గురించి పేర్కొన్నారు. పాదయాత్రాంజలి, ఏటి ఒడ్డున ప్రయాణం, ప్రార్థించే పాదాలు అనే శీర్షికలతో మూడు యాత్రలకు సంబంధించిన విశేషాలన్నింటినీ 'భ్రమణకాంక్ష' అనే యాత్రా గ్రంథంలో పొందుపరిచారు. ఇందులో మొదటి యాత్ర రాహుల్ సాంకృత్యాయన్ శతజయంతి సందర్భంగా విశాఖపట్నం నుండి డార్జిలింగ్ వరకు పాదయాత్ర చేసి, రాహుల్‌జీ సమాధిని దర్శించాలనే ఉద్దేశ్యంతో ఈ యాత్ర చేశారు.

రెండోది గుండ్లకమ్మ నది పుట్టిన దగ్గర నుండి, సముద్రంలో కలిసే వరకూ దాని పక్కనే చేసిన పాదయాత్రకు సంబంధించిన రచన. ఇది పదిరోజుల యాత్ర. అలాగే మూడవది 1994 ఏప్రిల్ 20వ తేదీన విశాఖపట్నం నుండి కాలినడకన బయలుదేరి ఢిల్లీలో

వున్న తన చెల్లెలు సమాధి వద్దకు 70 రోజుల్లో చేసిన యాత్ర. ఆదినారాయణ గారు తన అనుభవాల రచనల్లో భావ కవిత్వాన్ని చొప్పించారు. ఇది వచనంలో రాయబడ్డా, ప్రతీ వాక్యంలో కూడా కవిత్వం కన్పిస్తుంది. ప్రకృతిని చక్కగా, ఎక్కువగా వర్ణించాడు.

ఈ యాత్రా గ్రంథం 1999లో మొదటిసారిగా ముద్రించబడింది. 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు 10వ తరగతి (రెండవ భాషగా) తెలుగు వాచకంలో ఈ యాత్రాగ్రంథంలోని ఒక భాగాన్ని పాఠ్యాంశంగా పెట్టి, విద్యార్థులకు యాత్రల పట్ల ఆసక్తిని పెంచేందుకు, యాత్రా సాహిత్య ప్రాముఖ్యాన్ని గుర్తించేందుకు కృషి చేశారు. మొదట భ్రమణకాంక్ష ఆకాశవాణిలో ప్రసారం అయింది. తరువాత న్యూస్‌లైన్ పత్రికలో భ్రమణకాంక్ష సీరియల్‌గా ముద్రింపబడి పాఠకుల ఆదరణను పొందింది.

2002 వ సంవత్సరంలో జిప్సీలు (ప్రపంచవ్యాప్త సంచార జీవితాలు), 2005వ సంతవత్సరంలో స్త్రీ యాత్రికులు (ప్రపంచవ్యాప్తంగా ప్రయాణాలు చేసిన 28 మంది స్త్రీ మూర్తులు), 2008వ సంవత్సరంలో 'మహాయాత్రికులు' (ఆరు ఖండాల్లోనూ ప్రయోగాలు చేసిన 24 మంది సాహసికులు) అనే పుస్తకాలను రాశారు. 2016లో 'తెలుగు వారి ప్రయాణాలు' పేరుతో యాత్రా సంకలన గ్రంథాన్ని ప్రచురించారు. ఇందులో మొత్తం 64 మంది యాత్రానుభవాలను పొందుపరిచాడు. ఈ యాత్రా సంకలన గ్రంథంలో వివరించిన పలువురి పర్యటనానుభవాలను వివిధ యాత్రాగ్రంథాల నుండి, జీవితచరిత్రల నుండి, యాత్రావ్యాసాల నుండి గ్రహించారు. 'తెలుగు వారి ప్రయాణా'లనే ఈ సంకలన గ్రంథంలో దాదాపు రెండు వందల సంవత్సరాల యాత్రా సాహిత్యాన్ని ఒకే చోట గుది గుచ్చి, యాత్రా సాహిత్యాభివృద్ధికి ఇతోధికమైన కృషి చేస్తున్నారు.

అందుకే ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆదినారాయణ రాసిన ప్రతి పుస్తకం భారతీయ సాహిత్యంలో వినూత్నమైనది. మహత్తరమైన యాత్రా సాహిత్య సంస్కృతిని ప్రచారం చేస్తున్న ఆదినారాయణ ఒక మహా పథికుడు. యాత్రా సాహిత్యాన్ని పటిష్టం చేయటానికి ఆయన చేస్తున్న కృషి అనన్య సామాన్యం అంటూ ప్రస్తుతించారు.

## 2.20. పాకిస్థాన్‌లో పదిరోజులు – యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు తెలుగు, హిందీ భాషలు రెండింటిలోనూ రచయితగా, అనువాదకుడిగా, విమర్శకునిగా, పరిశోధకునిగా ప్రసిద్ధిని పొందారు. వృత్తి రీత్యా అధ్యాపకులు. లక్ష్మీప్రసాద్ గారు తెలుగు, హిందీ రెండు భాషల్లోనూ పరిశోధనలు చేసి, డాక్టరేట్లను అందుకున్నారు. అంతేగాక భారత రాష్ట్రపతి నుండి పద్మశ్రీ పురస్కారాన్ని కూడా పొందారు. వీరు నలభైకి పైగా గ్రంథాలను రచించారు. వీరు తెలుగులోకి అనువదించిన 'తమస్' రచనకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. వీరి ద్రౌపది నవల ఎంతగానో జనాదరణను పొందింది.

లక్ష్మీ ప్రసాద్ గారు 1972లో జరిగిన ఆంధ్రోద్యమంలో, 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలంలో విద్యార్థి నాయకునిగా అంతరంగిక భద్రతా చట్టం కింది నిర్బంధానికి గురయ్యారు. తరువాతి కాలంలో రాజ్యసభ సభ్యునిగా, పార్లమెంటరీ అధికార భాషా సంఘం ఉపాధ్యాయునిగా, కేంద్రీయ హిందీ సమితీ సభ్యునిగా, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ ఛైర్మెన్‌గా, భిన్న పదవులను అలంకరించారు. మొదటి మరియు రెండవ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను నిర్వాహక సంఘం అధ్యక్షునిగా, విశ్వ హిందీ సదస్సు నిర్వాహకులుగా కూడా వ్యవహరించారు.

లక్ష్మీప్రసాద్ గారు అధికార, అనధికార హోదాల్లో అమెరికా, బ్రిటన్, జపాన్, హాంకాంగ్, బెల్జియం, మారిషస్, మలేషియా, థాయ్ లాండ్, కెనడా, స్పెయిన్, రష్యా, ఉక్రెయిన్, ఈజిప్ట్, అరబ్ ఎమిరేట్స్ మొదలైన దాదాపు 50 దేశాలను పర్యటించారు. అయితే పాకిస్తాన్ ను మాత్రం సందర్శించలేదని, 2010 మార్చి నెలలో 17 నుంచి 25 వరకు ప్రముఖ జర్నలిస్టు కులదీప్ నయ్యర్ నేతృత్వంలో భారతదేశ శాంతి ప్రతినిధి వర్గంలో సభ్యునిగా పాకిస్తాన్ ను పర్యటించారని తెలిపారు.

పాకిస్తాన్ అంటే తనలో ఒక వైముఖ్య భావం వుందని, ఆ మతరాజ్యంలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ యాత్రకు పూనుకున్నానని

తెలిపారు. ముందు పాకిస్తాన్ కు వెళ్ళాలని అనిపించలేదని, అయితే రచయితగా, రాజ్యసభ సభ్యునిగా అనేక మేధావులతో, రచయితలతో ఏర్పడిన సంబంధాల వల్ల పాకిస్తాన్ పట్ల తన ఆలోచనా దృక్పథం మారిందని పేర్కొన్నారు. అంతకాక ప్రముఖ జర్నలిస్టు కులదీప్ నయ్యర్, న్యాయవాది కుష్వంత్ సింగ్ ల మాటలవల్ల మరియు ఎల్.కె అద్వానీ రాసిన ఆత్మకథను రచయిత అనువదించే క్రమంలో అందులో అద్వానీ వర్ణించిన పాకిస్తాన్ ను చూడాలనే ఆసక్తి కలిగిందని వివరించారు. అందుకే పాకిస్తాన్ యాత్రకు వస్తారా అని కులదీప్ నయ్యర్ గారు అడగగానే ఆనందంగా అంగీకరించానని వివరించారు.

పాకిస్థాన్ లో ఎదురయిన అనుభవాలను సరళమయిన వాక్యాల్లో పొందుపరిచారు. వెళ్ళిన ప్రతీ ప్రాంతానికి సంబంధించిన చరిత్ర, సంస్కృతి రాజకీయ, ఆర్థిక అంశాలను అన్నింటినీ ఈ యాత్రాచరిత్రలో గుదిగుచ్చారు. ఈ యాత్రాచరిత్రను చదివిన పాఠకులకు పాకిస్థాన్ అంటే శత్రుదేశం కాదని, భారతదేశం లాంటి దేశమేనని, ఆ దేశంలోని ప్రజలు కూడా శాంతిని, ఆనందాన్ని కోరుకుంటారనే విషయం మనకు అర్థమవ్వడమే కాక ఈ దేశంపైన అప్పటివరకు వున్న వైముఖ్య భావం పోయి, మంచి అభిప్రాయం కలుగుతుందనటంలో సందేహం లేదు.

## 2.21. సంపూర్ణ భారతదేశ యాత్రా దర్శిని: లావణ్య

ఈ పుస్తకాన్ని 'లావణ్య' గారు సంకలనం చేశారు. పేరు తప్ప తనకు సంబంధించిన ఏ వివరాలను రచయిత్రి పొందుపరచలేదు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఉన్న అన్ని రాష్ట్రాలలోని ప్రముఖ నగరాలతో పాటూ, దేవలయాలు, వేసవి విడిది విహారాలు, జలపాతాలు, పార్కులు, అభయారణ్యాలు, లోయలు, సరస్సులు, పర్వత శ్రేణులు, అందమైన గుహలు, శిల్ప సంపద ఇంకా అనేక దర్శనీయ ప్రాంతాలను గురించిన సమాచారాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు. యాత్రికులకు ఏఏ ప్రాంతాలలో ఏవేమి ఉన్నాయో తెలియచెప్పే కరదీపిక వంటిది ఈ పుస్తకం.

విశాల భారతదేశాన్ని గురించి సంపూర్ణమైన సమాచారాన్ని ఈ పుస్తకంలో పొందుపరిచారు రచయిత్రి. అందరూ "కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు" అని అంటే, లావణ్యగారు కన్యాకుమారి నుండి మొదలుపెట్టి, కాశ్మీర్ వరకు గల రాష్ట్రాలలోని దర్శనీయ ప్రదేశాలను వివరించారు.

లావణ్యగారు రాష్ట్రాల వారీగా ఏఏ దేవాలయాలు వున్నాయో వాటిని వివరించారు. మొదటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చూడదగ్గ దేవాలయాలను పేర్కొన్నారు. తర్వాత తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలోని ప్రసిద్ధ దేవాలయాలను గురించి వివరించారు.

మొదట కన్యాకుమారి ప్రాంత విశేషాలతో పుస్తకాన్ని ప్రారంభించారు రచయిత్రి. సూర్యాస్తమయాన్నీ, చంద్రోదయాన్ని ఒకే సమయంలో దర్శించగలగడం ఈ ప్రాంత విశేషమన్నమాట. ఇక్కడ ఉన్న హిందూ మహాసముద్రంలో బంగాళాఖాతము, అరేబియా సముద్రం లీనమయ్యే దృశ్యం చూడదగినదని రచయిత్రి పేర్కొన్నారు. ఇక్కడ కన్యాకుమారి విగ్రహానికి వుండే ముక్కుపుడక తళ తళా మెరుస్తూ సముద్రాన ప్రయాణించే నావికులకు దూరాన్నుంచి లైటులాగా దారి చూపేదని జన ప్రచారంలో వుందని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని కె. కుసుమారెడ్డి గారు తన 'కన్యాకుమారి దీపకళిక'లో పేర్కొన్నారు.

ఇక్కడ ఒక చిన్న గుట్ట మీద వివేకానంద స్వామి మూడు రోజులపాటు ధ్యాన నిమగ్నుడై వున్న స్మారక మందిరాన్ని 1970లో నిర్మించారని, అదే వివేకానంద రాక్ మెమోరియల్ అని వివరించారు. అంతేకాక గాంధీజీ అస్థికలను ఇక్కడ వుంచి ఒక మండప నిర్మాణం చేశారని, ఈ మండపం పై కప్పున ఏర్పాటు చేసిన రంధ్రం నుండి ప్రతీ సంవత్సరం 'గాంధీజయంతి' రోజున సూర్యకాంతి లోపలికి ప్రసరిస్తుందని ఇది ఇక్కడి ప్రత్యేకత అని వివరించారు.

తర్వాత రాష్ట్రాల వారీగా ప్రసిద్ధి చెందిన దేవాలయాలను గురించి వివరించారు. అంతేగాక దేవాలయాలతో పాటూ, ఆయా రాష్ట్రాలలోని దర్శనీయ స్థలాలను గురించి వివరించారు. తర్వాత దేశంలోని ప్రధాన నగరాలను గురించి వివరించారు. హైదరాబాద్

ను గురించి వివరిస్తూ, మొదట మౌర్యులు, శాతవాహనులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు, విజయనగర ప్రభువులు ఆంధ్రదేశాన్ని పాలించారని, ఈ హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అని పేర్కొనింది. భారత దేశంలోని మహానగరాలలో హైదరాబాద్ ఐదవ మహానగరం అని తెలిపారు.

తర్వాత మైసూర్ రాష్ట్రాన్ని గురించి వివరించారు. 10వ శతాబ్దంలో గంగా వంశపు రాజులు మైసూరును రాజధానిగా చేసుకుని పాలించారట. మైసూర్ కు "ఉద్యానవనాల నగరం" అనే పేరు కూడా ఉంది. మహిషాసుర మర్ధిని పేరిట ఈ నగరానికి మైసూర్ అనే పేరు వచ్చిందని, బృందావన్ గార్డెన్స్, లలితా మహల్ ప్యాలెస్, చాముండేశ్వరి ఆలయాలు, ఇక్కడ చూడదగ్గ ప్రాంతాలని రాసారు రచయిత్రి.

తర్వాత గోవా నగరాన్ని గురించి చెబుతూ, పోర్చుగీసు పాలనలో ఎక్కువగా ప్రాముఖ్యతను పొందిన రేవు పట్టణం గోవా అని, ఇక్కడ ఎక్కువగా విదేశీ సంస్కృతి కన్పిస్తుందని పేర్కొన్నారు. గోవాలోని తీర ప్రాంతాలే అసలైన ఆకర్షణ అని కొనియాడారు రచయిత్రి. చెన్నై నగరాన్ని గురించి తర్వాత ప్రస్తుతించారు. ఇక్కడ సెయిట్ జార్జ్ కోట, ఫోర్ట్ మ్యూజియం, గోల్డెన్ బీచ్, మెరీనా బిచ్, గిండీ స్నేక్ పార్క్ చూడదగ్గ ప్రాంతాలన్ని పేర్కొనింది.

ముంబాయి గురించి పేర్కొంటూ, ముంబాదేవి అనే దేవత పేరువల్ల ఈ నగరానికి ముంబై అనే పేరు వచ్చిందని, ఇధి భారతదేశంలోనే అతి పెద్ద రెండవ నగరమని పేర్కొనింది. ఇక్కడ గేట్ వే ఆఫ్ ఇండియా, నెహ్రూ బీచ్, ఎలిఫెంటా గుహలు వంటి ప్రముఖ స్థలాలున్నాయని వివరించింది.

ఢిల్లీని గురించి ప్రస్తావిస్తూ, ప్రాచీన కాలంలో ఢిల్లీని 'ఇంద్రప్రస్థపురం' అని పిలిచేవారని, ఢిల్లీని మొగల్ వంశ పాలకుడైన షాజహాన్ బాగా అభివృద్ధి పరచాడని, అందుకే ఢిల్లీకి షాజనాబాద్ అనే మరొక పేరు కూడా వుందని వివరించింది.

అలాగే కోలకత్తా, భువనేశ్వర్, బెంగుళూర్, లక్నో, జైపూర్ నగరాలను గురించిన విశేషాలను కూడా రాశారు రచయిత్రి. "చల్లదనం సంతరించుకున్న వేసవి విడిది

విహారాలు" అనే పేరుతో దేశంలో గల చల్లటి కొండ ప్రాంతాలను, నదీ తీర ప్రాంతాలను, సముద్ర తీర ప్రాంతాలను, జలపాతాలు, అడవులు, సరస్సులు గల ప్రాంతాలను గురించిన సమాచారాన్ని అందించారు. అలాగే దేశంలో చూడదగ్గ జలపాతాలను గురించి, ప్రసిద్ధి చెందిన పార్కులు, అభయారణ్యాలు, లోయలు, ప్రఖ్యాతి చెందిన సరస్సులు, చూడదగ్గ గుహలు – శిల్పసంపద, వీటన్నింటి వివరాలు కూలంకషంగా చర్చించారు.

మనకు తెలియని ఎన్నో ప్రాంతాలను గురించి, వాటి ప్రత్యేకతలను గురించి ఇందులో వివరించారు. అలాగే ఏ ఏ ప్రాంతాలకు ఎలా వెళ్ళాలో, వాటికి దగ్గరగా ఉన్న ప్రముఖ ప్రదేశాలేమిటో పేర్కొన్నారు. ఒక వ్యక్తి తనకు తెలియని ఒక ప్రాంతానికి వెళ్ళాలనుకున్నప్పుడు ఈ పుస్తకం చదివితే చాలు ఆ ప్రాంతానికి సంబంధించిన అవగాహన వస్తుంది.

## 2.22. నేను తిరిగిన దారులు:- వాడ్రేవు చినవీరభద్రుడు

తన అక్షరాల వెంట పాఠకుణ్ణి పరిగెత్తించేలా రచించిన యాత్రాచరిత్ర 'నేను తిరిగిన దారులు' రచయిత పర్యటించిన దారులలో పాఠకుణ్ణి కూడా మమేకం చేయగలిగిన అనుభూతిపూర్వక యాత్రాచరిత్ర ఇది. రచయిత వాడ్రేవు చినవీరభద్రుడు, సాహితీ లోకంలో లబ్ధప్రతిష్టులు.

వివిధ సందర్భాల్లో అనేక ప్రాంతాలను పర్యటించి, ఆ పర్యటనా విశేషాలతో రాసిందే ఈ యాత్రాచరిత్ర. ఇందులో రచయిత యొక్క యాత్రాప్రియత్వం అడుగడుగునా వ్యక్తం అవుతుంది. "బహుశా ప్రయాణాలు, యాత్రలూ మా ఇంట్లో తరం తరం నుంచి తరానికి కొనసాగుతూ వస్తున్న వ్యసనాలై ఉండాలి. మా తాతగారు సుందర్రావు గారు కాలినడకన మూడుసార్లు కాశీనుండి రామేశ్వరం దాకా యాత్ర చేశారని మా నాన్నగారు చెప్తూ ఉండేవారు. తన యాత్రల మధ్యలో అక్కడక్కడ నుండి ఆయన బామ్మగారికి రాసిన ఉత్తరాలు కూడా మా ఇంట్లో చాలాకాలం పాటే ఉండేవి. నేను చదివిన మొదటి యాత్రా

సాహిత్యం ఆ ఉత్తరాలే" (నేను తిరిగిన దారులు, పుట-9) అంటూ యాత్రాసక్తి, మరియు యాత్రానురక్తి తనకు ఎలా అబ్బినాయో తెలిపాడు రచయిత.

ఈ యాత్రాచరిత్రలో తన యాత్రానుభవాలను కథనంగా కూర్చి, అరకులోయ దారుల్లో, శివసాన్నిధ్య సుఖం, పాపికొండల నడుమ అనే పేరుతో యాత్రా కథనాల్ని రాశారు. యాత్రా సాహిత్య రచనలో ఇదొక కొత్త కోణం. ఇవి ఇండియాటుడే పత్రికలో ప్రచురించబడ్డాయి. ఇంకా, నా ఇంగ్లండ్ యాత్ర, అరుణగిరి దర్శనం, 'హే గోవింద, హే గోపాల', త్రయంబకం యజామహే పేరుతో తన పర్యటనానుభవాల్ని కూడా పొందుపరిచారు. ఇందులో ఇంగ్లండ్ యాత్రా విశేషాలు ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధంలో ధారావాహికగా ప్రచురితమయ్యాయి.

ఢిల్లీలోని రిపబ్లిక్ ఉత్సవాలకు ఉద్యోగార్థం హాజరయ్యి, అక్కడ ఉన్నన్ని రోజులు తమ కుటుంబ సభ్యులకు రాసిన ఢిల్లీ యాత్రానుభవాలు కూడా ఈ యాత్రాచరిత్రలో ఉన్నాయి. యాత్రా కథనాలు, యాత్రానుభవాలు మరియు యాత్రా లేఖలు అన్నీ కూడా పాఠకుణ్ణి ఆసక్తితో ఆసాంతం చదివించేవే. రచయిత చారిత్రక, తాత్విక దృష్టితో దీన్ని రచించడం వల్ల 'నేను తిరిగిన దారులు' యాత్రాచరిత్ర తెలుగు యాత్రా సాహిత్యంలో ఒక గొప్ప రచనగా నిలబడుతుందని చెప్పటంలో సందేహమే లేదు.

## 2.23. రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు – వేమూరి బలరామ్

స్వాతి సచిత్ర మాసపత్రిక, స్వాతి సపరివార పత్రికల వ్యవస్థాపక సంపాదకులు శ్రీ వేమూరి బలరామ్ గారు భారత ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానాలందుకుని, వివిధ కాలాల్లో రాష్ట్రపతులు, ప్రధానమంత్రులతో విదేశీ పర్యటనలు చేశారు. తన పర్యటనానుభావలను అన్నింటినీ క్రోడీకరించి, ఈ యాత్రా గ్రంథంలో పొందుపరిచారు. ఇతడు చేసిన యాత్రలను రాజకీయ యాత్రలుగా పేర్కొనవచ్చు. తాను జరిపిన విదేశీ పర్యటనల విశేషాలను, ఆయా దేశాల సంస్కృతులు, ఆర్థిక, రాజకీయ, సామాజిక పరిస్థితులను ఇందులో చర్చించాడు.

1993, 1994లో పి.వి. నరసింహారావు గారితో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశానికి 1996లో హెచ్.డి దేవగౌడ గారితో ప్రపంచ ఆహార సదస్సుకు, 1998లో రాష్ట్రపతి ఆర్.కె.నారాయణన్ గారి అధికారిక పర్యటనలో సభ్యుడిగా, 1999లో ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయ్ తో ఢిల్లీ – లాహోర్ బస్సు ప్రయాణాన్ని పునరుద్ధరించేందుకు, మళ్ళీ 2002లో వాజ్ పేయి గారి విదేశీ పర్యటనలో ఒకడిగా, 2003లో వాజ్ పేయి గారితోనే నైజీరియాలో జరిగిన కామన్ వెల్త్ దేశాల శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనేందుకు 2004లో అబ్దుల్ కాలాం గారితో విదేశీ పర్యటన బృందంలో సభ్యుడిగా యాత్రలు చేసి, ఆ యాత్రానుభవాలన్నింటినీ ఇందులో పొందుపరిచాడు. అందుకే తన యాత్రా గ్రంథానికి "రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు" అనే పేరును పెట్టారు.

సంపాదకునిగా మాత్రమే కాకుండా, ప్రజల ప్రతినిధిగా, ఒక పాత్రికేయునిగా బలరామ్ గారు విదేశీ పర్యటనలు చేశారు. తన యాత్రా విశేషాలను స్వాతి పత్రికలో వ్యాసాలుగా ప్రచురించి స్వాతికి అద్వితీయమైన గౌరవాన్ని సంపాదించి పెట్టారు. సులభంగా అర్థమయ్యే భాషలో రాశారు. ఇతని యాత్రాచరిత్ర చదవడం ద్వారా ముఖ్యంగా విదేశాలలోగల రాజకీయ పరిస్థితులపై ఒక అవగాహన వస్తుంది. అంతేగాక మనకు ప్రత్యక్షంగా ఆయా దేశాలను చూసొచ్చామన్న అనుభూతి కలుగుతుంది. కురుమెళ్ళ వెంకటరావు గారు తమ జమీందారు గారితో పాశ్చాత్య దేశ యాత్రలను చేసి, "మా మహారాజుతో దూర తీరాలు" అనే యాత్రా గ్రంథాన్ని రాశారు. వారి కాలంలో జమీందారీ పద్ధతి అమలులో ఉండేది. కాబట్టి వెంకటరావు గారు జమీందారు గారి ఆజ్ఞ ప్రకారం యాత్రలు చేసొచ్చాడు. అలాగే నేడు మనది ప్రజాస్వామ్య దేశం. కాబట్టి మన దేశ ప్రతినిధులతో పాటూ అనేక దేశాలను చుట్టివచ్చారు బలరామ్ గారు. జమిందారు గారు తాను చేసిన యాత్రలను గురించి ప్రజలకు తెలియచెప్పాలనే ఉద్దేశ్యంతో సంస్కృత పండితుడైన కురిమెళ్ళ వెంకటరావు గారిని కూడా వెంట తీసుకెళ్ళారట. ఆ యాత్రావిశేషాలను "మా మహారాజుతో దూరతీరాలు" అనే గ్రంథంలో రాశారు. అలాగే

వేమూరి బలరామ్ గారు కూడా తన యాత్రా విశేషాలను "రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు" అనే యాత్రా చరిత్రను రాశారు.

## 2.24. మా ఐరోపా యాత్ర – వేమూరి రాజేష్

చరిత్ర, స్వీయానుభవాలు కలబోతతో వచ్చిన ఒక చారిత్రక యాత్రాస్మృతి మా ఐరోపా యాత్ర. తాను చూసిన ప్రాంతాలకు సంబంధించిన చరిత్రకు ప్రాధాన్యం ఇస్తూ రచింపబడిన రచన ఇది. రచయిత వేమూరి రాజేష్. కృష్ణా జిల్లా ఘంటసాల వాసి అయిన రాజేష్ ప్రింటింగ్ టెక్నాలజీలో పట్టభద్రులు. వీరు పోలాండ్ లోని ప్రముఖ బహుళ జాతి కంపెనీలో Product Development Manager గా పనిచేశారు. దుబాయ్ లోని ఒక ప్రముఖ పాకేజింగ్ సంస్థలో కూడా బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ గా పని చేస్తున్న వీరికి చారిత్రక విషయాలన్నా, కొత్త ప్రదేశాల సందర్శన అన్నా ఎంతో ఆసక్తి. విదేశాల్లో జీవిస్తున్న అందరి ఎన్నారైల్లా కాకుండా తాను పుట్టిన గడ్డకు ఏదైనా చేయాలనే తపనతో 2010 జనవరిలో మిత్రుల సహకారంతో www.managhantasala.net అనే వెబ్ సైట్ ని స్థాపించారు. దానికి ఎడిటర్ గా ఉంటూ ఆ గ్రామ చరిత్రనంతా ఆ వెబ్ సైట్ లో పొందుపరచి ఒక వినూత్నమైన పనికి శ్రీకారం చుట్టాడు. అలాగే ఊరికి దూరంగా ఉన్న గ్రామస్థులకి మధ్య వారధిగా ఈ వెబ్ సైట్ ఉపయోగపడటం అభినందించదగ్గ విషయం.

వేమూరి రాజేష్ ఉద్యోగ రీత్యా పోలెండ్ కు వెళ్ళిన సందర్భంలో జర్మనీ, స్వీడన్, ఇటలీ, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, ఫ్రాన్సు, బెల్జియం, నెదర్లాండ్, చెకోస్లోవేకియా దేశాల్లో పర్యటించి ఆ యాత్రా వివరాలను 'మా ఐరోపా యాత్ర' అనే యత్రాగ్రంథంగా రూపొందించారు. తన యాత్రానుభవాలను గ్రంథస్థం చేయక పూర్వం వ్యాసాల రూపంలో పలు తెలుగు పత్రికల్లో ముద్రణకు నోచుకున్నాయి. యూరోప్ దేశాల చరిత్రను, సాంఘిక పరిస్థితులకు అద్దం పట్టేలా ఈ యాత్రాచరిత్ర ఉండటం గమనించదగ్గ విషయం. ఆయా దేశాలకు సంబంధించిన చారిత్రక అంశాలను విశ్లేషిస్తున్నపుడు, ఆ కాలంలోకి మనం ప్రయాణిస్తున్నామా అనే భ్రమను కలుగ చేస్తుంది. పుస్తకం ముఖ్యంగా హిట్లర్ గురించి

విస్తృతంగా పరిశోధన చేసి, ఆ వివరాలను ఈ యాత్రాగ్రంథంలో పొందుపరిచాడు. హిట్లర్ గురించి, జర్మనీ గురించిన సమాచారం ఈ యాత్రాగ్రంథం ద్వారా పుష్కలంగా లభిస్తుంది. తన ఐరోపా యాత్రా విశేషాలన్నింటినీ వీడియోల రూపంలో యూట్యూబ్ లో, ఫేస్ బుక్ లో ఉంచి వీడియో ట్రావెలాగ్ అ ఒక కొత్త పంథాకి కూడా తెరతీసే ప్రయత్నం చేయబోతున్నారు. ఐరోపా దేశాలతో పాటూ, దుబాయ్, కువైట్, గల్ఫ్ దేశాల యాత్రానుభవాలను కూడా ఈ యాత్రాగ్రంథంలో పొందుపరిచారు.

ఇంకా ఇవేగాక కొమ్మినేని శ్రీనివాసరావు 'ఆంధ్రా టు అమెరికా', ఒద్దిరాజు మురళీధరరావు గారు 'మా అమెరికా యత్ర', దాసరి అమరేంద్ర 'స్కూటర్లపై రోహతంగ్ యాత్ర', తంగెడు జనార్ధనరావు 'ఆస్ట్రేలియా', పాటిబండ్ల దక్షిణామూర్తి యాత్రానందం మొదలైనవి యాత్రాసాహిత్యంలో వెలువడినాయి.

ఒక యాత్రా చరిత్రను చదివినప్పుడు అది ఆ కాలంలో యాత్రికుడు చూసిన ప్రాంతానికి సంబంధించిన చారిత్రక, రాజకీయ, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులను గురించి క్లుప్తంగా అయినా వివరించే ప్రయత్నం చేయాలి. ఆయా యాత్రాచరిత్రలు చదివని పాఠకులకు విషయ జ్ఞానాన్ని పెంపొందించి వారికి కూడా యాత్రలు చేయాలనే సంకల్పాన్ని కలిగించాలి. ఇదే యాత్రాచరిత్ర యొక్క పరమ ప్రయోజనం. ఈ ప్రయోజనాన్ని నెరవేర్చడంలో పైన పేర్కొన్న యాత్రాచరిత్రలన్నీ సఫలీకృతమయ్యాయని చెప్పవచ్చు.

## 2.25. దూరతీరాలలో – వి. అశ్వనీ కుమార్

మిసిమీ మాస పత్రిక సంపాదకునిగా సాహితీలోకానికి చిరపరచితులు వి.అశ్వనీ కుమార్ గారు. అమాహ, అంతర్వీక్షణం, సిద్ధార్థ, నాలో నేను మొదలైన రచనలు చేసిన అశ్వనీ కుమార్ గారు యాత్రా ప్రియులు. ఆ యాత్రా ప్రియత్వంతోనే తన ముప్పై దేశాలను పర్యటించి, తన పర్యటనానుభవాలను యాత్రాచరిత్రగా మలిచారు. అదే 'దూరతీరాలలో'.

తాను లండన్, స్కాట్లాండ్, రోమ్, వెనిస్, పారిస్, అమెరికా, థాయ్ లాండ్, హాంకాంగ్, మలేషియా, కౌలాలంపూర్, సింగపూర్, దుబాయ్, మస్కట్ మొదలైన దేశాలని

సందర్శించారు. అక్షరాల మూడు లక్షల కిలోమీటర్ల పాటూ సాగిన వీరి ప్రయాణాల ఫలితమే 'దూర తీరాలలో'. వెనిస్ నగర అందాన్ని, రోమ్ నగర చరిత్రని, పారిస్ వైభవాన్ని, తెలుసుకోవాలంటే, వీరి 'దూరతీరాలలో' చదవాల్సిందే. ఆ తీరాలలో రచయితతో పాటూ పాఠకుడూ అక్షరాలతో పాటూ సాగిపోతాడు.

# మూడవ అధ్యాయం

# యాత్రా చరిత్రలు –చారిత్రకాంశాలు

# 3.0. యాత్రా చరిత్రలు – చారిత్ర కాంశాలు

గతకాలపు సంఘటనల విశ్లేషణ, వివరణ, వర్ణనల సమాహారమే చరిత్ర. ఆదిమానవుడు ఆధునిక మానవునిగా పరిణామం చెందటానికి గతానుభవాలతో రాయబడ్డ చరిత్ర కూడా ఒక కారణం. చరిత్ర పఠనం అతన్ని ఆలోచనాపరునిగా, విశ్లేషకునిగా మార్చింది. చరిత్ర అంటే శకలాలు, అవశేషాలు మాత్రమే కాదు, అవి భవిష్యత్ తరాల అభివృద్ధికి బాటలు వేసే సాధనం. చరిత్ర అంటే పుస్తకాల్లో మాత్రమే చదువుకునేది కాదు, అది జరిగిపోయిన సంఘటనలకు సజీవ సాక్ష్యం. చారిత్రక కట్టడాలు, నిర్మాణాలూ కూలిపోతున్న శిథిలాలు కాదు, అవి ఒకనాటి సంస్కృతి గొప్పదనాన్ని చాటేవి. నిన్నటి చరిత్ర నేటి అనుభవం. నేటి అనుభవం రేపటికి పునాది. అందుకే ఏ జాతి నిర్మాణానికైనా, ఏ జాతి నిలువెత్తున నిలబడాలన్నా సమర్థమైన చరిత్రే సరైన పునాది. చరిత్ర అంత విలువైనది కాబట్టే ప్రతి సమాజానికి తమ గతాన్ని గూర్చిన భావన తప్పక ఉంటుంది.

చరిత్ర అనే పదం 'ఇస్తోరియా' అనే గ్రీకు పదం నుంచి వచ్చింది. అన్వేషణ, పరిశోధన లేదా పరిశీలన అని ఈ పదానికి అర్థం. అంటే గతాన్ని గురించిన అన్వేషణ, పరిశోధన లేదా పరిశీలనే చరిత్ర. గతాన్ని గురించిన పరిశోధనను లిపిబద్ధం చేసి, భవిష్యత్ తరాల వారికి అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పూర్వము చెట్ల బెరళ్ళు, రాళ్ళు, పదును చేసిన చర్మాలు మొదలుగునవి వాటి పైన చరిత్ర లిఖింపబడుతుండేది. అంతేగాక ప్రాచీన జానపద కథలు, గాధలు, విజ్ఞాన రచనల రూపంలో కూడా చరిత్ర కన్పిస్తుంది. అయితే శాస్త్రీయంగా మొట్టమొదటగా చరిత్రను లిపిబద్ధం చేసిన వ్యక్తిగా హెరడోటస్ ను పేర్కొంటున్నారు. హెరడోటస్ క్రీ.పూ.5వ శతాబ్దానికి చెందిన గ్రీకు తత్త్వవేత్త. ఇతని తర్వాత థూసిడైడిస్ చరిత్రకారుల్లో అగ్రగామిగా వెలుగొందాడు.

## 3.1. చరిత్ర-నిర్వచనాలు

1. "ఒక తరం తాను సంపాదించిన కౌశలాన్ని, నేర్పరితనాన్ని ముందు తరానికి అందివ్వటం వల్ల వచ్చే ప్రగతే చరిత్ర"

– ఇ.హెచ్.కార్

2. "చరిత్ర ఒక శాస్త్రం. ఈ శాస్త్రం ప్రజలు ఎలా జీవించారు, వారి కృషి ద్వారా ప్రపంచం ఎలా మారింది, వాళ్ళ జీవితం ఎందుకు, ఎలా ఈనాటి జీవితంలోకి పరిణామం చెందింది అన్న విషయాలను పరిశీలిస్తుంది"

– ప్రాచీన ప్రపంచ చరిత్ర, (2013)

3. మనం ఎంత వెనుకకు దృష్టి సారించగలమో అంతే ముందుకు చూడగలం. వెనుకకు చూడటమే చరిత్ర. అదే నాగరికత.

– పొత్తూరు రంగనాయకులు

పై నిర్వచనాలను బట్టి గతకాలపు మానవాభ్యుదయాన్ని వివరించటమే చరిత్ర. మానవుడు పూర్వం ఏఏ విధానాలను అవలంబించి ఎలా పయనించాడో చరిత్ర తెలుపుతుంది. గతచరిత్ర అందించిన వెలుగులో వర్తమానాన్ని కాంతివంతం చేసుకోవడమే చరిత్ర యొక్క లక్ష్యం. కేవ లం గతకాలపు సంఘటనలను గుదిగుచ్చి అందిస్తే అది చరిత్ర అనిపించుకోదు. ఆ సంఘటనలు జరగటానికి ప్రేరేపించిన శక్తుల గురించి, తత్ఫలితాలను గురించి కూడా వివరించాలి. సమాజంలోని అంతర్గత సంబంధాలను వివరించాల్సిన బాధ్యత కూడా చరిత్రదే. రాజుల గురించి, రాజవంశాల గురించి, వారి ఘనకీర్తుల గురించి మాత్రమే కాకుండా, ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి శక్తుల మధ్య గల సంబంధాలను గురించి తెలుసుకుంటే ఒక సమాజపు చరిత్ర తెలుసుకోవచ్చనేది డి.డి.కోశాంబీ అభిప్రాయం. "ఫలానా నదీతీరంలో ఏ అనాగరికుడి తర్వాత ఏ అనాగరికుడు అధికారానికి వచ్చాడో మాత్రమే చెబితే దానివల్ల మాకేం ప్రయోజనం అనేది వాల్టేర్ ప్రశ్న" (చరిత్ర అంటే ఏమిటి–పుట–94). అందుకే మహాకవి శ్రీశ్రీ.

"తారీఖులు దస్తావేజులు
ఈ రాణీ ప్రేమపురాణం
ఈ ముట్టడికైనా ఖర్చులు
మతలబులూ కైఫియతులూ
ఇవి కావోయ్ చరిత్రసారం"

అంటూ అప్పటి వరకూ సాగిన ప్రపంచ చరిత్ర రచనా విధానాన్ని ఈసడించుకున్నారు. 1908లో ఎర్లీ హిస్టరీ ఆఫ్ ఇండియా అనే గ్రంథాన్ని రాసిన విన్‌సెంట్ స్మిత్ గొప్పవాళ్లే చరిత్ర నిర్మాతలంటూ రాజులనే చరిత్ర నిర్మాతలుగా చూపించాడు. అప్పటి వరకు దాదాపు అందరి ఆలోచనలు కూడా అలాగే ఉండేవి. 19వ శతాబ్ది చివరివరకూ కూడా చరిత్ర అంటే గొప్పవాళ్ళదే అనే ధోరణి పాతుకుపోయింది. అయితే ప్రపంచంలోని చాలా దేశాల్లో అప్పటివరకూ ఉన్న రాచరిక వ్యవస్థల స్థానంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు రావటంతో ప్రజల్లో చరిత్ర పట్ల అవగాహన కలిగి చరిత్ర అంటే రాజులదేనా అనే ప్రశ్న మొలకెత్తటం ప్రారంభించింది అనే సరికొత్త స్పృహ వారిలో మొదలైంది. చరిత్ర అంటే ఆస్థానాల వర్ణన మాత్రమే కాదు, జనం చరిత్ర కూడా అనే సరికొత్త స్పృహ వారిలో మొదలైంది. అందుకే

"ఆ చల్లని సముద్ర గర్భం దాచిన బడబానలమెంతో?
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో?
నరమానవ రూపం కోసం
జరిగిన పరిణామాలెన్నో?
వొక రాజును గెలిపించుటలో
వొరిగిన నరకంఠాలెన్నో?" అనే ప్రశ్న మొదలైంది.

'తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవరన్న' ప్రశ్న ఉదయించింది. చరిత్రలో సామాన్యజనుల స్థానం ఎక్కడంటూ కొన్ని వర్గాలు తమ అస్థిత్వం కోసం గొంతెత్తాయి. అప్పటి నుండి జనం చరిత్రే నిజమైన చరిత్రగా పుటలకెక్కడం ప్రారంభమైంది. ఫలితంగా చరిత్ర రచనలో మానవుని సాంఘిక జీవనాన్ని ప్రధానంగా ప్రతిబింబించడం కన్పిస్తుంది.

కేవలం సాంఘిక, జీవనాన్నే కాక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, భాషా సాహిత్యాలన్నింటినీ చరిత్ర తనలో ఇముడ్చుకుంటుంది. అందుకే చరిత్ర పరిధి చాలా విశాలమైనది. మరి ఇంతటి ఘనమైన చరిత్రను సేకరించటానికి, రచించటానికి ఉపయోగపడేవే చారిత్రక ఆధారాలు.

## 3.2. చారిత్రక ఆధారాలు – యాత్రా చరిత్రలు

చరిత్రను రచించేందుకు చరిత్రకారునికి కొన్ని హేతువులు అవసరమవుతాయి. చరిత్ర నిర్మాణానికి చరిత్రకారునికి తోడ్పడే ఆ హేతువులను లేదా సామగ్రిని చారిత్రక ఆధారాలంటారు. ఈ సృష్టిలో జ్ఞానాన్ని కలిగిన ఏకైక ప్రాణి మానవుడు. మానవుడు భూమిపై అడుగుపెట్టిన నాటి నుండి తన జీవితాన్ని సుఖమయం చేసుకోవటానికి తన సృజనాత్మకతతో ఎన్నో వస్తువులను, సాధనాలను సృష్టించాడు. గతకాలంలో తాను సృజించి ఉపయోగించి వదలి వెళ్ళిన అవశేషాలనే చారిత్రక ఆధారాలంటారు. ఈ ఆధారాలు మానవ వికాస పరిణామాన్ని సూచిస్తాయి. అంటే ఆనాటి మానవుల జీవనవిధానంతెలిసే అవకాశముంటుంది. వీటి మూలంగానే చరిత్రకారుడు గతకాల సంఘటనలను గురించి తార్కికంగా ఆలోచించి, ఒక అంచనాకు రాగలుగుతాడు. ఒకనాటి చరిత్రను అన్వేషించే క్రమంలో అప్పటి మానవుల ఆలోచనలకు, చర్యలకు చిహ్నాలుగా మిగిలినవే ఈ ఆధారాలు. గతంలో జరిగిన సంఘటనలు వాస్తవమే అయినప్పటికీ వాటిని ఇప్పుడు మనం చూడలేము కాబట్టి, ఆ సంఘటనల తాలూకు వాస్తవాలను ఇవి మనకు తెలియజేస్తాయి.

కట్టడాలు, నిర్మాణాలు, సమాధులు, శాసనాలు, శిల్పాలు, చిత్రలేఖనాలు, నాణేలు, మొదలగు భౌతిక వస్తువులన్నీ ఒకనాటి చరిత్రను పట్టిచ్చే సజీవ ఆధారాలే. చరిత్ర రూపకల్పనలో ఇవి ప్రముఖపాత్ర వహిస్తాయి. ఇవేకాక చారిత్రక సంఘటనలతో ప్రత్యక్ష సంబంధం కలిగిన వారి నుండి లేదా ఆ సంఘటనలకు సాక్షులుగా వున్న వ్యక్తుల నుండి కూడా చరిత్ర రచనకు అవసరమయిన ఆధారాలను సేకరించవచ్చు. డైరీలు, కైఫియత్తులు,

వీలునామాలు, కరపత్రాలు, గెజిట్‌లు, గ్రంథాలు, స్వీయచరిత్రలు కూడా చారిత్రక ఆధారాలే. ఈ కోవకు చెందినవే యాత్రాచరిత్రలు. యాత్రాచరిత్రలు కూడా ఒకకాలంనాటి వైభవాలను, విషాదాలను, సంఘటనలను పాఠకులకు చేరవేయడంలో ముందుంటాయి. యాత్రా రచయిత తాను పర్యటించిన ప్రాంతంలోని సమకాలీన రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక మొదలైన పరిణామాలను, సంఘటనలను సందర్భవశాత్తు అక్షరబద్ధం చేసి ఉంటాడు. ఈ సంఘటనలే భవిష్యత్తులో చరిత్రగా రూపుదాల్చవచ్చు. కాబట్టి చరిత్ర నిర్మాణానికి యాత్రాచరిత్రలు తమవంతు భూమికను పోషిస్తాయనటంలో సందేహం లేదు. భారతదేశాన్ని సందర్శించిన ఎంతోమంది విదేశీ యాత్రికుల యాత్రాచరిత్రలు భారతదేశ చరిత్ర రూపకల్పనకు తోడ్పడతాయనేది నిస్సందేహం. వీరుఇక్కడ తమకు ఎదురైన అనుభవాలను గ్రంథస్థం చేసి, అమూల్యమైన చరిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నికోలోకాంటి, ఇబన్ బటూటా, డోమింగోపేస్, అబ్దుల్ రజాక్, న్యూనిజ్ వంటి విదేశీ యాత్రికులు తమ యాత్రాచరిత్రల్లో విజయనగర సామ్రాజ్య వైభవాన్ని, మత పరిస్థితులను, ప్రజల జీవన విధానాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించారు. చైనా యాత్రికులయిన ఫాహియాన్, హుయాన్ త్సాంగ్, ఇత్సింగ్‌ల రచనల ద్వారా గుప్త సామ్రాజ్య వైభవం, ఆనాటి బౌద్ధమత వ్యాప్తి ఎలా వుండేదో తెలుస్తుంది. ఈవిధంగా ప్రాచీనకాలం నుండి యాత్రాచరిత్రల్లో చరిత్ర ప్రతిఫలించడం విదితమే.

ఏ యాత్రాచరిత్రను పరిశీలించినా చారిత్రకాంశాలు విరివిగా కన్పిస్తుంటాయి. తాను సందర్శించిన ప్రాంతం యొక్క విశిష్టతను యాత్రాచరిత్రకారుడు పాఠకునికి తెలపాలనుకోవడమే దానికి కారణం. అంతేకాక దాదాపుగా యాత్రా రచయితలు చరిత్ర పట్ల మక్కువను అవగాహనను కలిగివుంటారు. అందుకే తమ యాత్రారచనల్లో చారిత్రకాంశాలకు పెద్దపీట వేస్తారు. చరిత్రకారుడు ఒక అంశానికి సంబంధించినచరిత్రను వివరించే క్రమంలో దానికి సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తాడు. ఆ సమాచారం ప్రామాణికమైనదో, కాదో అని అంతర్విమర్శ ద్వారా పరిశీలించి వాటిలోని ప్రామాణికతను పరిశీలించాక అక్షరబద్ధం చేస్తాడు. అలాగే యాత్రాచరిత్రకారుడు కూడా తాను చూసిన

ప్రదేశపు, లేదా నిర్మాణపు చరిత్రను వివరించే క్రమంలో వాటి చరిత్రను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తెలుసుకుని అందులోని నిజానిజాలను పరిశీలించి పాఠకునికి అందించేందుకు సమాయత్తమవుతాడు అయితే చారిత్రకాంశాలను స్వీకరించి, రచించే క్రమంలో చరిత్రకారుని లాగే యాత్రాచరిత్రకారునికి కూడా ఓర్పు, నేర్పు, ముందుచూపు, ఊహ, విమర్శనాత్మక దృష్టి, తర్కం కావాలి. అప్పుడే చరిత్ర వక్రీకరణకు గురవకుండా ఉండడమే కాక, పాఠకునికి విలువైన అంశాలను ఆ యాత్రాచరిత్ర అందించగలదు.

యాత్రాచరిత్రకారుడు కూడా తాను చూసిన ప్రదేశంలోని నిర్మాణాలు, కట్టడాలు, శాసనాలు గ్రంథాలు మొదలగు చారిత్రక ఆధారాల ఆధారంగా స్థానిక చరిత్రను వివరించే ప్రయత్నం చేస్తాడు. తెలుగులో రాయబడ్డ అనేక యాత్రాచరిత్రల్లో ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన చరిత్ర స్థూలంగా గుదిగుచ్చబడింది. అనేక ప్రాంతాలను పర్యటించలేని యాత్రాపిపాసులకి, జిజ్ఞాసువులకు వీటిలో పొందుపరచబడిన అంశాలు మృష్టాన్న భోజనమే అని చెప్పవచ్చు. యాత్రాచరిత్రల్లో పొందుపరచబడిన చారిత్రకాంశాలను చదివిన పాఠకునికి ఆయా ప్రాంతాలను పర్యటించాలనే కోరిక కలగక మానదు. వివిధ ప్రాంతాలకు సంబంధించిన చరిత్రల్లోని వైవిధ్యాన్ని తెలుసుకుని పాఠకుడు ఆనందించగలడు. యాత్రాచరిత్రల్లో పొందుపరచబడిన భిన్న ప్రాంతాల చారిత్రకాంశాలను ఈ క్రిందివిధంగా విభజించవచ్చు.

### 3.2.1.కట్టడాలు

ఒకనాటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే ఏ నిర్మాణమయినా చారిత్రక కట్టడమే అవుతుంది. ఏ నిర్మాణమయితే ఒకకాలంనాటి చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక మరియు కళా సంపదను, వారసత్వాన్నీ తెలియజేస్తుందో వాటిని కట్టడాలుగా చెప్పవచ్చు. ఇవి గడచిపోయిన ఒక వాస్తవానికి చిహ్నాలు. భవన నిర్మాణాలు, శిల్పాలు, సమాధులు, స్మారక మందిరాలు, మ్యూజియమ్స్, మసీదులు, చర్చిలు, ఆలయాలు,కోటలు, స్థూపాలు

మొదలైనవన్నీ కట్టడాలే. ఇవి ఆ కాలంనాటి మానవ జీవన విధానానికి, ప్రతీకలుగా నిలబడటమేగాక సమకాలీన సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి.

వందలాది సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ కట్టడాలు ప్రాచీన నాగరికతకు, సంస్కృతికి ఘనమైన నిదర్శనాలు. ముఖ్యంగా ఇవి ఆనాటి వస్తు సంస్కృతిని సూచిస్తాయి. ఒక సమాజం ఎంత విస్తృతమైనదో, నాగరికమైదో ఆ సమాజంలో వెలసిన కట్టడాలే చెప్తాయి. వీటిని నాశనం చేయడం అంత సులభసాధ్యం కాదు. కట్టడాలు అవి నిర్మింపబడిన కాలంనాటి చారిత్రక, సామాజిక మొదలగు పరిస్థితులను ప్రతిబింబిస్తేనే అవి ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఈ చారిత్రక కట్టడాల ద్వారా అప్పటి మనుషుల సామర్థ్యం, శిల్పకళా నైపుణ్యం అవగతమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యాన్ని పొందిన ఎన్నో కట్టడాలను గురించిన విశేషాలు తెలుగు యాత్రాచరిత్రల్లో పొందుపరచబడ్డాయి. వాటి విశిష్టతలను ఈ విధంగా గమనించవచ్చు.

### 3.2.1.1. **కోటలు**

రాజ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయంగా నిర్మింపబడినవి కోటలు. కోటలు రాజ్యప్రాసాదాలను, అంతఃపురాన్ని, రాజ్యాన్ని సంరక్షించేందుకు కట్టిన రక్షణ కవచాలు,. రాజరికం అమలులో ఉన్నకాలంలో ప్రతీ రాజ్యానికి అత్యంత ఆవశ్యకాలుగా ఇవి పరిగణింపబడేవి. ప్రపంచవ్యాప్తంగా రాజరిక వ్యవస్థ అమలులో ఉన్న ప్రతీ దేశంలో, ప్రాంతంలో కూడా ఈ కోటలు వెలిసాయి. ఇవి గతచరిత్రకు పటిష్టమైన ఆనవాలు. అటువంటి ఎన్నో కోటలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యాన్ని పొందాయి. వాటిలో లండన్ లోని టవర్ ఆఫ్ లండన్ ఒకటి.

### 3.2.1.1.1. టవర్ ఆఫ్ లండన్

మధ్యయుగపు రాచరిక వ్యవస్థకు ప్రతీక లండన్ లోని టవర్ ఆఫ్ లండన్. 'కలల దారులలో యూరోపు యాత్ర' రచయిత పరవస్తు లోకేశ్వర్ గారు లండన్ ను సందర్శించిన క్రమంలో అక్కడ ప్రసిద్ధి చెందిన కోట "టవర్ ఆఫ్ లండన్" విశేషాలను దాని చరిత్రను వివరించారు. "కాకతీయులకు వరంగల్ కోట, కుతుబ్ షాహీలకు గోల్కొండ కోట ఎలాంటిదో ఇంగ్లాండును పరిపాలించిన రాచరిక వంశీయులకు "టవర్ ఆఫ్ లండన్" కోట అలాంటిది. 1066వ సంవత్సరంలో నార్మండీని గెలుచుకున్న విలియం కాంకరర్ ఆ శుభ సందర్భంలో ఈ కోటకు పునాదులు వేశాడు. పన్నెండు ఎకరాల విశాల మైదానంలో 27మీటర్ల ఎత్తులో విలాసవంతమైన నివాస భవనాన్ని నిర్మించారు. 1190లో ఇతర నిర్మాణాలతో పాటు చుట్టూ బలమైన కోట గోడలను కట్టించి చాలా లోతుతో అగడ్తను తవ్వించి శత్రుదుర్భేద్యంగా నిర్మించారు. కోట దక్షిణాన థేమ్స్ నది సరిహద్దుగా ఉంచి లండన్ నగరానికి సహజభద్రత ఏర్పడింది. ఆ కోటలో నివాసభవనాలు, ఆయుధాగారాలు, ప్రభుత్వ ఖజానా, టంకశాల, పరిపాలనా భవనాలే కాక ఆభరణాల భవనం ప్రత్యేకంగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఉంది. సందర్శకులకు ఆభరణాల భవనమే పెద్ద ఆకర్షణ" (కలల దారులలో యూరోపు, పుట-127).

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కోహినూర్ వజ్రం ప్రస్తుతం ఈ కోటలోనే ఉంది. తరతరాల రాచరిక సంపదలకి చిరునామా టవర్ ఆఫ్ లండన్. ఒకనాటి హింసాయుత పాలనకు, నియంతృత్వ రాచరిక వ్యవస్థకు ఈ కోట సంకేతం. 12వ శతాబ్దంలో కోటలో ఒక భాగంగా జైలును నిర్మించారు. అప్పటి నుండి రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే దాకా ఇక్కడ జైలు కొనసాగింది. నియంతృత్వ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య ప్రభుత్వం కోసం జరిగిన విప్లవంలో అనేకమంది రాజులను, రాణులను కోటలోనే బంధించడం జరిగింది. ఈ కారణంగానే మొదటి చార్లెస్ రాజుకు 1649లో ఈ కోటలోనే విప్లవ నాయకులు మరో శిక్ష విధించారు. చార్లెస్ మరణంతో బ్రిటన్‌లో రాచరికం రద్దయి, ప్రజాస్వామ్యం ప్రారంభమైంది.

### 3.2.1.2. అజెంగో కోట

రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని స్థాపించిన ఆంగ్లేయుల వలస పాలనకు చిహ్నం. కేరళలో అజెంగో కోట. నిజానికి ఈ కోటను నిర్మించింది పోర్చుగీసు వారైనప్పటికీ, కాలక్రమంలో ఈస్టిండియా కంపెనీ పాలనాకాలంలో ఈ కోటపై ప్రాబల్యాన్ని సంపాదించారు ఆంగ్లేయులు. అంచుతెంగు అనే పదం కాలక్రమంలో అజెంగోగా పరిణామం చెందింది. అంచుతెంగు అంటే మలయాళంలో ఐదు కొబ్బరి చెట్లని అర్థం. ఇది అతి ప్రాచీనమైన పోర్చుగీసు వలస. అయితే తరువాతి కాలంలో అది బ్రిటిష్ వారికి స్వాధీనమైంది. "17వ శతాబ్దంలో అత్తింగళ్ రాణి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి ఇక్కడ ఒక ఫ్యాక్టరీని కట్టుకోవడానికి పురాతన కోటను మరమ్మత్తులు చేసుకుని వినియోగించుకోవటానికి అనుమతి మంజూరు చేసింది. 1694లో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వారు కోటను పునరుద్ధరించి ఉపయోగంలోకి తెచ్చారు. పశ్చిమ సముద్ర తీరంలో బ్రిటిష్ వారికి ఇదొక కీలకమైన వ్యాపార కేంద్రంగా కొన్నాళ్ళు ఉంది. బ్రిటన్ నుంచి వచ్చే నౌకలకు మలబార్ తీరంలో ఇదే మొట్టమొదటి సంకేత కేంద్రంగా ఉండేది. ఆంగ్లో-మైసూర్ యుద్ధాలలో ఈ కోట చాలా ప్రముఖపాత్ర వహించింది. అప్పట్లో ఈ కోట బ్రిటిష్ వారికి ఆయుధాగారంగా ఉపయోగపడింది. 19వ శతాబ్ది వచ్చేసరికల్లా బ్రిటిష్ వారు దీనికొక అనవసర వ్యయంగా భావించారు. దీనివల్ల బ్రిటిషువారి నిరాసక్తత కారణంగా 1818 నాటికే ఈ కోట నిర్మానుష్యంగా, నిరుపయోగంగా మారిపోయింది" (మా కేరళ యాత్ర, పుట-67).

ఈ కోట లోపల దచ్చి, బ్రిటిషు నాయకుల, సైనికుల సమాధులున్నాయి. వీటిలో 1704వ సంవత్సరంలో నాటి పురాతనమైన సమాధి కూడా ఒకటి. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ఈ అజెంగో కోటను సాంస్కృతిక వారసత్వ సంపదగా భావించి, హెరిటేజ్ ప్రాంతంగా గుర్తింపునిచ్చింది.

### 3.2.1.1.3. శ్రీరంగపట్నం కోట

పరమత సహనానికి ప్రతీకగా నిలిచిన టిప్పుసుల్తాన్ ఏలిన కోట శ్రీరంగపట్నం "శ్రీరంగపట్నం టిప్పుసుల్తాను కోట. అవిశ్రాంతంగా ఆంగ్లేయులను ఎదురించి ఈ కోటలోనే బలి అయినాడు, అమరుడు అయినాడు. టిప్పు లేదు కాని కోట సజీవంగా ఉంది" (యాత్రాజీవనం, పుట-370). ఈ కోటలో టిప్పు సుల్తాన్ నివసించిన రాజభవనం, లాల్ మహల్, శ్రీరంగనాథుని దేవాలయం, జుమ్మా మసీద్ వంటి నిర్మాణాలు ఉన్నాయి. అయితే టిప్పు ప్యాలెస్, లాల్ మహల్ నిర్మాణాలను బ్రిటిషు వారి పాలనాకాలంలో నాశనం అయ్యాయి.

శ్రీరంగపట్నం కోటకు చరిత్రలో విశిష్ట స్థానముంది. 1454లో ఈ కోటను విజయనగర రాజైన తిమ్మన నాయకుడు నిర్మించాడు. అయితే 1495వ సంవత్సరంలో దీన్ని ఒడయార్ రాజులు ఆక్రమించుకున్నారు. ఒడయార్ రాజులు మైసూర్ నుండి తమ రాజధానిని శ్రీరంగపట్నానికి మార్చారు. 1734లో అధికారంలోకి వచ్చిన కృష్ణరాజ ఒడయార్ కాలంలో రాజ్యం మరింత బలపడి, సైనిక బలంతో అలరారింది. అయితే ఈ కోటకు మరింత గుర్తింపు వచ్చింది మాత్రం టిప్పు సుల్తాన్ కాలంలోనే. 1782లో టిప్పు రాజయ్యాక ఈ కోటను మరింత పటిష్టం చేశాడు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ కాలంలో లార్డ్ వెల్లసీ 1799లో ఈ కోటపై దండెత్తి టిప్పును ఓడించారు. ఇప్పటికీ టిప్పుసుల్తాన్ సమాధిని, టిప్పు నిర్మించిన చెరశాలను ఈ కోటలో చూడవచ్చు.

### 3.2.1.1.4. చిత్తోడ్‌గఢ్ కోట

వీర, శౌర్య ప్రతాపాలకు ప్రతీక మేవార్ కోట. భారతదేశంలోని అతిపెద్ద కోటల్లో ఒకటి. వీరునిగా ప్రసిద్ధి చెందిన రాణా ప్రతాప్ జన్మస్థలం. ఒకప్పుడు మేవార్ రాజుల రాజధానిగానే విలసిల్లినది చిత్తోడ్‌గఢ్. ఏడవ శతాబ్దం నుండి మేవార్ రాజులు ఈ కోటను పాలించేవారు. ఈ కోట మొట్టమొదటిసారిగా 1303వ సంవత్సరంలో అల్లావుద్దీన్ ఖిల్జీ వశమయింది. ఖిల్జీ చేతిలో రాజు రాణారతన్ సింగ్ ఓడిపోవడంతో ఈ కోట ఖిల్జీ

స్వాధీనంలోకి వచ్చింది. "ఢిల్లీకి దగ్గర కావడం దాడులు మెండుకావడం వల్ల మేవాడ్ రాజధానిని ఉదయ్‌పూర్‌కు మార్చారు. ఈ కోట రాణా పౌరుషం – మీరా మధుర భక్తి – సూర్యచంద్రుల విశిష్ట విచిత్ర ద్వందం! దుర్గద్వారమే జయమల్ ఫత్తా అమరుల స్మారకాల బలిస్థానం. కోటలో శిల్పసుందర విజయకీర్తి రెండు స్తంభాలు ఉన్నాయి. ఇంకా మహారాణా జన్మస్థలం – మీరా, పన్నా, రాణీ పద్మిని అంతఃపుర భవనాలు ఉన్నాయి. రాణీ పద్మిని జగదేక సుందరిగా ప్రసిద్ధి. అల్లావుద్దీన్ ఆమెకోసం దాడి చేశాడు, ఓడాడు. పద్మిని భవనంలో ఆ అద్దం చూపుతారు. అద్దంలో పద్మిని అందం చూచిన అల్లావుద్దీన్ వెర్రివాడయినాడు. మరింత బలంతో దండెత్తాడు. అల్లావుద్దీన్ గెలిచి ఓడాడు. రాణీ పద్మిని అగ్నిప్రవేశం చేసింది. అల్లావుద్దీన్ కు చితాభస్మం మిగిలింది" (యాత్రాజీవనం, పుట-457).

చిత్తోడ్‌గఢ్ కోట అనేకసార్లు శత్రురాజుల దండయాత్రలలో చేతులు మారుతూ వచ్చింది. 1567లో మొఘల్ చక్రవర్తి అక్బర్ మహారాణా ఉదయ్‌సింగ్ ను ఓడించి ఈ కోటను స్వాధీనం చేసుకున్నాడు. కాలక్రమంలో మొఘలాయిల దురాక్రమణల్లో ఇది నాశనం అయింది. 2013వ సంవత్సరంలో యునెస్కో ప్రపంచ వారసత్వ కట్టడాల్లో చిత్తోడ్ గఢ్ కోటకు కూడా గుర్తింపు ఇవ్వడం ఈ కోటకు చరిత్రలో గల స్థానాన్ని తెల్పుతుంది.

### 3.2.1.2. రాజప్రాసాదాలు (ప్యాలెస్లు)

రాజ కుటుంబీకులు నివసించే భవనాలే రాజప్రాసాదాలు. అంతఃపురాలు రాజప్రసాదాలలో ఒక భాగం. చాలాదేశాల్లో ప్రజాస్వామ్యం అమలులోకి వచ్చాక ఈ రాజప్రాసాదాలు దేశాధ్యక్షుల అధికార భవనాలుగా ఉపయోగంలోకి వచ్చాయి. ప్రపంచంలోని అనేక దేశాల్లో రాచరిక వ్యవస్థకు సంకేతాలుగా నిలిచిన ఈ ప్యాలెస్లు నాటి రాచరిక విధివిధానాలను, సంస్కృతిని తెలియజేస్తాయి. ప్రపంచంలో ఎక్కువగా ప్రాచీన రాజభవనాలు నిర్మింపబడిన దేశం మెక్సికో. అందుకే దీన్ని 'సిటీ ఆఫ్ ప్యాలసెస్' (City of palaces)అంటారు. భారతదేశం కూడా రాజప్రసాదాలకు చిరునామాగా నిలిచింది. అనేక

రాజవంశాల పాలనలో భారతదేశంలో అనేక రాజభవనాల నిర్మాణం జరిగింది. అవన్నీ కూడా ఆయా వంశాల పాలనా విధానాలను వైభవాలను ప్రతిబింబిస్తున్నాయి. అయితే చాలా నిర్మాణాలు శత్రురాజుల దాడుల వలన నాశనమవ్వడమో లేదా కాలక్రమంలో నశించడమో జరిగింది. ఇప్పటికీ మైసూర్ ప్యాలెస్ వంటి కొన్ని నిర్మాణాలు మాత్రం చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఇవన్నీ ఆనాటి వారి భవన నిర్మాణ కౌశలాన్ని తెలియజేసేవే. మనదేశంలో రాజస్థాన్ ప్యాలెస్‌లకు, కోటలకు పుట్టినిల్లు వంటిది.

రాచరికం అంతరించాక ఎన్నో ప్యాలెస్‌లు అధికారుల నివాస గృహాలుగా, హోటల్స్ గా, మ్యూజియములుగా రూపాంతరం చెందాయి. అలా మ్యూజియంగా మారిన ఒకప్పటి ప్యాలెస్ టర్కీలోని టాప్ కపీ ప్యాలెస్.

### 3.2.1.2.1 టాప్ కపీ పేలస్

టర్కీని పాలించిన ఓట్టోమాన్ సుల్తానుల భోగభాగ్యాలకు ప్రతీక ఈ ప్యాలెస్. ఇది 1465 నుండి 1856 వ సంవత్సరం వరకు ఓట్టమాన్ రాజుల ప్రధాన రాజభవనంగా ఉండింది. క్రీ.శ.1459లో సుల్తాన్ మొహ్మద్-2 కాన్‌స్టాంటిన్‌నోపులోను జయించాక తన విజయానికి గుర్తుగా ఈ ప్యాలెస్‌ను నిర్మించాడు. ఆనాడు దాదాపుగా నాలుగువేలమంది ఇందులో నివసించేవారు. అయితే 1574లో జరిగిన అగ్నిప్రమాదంలో ఇది కాలిపోయింది. ఈ ప్రమాదంలో రెండు రాజప్రాసాదాలు తప్ప మిగతా అంతా కూడా దగ్ధమైపోయింది.

"1924లో దీన్ని మ్యూజియంగా మార్చారు. అప్పటినుంచి ఇక్కడ నిర్మాణాలకి రిపేర్లు జరుగుతూ వస్తున్నాయి. ముందుగా టాప్ కపీలోని కొన్ని ప్రభుత్వ కార్యాలయాలని చూసాము. ఓ అతిపెద్ద దివాన్ (మంచం) ఉన్న గది పేరు గూఢచారి గది. ఇక్కడ రాజులు గూఢచారులతో రహస్యంగా మంతనాలు చేసేవారు. మరో గదిలో ఆనాటి పేలస్ చిత్రాలు గోడలకి ఉన్నాయి. ఆరోజుల్లో పేలస్ లో నివసించిన నాలుగు వేల మంది పనివాళ్ళకి ఆహారం తయారు చేసే పెద్ద వంటశాలని గైడ్ దూరం నుంచే చూపించాడు ..... మ్యూజియంలోని మొదటి గదిలో ఓట్టోమాన్ రాజులు ఉపయోగించిన కత్తులు,

తలపాగాలు, పైజామా, కుర్తాలు, బంగారు దారాలతో డిజైన్ చేయబడ్డ దుస్తులు అనేకం అద్దాల షోకేసుల్లో కనిపించాయి. వాటిని ధరించేవారు చాలా భారీ మనుషులని తెలిసిపోతుంది. కనీసం ఏడడుగుల ఎత్తుండేవారు వారు" (ట్రావెలాగ్ దుబాయ్ – టర్కీ – గ్రీస్, పుట-89 మరియు 90).

టాప్ కపీ ప్యాలెస్‌ను మ్యూజియంగా మార్చాక, దాదాపు ప్రతీ సంవత్సరం డెబ్బై ఐదు లక్షల మంది పర్యాటకులు దీనిని సందర్శిస్తున్నారట. టర్కీలోని ప్రసిద్ధ చారిత్రాత్మకమైన ఈ ప్యాలెస్ ను యునెస్కో హెరిజేజ్‌సైట్ గా గుర్తించాక, దీనికి ప్రాధాన్యత మరింత పెరిగింది. ఇలా మ్యూజియంగా మారిన మరొక ప్రసిద్ధమైన కట్టడం వర్సైల్స్ ప్యాలెస్.

## 3.2.1.2.2. వర్సైల్స్ రాజభవనం

ఒకనాటి ఫ్రాన్స్ రాచరిక వైభవానికి, ఆడంబరాలకు, విలాసాలకు ప్రతీక వర్సైల్స్ భవనం. యూరోప్ లో భూలోక స్వర్గంగా పిలువబడే ఈ ప్యాలెస్ ను 1624లో పదమూడవ లూయీ నిర్మించాడు. "ఈ వర్సైల్స్ రాచభవనం ప్యారిస్ కు ఆగ్నేయదిశలో ఉంది. ఈ ఊరు పేరు వర్సైల్సు. పదమూడవ లూయీ చక్రవర్తి వేటకోసం ఈ ప్రాంతానికి వచ్చి, ఇక్కడ ప్రకృతి అందాలకు పరవశించి రాజభవనాన్ని నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. 1624లో చిన్న విడిది గృహంగా నిర్మాణం ప్రారంభమై అంచలంచెలుగా విస్తరించింది. 1682లో 14వ లూయీ ప్యాలెస్ లోని లూర్ భవనం నుండి ఈ వర్సైల్స్‌కు తన నివాసాన్ని మార్చాడు. 1789లో ఫ్రెంచి విప్లవం ప్రారంభమయ్యే వరకు ఇది అధికార భవనంగా కొనసాగింది. ఈ వర్సైల్స్ భవనం సంపూర్ణ నియంతృత్వ రాచరిక వ్యవస్థకు ఒక సంకేతంగా చరిత్రలో నిలిచిపోయింది" (కలల దారులలో యూరపుయాత్ర, పుట-163). శ్రమజీవుల చెమట చుక్కల ఫలితమే ఈ భవనం. అందుకే 1789లో సంభవించిన ఫ్రెంచి విప్లవంలో వేలాది మంది ఉడుకు రక్తంతో ఉన్న సామన్య ప్రజలు ఈ భవనాన్ని చుట్టుముట్టినపుడు చక్రవర్తి లూయీ దొంగలాగా ఈ భవనం నుండి

పారిపోయి తన ప్రాణాలను దక్కించుకునే ప్రయత్నం చేశాడు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో ఈ భవనం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. కారణం వర్సైల్స్ ఒడంబడిక."మొట్టమొదటి ప్రపంచ యుద్ధం ముగియగానే విజేతలైన అమెరికా, బ్రిటన్, ఫ్రాన్సులు ఓడిపోయిన జర్మనీతో ఇక్కడే ఒప్పందం చేసుకొని యుద్ధానికి కారణమైన జర్మనీపై నష్టపరిహారాలు విధించటం, దాని భూభాగాన్ని పదిశాతం తగ్గించటం, దాని వలసలను స్వాధీనం చేసుకోవటం, సైన్యాన్ని, ఆయుధాలను తగ్గించటం లాంటి జర్మనీ గాయపడే అవమానకర ఒప్పందాన్ని ఈ భవనంలోనే చేశారు. ఫలితంగా జర్మనీలో ఫాసిజం బలపడి నాజీ పార్టీ ఆవిర్భవించి, "హిట్లర్" నాయకత్వంలో రెండవ ప్రపంచ యుద్ధానికి రంగం సిద్ధమయ్యింది. ఈ ఒప్పందం ఫలితంగానే "League of Nations" ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న ఐక్యరాజ్యసమితికి (UNO)పూర్వరూపం ఇది" (కలల దారులలో యూరపు యాత్ర, పుట-164).

ప్రస్తుతం ఇదొక వస్తుప్రదర్శనశాలగా మారింది. దేశవిదేశీ పర్యాటకులను ఆకర్షిస్తూ, ఫ్రాన్సు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తున్నది. ఫ్రాన్సు మాదిరే భారతదేశంలో పర్యాటకులను ఆకర్షించే ప్రాంతం కేరళ. కేరళ కూడా ప్యాలెస్ లకు ప్రసిద్ధి చెందింది. అనేక రాజవంశాల పాలనాకాలంలో కేరళ అంతటా విరివిగా ప్యాలెస్ లు నిర్మింపబడ్డాయి. తరువాత పోర్చుగీసు, డచ్, బ్రిటిషు వారు మొదలగు వారి పాలనాకాలంలో పరిపాలనావసరాలకు మరియు ఇతర అవసరాలకై వారు ఎన్నో ప్యాలెస్ లను నిర్మించటం జరిగింది. వాటిలో చెప్పుకోదగ్గవి కుదిర మాళిగ ప్యాలెస్, కనకకున్ను ప్యాలెస్, పద్మనాభపురం ప్యాలెస్ మరియు డచ్చి ప్యాలెస్‌లు.

### 3.2.1.2.3. కుదిర మాళిగ ప్యాలెస్

ప్రాచీన సంగీత విద్వాంసునిగా, వాగ్గేయకారునిగా పేరుగాంచిన స్వాతి తిరునాళ్ నిర్మించిన రాజప్రాసాదమే ఈ కుదిర మాళిగ ప్యాలెస్. స్వాతి తిరునాళ్ హిందుస్థానీ, కర్ణాటక శాస్త్రీయ సంగీత రీతులలో దాదపు 400లకు పైగా కీర్తనలను రచించి,

స్వరపరచిన వాగ్గేయకారుడు. అతి చిన్నవయస్సులో తిరువితాంకూర్ ఆస్థానానికి రాజుగా ప్రకటించబడ్డాడు. అప్పటి బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ప్రతినిధిగా ఉన్న కర్నల్ మన్రో పర్యవేక్షణలో సాంప్రదాయ, ఆధునిక మరియు ఆంగ్ల విద్యలను నేర్చుకుని, ఆధునిక భావాలతో, సమర్ధవంతంగా రాజ్యాన్ని పాలించాడు. ఈయన నిర్మించిన భవనమే ఈ కుదిర మాళిగ ప్యాలెస్. "అనంత పద్మనాభ స్వామి దేవాలయంలోంచి బయటకి వచ్చి అక్కడికి ఆగ్నేయదిశగా ఉన్న కుదిర ప్యాలెస్ ను చూసేందుకు వెళ్ళాం. మలయాళ భాషలో 'కుదిర' అంటే గుర్రం. 'మాళిగ' అంటే బంగళా. కుదిర మాళిగ అంటే Horse Bungalow. ఈ అందమైన రాజప్రాసాదం యొక్క దక్షిణపు పైకప్పుకు దిగువన వరుసగా చెక్కబడిన 122 చక్కటి గుర్రపు బొమ్మలను బట్టి దీనికా పేరు వచ్చింది. తలపైకెత్తిన ముందు రెండు కాళ్ళు మాత్రమే చెక్కబడిన ఆ గుర్రపు బొమ్మలు ఈ రాజభవవనం దక్షిణపు పైకప్పును మోస్తున్నాయా? అన్నట్లుంటాయి" (మా కేరళయాత్ర, పుట-91) మొత్తం ఈ ప్యాలెస్ లో ఎనభై గదులున్నాయి. ఇంతటి మహాభవనాన్ని నిర్మించటానికి ఐదువైల మంది భవన నిర్మాణ శ్రామికులు, నిపుణులు ఐదేళ్ళపాటూ అహోరాత్రులు శ్రమించారట. అయితే స్వాతి తిరునాళ్ మరణానంతరం ఈ భవనాన్ని పట్టించుకున్న వారులేక పాడయిపోవడంతో 1995వ సంవత్సరంలో కేరళ ప్రభుత్వం దీన్ని మరమ్మత్తులు చేసి సందర్శకులను అనుమతిస్తున్నారు.

ఆధునిక కాలంలో సౌండ్ ప్రూఫ్ గా నిర్మించబడుతున్న భవనాల మాదిరిగానే, ఈ ప్యాలెస్ లో కూడా శబ్ద తరంగాల నిర్వీర్యం కోసం యాభై పెద్ద మట్టికుండల్ని తలక్రిందులుగా వేలాడదీశారు. దీంతో ఏ చిన్న శబ్దమైనా ఈ కుండల్లో చేరి నిర్వీర్యమయిపోతాయి. గచ్చు, కర్రబొగ్గు, కోడిగుడ్డులోని తెల్లసొన, సన్నపురాయితో నిర్మించినందువల్ల వేసవిలో కూడా చల్లగా ఉండటం ఈ ప్యాలెస్ ప్రత్యేకత.

“ఈ ప్రాసాదంలో చూడముచ్చటైన ఎన్నెన్నో తెల్లటి పాలరాతి విగ్రహాలున్నాయి. ఇక మొదటి అంతస్తులో రాజు ప్రజలకు దర్శనమిచ్చి, వారి సమస్యలు వినడానికి ఉద్దేశించిన ‘దర్శన గవాక్షాలు’ ఉన్నాయి. ఇవి మొఘలాయి నిర్మాణ రీతిలోని ఝరోఖా

(Jharokha)లను పోలి ఉన్నాయి. రాజు ధ్యానం చేసుకునేందుకు ఇక్కడ ఒక ధ్యానమందిరం, సంగీత సాధన చేసుకునేందుకు ఒక ప్రత్యేక మందిరం ఉన్నాయి. అలాగే ఆయన అధ్యయనం చేసుకునేందుకు వీలైన ఒక గ్రంథాలయం కూడా ఉంది. మొదటి అంతస్తులో రాజు నేరుగా ఏనుగు అంబారిపై ఎక్కేందుకు అనువుగా చేసిన ఏర్పాటునూ మేము చూశాం. రాజు కోసం ఇక్కడి ఒక ప్రదేశం నుంచి చూస్తే పద్మనాభస్వామి ఆలయ గోపురం చక్కగా కనిపించే ఏర్పాటు కూడా చేయబడ్డది. ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాత రష్యన్ చిత్రకారుడు స్వెతస్లావ్ నికోలయేవిచ్ రోరిక్ (1904-1993) చిత్రించిన తిరువితాంకూర్ మహారాజా చిత్ర తిరునాళ్ బలరామ వర్మ (1912-1991) యొక్క అద్భుతమైన పెయింటింగ్ చూసి ఎవరైనా ఆశ్చర్య చకితులౌతారు. ఎనిమిది దిక్కులలో ఎటునుంచి చూసినా ఆయన మనవైపు తిరిగి, మనవంక చూస్తున్నట్లే అనిపించే విధంగా రాజా ముఖం, పాదరక్షలు చిత్రించడం విశేషం" (మా కేరళయాత్ర, పుట-93 మరియు 94).

ప్రతీ సంవత్సరం జనవరి 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు వారంపాటూ స్వాతి తిరునాళ్ సంగీతోత్సవం పేరిట సంగీతోత్సవాన్ని నిర్వహిస్తారు. దీనినే 'కుదిర మాళిగ పండగ'గా స్థానికులు వ్యవహరిస్తారు. ఈ రాజప్రాసాదంలో సంగీతోత్సవంలో బిస్మిల్లాఖాన్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, డి.కె. పట్టమ్మాళ్ వంటి ప్రాచుర్యం పొందిన మహావిద్వాంసులు పాల్గొని, సంగీత ప్రియుల్ని రాగాలలో ఓలలాడించారు. స్వాతి తిరునాళ్ ఉపయోగించిన మరొక ప్యాలెస్ కనకకున్ను ప్యాలెస్ (Kanaka Kunnu Palace).

### 3.2.1.2.4. కనక కున్ను ప్యాలెస్

కేరళ నిర్మాణ శైలికి చెందిన ప్రముఖ కట్టడం కనక కున్ను ప్యాలెస్. ట్రావెన్‌కోర్ రాజా శ్రీ మూలం తిరునాళ్ (1885-1924) నిర్మించిన అద్భుత నిర్మాణం ఇది. స్వదేశీ, విదేశీ అతిథులకు ఆతిథ్యాలను ఇచ్చేందుకై ఈ భవనం నిర్మించబడింది. ఇక్కడ తరచూ అధికార విందులు జరుగుతుండేవి.

"అందమైన పచ్చటి పచ్చిక మైదానం నడుమ నిర్మించారు ఆ చూడచక్కటి రాజభవనాన్ని తిరువితాంకుర్ రాజవంశానికి చెందిన శ్రీ మూలం తిరునాళ్ (1855-1924) దీనిని నిర్మించాడు .... తరువాత కాలపు తిరువితాంకూర్ రాజా స్వాతి తిరునాళ్ ఈ భవనాన్ని అభివృద్ధి పరచి, చుట్టూ ఉన్న గడ్డి మైదానంలో టెన్నిస్ కోర్టులు ఏర్పరచాడు. ఆయన ఈ ప్యాలెస్‌ని తన వేసవి విడిదిగా కూడా వాడుకున్నాడు. ఈ భవనం లోపల ఉండే క్రిస్టల్స్‌తో తయారైన అతిపెద్దవిలాసవంతమైన షాండ్ లేర్లు, ఖరీదైన ఫర్నీచర్, స్వాతి తిరునాళ్ యొక్క జీవితానికి తార్కాణాలుగా పేర్కొంటారు" (మా కేరళయాత్ర, పుట-104).

ప్రస్తుతం ఈ రాజప్రాసాదాన్ని కేరళ ప్రభుత్వం హెరిటేజ్ సెంటర్‌గా గుర్తించి, అభివృద్ధి పరుస్తున్నది. ఈ ప్యాలెస్‌లో ప్రతీ సంవత్సరం కేరళ పర్యాటక శాఖవారు నిశాగంధి పేరుతో సాంస్కృతిక సమ్మేళనాలను నిర్వహిస్తున్నాయి. కేరళను సందర్శించే పర్యాటకులను ఆకర్షించే మరొక ప్యాలెస్ పద్మనాభపురం ప్యాలెస్.

### 3.2.1.2.5. పద్మనాభపురం ప్యాలెస్

ఒకప్పుడు తిరువితాంకూర్ సంస్థానానికి రాజధాని పద్మనాభపురం. ఇది దాదాపు రెండు వందల సంవత్సరాలకు పైనే తిరువితాంకూర్ రాజధాని నగరంగా వెలుగొందింది. కేరళ గృహనిర్మాణ శైలి ప్రకారం ఈ ప్యాలెస్‌ను 'పదినారు కెట్టు'గా నిర్మించారు. క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన వేణాడు ప్రభువు రాజారవివర్మ కులశేఖర పెరుమాళ్ ఈ ప్యాలెస్‌ను నిర్మించినట్లు చరిత్రకారుల మాట. 18వ శతాబ్దంలో తిరువితాంకూర్ సంస్థానాన్ని పాలించిన మార్తాండ వర్మ ఈ రాజప్రాసాదాన్ని పునరుద్ధరించాడు. తన రాజ్యాన్ని మొత్తం తమ కులదైవమైన తిరువనంతపురం పద్మనాభస్వామికి ధారాదత్తం చేసి, తనను పద్మనాభస్వామికి దాసునిగా ప్రకటించుకుని, తన సంపదనంతా స్వామి ఆలయానికి సమర్పించాడు. ప్రస్తుతం కేరళ పర్యాటకానికి ఈ ప్యాలెస్ ఒక ప్రధాన ఆకర్షణ.

"బయటి ప్రవేశ ద్వారానికి సరిగ్గా ఎదురుగా రాజ ప్రాసాదంలోకి ప్రవేశించే ప్రధాన ద్వారం ఉంటుంది. దీని పైకప్పు ఎంతో శ్రద్ధతో అందంగా, కళాత్మకంగా రూపొందించారు. దాని లోపలికి వెళ్ళగానే ప్రవేశ మందిరం చూశాం (Entrance Hall)దానికి ఒక పక్కగా సరిహద్దు గోడను ఆనుకొని నిర్మించిన పొడవాటి రెండు అంతస్తుల కొట్టంలోకి పెద్దహాలులో ఒకేసారి రెండు వేల మంది అతిథులు భోజనం చేసే ఏర్పాటు ఉంది. పర్వదినాల సందర్భంగా ఇక్కడ సహపంక్తి భోజనాలు నిర్వహించేవారట. ఈ పెద్ద భోజనశాల, దానిని ఆనుకొని వున్న పెద్ద వంటశాల, అక్కడి పెద్ద పెద్ద రోళ్ళు, పొయ్యిలు, అలనాటి వంట పాత్రలు చూపరులకు సంభ్రమాశ్చర్యాలు గొలుపుతాయి. ఇక ప్రవేశ మందిరపు పైకప్పు అందంగా కలపతో చెక్కబడిన 90  రకాల పుష్పాల శిల్పాలతో నిర్మించిన ఒక అద్భుత కళా సృష్టి" (మా కేరళయాత్ర, పుట-125 మరియు 126).

ప్యాలెస్‌లో అత్యంత ఆకర్షణీయమయినది మంత్రశాల. ఇక్కడే రాజు తన ఆంతరంగిక మంత్రులతో రహస్యాలను చర్చించేవాడట. ఈ భవనంలోని కిటికీలు పనస చెక్కతో తయారు చేయబడటం ఇందులోని ప్రత్యేకత. ఇంకా రాజప్రాసాదం పక్కనే నిర్మించబడిన 'క్లాక్‌టవర్' కు  మూడు వందల ఏళ్ళ విశిష్ట చరిత్ర ఉంది. అది ఇప్పటికీ పనిచేస్తుండటం విశేషం. ప్రస్తుతం పద్మనాభపురం ప్యాలెస్‌లోని కొంతభాగాన్ని మ్యూజియం కోసం కేటాయించారు.

### 3.2.1.2.6. డచ్చి ప్యాలెస్

ప్రస్తుతం 'మటాన్ చేరి ప్యాలెస్'గా పిలువబడే ఈ రాజభవనం క్రీ.శ.16వ శతాబ్దానికి చెందిన కట్టడం. కేరళలో తమకు వ్యాపార హక్కులు కల్పించినందుకు గానూ కృతజ్ఞతగా ఈ భవనాన్ని కొచ్చిన్ మహారాజు రాజా వీర కేరళవర్మకి పోర్చుగీసు వారు కానుకగా ఇచ్చారు. అయితే 1663వ సంవత్సరంలో కొచ్చిన్‌ను డచ్చివారు స్వాధీనపరుచుకున్నారు. తరువాత వీరు ఈ భవనానికి కొన్ని మరమ్మత్తులు చేసి పునరుద్ధరించారు. అందువల్లే ఇది 'డచ్ ప్యాలెస్'గా ప్రసిద్ధి చెందింది అయితే ఈ ప్యాలెస్‌ను

నిర్మించిన పోర్చుగీసు వారు కానీ, డచ్చివారు కానీ ఈ భవనాన్ని వినియోగించలేదు. పట్టాభిషేకం వంటి మహోత్సవాలను నిర్వహించేందుకై రాజకుటుంబీకులే ఈ భవనాన్ని వినియోగించేవారు. "ప్యాలెస్ భవనం కేరళ భవన నిర్మాణ శైలిలో గ్రామీణ భూస్వాముల నివాసభవనాల నిర్మాణ రీతిగా ప్రసిద్ధమైన నాలుకెట్టు (Quadrangle)తరహాలో నిర్మింపబడింది. కింది అంతస్తులో స్త్రీల గది ఉంది. పై అంతస్తులో నలుచదరపు పట్టాభిషేక మందిరం, రాజు విశ్రమించే పడకగది, రాజావారి భోజనశాల, సమావేశ మందిరం మొదలైనవి ఉన్నాయి. ప్రతి మందిరంలో పైకప్పుకు చక్కటి కలప చెక్కడాలు, పనసకర్రతో చెక్కిన తలకిందులుగా ఉండే తామర పుష్పాలు ముచ్చట గొలుపుతాయి. భోజన మందరిపు పైకప్పు అలంకరణకు ఇత్తడి తొడుపులు కూడా వినియోగించటం విశేషం" (మా కేరళయాత్ర, పుట-239).

డచ్చిప్యాలెస్ అరుదైన కుడ్య చిత్రాల (mural paintings) కు ప్రసిద్ధి. ఈ ప్యాలెస్ గోడల మీద దాదాపు 300 చదరపు అడుగుల వరకు కుడ్య చిత్రాలున్నాయి. ఇవన్నీ కూడా పురాణాలు, రామాయణ, భారతాది ఇతిహాసాలు, దైవలీలలకు సంబంధించిన గాథల ఆధారంగా చిత్రీకరించబడ్డాయి. ఇవన్నీ కూడా 17-18 శతాబ్దం మధ్యకాలంలో చిత్రించి ఉంటారని చరిత్రకారులు భావిస్తున్నారు

### 3.2.1.3. ఆలయాలు

మానవ ధార్మిక, ఆధ్యాత్మిక, మతపరమైన ఆలోచనలకు కేంద్రాలు ఆలయాలు. దైవప్రార్థనల కోసం, మత సంస్కారాల కోసం ప్రధానంగా నిర్మింపబడిన కట్టడాలు ఆలయాలు. సింధునాగరికతతో బయటపడిన పశుపతివిగ్రహం, పూజారి విగ్రహాల వలన క్రీ.పూ.మూడు వేల సంవత్సరాల కాలం నాటికే ప్రజల్లో 'దైవారాధన' ఉన్నట్లు తెలుస్తుంది. భారతదేశంలో విగ్రహరూపంలో దేవుణ్ణి పూజించే విధానంతో హిందూ ఆలయాల నిర్మాణం ప్రారంభమైంది. పూర్వం పంచభూతాలను, ప్రకృతిని ఆరాధించేవారు. కాలక్రమంలో వీటికి ప్రతీకలుగా విగ్రహాలను నిలిపి పూజించారు. మానవునికి లాగే

దేవునికి కూడా ప్రశాంతమైన నివాసం అవసరమని భావించి విగ్రహాలకు మూడు వైపులా బండలను పాతేవారు. ఇదే కాలక్రమంలో ఆలయాల నిర్మాణాలకు పునాది అయింది. ఇంతవరకు మనకు లభిస్తున్న ఆధారాలను బట్టి గుప్తుల కాలానికి ముందే దేవాలయాల నిర్మాణం ప్రారంభమైనట్లు చరిత్రకారుల అంచనా.

"శాతవాహనకాలంలో ఇటుకలతో గర్భాలయం వరకూ, ఇక్ష్వాకుల కాలంలో ఇటుకలతో గర్భాలయ, అర్ధమండప, మహామండప, ధ్వజస్థంభ, ప్రాకార, గోపురాలతో నిర్మింపబడిన తొలినాటి దేవాలయాలు, చాళుక్యుల కాలానికి ఎత్తైన ఇటుకరాతి దేవాలయాలుగా రూపుదిద్దుకున్నాయి. తరువాత రాష్ట్రకూట, కళ్యాణ చాళుక్య, వేంగీ చాళుక్య, తూర్పు గాంగులకాలంలో ప్రాంతీయ శైలిలో భిన్న రీతుల్లో ఆలయాలు నిర్మించబడినాయి.

కాకతీయుల కాలంలో కప్పు వరకూ రాయి, పైన ఇటుకలతో విమానాలు నిర్మించబడినాయి. విజయనగర కాలంలో విశాల ప్రాంగణాలతో ఎత్తైన గోపురాలతో దేవలయాలు నిర్మింపబడి తెలుగువారి దేవాలయ వికాసాన్ని తెలియజేస్తున్నాయి" (తెలుగు వారి దేవాలయాలు, పుట-66 మరియు 67). భారతదేశంలో ఆయా రాజవంశాల పాలనలో ఆలయ నిర్మాణంలో భిన్నత్వాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం లభిస్తున్న ఆధారాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా గుడిమల్లంలోని శివాలయమే మొదటి ఆలయంగా రికార్డులకెక్కింది. భారతదేశంలోని ఆలయ నిర్మాణాల్లో అనేక ప్రత్యేకతలు, విశిష్టత, వున్నట్లుగానే ఈజిప్టువారి నిర్మాణంలో కూడా కన్పిస్తాయి. ఆలయంలో గర్భగుడిలో విగ్రహాలపై సూటిగా సూర్యకిరణాలు పడేలా నిర్మించిన ఫిలే దేవాలయం ఈజిప్ట వారి ఆలయ నిర్మాణ కళకు నిదర్శనం.

### 3.2.1.3.1. ఫిలే దేవాలయం

హంపీలోని హంపీశ్వరాలయం, అరిసవెల్లి సూర్యనారాయణ దేవాలయాల్లో మాదరిగా ఈజిప్టులోని 'ఫిలే' ఆలయంలోని విగ్రహాలపై కూడా సంవత్సరంలో రెండు

రోజులు సూర్యకిరణాలు ప్రసరించడం ఈ ఆలయ ప్రత్యేకత. ఈ ఆలయంలో ఈజిప్టును పాలించిన న్యూకింగ్‌డమ్ వంశానికి చెందిన రెండో రామైసెస్ విగ్రహం ప్రతిష్ఠింపబడింది. ప్రాచీన ఈజిప్టియన్లు వాళ్ళ రాజును (ఫెరో) భగవంతును అవతారమని నమ్మేవారు. అతన్ని పూజించేవారు. “రెండో రామైసెస్ మానవుని నుంచి దేవతగా పూజలందుకునేంతగా ఎదిగాడన్న మాట. దేవాలయం ద్వారబంధానికి రెండు పక్కల ఉన్న రెండో రామైసెస్ నాలుగు విగ్రహాలు కూర్చున్న ఆకారంలో వున్న ఆ విగ్రహాలు దూరం నుంచే మన శ్రవణ బెలగొళలోని బాహుబలి విగ్రహంలాగా మనల్ని అద్భుతరసంలో ముంచెత్తుతాయి” (నైలునదీ నాగరికత, పుట-49). ప్రాచీన ఈజిప్టులు భారతీయుల లాగే ప్రకృతిని ఆరాధించేవారు. ముఖ్యంగా న్యూకింగ్‌డమ్ రాజులల్లో గొప్ప ఫెరోగా ప్రసిద్ధి చెందిన అఖెనాతన్ సూర్యదేవునికి ఆలయాన్ని నిర్మించడం విశేషం.

### 3.2.1.3.2. కర్నక్ దేవాలయం

ప్రాచీన ఈజిప్టియన్లు అనేక మంది దేవతలను పూజించేవారు. అయితే న్యూకింగ్‌డమ్ రాజుల్లో ఒకడైన అఖెనాతన్ సూర్యుని మాత్రమే దేవునిగా ప్రకటించి, ఏకేశ్వరోపాసనను ప్రవేశపెట్టాడు. అంతేగాక సూర్యదేవునికి ‘లక్సర్’ సమీపంలోని కర్నక్‌లో ఒక అద్భుతమైన దేవలయాన్ని నిర్మించాడు. “ఆయన ఈజిప్టులో వుండే అనేకమంది దేవతలను, వాళ్ళ ఆరాధనలను తోసిపుచ్చి ఏకైక భగవంతునిగా సూర్యదేవుణ్ణి ‘ఆతన్’ పేరుతో పూజించాడు. ‘అమెనోఫిన్’యే అఖెనాతన్‌గా ప్రసిద్ధి చెందాడు. ‘అఖెనాతన్’ అంటే ‘ఆతన్’కు ప్రియమైనవాడు అని అర్థం. ఇది మన అశోకుడు ధరించిన “దేవానాం ప్రియః” బిరుదాన్ని తలపిస్తున్నది. అఖెనాతన్ పూజించిన సూర్యదేవుణ్ణి ఈజిప్టు భాషలో ‘రే’ అని ‘రా’ అని కూడా పిలుస్తారు. అఖెనాతన్ తల్లి బాబిలోనియా ప్రాంతాన్ని పాలించిన మితాన్ని లేదా హిట్టైట్ రాజకుమారి. తల్లివంశం చేత ప్రభావితుడై అఖెనాతన్ సూర్యారాధనను అంగీకరించాడని తెలుస్తున్నది” (నైలునదీ నాగరికత, పుట-25).

ఈజిప్టియన్ల మరొక ప్రాచీన దేవత 'అమోన్'. ఈ అమోన్‌ను సూర్యదేవుని 'రే' పేరుకి చేర్చి 'అమోన్ రే' పేరుతో పూజిస్తున్నారు. అయితే ప్రస్తుతం ఈజిప్టులో ఉన్న దేవాలయాల్లో 'కర్నక్' దేవాలయం అతిపెద్దది. ప్రపంచ విజేతగా కీర్తింపబడుతున్న అలెగ్జాండర్ ఈజిప్టును స్వాధీనం చేసుకున్నాక ఈ 'అమోన్ రే' ను పూజించాడట. ఈజిప్ట్‌ను గ్రీకులు పాలించే కాలంలో కూడా గ్రీకు రాజులు తమ దేవతలను ఆరాధించడంతో పాటూ ప్రాచీన ఈజిప్టియన్ల దేవతలను కూడా ఆరాధించి, వారికి ఆలయాలను నిర్మించారు.

### 3.2.1.3.3. అపోలో ఆలయం

గ్రీకుల దేవత అపోలో, గ్రీసులోని డెల్ఫీ ప్రాంతంలో నిర్మింపబడిన అపోలో ఆలయం ప్రపంచ ప్రసిద్ధి గాంచినది. ఈ ఆలయాన్ని నిర్మించారు. "క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దానికల్లా అపోలో దేవుడి ఆలయాన్ని అక్కడ నిర్మించారు. పైథాన్ అనే సర్ప దేవతని అపోలో అక్కడ చంపాడు అని నమ్మకం. క్రీ.పూ. ఏడో శతాబ్దానికల్లా అపోలోతో పాటు ఎథినా అనే దేవతకి కూడా రాళ్ళతో అక్కడ ఓ ఆలయం నిర్మింపబడింది. అప్పట్లో గ్రీస్ దేశం అంటూ లేదు. ప్రతీ నగరం ఒక్కో రాజ్యంగా ఉండేది. నేటి సిసిలీ, టర్కీల్లోని కొంతభాగంలో గ్రీకు భాషని మాట్లాడేవారు ఉండేవారు. వారందరికీ డెల్ఫీ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉండేది. ఆ రాజులంతా అపోలో, ఎథీనా ఆలయాలకి విలువైన కానుకలు సమర్పిస్తుండేవారు. గ్రీసు దేశస్థులు క్రీడాసక్తులు. అపోలో గౌరవార్థం నాలుగేళ్ళకోసారి పైథాన్‌ని సంహరించిన విజయానికి గుర్తుగా అక్కడ 'పైథియన్ గేమ్స్'ని నిర్వహించేవారు" (ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్, పుట-116).

అపోలో ఆలయానికి గ్రీకు చరిత్రలో ప్రత్యేక స్థానముంది. దీనిని క్రీ.పూ. 6వ శతాబ్దంలో నిర్మించారు. పాలరాతి టైల్స్‌తో దీనిని నిర్మించడం చెప్పుకోదగ్గ అంశం. అంతేగాక ఇది ప్రపంచంలో మొట్టమొదటి పాలరాతి కట్టడంగా ప్రసిద్ధి చెందింది. అపోలో ఆలయంలాగే గ్రీస్‌లో ప్రసిద్ధి చెందిన మరొక దేవాలయం అక్రోపోలిస్ దేవాలయం.

### 3.2.1.3.4. అక్రోపోలిస్ దేవాలయం

ఇది కూడా పాలరాతితో నిర్మించిన అద్భుత కట్టడం. ఈ దేవాలయంలో పూజలందుకునే దేవత ఎథీనా. ఎథీనా పేరు మీదుగానే ఏథెన్స్ అనే పేరు ఏర్పడింది. ఈమె జ్ఞానానికి, కళలకి, అధిదేవత అయితే పర్షియన్ల దండయాత్రలో ఈ ఆలయం నాశనమైంది. ప్రస్తుతం ఈ ఆలయ శిథిలాలు అక్కడి మ్యూజియంలో వుంచి గ్రీసు ప్రభుత్వం తమ సంస్కృతీ వారసత్వాన్ని రక్షించుకుంటుంది. భూమిలోని అక్రోపోలిస్ ఆలయ శిథిలాలు కన్పించేలా మ్యూజియం గచ్చును అద్దాలతో పారదర్శకంగా ఏర్పాటు చేశారు. "అక్రోపోలీస్ మ్యూజియం కోసం అక్కడ పునాదులు తవ్వుతుంటే, క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దపు ఏథేన్స్ నగర అవశేషాలు బయటపడ్డాయి. దీంతో తవ్వకాలు ఆపి, పిల్లర్స్ లేపి పై ఫ్లోర్‌లో నేలకి అద్దాలని ఫ్లోరింగ్‌గా వాడారు. వాటిలోంచి కింద ఉన్న శిథిలాలని చూడవచ్చు. అంటే పురాతన శిథిలాల మీద ఈ మ్యూజియాన్ని నిర్మించారన్న మాట. ఇందువల్ల ఆ భవంతి నిర్మాణంలో ఒక ఫ్లోర్ పెరిగింది. కొండ మీది అక్రోపోలిస్ దేవాలయం తర్వాత ఇప్పుడు పర్యాటకులు మ్యూజియానికే అధికంగా వస్తున్నారు" (ట్రావెలాగ్, దుబాయ్, టర్కీ మరియు గ్రీస్, పుట-104).

అయితే ప్రస్తుతం ఆలయంలో పునాదులు మాత్రమే మిగలగా, మిగిలిన ఆలయ అవశేషాలన్నీ అక్రోపోలిస్ మ్యూజియంలో ఇప్పటికీ చూడవచ్చు.

### 3.2.1.3.5. అనంత పద్మనాభ స్వామి ఆలయం

భారతదేశంలోనే అత్యంత సంపద కలిగిన ఆలయంగా ప్రసిద్ధికెక్కింది కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం పద్మనాభస్వామి ఆలయం. నేల మాళిగలో అశేష సంపదతో అలరారే ఈ ఆలయానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ఇది కేరళీయుల సామాజిక, సాంస్కృతిక జీవనంలో ఒక భాగం ఇది. తిరు అనంతపురం అంటే అనంత పద్మనాభస్వామి కొలువైన పవిత్ర నగరమని అర్థం. కేరళ రాష్ట్రంలో ఉన్న ఈ ఆలయం

తమిళ దేవాలయ నిర్మాణ శైలిలో ఉండటం దీని ప్రత్యేకత. ఏడంతస్తుల అద్భుతమైన గాలిగోపురాన్ని కలిగి వుండటం మరొక ప్రత్యేకత. "దేవస్థాన ప్రాంగణంలోకి ప్రవేశించగానే బంగారు తొడుపుతో ధగధగా మెరిసిపోతూ ఉన్న పెద్ద ధ్వజస్తంభం చూపరులకు ఇట్టే ఆకట్టుకుంటుంది. దేవాలయ ప్రాంగణం చుట్టూ రెండు వరుసలలో నిలిపిన 324 రాతి స్తంభాలతో నిర్మించిన కారిడార్ కూడా ఈ ఆలయం యొక్క ప్రత్యేక ఆకర్షణ. ప్రతీ ధ్వజస్తంభం మీద ఆకర్షణీయంగా చెక్కిన 'చేతిలో దీపం ధరించినట్లున్న దీపలక్ష్మీ' విగ్రహాలు ముచ్చట గొలుపుతూ ఆహుతులకు స్వాగతమిస్తాయి. గర్భగుడి బయటి గోడల మీద ఆకర్షణీయమైన రంగుల్లో చిత్రీకరించబడిన కుడ్య చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. ఇక గర్భగుడిలో తల దక్షిణ దిక్కుకూ, పాదాలు ఉత్తర దిక్కుకూ పెట్టుకుని శేషతల్పం మీద శయనిస్తున్నట్లు చెక్కబడిన ముచ్చటైన 20 అడుగుల పద్మనాభుని విగ్రహం చూపరులను కట్టిపడేస్తుంది" (మా కేరళ యాత్ర, పుట-87 మరియు 88).

ప్రాచీన సంగం సాహిత్యంలో అనేకమార్లు పద్మనాభస్వామి ఆలయం యొక్క ప్రస్తావన కన్పిస్తుంది. దీనిని బట్టి క్రీ.పూ.5వ శతాబ్దానికి ముందే ఈ ఆలయం నిర్మించబడినట్లు తెలుస్తుంది. అయితే ట్రావెన్ కోర్ రాజా మార్తాండ వర్మ కాలంలో ఈ ఆలయానికి మహర్దశ పట్టిందని చెప్పవచ్చు. ఈ ఆలయ గోపురంలోని ఏడు అంతస్థులలో ఐదంతస్థులు ఇతని హయాంలో నిర్మించినవే. శత్రు రాజులను జయించిన సందర్భాల్లో సంపదను దోచుకుని ఈ ఆలయపు ఖజానాలో నిక్షిప్తం చేసేవాడట. మార్తాండ వర్మ కాలంలోనే ట్రావెన్ కోర్ రాజ్యం అధిక సిరిసంపదలతో విలసిల్లేది. శత్రురాజుల దాడుల నుండి సంపదనంతా కాపాడాలనే ఉద్దేశ్యంతో పద్మనాభ స్వామి మీద భక్తితో తన సర్వస్వాన్ని స్వామికి ధారపోశాడు. అంతేకాక తనను తాను పద్మనాభ దాసునిగా ప్రకటించుకున్నాడు. ప్రస్తుతం రాజవంశీకుల వారసులు ఈ ఆలయ వ్యవహారాలను చూసుకుంటున్నారు. పద్మనాభస్వామి ఆలయంలాగే దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన మరొక ఆలయం తంజావూరు బృహదీశ్వరాలయం.

### 3.2.1.3.6. బృహదీశ్వరాలయం

దక్షిణ భారతదేశంలోని అతిపెద్ద ఆలయాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన ఆలయం తమిళనాడులోని బృహదీశ్వరాలయం. ద్రావిడ ఆలయ నిర్మాణ శైలికి అద్భుతమైన నిదర్శనం ఈ ఆలయం. తన కళాశాల విద్యార్థులతో బృహదీశ్వరాలయాన్ని సందర్శించారు, ఆచార్య కుసుమారెడ్డిగారు. ఆ సందర్భంలో ఈ ఆలయ విశిష్టతను ఈ విధంగా వివరించారు. "ఆలయ శిల్పాకృతుల గూర్చి వర్ణించాలంటే మాటలు చాలవు. లఖించడానికి చేతులు చాలవు. తెలుసుకోవాలని ఉంటే తనవితీరా చూడాల్సిందే. అలా చేస్తేనే మనసు కుదుటపడుతుంది. బృహదీశ్వరాలయం చుట్టూ నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అదే కందకం కాబోలు. అలా దాన్ని దాటి వెళ్ళడంలో ముందుగా ఆలయ ప్రాంగణం వస్తుంది. అది చాలా అద్భుతంగా వర్ణించవశం కాని శిల్ప సౌందర్యాలతో సర్వాంగ సుందరంగా శోభతో ఉంది. ఆ తర్వాత రెండవ ఆలయ ప్రాంగణ వస్తుంది. ఆలయం చుట్టూ ఎత్తైన గోడలున్నాయి. వాటిపై నంది విగ్రహాలు చుట్టూరా ఉన్నాయి. ఆలయ ప్రాంగణం లోపల భూ ప్రదేశాన్ని రాతి కట్టడంతో పాటూ ఇటుకలు పేర్చి కూర్చినారు" (కన్యాకుమారి దీపకళిక, పుట-29 మరియు 30).

ఈ ఆలయంలోని శివలింగం అతిపెద్దది. కాబట్టే బృహదీశ్వరాలయం అనే పేరు వచ్చింది. బృహదీశ్వర ఆలయాన్ని మొదటి రాజరాజ చోళుడు నిర్మించాడు. లక్షాముప్పైవేల గ్రానైట్ రాయిని ఈ ఆలయ నిర్మాణానికి ఉపయోగించారు. ఈ ఆలయానికి 100 కి.మీ. లోపు గ్రానైట్ క్వారీలు లేనందున సుదూర ప్రాంతం నుండి మూడు వందల ఏనుగుల సహాయంతో వీటిని తెప్పించారు. ఈ ఆలయం ఎత్తు 216 అడుగులు. పూర్తిగా ద్రావిడ నిర్మాణ పద్ధతిలో నిర్మించిన ఈ ఆలయపు శిఖరం నీడ నేలపై పడకుండా వుండటం విశేషం. అంతాగాక పునాదులు లేకుండా చదునైన నేలమీద నిర్మించడం మరొక ప్రత్యేకత. భరతనాట్యానికి చెందిన 108 భంగిమలు బృహదీశ్వరాలయ గోడలపై కొలువై వున్నాయి. ఈ ఆలయం చోళుల యొక్క కళాతృష్ణకు అద్భుత నిదర్శనం.

### 3.2.1.3.7. సింహాచలం

వేయి సంవత్సరాల ప్రాచీన చరిత్ర కలిగిన ఆలయం సింహాచలం – ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా ప్రజల ఇలవేల్పు వరాహ నరసింహుడు. విష్ణువు యొక్క దశావతారాల్లో నరసింహస్వామి అవతారం ఆంధ్రదేశానిదని భక్తుల నమ్మకం. మిగతా దక్షిణాది ఆలయాలకు భిన్నంగా పడమటివైపు ప్రవేశద్వారం, గోపురం నిర్మింపబడి వుండటం దీని ప్రత్యేకత. “లగేజీ విశాఖపట్నపు గెస్ట్‌హౌస్‌లో పడేసి, మిత్రుల సహితంగా సింహాచలానికి బయలుదేరాం. కొండ దగ్గర పడుతుంటుంది. జీడిమామిడి తోటలు అందంగా కనిపిస్తుంటాయి. కొండదారి పచ్చని చెట్లు, అది అందాల అడవి చల్లని పరిమళమారుతం! దేవసాన్నిధ్యానికి చేరుకుంటున్న అనుభూతి! నాకు ఆలయంమీద ఆసక్తి. కొండ మధ్య మైదానం – లోయ! సంపంగిచెట్ల పరిమళం! మనం దివ్యలోకంలో ఉంటాం. దగ్గరకి వచ్చేదాకా ఆలయం గోపురం దర్శనం ఇవ్వవు! ఆలయ శిల్పసంపద అద్భుతం! మయుడు దిగివచ్చి నిర్మించాడా అన్పిస్తుంది! శిల్పాలను చెప్పడానికి భాష – అక్షర చాలవు! .... ఆలయం చతురస్రం. పైన ఉన్నత గోపురం ముఖ మండపం, దానిమీద చిరుశిఖరం, పదహారు స్తంభాల నాట్యమండపం. శాలలో గుర్రాలు లాగుతున్న రాతిరథం. ఆ వసారాలో విష్ణుపురాణ శిల్పాలు ఆలయపు ఆవల శిల్పసంపన్న కళ్యాణమంటపం. ఇది తొంబది ఆర్యశిల్ప స్తంభాలది. చైత్రశుక్ల ఏకాదశినాడు ఇక్కడ స్వామివారి కళ్యాణోత్సవం జరుగుతుంది. ఇవన్నీ కనుల పండుగ, మనసుకు పర్వం, ఆత్మకు ఆనందం, ఆధ్యాత్మికత ఉత్సవం! విజయనగర కృష్ణదేవరాయలు కళింగను జయించిన సందర్భంగా సువర్ణ ఆభరణ కవచం, పచ్చల పతకం సమర్పించారు. అవి విలువకట్టలేనివి, కట్టరానివి! స్వామివారికి మరెన్నో అమూల్య ఆభరణాలు ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వపు విజయనగర గజపతి రాజులు సింహాచలస్వామిని ఎంతగానో సేవించారు. అనేక ఆస్తులు అర్పించారు. వాటిలో ఎక్కువభాగం ప్రస్తుతం దురాక్రమణలో ఉన్నాయి” (యాత్రాజీవనం, పుట-122).

సింహాచల ఆలయ స్తంభాలపైన, గోడలపైన గల అనేక శాసనాలు, ఈ ఆలయ ప్రాచీనతను, చరిత్రను వెల్లడిస్తున్నాయి. 1099లో కులోత్తుంగ చోళుడు కళింగ ఒరిస్సాను జయించాడు. వెలనాటి వంశానికి చెందిన మూడు గొంకడు 1137లో సింహాచలస్వామికి బంగారు కవచాన్ని సమర్పించాడు. 1267లో ప్రస్తుతం మనం చూస్తున్న ఆలయ ముఖ మంటపాన్ని, నాట్య మంటపాన్ని గంగవంశానికి చెందిన మొదటి నరసింహుడు నిర్మింపజేశాడు. కృష్ణదేవరాయలు తన విజయానికి గుర్తుగా ఇక్కడ విజయ స్థూపాన్ని నిర్మించాడు. అంతేగాక అనేక ఆభరణాలను దేవునికి సమర్పించాడు. ఆ ఆభరణాలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి. పైన చెప్పుకున్న హిందూ ఆలయాలగానే చరిత్ర ప్రాధాన్యం వున్న క్రైస్తవ ఆలయాలెన్నో ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి. వాటి విశిష్టతను తెలుసుకుందాం.

### 3.2.1.4. చర్చిలు

క్రైస్తవుల ప్రార్థనా మందిరం చర్చ్. క్రీ.శ. 1వ శతాబ్దంలో ప్రారంభమయినట్లుగా చెప్పబడే క్రైస్తవమతంలో ప్రధానంగా ఐదు శాఖలుగా కన్పిస్తుంది. వారు రోమన్ క్యాథలిక్స్, ప్రొటెస్టాంట్లు, Eastern orthodox, Oriental Orthodox మరియు Anglican. వీరు పూజించే విధానాన్ని బట్టి, పూజించే శాఖను బట్టి చర్చిల నిర్మాణంలో భిన్నత్వాన్నీ, చర్చిలను బసిలికా, కాథెడ్రల్, సినగాగ్ మొదలైన పేర్లతో వ్యవహరిస్తారు. “కాథలిక్ మతాధినేత పోప్ చేత ఒక ప్రత్యేకమైన డిక్రీ ద్వారా ప్రత్యేక పూజా హక్కులు ఇవ్వబడిన చారిత్రక ప్రాధాన్యంగల అతిపెద్ద చర్చిలను ‘బసీలికా’లు అంటారు” (మా కేరళయాత్ర, పుట-227) బసీలికాలు నిర్మాణంలో దీర్ఘచతురస్రాకారంగా వుండి, ఎత్తుగా ఉంటాయి. ఈ బసీలికాల నిర్మాణ శైలిని ప్రాచీన రోమ్‌లో కనుక్కొన్నారు. బిషప్ ఆధ్వర్యంలో నడిచే చర్చిలే కాథెడ్రల్. ముఖ్యంగా ఇవి రోమన్ క్యాథలికుల ప్రార్థనా కేంద్రాలు. యూదుల ప్రార్థనాలయాలు సినగాగ్‌లు. అయితే ఏ శాఖవారైనా సందర్శించగలిగే మందిరమే చర్చ్. కాథెడ్రల్‌లు, బసీలికాలు నగరాల్లో నిర్మింపబడే అతిపెద్దవైన కట్టడాలు. కానీ గ్రామాల్లో,

పట్టణాల్లో, నగరాల్లో ఎక్కడైనా చర్చిలను చూడవచ్చు. ఏసుక్రీస్తు జననం, క్రైస్తవమతానికి మూలం మొదలైన అంశాలను ఇక్కడ ప్రసంగిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కొన్ని చర్చిలను గురించి, వాటి విశిష్టతలను గురించిన అంశాలు తెలుగు యాత్రాచరిత్రల్లో కన్పిస్తున్నాయి. వాటిని ఈ క్రింది విధంగా చెప్పుకోవచ్చు.

### 3.2.1.4.1. సెయింట్ పీటర్ బసీలికా వాటికన్

శాంతి, ప్రేమ, కరుణలకు ప్రతీకగా నిలిచిన నగరం వాటికన్ సిటీ. ఇటలీ రాజధాని రోమ్ నగరానికి మధ్యలోగల ఈ నగరం రోమన్ క్యాథలిక్కుల ఆధ్యాత్మిక కేంద్రం. ప్రపంచంలోని క్రైస్తవులంతా పవిత్రంగా భావించే ఈ నగరం 1929లో సర్వస్వతంత్ర సార్వభౌమదేశంగా ఆవిర్భవించింది. అంతకుముందు వరకు ద్వీపకల్పంలో చిన్న చిన్న దేశాలు పోప్‌ల సారధ్యంలో వుండేవి. దీంతో పోప్‌ల గుత్తాధిపత్యం పెరిగిపోయిందని భావించిన ప్రభుత్వం వీరి ఆధిపత్యాన్ని ఆ ద్వీపాలన్నింటినీ కలిపి, యునైటెడ్ కింగడమ్ ఆఫ్ ఇటలీగా ఏర్పరిచింది. ఇందులో భాగంగా ప్రభుత్వానికి ఎదురు తిరిగిన ఎందరో పోప్‌లను జైళ్ళల్లో బంధించారు. ఖైదీలుగా ఉన్న పోప్‌లకు ఇటలీ ప్రభుత్వానికి మధ్య చేసుకున్న ఒప్పందంలో వాటికన్ సిటీకి స్వతంత్రం వచ్చింది. ఈ రాజ్యానికి అధిపతి పోప్.

"క్రీస్తుశకం ఐదవ శతాబ్దం నుండి క్రైస్తవ మతాధిపతి పోప్ ఇక్కడ నివాసం వున్నారు. 1309-1378 మధ్య మాత్రం పోప్‌ల పీఠం వాటికన్ నుండి ఎవిగ్నోన్‌కి మార్చబడింది. ఎనిమిదవ శతాబ్దపు రోమన్ సామ్రాజ్య స్థాపనలో, నిర్వహణలో పోప్‌లకు అధిక ప్రాముఖ్యత వుంది. ఒకప్పుడు పోప్‌ల ఆధిపత్యం ఇటలీలోని అధిక భూభాగం మీద చలామణి అయ్యేది. అయితే ఇటలీ పునరేకీకరణ జరిగినప్పుడు ఆ దేశానికి మొదటి చక్రవర్తి అయిన విటారియా ఇమాన్యుయేల్, పోప్‌లను వాటికన్ సిటీకి పరిమితం చేశాడు. తాము వాటికన్ నగరంలో బందీలయ్యామని నాటి పోప్ గగ్గోలు పెట్టేవాడు. వాటికన్ 1929లో ముస్సోలిని చర్చితో సంప్రదింపులు జరిపి వాటికన్ నగరానికి స్వతంత్ర రాజస్థానం

ఇచ్చేందుకు, పోప్ ఇటలీలోని ప్రజాస్వామ్య రాజ్యాన్ని గుర్తించేందుకు అంగీకరింపజేశాడు" (రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు, పుట-60).

ప్రస్తుతం 260 మందికి పైగా పోపులు ఇక్కడ నివాసముంటున్నారు. రోమన్ క్యాథలిజానికి కేంద్రమైన ఈ ప్రాంతంలో "పోప్ సందేశం ఇచ్చే ప్రదేశం సెయింట్ పీటర్ చర్చి. ప్రపంచంలోనే అతిపెద్ద చర్చి ఇది. దానికి సెయింట్ పీటర్ స్క్వేర్ నుంచి వెళ్ళాలి. క్రైస్తవులందరూ సమావేశమవడానికి వీలుగా అతిపెద్ద కూడలిని నిర్మించామన్న పోప్ అలెగ్జాండర్-7 ఆదేశం మేరకు ప్రసిద్ధ రూపశిల్పి బెర్నీని 1656-67లో సెయింట్ పీటర్స్ స్క్వేర్‌కు రూపకల్పన చేశాడు. అందుకే బెర్నీని పియజ్జా అని కూడా అంటారు .... చర్చి అడుగున సెయింట్ పీటర్ సమాధి ఉంది. దీని మీద పోపల్ దైవపీఠాన్ని ఉంచారు. ఇక్కడి నుంచే పోప్ శాంతి సందేశాన్ని అందిస్తారు" (నా జర్మనీయానం, పుట-86).

అద్భుత కట్టడంగా భాసిల్లే ఈ చర్చి కళలకు నిలయం. ఎటు చూసినా చిత్రాలతో, శిల్పాలతో, పర్యాటకులను ఆకర్షించే ప్రాంతం. ముఖ్యంగా ప్రముఖ శిల్పి, చిత్రకారుడైన మైఖేలెంజెలో నిర్మించిన చర్చి గమ్మటం అత్యంత ఆకర్షణీయం. ఈ గుమ్మటంపై నుండి రోమ్ అందాలను వీక్షించటానికి పర్యాటకులు అధిక సంఖ్యలో ఇక్కడికి రావడం విశేషం.

### 3.2.1.4.2. సెయింట్ వైటస్ కెథడ్రిల్

ఆరువందల ఏళ్ళ కాలం పాటూ సుదీర్ఘంగా నిర్మింపబడిన కట్టడం సెయింట్ వైటస్ కెథడ్రిల్. చెకోస్లోవేకియాలోనే అతిపెద్ద చర్చిగా ప్రసిద్ధి చెందిన దీనికి ఎంతో చరిత్ర ఉంది. "సెయింట్ వైటస్ కెథడ్రిల్లోకి నడిచాం. అసలు ఎంత పెద్ద నిర్మాణం అది. మాకు తల ఎత్తి చూస్తే అసలు ఏమీ కనపడట్లా. దీని నిర్మాణం పూర్తవడానికి ఆరు వందల ఏళ్ళు పట్టిందట. 1344లో చార్లెస్ IV దీని నిర్మాణాన్ని చేపట్టాడు. పదో శతాబ్దానికి చెందిన రోటుండా అనే భవంతిని పడగొట్టి ఆ స్థలంలో ఈ కెథడ్రిల్ కట్టారు. ఇది చెకోస్లోవేకియాలోనే అతిపెద్ద చర్చి. దీన్ని గోథే ఆర్కిటెక్చర్‌తో నిర్మించారు" (నా ఐరోపా యాత్ర, పుట-126).

ఈ చర్చి ప్రధానంగా రాజవంశీయుల స్వప్రయోజనాలకై నిర్మింపబడింది. రాజవంశీయులు తమ పట్టాభిషేకాల నిర్వహణలకు, సమాధులను నిర్మించుకోవటానికి, తమ ఆభరణాలను దాచడానికై ఇది ప్రధానంగా నిర్మింపబడింది. నవంబర్ 1344వ సంవత్సరం నుండి దీని నిర్మాణం ప్రారంభమైనప్పటినుండే దీన్ని తెరిచారు. నూట ఇరవై మీటర్ల పొడవు గల ఆ చర్చి ఆ కాలంలో యూరప్‌లో కట్టిన మిగిలిన చర్చిల్లాగానే ఫౌండియర్లతో, చక్కటి పాలరాతి శిల్పాల అలంకరణతో చాలా అందంగా ఉంది. .... ఈ చర్చిలో చాలా మంది బొహీమియన్, హోలీ రోమన్ రాజులు, చెకోని పాలించిన ఛార్లెస్ డి ఫోర్త్, ఆయన నలుగురు భార్యలు సమాధి చేయబడ్డారు. ప్రధానంగా ఇది రాజుల పట్టాభిషేకానికి, సమాధులకి, రాజవంశీయుల ఆభరణాలని దాచుకోవడానికి ఉద్దేశించబడింది" (ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్, పుట-94).

### 3.2.1.4.3. హాజియా సోఫియా

క్రైస్తవ మరియు ఇస్లాం మత సంస్కృతుల సమ్మేళనం హాజియా సోఫియా. టర్కీలో గల ఈ చర్చ్ క్రైస్తవులతో పాటూ ముస్లింలకు కూడా పవిత్ర ప్రదేశం. హాజియా సోఫియా అంటే గ్రీకు భాషలో పవిత్ర జ్ఞానం అని అర్థం. క్రీ.శ.4వ శతాబ్దంలో కాన్‌స్టాన్‌టైన్ అనే రోమన్ చక్రవర్తి దీని నిర్మాణానికి కారకుడు. యాత్రారచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు ఈ చర్చి ప్రత్యేకతలను గురించి తన ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్ అనే యాత్రాచరిత్రలో ఇలా పేర్కొన్నాడు.

"క్రీ.శ. 1453లో కాన్‌స్టాన్‌టినోపులోని ఒట్టోమాన్ రాజు సుల్తాన్ మొహమ్మద్ స్వాధీనం చేసుకున్నాక, దాని పేరుని అయ సోఫియా మాస్క్‌గా మార్చి క్రిస్టియన్ చర్చ్‌ల్లో ఉపయోగించే గంటలు, పాత్రలు మొదలైనవన్నీ తొలగించి ఈ చర్చిని మసీదుగా రూపుదిద్దారు. అతని కొడుకు మొహమెద్-2 ఆ భవంతికి ఓ మినార్ నిర్మించాడు. సోఫియా చర్చి బయట మెహ్‌మెద్-2 నిర్మించిన చిన్న భవంతిలో ముస్లిమ్స్ కాళ్ళు చేతులు, మొహం శుభ్రం చేసుకుని మసీదులోకి ప్రార్థనకి వెళ్ళేవారు. చర్చికి ఈ నియమం లేదు

కాబట్టి సోఫియా చర్చికి ఈ బిల్డింగ్ ఉండేది కాదు. వృద్ధులు నమాజ్ అయ్యాక కూర్చుని విశ్రాంతి తీసుకోవడానికి అరుగులు కూడా నిర్మించారు" (ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్, పుట-84).

19వ శతాబ్ది మధ్యభాగంలో దీని పునర్నిర్మాణ సందర్భంలో చర్చి గోడలపై క్రీస్తుకు, క్రైస్తవ మతానికి సంబంధించిన బొమ్మలు చెక్కుచెదరకుండా కన్పించాయట. హాజియా సోఫియా చర్చను మసీదుగా మార్చిన మెహ్మెద్-2 తల్లి క్రిస్టియన్ కావటమే దీనికి కారణం. మెహమెద్ తల్లి ఫ్రాన్సు దేశస్థురాలు. నాడు ముస్లిం పాలకులు క్రైస్తవ మతానికి చెందిన విదేశీ వనితలనే వివాహం చేసుకునేవారు. కాబట్టే తండ్రి మతాన్నే పుచ్చుకున్నా, తల్లి పూజించే మతం పట్ల కూడా గౌరవంతో, విశ్వాసంతో ఉండేవాడు. ఇది 7,670 చదరపు మీటర్ల విస్తీర్ణంతో, అరవై ఆరు మీటర్ల ఎత్తుగల డోమ్‌తో చతురస్రాకారంలో నిర్మించబడిన ఈ చర్చిలో అనేక చేపల బొమ్మలు కన్పించాయని, చేపలు 4వ శతాబ్ది వరకూ క్రిస్టియానిటీకి చిహ్నంగా వినియోగించేవారని మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు పేర్కొన్నారు.

### 3.2.1.4.4. సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్

కేరళలోని కొచ్చిన్‌లో గల సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్ భారతదేశంలో యూరోపియన్లు నిర్మించిన మొట్టమొదటి చర్చిలలో ఒకటి. పోర్చుగీసు వలస కాలంలో 1503వ సంవత్సరంలో దీనిని నిర్మించడం జరిగింది. పోర్చుగీసు వలసల స్థాపకుడైన పెడ్రో ఆల్వరెజ్ కాబ్రల్ ఈ నిర్మాణానికి ఆద్యుడు. పూర్తిగా కొయ్యతో, మట్టితో నిర్మించిన ఈ చర్చి పోర్చుగీసు వారి భవన నిర్మాణ కళకు నిదర్శనమని చెప్పవచ్చు. పోర్చుగీసు తరువాత కేరళలో వలసలు ప్రారంభించిన విదేశీయులు ఈ చర్చికి తమదైన శైలిలో దీని నిర్మాణంలో మార్పులు చేశారు. "డచ్చివారు 1795లో బ్రిటిష్ వారి దాడుల అనంతరం కుదిరిన ఒక సంధి షరతుల మేరకు ఫోర్ట్, దానితో పాటు ఈ చర్చ్ బ్రిటిష్ వారి పరమయ్యాయి. అయితే ఈ చర్చ్ 1804లో మాత్రమే అధికారికంగా ఆంగ్లికన్ చర్చిలో విలీనం చేయబడింది.

1866లో బ్రిటిష్ వారు దీనిని పునర్నిర్మించి సెయింట్ ఫ్రాన్సిస్ చర్చ్ పేరుతో దీనిని పునః ప్రారంభించారు" (మా కేరళ యాత్ర, పుట–221).

ఈ చర్చి ఆవరణలోనే వాస్కోడిగామా సమాధి ఉండటం చెప్పుకోదగ్గ అంశం. 1524లో వాస్కోడిగామా మరణించాక ఆయన శరీరాన్ని ఈ చర్చ్ ప్రాంగణంలోనే ఖననం చేశారట. తరువాత 14 సంవత్సరాలకి ఆయన భౌతిక కాయాన్ని అతని స్వదేశం అయిన పోర్చుగల్‌కి సమర్పించారు. భౌతికకాయం లేకున్నా ఆ స్మారక కట్టడాన్ని దర్శించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు రావడం విశేషం. కేరళలో రోమన్ క్యాథలికులు, ప్రొటెస్టెంట్లు వంటి క్రైస్తవులతో పాటూ యూదు జాతీయులు కూడా నివాసముంటున్నారు. యూదుల ప్రార్థనాలయాలను సినగాగ్‌లంటారు. కేరళలో కెథెడ్రిల్, బసీలికాలతో పాటూ సినగాగ్‌లు ఉండటం, వాటిని ఇప్పటికీ కేరళ ప్రభుత్వం చారిత్రక కట్టడాలుగా అపురూపంగా రక్షించుకోవడం విశేషం.

## 3.2.1.4.5. పరదేశి సినగాగ్

యూదుల ప్రార్థనా మందిరమే సినగాగ్. యూదులు ప్రపంచంలోని అతిప్రాచీన జాతులలో ఒకటి. వీరి మతాన్ని యూదుమతం లేదా జుడాయిజం అంటారు. పెంటాట్యూక్ లేదా టోరా అనేది వీరి పవిత్ర మతగ్రంథం. ఆరు కోణాల నక్షత్రమైన 'స్టార్ ఆఫ్ డేవిడ్' వీరి పవిత్ర మత చిహ్నం. వీరి భాష హిబ్రూ. ఇజ్రాయెల్ వీరి మతకేంద్రం. అయితే క్రీ.శ.4వ శతాబ్దం నుండి ఈ సినగాగ్‌ల నిర్మాణం కేరళలో కన్పిస్తుంది. క్రీ.శ.4వ శతాబ్దంలో నిర్మించిన సినగాగ్ పెరియార్ నదికి వచ్చిన వరదల కారణంగా నాశనమయింది. 16వ శతాబ్దంలో కొచ్చిరాజు సహాయంతో ఈ పరదేశీ సినగాగ్‌ను నిర్మించుకున్నారు కేరళలోని యూదులు.

"ఇప్పటి ఈ పరదేశి సినగాగ్‌ను కూడా 1662లో పోర్చుగీసువారు ధ్వంసం చేయగా, 1664లో యూదులు డచ్చివారి సాయంతో దానిని పునర్నిర్మించుకున్నారు. ఆ సందర్భంలో 45 అడుగుల ఎత్తైన ఒక గడియార స్తంభం (క్లాక్‌టవర్)తో సహా ఈ

సినగాగ్‌ను విలక్షణమైన డచ్చి పద్ధతి పెంకుటి పై కప్పుతో నిర్మించారు. ఈ టవర్‌లోని గడియారం 1930 వరకూ క్రమం తప్పకుండా గంట గంటకూ ఘంటారావం చేసేదట. ఇక సినగాగ్ లోపల మేలిమి బంగారం, వెండి పుటలు కలిగిన పవిత్ర టోరా గ్రంథం. లోపలి పైకప్పు నుంచి వేలాడే దీపాలు, క్రిస్టల్‌స్‌తో చేసిన షాండ్లేర్లు (chandeliers), చక్కటి చెక్కడపు పనితో చేసిన ఇత్తడి ప్రసంగ పీఠం (pulpit)చూడదగ్గవి. స్థానిక కొచ్చి, తిరువితాంకూర్ రాజులు యూదు ప్రజలకు బహూకరించిన బంగారు కిరీటాలు కూడా ఇక్కడ ప్రదర్శనకు పెట్టారు. రాగి రేకులమీద మలయాళ లిపిలో రాయబడిన క్రీ.శ.4వ శతాబ్దానికి చెందిన శాసనాలు కూడా భద్రపరచబడ్డాయి. స్థానిక కొచ్చిన్ రాజులు యూదు సమాజానికి ఇచ్చిన పలు దానాలకు సంబంధించిన శాసనాలవి. ఇథియోపియాకు చెందిన చిట్టచివరి చక్రవర్తి హైలీసెలాసీ యూదులకు బహూకరించిన ఒక ఉన్ని రగ్గును కూడా భద్రపరిచారు. 19వ శతాబ్దానికి చెందిన ఇక్కడి గాజు, క్రిస్టల్ షాండ్లేర్లు బెల్జియం నుండి తెచ్చినవి. నేలపై పరచిన నీలిరంగు పింగాణీ టైల్స్ ఇక్కడి ప్రత్యేక ఆకర్షణ. ఈ టైల్స్ అన్నింటిమీదా చేతితోనే పెయింట్ వేయడం జరిగింది. 18వ శతాబ్ది మధ్యయుగంలో ఎజెకియేల్ రాహాబి అనే ధనిక యూదు వర్తకుడు చైనాలోని కాటన్ నుంచి వీటిని తీసుకొచ్చి ఇక్కడ చేయించాడట" (మా కేరళయాత్ర, పుట-237 మరియు 238).

నాడు కొచ్చిన్‌లో మలబారీ యూదులు, మేషుహూరారం యూదులు, పరదేశీ యూదులని మూడు తెగలకు చెందిన యూదులు వుండేవారు. మధ్య ప్రాచ్యం (middle east)నుంచి వచ్చిన యూదులను పరదేశీ యూదులంటారు. వీరు నిర్మించిన కారణంగానే దీనికి పరదేశీ సినగాగ్ అనే పేరు రావడం జరిగింది.

ప్రపంచవ్యాప్తంగా చర్చి నిర్మాణాల వెనుక గల ఆసక్తికరమైన చరిత్రను, వాటి విశిష్టతను పాఠకులకు అందించటంలో యాత్రాచరిత్రలు ముందంజలో ఉన్నాయి.

### 3.2.1.5. మసీదులు

ప్రపంచంలోని అతి ప్రాచీన మతాల్లో ఇస్లాం ఒకటి. ఇస్లాం పదానికి మూలం 'అస్లాం' అనే పదం, సమర్పించుకోవడం అని దానికి అర్థం అంటే తనను తాను దేవునికి స్వచ్ఛందంగా సమర్పించుకునేవాడే ముస్లిం. ఇస్లాంను ఒక జీవన విధానమనుకుంటే ఆ జీవన విధానాన్ని అంగీకరించినవాడు, ఆచరించిన వాడు 'ముస్లిం'గా పరిగణింపబడతాడు. మానవాళి మనుగడ ఈ భూమిపై మొదలైనప్పటి నుంచే ఇస్లాం ఉనికిలో ఉందని మహమ్మదీయులు విశ్వాసం. కానీ చరిత్రకారులు ఇది క్రీ.శ.7వ శతాబ్దం ప్రథమార్థంలో మక్కా మరియు మదీనాలో పుట్టిందని అభిప్రాయపడుతున్నారు. ఏసుక్రీస్తుని కూడా అల్లా పంపించిన దూతగా వీరు భావిస్తారు. ఇస్లాం మతాన్ని అనుసరించే వారి ఆధ్యాత్మిక ప్రార్థనా కేంద్రాలే మసీదులు. సౌదీ అరేబియాలోని 'కాబా' మసీదు అతిప్రాచీనమైన మసీదుగా పేర్కొంటారు. విస్తృతంగా నగరమంతా మసీదులు నిర్మించబడటం వల్ల బంగ్లాదేశ్ రాజధాని ఢాకా మసీదుల నగరంగా (city of mosques)పిలవబడుతుంది. ప్రసిద్ధి చెందిన మసీదులను యాత్రాచరిత్రలు తమ యాత్రాక్రమంలో దర్శించి, ఆ అనుభవాలను తమ యాత్రాగ్రంథాల్లో పొందుపరిచారు. అందులో ముందుగా చెప్పుకోవల్సింది టర్కీలోని బ్లూమాస్క్.

#### 3.2.1.5.1. బ్లూమాస్క్

బ్లూమాస్క్ గా ప్రసిద్ధి చెందిన ఈ మసీదు అసలు పేరు అహ్మెద్ కెమీ. ఇది బ్లూ మాస్క్ గా ప్రసిద్ధి చెందడానికి కారణం ఈ మసీదంతా నీలం రంగు టైల్స్ తో అలంకరింపబడి వుండటమే. టర్కీలో గల మసీదు అహ్మద్-1 అనే రాజుచేత క్రీ.శ. 1609-1616 మధ్య నిర్మింపబడింది. ప్రాచీనమైన మసీదుగా ప్రఖ్యాతిగాంచిన ఈ మసీదును ముదిగంటి సుజాతారెడ్డి గారు పర్యటించిన సందర్భంలో ఈ మసీదుకు సంబంధించిన విశేషాలను ఇలా పేర్కొన్నారు.

"ఇస్తాంబుల్ లో ప్రసిద్ధమైన రెండు మసీదులున్నాయి. ఒకటి సుల్తాన్ అహ్మద్ మసీదు. దీన్నే బ్లూ మసీదు అంటారు. పదిహేడవ శతాబ్దారంభంలో నిర్మింపబడింది. నీలిరంగు మొజాయిక్ లతో నిర్మింపబడిన ఈ మసీదు ఆరు మినార్ లతో చాలా విశాలమైంది! అందమైంది!" (అద్భుత చైనాయాత్ర, పుట–53).

డెబ్బై రెండు మీటర్ల పొడవు, అరవై నాలుగు మీటర్ల వెడల్పు గల ఈ మసీదులో డోమ్ ఎత్తు నలభై మూడు మీటర్లు. ఎక్కడా స్థంభాలు లేకుండా నిర్మింపబడటం దీని ప్రత్యేకత. టర్కిష్ బ్లూగో పిలవబడే ఒక రకమైన నీలిరంగు ఇరవై ఒక్క వేల టైల్స్ తో ఈ మసీదు అలంకరింపబడి వుంది. "ఇస్తాంబుల్ లోకి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇజానిక్ అనే ఊళ్ళో 1815లో అక్కడ వచ్చిన భూకంపంలో ఇజానిక్ టైల్స్ తయారు చేసే నిపుణులంతా మరణించారు. ఆ తర్వాత ఇజానిక్ టైల్స్ తయారీ ఆగిపోయింది. 17వ శతాబ్దానికి చెందిన ఇజానిక్ టైల్స్ ఇప్పుడు చాలా విలువైనవి. ఒక్కో టైల్ ధర పదివేల అమెరికన్ డాలర్లు. బ్లూమాస్క్ ఇజానిక్ టైల్స్ ఉన్న బ్లూ మాస్క్ మసీదు విలువ ఎంతో అంచనా కట్టడం కష్టం" (ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్, పుట–82).

రోజుకు ఐదు సార్లు నమాజ్ జరిగే ఈ మసీదులో ఒకేసారి పదివేలమంది ప్రార్థనలు చేయవచ్చు. రోమన్ క్యాథలిక్ మతాధినేత పోప్ బెనడిక్ట్ – 16 2006, నవంబర్–30 న తేదీన బ్లూమాస్క్ ను సందర్శించి, ప్రార్థనలు చేయడం విశేషం. ఆరు మినార్లతో, గోడలపై ఖురాన్ పవిత్ర వాక్యాలతో, షాండ్లియార్ దీపాల కాంతులతో, నీలిరంగు టైల్స్ తో వెలుగొందే ఈ మసీదు అందాన్ని తప్పక చూడాల్సిందేనని ఈ యాత్రారచయితలు పేర్కొన్నారు. ఓట్టోమాన్ రాజుల భవన నిర్మాణ శైలికి అద్దం పట్టే మసీదు బ్లూమాస్క్.

### 3.2.1.5.2. డోమ్ బాబ్ రా

ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఒకటిగా గుర్తింపబడిన ప్రాంతం కిర్గిజ్ స్థాన్ లోని ఓష్ పట్టణంలో గల సులేమాన్ మౌంటేన్. మహమ్మదీయులకు పవిత్రకేంద్రంగా భాసిల్లే ఈ స్థలానికి మూడువేల సంవత్సరాల చరిత్ర ఉంది. సిల్క్ రూట్ కి నడిమిన గల పర్వతంపై

చారిత్రక ప్రాధాన్యం ఉన్న మసీదు నిర్మింపబడి వుంది. అదే 'డోమ్ బాబరా' క్రీ.శ. 1510వ సంవత్సరంలో బాబర్ చేత నిర్మింపబడినట్లుగా చెప్పబడే ఈ మసీదు గొప్ప పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందింది.

"సులేమాన్ షేక్ అను ముస్లిం సాధువు సమాధి ఈ కొండ క్రింద ఉండటం వలన దీనికి సులేమాన్ మౌంటేన్ అని పేరు వచ్చింది. ఒకప్పుడు మహమ్మద్ ప్రవక్త ఈ పర్వతం మీద ప్రార్థనలు చేశాడనన్న నమ్మకంతో ఇది ముస్లింలందరికీ పవిత్ర స్థలమైపోయింది. ఒకవైపు నుండి దీనిని పరీక్షగా గమనిస్తే గర్భభారంతో వంశ స్త్రీలందరూ ఈ పర్వతాన్ని నగ్న పాదాలతో ఎక్కి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేస్తారు. ఈ ఓష్ నగరం ఒకప్పుడు బాబర్ పరిపాలించిన ఫర్గానా అధిష్టించగానే ఈ కొండమీద ఒక మసీదును నిర్మించాడు. బాబర్ మన దేశంపై 1526లో దండయాత్ర చేసే ముందు ఈ సులేమాన్ కొండపై 40 రోజులు భక్తిశ్రద్ధలతో చిల్లా (ధ్యానం) చేశాడు. ఆ అన్నిదినాలు చాలా పవిత్రంగా మగువ, మద్యం, మాంసాలకు దూరంగా ప్రార్థనలు చేసి, నూతనంగా సంతరించుకున్న ఆత్మశక్తితో మనదేశంపై దండెత్తి విజయం సాధించాడు. ఆ మసీదు ఇప్పటికీ ఉంది. దానిపేరు 'డోమ్ బాబ్ రా'" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర, పుట-68).

అయితే ఇంతటి చారిత్రకంగా ప్రసిద్ధి చెందిన ఈ మసీదు 1853లో వచ్చిన భూకంపం వల్ల ధ్వంసమైందని, మళ్ళీ పునర్మించుకున్నారని యాత్ర రచయిత లోకేశ్వర్ గారు పేర్కొన్నారు. అయితే 1960వ సంవత్సరంలో డోమ్‌బాబ్‌రా హఠాత్తుగా కూలిపోయిందట. అనేకమంది ముస్లిం యాత్రికులు ఈ మసీదును సందర్శించటానికై రావడం ఇష్టం లేని కారణాం రష్యా ప్రభుత్వమే ఈ పని చేసే వుంటుందని భావించిన స్థానిక ముస్లింలు అప్పటికి మౌనంగా వున్నా, 1991లో తమ దేశానికి స్వతంత్ర్యం వచ్చిన వెంటనే డోమ్ బాబ్ రా ను తిరిగి నిర్మించుకున్నారు. బాబర్ ప్రార్థనలు చేసిన స్థలంలో తానున్నాననే బావనే ఆనందపరచిందని రచయిత లోకేశ్వర్ గారు పేర్కొన్నారు. లోకేశ్వర్ గారు ఛత్తీస్ ఘడ్ కి స్కూటర్ పై చేసిన యాత్రలో డోమ్‌బాబ్‌రా మాదిరే ఒక మసీదును గురించి పరిచయం చేశారు. అదే కాంకేర్ మసీదు.

### 3.2.1.5.3. కాంకేర్ మసీదు

ప్రకృతికి నెలవైన ప్రదేశం ఛత్తీస్‌ఘడ్. దట్టమైన అడవులు, కొండలు, కోనలు, నదులు, జలపాతాలు, లోయలు, గుహలు మొదలైన ప్రకృతి వింతలతో అలాగే ఈ ప్రాంతం పర్యాటకానికి పెట్టింది పేరు. పరవస్తు లోకేశ్వర్ గారు ఛత్తీస్‌ఘడ్‌కి స్కూటర్ పై యాత్ర చేసిన క్రమంలో చిత్రకూట జలపాతం, కాంకేర్ వాలీ జాతీయ పార్కు, బార్ సూర్ దేవాలయాలతో పాటూ కాంకేర్ మసీదును కూడా సందర్శించారు.

"కాంకేర్ పట్టణంలో ఒక మసీదు చాలా అందంగా కనపడింది. మధ్య ఆసియా సమర్ ఖండ్ లోనో, బుఖారాలోనో ఉన్నట్లు మాకు అన్పించింది. మొగల్ కాలం నాటి ఆ మసీదు మెట్లమీద చాలాసేపు కూర్చుని లోపలి నమాజుల్ని శ్రద్ధగా విన్నాం" (ఛత్తీస్‌ఘడ్ స్కూటర్ యాత్ర, పుట-90) అంటూ మసీద్ గురించి పరిచయం చేశారు. ఛత్తీస్ ఘడ్ లోని కాంకేర్ జిల్లాలో గల ఈ మసీదు స్థానిక ముస్లిముల ఆరాధ్య స్థలమేకాక, ప్రముఖ పర్యాటక ప్రాంతంగా వెలుగొందుతున్నది.

### 3.2.1.5.4. అల్‌ఫతే మసీదు

6,500 స్క్వేర్ మీటర్ల వెడల్పుతో అలరారే అల్‌ఫతే మసీదు ప్రపంచంలోని అతి పెద్దదైన మసీదుల్లో ఒకటి. బహ్రెయిన్‌లో గల ఈ మసీదు ఒకేసారి ఏడువేల మంది ప్రార్థన చేయగల సామర్థ్యం కలది. బహ్రెయిన్ స్థాపకుడైన 'అహ్మల్ అల్‌ఫతే' పేరు మీదుగా ఈ మసీదు ప్రసిద్ధి చెందింది.

"అల్‌ఫతే మసీదు! ఏడు వేల మంది ప్రార్థన చెయ్యటానికి అనువుగా వుంటుంది. అరవయి టన్నుల ఫైబర్ గ్లాస్ డోమ్, డెబ్బయి మీటర్ల మినార్‌లు!

ప్రపంచంలో చాలా కొద్ది మసీదులు మాత్రమే ముస్లిమేతరులను లోనికి రావటానికి అనుమతిస్తాయి. అందులో బహ్రెయిన్ మసీదు చాలా ప్రసిద్ధి" (దూరతీరాలలో – పుట 168).

1988లో నిర్మింపబడిన ఈ కట్టడం గోడలపై 'కుఫిక్' అనే ప్రాచీన చిత్రలిపి కనబడుతుంది. ఇస్లామిక్ వాస్తు శైలిలో నిర్మింపబడిన అల్‌ఫతే మసీదు ప్రసిద్ధ పర్యాటక స్థలంగా విరాజిల్లుతోంది. ప్రసిద్ధ పర్యాటక కట్టడమైన అల్‌ఫతే మసీదు ఇస్లామిక్ వాస్తు శైలికి దర్పణంగా నిలిచే నిర్మాణం. యాత్రాకారులు ఏ మతానికి, ఏ దేశానికి చెందిన వారైనా తాము పర్యటించిన ప్రాంతాల్లో గల మసీదులను దర్శించి, ఆ విశేషాలను తమ యాత్రాచరిత్రల్లో పొందుపరచటం విశేషం. యాత్ర మానవునిలోని భిన్నతలను పోగొట్టి అద్వైత భావాన్ని కలిగిస్తుందని చెప్పటానికి పై యాత్రాకారులు పేర్కొన్న అంశాలే నిదర్శనం.

### 3.2.1.6. బౌద్ధారామాలు/బౌద్ధాలయాలు

చిరు దీపాల వంటి తన బోధనలతో అజ్ఞానం వున్నవారి హృదయాలలో జ్ఞాన దీపాలను వెలిగించిన దివ్యమూర్తి బుద్ధ భగవానుడు. అందుకే ఎడ్విన్ ఆర్నాల్డ్ బుద్ధుణ్ణి Light of Asia గా వర్ణించాడు. మహారాజుగా జీవితాన్ని గడిపి, ఒక్కసారిగా ప్రజల కష్టాల్ని చూసి, చలించిపోయి, రాజభోగాలను వదలుకొని దుఃఖానికి కారణాలను వెతికిన అన్వేషి బుద్ధుడు. అతని అన్వేషణల సారమే బౌద్ధమత ఆవిర్భావం. సాటి మనుషుల్లో మానవత్వాన్ని, దైవత్వాన్ని చూడమని చెప్పటమే బౌద్ధమత లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది బౌద్ధానుయాయులు ఉన్నారు. ఆ బౌద్ధానుయాయుల ప్రార్థనా స్థలాలే బౌద్ధాలయాలు లేదా ఆరామాలు. బౌద్ధాలయాలు, విహారాలు, స్థూపాలు, పగోడాలు, ఆరామాలు ఇవన్నీ బౌద్ధమతాన్ని ప్రతిబింబించే నిర్మాణాలు. వీటి నిర్మాణంలో పరిసరాలు ప్రాధాన్యం వహిస్తాయి. ప్రశాంత వాతావరణంలోనే సాధారణంగా వీటి నిర్మాణం వుంటుంది. బౌద్ధమతానికి పుట్టినిల్లు భారతదేశమే అయినా, అది ఆసియా ఖండమంతా వ్యాపించింది.

"మనదేశంలో క్రీ.పూ.5, 6 శతాబ్దానికి ప్రారంభమయిన గౌతమ బుద్ధుని ఆలోచనలు, వివరణలు, బోధనలు ఆసియా ఖండమంతా ప్రసరించాయి. ఎంతోమంది

భారతదేశ బౌద్ధ పండితులు చైనా వరకు కాలినడకన వెళ్ళి, చైనా భాషను నేర్చుకుని త్రిపిటకాలను అనువదించారు. క్రీ.శ.1వ శతాబ్దంలో చైనాలో 'హాన్ సామ్రాజ్యం' ఉన్న సమయంలో 'మహాయాన బౌద్ధమతం' చైనాలో ప్రజామోదం పొందింది. చైనా నుంచి కొరియాకు, కొరియా నుంచి జపాన్ కు బుద్ధుని బోధనలు పయనించాయి" (జపాన్ ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-71).

ఇలా బౌద్ధం ప్రవేశించిన ప్రతీ చోట బౌద్ధారామాలు/ఆలయాలు వెలిసాయి. ముఖ్యంగా జపాన్ లోనూ, చైనాలోనూ బౌద్ధమత సూత్రాలకు వ్యతిరేకంగా విగ్రహ రూపంలో బుద్ధున్ని పూజించడం కన్పిస్తుంది. ఈ స్థలం నేపాల్లోని లుంబినీలో గల మాయాదేవి ఆలయాన్ని అతిప్రాచీన ఆలయంగా పేర్కొంటారు.

### 3.2.6.1. లుంబిని

బుద్ధ భగవానుని జన్మస్థలం లుంబిని. లుంబినీ వనాన్ని సందర్శించిన దాశరథి రంగాచార్య గారు ఆ స్థలగాథను ఈ విధంగా వివరించారు. "మానవ జాతికి 2,500 సంవత్సరాల తరువాత కూడా వసివాడని ప్రేమ – శాంతి సందేశాలను ఆవిష్కరించిన మానవతా మూర్తి జన్మించిన స్థలం దర్శించబోతున్నామనే ఆనంద – ఆవేశాలతో సాగుతున్నారు ... విశాలమైన ప్రాకృతిక పచ్చిక బయలు – అలంకారాలు లేవు. ఖాట్మండు వంటి గులాబి తోట – తిరుగుతున్న లేళ్ళు ఉంటే బావుండేది. ఉన్నది ఒక చెట్టు. పక్కన ఎండుతున్న కొలను ఉంది. ఇక్కడే బుద్ధభగవానుడు జన్మించాడని చాటి చెప్పే సమున్నత అశోక స్థంభం సాక్ష్యంగా నిలిచి వుంది. ఆ భూమికి ప్రణమిల్లి ఆ చెట్టుక్రిందనే కూర్చున్నాం, కథ చెప్పుకున్నాం. శుద్ధోధనుడు కపిలవస్తుకు రాజు. మాయాదేవి అతని రాణి – ఆమె గర్భం దాల్చింది. నెలలు నిండాయి. రాజు ఆమెను ససైన్యంగా దాసదాసీజన సహితంగా పుట్టింటికి పంపాడు. మాయ మహారణ్యం అయిన లుంబిని వనానికి చేరింది. రాణికి పురిటినొప్పులు వచ్చాయి. పరిచారికలు చాటుకుని పట్టు నేపథ్యం ఏర్పరచారు. మాయాదేవి

ఒక చేతితో కొమ్మ పట్టుకుంది. అజ్ఞానాంధకారానికి జ్ఞానభానుడు కాగల బాల భాస్కరుని కన్నది! అతడే గౌతమ బుద్ధ భగవానుడు" (యాత్రా జీవనం, పుట-470).

లుంబినీ వనంలోనే గల కోనేరుకు కూడా ప్రాశస్త్యం ఉంది. మాయా దేవి పురిటి పనులకు, సిద్ధార్థుని మొదటి పురిటి స్నానానికి వాడిన నీళ్ళు ఈ కొలనులోవని చెబుతారు. ప్రస్తుతం ఈ ఆలయం వారసత్వ కట్టడాల్లో ఒకటిగా గుర్తింపబడింది. భారతదేశంలో బుద్ధుని జీవితంలో సంబంధం ఉన్న మరొక ప్రదేశం సారనాథ్.

### 3.2.1.6.2. సారనాథ్

సిద్ధార్థుడు బుద్ధునిగా పరిక్రమం జరిగాక బుద్ధ భగవానునిగా తొలి ఉపదేశం ఇచ్చిన నేల సారనాథ్. తన జ్ఞానోదయ ధర్మ ప్రబోధాన్ని తన ప్రియ శిష్యులైన కౌండిన్య భాష్ప, భద్రిక, మహానమన్, అశ్వజిత్‌లకు బోధించి, వారిని కూడా జ్ఞానులుగా మార్చిన ప్రదేశమే సారనాథ్. దీనిని పూర్వం ఇస్సీ పట్టణంగా వ్యవహరించేవారు. శ్రీలంకకు చెందిన అంబరిక ధర్మపాలుడు మహాబోధి సొసైటీ తరపున దీనిని నిర్మించాడట. 1913 నుండి ఈ విహారాన్ని భక్తుల సందర్శనానికై తెరిచారు. ఈ ఆలయాలలో గోడలపై బుద్ధుని జీవితానికి సంబంధించిన ఘట్టాలెన్నో చిత్రాలుగా వేసి వున్నాయి. 1932-36 ప్రాంతంలో కోసెట్ నోస్ అనే జపనీస్ అనే జపనీస్ చిత్రకారుడు వీటిని చిత్రించాడు. ఈ ఆలయంలోని గర్భగుడిలో బుద్ధుని అస్థికలు, దంతాలను భద్రపరిచారు. ప్రతీ కార్తీక పౌర్ణమి నాడు వాటిని వెలుపలకు తెచ్చి, భక్తుల సందర్శనార్థం ఉంచుతారు. అందుకే ఈ ఆలయాన్ని దర్శించిన దాశరథి గారు ఆలయ విశిష్టతను ఇలా పేర్కొన్నారు. "మానవుని సుఖ జీవనం కోసం గౌతముని అంతగా పరితపించినవారు లేరు. గయలో బోధివృక్షం కింద ఒక తేజోదర్శనం ఇచ్చింది. దుఃఖ తిమిరాలు చెదిరిపోయాయి. గౌతమబుద్ధుడు భగవానుడు అయినాడు. ఆ తేజస్సుతో భగవానుడు సార్నాథ్ చేరారు. భగవానుడు తొలి ఉపదేశం సారనాథ్ లో చేశారు. ధర్మచక్ర ప్రవర్తన కూడా ఇక్కడి నుంచే ప్రారంభించారు. బౌద్ధం మహర్దశలో ఉన్నప్పుడు సార్నాథ్ మహా వైభవంతో వెలిగింది. కాలం-రాజకీయం-స్వయంకృత

అపరాధాలతో బౌద్ధం క్రుంగింది. ఇవాళ సార్నాథ్ ఎడారిగా – శిథిలాలయంలా బావురుమంటున్నది" (యాత్రాజీవనం, పుట-462).

ఎంతో చారిత్రక ప్రాధాన్యం గల ఈ ఆలయంలో ఎన్నో కట్టడాలు శిథిలావస్థలో ఉండటం చూడవచ్చు. అశోకుని చతుర్ముఖ సింహస్తంభం, ధమేఖ స్థూపం, చేఖండి స్థూపం, గంధకుటి నవీన విహారం, జైన మందిరం ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నా సందర్శించదగ్గవి. జైనుల తీర్థంకరుడైన శ్రేయణనాథ్ జన్మస్థలం కూడా ఇదే అయివుంటుందనేది చరిత్రకారుల అభిప్రాయం. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుపుతున్న ఇక్కడి ప్రదర్శనశాలలో తవ్వకాల్లో బయటపడిన సారనాథ్ అవశేషాలు, విలువైన వస్తువులను చూడవచ్చు. సారనాథ్ బుద్ధులకే గాక, అన్యమతస్థులకు పవిత్ర ప్రాంతంగా భావిస్తూ ప్రతియేటా ఇక్కడి పర్యాటకం విస్తరిస్తోందని చెప్పాలి.

### 3.2.1.6.3. బుద్ధగయ

సిద్ధార్థుడు గౌతమ బుద్ధునిగా అవతరించిన నేల బుద్ధగయ. 29వ ఏట సర్వస్వాన్ని పరిత్యజించి, విశ్వమానవ శాంతికై తపించిన కరుణామూర్తి బుద్ధుడు. భారతదేశంలో గల బౌద్ధాలయాల్లో బుద్ధగయది అగ్రస్థానం. దీనినే బోధిగయ అని కూడా అంటారు. ఇక్కడ గల బోధి వృక్షం కిందనే బుద్ధునికి జ్ఞానోదయం కలగటం వలన ఈ ప్రాంతాన్ని బోధిగయ అని కూడా వ్యవహరిస్తారట.

"బోధివృక్షం ఆ కాలం నాటిదే అంటారు గాని యదార్థం కాదనిపిస్తుంది. ఒకవేళ దాని అంటేమో! బౌద్ధమతాన్ని అనుసరించే చైనా, టిబెట్, భూటాన్, జపాన్, థాయ్‌లాండ్ దేశవాసులు నిర్మించిన బౌద్ధాలయాలు ఇచ్చట కన్పిస్తాయి. 1400 ఏళ్ళనాటి మహాబోధి ఆలయాన్ని యునెస్కో ప్రపంచ వారసత్వంగా ప్రకటించింది. చైనా, టిబెట్ భక్తులు బోధి వృక్షచ్ఛాయలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు ... అశోకుడు కట్టించిన రాతి గోడలపై పాళిభాషలో అతని పేరు చెక్కబడింది" (మా యాత్ర – పుట.73).

ఇక్కడ గల ధ్యానముద్రలోని బుద్ధుని విగ్రహం ఎనభై అడుగుల ఎత్తు గలది. అంతేగాక భారతదేశంలోని బుద్ధ విగ్రహాల్లో భారీ అయిన విగ్రహం ఇదే. ప్రధాన మందిరంలో గల బుద్ధుని విగ్రహం బంగారం, వెండి, వజ్ర, వైఢూర్యాలు మరియు మాణిక్యాలతో చెక్కబడి సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తుంది.

### 3.2.1.6.3. వెన్ శూ ఆలయం

పద్నాలుగు వందల ఏళ్ళ చరిత్ర గల బౌద్ధ ఆలయం వెన్ శూ. బోధి సత్త్వుని అవతారమైన 'వెన్ శూ' చైనీయుల దేవత. ఈ బౌద్ధాలయాన్ని వెన్ శూ బౌద్ధారామం లేదా మంజుశ్రీ బౌద్ధారామం అని పిలుస్తారు. చైనాను పాలించిన 'టంగ్' వంశీయుల కాలంలో నిర్మించిన ఈ ఆలయం చైనీయుల పవిత్ర, ఆధ్యాత్మిక కేంద్రం.

"చెంగ్డూ నగరంలో ఉన్న వెన్ శూ దేవాలయాన్ని సందర్శించాను. చైనా భాషలో మంజుశ్రీని (బోధిసత్త్వుడి మరో అవతారం) వెన్ శూ అంటారు. మంజుశ్రీ 'జ్ఞాన దేవత' అవతారమని కూడా వీరు భావిస్తారు. అతిపెద్ద ప్రాంగణంలో ఉన్న ఈ ప్రాచీన బౌద్ధ దేవాలయం ఒక అద్భుత కళాఖండం. తీరికగా చూడాలంటే ఒకరోజు సమయం కూడా సరిపోదేమో. ఇక్కడ అందమైన ధ్యాన మందిరంపై అంతస్తులో అతిపెద్ద సాహిత్య గ్రంథాలయం ఉంది." (సిల్క్ రూట్ లో సాహసయాత్ర, పుట-208 మరియు 209).

చైనాలోని చెంగ్డూ నగరంలో కొలువైన ఈ ఆలయం ప్రకృతి సౌందర్యానికి నిలయంగా చెప్తారు. చైనీయులు తాబేలును పవిత్ర జంతువుగా భావిస్తారు. చైనాలోని అనేక బౌద్ధాలయాల్లో తాబేలు విగ్రహాలు కొలువై వుంటాయి. దానిని తాకితే శుభాలు కలుగుతాయని, ఆయుః ప్రమాణం పెరుగుతుందని చైనీయుల నమ్మకం. ఈ ఆలయంలో కూడా తాబేలు విగ్రహమున్నదట. వెన్ శూ ఆలయంలో అగరవొత్తులు వెలిగించి ఏమి కోరుకున్నా నెరవేరుతుందని భక్తుల నమ్మకం.

### 3.2.1.6.4 లీషాన్

ప్రపంచంలోనే అతి భారీ బుద్ధ విగ్రహం చైనాలోని సిచుఆన్ ప్రావిన్స్ లోని 'లీషాన్' నగరంలో కొలువైంది. మిన్, కింగ్యీ మరియు డాదు అనే మూడు నదుల సంగమస్థానం లీషాన్. దీంతో అలలు పెద్దగా ఎగసిపడి, పడవ ప్రమాదాలు జరిగేవి. దాంతో ఆ నదిలో నీటిదెయ్యం ఉందని, ఆ కారణానే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు భావించేవారు. బుద్ధుడు దెయ్యాన్ని శాంతపరుస్తాడని భావించి, నదుల పక్కనే వున్న పెద్ద కొండపై బుద్ధుని విగ్రహాన్ని చెక్కడం ప్రారంభించారు. ఈ విగ్రహం 233 అడుగుల పొడవుతో, చూసే వారికి ఆనంద, ఆశ్చర్యాలను కలిగిస్తుంది. అంతేకాదు బుద్ధుడి చెయ్యి 30 అడుగుల వెడల్పుతో, చేతి వేళ్ళు 27 అడుగుల పొడవుతో వుంటుందంటే అది ఎంత భారీగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ విగ్రహాన్ని దర్శించిన పరవస్తు లోకేశ్వర్ గారు తన సిల్క్ రూట్ లో సాహసయాత్ర అనే గ్రంథంలో తన అనుభవాలను ఇలా వివరించారు.

"అలా ఎక్కుతూ కొండ చివరి భాగాన ఉన్న తథాగతుడి 'తల' భాగానికి చేరుకున్నాను. రెండు కళ్ళు చాలని ఆనందం అది. అర్ధనిమీలిత నేత్రాలతో, ధ్యానముద్రతో ఉన్న బుద్ధుడి చుట్టూ నిలబడిన మనుషులు అల్పజీవులైన పిపీలికల్లా పాకుతున్నట్లు కనిపించారు. అందుకే దానిని Gaint Buddha of Lee Shan అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద విగ్రహం. మోకాళ్లపై చేతులు ఆనించి కుర్చీలో కూర్చున్న భంగిమలో ఆ శిల్పాన్ని పెద్ద కొండను తొలిచి నిర్మించారు. తలపై నుండి, కింది పాదాల వైపు లోయలోకి తొంగి చూస్తే కళ్ళు తిరిగేటంత లోతు, దానికి తోడు రెండు ఉగ్ర నదుల భీకర సంగమస్థలం. ఆ పవిత్ర పాదాల చెంతన ప్రణామం చేస్తున్నట్లు, తమను తాము అర్పించుకున్నట్లు, ఆ భీకర ప్రవాహాల జలఘోషలను వింటుంటే నదులు కాక రెండు సముద్రాలు సంగమిస్తున్న భ్రమా జనిత భీభత్సరస సుందర దృశ్యం. ఆ కొండను అధిరోహించటం ఎంత కష్టమో, కిందికి పాదాల చెంతకు చేరటం అంతకంటే కనాకష్టం. అక్కడున్న ఇరుకుమెట్లు మీద నుండి సూటికా కిందికి దిగటం ప్రమాదకరం. ఏ మాత్రం కాలు జారినా ఇక అంతే సంగతులు – కింద నదీ ప్రవాహంలో పడి ఆ వెల్లువలో పూచిక

పుల్లలా కొట్టుకుపోవటమో! ఏదైతేనేం నేను బుద్ధదేవుడి దయవలన సురక్షితంగా కిందకు చేరాను. మేరుపర్వతం ముందు మరుగుజ్జులా తలపైకెత్తి చూస్తే మోకాలిపై ఆనించిన అరచేతిలోని ఒక చూపుడువేలే ఆరు అడుగులు ఉంది. ఇక ఈ లెక్కన ఆ 170 మీటర్ల విగ్రహం ఎత్తు ఎలా ఉందో పాఠకుల ఊహాశక్తికే వదిలేస్తున్నాను" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర, పుట-207 మరియు 208).

ఇంతటి భారీ శిల్పి నిర్మాత హాయ్ టొంగ్ (Hai Tong)అనే బౌద్ధ సన్యాసి. క్రీ.శ. 713 వ సంవత్సరంలో ప్రారంభమైన దీని నిర్మాణం 803లో ముగిసింది. 90 సంవత్సరాల కాలం పాటూ ఈ విగ్రహాన్ని నిర్మించటానికి వేలాది మంది కృషిచేశారు. అయితే 1963కంటే ముందే గాలీవానల కారణంగా ఈ విగ్రహం కొంత పాడయింది. ప్రస్తుతం ఇది ప్రపంచ వారసత్వ కట్టడాల్లో గుర్తింపబడి, యునెస్కో వారి నిపుణుల ఆధ్వర్యంలో పరిరక్షణా చర్యలు జరుగుతున్నాయి. చైనాలో ప్రసిద్ధి చెందిన మరొక బౌద్ధాలయం గ్వాన్ యిన్.

## 3.2.1.6.5. గ్వాన్ యిన్ బౌద్ధాలయం

చైనాలోని షంఘైలో గల గ్వాన్ యిన్ ఆలయం ప్రత్యేకమైంది. కారణం ఈ ఆలయంలో బుద్ధుడు స్త్రీ మూర్తిగా దర్శనమివ్వటం. ఈ ఆలయంలో బుద్ధుడు దయాదేవతగా, స్త్రీ రూపంలో ఉండటం విశేషం. 'షంఘై నింగిలో' పేరుతో యాత్రాచరిత్ర రాసిన రచయిత్రి కురుగంటి శ్రీలక్ష్మిగారు ఈ ఆలయ చరిత్రను ఇలా పేర్కొన్నారు.

"చైనీయుల జానపద కథల్లో, బుద్ధుడి మతంలో చేరిన సన్యాసినులకు బుద్ధుడు స్త్రీ రూపంలో దర్శనమిచ్చాడని చెప్తారు. పిల్లలు లేని వాళ్ళకు సంతానమివ్వటం, కారుణ్యం కలిగి ఉండటం స్త్రీ లక్షణాలుగా 'సంగ్' ల పరిపాలనా కాలంలో 1127-1279 ఈ బుద్ధుడు స్త్రీగా రూపుదిద్దుకున్నాడు. ఈ రూపాన్ని 'గ్వాన్ యిన్' అంటారు. దీన్ని వివరించే కథలనేకం (722-481) నాటి రాజు జాంగ్ మూడో కూతురైన మియౌషాన్ చిన్నతనం నుండి శాఖాహారిగా, బుద్ధుడి సూత్రాలు వల్లిస్తూ సన్యాసిగా మారతానంటే తండ్రి కోపంతో ఆత్మహత్య చేసుకోమనటం, కత్తి విసరటం, ఆ కత్తి ఆమెకు తగలకుండా 1000

ముక్కలవటం, తర్వాత రాజు ఆమెను చంపటం, ఆమె ఆత్మ నరకానికి వెళ్ళే వాళ్ళు తిరిగి ఆమెని హాంగ్ జూలోని పటంవో పర్వతాల్లోకి పంపటం, అక్కడ చిన్న కొలనులో తామరపువ్వులా ఆమె నిలిచిపోవటం దీనికి సంబంధించిన కథ" (షంఘై నింగిలో, పుట–63).

అయితే ఆ అమ్మాయి తన తండ్రి జబ్బు పడితే, అతడు మంచివాడు కాకున్నా, తన కాళ్ళు, చేతులిచ్చి జబ్బు నయం కావటానికి మందు చేయించిందట. దాంతో రాజు పశ్చాత్తాపంతో ఆమెను చేతులతో, కాళ్ళతో అందమైన బొమ్మగా తయారు చేయమని ఆజ్ఞాపించాడట. అతడు అందంగా తయారు చేయమన్న చువాన్ యన్ చువాన్ సౌ (quan yan quan shou)అనే మాటలు శిల్పకారులకు మరోల అర్థమై చియన్ యన్ చియన్ సౌ గా (quian yan qian shou)అంటే 1000 కాళ్ళు, 1000 చేతులతో ఈ బొమ్మను తయారుచేశారట. ఈ విగ్రహం నలుదిక్కులను చూస్తున్నట్లుగా కొలువై వుంటుంది. ఈ 'గ్వాన్ యిన్' దేవత అనక చేతులతో, కాళ్ళతో భక్తుల కోరికల్ని నెరవేరుస్తుందని చైనీయుల విశ్వాసం. క్రీస్తుపూర్వం 6వ శతాబ్దంలో ప్రారంభమైన బౌద్ధం చైనా, కొరియా మీదుగా జపాన్ లోకి కూడా ప్రవేశించింది. జపాన్ లో కూడా ఎన్నో ప్రసిద్ధ బౌద్ధారామాలున్నాయి. వాటిలో 'నరో' ఆలయం ఒకటి.

### 3.2.1.6.6. నరో బుద్ధ

జపాన్ లోని నరో పట్టణంలోని డియర్ పార్క్ లేళ్ళకు బాగా ప్రసిద్ధి చెందినది. ఆ పార్క్ లో కొలువైన బుద్ధునికి ఆ బౌద్ధారామానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యముంది. ఆ పార్కులో ఈ ఆరామాన్ని దర్శించిన ముదిగంటి సుజాతారెడ్డిగారు ఆ విశేషాలను ఇలా పేర్కొన్నారు. "ఇక్కడ 'డియర్ పార్క్' లేళ్ళ పార్కు ప్రసిద్ధమైంది. ఆ పార్కులో క్రీ.శ. 8వ శతాబ్దం నాటి బుద్ధుని దేవాలయం వుంది. అభయ హస్తంతో ధ్యాన ముద్రతో కూర్చున్న బుద్ధుని విగ్రహం ప్రసన్న ముఖంతో చాలా బాగుంది. అది చాలా పెద్ద కాంస్య విగ్రహం. ఆ బుద్ధునికి "వైరోచన బుద్ధ" అనే పేరు" (అద్భుత చైనాయాత్ర, పుట–15).

అయితే  జపాన్‌లో కానీ, చైనాలో కానీ నిల్చుని, కూర్చొని, ధ్యానముద్రలో వున్న మహాపరినిర్యాణం చెందుతూ పడుకొని వున్న రకరకాల బుద్ధుని విగ్రహాలను చూశామని, అన్నీ బుద్ధ విగ్రహాల మీద బొట్టు మాత్రం తప్పక కనిపించదంటూ పేర్కొన్నారు.

ఇదే కాక జపాన్ లో ఎన్నో బౌద్ధారామాలు, విహారాలను ప్రభుత్వం కట్టించడమే కాక పరిరక్షణగా చర్యలు కూడా తీసుకుంటుంది. "క్రీ.శ. 8వ శతాబ్దంలో ప్రభుత్వమే బౌద్ధమతాన్ని ప్రోత్సహించి, అనేక ప్రాంతాలలో ఆరామాలు, విహారాల నిర్మాణ వ్యయాలు 50 శాతం భరించింది. నేడు దేశమంతా బౌద్ధారామాలు, విహారాలు కన్పిస్తాయి. ప్రతి ఆలయంలో చక్కటి వాతావరణం, క్రమశిక్షణ, పరిశుభ్రత కనిపిస్తాయి. మన దేశాల్లో లానే అగరొత్తులు వెలిగించటం, రెండు చేతులు జోడించి ప్రార్థించటం, పరీక్షలలో మంచి మార్కులొచ్చినా, వ్యాధులు నయమయినా ఇక్కడకు వచ్చి మొక్కుకోవటం వారి అలవాటు" (జపాన్ ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-71 మరియు 72).

### 3.2.1.7. సమాధులు

మానవుని శాశ్వత నిద్రకు ఆధారమైన స్థలం సమాధి.ఒక జీవి మరణించినప్పుడు వారి జ్ఞాపకార్థం నిర్మించబడిన కట్టడాన్ని సమాధి అంటారు. లేదా శ్మశానంలో శవాన్ని పూడ్చిన చోట నిర్మించడిన కట్టడాన్ని కూడా సమాధి అంటారు. సమాధుల నిర్మాణం వారి వారి సంస్కృతిని, సాంస్కృతిక అంశాలను, ఆచార-సంప్రదాయాలను వెల్లడించే అంశం. మనిషి మరణానంతరం ఆత్మకు మరో జన్మ వుంటుందనుకోవటమే సమాధుల నిర్మాణానికి కారణమై వుండవచ్చు. అందుకే ప్రాచీన ఈజిప్టియన్లు పిరమిడ్లలో చనిపోయినవారి శరీరాలను భద్రపరిచేవారు. అంతేకాక మరొక జన్మలో ఆ మనిషికి కావల్సిన వస్తువులను కూడా శవాలతో పాటుగా పిరమిడ్లతో దాచేవారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన సమాధులు పిరమిడ్లు. ఈజిప్టు, మెసపటోమియా నాగరికతా కాలం నుంచే మనకు సమాధుల నిర్మాణం కన్పిస్తుంది. జపాన్ చక్రవర్తి నిన్ తోకు, సమాధి, చైనా చక్రవర్తి క్విన్‌షి

హాంగ్, ఈజిప్టు రాజు కూఫూల సమాధులు ప్రపంచంలో అతిపెద్ద సమాధులుగా పేరొందాయి. వాటిలో 'కుఫూ' సమాధి గురించి చర్చిద్దాం.

### 3.2.1.7.1. ఈజిప్ట్ పిరమిడులు

మానవ నాగరికత అంకుర స్థాయిలో వున్నప్పుడు, శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం మొగ్గలు తొడగని సమయంలో ఎత్తైన, విశాలమైన అద్భుతమైన కట్టడాలను నిర్మించారు. ప్రాచీన ఈజిప్టియన్లు అవే పిరమిడులు. ఈజిప్టు రాజులను ఫెరోలంటారు. ఫెరోలు తాము జీవించివున్న కాలంలోనే తమకోసం పిరమిడులను నిర్మించుకునేవారు. వారి మరణానంతరం వారి శవాలను'మమ్మీ'లుగా చేసి, వారికి సంబంధించిన సమస్త సంపదలతో, సేవకులతో, వస్తువులతో సహా ఆ పిరమిడులలో పెట్టి కర్మకాండలు చేసి, మూసేసేవాళ్ళు. పిరమిడ్ ల ద్వారం ఎక్కడ ఉందో ఇప్పటికీ అంతుచిక్కని రహస్యం. అంతటి నిర్మాణ కౌశలంతో కట్టిన సమాధులు పిరమిడ్లు. ఈజిప్ట్ మొత్తంలో 114 పిరమిడ్లు ఉన్నాయి. వాటిలో పెద్దది ఘీసా ప్రాంతంలోని 'కఫ్రా'. కఫ్రా అనే ఫెరో తనకోసం తాను నిర్మించుకున్నాడు. పిరమిడ్‌లలోనే అతి పెద్దగా గుర్తింపు పొందుతున్నది కఫ్రా సమాధి.

"ఘీసాలోని పిరముడులు క్రీ.పూ.2700–2500 మధ్యకాలంలో కట్టబడినాయి. మూడు పిరమిడుల్లో 'కఫ్రా' నిర్మించిన పిరమిడ్ చాలా పెద్దది. దాన్ని కట్టడానికి ఇరవై సంవత్సరాలు పట్టాయట. లక్షమంది కూలీలు పనిచేశారట. దానిక్కావల్సిన రాళ్ళను పగులగొట్టి ఒక్క ఆకారంలో చెక్కటానికి పది సంవత్సరాలు, నిర్మాణానికి పది సంవత్సరాలు పట్టాయట. ఇది పదమూడు ఎకరాల స్థలంలో ఆరు మిలియన్ టన్నుల బరువు గల రాళ్ళతో కట్టబడింది. దీని ఎత్తు 480 ఫీట్లు. ఈ పిరమిడును మెట్లుమెట్లుగా కట్టి పైన 'లైమ్ స్టోన్' లను పరిచారు కానీ ఆ పరిచిన రాళ్ళు కొన్నే మిగిలాయి. వందల సంవత్సరాలుగా జనం పిరమిడులపైనున్న రాళ్ళను ఎత్తుకొనిపోయి ఇండ్లను నిర్మించుకున్నారు. కొన్ని కాలం సమ్మెటలలో ఊగిపోయాయి (నైలునదీ నాగరికత, పుట–8)."

జీవించి ఉండగానే తన కోసం తాను పిరమిడును ఏర్పాటు చేసుకున్న మొదటి ఫెరో జోసర్. మరణం తర్వాత కూడా జీవితం కొనసాగుతుందనే నమ్మకం ప్రాచీన ఈజిప్టియన్లలో బాగా నాటుకుని వుండేది. అందుకే వారు చనిపోయిన శరీరాలను మమ్మీలుగా చేసేవారు. రాజులు మరణించాక వారి శరీరాలను ప్రిజర్వ్ చేసుకోవడానికి శరీరంలోని భాగాలను ఒక గుండెను తప్ప అన్నింటినీ తీసేసేవారు. తర్వాత శరీరాన్ని రసాయనాలతో శుభ్రంచేసి నీరు లేకుండా చేసేవారు. తర్వాత శరీరానికి మరికొన్ని రసాయనాలను పూసి, అతి సన్నని బట్టలను చుట్టేవారు. దీనిని 'మమ్మిఫికేషన్' అంటారు. ఈ విధంగా తయారయిన మమ్మీలను శవపేటికల్లో పెట్టి పిరమిడ్లలో కర్మకాండలు చేసేవారు. రాజులు శరీరాలతో పాటు వారు వాడుకున్న వస్తువులు, బంగారం ఆభరణాలు, పానీయాలు, సువాసనా ద్రవ్యాలు, ఆహార పదార్థాలను కూడా ఉంచేవారు. రాజులకు ఇష్టులైన సేవకులను, ప్రియురాళ్ళను కూడా సజీవంగా పిరమిడుల్లో ఉంచేవారట.

"పేదవాళ్ళయితే ఇంత వైభవంగా తమ బంధువులను సాగనంపలేక పోయేవాళ్ళు. కాని వాళ్ళ వాళ్ళ అంతస్తుకు తగినట్లుగా వస్తువులను పెట్టి 'మస్తాబా' సమాధులను కట్టేవాళ్ళు. ఈజిప్టులో మనకు చాలా చోట్ల ఈ ముస్తాబాలు కన్పిస్తాయి. అసలయితే మొదట శవాలను ఇసుకలో తవ్విన పొక్కలో వుంచేసేవారట. అట్లా వుంచినప్పుడు అక్కడి వేడి వాతావరణ వల్ల శవాలు కుళ్ళిపోకుండా వుండేవట. ఎముకల మీద చర్మం, తల మీద వెంట్రుకలు అట్లాగే వుండేవట. ఇటువంటి శవాలను చూసే ప్రాచీన ఈజిప్టియన్లకు మరణం తర్వాత కూడా శరీరం వుంటుంది, జీవితం తర్వాత కూడా మరో జీవితం ఉంటుందనే విశ్వాసాన్ని కలిగించిందని చారిత్రకులు అభిప్రాయపడుతున్నారు. ఘీసాలో వున్న మూడు పిరమిడులు వాటి చుట్టూ విశాలమైన ప్రాంగణం, ఆ ప్రాంగణంలో 'మార్చ్యురీ' అనే కట్టడం, మమ్మీలను తయారు చేసే దేవాలయం, ఇంకా పిరమిడులకు కాపలాగా నిర్మించిన అతిపెద్దదైన 'స్ఫింక్' మిగిలి ఉండి చూపరులను అద్భుతరసంలో ముంచెత్తుతున్నాయి. క్రీ.పూ.ఐదవ శతాబ్దం వాడైన గ్రీకు చరిత్రకారుడు హెరడోటస్ ఈజిప్టును సందర్శించి, అక్కడి పిరమిడులను, దేవాలయాలను చూసి అద్భుతాశ్చర్యాల్లో మునిగిపోయాడట.

హెరడోటస్ కాలంనాటి చాలా నిర్మాణాలు పూర్తిగా నిలవకున్నా ఇప్పటికీ ఎన్నో దేశాల నుంచి వచ్చే సందర్శకులను అవి ఇంకా అద్భుతాశ్చర్యంలో ముంచెత్తుతూనే వున్నాయి" (నైలునదీ నాగరికత–పుట–17).

పిరమిడుల్లో శవాలతో పాటూ వస్తువులను, సేవకులనుమరియు ఆ ఫెరో జీవితాన్ని ప్రతిబింబించే బొమ్మలను, శిల్పాలను కూడా పెట్టేవారు. పురాతత్వ శాస్త్రవేత్తలు జరిపిన తవ్వకాల్లో ఇవన్నీ బయటపడ్డాయి. అంతేకాక వేల సంవత్సరాలు గడిచిపోయినా బొమ్మలకు వేసిన రంగులు, శిల్పాలు అలాగే వుండటం విశేషం. "ఘీసా సమీపంలోనే సక్కారా పిరమిడులు మార్చ్యురీలు శిథిలాలు వున్నాయి. ఘీసాకు దగ్గరగా సక్కారానే కాక, అబుసీర్, దశూర్ అనే చోట్ల కూడా పిరమిడులున్నాయి. ఇప్పటి 'సక్కారా' ప్రాంతంలోనే ప్రాచీన ఈజిప్టు రాజుల ప్రథమ రాజధాని 'మెంఫిస్' వుండేది. ఇక్కడనే మనకు ఈజిప్టు చరిత్రలో నిర్మింపబడిన మొట్టమొదటి పిరమిడ్ ఉంది. దీన్ని ఫాదర్ ఆఫ్ పిరమిడ్స్ అని అంటారు. దాన్ని క్రీ.పూ.2980లో ఈజిప్టును పరిపాలించిన 'జోసర్' అనే 'ఫెరో' తనకోసం నిర్మించుకున్నాడు. అప్పటికి పిరమిడులను అలబస్టర్, గ్రానైట్ రాళ్లతో పైన నున్నగా కన్పించేటట్లుగా కప్పి వేసే పద్ధతి రాలేదు. కాబట్టి ఆ పిరమిడ్ మెట్లు మెట్లుగా ఆరు అంతస్తులుగా కన్పిస్తుంది. ఇది 'మస్తాబా' సమాధి డిజైన్ నుంచి ఎదిగిన మొదటి పిరమిడ్ నిర్మాణం. దీన్ని 'ఇమోతప్' అనే పేరుగల ఆర్కిటెక్ట్ ప్లాన్ చేసి నిర్మించాడట. ప్రాచీనకాలంలో ఈజిప్టులో 'ఆర్కిటెక్ట్'లకు చాలా గౌరవం వుండేది. అతన్ని దివ్యపురుషులుగా భావించేవారట. జోసర్ పిరమిడ్ ఎత్తు 200 ఫీట్లు. 358X410 ఫీట్ల స్థలంలో అది నిర్మించబడింది. అంటే దాని అడుగు భాగం అంత విస్తీర్ణంలో విస్తరించి వుంది. ఈ పిరమిడ్ లోపలకు దిగగానే మనకు జోసర్ మమ్మీని వుంచిన స్థలం ఎదురవుతుంది. పిరమిడ్ లోపల మమ్మీని వుంచిన స్థలం తప్ప వేరే గదులు లేవు. అదే తరువాతికాలంలో పిరమిడుల లోపల అనేక కక్ష్యలు, గోడల మీద చిత్రాలు, శిల్పాలు, చిత్రలిపి అనేకం కన్పిస్తాయి. పిరమిడ్ ద్వారం ఎప్పుడూ ఉత్తరం ధ్రువ నక్షత్రం వైపు ఉంటుంది. ప్రాచీన ఈజిప్టియన్లు ధ్రువనక్షత్రం (పోలార్ స్టార్) ఆత్మ (సోల్) చేరుకునే

గమ్యస్థానంగా విశ్వసించారు. కాబట్టి మమ్మీలను పెట్టే పిరమిడుల ద్వారం ఉత్తరం వైపుగా ఉంటుంది. శరీరంలోని ఆత్మ పడవ ద్వారా పై లోకానికి చేర్చబడుతుందని కూడా వాళ్ళు విశ్వసిస్తారు"(నైలునదీ నాగరికత, పుట-23).

పిరమిడులు క్రిందిభాగం దీర్ఘచతురస్రాకారంలోనూ, పైభాగం మొన తేలినట్లుగా ఉండటం మనం గమనించి వుంటాం. మృతుని ఆత్మ ఈజిప్టియన్ల ఆకాశ దేవత అయిన హోరస్‌ను చేరుకుంటుందనేదానికి ప్రతీకగా సూచిలాగా పిరమిడ్ పై భాగం ఉంటుందని వీరి నమ్మకం. పిరమిడుల లాగే అతి ప్రాచీనమైన సమాధులు రోమ్ లోని కెటామాంబ్స్. శాసనసభా సభ్యులుగా పనిచేసిన మండలి బుద్ధప్రసాద్ గారు ప్రజాప్రతినిధిగా జర్మనీని రోమ్ దేశాలను పర్యటించారు. ఆ క్రమంలో రోమ్ లో ప్రసిద్ధి చెందిన సమాధులైన కెటామాంబ్స్ గురించి ఇలా వివరించారు.

### 3.2.1.7.2 – కెంటామాంబ్స్

కెటామాంబ్స్ లేదా కెటాకాంబ్స్ అనేవి రోమ్ లోని భూగర్భంలో ఉన్న క్రిస్టియన్ సమాధులు. పేరుకు క్రిస్టియన్ సమాధులని వ్యవహరించినా, ఇందులో రోములోగల అన్ని మతాలకు సంబంధించిన మనుషులను సమాధి చేశారట. హిందూ సాంప్రదాయంలో లాగే రోమన్ లు కూడా క్రీ.శ.2వశతాబ్దం వరకూ చనిపోయిన వారిని దహనం చేసి, బూడిదను మట్టికుండలో ఉంచేవారు. అయితే 2వ శతాబ్దం తర్వాత దహనం చేయకుండా ఖననం చేయడం మొదలుపెట్టారు. "రోమ్ లోని దర్శనీయ స్థలాలలో ఒకటి కెటామాంబ్స్. అంటే భూగర్భ సమాధుల సముదాయం. తొలి క్రైస్తవుల సమాధులు ఇవి. రెండు, మూడు శతాబ్దాల నాటివి. కొన్ని ముఖ్యమైన సమాధులు కట్టినప్పటి నుంచి ఇప్పటివరకు యథాతథంగానే ఉన్నాయి. తొలిక్రైస్తవులు శత్రువులు హింసిస్తారని భయపడి తలదాచుకొన్న రహస్య ప్రదేశాలని మొన్న మొన్నటి వరకు అనుకునేవారు. అది తప్పనీ, వారి సమాధులు మాత్రమేనని రుజువైంది" (నా జర్మనీ యానం-పుట-8).

ఈ కెటామాంబ్స్ పై చిత్రించిన చిత్రాల ద్వారా ఆనాటి చిత్రకళ ఎలా వుంటుందో తెలుసుకోవచ్చు. మొదట్లో అందరూ కెటాకాంబ్స్ లో ఖననం చేసేవారు కానీ రాను రానూ దీనికి ప్రాధాన్యత తగ్గి చర్చిల్లో గల శ్మశానంలో ఖననం చేయడం ప్రారంభమైంది. క్రీ.శ.ఆరవ శతాబ్దంలో కెటాకాంబ్స్ లో కేవలం చంపేసిన వారిని పారేసేవారు. అయితే 10వ శతాబ్దం నాటికి వీటిని పూర్తిగా ఉపయోగించడం మానేశారు.

### 3.2.1.7.3 చిత్నా సమాధులు

మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు దుబాయ్‌ను సందర్శించిన క్రమంలో దుబాయ్‌కి సమీపంలో గల 'చిత్నా' అనే ప్రాంత ప్రత్యేకతను ఈ విధంగా వివరించారు.

"ఈ గ్రామంలో రెండున్నరవేల ఏళ్ళ క్రితం నాటి సమాధులని కనుగొన్నారు. ఇక్కడ కాల్చనికి కట్టెలు లభ్యం కావు కాబట్టి శవాలని పాతిపెట్టేవారు. ముస్లిమ్స్ శవాలని ఖననం చేసే ఆచారానికి ఎడారిలో కట్టెలు దొరకకపోవడమే కారణం. శవపేటికని ఉపయోగించడానికి ఇక్కడ కలప దొరకదు. కాబట్టి మరణించిన వారిని నీళ్ళతో కడిగి శవానికి బట్ట చుట్టి అలాగే పాతుతారు. ఎంబాలిమంగ్ కళ ఇక్కడే అభివృద్ధి చెందింది. ఎంబామ్ చేస్తే మూడు లేక నాలుగు రోజులు దాకా శవం చెడిపోదు" (ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్, పుట-41).

ఈజిప్టియన్లు శవాలను మమ్మీఫికేషన్ చేసినట్లుగానే దుబాయ్ లోని చిత్నా గ్రామంలో శవాలను ఎంబామింగ్ చేయడం ఒక కళగా అభివృద్ధి చెందుతోందట. శవాలను రసాయనాలతో ఏండ్ల పాటు శరీరం నశించకుండా చేసే శాస్త్రీయమైన ప్రక్రియే ఎంబామింగ్

### 3.2.1.7.4. డచ్ శ్మశాన వాటిక

భారతదేశంలోని అతిపురాతనమైన క్రైస్తవ శ్మశానవాటిక డచ్ సిమ్మెట్రీ. కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో గల డచ్ సిమిట్రీలోని ఈ సమాధులపై శిలువలు లేకపోవడం

చెప్పుకోవాల్సిన అంశం. గ్రానైట్, లాటరైట్ తో నిర్మింపబడిన ఈ సమాధులు డచ్చివారి భవన నిర్మాణ శైలికి అద్దంపడతాయి.

"డచ్ శ్మశాన వాటికను చూశాం. క్రీ.శ.1724 నుంచీ ఈ శ్మశానంలో మృత శరీరాలను ఖననం చేస్తున్నట్లుగా ప్రవేశ ద్వారపు స్తంభం మీద రాసి వుంది – అక్కడ మొత్తం 104 సమాధులున్నాయి. అవన్నీ డచ్, బ్రిటిషు సైనికులు, సైన్యాధికారులవే. ఆ సమాధుల ఫలకాల (epitaphs)మీది రాతలన్నీ ప్రాచీన డచ్ భాషలో ఉన్నాయి. ఇక్కడ ఖననం చేయబడిన చిట్టచివరి వ్యక్తి 1913లో మరణించిన కెప్టెన్ జోసెఫ్ ఇథెల్ బర్ట్ వాక్లర్ అనే సైనికాధికారి. ఈ శ్మశాన వాటిక ప్రస్తుతం చర్చ్ ఆఫ్ సౌతిండియా (CSI) వారి నిర్వహణలో ఉంది. భారతదేశం మొత్తం మీద అతి పురాతనమైన క్రైస్తవ శ్మశాన వాటి ఇదే" (మా కేరళయాత్ర–పుట–220).

దాదాపు మూడు వందల సంవత్సరాలు క్రితం నిర్మించిన ఈ శ్మశానవాటిక ఒకనాటి డచ్చివారి వలస వాదానికి గుర్తుగా చెప్పవచ్చు. నేడు కేరళను పర్యటించే పర్యాటకులను ఆకర్షించే ప్రధాన సందర్శనా ప్రాంతం ఇది. ఈ సమాధుల్లో చిత్రలిపిలో రాయబడిన శాసనాలు ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ. డచ్ స్మశాన వాటిక లాగే చారిత్రక ప్రాధాన్యం ఉన్న స్మారక కట్టడం జర్మనీలోని హాలో కాస్ట్ మెమోరియల్.

### 3.2.1.7.5. హాలోకాస్ట్ మెమోరియల్

జాతివిద్వేషంలో లక్షలాది మంది యూధులను, రోమన్ లను ఊచకోత కోసిన నియంత హిట్లర్. అతని జాతి విద్వేషానికి నిదర్శనం ఈ హాలోకాస్ట్ మెమోరియల్. జర్మనీ రాజధాని బెర్లిన్ లో నిర్మింపబడిన ఈ స్మారక కట్టడానికి వరల్డ్ హెరిటేజ్ సెంటర్‌ల్లో ఒకటిగా గుర్తింపబడింది. ఈ సమాధుల్లో శవాలు ఉండవు కేవలం రెండవ ప్రపంచ యుద్ధంలో మరణించిన వారి జ్ఞాపకార్థం నిర్మింపబడినది.

"రెండవ ప్రపంచ యుద్ధంలో ఊచకోత కోయబడిన యూదుల స్మారకార్థం జర్మనీ ప్రభుత్వం నిర్మించిన హాలోకాస్ట్ మెమోరియల్ అది. భూమి ఉపరితలానికి సమాన ఎత్తులో

ఆ సిమెంటు దిమ్మల్ని సమాధుల తరహాలో నిర్మించారు. వాటి మధ్య మనుషులు నడిచే దారులు ఉన్నాయి. ఆ ప్రాంతం మొత్తం లోతుగా తవ్వి ఒక్కో సమాధి ఒక్కో ఎత్తులో ఉండేట్లు నిర్మించి మనం లోపలి నుండి బయటికి వచ్చేటప్పుడు ఏటవాలుగా వుంటుంది. ఆ వాలుకి తగ్గ ఎత్తులు భూమి సమానంగా ఈ సిమెంటు దిమ్మలు నిర్మించారు. వాటి మధ్యలోకి వెళితే ఎటు వస్తామో తెలియదు. ఒకప్పుడు బెర్లిన్ లో లక్షాయాభైవేల మంది యూదులు ఉండేవారట. రెండవ ప్రపంచ యుద్ధంలో వారందరినీ హిట్లర్ చంపేసాక మిగలినవారు ఇజ్రాయిల్ కి వెళ్ళిపోయారు. ఇప్పుడు పది వేల మంది కూడా లేరు. యూదులకి సానుభూతిగా ప్రపంచంలో మరికొన్ని దేశాలల్లో ఇలాంటి హోలోకాస్ట్ మెమోరియల్ నిర్మించారు.” (మా ఐరోపాయాత్ర-పుట-61).

ఏప్రిల్ 1, 2003లో ప్రారంభమైన ఈ నిర్మాణం డిసెంబరు 15, 2004లో ముగిసింది. సరిగ్గా రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన అరవై ఏళ్ళకి ఈ Holocaust memorial ప్రారంభోత్సవం జరిగింది. దీనిని నిర్మించడానికి అయిన ఖర్చు సుమారు 25 మిలియన్ డాలర్లు. 4.7 ఎకరాల విస్తీర్ణంలో నిర్మింపబడిన ఈ మెమోరియల్‌లో 2711 సమాధులున్నాయి. నాడు ప్రసిద్ధ భవన నిర్మాణ నిపుణులుగా (Architect)పేరుగాంచిన Peter Eisenman మరియు ఇంజనీర్ BuroHappoldల మేధస్సు నుంచి వచ్చిన విశిష్ట కట్టడం హాలోకాస్ట్ మెమోరియల్ జర్మనీలోని హాలోకాస్ట్ సమాధులలాగే ప్రసిద్ధి చెందిన మరొక కట్టడం అమీర్ తైమూర్ సమాధి.

## 3.2.1.7.6. గోరి అమీర్

పర్షియన్-మంగోలియన్ నిర్మాణ శైలికి ప్రతీక అమీర్ తైమూర్ సమాధి. హుమయూన్ సమాధి, తాజమహల్ వంటి అద్భుత కట్టడాలకు ప్రేరణ అమీర్ తైమూర్ సమాధి. ఉజ్బెకిస్తాన్ లోని సమర్‌ఖండ్ లో గల ఈ ప్రదేశం ప్రముఖ పర్యాటకప్రాంతం. గ్రీకువీరుడు ఆలెగ్జాండర్ లా ప్రపంచాన్ని జయించాలని కలలు కన్న మంగలియన్ వీరుడు అమీర్ తైమూర్.

తన నలభై సంవత్సరాల వయస్సులో ఇరాన్, ఇరాక్, టర్కీ, రష్యాను మరియు భారతదేశాన్ని కూడా దండెత్తి దోచుకున్నాడు. 1405వ సంవత్సరంలో చైనాపై దండయాత్రకై వెళ్తూ మార్గ మధ్యలో కజకిస్థాన్ లో విపరీతమైన చలి వల్ల న్యుమోనియాతో మృతిచెందాడు. అతని శరీరాన్ని ఉజ్బెకిస్థాన్ లోని సమర్ ఖండ్ లో ఖననం చేశారు. అదే గోర్-ఈ-అమీర్. ఈ గోర్-ఈ-అమీర్ ప్రాంగణంలోనే అతని కొడుకులు, మనుమళ్ళ సమాధులు కూడా పూర్తి ఇస్లామిక్ శైలిలో నిర్మింపబడి ఉన్నాయి. అమీర్ తైమూర్ సమాధి గురించి ఒక కథ గాని కథ ప్రచారంలో ఉందంటూ ఈ సమాధిని దర్శించిన లోకేశ్వర్ గారు ఇలా పేర్కొన్నారు.

"అన్ని సమాధుల మధ్య తైమూరు సమాధి ప్రత్యేకంగా కనబడాలని దానిపై నాణ్యమైన ఆకుపచ్చ శిలాఫలకాన్ని అతికించారు. అది చాలా అపురూపమైన శిలాఫలకం (Jade stone). ఇస్లాం మతంలో ఆకుపచ్చ రంగు అతి పవిత్రమని మనకు తెలిసిన సత్యమే. ఆ సమాధి క్రింద ఒక కఠినమైన హెచ్చరిక కూడా లిఖించబడి ఉంది. ఎవరైనా ఈ సమాధిని ఏ ఉద్దేశ్యంతోనైనా ఏ మాత్రం ధ్వంసం చేసినా పెళ్ళగించినా వారు తనకున్న బలమైన శత్రువు చేతిలో నాశనమవుతారని హెచ్చరించబడి ఉంది. 1740లో పర్షియా రాజుల నాదిర్షా సమర్ ఖండ్ పై దాడి చేసింది చాలక మోజుతో ఆ శిలాఫలకాన్ని పెళ్ళగించి తన రాజధానికి పట్టుకెళ్ళాడు. ఇతను మన దేశంపై కూడా దాడి చేసి ఢిల్లీలోని బంగారు నెమలి సింహాసనాన్ని, కోహినూరు వజ్రాన్ని తన దేశానికి తరలించిన సంగతి మనకు తెలిసిందే. అయితే ఒకరోజు అతను పట్టుకెళ్ళిన ఆకుపచ్చ శిలాఫలకం పొరపాటున క్రిందపడి రెండు ముక్కలయ్యింది. అదేరోజు అతని కొడుకుకు ప్రాణాంతకమైన జబ్బు చేసింది. అతను ఇక బ్రతకడు అని హకీములు తేల్చేశారు. కానీ ఇస్లాం మతపెద్దలయిన ముల్లాలు మాత్రం ఆ శిలాఫలకాన్ని తిరిగి సమర్ ఖండ్ కు పంపినట్లయితే యువరాజు బ్రతుకుతాడని జోస్యం చెప్పారు. నాదిర్షా వారి మాట విని దాన్ని వాపసు పంపగానే అతని కొడుకు మృత్యుశయ్య నుండి లేచి కూచున్నాడట" (సిల్క్ రూట్ లో సాహసయాత్ర, పుట-20 మరియు 21).

అంతేగాక ఆధునికకాలంలో కూడా ఇలాంటి ఘటనే మరొకటి జరిగిందని రచయిత వివరించారు. 1941లో స్టాలిన్ ఆదేశాల మేరకు ప్రముఖ రష్యన్ ఆంత్రోపాలజిస్టు మైకేల్ గెరాసిమోవ్ పరిశోధన కోసం అమిర్ తైమూర్ సమాధిని తవ్వారట. ఆ పరిశోధనలో తైమూర్ చాలా పొడవైనవాడని, అతని కుడికాలు, కుడి చేయి అవిటివని తేల్చాడట. చరిత్ర ప్రకారం అది నిజమేనట. తైమూర్ తన 25వ ఏట ఒక యుద్ధంలో గాయపడి అవిటివాడైనాడు. అయితే ఆ సమాధిపై రాసినట్లుగానే ఆ సమాధిని తవ్విన మరుసటిరోజే హిట్లర్ రష్యా మీద దండెత్తాడని, ఇలా తైమూర్ బ్రతికున్నప్పుడేగాక, చనిపోయి కూడా తన శత్రువులను భయపెడుతున్నాడని రచయిత పేర్కొన్నారు. రచయిత సిల్క్ రూట్ లో పర్యటించిన సందర్భంలో తైమూర్ సమాధితో పాటూ ఉగైర్ జానపద సంగీత సరస్వతి అమనిషాన్ సమాధిని మరియు చైనాను పాలించిన 'కిన్ షీహాంగ్' చక్రవర్తి సమాధిని కూడా సందర్శించి,వాటి విశిష్టతలను కూడా తన 'సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర' అనే గ్రంథంలో వివరించారు.

### 3.2.1.8. వస్తు ప్రదర్శన శాలలు (మ్యూజియమ్స్)

చరిత్రలో చెప్పబడిన సంఘటనలు వాస్తవమే అయినా, అవన్నీ జరిగినా, ప్రస్తుతం ఆ చరిత్రకు భౌతిక రూపం లేదు. ఆనాటి చరిత్రకు సాక్ష్యాలుగా వున్న భౌతిక వస్తువులను మన కళ్ళముందుంచేవి ప్రదర్శనశాలలు. వీటిలో ప్రదర్శించబడిన వస్తువుల ద్వారా ఒక కాలం నాటి చరిత్ర మరియు సంస్కృతి అవగతమవుతుంది. ప్రపంచంలో ప్రాచుర్యం చెందిన ఎన్నో ప్రదర్శనశాలలు వున్నాయి. వాటిలో ముందుగా చెప్పుకోవల్సినది చైనాలోని టెర్రకోటా సైనికుల మ్యూజియం.

### 3.2.1.8.1. టెర్ర కోటా సైనికుల మ్యూజియం

మొదటి చైనా చక్రవర్తి కిన్ షీ హంగ్ కళాత్మక దృష్టికి నిదర్శనం ఈ మ్యూజియం. చైనీయులు మరణం తర్వాత కూడా జీవితం ఉంటుందని బలంగా విశ్వసిస్తారు. అందుకే పరలోకంలో కూడా తన పరిపాలన కొనసాగాలన్న కోరికతో 'కిన్ షీ హంగ్' చక్రవర్తి సైనికలు మ్యూజియంను నిర్మించినట్లు పురావస్తు శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. సైనికులు, యోధులు, గుర్రాలు మొదలైన రాచరిక ప్రభుత్వాల్లో వుండే సైనిక దళాల ప్రతిమలన్నీ సహజమైన ఆకారాలలో ఇక్కడ కొలువై ఉన్నాయి. లోకేశ్వర్ ఈ క్రింది విధంగా పేర్కొన్నారు.

"ఆ మ్యూజియం పూర్తిగా సమాయత్తమైన ఒక యుద్ధ రంగ దృశ్యాన్ని తలపింప చేస్తుంది. అన్ని వేల మంది సైనికులలో ఓ ఒక్కరి ముఖం ఇంకొకరి ముఖంతో పోలికలు లేకుండా పూర్తిగా విభిన్నంగా ఉండటమే వాటి ప్రత్యేకత. ముఖకవళికలలోనే గాక శిరోజాల అలకరణలతో కూడా ఆ విభిన్నత్వాన్ని గమనించవచ్చును. సైనికుల పాదాలకున్న బూట్ల లేసులు కూడా స్పష్టంగా కనపడేలా ఉండటం ఆ కళాకారుల సృజనాత్మకతకు ఒక నిదర్శనం ఆ మ్యూజియం మూడు విభాగాలుగా అనగా PITS రూపంలో ఉంటాయి. పిట్ అనగా లోతుగా, వెడల్పుగా, విశాలంగా, చతురస్రాకారంలో తవ్వబడిన గుంత. వీటిని రివర్స్ అనగా 3,2,1 గా సందర్శిస్తే సులభంగా అర్థమవుతుంది. పిట్ నంబరు మూడులో 72మంది ముఖ్య సైనికాధికారులు, గుర్రాలు ఉన్నాయి. ఇది ఆ సైన్యానికి సంబంధించిన ముఖ్యవిభాగం లేదా అగ్రభాగం. ఇందులోనే ఉత్తరభాగంలో యుద్ధానికి బయలుదేరే ముందు మతపరమైన పూజలు, తంతులు, బలులు జరిగినట్లు సాక్ష్యాధారాలు ఉన్నాయి. పిట్ నెంబరు రెండులో ఇంకా తవ్వకాలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతానికి 1700 మంది యోధులు, గుర్రాలు అక్కడ కొలువుతీరి ఉన్నాయి. ఇక్కడ వంగి బాణం వేస్తున్న విలుకాడు, నిలబడి బాణాలు వేస్తున్న యోధుడు, గుర్రం మీద ఉన్న రౌతు, ఒక సైనికాధికారి అతని సేవకుడు ముందు వరుసలో కనబడుతున్నారు. వారి హావభావాలన్నీ స్పష్టంగా, సహజంగా ఉన్నాయి. ఇక ఆఖరిదైన ఒకటవ నెంబరు పిట్ చాలా పెద్దది. అదొక ఆట స్థలమంత

విశాలంగా ఉంది. ఇక్కడి తవ్వకాలలో ఆరువేల మంది సైనికులు ఇవతలబడగా అందులో కేవలం రెండువేల మందిని మాత్రమే ప్రదర్శనలో పెట్టారు. వారంతా యుద్ధరంగానికి కదం తొక్కుతున్న సైనిక పటాలం. ముందు విలుకాండ్ర దళం వారి వెనుక పదాతి దళం. వారి చేతులలో కత్తులలు, గొడ్డళ్ళు, బల్లాలు ఇంకా రకరకాల ఆయుధాలు. ఆ పదాతి దళం వెనుక 35 రథాలు. అన్నీ చెక్కతో చేసినవే. ఆ రథాలపై నగిషీలు, నాణ్యమైన పనితనం చెప్పతరం కాదు" (సిల్క్ రూట్ లో సాహసయాత్ర, పుట-215).

ప్రాచీన చైనా చరిత్రకు అద్దం పట్టే ఈ బొమ్మలు చైనాలోని షియాన్ 1974లో ఒక రైతు పొలంలో బావిని త్రవ్వే క్రమంలో బయల్పడ్డాయి. చైనా ప్రభుత్వం ఈ టెరకోటా సైనికుల బొమ్మలు బయల్పడిన చోటే ఈ మ్యూజియంను నిర్వహిస్తుంది.

## 3.2.1.8.2. ఐన్‌స్టీన్ మ్యూజియం

వైజ్ఞానిక లోకంలో అగ్రగామిగా వెలుగొందిన ఐన్‌స్టీన్ స్మారకార్థం నిర్వహించిన మ్యూజియం ఇది. ఐన్ స్టీన్ సాపేక్ష సిద్ధాంతాన్ని కనుగొని నూరేళ్ళు పూర్తయిన సందర్భంలో జర్మనీ ప్రభుత్వం ఈ మ్యూజియంను ఏర్పాటు చేసింది. ఐన్‌స్టీన్ సమగ్ర జీవితాన్ని ప్రతిబింబించే మ్యూజియమిది. 1917లో బయాలజీ ఆఫ్ వార్ పేరుతో ఈయన రాసిన గ్రంథం ఎంతో ప్రఖ్యాతిని ఆర్జించింది. మొదటి ప్రపంచ యుద్ధం జరిగిన మారణకాండకు దుఃఖితుడై రాసిన పుస్తకమిది. శాస్త్రీయమైన ప్రదర్శనా కేంద్రంగా ఈ మ్యూజియంగా నిర్వచించవచ్చు. మండలి బుద్ధ ప్రసాద్ గారు తన 'నా జర్మనీ యానం' అనే యాత్రాగ్రంథంలో ఈ మ్యూజియం విశేషాలను ఇలా పేర్కొన్నారు.

"19వ శతాబ్దానికి చెందిన ఒక 'దిక్సూచి' ఈ మ్యూజియంలో ప్రత్యేక ఆకర్షణ. నాలుగు, ఐదేళ్ళ వయస్సులో ఐన్‌స్టీన్‌కి తండ్రి ఇచ్చిన బహుమతి అది. దిక్సూచి ముల్లు ఎందుకు కదులుతుందా అని ఐన్‌స్టీన్ చాలా కుతూహలంగా పరికించేవాడట. ఆ జిజ్ఞాస, అన్వేషణను ఆయన జీవితాంతం కొనసాగించి ఇప్పుడు ప్రపంచానికే దిక్సూచి అయ్యాడనిపించింది. తర్వాత పదహారేళ్ళ వయస్సులో అంటే 1985లో ఐన్‌స్టీన్ రాసిన

వ్యాస ప్రతిని చూశాం. ఈ విశ్వంలో అంతర్బహిశ్చ స్థితిస్థాపకత గల ఒక పదార్థం వ్యాపించి వుందని, దానిని వైజ్ఞానిక లోకంలో పెద్ద దుమారం లేపిన వ్యాసమిది. 1905లో జూరిచ్ లో పరమాణువుల (మాలిక్యూల్స్) కొలతలు ఎలా ఉంటాయో ఐన్‌స్టీన్ నిర్ధారించినప్పటి విశేషాలు కూడా మ్యూజియంలో దర్శనమిచ్చాయి" (నా జర్మనీ యానం, పుట-41).

ఐన్‌స్టీన్ కు సంగీతమంటే మక్కువ ఎక్కువ. ప్రసిద్ధ సంగీత విద్వాంసుడు బెతోవిన్ సర్వాలకు భౌతికశాస్త్ర పరంగా వ్యాఖ్యానం చేసిన నాటి విశేషాలు కూడా ఈ మ్యూజియంలో కనిపిస్తాయి. రవీంద్రనాథ్ టాగూర్ తో కలిసి తీయించుకున్న ఫోటోలు, తన తల్లికి, ప్రియురాళ్లకు రాసిన లేఖలు, భార్యకిచ్చిన విడాకుల పత్రం కూడా ప్రదర్శనలో ఉంచారు. సాధారణంగా మహనీయులైన వాళ్ళ జీవితానికి సంబంధించి మంచి విషయాలను మాత్రమే ప్రదర్శనకు పెడుతుంటారు. వాళ్ళ వైఫల్యాలను బహిర్గతం చేయరు. కానీ ఐన్‌స్టీన్ మ్యూజియం మాత్రం ఆయన జీవితంలో ఏ కోణాన్నీ దాచకుండా బహిరంగపరిచింది. కన్నతల్లి పట్ల ఐన్‌స్టీన్ చూపించిన ప్రేమాభిమానాలు అలాగే తన పిల్లల పైన ఆయన చూపిన వాత్సల్యాన్ని ఆయన రాసిన లేఖలో చూస్తాము. అలాగే ఆయన శృంగార జీవితాన్ని, కుటుంబజీవితాన్ని తెలిపే విశేషాలు కూడా ఎన్నో ఉన్నాయని మండలి బుద్ధ ప్రసాద్ గారు పేర్కొన్నారు.

గురత్వాకర్షణ శక్తి, చలన సిద్ధాంతం, అయస్కాంత క్షేత్రం, కాంతి స్వరూప స్వభావాలు, వేగం, భూమి, ఆకారం మొదలైనవి అనేక విషయాలు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనశాలను చూసిన వారికి అవగతమవుతాయి. ఈ మ్యూజియంలో ఐన్‌స్టీన్ చిత్రపటాలు ఉంటే అతని మైనపు విగ్రహం లండన్ లోని టుస్సాడ్స్ మ్యూజియంలో చూడవచ్చు.

### 3.2.1.8.3. మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం:-

సాధారణంగా మ్యూజియం అంటే వస్తు ప్రదర్శనశాల. కానీ టుస్సాడ్స్ మ్యూజియంలో వస్తువులనే కాక చారిత్రక ప్రాధాన్యం ఉన్న మరియు అనేక రంగాలలో ప్రసిద్ధిచెందిన వ్యక్తుల మైనపు బొమ్మలను ప్రదర్శనకు ఉంచడం దీని ప్రత్యేకత. అందుకే మేడం టుస్సాడ్స్ మ్యూజియం ప్రపంచంలోని అన్ని మ్యూజియములకంటే భిన్నమైంది. ఈ మ్యూజియం ప్రసిద్ధి చెందటానికి కారణం అక్కడ ప్రదర్శనకి ఉంచిన విగ్రహాలు, విగ్రహాలుగా కాకుండా సజీవ మూర్తులుగా గోచరించడమే 18వ శతాబ్దానికి చెందిన మేడం టుస్సాడ్స్ చే నిర్మించబడిన ఈ ప్రదర్శనాల శాఖలు లండన్ లోనే కాక ప్రపంచంలోని మరికొన్ని నగరాలలో కూడా విస్తరించాయి.

"మేడం టుస్సాడ్స్ ఈ మ్యూజియం సృష్టికర్త. ఈమె ఫ్రాన్స్‌లో జన్మించి స్విట్జర్లాండ్‌లోని బెర్న్ పట్టణంలో డాక్టర్ ఫిలిప్స్, ఫిజీషియన్ దగ్గర ఉద్యోగం చేస్తూ అతని ద్వారా మైనంతో ప్రముఖుల బొమ్మలను తయారు చేసే కళను నేర్చుకున్నది. 1777లో మొదటిసారి తను స్వంతంగా ఫ్రెంచి తత్వవేత్త వోల్టేర్ విగ్రహాన్ని రూపొందించింది. తర్వాత రూసో, బెంజిమన్ ఫ్రాంక్లిన్ విగ్రహాలతో పేరు, ప్రఖ్యాతులు ప్రారంభమయినాయి. 1779 ఫ్రెంచి విప్లవకాలంలో 'గెలిటిన్' యంత్రం ద్వారా శిరచ్ఛేదనాలు జరుగుతున్నప్పుడు ప్రముఖ విప్లవకారుల తలలను తనే ప్రత్యక్షంగా సేకరించి ఆ ఖండిత శిరస్సుల రూపురేఖలు మారక ముందే వారి ఎదవరకు [Bust Size] విగ్రహాలను తయారుచేసేది. విప్లవకారులు ఆ చిత్రాలను తమ పతాకాలపై పునర్ముద్రించి ప్యారిస్ నగర వీధులలో ఊరేగింపులు తీసి ప్రజలను చైతన్య పరిచేరవారు. 1794లో డాక్టర్ ఫిలిప్స్ మరణించగానే మేడం టుసాడ్ అప్పటివరకు సిద్ధం చేయబడిన అన్ని విగ్రహాల సేకరణతో, వాటి ప్రదర్శనలతో కొన్ని సంవత్సరాల పాటు యూరపు అంతటా పర్యటించింది. చివరికి 1802లో లండన్‌లో ప్రదర్శనలు ప్రారంభించింది. ఈ సారి ప్రత్యేకంగా విగ్రహాలే గాక House of Horrors ను కూడా నిర్మించింది.

1835లో మ్యూజియం మొదలయ్యింది. ఫ్రెంచి విప్లవ కాలంలో ఖండించిన శిరస్సులనే గాక భయంకర చిత్రహింసలను కూడా ఆ House of Horrorsలో కళ్ళకు కట్టేటట్టు, భయం గొలిపేటట్లు చూపెట్టేవారికి ప్రేక్షకులు తండోపతండాలుగా రాసాగారు"(కలల దారులలో యూరపు యాత్ర, పుట-119 మరియు 120).

ఈ మ్యూజియంలో సినీతారల విగ్రహాలే కాకుండా రచయితలు, దేశప్రధానులు, శాస్త్రవేత్తలు, క్రీడాకారులు, చిత్రకారులు మొదలైన విగ్రహాలు ప్రదర్శనకు ఉంచారు. అమితాబ్ బచ్చన్, ఐశ్వర్యరాయ్, మాధురీదీక్షిత్, అనిల్ కపూర్, హృతిక్ రోషన్, అబ్రహాం లింకన్, మోదీ, బరాక్ ఒబామా, వ్లాదిమిర్ పుతిన్, ఐన్‌స్టీన్, Elizebeth-2, మతాధిపతులు అయిన దలైలామా, పోప్ జాన్‌పాల్-II, పికాసో మొదలైనటువంటి గొప్ప వ్యక్తుల మైనపు బొమ్మలు ఉన్నాయి. ఇటీవల బాహుబలి చిత్ర హీరో ప్రభాస్ బొమ్మని కూడా ప్రదర్శించదలిచారు. ఈ మ్యూజియంలో అత్యంత వివాదాస్పదమైన విగ్రహం హిట్లర్‌ది. జాతి వివక్షతో మారణకాండను జరిపిన అతని విగ్రహం అక్కడ ఉండరాదని నిరసనలు పెల్లుబికాయి. అందువల్ల ఆ విగ్రహానికి భారీ ఎత్తున భద్రతను ఏర్పాటుచేశారు.

టుస్సాడ్స్ మైనపు బొమ్మలకి ప్రసిద్ధి చెందితే రోమ్‌లోని కాపిటోలినె మ్యూజియం శిల్పాలకు నెలవు.

### 3.2.1.8.4. కాపిటొలినె మ్యూజియం

అతి పురాతనమైన రోమన్ శిల్పాలకు, శాసనాలకు, కళాకృతులకు నెలవు కాపిటొలినె మ్యూజియం. రోమ్ లోని కాంపిడాగ్గియోలో గల ఈ మ్యూజియంలో అతిప్రాచీన కళాఖండాలెన్నో కొలువు తీరి ఉన్నాయి. కాపిటొలినె మ్యూజియం లోపల కూడా అనేక ఆర్టు మరియు పురావస్తు ప్రదర్శనశాలలు నిర్మింపబడి వుండటం దీని ప్రత్యేకత. ప్రజలు సందర్శించే అతిపురాతన మ్యూజియంగా ప్రసిద్ధికెక్కిన ఈ కట్టడం 1471వ సంవత్సరంలో నిర్మింపబడింది. భారతదేశానికి ప్రజాప్రతినిధిగా రోమ్ నగరాన్ని

సందర్శించిన సందర్భంలో మండలి బుద్ధప్రసాద్ గారు కాపిటొలినె మ్యూజియం విశేషాలను ఇలా వివరించారు.

"1471లో నాల్గవ సిస్టస్ చక్రవర్తి కాపిడోగ్లియోలో ఒక మ్యూజియం నిర్మించాడు. అందులో గ్రీక్, రోమన్ శిల్పాలు కనిపిస్తాయి. అత్యంత ఆకర్షణీయమైన శిల్పం అపోలో దేవత బాణం సంధిస్తున్నట్లు వుంటుంది. అయిదవ శతాబ్దం నాటిది ఆ శిల్పం. ఒకటవ శతాబ్దం విలాస్యలియా జాతీయ ప్రదర్శన శాల మరొక అద్భుతం. 16వ శతాబ్దం నాటిది. రెండవ జూలియస్ చక్రవర్తి జ్ఞాపకార్థం వినోలా నిర్మించాడు. పూర్వ రోమన్ యుగం నాటి పురావస్తు శిథిలాలు భద్రంగా ఉన్నాయి. క్రీస్తుకు పూర్వం ఆరవ శతాబ్దం నాటి దంపతుల అస్థిపంజరం ఉంది. మట్టితో భద్రపర్చారు. రోమ్‌లో ప్రతి ప్రదర్శనశాల అత్యంత అద్భుత సౌందర్యభరితమైన శిల్పాల సంపుటి. అన్నింటిని చూడాలంటే చాలా నెలలు పడుతుంది" (నా జర్మనీ యానం – 2006).

రోమన్లు తమ ప్రాచీన, సాంస్కృతిక, కళా వారసత్వాన్ని రక్షించుకోవడంలో ఎప్పుడూ ముందుంటారు. అందుకే రోమ్ ప్రాచీన కళాఖండాలకు, సాంస్కృతిక వారసత్వ సంపదకు ఆలవాలంగా ఉన్నది. రోమ్ లో ఉన్నన్ని మ్యూజియమ్స్ ప్రపంచంలో మరెక్కడా లేవు.

### 3.2.1.8.5. నేపియర్ మ్యూజియం

అద్భుత భవన నిర్మాణ నిపుణుడిగా పేరొందిన రాబర్ట్ చిషోం (Robert Chisholm) నిర్మాణ సారధ్యాన్ని వహించిన మ్యూజియం, నేపియర్ మ్యూజియం. మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజీ, మెరీనా డ్రైవ్, సెనేట్ హౌస్ లను నిర్మించిన చిషోం ఈ మ్యూజియంను అత్యంత అధునాతనంగా నిర్మించాడు. గోథిక్ మరియు స్థానిక మళయాళీల భవన నిర్మాణ శైలికి ఈ కట్టడం అద్దం పడుతుంది. దీన్ని ప్రభుత్వ ఆర్ట్స్ మరియు క్రాఫ్ట్స్ మ్యూజియంగా కూడా పిలుస్తారు.

"ప్రభుత్వ ఆర్ట్స్ మరియు క్రాఫ్ట్స్ మ్యూజియం (నేపియర్ మ్యూజియం) లో పలు చారిత్రక కళారూపాలు, అద్భుతమైన పనితీరుతో ఆకట్టుకునే పలు బంగారు ఆభరణాలు, రాతి శిల్పాలు, కంచు విగ్రహాలు మాకు బాగా నచ్చాయి. ఇక్కడ ప్రదర్శనకు ఉంచబడిన ఒక దేవస్థానపు ప్రాచీన రథం, దంతంతో చేసిన పలు అద్భుతమైన కళా రూపాలు మాకు సంభ్రమాశ్చర్యాలు కలిగించాయి. ఇక్కడ ప్రదర్శించిన ప్రతి వస్తువూ తిరువితాంకూర్ సంస్థానంలో తయారైనదే కావడం మరో విశేషం" (మా కేరళ యాత్ర, పుట-96).

మద్రాసు రాష్ట్రానికి గవర్నర్‌గా, భారతదేశానికి వైస్రాయ్‌గా పనిచేసిన లార్డ్ ఫ్రాన్సిస్ నేపియర్ పేరిట నెలకొన్న మ్యూజియం ఇది. 1855లో నిర్మింపబడిన ఈ మ్యూజియం ను పడగొట్టి, 1874లో దాని స్థానంలో సరికొత్త భవనాన్ని మ్యూజియం కోసం నిర్మించారు. అదే ప్రస్తుతం మనం చూస్తున్న నేపియర్ మ్యూజియం. 1880లో నిర్మాణం పూర్తయిన ఈ మ్యూజియం కేరళ పర్యాటకులను ఆకర్షిస్తున్నది. అంతేగాక తిరువనంతపురం నగరానికి చిహ్నంగా మారిందని చెప్పవచ్చు.

ఇలా ఎన్నో ప్రాచీన కళాఖండాలకు, శిల్పాలకు, చారిత్రక సంపదకు రక్షణ కవచాలుగా ఉన్నవి మ్యూజియమ్స్. ఒకనాటి చరిత్రను వెల్లడించే ఈ మ్యూజియమ్స్ గురించిన విశేషాలను అతి తక్కువ మంది యాత్రారచయితలు తమ యాత్రాగ్రంథంలో అక్షరీకరించారు. వారికి చరిత్రపైన, పురావస్తు అంశాలపైన ఆసక్తి లేకపోవటమే దానికి కారణం అయివుంటుంది.

### 3.2.1.9. స్టేడియం

వివిధ క్రీడల్ని, క్రీడా పోటీల్ని నిర్వహించేందుకు నిర్మించబడిన కట్టడాలు క్రీడా మైదానాలు. ఇవి ఆధునిక కాల నిర్మాణాలని భావిస్తుంటారు. కానీ క్రీస్తుపూర్వమే వీటిని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలెన్నో లభ్యమవుతున్నాయి. ఆ కాలంలోనే మల్లయుద్ధాలు, గుర్రప్పందాలు, పరుగు పందాలు, సామూహిక ఉత్సవాలు, జాతర్లు, సంగీత కచేరీలు,

నాటక ప్రదర్శనలకై పెద్ద పెద్ద మైదానాలను నిర్మించారు. చరిత్రను ప్రతిబింబించే దర్పణాల్లో స్టేడియమ్స్ కూడా ఒకటని ఈ క్రింద పొందుపర్చబడిన యాత్రాచరిత్రల వలన తెలుస్తోంది.

### 3.2.1.9.1. గ్లాడియేటర్స్ కలోజియం

ప్రాచీన రోమ్ నగరంలోని క్రీడా మైదానం కలోజియం. దీని అసలు పేరు ఫ్లావియన్ ఆంఫిధియేటర్. క్రీ.పూ. ఒకటవ శతాబ్దం నాటికే అతిశక్తివంతమైన రాజ్యంగా పేరొందిన రోమ్ లో నిర్మింపబడిన ఓపెన్ ఎయిర్ థియోటర్ ఇది. "మనం ఇప్పుడు చూస్తున్న ఫుట్ బాల్ స్టేడియం మాదిరిగా రెండు అంతస్తులతో, అనేక గదులతో నేలమాళిగలతో గుండ్రంగా ఉంటుంది. ఆ రోజులలో డెబ్బై వేలమంది ప్రేక్షకులు కూర్చునేవారు. ఆ నాటి రాజులు, రాణులు, ధనికులు, భూస్వాముల క్రూరమైన వినోదాలకు ఇది వేదికగా ఉండేది. గాలి, వెలుతురు లేని ఆ నేలమాళిగలో ఒకవైపు సింహాలు, పులులు మరోవైపు యుద్ధఖైదీలు, బానిసలు, బందీలుగా ఉండేవారు. రాజులు, రాణులు తమ కాలక్షేపం, వినోదం కోసం కలోజియం మధ్యలో ఉండే విశాలమైన రంగస్థలంలో ఇద్దరు బానిస మల్లయోధులు (గ్లాడియేటర్స్) మధ్య పోటీ జరిపించేవారు. ఒకరి చేతిలో పెద్ద కత్తి, మరో చేతిలో ఆత్మసంరక్షణకు డాలు ఉంటే ఇంకొకరి చేతిలో పెద్ద ఇనుపవల మరో చేతిలో పొడుగు బల్లెం ఉండేది. వారి మధ్య వ్యక్తిగత శతృత్వం లేకున్నా తమ ఆత్మరక్షణ కోసం, ప్రభువుల వినోదం కోసం వారు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడేవారు. ఆ రణరంగంలో విజేత అయిన బానిస తనకు ఇష్టం లేకున్నా ఓడిపోయిన బానిసనను తప్పనిసరిగా చంపవలసి వచ్చేది. అతను ఏ మాత్రం ఆలస్యం చేసినా చంపు, చంపు అని ప్రేక్షకులు అరిచేవారు" (కలల దారులలో యూరపు యాత్ర, పుట-18 మరియు 19).

పండగలు ఉత్సవాల సందర్భంలో కూడా గ్లాడియేటర్స్ మధ్య ప్రత్యేక యుద్ధాలు జరుగుతుండేవి. ఆకలి మీద వుండే సింహాలను మల్లయోధులపైకి ఉసిగొల్పి వారు పోరాడుతుంటే ప్రేక్షకులు వినోదించేవారు. ఇంతటి రాక్షస క్రీడలో బానిసలు

మృత్యువాతపడగా, మరణంలో వున్నవారి బాధలు, హాహాకారాలు మిన్నంటేవి. వాటిని విని ప్రేక్షకులు బాగా ఆనందించేవారు. ఇంతటి క్రూరమైన చరిత్రకు సాక్షియైన ఈ కలోజియం క్రీ.శ. 72లో నిర్మించబడింది. ఆంఫిథియేటర్ భవనంలో అత్యద్భుతమైన శిల్పకళ ఉట్టి పడుతున్నది. అదొక ఇంజనీర్ ప్రతిభా దర్పణం. 48.5 మీటర్ల ఎత్తు. 80 ఆర్చ్ లు ఉన్నాయి. 55 వేలమంది ప్రేక్షకులు తిలకించేందుకు వీలు ఉంది. అంతమంది ప్రేక్షకులు థియేటర్ నుంచి నిష్క్రమించేందుకు అవసరమైన ద్వారాలు ఉన్నాయంటూ మండలి బుద్ధప్రసాద్ గారు 'నా జర్మనీ యానం' అనే యాత్రాగ్రంథంలో వివరించారు. ఇలా కలోజియం వంటి రోమ్ లో గల మరొక కట్టడం 'సర్కస్ మాక్సిం'.

## 3.2.1.9.2. సర్కస్ మాక్సిం

ప్రాచీన రోమ్ నగరంలో అతి భారీదైన మొట్టమొదటి కట్టడం సర్కస్ మాక్సిం (circus maximus) రథాల పరుగు పోటీల కోసం నిర్మించిన ఈ స్టేడియంలో దాదాపు ఒకేసారి లక్షన్నర మంది ప్రేక్షకులు కూర్చోగలిగే వీలుంది. సర్కస్ మాక్సిం గురించిన విశేషాలను పరవస్తు లోకేశ్వర్ గారు తన యాత్రాగ్రంథంలో ఇలా వివరించారు. "సర్కస్ అన్న పదం సర్కిల్ అన్న లాటిన్ పదం నుండి వచ్చింది. అనగా గుండ్రంగా నిర్మించబడిన కట్టడం అని అర్థం. ఇక సర్కస్ అనగా వినోద కార్యక్రమాల నిర్వహణ. ఈ సర్కస్ మాక్సిం పొడవు 600 మీటర్లు. వెడల్పు 180 మీటర్లు. ఇందులో గుర్రాలకు కట్టిన రథాలు ఏడుచుట్లు పరిగెత్తేవి. ప్రేక్షకులు తమ కరతాళ ధ్వనులతో ఆ పరుగు పందాలను ఉత్సాహపరిచేవారు. ప్రతి రథానికి నాలుగు గుర్రాలను కట్టేవారు. నాలుగు రథాలకు (టీములకు) నాలుగు రంగులు గుర్తులుగా ఉండేవి. తెలుపు, నీలం, ఎరుపు, ఆకుపచ్చ. ఈ రథాల పరుగుల పోటీలలో ప్రమాదాలు జరిగి రథసారథుల ప్రాణాలు కూడా పోయేవి. వారు ఆత్మరక్షణగా రక్షణ కవచాలు ధరించినా ప్రమాదాలు జరిగేవి. ఈ పోటీలు జరిగే రోజులలో సెలవులు ప్రకటించేవారు. ఈ రథాల పోటీలపై ప్రేక్షకులు పందాలు కాసేవారు.

అవి ఉద్రిక్తతలకు దారితీసి తమలో తాము కొట్టుకునేవారు. గెలిచిన వారికి రాజులు భారీ బహుమతులను అందజేసేవారు. బెనహర్ సిన్మాలో ఈ రథాల పరుగుల పందాలను చాలా గొప్పా చిత్రీకరించారు" (కలల దారులలో యూరపు యాత్ర, పుట–21).

గుర్రప్పందాల పోటీలను రోమన్ మతస్థుల పండుగ వేళల్లో నిర్వహించేవారు. ప్రాచీన రోమన్ ల మత సంబంధమైన అన్ని వేడుకలను దాదాపుగా ఇక్కడ నిర్వహించేవారు. అంతేకాక రోమన్ చక్రవర్తులు ఇతర దేశాలపై దండెత్తి విజయం సాధించాక, ఆ విజయోత్సవ సంబరాలను కూడా ఇక్కడే నిర్వహించేవారు. కోలోజియం మాదిరిగానే సర్కస్ మాక్సింలో కూడా గ్లాడియేటర్ ల మధ్య యుద్ధ పోటీలను నిర్వహించేవారు. బానిసలకు – క్రూర మృగాలకు మధ్య జరిగే పోరాటాన్ని చూడటానికి ధనిక–పేద, స్త్రీ–పురుష అనే భేదాలు లేకుండా తరలి వచ్చేవారట. ఇది కూడా కొలోజియం మాదిరే వుండటం వల్ల దీనిని 'బిగ్ కొలోజియం' గా  కూడా వ్యవహరిస్తారు.

### 3.2.1.9.3. హెరోడియాన్ స్టేడియం

నగర రాజ్యాల్లో అగ్రగామిగా వెలుగొందిన అథెన్స్ లోని అక్రోపోలిస్ నగరం ప్రాచీన గ్రీకుల నిర్మాణ కళకు ఆటపట్టు. ఇక్కడి అక్రోపోలిస్ దేవాలయం ప్రపంచ ప్రసిద్ధి చెందినది. నిజానికి అక్రోపోలిస్ పర్వతాలపై నిర్మింపబడిన నగరం. ఇక్కడి పర్వతాల సానువులో నిర్మింపబడిన స్టేడియం హెరోడియాన్ స్టేడియం లేదా అక్రోపోలిస్ స్టేడియం.

"అక్రోపోలిస్ అంటే రాజధాని నగరమని అర్థం. 'అక్రో' అంటె ఎత్తు మీద అని అర్థం. "పోలిస్" అంటే పురం అథెన్స్ నగరం అది ప్రాచీన దుర్గం. ఆ దుర్గంలోనే "అథెన్స్" దేవత మందిరం శిథిలాలున్నాయి. 'అథెన్స్' బుద్ధి విజ్ఞానం దేవత. ఆమె పేరు మీదనే ఆ నగరానికి పేరు. అక్రోపోలిస్ గుట్ట మీద ఉంది. అక్కడనే స్టేడియం ఉంది. క్రీ.పూ. 4వ శతాబ్దంలో పాలరాతితో నిర్మింపబడిన ఈ స్టేడియంలో నాటక ప్రదర్శనలు జరిగేవి. మెట్ల

క్రింద వలయాకారంలో వున్న రంగస్థలం మీద నిలబడే మాట్లాడితే స్టేడియం అంతటా వినిపిస్తుంది" (అద్భుత చైనాయాత్ర, పుట-55).

మూడు అంతస్థుల్లో నిర్మింపబడిన ఈ స్టేడియంలో ఒకేసారి ఐదువేల మంది ప్రేక్షకులు కూర్చోవచ్చు. హెరోడెస్ అట్టికస్ (Herodes Atticus) అనే రోమన్ సెనేటర్ తన భార్య స్మృత్యర్థం దీనిని నిర్మించాడు. నాటక ప్రదర్శనలకు, సంగీత కచేరీలకు వేదికగా నిలిచిన ఈ స్టేడియంలో కొంతభాగం క్రీ.శ. 3వ శతాబ్దంలో ధ్వంసమైంది. ప్రస్తుతం ప్రపంచ వారసత్వ కట్టడంగా పరిగణింపబడుతున్నది అక్రోపోలిస్ స్టేడియం.

### 3.2.1.10. గోడలు

ఒకనాటి చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన కట్టడాల్లో గోడలు కూడా ఒకటి. చరిత్రను వెల్లడించే అంశాల్లో ఇవి కూడా ప్రధాన పాత్ర వహించాయి. వ్యావహారికంగా చూస్తే గోడలు సామాన్యమైనవిగానే అనిపించినా వీటి నిర్మాణం వెనుక ఆసక్తికరమైన చారిత్రక అంశాలెన్నో దాగున్నాయని కొన్ని ప్రసిద్ధిగాంచిన గోడల వల్ల తెలుసుకోవచ్చు. చైనా గోడ, బెర్లిన్ గోడలు వీటికి నిదర్శనాలు. వీటి విశిష్టతలను, చరిత్ర పుటలలో వాటికి గల స్థానాన్ని గురించి యాత్రాచరిత్రకారులు తమ యాత్రాచరిత్రల్లో ఈ క్రిందివిధంగా పొందుపరిచారు.

#### 3.2.1.10.1. చైనాగోడ

ప్రపంచ అద్భుతాల్లో ఒకటిగా గుర్తింపబడిన గ్రేట్ వాల్ ఆఫ్ చైనా. చంద్రుని మీది నుండి భూమిని చూసినపుడు చైనా గోడ కన్పించిందని వ్యోమగాములు పేర్కొనడం విశేషం. ఎటువంటి సాంకేతికత అందుబాటు లేని కాలంలోనే ఇంతటి మహత్తరమైన కట్టడాన్ని నిర్మించడం సాధారణమైన విషయం కాదు. క్రీ.పూ. 2వ శతాబ్దంలో 'కిన్' రాజవంశానికి చెందిన క్విన్ షి హువాంగ్ (Qin shi huang)అనే చైనా చక్రవర్తి దీని నిర్మాత.

"చైనా గ్రేట్ వాల్ నిర్మాణం "కిన్" వంశపు రాజుల కాలంలో క్రీస్తు పూర్వం 221-206 మధ్యకాలంలో క్రమక్రమంగా జరిగింది. ఉత్తర భూములు నుంచి బర్బరులు చేసే దండయాత్రలను అడ్డుకోవడానికి ఈ గోడ నిర్మింపబడింది. "మింగ్" రాజుల (క్రీ.శ. 1368-1644) కాలంలో చైనా గోడ నిర్మాణం పూర్తిగా జరిగింది. ఇటుకలు, గ్రానైట్ లతో ఇప్పుడున్న ఆకారంలో గోడ, మింగ్ రాజుల కాలంలో పునర్నిర్మించబడింది..... అక్కడక్కడ పహారా కోసం సైనిక శిబిరాలతో చైనా గ్రేట్ వాల్ డ్రాగన్ లాగా గుట్టలమీద పొడుగ్గా వ్యాపించి అద్భుతంగా కన్పిస్తుంది. ఆ ప్రసిద్ధమైన చైనా గోడను చూసి మేమందరం ముగ్ధులయ్యాం" (అద్భుత చైనాయాత్ర, పుట-4).

శత్రువుల రాకను గమనించేందుకు, సైనిక పహారాలకోసం ఈ గోడల 25,000 వాచ్ టవర్లను కూడా నిర్మించారు. ఇవి దాదాపు 40 అడుగుల ఎత్తును కలిగి వున్నాయి. అయితే దాచేస్తే దాగని సత్యాలెన్నో ఈ గోడల క్రింద వున్నాయంటూ పరవస్తు లోకేశ్వర్ గారు ఇలా పేర్కొన్నారు. "చైనా మొదటి చక్రవర్తి దీని నిర్మాణ ప్రారంభంలో మూడు లక్షల మంది సైనికులను, రైతులను, ఖైదీలను ఆ దట్టమైన అడవులు, ఎత్తైన పర్వతాల పైకి పంపించాడు. ఆ సమయంలో రోగాలు, నొప్పులు, చలి, ఆకలి బాధలతో వేలాది మంది చనిపోయారు. వారి శవాలను ఆ పునాదులలోనే వేసి గోడలను నిర్మించారు. మరికొంతమంది ఆ శ్రమను, చలిని, బాధలను తట్టుకోలేక పారిపోతుంటే సైనికులు తమ గుర్రాలపై వారిని వెంటాడి చంపి వారి శవాలను కూడా ఆ పునాదులలో పారేయటం, పాతిపెట్టడం జరిగింది. 'తాజ్ మహల్ నిర్మాణానికి రాళ్లెత్తిన కూలీలెవ్వరు' లాగానే వేలమంది కూలీల కంకాళాలపై ఆ కోట గోడ నిర్మించటం వలన ప్రపంచంలోనే అతిపెద్ద శ్మశానస్థలం 'గ్రేట్ వాల్' అన్న అపఖ్యాతిని కూడా చైనా మూటకట్టుకున్నది" (సిల్క్ రూట్ లో సాహసయాత్ర, పుట-229).

6,400 కి.మీ.ల పొడవు కలిగిన ఈ కట్టడం ఏకధాటిగా నిరంతరాయంగా ఒకేసారి నిర్మింపబడిన కట్టడం కాదు. చైనా యొక్క ఉత్తర సరిహద్దులను కాపాడటానికి వివిధ వంశాలకు చెందిన రాజులు తరాలకొద్దీ ఈ గోడను నిర్మించుకుంటూ అతిపెద్దదిగా

తయారుచేసారు. చైనా గ్రేట్ వాల్ ఆఫ్ సొసైటీ మరియు గ్రేట్ వాల్ ఆఫ్ ద ఇంటర్నేషనల్ ఫ్రెండ్స్ అనే రెండు సంస్థలు అవసరమైనప్పుడు మరమ్మత్తులు చేస్తూ, నిరంతరం ఈ గోడ కాపాడేందుకు కృషి చేస్తున్నాయి. చైనా గోడ లాగే చారిత్రక ప్రాధాన్యమున్న మరొక గోడ బెర్లిన్ వాల్.

### 3.2.1.10.2. బెర్లిన్ గోడ

రెండవ ప్రపంచ యుద్ధ కాలంనాటి సంఘటలనకు ప్రత్యక్షసాక్షి బెర్లిన్ గోడ. ఐరన్ కర్టెన్ గా ప్రసిద్ధి చెందిన ఈ కట్టడ నిర్మాణం 1961లో ప్రారంభమైంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ చనిపోయాక, జర్మనీ రెండవ ప్రపంచ యుద్ధంలో ఓడిపోయాక అమెరికా, రష్యాలు జర్మనీని రెండు భాగాలుగా పంచుకున్నాయి. తూర్పు జర్మనీ రష్యా, పశ్చిమ జర్మనీ అమెరికా దేశాల ఆధిపత్యంలోకి వెళ్ళాయి. ఈ రెండింటికీ అడ్డుగా కట్టిన కట్టడమే బెర్లిన్ గోడ.

"1949లో జర్మనీని ఆక్రమించుకొని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ లు పశ్చిమ భాగాన్నీ, సోవియట్ యూనియన్ తూర్పు భాగాన్నీ పంచుకున్నాయి. రెండు రకాల పాలనా వ్యవస్థల మధ్య ఒక అడ్డుగీతను గీశారు. 1961లో గీసిన గీత 1989లో గానీ చెరిగిపోలేదు. 28 సంవత్సరాలపాటు ప్రజల అగచాట్లు వర్ణనాతీతం. రాత్రికి రాత్రే గోడ లేచింది. ఎక్కడి బంధువులక్కడే విడిపోయారు. వేలాది మంది గోడలెక్కి అవతలకి దాటే ప్రయత్నం చేసినవారు నిర్భంధాలకూ, తుపాకీ గాయాలకూ గురయ్యారు. వందలాది మంది తుపాకి గుండ్లకు బలయ్యారు" (జర్మనీలో కవితాయాత్ర, పుట-59).

తూర్పు జర్మనీ నుంచి పశ్చిమ జర్మనీలోకి జనం వలసలు వెళ్ళకుండా కట్టుదిట్టం చేయడం కోసం తూర్పు జర్మనీ కమ్యూనిస్టు పాలకులు సరిహద్దులు మూసేయాలనుకోవడంతో ఈ గోడ నిర్మాణం ప్రారంభమైంది. వాల్ కట్టక ముందు వరకూ తూర్పు బెర్లిన్ వాసులు పశ్చిమ బెర్లిన్ లోకి నిత్యం షాపింగ్ ల కోసం, ఉద్యోగాలకై రాకపోకలు సాగించేవారు. ఎప్పుడైతే ఈ గోడ నిర్మాణం ప్రారంభమైందో ఇరు వైపుల వారి

నుంచి నిరసనలు ఉప్పొంగాయి. "ఈ చర్య తూర్పు పశ్చిమ జర్మనీలలోని ప్రజల్లో గొప్ప వేదన కలిగించింది. కొంతకాలం గడిచిన తర్వాత తూర్పు నుంచి ఆ గోడను దాటడానికి ప్రయత్నించిన 136 మందిని తూర్పు జర్మనీ భద్రతా దళాలు కాల్చి చంపాయి. వేల మందిని అదుపులోకి తీసుకొని జైలుపాలు చేశాయి. కాలగమనంలో 28 సంవత్సరాలు గడిచాయి. ప్రజల మధ్య గోడ నిర్మాణం పట్ల వెల్లువెత్తుతున్న నిరసనలు, వారి మధ్య సౌహార్ద్రాన్ని నిలువరించడం ఎంతమాత్రం సాధ్యమయ్యే పనికాదని గుర్తించిన తూర్పు జర్మనీ పాలకులు సోవియట్ యూనియన్ పతనం తరువాత గోడను 1989 నవంబర్ 9న పడగొట్టడంతో తిరిగి ఐక్య జర్మనీ ఏర్పాటైంది" (నా ఐరోపాయాత్ర, పుట-59).

ఈ చారిత్రాత్మకమైన రోజున 17,000 మంది తూర్పు బెర్లిన్ వాసులు ఈ గోడను ధ్వంసం చేసి అవతల వైపుకు వెళ్ళారు. పశ్చిమ బెర్లిన్ వాసులు కూడా ఆ గోడను కూల్చిన రాళ్ళను కొనుక్కొని మరీ దాచుకున్నారట. ఇంతటి ప్రఖ్యాత కట్టడం నిర్మాణాన్ని గురించి మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు తన యాత్రాచరిత్రలో ఈవిధంగా పేర్కొన్నారు.

"బెర్లిన్ వాల్ నిజానికి రెండు గోడల సముదాయం. లోపలి వైపు ఓ గోడ, దానికి అవతలి వైపు మరో గోడ కట్టారు. మధ్యలో కారిడార్ లాగా కొంత ప్రదేశం వదిలారు. మొదటిది అధికారిక కోడ, రెండవది రక్షణ గోడ. కొందరు గోడ మీంచి అవతలకి పారిపోయే ప్రయత్నం చేశారు. దాంతో ఈ రెండు గోడల మధ్య నించి ఎవరూ ప్రాణాలతో వెళ్ళకుండా మందు పాతర్లని అమర్చారు. దీనికి డెత్ కారిడార్ లేదా డెత్ స్పాట్ అని ముద్దుపేర్లు. ఎవరూ బయటికి వెళ్ళకుండా ఏంటీ వెహికల్ ట్రెంచ్ లు, కాపలా కుక్కలతో ఆ కారిడార్ ని కాపలా కాసేవారు. పారిపోయే వారి పాద ముద్రల కోసం గోడ పక్కన మట్టిని దున్నేవారు. పది మీటర్ల ఎత్తుగల వాట్ టవర్స్ లోని ఇద్దరు సైనికులు 24 గంటలూ, 106 కిలోమీటర్ల పొడవైన కాంక్రీట్ వాల్ గోడని దాటి ఎవరూ వెస్ట్ బెర్లిన్ లోకి ప్రవేశించకుండా కాపలా కాసేవారు. అందుకు 302 వాచ్ టవర్లు ఉండేవి. రాత్రిళ్ళు కాంతివంతమైన స్పాట్ లైట్లని ఉపయోగించేవారు" (ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్, పుట-42).

దాదాపు 12 అడుగుల ఎత్తు కలిగిన ఈ గోడను దాటేందుకు ఎంతోమంది ప్రయత్నించి అసువులు బాసారు. స్ప్రీ నది ఒడ్డున వారి సమాధులు నేటికీ నిలిచి ఉన్నాయి. నవంబర్ 9, 1989న గోడకు ఇరువైపు గల జర్మనీ ప్రజలు దీనిని నాశనం చేసి, ఆనవాళ్ళు లేకుండా చేశారు. అయితే మూడు చోట్ల మాత్రం ఓ కిలోమీటర్ పొడవున చారిత్రక చిహ్నంగా, దానిని కూల్చకుండా ఉంచేశారు. అదే ప్రస్తుతం ఉన్న బెర్లిన్ గోడ. ప్రపంచ వారసత్వ కట్టడాల్లో ఒకటి.

### 3.2.11. స్థూపాలు (టవర్)

'Tower' అనే ఆంగ్లపదం Turri అనే లాటిన్ పదం నుండి ఆవిర్భవించింది. ఎత్తైన కట్టడం అని దీనికి అర్థం. టవర్లు భవనాల మాదిరిగా నివాసయోగ్యమైన నిర్మాణాలు కావు.కొన్ని టవర్లు భద్రతా కారణాలకై లేదా టెలీ కమ్యూనికేషన్ అవసరాలకై నిర్మించవచ్చు. అయితే దాదాపుగా చిత్రకారుడు గీసిన కాన్వాస్‌లా ఊరి అందాలను చూడటానికై టవర్లను నిర్మించారని చెప్పవచ్చు. ఈఫిల్ టవర్, పీసా టవర్లు ఈ కోవకు చెందినవి. ఎలాంటి ఆధునిక, సాంకేతిక సౌకర్యాలు లేని కాలంలో ఇలాంటి ఎత్తైన కట్టడాలు నిర్మించడం, అవి కూడా చరిత్రకు సాక్ష్యాలుగా ఉండటం గమనించదగ్గ విషయం. ఈ క్రింద పేర్కొన్న టవర్ల నిర్మాణాల వెనుక ఎంతో చరిత్ర దాగి ఉంది.

#### 3.2.1.11.1. ఈఫిల్ టవర్

నిద్రపోని నగరంగా, పేరుగాంచిన పారిస్ ప్రపంచంలో ఎక్కువ మంది ఇష్టపడే పర్యాటక ప్రాంతాల్లో వందేళ్ళ నాటి రాచరికపు హంగులతో, ఫ్యాషన్ కళలతో, అణువణువునా సౌందర్యంతో అలరారే పారిస్ అందాలు వర్ణించతరం కాదని పర్యాటకుల ఉవాచ. రొమాంటిక్ సిటీగా పేరొందిన పారస్ లో నిర్మింపబడిన ప్రసిద్ధ కట్టడమే ఈఫిల్ టవర్. గుస్టావ్ ఈఫిల్ అనే ఇంజనీర్ అపూర్వ మేధస్సు ఫలితమే ఈ టవర్. 1889లో నిర్మింపబడిన ఈ కట్టడం 324 మీటర్ల ఎత్తులో పారిస్ నగరానికి  నుదటున తిలకం

బొట్టులా కాంతులు చిందుతోంది. గుస్టావ్ ఈఫిల్ మొదట ఈ కట్టడాన్ని సెయిన్ లోని బార్సిలోనాలో నిర్మించాలనుకున్నాడట. అయితే బార్సిలోనా అధికారులు అతని ప్రతిపాదనని త్రోసిపుచ్చటంతో పారిస్ లోని ప్రపంచ ప్రదర్శన అధికారులకు చూపించాడు. అతని నిర్మాణ ప్రణాళికకు, డిజైన్ కు అబ్బురపడిన పారిస్ ప్రభుత్వం వారు ఈఫిల్ టవర్ నిర్మాణానికి ఒప్పుకున్నారు.

"ముందు దీని డిజైన్ చూసి కళాకారులు, మేధావులు నవ్వుకుని ఆటపట్టించారట. కానీ తర్వాత కాలంలో వారు దాని గొప్పదనాన్ని ఒప్పుకున్నారు. ప్రఖ్యాత ఫ్రెంచి కథకుడు గైడీ యోపాసా ప్రతిదినం మొదటి అంతస్తులోని రెస్టారెంట్‌లోనే లంచ్ చేసేవాడు. అలా అది మొత్తం ఫ్రాన్సు దేశానికే ఒక సంకేతంగా, గర్వకారణంగా మారిపోయింది. 324 మీటర్ల ఎత్తులో, 18 అంతస్తుల భవనానికి సమానంగా నిలబడింది. 1930 వరకు అనగా నిర్మాణం జరిగిన 41 సంవత్సరాలు వరకు ప్రపంచంలోనే ఇది ఎత్తైన కట్టడంగా పేరొందింది. 1930లో న్యూయార్క్ లో క్రిస్టర్ బిల్డింగ్ కట్టేంత వరకు మొత్తం ప్రపంచంలో ఇదే గ్రేట్ టవర్. (కలల దారులలో యూరపు యాత్ర – పుట-107)".

మొదట్లో ఈ టవర్‌ను ఇరవై సంవత్సరాల వరకే ఉండేటట్లు ఒప్పందం జరిగింది. ఒప్పందం ప్రకారం 1909లో దీన్ని కూల్చేయాలి కానీ మిలటరీ అవసరాలకు, కమ్యూనికేషన్ అవసరాలకు ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో అనుమతి గడువు అయిపోయినా, విజయ సంకేతంతో అలాగే ఉంచేశారు. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో హిట్లర్ సైన్యాలు పారిస్ పై దండెత్తినప్పుడు ఈఫిల్ టవర్‌ను నాశనం చేయకూడదనే ఉద్దేశంతో ఫ్రాన్సు ప్రభుత్వం టవర్ లిఫ్ట్ కేబుల్ వైర్లను కట్ చేసిందట. పారిస్ ను ఆక్రమించుకుని తిరిగి వెళ్ళేటప్పుడు ఈ టవర్‌ను నాశనం చేయాల్సిందిగా హిట్లర్ ఆదేశించాడట. అయితే అదృష్టవశాత్తు హిట్లర్ సైన్యం దీనిని శాసనం చేయకుండా వదిలేశారు.

"ఈ టవర్‌లో వాడిన లోహాలు తుప్పు పట్టకుండా ఉండేందుకు ఏడు సంవత్సరాలకొకసారి 50 నుంచి 60 టన్నుల పెయింట్ ను వాడుతారు. భూమి మీద

నుంచి చూసే వీక్షకుడికి ఇది సమదృష్టి కోసం మూడు రకాలైన రంగులను ఉపయోగిస్తారు, బాగా ముదురుగా ఉన్న రంగు క్రింద భాగంలోనూ, లేతరంగు టవర్ పై భాగంలోనూ వేస్తారు. దీనికి 2 అంతస్థులు ఉన్నాయి. మొదటి అంతస్థు వరకే అయితే 11 యూరోలు టికెట్, అదే చివరి వరకు అయితే 17 యూరోలు. మేము మొత్తం పైకే వెళ్ళాలని నిర్ణయించుకున్నాం. మేము టికెట్ తీసుకుని పైకి వెళ్ళటానికి గంట పట్టింది. ఇలా 365 రోజులు జనాలు క్యూలో పైకి వెళుతూనే ఉంటారు. పైనుండి పారిస్ నగరం మొత్తం అద్భుతంగా కనిపించింది. నగరం మొత్తం అందులో భవనాలన్నీ ఎవరో పెయింటింగ్ వేసిన కాన్వాస్ లా అనిపించింది" (మా ఐరోపా యాత్ర – పుట 91 మరియు 92).

ఈఫిల్ టవర్ కట్టినప్పటి నుండి ఇప్పటివరకు దాదాపు 250 మిలియన్ల ప్రజలు ఈ కట్టడాన్ని దర్శించారట. ప్రతీ ఏటా ఇంచుమించు ఏడు మిలియన్ల మంది పర్యాటకులు సందర్శిస్తున్నారు. ప్రపంచంలోనే ఏ కట్టడం పొందలేని రికార్డు ఈఫిల్ టవర్ సొంతం. అంతేకాక ప్రపంచంలోకెల్లా ఎక్కువమంది డబ్బులిచ్చి సందర్శించే స్థలంగా కూడా ఇది ప్రసిద్ధి చెందింది.

### 3.2.10.2. బురానా టవర్

ప్రాచీన సిల్క్ రూట్ లోని ఉత్తర కిర్గిజ్‌స్థాన్ దేశంలోగల ప్రఖ్యాత కట్టడం బురానా టవర్. దీనినే "బురానా మినార్" అని కూడా అంటారు. మధ్య ఆసియా దేశాల్లో నిర్మింపబడిన మొట్టమొదటి టవర్ ఇదే అని చరిత్రకారుల అభిప్రాయం.

"టర్కీ భాషలో 'మురానా' అంటే మినార్ లేదా స్తంభం అని అర్థం. ఈ పదం నుండే 'బురానా' పదం పుట్టింది. పదవ శతాబ్దంలో 'బాలసుగన్' కు రాజధానిగా బురానా పట్టణం ఉండేది. అది సిల్క్ రూట్ లో ఒక ముఖ్యపట్టణం. అక్కడ వర్తకులు విశ్రాంతి తీసుకునేవారు. వారి విరాళాలతోనే ఈ మినార్ నిర్మాణం జరిగిందని కూడా అంటారు. 13వ శతాబ్దంలో చెంఘీజ్ ఖాన్ మొత్తం పట్టణాన్ని ధ్వంసం చేసినా ఈ మినార్ అందానికి ముగ్ధుడై దానిని మాత్రం ముట్టుకోకుండా వదిలేశాడట. ఆ రోజులలో ఇది 25, 30

కిలోమీటర్ల దూరం నుండి కూడా కనబడేది. దీని అసలు ఎత్తు 45 మీటర్లు. కాని భూకంపం వలన కూలి 25 మీటర్ల ఎత్తు మాత్రమే మిగిలింది. ఎర్రనిఇటుకలతో చక్కని నగిషీలతో చాలా నాణ్యంగా, కళాత్మకంగా ఉంటుంది. పైకి చేరుకోవటానికి లోపల వలయాకారపు మెట్లు కూడా ఉంటాయి. ఈ బాలసుగన్ పట్టణం 15వ శతాబ్దంలో మనకు తెలియని కారణాల వలన అంతర్ధానమైపోయింది. 1970లో రష్యన్ పురావస్తు శాస్త్రజ్ఞులు ఈ బురానా టవర్ పరిసర ప్రాంతాలలో తవ్వకాలు చేపట్టగా ఆ ప్రాచీన అద్భుత పట్టణం బయలుపడింది. పట్టణ ప్రాకారపు కోట గోడలు, జనావాసాలు, స్నానఘట్టాలు, శ్మశాన స్థలాలు, ప్రార్థనా స్థలాలు, శిల్పాలు, నాణేలు, రాతిగుండ్లపై చెక్కిన చిత్రాలు వెలుగులోకి వచ్చాయి. 36 హెక్టార్ల ప్రాంగణంలో ఉన్న వాటన్నింటినీ ఒక ఓపెన్ మ్యూజియంగా నిర్వహిస్తున్నారు. వాటన్నింటి మధ్య ఈ మినార్ మనల్ని ఆకర్షిస్తుంది" (సిల్క్ రూట్ లో సాహసయాత్ర, పుట–125).

పచ్చటి తియాన్ షాన్ పర్వతాల మధ్యలో నిర్మింపబడిన ఈ మినార్ కిర్గిజ్‌స్థాన్‌లోని ప్రసిద్ధ సందర్శనీయ ప్రదేశం. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం వున్న మినార్ లోని ఇటుకలను రష్యన్ లు పెకిలించి, మరో భవన నిర్మాణానికి ఉపయోగించడం బాధాకరమైన అంశం.

### 3.2.1.10.3. థియోడోసియస్ ఓబ్లిస్క్ (డికిలిటాస్)

టర్కీలోని ఫోరమ్ ఆర్యాడి ప్రాంతంలో గల ఈ స్థూపానికి 3,500 ఏళ్ళ చరిత్ర వుంది. క్రీ.పూ.15వ శతాబ్దంలో నిర్మింపబడిన థియోడోసియస్ ఓబ్లిస్క్ వాస్తవానికి ఈజిప్టులో నిర్మింపబడింది. కానీ క్రీ.శ. 379వ సంవత్సరంలో అప్పటి టర్కీ చక్రవర్తి మొదటి థియోడోసియస్ ఇక్కడికి తెప్పించి, ప్రతిష్టింప చేశాడు. టర్కీని సందర్శించిన క్రమంలో యాత్రారచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు ఈ స్థూపంకు సంబంధించిన చరిత్రను ఇలా వివరించారు.

"ఒకప్పుడు ఈ స్థూపం బంగారంలా మెరిసేది. దీన్ని బంగారంతో నిర్మించారనుకుని చెక్కితే అది బంగారం కాదని తెలిసింది. అప్పటి నుండి 'మెరిసేదంతా

బంగారం కాదు' అనే నానుడి మొదలైందని ఓక్తామ్ చెప్పాడు. ఈ స్థూపం కాన్ స్టాంటిన్ నోపుల్ (ఇస్తాంబుల్ పాత పేరు) నగరం కన్నా 900 ఏళ్ళు ప్రాచీనమైనది, ఆ నగరం ఏడవ శతాబ్దం బి.సిలో నిర్మించబడితే, ఈ స్థూపం అంతకు 900 ఏళ్ళ క్రితమే తయారు చేయబడింది. ఇన్నేళ్ళు వర్షానికి, ఎండకి ఎక్స్ పోజ్ అయినా ఈ రోజుకీ అది అది ఇటీవలే చెక్కినట్లుగా ఎంతో అందంగా కనిపించడం విశేషం. దీనికి ఎదురుగానే రెండు పాములు చుట్టుకున్న నాగబంధం డిజైన్ లో ఒక స్తంభం ఉంది. ఇలాంటివి మూడు ఉండేవి. 1919-1922లో బ్రిటిషర్లు టర్కీని ఆక్రమించుకున్నప్పుడు ఒకదాన్ని బ్రిటిష్ మ్యూజియంకి తరలించారు. మరొకటి ఏమైందో ఎవరికీ తెలీదు" (ట్రావెలాగ్ దుబాయ్, టర్కీ మరియు గ్రీస్ పుట 80 మరియు 81).

ఎర్రటి గ్రానైట్ తో నిర్మించబడిన ఈ స్థూపం ఎత్తు 30 మీటర్లు. అయితే ఈజిప్టు నుంచి ఇస్తాంబుల్ కి దీనిని తరలించే క్రమంలో స్థూపం విరిగిపోయింది. ప్రస్తుతం దీని ఎత్తు 19.6 మీటర్లు. హిప్పోడ్రోమ్ స్క్వేర్ గా పిలువబడే ఈ స్థలం ఇస్తాంబుల్ లోని ప్రఖ్యాత సందర్శనీయ స్థలాల్లో ఒకటిగా గుర్తింపుపొందింది.

### 3.2.1.10.4. ఓరియంటల్ పర్ల్ టవర్ (Oriental Pearl Tower)

చైనాలోని షంఘైలో గల ఈ టవర్ కమ్యూనికేషన్ అవసరాలకై ఏర్పరచిన అతి ఎత్తైన కట్టడం. ఈ టవర్ ఎత్తు 468 మీటర్లు. వందకు పై అంతస్థులు గల ఈ టవర్, 1994వ సంవత్సరంలో నిర్మింపబడింది. జియాన్గ్ హునాన్ షెన్ (Jiang Huan Chen), లిన్ బెన్ లిన్ (Lin Benlin), zhang xiulin అనే డిజైనర్ల ఆలోచనలకు రూపం పర్ల్ టవర్. ఈ టవర్ లో ఆధునికమైన హంగులు కల అన్ని సౌకర్యాలున్నాయి. యాత్రారచయిత్రి కురుగంటి శ్రీలక్ష్మి గారు ఈ విధంగా వివరించారు. "ప్రతి అంతస్తు నుంచి షంఘై నగర సౌందర్యాలను వీక్షించవచ్చు. గుండ్రంగా ఉండటం వలన ఇది నిజంగా ముత్యంలా మెరుస్తూ కళ్ళకి జిగేలుమనిపిస్తుంది. దీంట్లో ప్రతి అంతస్తులో షాపింగ్ మాల్స్, హోటళ్ళు, సమావేశాలకు గదులు ఉండటానికి వీలుగా అధునాతనంగా

తీర్చిదిద్దారు. లోపలి నుండి ఎంతో ఎత్తు నుండి బయటకి వెళ్ళి పడవల్ని, ఓడల్ని చూడటం ఒక సరదా. లోపల గుండ్రంగా అద్దాల బీరువాల్లో అమర్చిన చైనీయుల హస్తకళలు వాళ్ళ సంప్రదాయకమైన జీవన శైలిని వివరిస్తాయి. బట్టతో తయారు చేసిన బొమ్మలు, పింగాణీ బొమ్మలు, బాతిక్ అద్దకాలు, పట్టు స్కార్ఫులు, తోలు సంచులు, పర్సులు, అందంగా అమర్చిన ఎలక్ట్రానిక్ వస్తువులు, గోడలకు తగిలించుకునే బొమ్మలు, చిన్నా పెద్దా అలంకరణ సామగ్రి, ఆభరణాలు, మన కొండపల్లి బొమ్మల్లాంటివి. ఇవీ అవీ అని చెప్పేకన్నా వాటన్నింటినీ చూస్తేనేగానీ తనివి తీరదు. అందులో ఉట్టిపడే జీవకళ మనల్ని కొనేదాకా కదలనివ్వదు. పింగాణీ బొమ్మల్లో ఎక్కువ జవాన్ల బొమ్మలు (తుపాకులతో) ఉన్నాయి. అవి వీరత్వానికి, వీళ్ళ యుద్ధ నైపుణ్యానికీ చిహ్నాలు" (షంఘై నింగిలో, పుట-41) అంటూ పర్ల్ టీవి టవర్ లో తాము చూసిన విశేషాలను పేర్కొన్నారు రచయిత్రి.

2007వ సంవత్సరంలో 492 మీటర్ల ఎత్తుగల షంఘై వరల్డ్ ఫైనాన్షియల్ సెంటర్ కట్టేవరకు అంటే 2007 వరకు పర్ల్ టవరే చైనాలో ప్రాచీన టవర్ గా ప్రఖ్యాతిగాంచింది.

### 3.2.1.10.5. లీనింగ్ టవర్ ఆఫ్ పీసా

ప్రముఖ ఖోగళ శాస్త్రజ్ఞుడయిన గెలీలియో విశ్వరహస్యాలను ఆవిష్కరించటానికి వేదికైంది ఈ పీసాటవర్. 16వ శతాబ్దానికి చెందిన గెలిలీయో ఈ టవర్ పై నుండి టెలిస్కోపుతో అనేక పరిశోధనలు చేసి ఖగోళశాస్త్రానికి ఊపిరులూదాడు. ఈవిధంగా ఒక నూతన ఆవిష్కరణకు పునాది అయింది లీనింగ్ టవర్ ఆప్ పీసా. ఇటలీలోని 'పీసా' లో గల ఈ టవర్ ప్రపంచంలో అనేకమంది సందర్శించే పర్యాటక స్థలం. లీనింగ్ అనగా ఒక పక్కకు జరగటం అని అర్థం. మొత్తం పాలరాతితో నిర్మింపబడిన ఈ కట్టడం నిజానికి గంట స్తంభం. ఏడంస్తుల్లో దీన్ని నిర్మించగా, సప్త స్వర్గాలకు అనుకరణగా మొత్తం ఏడు గంటలను ఏర్పాటు చేశారు. పీసా టవర్ నిర్మాణం వెనుక కొన్ని ఆసక్తికరమైన విషయాలు దాగి వున్నాయి. వాటిని కలలదారులలో యూరపు యాత్రా రచయిత లోకేశ్వర్ గారు ఇలా వివరించారు.

"ఇప్పటికి 840 సంవత్సరాల క్రిందట ఇటలీ దేశం సాధించిన విజయాలు, అభివృద్ధికి ఒక చిహ్నంగా 1173లో ఈ బెల్ టవర్ నిర్మాణం ప్రారంభమయ్యింది. ఒక ఐదు సంవత్సరాలు గడిచాక మూడో అంతస్తు నిర్మాణం పూర్తయ్యేసరికి ప్రధాన శిల్పాచార్యుడికి (ఇంజనీరు) గుండె గుభేల్ మంది. ఆ టవర్ ఒక ప్రక్కగా ఒంగటం ప్రారంభించింది. భూసారంలో బలం లేకపోవటం, దానికి తగ్గట్టు పునాదులు తీయకపోవటమే ప్రధాన లోపమని దానికి అతను గ్రహించే సరికి పరిస్థితి చేయి దాటిపోయింది. అతను తీవ్రమైన అవమాన భారంతో ఎవరికీ చెప్పకుండా అంతర్థానమై, బెంగతో తన స్వగ్రామంలో కన్నుమూశాడు. 1185లో మరొక ప్రముఖ ఇంజనీరు తన మేథాశక్తిని జోడించి ఆ నిర్మాణాన్ని కొనసాగించాడు. వందల సంవత్సరాల తర్వాత 1284లో ఇటలీ ఒక యుద్ధంలో ఓడిపోవడంతో ఆ నిర్మాణానికి ఆటంకం ఏర్పడింది. మళ్ళీ కొంతాకాలనికి మూడవ ఇంజనీరు కృషితో 1372లో ఆ నిర్మాణం పూర్తి అయింది. ప్రపంచంలోని ఏడు వింతలలో ఈ "లివింగ్ టవర్" కూడా ఒక వింత" (కలల దారులలో యూరపు యాత్ర, పుట-32).

ఈ టవర్ ఎత్తు 56 మీటర్లు. కాగా పైకి వెళ్ళేందుకు 294 మెట్లు ఉన్నాయి. 14,500 మెట్రిక్ టన్నుల బరువు గల పీసా టవర్, 3.97 డిగ్రీల కోణంలో భూమిలోకి కుచించుకుపోయింది. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో అమెరికా సైన్యాలు ఇటలీపై దాడి చేసినప్పుడు ఈ టవర్ అందానికి ముగ్ధులై దానిని ధ్వంసం చేయకుండా వదిలేశారట. అందుకే ఇంతటి అపూర్వమైన కట్టడం కాబట్టే ప్రతీ సంవత్సరం ఐదు మిలియన్ల మంది పర్యాటకులు పీసా టవర్ ను సందర్శిస్తున్నారు.

### 3.2.1.11. ఇతర కట్టడాలు

కోటలు, మసీదులు, ఆలయాలు వంటి కట్టడాలు మాత్రమే చరిత్ర రచనకు ఆధారాలు కావు. ఇంకా ఎన్నో ప్రత్యేకమైన కట్టడాలు కూడా నాటి చరిత్ర గతిని నిరూపించే సాధనాలవుతున్నాయి. పైన పేర్కొన్నవే గాక, విశిష్టమైన, చారిత్రక కట్టడాలు

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. పై విభజనల్లోకి చేరని కట్టడాలను ఈ విభాగంలో ప్రత్యేకంగా వివరించడం జరిగింది. ఈ కట్టడాలు ఆయా కాలంనాటి చారిత్రక సంఘటనలకు ప్రధాన సాక్షులుగా నిలిచి వుండటమే గాక ప్రపంచ చరిత్ర గతిని మార్చాయని చెప్పటంలో సందేహం లేదు. ముందుగా చెప్పుకోవాల్సిన అటువంటి కట్టడం అన్నేఫ్రాంక్ హౌస్. నెదర్లాండ్స్ లో గల ఈ కట్టడం రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీ క్రూరత్వానికి నిదర్శనం.

### 3.2.1.11.1. అన్నేఫ్రాంక్ హౌస్

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో నాజీలు సాగించిన మానవ హననంలో బలయిన బాలిక అన్నేఫ్రాంక్. 1929 జూన్ 12వ తేదీన జర్మనీలోని ఫ్రాంక్ ఫర్ట్ లో జన్మించిన అన్నేఫ్రాంక్ ఒక యూదు కుటుంబానికి చెందినది. హిట్లర్ కి గల ఆర్యజాతి విద్వేషాన్ని గురించి తెలిసిన అన్నే తండ్రి తమ కుటుంబం కూడా హిట్లర్ దురహంకారానికి బలి అవుతుందని తెలిసి, తన ఇంట్లోని పుస్తకాల బీరువా వెనుక ఒక రహస్య గదిని ఏర్పాటు చేశాడు. రెండవ ప్రపంచ యుద్ధం మొదలైందని తెలిసిన వెంటనే అన్నే తండ్రి ఓట్టో ఫ్రాంక్ తన కుటుంబాన్ని నలుగురిని ఆ రహస్య గదిలోకి మార్చాడు. “రెండు సంవత్సరాల ఒక నెలపాటు గాలి వెలుతురు సరిగ్గాలేని ఆ గదిలో ఆ ఎనిమిది మంది ఎలా బ్రతికారో, క్షణక్షణం ఎలా భయపడ్డారో, ఒకప్పుడు వారు ఎంత సంతోషంతో స్వేచ్ఛగా బ్రతికారో ఆ పన్నెండేళ్ళ అమాయక బాలిక ప్రతి రోజూ డైరీలో రికార్డు చేసుకుంది. అవన్నీ జ్ఞాపకాల గాయాలే” (కలల దారులలో యూరపు యాత్ర, పుట-93 మరియు 94).

జూన్ 12, 1942న అన్నే పుట్టినరోజు సందర్భముగా ఎవరో కానుకగా ఇచ్చిన డైరీని తన రహస్య జీవిత విశేషాలను రాయటానికి ఉపయోగించుకుంది. అయితే నాజీ సైన్యం వీరి ఆచూకీని కూడా కనిపెట్టి, కుటుంబం మొత్తాన్ని పోలాండ్ లోని కన్ సన్ ట్రేషన్ క్యాంపుకి తరలించింది. ఈ క్యాంపులో ఒక్క తండ్రి తప్ప అందరూ మరణించారు.

అన్నేఫ్రాంక్ తన 16 సంవత్సరాల వయసులో టైఫాయిడ్ తో ఈ క్యాంపులోనే మరణించింది.

"యుద్ధ సమయంలో ఎవరైనా డైరీలు రాసుకుని ఉంటే యుద్ధం పూర్తి అయిన తర్వాత వాటిని ప్రచురిస్తామని 1944లో రేడియోలో ప్రకటన వచ్చింది. 1945లో యుద్ధం ముగిసాక బ్రిటిష్ వాళ్ళు అందర్నీ వదిలేశారు. అయితే వేరే క్యాంప్ లో ఉన్న అన్నేఫ్రాంక్ తండ్రి మాత్రం బతికే ఉన్నాడు. ఆయన ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత అన్నే రాసిన డైరీ దొరికింది. దానిని ఆయన 1947లో కొద్దిగా మార్చి ప్రింట్ చేస్తే 25 మిలియన్లు అమ్ముడయ్యాయి. ఎందరో నాజీ నిర్బంధాన్ని గురించి, వారు చేసిన దారుణాలను గురించి డైరీలు రాసినా అన్నేఫ్రాంక్ డైరీకున్న ప్రాధాన్యత దేనికీ రాలేదు. దాదాపు అరవై భాషల్లోకి అనువాదం పొందింది. బైబిల్ తర్వాత అన్నే డైరీకి అంత గిరాకీ వచ్చింది. దక్షిణాఫ్రికా స్వాతంత్ర ఉద్యమ నేత, అధ్యక్షుడు నెల్సన్ మండేలా జైలులో ఉండగా అన్నేఫ్రాంక్ డైరీని తానూ చదివానని, ఎంతో ప్రభావితం చేసిందని, తోటి ఖైదీలకు కూడా చదివి వినిపించానని రాశాడు" (నా ఐరోపా యాత్ర, పుట-112).

నెల్సన్ మండేలానే కాదు ప్రపంచంలో చదివిన ఎంతోమందికి కన్నీళ్ళు తెప్పించింది అన్నే డైరీ. అందుకే ప్రముఖ రాజకీయనాయకురాలు, ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్ భార్య ఎలెనోర్ రూజ్ వెల్ట్ (ELEANOR ROOSEVELT) ANNE FRANK THE DIARY OF A YOUNG GIRL అనే పుస్తకానికి ముందుమాట రాస్తూ, "This is a remarkable book written by a young girl – and the young are not afraid of telling the truth – it is one of the wisest and most moving Commentaries on war and its impact on human being that I have ever read"అని పేర్కొన్నారు.

అయితే మొదట ఈ డైరీ అన్నే రాసిన డచ్ భాషలోనే ప్రచురణ అయినా, అది ఆంగ్లానువాదం అయ్యాకే ప్రాముఖ్యం వచ్చింది. ఈ డైరీని చదివిన ఎంతోమంది అన్నేఫ్రాంక్ ఇంటిని, నాజీల దుశ్చర్యలకు భయపడి దాచుకున్న అరలను చూడాలని వస్తూ

వుండటంతో అన్నే తండ్రి ఆ ఇంటిని అన్నే స్మృత్యర్థం సందర్శనకై ఉంచాడు. 1980లో ఓట్టోఫ్రాంక్ మరణించాక ప్రభుత్వం ఈ గృహాన్ని మ్యూజియంగా మార్చింది. ఆమె దాచుకున్న అటక ఆమెకు సంబంధించిన వస్తువులు, ఒక వీడియో క్లిప్ లను ఈ ప్రదర్శనశాలలో ఉంచారు.

"అన్నాఫ్రాంక్ గృహం ఇప్పుడొక మ్యూజియం. కాలం చెక్కిలి మీద ఘనీభవించిన కన్నీటి బొట్టు. రక్తపాత యుద్ధాలు లేని ఈ భూమ్మీద శాంతి కుసుమాలు విరబూసి, శాంతి కపోతాలు స్వేచ్ఛగా విహరిచాలని కోరుకునే శాంతి కాముకులందరికి అదొక పవిత్ర స్థలం. మేము ఆ గృహాన్ని సందర్శించి ఆ పుస్తకాల అల్మారాను ముట్టుకున్నాం. ఆ చీకటి గదిలో అన్నా దాక్కున్న అటకను చూసాం. అన్నా తండ్రి 1957లో అన్నా పేరుతో ఒక ఫౌండేషన్ స్థాపించి 1960 మే మాసంలో ఆ గృహాన్ని ఒక మ్యూజియంగా మార్చాడు. 2013వ సంవత్సరంలో 12 లక్షల మంది యాత్రికులు ఆ మ్యూజియంను దర్శించారు" (కలల దారులలో యూరపు యాత్ర, పుట-94).

రెండవ ప్రపంచ యుద్ధంలో కాన్సంట్రేషన్ క్యాంపుల్లో చూపబడ్డ లక్షలాది మంది యూదుల జీవితాలకి ప్రతినిధి అన్నేఫ్రాంక్. అన్నేఫ్రాంక్ చదివితే చాలు ఆ కాన్సంట్రేషన్ క్యాంపులు మనుషుల పాలిట ఎటువంటి మరణ సౌధాలో అవగతమవుతుంది.

## కాన్సన్‌ట్రేషన్ క్యాంప్స్

జాత్యహంకారంతో సామ్రాజ్య విస్తరణకు పూనుకుని రెండవ ప్రపంచ యుద్ధానికి బాటలు వేసినాడు ఆడాల్ఫ్ హిట్లర్. తోటి మనుషులనే కనికరం లేకుండా లక్షలాది మంది యూదులను జాతి విద్వేషం అనే మారణహోమానికి ఆహుతి చేసిన కళంక చరితుడు. 1934లో తాను అధికారంలోకి వచ్చాక యూదులపై అమానుషమైన చర్యల్ని చేపట్టాడు. ఒక యూదు ఈ పరిణామానికి ఎదురు తిరగటంతో దానికి ప్రతీకారంగా నవంబర్ 9, 1938 నాటి రాత్రి నాజీ సైన్యం ఒక్కసారిగా యూదులపై విరుచుకుపడింది. 91మందిని కాల్చి చంపారు. ముప్పైవేలమందిని ఒకేసారి నిర్బంధించి జైళ్ళకు తరలించారు. వీరిని

నిర్బంధించేందుకు జైళ్ళు చాలక కాన్సన్ట్రేషన్ క్యాంపులను నిర్మించారు. అంటే ఒకే చోట ప్రత్యేకంగా ఖైదీలపై దృష్టిని కేంద్రీకరించడమే ఈ క్యాంపుల లక్ష్యం. వీటిని డెత్ ఫ్యాక్టరీలు అని కూడా వ్యవహరించేవారు. నాజీలు పోలాండ్ మరియు జర్మనీలలో మొత్తం 48 డెత్ ఫ్యాక్టరీలను నిర్మించారు.

యూదుల ప్రార్థనా మందిరాలయిన సినగాగ్‌లను తగలబెట్టారు. వారి షాపుల అద్దాలన్నీ పగలగొట్టడంతో బెర్లిన్ అంతా గాజు ముక్కలతో నిండిపోయింది. అందుకే నాటి సంఘటనను జర్మన్ భాషలో Crystal Nacht అని అంటారు. అంటే అద్దాలు పగిలిన రాత్రి అని అర్థం.

"అత్యంత పెద్ద డెత్ ఫ్యాక్టరీ పోలాండ్ లో aushwitz అనే ప్రాంతంలో నిర్మించారు. పోలాండ్లో నేను చూసిన తరువాతి ప్రదేశం ఇదే. చాలా మంది మిత్రులు అది చూడవద్దని వారించారు. వారెందుకు అలా అన్నారో నాకు అర్థం కాలేదు. కాని నేను ఈ ప్రదేశం చూశాక ఒక మనిషిగా చలించిపోయాను. చెలియలి కట్ట కూడా ఆపలేని అశ్రువులు ధారగా కారుతుంటే అంతకుమించిన ఆవేదన నా మనసుని ఛిద్రం చేసింది. అసలు ఈ ప్రాంతం చూడకుండా ఉంటే బావుండేది అనిపించింది. ఇప్పటికీ, ఎప్పటికీ ఆ డెత్ క్యాంప్ నేను మరువలేని మరణ సౌధం. సాటి మనుషుల్ని చంపటానికి మనుషులే నిర్మించిన ఆ సువిశాల మరణ ప్రాంగణం ఎన్నో రోదనలని భరించిందో, ఎంతమంది పసివాళ్ళ ప్రాణాలు గ్యాస్ చాంబర్ల ఆకలికి బలైపోయాయో తలచుకున్నప్పుడల్లా గుండె చెమ్మగిల్లి పోతుంది" (మా ఐరోపాయాత్ర, పుట-18 మరియు 19) అంటూ పోలెండ్ లో గల కాన్సన్ట్రేషన్ కాంపుని చూసిన సందర్భంలో ఆవేదన చెందారు రచయిత.

రెండవ ప్రపంచయుద్ధ కాలంలో నాజీలు తాము ఆక్రమించిన అన్ని దేశాలలోని యూదులని బంధించి, క్యాంపులకి తరలించి చంపేసేవారు. వీరిని తీసుకురావటానికి నేరుగా రైలు మార్గాన్ని క్యాంప్ లోపలికే నిర్మించారు. రైలు దిగగానే నాజీ డాక్టర్లు వారిని పరీక్షించి, కొంచెం శారీరకంగా దృఢంగా వుండేవారిని ఒక వైపుకి, మిగతావారిని గ్యాస్ చాంబర్లకి పంపేవారు. పారిపోవడానికి ప్రయత్నించిన వారిని నాజీలు తమ తుపాకీలతో

కాల్చి చంపేవారు. ఈ క్యాంపుల్లో గల బేరక్స్ లో నలుగురు వుండే స్థలంలో రెండు వందల మంది దాకా కుక్కేవారు. మగవాళ్ళకి, ఆడవాళ్ళకి కూడా విడిగా బారక్ లు ఉండేవి. ఆడవాళ్ళ బారక్ అత్యంత దయనీయంగా వుండేవి. పోలెండ్ లోని ఔట్ విష్ కాన్సన్ట్రేషన్ క్యాంప్ ని దర్శించిన క్రమంలో అక్కడగల పదవ నెంబర్ బారక్ లో స్త్రీలపై నాజీలు జరిపిన అమానుషమైన చర్యల్ని గురించి మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఈ విధంగా పేర్కొన్నారు.

"ఇక్కడ అత్యంత పైశాచికమైనవి జరిగేవి. దీంట్లో ప్రొఫెసర్ డాక్టర్ కార్ల్ బర్గ్ అనే సైకాలజిస్ట్ ఆడ ఖైదీల మీద స్టెరిలైజేషన్ పరిశోధనలని చేసేవాడు. ఏప్రియల్ 1943 నుంచి మే 1944 దాకా అతను చేసిన ఆ పరిశోధనలలో ఆడవారంతా మరణించేవారు. కొందరిని చంపి శవ పరీక్ష చేసేవాడు. ఇతర ఎస్ ఎస్ డాక్టర్లు కూడా ఆడవారి మీద రకరకాల పరిశోధనలు చేసేవారు. ఔట్ విష్ లోని అతి క్రూరమైన డాక్టర్ జోసెఫ్ మెంగెలెకి 'ఏంజెల్ ఆఫ్ డెత్' అనే పేరు ఉండేది. ఆ గైనకాలజిస్ట్ గర్భిణుల పిండాల మీద ఎన్నో కిరాతక పరిశోధనలని చేసేవాడు. మత్తుమందు ఇవ్వకుండా వారి గర్భాలని తెరిచి పిండాలని అతికించే పరిశోధనని చేసేవాడు. కొత్త మందులని ఖైదీలమీద ప్రయోగించేవాడు. కవలలని చంపి వారిద్దరికీ శవపరీక్ష, చేసి పోల్చి చూసేవాడు. మేలు జాతి మనుషులని సృష్టించాలని చిన్నపిల్లల మీద కూడా పరిశోధనలని చేసేవాడు. ఓసారి లోపలికి వెళ్ళినవారు శవమై రావల్సిందే. 8, 9, 10వ నంబర్ బేరక్స్ లోకి ఎవరికీ ప్రవేశానికి అనుమతి ఉండేది కాదు. అక్కడ జీవించాలనే కోరిక కంటే తక్షణం మరణించాలనే కోరిక గాఢంగా ఉండేది" (ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్, పుట 168 మరియు 169).

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాతే ఈ కాంపుల్లో జరిగిన అకృత్యాలు బయటి ప్రపంచానికి తెలిసాయి. 1945, ఏప్రియల్ 30 నాడు హిట్లర్, అతని భార్య ఇవా బ్రౌన్ అండర్ గ్రౌండ్ లోని బంకర్ లో ఆత్మహత్య చేసుకోవడంతో ఈ కాంపుల్లో చిక్కి మగ్గిపోతున్న యూదులకు విముక్తి లభించింది. అయినా నాజీలు సాగించిన మారణకాండకు దాదాపు అరవై లక్షలమంది యూదులు బలవ్వటం బాధాకరమైన అంశం.

యూదుల స్మారకార్థం అనేక దేశాల్లో స్మారక మందిరాలను, చిహ్నాలను రెండవ ప్రపంచయుద్ధంలో ఊచకోత కోయబడిన యూదుల స్మారకార్థం స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ఈ స్మారక చిహ్నానికి సమీపంలో కట్టబడిన చారిత్రక కట్టడం బ్రాన్ డెన్ బెర్గ్ గేట్.

## 3.2.1.11.3. బ్రాన్ డెన్ బెర్గ్ గేట్

బెర్లిన్ నగర చారిత్రక వైభవానికి ప్రతీక ఈ బ్రాన్ డెన్ బెర్గ్ గేట్. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సంకుచిత చరిత్రకు ప్రతీకగా నిలిచి, దేశ విదేశీ యాత్రికులను ఎక్కువగా ఆకర్షిస్తున్న బెర్లిన్ గోడకు సమీపంలో గల చారిత్రక కట్టడం బ్రాన్ డెన్ బెర్గ్ గేట్. 'నా జర్మనీయానం' అనే యాత్రా చరిత్రలో మండలి బుద్ధప్రసాద్ గారు ఈ గేట్ కు గల చారిత్రక ప్రాధాన్యాన్ని ఇలా వివరించారు.

"మేము తిలకించిన మరో మహత్తర నిర్మాణం బ్రాన్ డెన్ బెర్గ్ గేట్. దీని చరిత్ర గురించి విని ఆశ్చర్య చకితులమైనాము. ఈ గేటుని 1988-91లో నిర్మించారట. నెపోలియన్ యుద్ధంలో జర్మనీని ఓడించి తన విజయానికి సంకేతంగా ఈ గేటుని పారిస్ తీసుకుని పోయాడట. 1814లో దానిని బెర్లిన్ నగరవాసులు తిరిగి తెచ్చుకుని పునఃప్రతిష్ట చేసుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధంలో అది ధ్వంసం కాగా దాని పూర్వ వైభవం చాటే విధంగా తిరిగి నిర్మించుకున్నారు" (నా జర్మనీ యానం, పుట-23).

బెర్లిన్ లోకి ప్రవేశించే అనేక గేట్లలో ఇదొకటి. దీని సమీపంలోని బెర్లిన్ గోడ మరియు జర్మనీ పార్లమెంట్ భవనమయిన రైష్ టాగ్ బిల్డింగ్ లు కూడా నెలకొని ఉన్నాయి. 1789లో ప్రష్యన్ చక్రవర్తి ఫ్రెడరిక్ విలయం-2 నిర్మించిన ఈ కట్టడం శాంతికి చిహ్నం. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో నాజీల దుశ్చర్యలకు మూగగా నిలిచిన సాక్షి ఈ బ్రాన్ డెన్ బెర్గ్ గేట్.

"ఈ గేట్ దగ్గరే హిట్లర్, ఇతర నాజీలు ప్రజలని ఉద్దేశించి మాట్లాడేవారు 1963లో అమెరికన్ ప్రెసిడెంట్ జాన్ ఎఫ్ కెన్నెడి ఈ గేట్ ని సందర్శించి వెస్ట్ బెర్లిన్ ప్రజలని

ఉద్దేశించి మాట్లాడాడు. అప్పుడు ఈ గేట్ లోనుంచి పక్కనే ఉన్న తమ భూభాగంలోకి కెన్నడీ చూడకుండా కమ్యూనిస్ట్ లు ఎర్రని బౌన్సర్ని అడ్డు కట్టేసారు...... 1994లో ఈ గేట్ ని దర్శించి, అమెరికన్ ప్రెసిడెంట్ క్లింటన్ ప్రజలని ఉద్దేశించి ఇక్కడ మాట్లాడాడు. నవంబర్ 9, 2009న బెర్లిన్ వాల్ పడిపోయిన యానివర్సరీ సందర్భంగా జర్మన్ ఛాన్సలర్ ఏంజెలా మార్కెల్ రెండు పక్కలా రష్యన్ ప్రీమియర్ గోర్బచేవ్, పోలెండ్ అధినేత లెచ్ వరేప్పాలతో ఈ గేట్ లోంచి నడిచింది" (ట్రావెలాగ్ ఈస్టర్న్ యూరప్, పుట-52).

18వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ గేట్ నిర్మాణానికి ఏథెన్స్ లో గల అక్రోపోలిస్ దేవాలయ ముఖద్వార నిర్మాణమే ప్రేరణ. ఇంతటి ఈ చారిత్రక కట్టడానికి రెండవ ప్రపంచ యుద్ధంలో చాలా నష్టం వాటిల్లింది. ఇలా రెండవ ప్రపంచ యుద్ధంతో సంబంధం ఉన్న మరొక కట్టడం లండన్ లోని ట్రాఫెల్గర్ స్క్వేర్.

### 3.2.1.11.4. ట్రఫాల్గర్ స్క్వేర్

రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర రాజ్యాలు జర్మనీపై విజయం సాధించాయని, యుద్ధం ముగిసిందని నాటి బ్రిటిష్ ప్రధాని విన్ స్టన్ చర్చిల్ ఈ స్క్వేర్ లో నిలబడే ప్రజలను ఉద్దేశించి ప్రకటించాడు. అప్పటి నుండీ ఈ స్క్వేర్ లో మే 8వ తేదీన 'విక్టరీ డే' జరుపుకోవటం ఆనవాయితీగా మారింది. లండన్ లో జరిగే ప్రతీ వేడుకకి వేదిక ట్రఫాల్గర్ స్క్వేర్.

"విశాలమైన ప్రాంగణంలో నలుమూలలా ఎటు చూస్తే అటు కనబడే పాలరాతి సౌధాల మధ్య అనేక అంతస్థులు గల భవనాల మధ్య ఈ స్క్వేర్ ను నిర్మించారు. జూలు విరగబోసుకుని ఉగ్రంగా చూస్తున్న నాలుగు దిశల్లో ఉన్న నాలుగు బలిష్టమైన సింహాలు, మరోపక్క సందర్శకులపై పన్నీటి జల్లలు కురుపిస్తున్న వాటర్ ఫౌంటేనులు, అంబరాన్ని చుంబించే విజయస్తంభం, నెపోలియన్ యుద్ధాలు మొదలు రెండవ ప్రపంచ యుద్ధం దాకా అనేక యుద్ధాలలో పాల్గొని ఇంగ్లాండు కీర్తి ప్రతిష్టలను నిలిపిన మిలటరీ నాయకుల విగ్రహాలు, అనేక ఇతర కళాత్మక విగ్రహాలతో ఈ ప్రాంగణం నయనానందంగా

ఉండటమేగాక, స్వప్నలోకంలో సంచరిస్తున్నామన్న భావన సందర్శకులకు కలుగుతుంది. అసలు దీని అందమంతా రాత్రుళ్ళు వెన్నెల వెలుగులలోనో లేక రంగురంగుల విద్యుద్దీపాల కాంతులలోనో చూడాలి. వర్తమానంలోని అందమైన అనుభవం భవిష్యత్తులోకి వెళ్ళి శాశ్వతమైన అనుభూతిగా మారుతుంది" (కలల దారులలో యూరపుయాత్ర, పుట-141 మరియు 142).

19వ శతాబ్ది ప్రథమార్థంలో నిర్మింపబడిన ఈ కట్టడం ఒక చారిత్రాత్మక విజయానికి గుర్తు. 1805వ సంవత్సరంలో నెపోలియన్ తో యుద్ధం చేసి, ఫ్రాన్స్, మరియు స్పెయిన్ దేశాలను ఇంగ్లాండ్ ట్రఫాల్గర్ ఓడరేవులో ఓడించింది. అందుకే ఈ స్క్వేర్ ను ఆ విజయానికి ప్రతీకగా నిర్మించారు. లండన్ ను సందర్శించే యాత్రికులకు ఇదొక ప్రముఖ పర్యాటక స్థలం.

### 3.2.1.11.5. సెక్రటేరియట్ – తిరువనంతపురం

తిరువనంతపురం నడిబొడ్డున గల ఈ రాజ భవనానికి దాదాపు నూట యాభై ఏండ్ల చరిత్ర ఉన్నది. తిరువనంతపురంలోని పాళయం అనే వీధి చారిత్రక కట్టడాలకు ప్రసిద్ధి. అనంతపద్మనాభ స్వామి దేవాలయం, విక్టోరియా జూబిలీ టౌన్ హాల్, సెయింట్ సెంట్రల్ లైబ్రరీ, కేరళ యూనివర్సిటీ, అసెంబ్లీ భవనం, సెయింట్ జోసెఫ్ కెథెల్, కన్నెమ మార్కెట్ వంటి అద్భుత, మరియు అరుదైన కట్టడాలు ఈ వీధిలోనే నిర్మింపబడ్డాయి. ఈ సెక్రెటేరియెట్ ని దర్శించిన యాత్రారచయిత ముత్తేవి రవీంద్రనాథ్ గారు దాని చారిత్రక విశిష్టత ఈ విధంగా వివరించారు.

"తిరువనంతపురంలో కెల్లా అతి సుందరమైన భవనం నిస్సందేహంగా కేరళ సెక్రెటేరియేట్ భవనమే, తెల్లగా దూరాన్నుంచే ధవళ కాంతులీనుతూ, రాజసం ఉట్టిపడుతూ కనిపించే ఈ రాజభవనం యూరోపియన్ శైలిలో నిర్మించబడింది. అయిల్యం తిరునాళ్ రామవర్మ (1832-80) పాలనాకాలం (1860-80) లో ఈ రాజభవనం

నిర్మించబడింది. బార్టన్ (Barton)అనే చీఫ్ ఇంజనీర్ దీని డిజైన్ ని రూపొందించాడట" (మా కేరళయాత్ర, పుట–119).

నేటి సెక్రటేరియేట్ భవనం ఒకనాటి ట్రావెన్ కోర్ రాజుల ఆస్థాన భవనం. ట్రావెన్ కోర్ వంశానికి చెందిన చివరి రాజైన చిత్రతిరుణాల్ పట్టాభిషేక మహోత్సవం ఇందులోనే జరిగింది. ప్రజాస్వామ్య ప్రభుత్వం అవతరించాక 1949 నుంచి ఇది కేరళ సెక్రటేరియేట్ భవనంగా ఉపయోగంలో ఉంది. కేరళలోని ప్రముఖ సందర్శనీయ స్థలాలలో సెక్రటేరియేట్ భవనం కూడా ఒకటి.

### 3.2.1.11.6. చార్లెస్ బ్రిడ్జి

చెక్ రిపబ్లిక్ దేశ రాజధాని ప్రాగ్ లో గల చారిత్రాత్మిక కట్టడం చార్లెస్ బ్రిడ్జి. ఇది వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రాగ్ కోటకు రక్షణ కవచం. చెక్ రిపబ్లిక్ లో ప్రవహించే అతిపెద్ద 'వ్లటావా' నదిపై నిర్మింపబడిన అనేక వంతెనల్లో ఇది అతి ప్రాచీనమైనది.

"వ్లటావా నదిమీద31 వంతెనలున్నాయి. వాటిలో అతి పురాతనమైనది చార్లెస్ బ్రిడ్జి. మేము చార్లెస్ బ్రిడ్జ మీదుగానే వ్లటావా దాటి అవతలకి వెళ్ళాలి. బొహోమియన్ సాండ్ స్టోన్ తో పూర్తయ్యాక దీన్ని మొదట్లో స్టోన్ బ్రిడ్జి లేదా ప్రాగ్ బ్రిడ్జి అనేవారు. పాతరోజులలో గుడ్డు సొనని సున్నంలో కలిపి దీన్ని నిర్మించారు. 1870 నుంచి మాత్రమే దీన్ని చార్లెస్ బ్రిడ్జిగా వ్యవహరిస్తున్నారు. బ్రిడ్జి ఫెన్సింగ్ రోజ్లకి వేసిన వందల కొద్దీ తాళాలు చూసాం. వీటిని 'లాక్స్ ఆఫ్ లవ్' అంటారు. ప్రేమికులు ఇక్కడ తాళాలు వేస్తే వారి ప్రేమ సఫలీకృతం అవుతుందనే ఇక్కడివాళ్ళు నమ్ముతారు. 1621లో నరికిన మనుషుల తలలని ఈ బ్రిడ్జి మీద ఉంచి, చెక్ తిరుగుబాటుదారుల ప్రాగ్ కేజిల్ కి రాకుండా ఆనాటి రాజు భయభ్రాంతులకి గురిచేశాడు. 1648లో స్వీడిష్ సైన్యం దాడి చేసినప్పుడు, ఈ బ్రిడ్జి మీద యుద్ధం చేయగా కొంత దెబ్బతింది. పూర్వం సైనికులు దీనిమీద నుంచి శత్రుసైన్యం వస్తోందేమోనని కాపలా కాసేవారు. ఎందుకంటే కోటలోకి  ఈ బ్రిడ్జి మీద నుంచే వెళ్ళాలి" (మా ఐరోపా యాత్ర, పుట– 123 మరియు 124).

వాస్తవానికి జుడిల్ బ్రిడ్జి స్థానంలో చార్లెస్ బ్రిడ్జిని పునర్నిర్మించారు. 1342లో వ్లటావా నదికి వచ్చిన వరదల వల్ల జుడిత్ బ్రిడ్జి ధ్వంసం అవడంతో నాటి రాజు చార్లెస్-4 ఆదేశం మేరకు మరొక బ్రిడ్జిని నిర్మించారు. అదే చార్లెస్ బ్రిడ్జ్. 1357 నుండి 1402 మధ్య కాలంలో నిర్మింపబడిన ఈ బ్రిడ్జి పొడవు 515.8 మీటర్లు. నాడు తూర్పు యూరపు మరియు పశ్చిమ యూరపుల నడుమ ప్రధాన వాణిజ్య మార్గంగా ఆధారమైనది చార్లెస్ బ్రిడ్జి.

1866లో బ్రిడ్జ్ మీద గేస్ లైట్లని అమర్చారు. తర్వాత వాటిని ఎలక్ట్రిక్ లైట్లుగా మార్చారు. దాని మీద గుర్రాలు లాగే ట్రామ్ లైన్స్ వేసారు. 1905లో గుర్రాల స్థానంలో ఎలక్ట్రిక్ ట్రాయ్ వచ్చింది. 1908 నుండి ఈ బ్రిడ్జ్ పై సిటీ బస్సులు కూడా తిరగటం ప్రారంభమైంది. అయితే 1978 నుంచి వాహనాలను నిషేధించారు. దీన్ని కేవలం పాదచారులకే కేటాయించారు.పగలంతా పర్యాటకులతో చిత్రకారులతో, సావనీర్లు, తాళాలు, ఇతర వస్తువులు కియోస్క్ లతో, సంగీతకారులతో రద్దీగా ఉండే ఈ బ్రిడ్జ్ రాత్రి ప్రశాంతంగా ఉంటుందంటూ తన 'ట్రావెలాగ్ ఈస్ట్రన్ యూరప్' అనే యాత్రా గ్రంథంలో వివరించారు. మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు.

### 3.2.1.11.7. ఉలుగ్ బేగ్ మదర్సా

2,500 సంవత్సరాల చరిత్ర కలిగిన నగరం ఉజ్బెకిస్తాన్ దేశంలోని సమర్ ఖండ్. ఒకనాడు ఉజ్బెక్ రాజధానిగా వెలుగొందిన ఈ నగరం ప్రాచీన సిల్క్ రూట్ లో ప్రధాన వర్తక, వాణిజ్య కూడలి మాత్రమేగాక, ప్రాచీన కట్టడాలకు కేంద్రం కూడా. ముఖ్యంగా మధ్యయుగాల కాలంనాటి విజ్ఞాన ఖండాలు. మధ్య ఆసియా చరిత్రలో గొప్ప చక్రవర్తిగా పేరొందిన అమీర్ తైమూర్ మనుమడు మీర్జా ఉలూగ్ బేగ్ 1420లో నిర్మించిన మదర్సా ఉలుగ్ బేగ్ మదర్సా.

"తైమూరు తర్వాత సింహాసనాన్ని అధిష్టించింది ఇతనే. ఇతను జీవించిన కాలం (1394-1449). 1405లో తైమూర్ చనిపోగానే ఇతను రాజ్యాధికారాన్ని చేపట్టినాడు. అయితే ఇతను పరిపాలకుడే గాక మేధావి కూడా. విజ్ఞాన శాస్త్రాల పట్ల మక్కువ ఎక్కువ.

స్వయంగా మదర్సాలలో విద్యార్థులకు గణితశాస్త్రం, ఖగోళశాస్త్రం, తత్త్వశాస్త్రం, మతతత్వశాస్త్రం బోధించేవాడు. ఖగోళశాస్త్రం ఇతని ప్రత్యేక అభిరుచి. ఆ కాలంలోనే ఇతను ప్రత్యేకంగా ఒక నక్షత్రశాల నిర్మించాడు. నిరంతరం పండితులతో విజ్ఞాన శాస్త్ర చర్చలు జరిపేవాడు. మీర్జా ఉలూగ్ బేగ్ చాలా ఇష్టంతో ఈ మదర్సాను తన స్వీయ పర్యవేక్షణలో కట్టించాడు. ముందు ఆ మహాద్వారం దాటగానే లోపల ఉన్న విశాలమైన ప్రదేశంలో వందల మంది విద్యార్థులు చదువుకునే తరగతి గదులు, మధ్యలో పెద్దపెద్ద వరండాలు, వాటితో పాటు వారికి సకల సౌకర్యాలతో వసతి గదులు రెండస్తులలో కనిపిస్తాయి. వీటన్నింటి మధ్యన ఒక మసీదు, దాని చుట్టు మళ్ళీ ఒక ఉద్యానవనం. విద్యావనాల మధ్య ఉద్యానవనం" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర, పుట 26 మరియు 27).

ఉలూగ్ బేగ్ మదర్సానే కాక, షేర్ దోర్ మదర్సా, తిల్లాకారీ మదర్సాలు కూడా రేగిస్థాన్‌లో కొలువై వున్నాయి. పర్షియన్, అరబిక్ భాషల్లో బోధించే ఈ మదర్సాల్లో దాదాపు అన్ని శాస్త్రాలను బోధిస్తారు. ఇప్పటికీ ఎన్నో విద్యా కుసుమాలు ఈ విశ్వవిద్యాలయాల్లో పరిమళించడం ఆనందాయకమైన విషయం.

ఇలా యాత్రాచరిత్రలు ప్రసిద్ధమైన కట్టడాలనే గాక, మరుగున పడిన ఎన్నో చారిత్రక కట్టడాలను గురించి తెలియజేస్తున్నాయి. వీటి వల్ల ఒక ప్రాంతానికే పరిమితమైన ఆయా చారిత్రక కట్టడాల విశిష్టత ప్రపంచవ్యాప్తమవుతుంది. తద్వారా ఆయా దేశాల సంస్కృతీ వారసత్వం చరిత్ర ఎంత ఘనమైందో ఇతర ప్రాంతాల వారు లేదా దేశాల వారు కూడా తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలా తెలుసుకోవడం వల్ల వారిలో ఆలోచనా పరిధి పెరుగుతుంది. అంతేకాదు ఆయా ప్రాంతాలకు పర్యటించాలనే కాంక్ష ఏర్పడుతుంది. తద్వారా మన జ్ఞానతృష్ణ తీరటమే గాక, మానసికోల్లాసం కలుగుతుంది. ఆయాదేశాల పర్యాటకం వృద్ధి చెంది ఆర్థిక పుష్టి చేకూరుతుంది. ఇలా జరగాలంటే ముందుగా చారిత్రక ప్రాధాన్యం ఉన్న కట్టడాలను తప్పనిసరిగా కాపాడాల్సిందే.

కట్టడాలను కాపాడటమంటే ఇటుకలను కాపాడటం కాదు, వాటి నిర్మాణం వెనుక గల చారిత్రక సంఘటనలను, మన ప్రాచీనుల అనుభవాలను, సంస్కృతిని కాపాడటమే.

మన పూర్వీకుల జీవితాల ద్వారా మనం జ్ఞానాన్ని, విలువలను నేర్చుకున్నట్లే. మన తరువాత తరంవారు కూడా నేర్చుకునేందుకు ఆయా కట్టడాలను పరిరక్షించాలి. చరిత్ర అందరికీ అవసరం. చరిత్ర గొప్పతనాన్ని అందరికీ తెలియచేయాలి. ముఖ్యంగా నేటి యువతరానికి నేటితరం విద్యార్థులు చరిత్ర చదవడానికి, తెలుసుకోవడానికి సుముఖంగా ఉండరు. కారణం చరిత్ర అధ్యయనం వల్ల ఎటువంటి ఉపయోగం లేదనే అభిప్రాయం పిల్లల్లో నాటుకుపోవడమే. చరిత్ర విలువ వారికి తెలిసేలా కట్టడాలను చూపించి, విశదీకరించి, అందులోని మంచిని గ్రహించి, చెడును గుర్తించేలా ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యేలా తెలియచేయాలి.

విద్యార్థులకు, యువతకే గాక ఆ దేశ పౌరులకు నగర పౌరులందరికీ వాటి రక్షణ పట్ల కనీస బాధ్యతను కలిగి వుండాలి. అందుకు గానూ మౌఖికంగా, సామాజిక మాధ్యమాల ద్వారా చారిత్రక కట్టడాల పరిరక్షణ పట్ల అవగాహన కలుగచేయాలి. ఆ కట్టడాల నాశనం వెనుక ఆ పరిసర ప్రాంత ప్రజలు కారణం కాకూడదంటే దాని శుభ్రత పట్ల, రక్షణ పట్ల నిర్లక్ష్యాన్ని వహించక తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. చారిత్రక నిర్మాణాల చుట్టూ నివసించే మురికివాడ ప్రజలను వేరే చోటికి తరలించి ఆ నిర్మాణ పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అంతేకాక కట్టడాలకు అవసరమైన మరమ్మత్తులు ఎప్పటికప్పుడు చేయిస్తూ, వాటి పరిరక్షణకు చర్యలు కూడా తీసుకోవల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అందుకు గానూ ఒక ప్రత్యేకమైన శాఖను కేటాయించగలిగితే పర్యాటకాన్ని ప్రోత్సహించిన వారవుతారు.

# నాలుగవ అధ్యాయం

# యాత్రా చరిత్రలు –సాంస్కృతికాంశాలు

# 4.0. యాత్రా చరిత్రలు – సాంస్కృతాంశాలు

ముందు తరాలను మనకు పరిచయం చేసే వారధి సంస్కృతి. మతం, సామాజిక విలువలు, నమ్మకాలు, ఆచారాలు మొదలగు వాటితో మానవునికి గల సంబంధం పేరే సంస్కృతి. ఒకే ఆలోచనా విధానాన్ని, నేపథ్యాన్ని కలిగిన మనుషులను కలిపే సూత్రం సంస్కృతి. క్లుప్తంగా చెప్పాలంటే ప్రజల యొక్క జీవన విధానమే సంస్కృతి. ప్రతీ జాతికి, మతానికి, కులానికి, ప్రాంతానికి, వర్గానికి, మనిషికి ఒక ప్రత్యేకమయిన సంస్కృతి వుంటుంది. సంస్కృతి మనిషి జీవితంలో ఒక అంతర్భాగం. మనిషి పుట్టినప్పటి నుండి గిట్టే వరకు నీడలా వెన్నంటి వుంటుంది. సంస్కృతి లేని జాతిని మనం ఊహించలేము. ఇది ఒక సమాజంలోని మానవుల ఆలోచనలకు ఆచరణలకు ప్రతిబింబవంటిది. అంతేగాక మానవ జీవన గమనానికి ఒక శక్తివంతమయిన సాధనం. సమాజంలోని అన్ని వర్గాల వారిని ఏకతాటిపైకి తెచ్చి, ఐక్యతాభావాన్ని నెలకొల్పడంలో సంస్కృతి ప్రధాన పాత్ర వహిస్తుంది. నాణ్యమయిన నాగరికమైన జీవన విధానం సంస్కృతి వలనే అలవడుతుంది.

సంస్కృతి వైయక్తికమే కాదు, సార్వత్రికం కూడా. ఇది మార్పులకు లోనవుతూ వుంటుంది. ఒక్కోసారి నశిస్తూ కూడా వుంటుంది. ఎందుకంటే సంస్కృతి అనేది మన మానసిక భావన తప్ప, భౌతిక రూపం కాదు. మన మానసిక భావనలకు రూపం కడితే అది సంస్కృతిగా రూపాన్ని పొందుతుంది. భాష, ఆచార–సాంప్రదాయాలు, కళలు, ఆహారం, ఆహార్యం, సారస్వతం, పండుగలు–ఉత్సవాలు మొదలైనవన్నీ కూడా సంస్కృతి ఉత్పత్తులే. ఇవన్నీ తమకు తాము సంస్కృతిని సృష్టించుకోలేవు. కేవలం సంస్కృతి జనకాలు మాత్రమే. ఇది ఎప్పటికప్పుడు తనలోని లోపాలను అధిగమించుకుంటూ, నూతనత్వాన్ని పొందుతూ, ముందుకు సాగుతూంటుంది. మార్పు సంస్కృతి యొక్క మౌలిక లక్షణం.

సంస్కృతి సమాజంలో అంతర్భాగం. ఇది సమాజంతోపాటూ నిరంతరం పరిణామం చెందుతూ వుంటుంది. ఇతర సంస్కృతుల నుంచి ఆదాన ప్రదానాలు జరగడమే

దీనిలోని మార్పుకు కారణం. భిన్న సంస్కృతులు గల ఈ ప్రపంచంలో ఒక సంస్కృతి ప్రభావం, మరొక సంస్కృతిపై పడి, వాటిలో ఆదాన ప్రదానాలు జరగడం సహజం. అయితే ఒక సంస్కృతి మరొక సంస్కృతిని అంత తొందరగా దగ్గరకు రానీయదు. అంతేకాదు భిన్న భిన్న సంస్కృతులు ఒక్కోసారిగా సులభంగా మిళితం కాలేవు.

ముందుగా వ్యతిరేకతలను విడిచే ప్రయత్నం చేస్తూ, మరొక సంస్కృతి లక్షణాలను తనలో కలుపుకుంటూ ఒక ప్రత్యేకమయిన సంస్కృతిగా ఏర్పడదుతుంది. అందుకే సంస్కృతి సంకీర్ణయినది. అనేక జాతులున్న ఈ ప్రపంచంలో ఏక సంస్కృతికి అవకాశం లేదు. అందుకే సంస్కృతుల్లో వైవిధ్యం, భిన్నత్వం కన్పిస్తున్నాయి.

సంస్కృతికి గల ప్రధాన లక్షణం వ్యాపించడం. ఇది తరతరాలకు వారసత్వంగా సంక్రమిస్తుంది. ఆదిమ మానవుని కాలం నుండి నేటిదాకా సంస్కృతి పోగుచేయబడి ముందుతరాల వారికి అందచేయబడుతుంది. దీనికి వ్యాపించే లక్షణమే లేకుంటే ఆదిమమానవుడు కనుగొన్న వ్యవసాయ పద్ధతులు, నిప్పు ముట్టించే విధానం మొదలైనవన్నీ ఎప్పుడో వారితోనే అంతరించేవి. అయితే సంస్కృతి యధాతథంగా తరువాతివారికి సంక్రమించకపోవచ్చు. సందర్భాన్ని బట్టి, కాలాన్ని బట్టి, ఆ ఉన్న సంస్కృతికి ఏదో కొత్తదనం తోడు అవటమో లేదా ఉన్నదాంట్లోంచే కొంత కనుమరుగు అవడమో జరుగవచ్చు.

## 4.1. సంస్కృతి నిర్వచనాలు

1. "ఒక జాతి అభివృద్ధి మార్గమున నడిచిన రీతిని సంస్కృతి యనుచున్నారు" – ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం.

2. సంస్కృతి యనగా నాగరికత, లలితకళలు, సారస్వతము, సభ్యత, దైనందినాభివృద్ధి మున్నగు నుత్తమ గుణములన్నియు కలిసిన విశిష్ట గుణము" – సురవరం ప్రతాపరెడ్డి.

3. "The way of life, especially the General Customs and beliefs of a particular group of people at particular time" – కేంబ్రిడ్జి ఇంగ్లీష్ నిఘంటువు

4. "అర్థాల్నీ విలువల్నీ వ్యాపింపచేసే వ్యవస్థల, ఆచరణల, పద్ధతుల ప్రవర్తనల సమాహారమే సంస్కృతి" (ప్రపంచీకరణ-సంస్కృతి-పుట-11)

సంస్కృతి కేవలం మానవులకు మాత్రమే సొంతం కాదు. సృష్టిలోని అన్ని ప్రాణులూ వాటి వాటి సంస్కృతి పరిధిలోనే జీవిస్తాయి. అంతేగాక వారి జీవనవిధానాన్ని తమ తరువాతి తరాల వారికి అందిస్తాయి. ఉదాహరణకు మనం కోతుల జీవనాన్ని గమనిస్తే ఆడకోతిని పిల్లకోతి కరుచుకునే వుంటుంది. పిల్లకోతి వేసే గెంతులు, చేసే అల్లర్లు అన్నింటిని – తల్లికోతి – తండ్రికోతి గమనిస్తూనే వుంటాయి. ఆ పిల్ల కోతికి ఏదైనా ఆపద పొంచి వున్నట్లు అనిపించినా పిల్లకోతి తల్లికోతి వద్దకు పరిగెత్తడం, తండ్రికోతి రక్షణగా నిలవడం చూస్తుంటాము. అంటే ఆ తండ్రికోతికి తన కుటుంబానికి రక్షణగా నిలవాలని ఎవరు నేర్పి వుంటారు? మనిషి నేర్పలేదుగా! వీటిని తమ ముందు తరాల కోతులనుండి గానీ, ఆ భౌతిక వాతావరణం నుంచి గానీ నేర్చుకుని వుంటాయి. అంటే జంతువులకు కూడా సంస్కృతి వుందనటంలో సందేహం లేదు కదా!

అలాగే కాకి చనిపోయినప్పుడు మిగిలిన కాకులు చుట్టూ చేరి అరవటం, కోతి చనిపోయినప్పుడు మిగిలిన కోతులు దానిచుట్టూ చేరి ఆగ్రహంతో కిచకిచమనడం మనం చూస్తూనే ఉంటాం. అంటే సాటి జీవి చనిపోయినప్పుడు బాధపడాలనే భావనను ఈ ప్రాణులు తమ తరాల వారికి అందించినట్లే కదా! ఈ భావన కూడా సంస్కృతిలో ఒక భాగం. ప్రాణుల యొక్క ఆలోచనా ధోరణులు, మానసిక భావనలన్నీ కూడా సంస్కృతులకి ప్రతిరూపాలే.

సంస్కృతి ఒక తరంతో అంతరించకుండా నిరంతరం ఆ సాంస్కృతిక వారసత్వం కొనసాగించాలంటే ఆ సంస్కృతిని తరువాతి తరాలకు అందించాలి. అలా అందించాలంటే ముందుగా వాటిని నిక్షిప్తం చేసుకోవాలి. అందుకు గ్రంథస్తం చేయడం కూడా ఒక పద్ధతి.

సంస్కృతిని గ్రంథస్థం చేయటంలో యాత్రాచరిత్రలు ప్రధానపాత్ర వహిస్తున్నాయి. యాత్రాచరిత్రల రచన ప్రారంభమయిన నాటి నుండి ఎన్నో ప్రాంతాలకు సంబంధించిన భిన్న సంస్కృతులు లిపిబద్ధం చేయబడ్డాయి. అంతవరకూ ప్రపంచానికి తెలియని ఎన్నో విషయాలను అక్షరీకరించి, ఆయా సంస్కృతులను యాత్రాచరిత్రలు విశ్వవ్యాప్తం చేస్తున్నాయి. అనేక ప్రాంతాలకు చెందిన పండుగలు, ఆచార-సాంప్రదాయాలు, ఆహారం, నమ్మకాలు, మతం, కళలు మొదలైన వాటిని ఇతరులకు పరిచయం చేసి ఆయా సంస్కృతుల్లోని విశిష్టతను తెలియజేయడమే గాక, వాటికి గౌరవాన్ని, విలువను యాత్రాచరిత్రలు కలిగిస్తున్నాయని చెప్పవచ్చు.

## 4.2. పండుగలు

సంస్కృతికి ఆయువు పట్టు పండుగలే. ఇవి ఒక సంస్కృతి యొక్క మూలాలను, విలువలను తరతరాలకు వారసత్వంగా అందిస్తాయి. మనిషి జీవన గమనానికి కావల్సిన శక్తిని అందజేసి, జీవన యాత్ర సాఫీగా జరిగేందుకు ప్రేరణ కలిగిస్తాయి. మనుషుల మధ్య సామాజిక సంబంధాలను పెంపొందించి, విశ్వ ఐక్యతకు తోడ్పడతాయి. తన-పర, ధనిక-పేద, జాతి, కుల, మత భేదాలను మరిచి మానవుల్ని విశ్వమానవులుగా ఎదిగేందుకు సహాయపడతాయి.

## పండుగలు-నిర్వచనం

"A festival is a special occasion of feasting or celebration, usually with a religious focus. A side from religion and sometimes folklore, another significant origin is agricultural, food".

(Wikipedia, Google)

పై నిర్వచనాన్ని బట్టి ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఏ పండుగలైనా నాలుగు రకాలుగా విభజించవచ్చు.

1. మత సంబంధమైన పండుగలు/పురాణ సంబంధమైనవి

2. ఋతు సంబంధమైన పండుగలు/వ్యవసాయ సంబంధమైనవి

3. జాతీయ పండుగలు

4. ఆధునిక దినోత్సవాలు

## 4.2.1. మత సంబంధమైన పండుగలు

మతపరమైన పండుగలు ముఖ్యంగా ఒకే మతానికి సంబంధించిన సమూహాలు జరుపుకునే పండుగలు మతసంబంధ పండుగలు. ఇవి ప్రధానంగా కుటుంబాన్ని కేంద్రీకరించి వుంటాయి. ఏ మతానికి సంబంధించిన పండుగయినా మనుషుల మధ్య ప్రేమ, సహనం, సామరస్యాన్ని కలిగించడమే వాటి పరమ లక్ష్యం. ముఖ్యంగా భగవంతునికి కృతజ్ఞతలు తెలపడం కూడా ఈ పండుగల పరమార్థం. తరువాతి తరం వారికి ధైర్యం, స్థైర్యం, ఆశావాహక దృక్పథం, కృతజ్ఞతా భావం వంటి సామాజిక విలువలను నేర్పించటం కూడా ఈ పండుగల ఉద్దేశ్యం. ఉదాహరణ:- దసరా, క్రిస్టమస్, రంజాన్

## 4.2.2. ఋతుసంబంధమైన పండుగలు

ఈ పండుగలు ప్రకృతి పట్ల మానవులకు గల ప్రేమను తెలియజేస్తాయి. ప్రకృతికి, మనిషికి గల అవినాభావ సంబంధంతో నిర్వహించుకునేవి ఋతుసంబంధమైన పండుగలు. ఉగాది, సంక్రాంతి, హోళి మొదలైనవి. ఈ పండుగల నాడు ప్రకృతి సంతరించుకున్న కొత్త శోభను ఆనందిస్తూ, ఆస్వాదిస్తూ మానసికోల్లాసాన్ని పెంపొందించుకుంటాము. మానవుడు, ముఖ్యంగా వ్యవసాయక దేశమయిన భారత్‌లో ఈ పండుగలకు ప్రాధాన్యం ఎక్కువ ప్రకృతి ఫలాలను మానవాళికి ప్రసాదించేది కాబట్టే ఈ పండుగలకు ఎంతో విశిష్టత.

ఆదిమ మానవుడి కాలం నుండి, వేద నాగరికతా కాలం నుండి మానవ సమూహాలు ప్రకృతిని పరమాత్మగా కొలవడం విదితమే. భారదేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా ఋతువులను అనుసరించి సంబరాలు చేసుకోవడం సాధారణమయిన విషయం. ఋతువులలో ప్రకృతి పాతను వదిలేస్తూ కొత్తను ఆహ్వానించినట్లుగా మనుషులు కూడా పాత జ్ఞాపకాలను వదిలేస్తూ కొత్త భావాలతో జీవితాన్ని సస్యశ్యామలం చేసుకోవాలనేది ఇందులోని అంతరార్థం. ఉదాహరణ:- ఉగాది, ఏరువాక పున్నమి, హోళీ, వసంత పంచమి మొదలైనవి.

### 4.2.3. జాతీయ పండుగలు

ప్రజలలో ఐక్యతకు నిదర్శనంగా నిలిచేవి జాతీయ పండుగలు. మనుషులంతా ఒకటే అనే భావాన్ని కల్పించి, అందరిలోనూ జాతీయ సమైక్యతను పెంచేవి జాతీయ పండుగలు. దేశం కోసం పోరాడి మరణించిన వీరుల వర్ధంతులను, జయంతులను నిర్వహించుకోవడం ఆ దేశ పౌరుల సంస్కారానికి, కృతజ్ఞతకు చిహ్నం. ఆనాడు త్యాగమూర్తుల త్యాగాన్ని తలుచుకుంటూ నివాళులర్పిస్తారు. వారిలోని ధైర్య, త్యాగ గుణాలను పౌరులు పెంపొందించుకోవాలనే లక్ష్యం కలిగినవి ఈ పండుగలు. స్వార్థాన్ని గురించి ఆలోచించకుండా 'పరహితా చరణమతులగు' మంటూ మనకు ఇవి బోధిస్తాయి.
ఉదా :- గాంధీ జయంతి, చాచా నెహ్రూ జయంతి, స్వాతంత్ర్య దినోత్సవం

### 4.2.4. ఆధునిక దినోత్సవాలు

జీవితంలో ఒక వ్యక్తి యొక్క విలువను గుర్తించి, ఆరోజు ఆ వ్యక్తితో మరొక వ్యక్తికి గల బంధాన్ని పండగలా నిర్వహించుకునే రోజులు ఆధునికకాలంలో కన్పిస్తున్నాయి. ప్రపంచీకరణ ప్రభావంతో పాశ్చాత్యీకరణ అన్నిదేశాలపై ప్రభావాన్ని చూపిస్తున్న తరుణంలో పాశ్చాత్యులు నిర్వహించుకునే Mothers Day, Fathers Day, Friendship Day,

Valentines Day మొదలగునవి ప్రపంచవ్యాప్తంగా వ్యాపించి, విశ్వ పండుగలుగా నేడు చెలామణీ అవుతున్నాయి

నేడు మతపరమైన, ఋతుపరమైన, జాతీయపరమైన పండుగలకంటే ఈ ఆధునిక దినోత్సవాలే ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందటమేకాక, ఆచరణలో కూడా వున్నాయి. నేటితరం యువత సాంప్రదాయబద్ధమయిన పండుగలను జరుపుకోవడం కంటే ఇలాంటి రోజుల్ని సంబరాలుగా చేసుకోవటానికే ఇష్టపడుతున్నారు. ఈ పండుగలు కూడా మాన విలువల్ని ఒక వ్యక్తితో గల అనుబంధాన్ని పెంచేందుకు ఆవిర్భవించినవే. కాబట్టి ఈ పండుగలను జరుపుకుంటూనే తరాలుగా సంస్కృతీ వారసత్వంగా వచ్చిన సాంప్రదాయ పండుగల్ని కూడా మరవకూడదు.

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భిన్నసంస్కృతులు వున్నాయి. వాటికి ప్రతిరూపాలుగా ఎన్నో పండుగలు కూడా వున్నాయి. యాత్రా రచయితలు ఆయా ప్రాంతాలను దర్శించినప్పుడు ఆ స్థానిక పండుగలను, వాటి విశిష్టతను తమ యాత్రాచరిత్రల్లో పొందుపరిచి, ఇతరుల సంస్కృతుల వైవిధ్యాన్ని పరిచయంచేసిన యాత్రాచరిత్రలు ఎన్నో తెలుగులో కన్పిస్తున్నాయి. అందులో ముందుగా చెప్పుకోవాల్సిన యాత్రాచరిత్ర 'షంఘై నింగిలో' రచయిత్రి శ్రీలక్ష్మి గారు చైనాలో జరుపుకునే పండుగలను ఈవిధంగా వివరించారు. "షంఘైలో సెప్టెంబర్ నెలాఖరిలో ఊరంతా అట్టహాసంగా వివిధ రకాలుగా అలంకరించారు. ఎక్కడ చూసినా లైట్లు తోరణాలు దర్శనమిచ్చాయి.... ఎందుకంటే అది చైనీయుల పండుగ, కురుగంటి శ్రీలక్ష్మి గారు చైనీయుల పండుగలను గురించి వివరించారు. రచయిత్రి షంఘై దర్శించిన సందర్భంలో చైనీయులు జరుపుకునే పండుగల్ని ప్రత్యక్షంగా గమనించి, వారి పండుగలలోని వైవిధ్యాన్నీ, విశిష్టతను ఈవిధంగా వివరించారు.

చైనాలో కొత్త సంవత్సరాన్ని ఛున్‌చి (chunjie) పేరుతో పండుగగా జరుపుకుంటారని, ఇది వసంత ఋతువు ఆరంభం మొదటి రోజు వస్తుందని వివరించారు. ఈ పండుగ సందర్భంగా చైనీయులు ఏడు రోజులు సెలవు దినాలుంటాయి. వీరు తమ

కుటుంబ సభ్యులతో కలిసి సింహాల, డ్రాగన్‌ల జానపద నృత్యాలను చూస్తూ ఆనందిస్తారు. వినోదాన్నిచ్చే ఆటలాడుకోవడం, టపాకాయలు కాలుస్తూ పండగని 15 రోజులు పాటూ జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంలో ఎరుపురంగు ప్యాకెట్‌లలో డబ్బుని పిల్లలకు కానుకగా ఇస్తారు. అలా ఇవ్వటం వల్ల ఆరోగ్య, సంపద, అదృష్టం కలిసి వస్తుందని వీరి నమ్మకం. ఈవిధంగా చైనీయులు కొత్త సంవత్సరాన్ని ఘనంగా ఆహ్వానించి, నూతనోత్సాహాన్ని పుంజుకుంటారని రచయిత్రి శ్రీలక్ష్మిగారు పేర్కొన్నారు.

చైనీయులకు కూడా భారతీయలు లాగే ఋతుసంబంధమైన పండుగలు వున్నాయని పై మాటల్ని బట్టి అర్ధమవుతుంది. దక్షిణ భారతీయులు ఉగాది, ఉత్తరాది వారు హోళీని నిర్వహించుకున్నట్లుగా చైనీయులు కూడా వసంత ఋతువులో ఈ 'ఛున్‌చి' అనే పండుగని నిర్వహించుకోవటం గమనించదగ్గ విషయం. అలాగే భారతదేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల వారికి నూతన సంవత్సరం వసంత ఋతువులో చైత్రమాసంలో వస్తుంది. చైనీయుల నూతన సంవత్సరం కూడా వసంత ఋతువులోనే రావడం గమనార్హం. చైనా, భారత్ రెండూ కూడా ఆసియా ఖండంలో వుండటమే కారణం. చైనీయులు ఈ పడుగను జరుపుకోవడంలో రెండు కారణాలు వుండవచ్చు. సంవత్సరం మొత్తం పడిన కష్టానికి విశ్రాంతి తీసుకుంటూ, అయిన వాళ్ళతో గడపాలనుకోవడం, నూతన సంవత్సరం నుండి అదృష్టం కలిసి రావాలనుకోవటం.

భారతీయ పండుగలలో సారూప్యత కలిగిన మరొక చైనీయుల పండుగ 'యు అన్ ష్యాచి' (yuan xiaojie) ఇది పౌర్ణమి నాదు వస్తుంది. ఇది ప్రధానంగా దీపాల పండుగ. "దీపాల్ని, ముఖ్యంగా సాంప్రదాయకంగా వెలిగించే లాంతర్లు, క్రమంగా విద్యుద్దీపాలకి మారినా... ఆ అవశేషాల్ని గుర్తించుకుని దీపాల్ని వెలిగించి చేసుకునే ఈ పండుగ జీవితానికి వెలుగును ప్రసాదించమని కోరే పండుగ. జీవితపు అంధకారాన్ని పారద్రోలి వెలుగును నింపి సంపదలతో, జీవితంలో ముందుకు సాగాలనేది ఇందులో ఇమిడిన ఆంతర్యం" (షంఘై నింగిలో, పుట-51). ఈ పండుగ చైనీయుల చాంద్రమానం ప్రకారం ప్రతీ

సంవత్సరం ఫిబ్రవరి 5వ తేదీ నుండి మార్చి 7వ తేదీల మధ్య మొదటి పౌర్ణమి నాడు వస్తుంది.

2016లో ఫిబ్రవరి 22న

2017లో ఫిబ్రవరి 22న

2018లో ఫిబ్రవరి 02న

2019లో ఫిబ్రవరి 19న ఈ పండుగను నిర్వహించుకుంటారు.

ఈ పండుగకు దాదాపుగా 2000సంవత్సరాల చరిత్ర ఉంది. హాన్‌వంశ రాజైన హాన్-మిన్-ద్ది కాలంలో బౌద్ధ సన్యాసులు ఆలయాల్లో చైనీయుల చాంద్రమానం ప్రకారం మొదటి పౌర్ణమినాడు బుద్ధున్ని పూజిస్తూ భక్తితో దీపాలను వెలిగించేవారట. ఈ విషయం తెలుసుకున్న రాజు ప్రతీ చాంద్రమానం పౌర్ణమినాడు ప్రతీ గుళ్ళో, ఇంట్లో, రాజస్థానాలలో సాయంత్రం దీపాలను వెలిగించాలని ఆజ్ఞాపించారు. అలా బౌద్ధసన్యాసులు చేసిన పూజా విధానం ఒక పెద్ద పండుగగా కాలక్రమేణా రూపాన్ని సంతరించుకుంది.

జీవితంలోని చీకటిని పారద్రోలి, వెలుగునిచ్చే పండుగలో భారతీయులు దీపావళిని జరుపుకుంటారు. అలాగే చైనీయులు కూడా దీపాల పండుగ జరుపుకోవడం వెనుక కూడా ఇదే ఉద్దేశ్యం దాగుంది. చీకటిని చెడుకు, కష్టానికి చిహ్నంగా భారతీయులు భావించినట్లే చైనీయులు కూడా విశ్వసించడం విశేషం. అలాగే చనిపోయిన తమ పితృదేవతలను తలచుకుని చైనీయులు చేసుకునే మరో పండుగ 'చింగ్‌మింగ్‌చి' – "ఇది ఏప్రిల్ మొదటివారం 5వ తారీఖున మళ్ళీ శుక్లపక్షం పౌర్ణమిలో వస్తుంది చింగ్ మింగ్ చి (xing ming jie). ఇది చనిపోయిన వాళ్ళను తలుచుకునే పండుగ ... వాళ్ళ సమాధులకు చైనీయులు సమర్పించే పూలు, గతం పునాదుల మీద తాము పురోగతిని సాధిస్తున్నామని కుటుంబంలోని బంధువులతో వాళ్ళకి అంజలి ఘటించడం, అంటే వాళ్ళ ఆత్మను భగవత్ స్వరూపంగా తలుచుకుని పూజ చేయటమే (షంఘై నింగిలో, పుట-51), చైనీయులు జరుపుకునే ఈ పండుగ వారి సత్సాంప్రదాయానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు. గతించిన పూర్వీకులను మర్చిపోకుండా, తరువాతి తరాలకు పెద్దల విలువలను తెలియజెప్పే

ఉద్దేశ్యంతో ఈ రోజును ఒక పండుగగా నిర్వహించుకోవడం నిజంగా అభినందనీయం. భారతీయులు అందునా తెలుగువారు సంక్రాంతినాడు, దీపావళి అమావాస్య నాడు నువులు, గుమ్మడికాయ బ్రాహ్మణుడికి దానమిచ్చి, గతించిన పెద్దలకు తర్పణాలు ఇవ్వడం ఆనవాయితి. ఈ రెండు దేశాల సంస్కృతుల్లో కూడా గతించిన పెద్దవారిని తలుచుకోవడం, నివాళులు అర్పించడం సామాన్యాంశం.

ఈ పండుగకు దాదాపు 2500 సంవత్సరాల చరిత్ర వుంది. ఈరోజు సమాధులను శుభ్రం చేసి, ఆహార పదార్థాలు, టీ, వైన్, అగరబత్తీలు, పూలను ఆ సమాధులకు సమర్పిస్తారు. ఆ రోజు గాలిపటాలను చిన్నా-పెద్దా తారతమ్యం లేకుండా ఎగురవేయటం పరిపాటి. ఆ గాలి పటాలకు చిన్ని తాంతర్లను కూడా దారంతో బిగించి ఎగురవేస్తారు. ఇలా రంగురంగుల దీపాలతో ఎగిరే గాలిపటాలు అదృష్టాన్ని తేవడమే కాక, రోగాలను పోగొడతాయని చైనీయులు నమ్ముతారు.

వీరి పండుగల్లో ఋతుసంబంధమైనవి, నమ్మకాలకు సంబంధించినవే కాక, జాతీయ వీరులను సంస్మరించుకునే పండుగలు కూడా ఉన్నట్లు 'షంఘై నింగిలో' అనే యాత్రాచరిత్ర ద్వారా తెలుస్తుంది. "అట్టహాసంగా చైనీయులు జరుపుకునే మరొక పండుగ ఐదో నెలైన జూలైలో జరుపుకునేది. ఇది వీరుల మరణాన్ని తెలిపేది. దేశం కోసం ప్రాణాలర్పించిన చూయు అన్ (Qu yuan) దేశభక్తిని చూపిన కవి. దేశం కోసం, యుద్ధకాలంలో హునాన్‌లోని మిల్యో (miluo) నదిలో మునిగి పోయిన రోజు ఇది .... ఇతను రాజకీయంగా 'చిన్'ల పాలనలో జరిగే అక్రమాలను సహించలేక తనంత తాను ఆత్మార్పణం చేసిన వీరుడిగా, ఆ రోజు ప్రజలు తమ పడవలతో అతని శరీరాన్ని వెతికి, విఫలమయ్యి ప్రతీ ఏడాది అదేరోజు అతనికి భోజనాన్ని పంపుతారు. ఐతిహ్యం ప్రకారం అతని ఆత్మ ఒకసారి ఎవరినో కలిసి తనకు పంపిన ఆహారం డ్రాగన్ ఎత్తుకుపోయిందనీ, దాన్ని వాసంతో 5 రంగుల దారంతో కట్టి పంపమని చెప్తారు...... ఇక్కడ చనిపోయిన వీరులను స్మరించటం, వాళ్ళు చేసిన సేవల్ని గుర్తు చేసుకోవటంలో ప్రజలకు వాళ్ళపై అభిమానంతో పాటూ, వీరత్వాన్ని, ఉత్సాహాన్ని పాదుకొల్పుతుంది – వీరుడు చనిపోయినా

అతని త్యాగం తలుచుకొని చేసుకునే ఈ పండుగలోని స్మరణం, భావితరానికి ఉత్సాహంతో పాటూ ఉద్రేకాన్నీ, తాము అలా ఉండాలని ఆదర్శంగా గ్రహించటానికి వీలు కలుగజేస్తుంది" (షంగై నింగిలో, పుట-53).

నిజంగా ఇదొక గొప్ప పండుగగా అభివర్ణించవచ్చు ఒక వ్యక్తి చేసిన త్యాగాల్ని, సేవల్ని గుర్తించుకుని అతని జయంతి నాడో / వర్ధంతి నాడో స్మరించుకోవడం అభినందిచదగ్గ విషయం. ఆయా మహానుభావుల్లోని కొన్నైనా మంచి లక్షణాలను వ్యక్తులు గ్రహించి, ఉన్నత గుణాలతో వర్ధిల్లాలనేదే ఈ జాతీయ పండుగల ప్రధాన ఉద్దేశ్యం అయివుండవచ్చు. ఆ గొప్ప వ్యక్తుల అడుగుజాడల్లోనే మిగిలిన ప్రజలు అడుగులు వేయాలనే సత్‌సంకల్పమే ఈ పండుగల పరమార్ధం. భారతదేశంలో కూడా గాంధీజయంతి, అంబేద్కర్ జయంతి, సుభాష్ చంద్రబోస్ జయంతి, అంటూ ఎన్నో జాతీయ పండగల్ని మనం జరుపుకోవటం తెలిసిందే. నేడైనా కనీసం ఆ మహనీయుల పడిన కష్టాలను, చేసిన త్యాగాన్ని గుర్తుచేసుకుని, ఆ త్యాగాలు వృధా అవకుండా సత్ప్రవర్తనను అలవరుచుకోవాలనేదే ఈ పండుగల పరమార్ధం. ఇలా చైనీయులు తమ వారి త్యాగాల్ని సంస్మరించుకునే రోజు మరొకటుంది. అదే వారి జాతీయ పండుగ. ఇది ప్రతీ సంవత్సరం అక్టోబర్ ఒకటిన వస్తుంది. "ఆ రోజు అక్టోబర్ ఒకటి, వారం దినాలు చైనీస్ నేషనల్ వీక్. అక్టోబర్ విప్లవ విజయోత్సవ సంబరాలు. వారం రోజులు బ్యాంకులతో సహా అన్ని కార్యాలయాలకు, విద్యాసంస్థలకు సెలవులు" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర పుట.137).

అయితే చైనీయుల పండుగలన్నీ దాదాపుగా పౌర్ణమి నాడే జరుపుకోవడం గమనించదగ్గ విషయం. అంతేకాక ప్రతీ పండక్కి గాలిపటాలు ఎగరేయటం, అవి ఎంతపైకి ఎగిరితే అంత ఉచ్చదశలో మనుషులు జీవిస్తారనే నమ్మకం కూడా ఆసక్తికర అంశమే. వీరు ఎత్తును జీవితంలోని ఎత్తుతో పోల్చటాన్ని గమనిస్తుంటే భారతీయుల భావనా దృక్పథంలో, ఆలోచన ధోరణిలో, నమ్మకాల్లోనూ చైనా-భారతీయులలో ఎక్కువ తేడాలున్నట్లు కన్పించదు. "చైనా పతంగులకు ప్రసిద్ధి చెందింది. పతంగులు ఎగురవేయటం చైనీయులకు చాలా ఇష్టం. ప్రతీ పండుగకు, ప్రతీ సంతోష సమయంలో పతంగులను ఎగురవేస్తారట.

చైనాలో పతంగులకు మూడువేల ఏండ్ల చరిత్ర ఉంది. పతంగులు ఎగరవేయడం వల్ల ప్రగతి, సౌభాగ్యం కలుగుతాయని వాళ్ళ విశ్వాసం, పతంగు ఎంత ఎత్తుకు ఎగిరితే అంతగా జీవితంలో శుభాలు జరుగుతాయని, ఆనందం కలుగుతాయని వాళ్ళ నమ్మకం. .... గుజరాత్‌లో పతంగులు ఎగురవేయుట, పతంగుల పోటీలు ఎక్కువే. హైదరాబాద్‌లోనూ జనవరి నెలలో సంక్రాంతి సమయంలో పతంగులు ఎగురవేసే పండుగ జరుపుకుంటారు" (అద్భుతచైనాయాత్ర, పుట.30).

ప్రతీ పండక్కి చైనీయులు గాలిపటాలు ఎగరవేయటమనేది వారికి అలవాటుగా మారిపోయింది. ఇరుగుపొరుగు వారితో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపడం, రోజువారీ పనులతో అలసిన తమ వయసును ఇలా వినోదిస్తూ పునరుత్తేజాల్ని కల్పించుకోవడం కుటుంబ సభ్యులతో తగిన సమయాన్ని గడపడం, సామాజిక సంబంధాల్ని పెంచుకోవడమే ఈ పండుగలనాడు గాలిపటాలు ఎగిరేయటానికి కారణం అయి వుంటుంది అని చెప్పవచ్చు. తమ సంతోషాన్ని గాలిపటాల్ని ఎగరవేయటం ద్వారా తెలియజేస్తారు. చైనాలో వుండే ప్రదర్శనశాలలో దాదాపుగా 4,000 గాలిపటాల్ని జలచరాలు, పక్షులు, కార్టూన్ల వంటి భిన్న ఆకృతుల్లో చేసిన వాటిని వుంచారని కురుగంటి శ్రీలక్ష్మి గారు పేర్కొన్నారు. 'సంగ్ల్' అనే చైనా రాజుల పాలనలో ఆనందానికి, ఆరోగ్యానికి సంకేతంగా వీటిని ఎగరవేస్తారని, తాబేళ్ళు, కొంగలు వంటి గాలిపటాల్ని ఎక్కువకాలం బ్రతకడానికి, పూలు, సీతాకోక చిలుకలు సమత్వానికి, డ్రాగన్ గాలిపటం ఎంత ఎత్తుకు ఎగిరితే జీవితం అంత ఉచ్ఛదశలో వుంటుందనీ, అంత ఆనందంగా బ్రతుకుతారని, ఒడిదుడుకులుండవని వీరి అభిప్రాయం.

వీరు పైన పేర్కొన్న పండగలేకాక, మార్చి 8న మహిళాదినోత్సవం, మే-1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్నీ, మే-4న యువజనోత్సవాన్ని, జూన్-1న జాతీయ బాలల దినోత్సవాన్నీ, సెప్టెంబరు-10న గురుపూజా దినోత్సవాన్ని, అక్టోబర్-1న జాతీయ దినోత్సవాన్ని తమ పండుగల్లో, అట్టహాసంగా ఆర్భాటంగా నిర్వహించుకుంటారు.

చైనీయులకు లాగే భారతీయులకు కూడా ఎన్నో పండుగలను జరుపుకుంటారు. భారతదేశం భిన్న సంస్కృతుల సమ్మేళనం. ఇక్కడ అనేక మతాలు, కులాలు, రాష్ట్రాలు వుండటం వల్ల ఒక్కో వర్గానికి సంబంధించిన వివిధ పండుగలను జరుపుకోవడం సర్వ సాధారణమయిన విషయం. ఈ మతాలకు, కులాలకు, రాష్ట్రాలకు చిహ్నంగా కొన్ని పండుగలు వ్యాప్తిలో ఉన్నాయి. ఉదాహరణ:- తమిళులకు సంక్రాంతి, తెలుగు వారికి ఉగాది, అలాగే కేరళ వారికి ఓనం, మొదలైన పండుగలు ముఖ్యమయినవి. ఈ ఓనం పండుగ విశిష్టతను ముత్తేవి రవీంద్రనాథ్‌గారు తన 'మా కేరళ యాత్ర' అనే గ్రంథంలో ఈ విధంగా వివరించారు. "ఏటా ఆగష్టు/సెప్టెంబర్ నెలల్లో వచ్చే ఓనం కేరళలో అతిపెద్ద పండగ. ఈ పండుగకూ బలి చక్రవర్తికీ ఒక సంబంధం ఉంది.... బలిని విష్ణువు వామనుడైన ఒక బ్రాహ్మణ వటువు రూపంలో వచ్చి, మోసపూరితంగా మూడు అడుగుల స్థలాన్ని దానంగా కోరి, ఒక అడుగుతో నేలనూ, మరో అడుగుతో ఆకాశాన్ని ఆక్రమించి, మూడవ అడుగును బలి తలపై మోపి, అతడిని పాతాళానికి తొక్కేశాడనీ, అందుకే విష్ణువును త్రివిక్రముడు అంటారనీ పురాణాలు పేర్కొన్నాయి. తన ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారో లేదో కళ్ళారా చూసేందుకు ఏటా ఒకసారి తాను పాతాళం నుంచి భూమి మీదకి వచ్చేటట్లు తనకు వరమివ్వమని విష్ణువును తన ఆఖరి కోరికగా కోరాడట బలి. ఆయన భూలోకానికి వచ్చే సమయాన్నే కేరళీయులు ఓనం పండుగగా జరుపుకుంటారు. 'బలి వరుహిర' అంటూ వీరు బలికి ఆత్మీయంగా ఆహ్వానం పలుకుతారు. ఇళ్ళముందు నేలపై ముగ్గులతో, పూలతో బలికి స్వాగత వచనాలు రాస్తారు. తాము సుఖసంపదలతో తులతూగుతుంటే తమ అభిమాన చక్రవర్తి అది చూసి సంతోషిస్తాడని వారు ఓనంను పెద్ద ఎత్తున అత్యంత ఆడంబరంగా జరుపుకుంటారు. కొత్తబట్టలు వేసుకుంటారు. గొప్ప విందులు చేసుకుంటారు. ఇళ్ళ ఆవరణలన్నీ వివిధ పూలతో అలంకరిస్తారు. వారి ఆనందానికి సంకేతంగా పడవల పోటీలు జరుపుకుంటారు" (మా కేరళ యాత్ర – 2016, పుట-57).

ఓనం పండుగను కేరళ రాష్ట్ర పండుగగా అభివర్ణించవచ్చు. ఇది మలయాళీల కాలెండర్ ప్రకారం చింగమ్ అనే మాసంలో వస్తుంది. ఓనంను ముఖ్యంగా నమ్మకాలకు

సంబంధించిన పండుగగా చెప్పవచ్చు. అంతేకాక ఇది వ్యావసాయిక పండుగ. ఇది పదిరోజుల పాటూ జరుగుతుంది.

| | | |
|---|---|---|
| మొదటి రోజు | – | ఆతమ్ |
| రెండవ రోజు | – | చితిర |
| మూడవ రోజు | – | చోధి |
| నాలుగవ రోజు | – | విసాకమ్ |
| ఐదవ రోజు | – | అనిర్గమ్ |
| ఆరవ రోజు | – | త్రికెత |
| ఏడవ రోజు | – | మూలమ్ |
| ఎనిమిదవ రోజు | – | పూరదమ్ |
| తొమ్మిదవ రోజు | – | ఉతర్సమ్ |
| పదవ రోజు | – | తిరువోన్ అని వ్యవహరిస్తారు |

వీటిలో మొదటి రోజైన ఆతమ్, చివరి రోజైన తిరువోనమ్ లను ప్రధానమైన రోజులుగా వీరు జరుపుకుంటారు. ఈ పదిరోజులు విందు వినోదాలతో, నృత్య, గానాలతో, ఆటలతో, పడవల పోటీలతో ఉత్సాహంగా గడుపుతారు. ఓనం అనగానే గుర్తుకు వచ్చేవి అందంగా అలంకరింపబడిన ఏనుగులు, పూలు. ఈ పదిరోజులు రకరకాల రంగవల్లులు వేసి, బలిచక్రవర్తికి స్వాగతం పలుకుతాయి.

1961లో కేరళ ప్రభుత్వం తమ రాష్ట్రపండుగగా ఓనంను ప్రకటించినప్పటి నుండి ఈ పండుగను అట్టహాసంగా ప్రతీ సంవత్సరం జరుపుతుంది. కేరళ టూరిజం శాఖవారు ఓనం పండుగ సమయంలో టూరిస్టు ప్యాకేజీల్లో తగ్గింపులు ఇస్తూ తద్వారా తమ పండగ గొప్పదనాన్ని చాటేందుకు ప్రయత్నిస్తుంటారు. అందుకే ఈ సమయంలో వేలాదిమంది దేశ విదేశీ యాత్రికులలో కేరళ రాష్ట్రం కిటకిటలాడుతుంటుంది.

ఓనం సంబరాలలో ముఖ్యంగా చెప్పుకోదగ్గవి ఓనం సద్య. ఇది తొమ్మిది రకాల ఆహారాలతో, పదమూడు రకాల కూరలతో కూడిన విందు భోజనం. దీనిని పదవరోజయిన

తిరువోనమ్ నాడు వండుతారు. అలాగే ఓనం నాడు కేరళీయులంతా ఉత్సాహంగా ఎదురుచూసేది నావల పోటీల కోసం. సర్పాకారంలో వుండే నావల్ని రకరకాల పూలతో అలంకరిస్తారు. నావికులు కేరళ సాంప్రదాయ జానపద గీతాలను పాడుతూ, చూసేవారికి ఆనందాన్ని కలుగజేస్తూ, ఇతర పడవల నావికులతో పోటీపడతారు. 1952 నుండి నెహ్రూ ట్రోఫీ పేరుతో ప్రతీ సంవత్సరం ఓనంనాడు సర్ప నావల పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా మారింది. ఈ పోటీలు చూడటానికి అనేక రాష్ట్రాల నుండి, దేశాల నుండి వేలాది మంది పర్యాటకులు ఏటా ఇక్కడికి వస్తుంటారు.

కేరళీయులకు ఓనం ఎంత ప్రధానమో ఉత్తరభారతీయులకు హోళీ అంత ప్రధానం. పాటిబండ్ల వెంకటపతి రాయలు గారు ఉత్తర భారతదేశంలో జరుపుకునే హోళీ పండుగ విశేషాలను గురించి తెలియజేస్తూ "ఈ రోజు హోళీ పండుగ. ఈ పండుగ సంబరం ఉత్తరభారతంలో చాలా ఎక్కువ. ఈ సమయంలో స్త్రీలు, పురుషులు, బాలురు, బాలికలు, పరస్పరం రంగు నీళ్ళు చల్లుకోవడం, రంగులు రుద్దుకోవడం సర్వసామాన్యంగా ఉండును. ఇచట నీ పండుగలో పాల్గొనుటకై ఎందరో విదేశీయులు వచ్చుచుందురు. నా మీద కూడా కొందరు రంగునీళ్ళు చల్లేందుకు వచ్చారు" అని ప్రస్తావించారు (నా ఉత్తర భారతయాత్ర-పుట.256),

భారతదేశయాత్రల పట్ల విదేశీయులను ప్రేరేపించే అంశాలలో మన సంస్కృతి ప్రధానమైనది. వాటిలో మన పండుగల నిర్వహణ వారిని ఎక్కువగా ఆకర్షించే అంశం. ఉత్తర భారతంలో జరిగే హోళీ పండుగ సంబరాల్ని చూడటానికి ఏటా వేలాది మంది అంతర్జాతీయ యాత్రికులు భారతదేశానికి వస్తున్నారు.

భారతీయులు జరుపుకునే ఈ రంగుల పండుగలని అనేక దేశాలవారు కూడా జరుపుకుంటారు. దక్షిణాఫ్రికా, జర్మనీ, కెనడా, మలేషియా, నెదర్లాండ్స్, బ్రెజిల్, రష్యా దేశాల్లో ఈ పండుగను అట్టహాసంగా జరుపుకుంటారు. ముఖ్యంగా అమెరికాలోని న్యూయార్క్‌లో జరిగే హోళీ సంబరాలను చూడటానికి, అందులో పాల్గొనటానికి అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి అనేకమంది యాత్రికలు రావడం గమనించదగ్గ విషయం.

అమెరికాలో ఈ రంగుల పండుగనే కాక అనేక పండుగల్ని నిర్వహించుకుంటారు. అవి వారి యొక్క సాంస్కృతిక మూలాల్ని పరిచయం చేసేలా ఉంటాయి. మరియు ఆ దేశ సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రపంచం ఒక కుగ్రామంగా మారిపోవడంతో ఇతర దేశీయులెందరో, విద్య, ఉద్యోగాల నిమిత్తం అమెరికాలో స్థిరపడటం తెలిసిందే. విభిన్న జాతులవారు దేశాలవారు అక్కడ నివసిస్తూనే తమ సంస్కృతి మూలాలను మర్చిపోకుండా ఉండేలా పండుగలు జరుపుకుంటారు. ముఖ్యంగా అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో, న్యూయార్క్‌లో చైనీయులు ఎక్కువగా వుండటం వల్ల చైనీయుల కొత్త సంవత్సర వేడుకలు పెద్ద ఎత్తున జరుపుతారు. భారతీయులు కూడా తమ సాంప్రదాయ పండుగలతో పాటూ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్ని కూడా జరుపుకోవడం "జనవరి ఒకటో తేదీ, అమెరికా స్వాతంత్ర్య దినోత్సవ వేడకలు, క్రిష్టమస్ పండుగ, కొన్ని చర్చిలకు సంబంధించిన ఉత్సవాలను కూడా అమెరికా ప్రజలు ఘనంగా నిర్వహిస్తున్నారు....... బోస్టన్‌లో ఏప్రిల్ నెలలో దేశభక్తుల దినోత్సవం, జూలైలో హార్బర్ ఫెస్టివల్, అక్టోబర్ చివరివారంలో చార్లెస్ నదిలో పడవ పందాలు జరుగుతాయి. వీటిని చూస్తే మనదేశంలోని కేరళలో ఏటా జరిగే పడవపందాలు సహజంగానే గుర్తుకువస్తాయి" (ఆంధ్రా టూ అమెరికా, పుట.53).

ప్రతీ సంవత్సరం మే-17న జరిగే సెయింట్ పాట్రిక్‌డే నాడు జరిగే వేడుకలో దాదాపు లక్షన్నరకు పైగా ప్రజలు పాల్గొంటారని అంచనా. అక్టోబర్ రెండో సోమవారం కొలంబస్ అమెరికాను కనుగొన్న సందర్భంగా కొలంబస్‌డే పేరేడ్ చేస్తారు. అలాగే నవంబర్ నాలుగవ తేదీన థాంక్స్ గివింగ్‌డే ని నిర్వహించుకుంటారు. దీనిని న్యూయార్క్ కార్నివాల్ అని కూడా పిలుస్తారు. క్రిష్టమస్ వీరు జరుపుకునే అతిపెద్ద పండుగ. అలాగే సంవత్సరాంతమైన డిసెంబర్-31న అమెరికాలోని టైమ్‌స్క్వేర్ వద్ద వేలాది మంది కొత్త సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ నిర్వహించుకునే న్యూ ఇయర్ డేని చూసి తీరవల్సిందే.

అమెరికన్లకు అతి ఇష్టమయిన పండుగ చెర్రి బ్లోజమ్ ఫెస్టివల్. దీని గురించి కొమ్మినేని శ్రీనివాసరావుగారు తెలియజేస్తూ, "ఏప్రిల్ తొలివారంలో చెర్రిబ్లోజమ్ ఫెస్టివల్

వుంటుంది. జపనీస్ చెర్రీస్ పూలు పూసి అందంగా ప్రకృతి మారే తరుణంలో ఈ పండుగ ఉంటుంది. లాంతర్లతో ఊరేగింపు చేస్తారు." (ఆంధ్రా టూ అమెరికా, పుట-55) నిజానికి చెర్రీబ్లోజమ్ ఫెస్టివల్ జపాన్‌కు చెందిన పండుగ. కానీ టోక్యో నగర మేయర్ యుకియో ఒజాకి (Yukio ozaki) ఈ జపనీస్ చెర్రి మొక్కలను అమెరికా జపాన్ మధ్య స్నేహానికి గుర్తుగా 1912, మార్చి 27న బహూకరించారు. అప్పటినుండి ఈ రెండు దేశాల మధ్య సత్సంబంధాలకు వారధిగా అమెరికాలోని ప్రతీ యేటా ఈ పండుగను నిర్వహించుకుంటారు. ముఖ్యంగా వాషింగ్టన్ డి.సి.లో, శాన్‌ఫ్రాన్సిస్‌కో లో జరిగే ఈ పండుగ ఆకర్షణీయంగా వుంటుంది.

అమెరికాలో ఆధునిక దినోత్సవాలను గొప్పసంబరాలుగా నిర్వహించుకోవడం కన్పిస్తుంది. మదర్స్‌డే, ఫాదర్స్‌డే, వంటివేగాక, హోమో సెక్సువల్స్‌డే, మారథాన్‌డే వంటి ఉత్సవాల్ని కూడా నిర్వహించుకుందురు. "ఇక్కడ మరో విచిత్రం ఏమిటంటే హోమో సెక్సువల్స్ ఆడ (లెస్బియన్స్), మగ (గే) ఇద్దరూ కూడా జూన్ చివరి ఆదివారం నాడు పెద్ద ప్రదర్శన చేస్తారు. లక్షకు పైగానే ఈ తరహా వారు పాల్గొంటారట. ..... జూన్‌లో శాన్‌ఫ్రాన్సిస్‌కోలో రెండు లక్షల మంది లెస్బియన్‌లు, గేలు ప్రదర్శనలకు జరపడం ఒక విశేషమే" (ఆంధ్రా టూ అమెరికా, పుట.56)

అమెరికాలో అనేక రాష్ట్రాలలో ప్రతీ సంవత్సరం ఈ ఉత్సవాలు జరుగుతుంటాయి. ఇవి అమెరికా సమాజపు వింత పోకడలను, విభిన్న ఆలోచనా, ప్రవర్తనా రీతులకు అద్దంపడుతున్నాయి.

పండుగ జరుపుకునేప్రాంతాలు, పండుగల పేర్లు, ఆ పండుగలో పాల్గొనే ప్రజలు, మనుషులు వేరైనా అందరిలో సాధారణంగా కన్పించే అంశం ఆనందంగా, ఉల్లాసంగా ఉండాలనుకోవడమే. వ్యక్తి మేధో, మనో, పరిజ్ఞానానికి అనుగుణంగా విభిన్న పద్ధతులలో పండుగలను ఎలా నిర్వహించుకుంటారో యాత్రాచరిత్రల పరిశోధనలో తెలుస్తుంది.

## 4.3. ఆచార – సాంప్రదాయాలు

నమ్మకాన్ని పునాదిగా చేసుకుని ఒక పనిని లేదా చర్యను నిరంతరాయంగా ఆచరించడం వల్ల ఆ పనులే లేదా ఆ చర్యలే ఆచారాలుగా స్థిరపడ్డాయని చెప్పవచ్చు. ఆచరణాత్మకమైది ఆచారం. వ్యక్తులకు గల ఆచారాలు, నమ్మకాలు ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమించటాన్ని సాంప్రదాయం అని చెప్పవచ్చు. "కొన్ని సందర్భాలలో మనుషులు అనుసరించే ఆచరణల్ని మనం సాంప్రదాయాలు అంటాం" (ప్రపంచీకరణ–సంస్కృతి – పుట–15) అయితే నిత్య జీవితంలో ఆచారం, సాంప్రదాయం అనే రెండు పదాలు దాదాపుగా ఒకే అర్థంలో వాడబడుతున్నా, సూక్ష్మంగా పరిశీలిస్తే ఈ రెండింటి మధ్య కొంత వ్యత్యాసం కన్పిస్తుంది. ఆంగ్లంలో ఆచారాన్ని Custom అని, సాంప్రదాయాన్ని Tradition అని వ్యవహరిస్తారు. "ఇంగ్లీషులో అయితే వాటిని గురించి డా॥ సి.నా.రె గారు వివరిస్తూ ఇలా పేర్కొన్నారు. Custom, Convention అనే మరి రెండు పదములున్నవి. Convention అనునది ఇంచుమించుగా Traditionకు సమానార్థకము. Custom అనగా ఆచారము మాత్రమే. సాంప్రదాయములోని విస్తృతి ఆచారమునకు లేదు. ఆచారం ప్రధానంగా ఆచరణకు సంబంధించినది. సంప్రదాయము ఆలోచనలకు సంబంధించినది. కానీ వ్యవహారము నందు రెండింటికంత భేదము పాటించబడుట లేదు" (ఆధునికాంధ్ర కవిత్వము – సాంప్రదాయాలు, ప్రయోగాలు, పుట–3).

పై నిర్వచనాన్ని బట్టి నాటి ఆచారమే కాలక్రమంలో సాంప్రదాయంగా రూపాంతరం చెందుతుంది. సాంప్రదాయలన్నీ ఆచారాలు కావచ్చు, కానీ ఆచారాలన్నీ సాంప్రదాయాలు కావు. ఒక సామాజిక ఆచారమైనా, మతాచారమైనా, పద్ధతులైనా ఏవైనా సరే తరువాతి వారికి సంక్రమిస్తేనే సాంప్రదాయమని చెప్పుకున్నాం. అయితే ఈ సంక్రమణం మౌఖికంగాకానీ, ఆచరణ రూపంలో గానీ జరగవచ్చు. ఆ సమూహానికి చెందిన వ్యక్తులు అంగీకరిస్తేనే ఆ ఆచారం లేదా నమ్మకం సాంప్రదాయంగా పరిణామం చెందుతుంది.

సంస్కృతి ఉనికిలో ప్రధానపాత్ర వహించేది ఆచారాలు. కుటుంబం యొక్క మరియు సమాజం యొక్క నిర్మాణాన్ని, స్థితిని తెలుసుకోవటానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయి. పదిమంది కలయికకు ఇవి వేదికలవుతాయి. మానవ సంబంధాలను పెంపొందించి, వారి ఐక్యతకు తోడ్పడతాయి. మానవుల్లో మూర్తిమత్వాన్ని కలిగించి, ఒక ఆదర్శప్రాయమయిన జీవన విధానానికి మార్గాన్ని చూపిస్తాయి. ముఖ్యంగా మన పూర్వీకుల ఆలోచనా విధానాన్నీ, జీవన రీతులను, ఆచార-సాంప్రదాయాలు మనకు తెలియజేస్తాయి. ఇవే కనుక లేకుంటే మానవులు సంస్కార హీనులుగా మిగిలే అవకాశం ఉంది.

అయితే “ఒక వ్యక్తి గాని, ఒక జాతిగానీ ఆచారాన్ని పాటిస్తుంటే, దానినతడుగాని, ఆ జాతి గాని ఎందుకంత నమ్మకంగా పాటిస్తుందో తెలుసుకోవలసిన అవసరమున్నది. దాని వెనుక ఉన్న అనుభవాన్నీ, శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనను పరిగణనలోకి తీసుకోవాల్సి వుంటుంది. (శివమెత్తిన చికాగో, 2008, పుట-82) నిజమే ఏ ఆచారాన్ని పాటిస్తున్నా దాని వెనుక గల నేపథ్యాన్ని తెలుసుకోవాలి లేదంటే ఆ ఆచారం ఉనికిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఏ ఆచారమైనా బ్రతకాలంటే దానిని పాటించాల్సిన ఆవశ్యకత, కారణాలు తెలిస్తే దాని ప్రభావం మరింత మెరుగ్గా వుంటుంది.

ఆచార, సాంప్రదాయాలు ప్రాంతాన్ని బట్టి, కాలాన్ని బట్టి మతాన్ని బట్టి, సంస్కృతిని బట్టి మారుతుంటాయి. ఈ ఆచార-సాంప్రదాయాలేవీ ఏ మతగ్రంథాల్లో చెప్పి ఉండకపోవచ్చు. కానీ ఆయా మతాలను పాటించే వారికి వాటి పట్ల విశ్వాసం ఉంటుంది. సంస్కృతికి ఆచారాలకు అవినాభావ సంబంధం ఉంది. సంస్కృతి సిద్ధాంతమయితే ఆచారం ఆచరణాత్మకం. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భిన్న సంస్కృతులున్నాయి. వాటికి ప్రతిబింబాలుగా ఆచార సాంప్రదాయాలు వాడుకలో ఉన్నాయి. అయితే అన్నీ సంస్కృతుల గురించి అందరికీ అవగాహన లేదా పరిచయం ఉండదు. ఒక ప్రాంతపు లేదా జాతి యొక్క ఆచార సాంప్రదాయాలను తెలుసుకోవటానికి యాత్రాచరిత్రలు ఎంతగానో తోడ్పడతాయి. యాత్రికులు ఇతర ప్రాంతాలకు వెళ్ళినప్పుడు అక్కడ వాడుకలో ఉన్న ఆచార-సాంప్రదాయాలకు ఆకర్షితులవుతారు. తెలియని ఒక కొత్త విషయాన్ని తెలుసుకోవడం

మనిషికి ఎన్నటికీ ఉత్సాహాన్ని ఇస్తుంది. ఆ కుతూహలమే వారిని కొత్తవారి ఆచార-సాంప్రదాయాలను తెలుసుకునేలా పురిగొల్పుతుంది. యాత్రికుడు రచయిత అయితే వాటిని అక్షరీకకరిస్తాడు. ఆ అనుభవాలను చదివిన పాఠకుడు ఆ ఆచార-సాంప్రదాయాల్లో గల వైవిధ్యాన్ని తెలుసుకుని ఆనందిస్తాడు. రచయితతో సమానమయిన అనుభవాన్ని పొందుతాడు. ప్రపంచానికి తెలియని, ఆశ్చర్యాన్ని కలిగించే ఆచర-సాంప్రదాయాలెన్నో యాత్రాచరిత్రల్లో నిక్షిప్తంచేయబడ్డాయి.

ఆచార-సాంప్రదాయాల్లో ప్రముఖంగా చెప్పుకోవాల్సినవి వివాహం వేడుకలు. ఆచార-సాంప్రదాయాలకు పట్టుకొమ్మలు వివాహవేడుకలు. ఏ వివాహంలోనైనా వారి వారి ఆచార-సాంప్రదాయాలు గోచరిస్తాయి. వివాహం జరిగే పద్ధతిని బట్టి, వారి ఆచార-సాంప్రదాయాలు ఎటువంటివో చెప్పవచ్చు. డా॥ ఎస్.గోపీ గారు 'నేను చూసిన మారిషస్' అనే యాత్రాగ్రంథంలో మారిషస్‌లోని తెలుగువారి వివాహ సాంప్రదాయాలను ఈ విధంగా వివరించారు. "ఇక్కడి తెలుగువారి పెళ్ళి మూడు రోజుల పాటు జరుగుతుంది. శుక్ర, శని, ఆదివారాలు. మొదటి రోజును 'పసుపు' అంటారు. పెళ్ళి తప్పకుండా ఆదివారమే జరుగుతుంది. మూడోరోజు పెళ్ళి అన్నమాట. వీరి ఆచారాల్లో ఆర్య సమాజ ప్రభావం ఎక్కువ. దీని వల్ల హవనం, సప్తపది ఉంటాయి. తాళిబొట్టు వేస్తారు కానీ కట్టరు. మూడుముళ్ళ పద్ధతి లేదు. తలంబ్రాలు, జీలకర్ర, బెల్లం అసలే లేవు. పెళ్ళిళ్లలో కట్నాలు లేవు" (నేను చూసిన మారిషస్ – పుట.50)

తెలుగువారు 'తాళి'ని కట్టిస్తారు. జీలకర్ర-బెల్లం తెలుగువారి వివాహానికి అత్యంత అవసరం. జీలకర్ర-బెల్లం పెడితే సగం వివాహమయినట్లే అని తెలుగు వారి భావన. ఏ ఆచారమైనా ఉనికిలో ఉండాలంటే దానికి తగిన భౌతిక వాతావరణం ఉండాలి. కనీసం కొద్దిమంది ప్రజలైనా సామూహికంగా ఆ ఆచారాన్ని పాటిస్తూ ఉండాలి. కానీ మారిషస్‌లో నివసించే తెలుగువారు మాతృదేశానికి దూరంగా ఉండటం వల్ల వారి ఆచారాల పాటింపులో కొంతభేదం కన్పిస్తుంది. ఏదేమైనా ఆ ఆచారాలను పాటిస్తూ, తమ మూలాలను నిలుపుకోవాలనుకోవడం అభినందించదగ్గ విషయం.

ఒకే భార్య/భర్త అనే నైతిక ధర్మానికి కట్టుబడి జీవితాన్ని కొనసాగించడం భారతీయుల లక్షణం. కొన్ని ఇతర దేశాలను గమనించినట్లయితే వారిలో బహుభార్యత్వ/భర్తృత్వ పద్ధతి కన్పిస్తుంది. ఈజిప్ట్‌లో గల బహు భార్యత్వ పద్ధతిని గురించి ముదిగంటి సుజాతారెడ్డి గారు ప్రస్తావిస్తూ "ఈజిప్ట్‌లో ఇస్లాం ప్రకారం ఒక మగవాడు నలుగురు భార్యలను పెళ్ళిచేసుకోవచ్చు. కానీ ఎంతమందికి తలాఖ్ ఇచ్చినా భార్యలు ఒక సమయంలో నలుగురు మాత్రమే ఉండాలి. కానీ ఇప్పుడా ఆచారం అంతరిస్తుందంటూ" వివరించారు (నైలునది నాగరికత, పుట-09).

ముదిగంటి సుజాతారెడ్డి గారు వివరించినట్లుగా బహుభార్యత్వ ఆచారం కిర్గిజ్‌స్థాన్ దేశీయులకు కూడా ఉందట. "స్త్రీ జనాభా ఎక్కువ కావున ఒకే పురుషుడిని అనేక మంది స్త్రీలు వివాహమాడటం ఇక్కడ వింతకాదు. అయినా పెద్ద భార్యకే అగ్రస్థానం. మిగతా భార్యలు సింగల్ మదర్, సింగల్ పేరంట్ గానే ఉండటానికి ఇష్టపడతారు" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర-పుట.128). ఇస్లాం మతంలో బహుభార్యత్వ ఆచారం సర్వసాధారణం. వారికి ఒకటికి మించి వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా తప్పేమి కాదు. కిర్గిజ్ ప్రజలు కూడా సున్నీశాఖకు చెందిన ముస్లింలు కాబట్టి, వీరిలో కూడా బహుభార్యత్వ ఆచారాన్ని పాటిస్తున్నారు. అయితే మిగతా ఇస్లాం దేశాలలో లాగా స్త్రీలు స్వేచ్ఛా రహితంగా, నియమనిబంధనలతో జీవితాన్ని గడిపే విధానం ఇక్కడుండదు. ఇక్కడి స్త్రీలు స్వేచ్ఛా ప్రియులు. ఆత్మవిశ్వాసాన్ని, ఆధునికతను రంగరించుకున్న ఆధునిక మహిళలు. కిర్గిజ్ స్త్రీలు మద్యపానాన్ని చాలా తరచుగా తీసుకుంటారని, చలిదేశం కాబట్టి ఈ అలవాటు వీరికి సాధారణమని రచయిత పరవస్తు లోకేశ్వర్ గారు పేర్కొన్నారు.

బహుభార్యత్వమే కాదు, బహుభర్తృత్వం కలిగిన సంస్కృతులు కూడా ప్రపంచంలో వ్యాప్తిలో ఉన్నాయి. ప్రాచీన కాలంలో కేరళలో బహుభర్తృత్వ సంస్కృతి అమలులో ఉండేది. ఒకప్పుడు అక్కడ మాతృస్వామ్య వ్యవస్థ అమలులో ఉండటమే కారణం కావచ్చు. "పితృస్వామిక వ్యవస్థలో రాజులకు కోరుకున్నంత మంది భార్యలు ఉన్నట్లే మాతృస్వామిక రాజ్యంలో ఒకరాణి తనకు నచ్చిన పురుషుడిని తన భర్తగా ఎంచుకుని అతడి మీద మోజు

తీరే వరకు అతడితో సంసారం చేయడం, ఆ తరువాత "దేవుడీ మనా" పేరుతో నచ్చని సేవకులను కోటనుంచి గెంటివేసినట్లే తన 'భర్త'ను కూడా గెంటి వెయ్యడం జరిగేది. రాణుల దయ తమపై ఉన్నంతకాలమే వారు కోటలో రాజులు. ఆ తరువాత తరాజులన్నమాట. అలా కొంతకాలం 'రాచవారి'కి భర్తగా సేవలందించినందుకు వేదపండితులైన ఒక నంపూతిరి బ్రాహ్మణ కుటుంబానికి 17 చదరపు మైళ్ల చిన్న 'కిళిమానూర్' రాజ్యాన్ని వేణాడు పాలకులు ధారాదత్తం చేశారు. అలా అక్కడి బ్రాహ్మణులు క్షత్రీయ సహజమైన వర్మ అనే పేరును ధరించడం మొదలైంది. వారు పేరుకు మాత్రం రాజులయ్యారు, కానీ తమ రాజ్యంలో పరిపాలన అంతా మళ్ళీ బ్రాహ్మణ స్త్రీలకే దక్కింది. నాటి కేరళ సమాజంలో వేళ్ళూనుకున్న మాతృస్వామ్య వ్యవస్థ ప్రభావం అది" (మా కేరళయాత్ర, పుట-100) ఇలా బహుభార్యత్వ సాంప్రదాయం ద్వారా నీలకంఠ భట్టారిపాద్ అనే నంబూదిరి బ్రాహ్మణునికి, ఉమా అంబాబాయి తింపురత్తి అనే బ్రాహ్మణ రాణికి పుట్టిన సంతానమే ప్రముఖ చిత్రకారుడు రాజారవివర్మ.

ముఖ్యంగా ఈ బహుభార్యత్వ ఆచారం కేరళలోని అగ్రవర్ణాలలో ఒకటయిన 'నాయర్' కులస్థులలో కూడా ఉండేది. నాయర్ కులానికి చెందిన స్త్రీలు తమకు నచ్చిన మగవారిని ఎంతమందినైనా పెళ్ళాడవచ్చు. తనకు నచ్చని భర్తని ఎప్పుడైనా వదిలేసే హక్కు కూడా ఆమెకు ఉంటుంది. ఈ విషయంలో ఎవరి అనుమతి ఆమె తీసుకోవల్సిన అవసరం లేదు. ఆమెకు బహుభర్తల ద్వారా కలిగిన సంతానానికి మేనమామ సంరక్షకునిగా వ్యవహరిస్తాడు. ప్రముఖ చిత్రకారుడయిన రాజారవివర్మకు తన మేనమామ రాజరాజవర్మ సంరక్షకునిగా వ్యవహరించాడు. ఆ కాలంలో రవివర్మ తన మేనమామ దగ్గరనే చిత్రకళా రహస్యాలను తెలుసుకుని, గొప్ప చిత్రకారునిగా ఖ్యాతి గడించాడు. ఒక వింత ఆచారం ఒక గొప్ప కళాకారుణ్ణి ప్రపంచానికి పరిచయం చేసింది.

కేవలం కేరళలోనే కాక ఈ బహుభర్తృత్వ సాంప్రదాయం ప్రపంచంలోని మరికొన్ని దేశాలలో కన్పిస్తుంది. 'మసాయ్' అనే ఆఫ్రికా గిరిజన హిమాలయాల్లో నివసించే కొన్ని తెగల్లో ఈ ఆచారం ఇప్పటికీ నిలిచివుంది. బహుభర్తృత్వంలో కూడా అన్నదమ్ముల

వరసయ్యే వారిని నలుగురు లేదా ఐదుమందిని వివాహం చేసుకునే ఆచారం కూడా హిమాలయాల్లోని కొన్ని తెగలకు చెందిన స్త్రీలకు ఉంది. అలాగే చైనాలోని యున్నన్ ప్రావిన్స్‌లోని (Yunnan provience) మసువో (masuo) అనే గిరిజన తెగలో కూడా ఇటువంటి ఆచారమే అమలులో ఉంది.

అలాగే అన్నదమ్ముల వరసయ్యే వారిని వివాహం చేసుకునే వింత ఆచారం కూడా కొన్ని చోట్లు అమలులో ఉండేది. “ఈజిప్టు రాజవంశాల్లో సోదరీ సోదరులకు వివాహాలు జరిగేయి. అటువంటి ఆచారం ఒక ఫెరోల్లోనే కన్పిస్తుంది. రాజవంశం రక్తం పరిశుద్ధంగా వుండాలనే ఉద్దేశంతోనే అటువంటి వివాహాలు జరిగేయట” (నైలునదీ నాగరికత, పుట-35). కొన్ని ఆచారాలకు నమ్మకమే తప్ప, శాస్త్రీయత పునాది కాదని ఈ విషయాన్ని బట్టి చెప్పవచ్చు. ఈ పద్ధతి ఇప్పటికీ టిబెట్, నేపాల్, భారత్ దేశాలలో అమలులో వుంది. దక్షిణ భారతదేశంలో ‘తొద’ జాతి వారిలో అన్నదమ్ములు అక్కచెల్లెళ్ళను వివాహం చేసుకునే సాంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతుంది. తమ జాతిలోకి వేరే వారిని రానివ్వకూడదు అనుకోవటం, ఆ జాతిలో జనాభా తక్కువగా ఉండటం, తమ సంస్కృతి వారసత్వాన్ని కొనసాగించాలనుకోవటం ఇందుకు కారణాలయి ఉంటాయి.

వివాహానికి ముందరి ఘట్టం, అతి ప్రధానమయిన ఘట్టం పెళ్ళిచూపులు. ఆసియా దేశాల్లో ఒకటైన చైనాలో పెళ్ళిచూపులు-పెళ్ళికి సంబంధించిన ఆచార సాంప్రదాయాలెలా వున్నాయో చూద్దాం. చైనీయుల వివాహ ఆచారాలకు-సాంప్రదాయాలకు దాదాపు 5000 సంవత్సరాల చరిత్ర ఉంది. వీరి ఆచార-సాంప్రదాయాలన్నీ దాదాపుగా ‘టీ తో ముడిపడి ఉన్నాయి. చైనాలో ఏ శుభ/అశుభ కార్యమైనా ‘టీ’ లేనిదే జరగదు. ‘టీ’ చెట్టు వీరికి పరమ పవిత్రమైనది. భారతీయులకు తులసి చెట్టులా వీరికి ‘టీ’తో విడదీయలేని సంబంధం ఉంది. బౌద్ధ భిక్షువులకు బౌద్ధారామాల్లో పూజా సమయంలో ‘టీ’ని తప్పనిసరిగా తాగే సాంప్రదాయం ఉంది.

ముఖ్యంగా ‘టీ’కి వీళ్ళ ఆచారాలతో సంబంధం ఉంది. సంగ్‌లు దీన్ని మొదలుపెట్టారు. పెళ్ళిలో మగపెళ్ళివారు ఆడపెళ్ళివారికి సమర్పించే కానుక ఇది. వీళ్ల

పెళ్ళిళ్ళల్లో మూడు 'టీ' పార్టీలుంటాయి. 1) నిశ్చితార్థం, 2) పెళ్ళిరోజు, 3) మొదటి రాత్రి. ఇంకా పిల్లకి పిల్లవాడు నచ్చితే టీ ఇస్తుంది. అలాగే ఇద్దరూ కలిసి 'టీ' తాగితే పిల్లవాడికి పిల్ల నచ్చితే 'టీ'కి డబ్బులిస్తాడు. నచ్చకపోతే 'టీ' తాగాక కప్పు తలకిందులుగా పెడతాడు. ఈ ఆచారాలు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకంగా వుంటాయి... 'టీ' వీరి ఆచారాల్లో అగ్రస్థానం పొందింది" (షంఘై నింగిలో పుట-76మరియు77) అంటూ చైనీయుల జీవితాల్లో 'టీ' పోషించే విశిష్ట పాత్రను వివరించారు కురుగంటి శ్రీలక్ష్మిగారు.

పెళ్ళి చూపుల్లో అమ్మాయికి అబ్బాయి నచ్చకో, అబ్బాయికి అమ్మాయి నచ్చలేదనో నోటితో చెప్పి ఎదుటివారి మనుసును బాధపెట్టలేక, లేదా ఎదుటి వారు నచ్చారని చెప్పేందుకు సిగ్గుపడొచ్చనేమో 'టీ'కప్పును బోర్లించే సాంప్రదాయాన్ని, నచ్చితే దానికి డబ్బు ఇచ్చే సాంప్రదాయాన్ని వీరు కల్పించుకున్నారు. పెళ్ళిచూపుల్లో ఒకరికొకరు నచ్చిందీ, లేనిదీ తెలుసుకునే క్రమంలో ముందుగా ఇక్కడ స్త్రీ అభిప్రాయానికే ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తుంది. ముందుగా అమ్మాయికి అబ్బాయి నచ్చితే 'టీ' ఇస్తుంది. నచ్చకపోతే ఇవ్వదు. ఈ సంఘటనతోనే అబ్బాయి తరపు వారికి విషయం ఏమిటన్నది అర్థం అవుతుంది. చైనాలో కేవలం పెళ్ళి విషయంలోనే కాక, అన్ని విషయాల్లో కూడా స్త్రీల అభిప్రాయానికే విలువెక్కువ. ఒకప్పుడు చైనాలో మాతృస్వామ్య వ్యవస్థ వుండటమే దీనికి కారణం.

జీవితంలో ప్రతీ మనిషి ఆడంబరంగా జరగాలనుకునే వేడుక వివాహం. ఏ సంస్కృతిలోనైనా వివాహం ప్రధాన ఘట్టం. భారతీయులు వివాహాన్ని ఘనంగా నిర్వహించుకునేందుకు డబ్బులు ఎక్కువ ఖర్చుపెడతారనటంలో సందేహం లేదు. ముఖ్యంగా పెళ్ళి దుస్తులకు, భోజనానికి తమ శక్తికి మించి ఖర్చుపెడతారు. భారతదేశం లాగే ఆర్భాటంగా వివాహం జరిపించే దేశాలలో జపాన్ కూడా ఒకటి. "ప్రపంచవ్యాప్తంగా ఉన్నట్లే వివాహ సందర్భంగా శక్తికి మించి ఖర్చుపెట్టడం జపాన్‌లోనూ బలహీనత. ఒక మధ్యతరగతి కుటుంబం, వివాహానికి 30లక్షల రూపాయల వరకూ ఖర్చుపెడుతుంది. ఇందులో ఎక్కువ భాగం వజ్రాలు కొనటానికి, హనీమూన్‌కు వెళ్లటానికి వ్యయమవుతుంది.

వివాహ సందర్భంగా ఇచ్చే విందు వారికి చాలా ముఖ్యం" (జపాన్-ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-29).

అందుకే జపాన్లో వివాహానికి వచ్చే అతిథులు డబ్బును కానుక రూపంలో ఇవ్వాలనే సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. దగ్గరి బంధువులు, స్నేహితులైతే మరికొంత ఎక్కువగా ఇవ్వాల్సి వుంటుంది. పెళ్ళి జరిగే చోటు, అవబోయే ఖర్చును దృష్టిలో ఉంచుకుని కానుకల రూపంలో ఇవ్వాల్సిన డబ్బును ముందుగానే వివాహ ఆహ్వాన పత్రికలో పేర్కొంటారు. పెళ్ళి తర్వాత రిసెప్షన్‌లో పెట్టే విందు భోజనాలకే వీరికి ఖర్చు ఎక్కువ అవుతుందట. అందుకే కొన్నిసార్లు ఈ ఖర్చులో కొంతభాగాన్ని బంధువులు కూడా భరిస్తారు. అయితే వివాహ సమయంలో ధరించే వస్త్రాలకు మాత్రం వీరు ఎక్కువ ఖర్చు చేయరు. జపాన్‌లో షింటో, బౌద్ధం, క్రైస్తవ మతాలను పాటిస్తారు. ఏ మతాచారాల ప్రకారం వివాహం జరిగినా, వివాహ దుస్తులను అద్దెకే తెచ్చుకుంటారు. "వారి సాంప్రదాయక మతమైన" షింటో పద్ధతిలో ఎక్కువ పెళ్ళిళ్ళు జరుగుతాయి. కొన్ని పెళ్ళిళ్ళు క్రైస్తవ పద్ధతిలోనూ, బౌద్ధమత పరంగానూ, కొంతమంది 'హిందూ పద్ధతి'లోనూ చేసుకుంటారు. వీటిలో ఏ పద్ధతిలో అయినా వేసుకునే బట్టలు (హిందూ పద్ధతిలో అయితే చీర) కొనడం ధర ఎక్కువని, బట్టలను అద్దెకిచ్చే సంస్థలున్నాయి. వివాహమహోత్సవం తరువాత వీటిని బాగా శుభ్రంచేసి, మరో పెళ్ళికి సిద్ధం చేస్తారు" (జపాన్-ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-29).

సాధారణంగా ఏ కళ్యాణ మంటపంలో (Function Hall) వివాహం చేసుకుంటారో, ఆ కళ్యాణ మంటపం వారే పెళ్ళి దుస్తులను అద్దెకు ఇస్తుంటారు. దాదాపుగా ఆ దుస్తుల్ని తక్కువ ధరకే అద్దెకు ఇస్తున్నా, సమయాన్ని బట్టి వాటి డిమాండ్‌ను బట్టి అద్దెలు ఒక్కోసారి ఎక్కువగానే ఉంటాయి. అంతేకాక ఆ డ్రస్సు డిజైన్ పైన, మెటీరియల్ పైన కూడా వాటి అద్దె ధర ఆధారపడి వుంటుంది. ఆ పెళ్ళి దుస్తులపై ధరించే ఆభరణాలను కూడా వీరు అద్దెకే తీసుకుంటారు. ఇటువంటి పద్ధతి భారత్ వంటి దేశాలలో కూడా ఉంటే వివాహ వ్యయం తగ్గి, దేశానికి ఆర్థిక ప్రగతి చేకూరే అవకాశం ఉంది.

జపాన్ వారు వివాహ సందర్భంలో ఆచార-సాంప్రదాయాలను తూ.చ. తప్పకుండా పాటించినట్లే అనేక విషయాల్లో కూడా పాటిస్తున్నారు. “జపాన్ వాసులకు మతంపై గౌరవం, సెంటిమెంట్లు, రకరకాల భయాలు ఉన్నాయి. ప్రతీ ఇంటిలోనూ ఒక దేవుడి గది, అందులో బుద్ధుని ప్రతిమ వుంటుంది. విగ్రహానికి ప్రసాదంగా అన్నం, టీ సమర్పిస్తారు. అగరొత్తులు వెలిగిస్తారు. రెండు చేతులతో నమస్కరిస్తూ మ్రొక్కటం తాయత్తులు కట్టుకోవటం లాంటి సంప్రదాయాలున్నాయి. భూత కాలానికి చెందిన ఎన్నో సంప్రదాయాలు, ఆచారాలపై అపార నమ్మకం, గౌరవం, భవిష్యత్ పై ఆశ కలగలిసి వుంటాయి. అనేక శాస్త్ర సాంకేతిక రంగాలలో ఆధిపత్యం సాధించినా సాంప్రదాయంలో విశ్వసాన్ని మాత్రం చెక్కు చెదరక కాపాడుతూ వుంటారు” (జపాన్ – ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-2).

ఏ దేశమైనా నమ్మకాలకు, ఆచార సాంప్రదాయాలకు అతీతం కాదని పై మాటల వల్ల తెలుస్తుంది. ఆర్థికంగా, సాంకేతికంగా, ప్రపంచంలోనే ముందుంజలో ఉన్న జపాన్ వారికి కూడా ఆచార-సాంప్రదాయాల పట్ల మక్కువ వుండటం ఆశ్చర్యపరిచే అంశం. అంటే అందరూ అంటున్నట్లు శాస్త్ర–సాంకేతిక పరిజ్ఞానం మరియు ఆచార-సాంప్రదాయాలు బద్ధవిరోధులు కాదనే విషయం దీనిని బట్టి అర్థమవుతుంది. మాజీ ఇస్రో అధ్యక్షుడు కె.రాధాకృష్ణన్ అంతరిక్షంలోకి రోదసీనౌక ప్రయోగం విజయవంతమయితే తిరుమల వేంకటేశ్వరున్ని దర్శించుకోవటం ప్రసార మాధ్యమాల్లో గమనించే ఉంటాం. భావ, భౌతిక వాదాలు రెండూ ఒక వ్యక్తిలో ఉంటాయనటానికి జపనీయులను నిదర్శనంగా చెప్పవచ్చు.

ఇవేగాక వీరు నిత్యజీవితంలో అనేక సాంప్రదాయాలను పాటిస్తారు. అతిథులను, పెద్ద వారిని వంగి నమస్కరించటం వీరి సంప్రదాయం. ఇంట్లోకి ప్రవేశించే ముందు ద్వారానికి ఎడమ వైపుగా చెప్పులు వదలాలి. దీన్ని వీరు ఖచ్చితంగా పాటిస్తారు. భారత సమాజం లాగానే జపాన్ సమాజం కూడా కులాలుగా విభజితమై ఉండేది, సాంప్రదాయకమైనది. పెళ్ళి, కుటుంబం, మతం వారికి ఎంతో పవిత్రమైనవి. ఇండియాలాగే

జపాన్ వ్యవసాయక దేశం. ప్రతీ ఊరికీ ఓ గ్రామదేవత, ప్రతీ ఒక్కరికీ ఎన్నో నమ్మకాలు, సెంటిమెంట్లు ఉన్నాయి అంటూ జపాన్‌ను సందర్శించిన క్రమంలో రచయిత రంగనాయకులు గారు వివరించారు.

జపాన్ వారికి వంగి నమస్కరించే సాంప్రదాయమున్నట్లే పెరూ దేశం వారికి కరచాలనం చేయటం సాంప్రదాయం. చాలా పాశ్చాత్య దేశాల్లో కరచాలనంతో పలుకరించడం గౌరవమని భావిస్తారు. అయితే పెరూ వారు మరొక కొత్త సాంప్రదాయాన్ని పాటిస్తారు. "పెరూ దేశంలోని స్త్రీ-పురుషులు, తమ మొదటి పరిచయం కరచాలనంతో ప్రారంభిస్తారు. కరచాలనం చేయడం ఏ దేశంలోనైనా సర్వసాధారణం. అయితే అక్కడి స్త్రీ-పురుషులు తాము తిరిగి అదే వ్యక్తులను రెండవసారి కలుసుకుంటే కరచాలనం చేయరు, బుగ్గ మీద ముద్దు పెట్టుకుంటారు.... తారతమ్యాలు, వయోభేదాలు అసలు పట్టింపులోకి రావు." (రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు, పుట-71).

ఆచారాలు, సాంప్రదాయాలు కొన్నిసార్లు శృతిమించి మూఢాచారాలుగా మారిపోయే ప్రమాదం ఉంది. అయితే నాగరికంగా అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా మూఢాచారాల పాటింపు ఉండటం గమనార్హం. మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు టర్కిని దర్శించిన క్రమంలో అక్కడ గల ఒక విగ్రహాన్ని గురించిన చరిత్రను వివరిస్తూ ఈ విధంగా పేర్కొన్నారు. "ఆనాటి ఇక్కడి ఓ ఆచారం పదేళ్ళ బాలికని కన్యగా మోనాస్ట్రీకి ఇచ్చేయడం. ఇది అలాంటి ఓ బాలిక విగ్రహం. ముప్పైఏళ్ళ పాటు ఆమె కన్యగా జీవిచాక, నలభైయ్యవ ఏట మోనాస్ట్రీలోంచి బయటకి రాగానే జీవితాంతం ఆమెకు పెన్షన్ ఇచ్చేవారు. ఈలోగా ప్రమాదవశాత్తూ ఆమె కన్యత్వం కోల్పోతే మాత్రం ఆమెను జీవించి ఉండగానే పాతిపెట్టేవారు. బయటికి వచ్చాక, ఆమె కన్యత్వాన్ని కాపాడుకోవాలనే నియమం ఉండేది కాదు. కాబట్టి నలభై నిండిన ఆమె ఏ మగాడితోనైనా ఉండవచ్చు. దీన్నించే ఇంగ్లీషులో ఆడవాళ్ళ విషయంలో లైఫ్ స్టార్ట్స్ ఎట్ థర్టీ అనే సామెత వచ్చింది" (ట్రాయోగ్ దుబాయ్, టర్కీ&గ్రీస్, పుట-142).

మతాచారాల్లో కొన్ని మూడాఢాచారాలు కూడా ఉంటాయి. పైన పేర్కొన్న ఆచారం అటువంటిదే. భారతదేశంలో కూడా దేవదాసీ సాంప్రదాయం, జోగిన సాంప్రదాయాలు ఒకప్పుడు వ్యాప్తిలో వుండేవి. ఏమతమయినా, ప్రాంతమయినా మూఢాచారాలకు, సాంప్రదాయాలకు వ్యతిరేకం కాదని పై అంశం నిరూపిస్తుంది.

## 4.4. ఆహారం

మానవుని భౌతిక అవసరాలలో అత్యంత ముఖ్యమయినది ఆహారం. ఆహారం మనిషి యొక్క శారీరక, మానసిక స్థాయిని నిర్దేశిస్తుంది. అందుకే 'అన్నం పరబ్రహ్మ స్వరూపం', 'కోటి విద్యలు కూటి కొరకే' అనే జాతీయాలు పుట్టుకు వచ్చాయి. ఇవన్నీ కూడా ఆహారం యొక్క ప్రాముఖ్యాన్ని తెలిపేవే. పురాతన కాలం నుండీ ఆహార సేకరణ వేటను, వ్యవసాయాన్ని ప్రధానంగా చేసుకుని జరిగింది. సంస్కృతికి, ఆహారానికి విడదీయరాని సంబంధం ఉంది. ఒక వ్యక్తి యొక్క నాగరికతనీ, సంస్కృతిని వెల్లడించే అనేకానేక అంశాల్లో ఆహారానిది ప్రధానపాత్ర. ఒక సంస్కృతిలో నివసించే వారి యొక్క అలవాట్లు, నమ్మకాలు, ఆలోచనలకు ప్రతిబింబంలా వారి ఆహార పద్ధతులుండటం గమనించవచ్చు. వీటి ద్వారా పూర్వీకుల ఇష్టాయిష్టాలు, అభిరుచులను తెలుసుకునే అవకాశం వుంటుంది.

ప్రపంచవ్యాప్తంగా అనేక ఆహార పద్ధతులు కలిగివున్న సమూహాలు ఎన్నో ఉన్నాయి. వారు అనుసరించే మతాన్ని బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి, వర్గాన్ని బట్టి, సంస్కృతిని బట్టి ఆహార పద్ధతుల్లో వైవిధ్యం కన్పిస్తుంది. ఆహార సామాగ్రి వాడకం, తయారు చేసే విధానం, నిలువ చేసే విధానం, ఆహారాన్ని స్వీకరించే విధానం (తినే పద్ధతి) మొదలైనవన్నీ కూడా సంస్కృతితో వైవిధ్యానికి గల కారణాలు. అయితే ప్రతీ సంస్కృతి కూడా తనదైన ఆహారశైలి, నియమాలను కలిగివుంటుంది. ఒక సంస్కృతికి ఆమోదయోగ్యమయిన ఆహారం మరొక సంస్కృతి నియమాలకు వ్యతిరేకం కావచ్చు.

ఏ సంస్కృతికి చెందిన ఆహార విధానాలయినా మానవుని భౌతిక అవసరాలను తీర్చేవిగానే కాకుండా, మానవ సంబంధాలను పెంపొందించేందుకు కూడా వేదికవుతాయి.

అయితే నేడు ఒక సంస్కృతికి చెందిన సాంప్రదాయ వంటకాలు కేవలం ఆ సంస్కృతికి మాత్రమే పరిమితం అవడం లేదు. ప్రపంచమంతా వ్యాపిస్తూ, ఆహారంలో విశ్వ సంస్కృతిని తీసుకువచ్చే ప్రయత్నాలను చేస్తున్నాయి. దీనికి కారణం సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక ప్రగతి, రవాణా సౌకర్యాలు, మీడియా. ఇవి అనేక ప్రాంతాల రుచులను మారు మూల పల్లెలలకు కూడా పరిచయం చేస్తున్నాయి. ఈ లక్ష్యాన్ని నెరవేర్చడంలో యాత్రాచరిత్రలు కూడా ముందంజలో వున్నాయి. యాత్రా చరిత్రల పఠనం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆహారంలో గల వైవిధ్యాన్ని వివరంగా తెలుసుకునే వీలుంది. యాత్రికుడు యాత్రలు చేసే క్రమంలో స్థానిక ఆహారాన్ని భుజిస్తాడు. యాత్రికుడు విశ్లేషకుడు కూడా అయితే ఆ ఆహారాన్ని బట్టి వారి సంస్కృతిని అవగాహన చేసుకుని యాత్రాచరిత్రలో పొందుపరుస్తాడు. తద్వారా పాఠకునికి కూడా ఆ ప్రాంతానికి సంబంధించిన అనేక అంశాలతో పాటూ వారి ఆహార సంస్కృతి కూడా పరిచయం అవుతుంది. కాబట్టి ఒక సమూహానికి మాత్రమే పరిమితమయిన ఆహార సంస్కృతి వ్యాప్తి చెందటానికి, ప్రసిద్ధి చెందటానికి యాత్రాచరిత్రలు ఇతోధికంగా తోడ్పడుతున్నాయి అనటంలో సందేహం లేదు. ఒక సంస్కృతిలో అంతర్భాగమయిన ఆహారవిధానాలను చవులూరించే విధంగా వివరించిన యాత్రాచరిత్రలు తెలుగులో కొన్ని కన్పిస్తున్నాయి.

ఆధునిక కాలంలో ఒక ప్రాంతానికి ప్రతీకలుగా ఎన్నో ఆహారపదార్థాలు చెలామణిలో వున్నాయి. ఉదాహరణకు అమెరికా–బర్గర్, ఇటలీ–పాస్తా, చైనా–నూడుల్స్, అలాగే భారతీయ వంటకాల్లో కాశ్మీర్–పులావ్, గుజరాత్–లస్సీ, పంజాబ్–చికెన్ వంటకాలు, బెంగాల్–స్వీట్స్, హైదరాబాద్–బిర్యాని, తమిళనాడు–పొంగల్, సాంబార్, కర్ణాటకా–బిసిబేళాబాత్ మొదలైనవి ప్రసిద్ధి చెందినవి. కేరళలో అనేక వంటకాలు ప్రసిద్ధి చెందినా, కేరళ అనగానే గుర్తుకు వచ్చే వంటకం 'పుట్టు'. ఇదొక ఉపాహారం (టిఫిన్). "కేరళలో పలురకాల రుచికరమయిన ఉపాహారాలు (టిఫిన్లు) కూడా లభిస్తాయి. బియ్యపు పిండిలో తురిమిన కొబ్బరి కలిపి ఆవిరి మీద ఉడికించి చేసే 'పుట్టు' అనే వంటకం ప్రసిద్ధం. ఈ వంటకాన్ని శనగలు లేక బఠానిలతో చేసిన కూరతో తింటారు" (మా కేరళ యాత్ర,

పుట–233). ఈ వంటకం కేరళ రాష్ట్రానికి చెందిన వంటకమైనా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో కూడా ప్రసిద్ధి చెందింది. పుట్టే కాక పిడియన్, ఇడియాప్పం మొదలైన టిఫిన్‌లు గూడా కేరళవారి సాంప్రదాయ ఉపాహారాలుగా ప్రసిద్ధి చెందాయి.

కేరళీయులు పవిత్ర దినాల్లో, పండుగలు, శుభకార్యాల్లో తప్పనిసరిగా 'సద్య' అనే విందును చేస్తారు. ఇందులో అన్నంతో పాటుగా దాదాపు ఇరవై రకాల ఆహారపదార్థాలను వడ్డిస్తారు. ముఖ్యంగా ఓనమ్, విషు వంటి సాంప్రదాయ పండుగల్లో 'సద్య' వడ్డన తప్పనిసరి. ఈ సద్యను భుజించే విధానం గురించి ముత్తేవి రవీంద్రనాథ్ గారు ఇలా పేర్కొన్నారు. "కేరళీయుల సద్య అనే విందు భోజనానికి కొన్ని ప్రత్యేక నియమాలున్నాయి. అందరూ నేలపై పరిచిన చాపల మీద బాసిపట్లు వేసుకు కూర్చుని, అరటి ఆకులో వడ్డించబడిన ఆహార పదార్థాలను కుడి చేతితో తినాలి. మన ప్రాంతంలో కూడా అయ్యప్ప దీక్ష తీసుకున్న స్వాములు నేలపై పరచిన చాపల మీద కూర్చుని నియమంగా అరటి ఆకులోనే భోజనం చేయడం మనం చూడచ్చు. ఈ నియమం కేరళ నుంచి వ్యాపించిందే.... మలయాళీలు సద్య అనే పదమే మన ప్రాంతపు అయ్యప్ప భక్తుల వాడుకలో 'సద్ది' అయింది" (మా కేరళ యాత్ర, పుట–231).

అయితే సద్య వంటి సాత్త్వికాహారమే కాకుండా బిర్యాని మరియు అనేక మాంసాహారాలను కూడా కేరళ పెట్టింది పేరు. మిరియాలు, యాలకులు, అల్లం, లవంగాలు మొదలైన సుగంధ ద్రవ్యాలకు ఆలవాలమయిన ప్రాంతం కేరళ. కేరళలో ఏ వంటకం అయినా మసాలా దినుసులు మరియు కొబ్బరి లేకుండా వండటం ఉండదు. పదార్థానికి రుచి, వాసన వచ్చేందుకు వీటిని వాడతారు. కేరళ సముద్ర తీర ప్రాంతం అవడం, నదులు ఎక్కువగా వుండటం వల్ల వీరి ఆహారంలో చేపలు ప్రధానంగా ఉంటాయి.

మసాలా దినుసులతో చేసిన బిర్యాని ఇక్కడ చాలా ప్రసిద్ధి చెందింది. "కేరళీయుల మాంసాహార బిర్యానీకి మంచిపేరుంది. దానిని 'తలస్సేరి బిర్యాని' అంటారు. వివిధ రకాలైన చికెన్, మటన్, చేప కూరలకు కేరళ ప్రసిద్ధి. అక్కడ విశేషంగా లభిచేం పలు సుగంధ ద్రవ్యాలను అధికంగా వాడడం కారణంగా అక్కడి మాంసాహార పదార్థాలకు

మంచి ఘుమాయింపు వచ్చి, వాటి రుచి ఇనుమడిస్తుంది .... నాదన్ కోళి (నాటుకోడి) కూర, కోళి పొరిచతు (చికెన్ ఫ్రై), మీన్‌మొల్లీ (చేపల పులుసు), కొంచు వరతతు (రొయ్యల వేపుడు) వంటి పదార్థాలు కేరళలోని అన్ని ప్రాంతాలలో మాంసాహార ప్రియులకు చవులూరిస్తాయి" అని 'మా కేరళ యాత్ర' అనే యాత్రాచరిత్రలో రచయిత అక్కడి ప్రసిద్ధ వంటకాల్ని గురించి పేర్కొన్నారు (పుట-232).

కేరళలో మరొక ప్రసిద్ధి చెందిం వంటకం 'అవియల్'. "అవిజల్ అని కూడా పిలిచే ఈ పదార్థం అన్ని రకాల కాయగూరలతో వండే చిక్కటి గుజ్జుకూర" అవియన్ అంటే 'నీటితో వండినది' అని అర్థం. కాయగూర ముక్కల్ని ఉడికించి, తురిమిన కొబ్బరి వేసి, కరివేపాకులు, కొబ్బరి నూనెతో తిరగమోత వేస్తారు. సాధారణంగా కంద, అరటి, గుమ్మడి, కారట్, బీన్స్, వంకాయ, దోసకాయ, మునక్కాయ, పొట్లకాయ, అవరై అనబడే పెద్ద బీన్స్ వంటి కూరగాయలు ఈ కలగూరలో వాడతారు. దీనిలో పుల్లదనం కోసం కొందరు పెరుగు, ఇంకొందరు తురిమిన మాంగ, అంటే పచ్చి మామిడికాయ వాడుతారు" అంటూ అవియల్ వండే విధానాన్ని వివరించారు ముత్తేవి రవీంద్రనాథ్ గారు (మా కేరళయాత్ర, పుట-232).

అవియల్‌ను బలవర్ధకమైన ఆహారంగా కేరళీయులు భావిస్తారు. అనేకరకాల కూరగాయలతో వండటం, నూనెను తక్కువగా వాడటం, ఆవిరి మీద ఆ కాయగూరలను వుడికించటం వల్ల వీటిలో పోషకాలు ఎక్కువగా వుంటాయి. అందుకే వీరు తరచుగా చేసుకొనే పదార్థాల్లో అవియల్ ముందజలో వుంటుంది. ఇవేకాక, కొన్ని రకాల తీపిపదార్థాలు కూడా ఇక్కడ ప్రసిద్ధి చెందాయి. అవి బియ్యంపిండితో చేసే అరివుండ పాయసం, బియ్యం, కొబ్బరితో చేసే పాల్‌పాయిసం, పప్పుతో చేసే పరిప్పు పాయసం, అటుకులతో చేసే ఆటుకుల్ పాయసాలు కూడా ఇక్కడి ఆహార సంస్కృతిలో ప్రధాన భూమికను పోషిస్తున్నాయి. కేరళకు మాత్రమే పరిమితమయిన కూరగాయ కసావా. దీనిని Tapioca అని కూడా వ్యవహరిస్తారు. ఇది కర్రపెండలం జాతికి చెందినది. చికెన్, చేపలకు Topioca జతచేసి వండిన వంటకాలు ఇక్కడ ఎంతో ప్రాచుర్యాన్ని చెందాయి.

మిగిలిన దక్షిణ భారతీయుల్లాగే కేరళీయులకి కూడా బియ్యం వాడకం ఎక్కువ. ముఖ్యంగా మధ్యతరగతి, ఉన్నత వర్గాలలో బియ్యం వాడకం ఎక్కువ. అయితే దాదాపు అందరూ ఉప్పుడు బియ్యాన్ని వాడుతారు. ఈ బియ్యం చాలా లావుగా, మందంగా వుండటం వల్ల నమలటానికే కాదు, జీర్ణమవటానికి కూడా కొద్దిగా ఇబ్బంది పెట్టే అంశం. అందుకే వీరు ఈ లావు బియ్యంతో చేసిన అన్నం జీర్ణమవటానికి భోజన సమయంలో మూలికలతో తయారు చేసిన వెచ్చటి నీటిని సేవిస్తారు.

ఇవేకాక, ఉలవలతో చేసే ముధిర సాంబార్, పులి ఇంజి, ఓలన్, పుళిస్సేరి, మొదలైన ఎన్నో పదార్థాలను, వాటిని వండే విధానాన్ని గురించి మా కేరళయాత్ర అనే గ్రంథంలో స్పష్టంగా వివరించబడింది. అయితే కేరళీయుల ఏ వంటకంలోనైనా కన్పించే వస్తువు కొబ్బరి. భౌగోళికంగా కేరళ రాష్ట్రం కొబ్బరి, అరటి చెట్లతో కూడుకుని వుంటుంది. అందుకే వీరి వంటకాలు కొబ్బరినూనెతో, కొబ్బరి పాలతో, కొబ్బరి ముక్కలతో ఘుమఘుమలాడుతుంటాయి. అంతేకాక వీరు ప్లాస్టిక్, డిస్పోసబుల్ ప్లేట్లను కాకుండా నిత్యజీవితంలో కూడా దాదాపుగా అరటి ఆకుల్లోనే భోంచేయటం పరిపాటి.

దక్షిణ భారతదేశంలో బియ్యానికి లేదా అన్నానికి ప్రాముఖ్యం వున్నట్లుగా ఉత్తర భారతదేశంలో రొట్టెలకు ప్రాధాన్యత ఎక్కువ. ముఖ్యంగా రాజస్థాన్, మహారాష్ట్ర, పంజాబ్, గుజరాత్‌లు రొట్టెల తయారీకి పెట్టింది పేరు. దాశరధి రంగాచార్య గారు ఉత్తర భారతదేశ యాత్ర చేసే క్రమంలో రాజస్థాన్‌లోని జైసల్మీర్‌ను దర్శించారు. దక్షిణాది వారికి తెలియని ఎన్నో రుచికరమయిన వంటల్ని ఇక్కడ వారు తింటారని, జొన్న, సజ్జ, గోధుమ రొట్టెలు, కొద్దిగా అన్నం, మట్టి గిన్నెల్లోని పెరుగు వారి ఆహార విధానమని వివరించారు (యాత్రాజీవనం, పుట–454). కేవలం రాజస్థాన్‌లో మాత్రమే కాకుండా ఉత్తర భారతదేశం అంతా కూడా రొట్టెలను విరివిగా స్వీకరించడం కన్పిస్తుంది. ఉత్తర భారతదేశం చలి ప్రదేశం కావడం, పైగా ఆ నేలల్లో గోధుమ ఎక్కువగా పండటం దీనికి కారణమయి వుంటుంది. కాశ్మీర్‌లోనూ, దాని పరిసర ప్రాంతాలయిన లడక్‌లో కూడా ఇదే రకమయిన ఆహార సంస్కృతి వుందంటూ ముదిగంటి సూజాతారెడ్డి గారు పేర్కొన్నారు. "అక్కడి ప్రజలు

పోడు లాంటి వ్యసాయం చేసి, క్యారెట్, గోబీ, ఆలు, క్యాలిఫ్లవర్ లాంటి కూరగాయలు, బార్లీ, గోధుమలు పండించుకుని నిలువ వుంచుకుంటారు. బార్లీ నుంచి చేసిన సారాయి 'చ్యాంగో'ను తాగుతారు. వీళ్ళ ప్రియమైన పానీయం అదే" (నైలునదీ నాగరికత – విశిష్ట సంస్కృతికి నిలయం లద్దాఖీ, పుట-66). సాధారణ భాషలో చ్యాంగ్ అంటే ఆల్కహాల్ అని అర్థం. కానీ లద్దాఖీలు బార్లీ పానీయాన్ని 'చ్యాంగ్' అని పిలుస్తారు. దీన్ని లద్దాఖ్‌లోని నూబ్రా లోయలో ఎక్కువగా తయారుచేస్తారు. ఇక్కడ ఇంటికొచ్చిన అతిధులకు చిన్న ఇత్తడి పాత్రలో, కొంచెం వెన్నతో కలిపి ఇవ్వటం అతిథి మర్యాదగా భావిస్తారు.

కేవలం భారతీయ వంటకాలలోని వైవిధ్యాన్ని తెలిపే యాత్రాచరిత్రలేకాక, విదేశీయ వంటకాలను వాటి రుచులను వర్ణించే యాత్రాచరిత్రలు కూడా తెలుగులో ఉన్నాయి. వాటిలో ముందుగా చెప్పుకోదగ్గది పి.వి.రంగనాయకులు గారి 'జపాన్ – ఒక నాగరక జైత్రయాత్ర'. ఆసియా దేశాల్లో ఒకటైన జపాన్ వంటకాలనుగురించి, వాటి తయారీ విధానాన్ని గురించి డా॥ పి.వి. రంగనాయకులు గారు తన యాత్రాచరిత్రలో ఈ విధంగా వివరించారు. "మన దేశీయ వంటకాలతో పోలిస్తే జపాన్ వంటకాలు భిన్నంగా వుంటాయి. బియ్యాన్ని ఉడికించి మనలాగే అన్నం చేస్తారు. అన్నం పొడిపొడిగా రుచిగానే వుంటుంది. సిద్ధంగా ఉన్న అన్నాన్ని సూపర్ బజార్లలోను అమ్ముతారు ..... వారు మాత్రం అన్నంతో సముద్రంలో పెరిగే ఒక 'నాచు'ను పలుచగా చేసి అన్నంతో కలిపి తింటారు. అది కొద్దిగా 'రాగి' లోహం వాసనలాగా వస్తుంటుంది. ఆ నాచు తింటున్నందువల్లే వారికి 'రక్తపోటు' చాలా తక్కువ. జపాన్ ఆహార పదార్థాల్లో ఒకటి 'నట్టు'. మరీ ఎబ్బెట్టుగా ఉండే నట్టును సోయా గింజల నుంచి తీస్తారు. ఇది జిగురు జిగురుగా తినటానికే అసహ్యంగా అనిపించింది" (జపాన్-ఒక నాగరక జైత్రయాత్ర, పుట-34).

నట్టు జపనీయుల సాంప్రదాయ వంటకం. ఇది ఒక ఉపాహారం. జపాన్‌లోని తూర్పు ప్రాంతాల్లో దీనికి ప్రాచుర్యం ఎక్కువ. ఈ నట్టు తయారీ వెనుక చరిత్రలో ఒక కథ ఉన్నట్లు జపాన్‌లో వ్యాప్తిలో వుంది. క్రీ.శ 11వ శతాబ్దంలో జపాన్‌ను పాలించిన రాజు మిమోటో నోయషియె (minanoto no yoshiie) శత్రుదేశాలతో యుద్ధం చేసే

సమయంలో శిబిరంలో ఉండగా, తన గుర్రాలకు ఆహారంగా సైనికలు సోయాబీన్స్‌ను ఉడికించే సమయంలో శత్రురాజులు వీరి శిబిరంపై ఆకస్మిక దాడి చేశారు. దాంతో ఆ ఉడికించిన సోయాబీన్స్‌ను హడావిడిగా మూటలుగా కట్టి, అక్కడి నుండి మరొక చోటికి తీసుకువెళ్ళారు. యుద్ధ కసరత్తుల్లో పడి ఆ మూటల సంగతి మరచిపోయి, నాలుగు రోజుల తర్వాత తెరిచి చూసే సరికి ఆ సోయాబీన్స్ పులిసి, ఒక విధమయిన రుచి, వాసన రావడం మొదలైంది. ఆ రుచిని చూసి, దాన్ని అమితంగా ఇష్టపడ్డారు సైనికులు. అంతేకాక రాజులకు కూడా రుచి చూపించగా అతడు ఆ వంటకం రుచికి ఆకర్షితుడయ్యాడట. ఈ విధంగా అనుకోకుండా పుట్టిన ఒక వంటకం జపాన్ వారి సంస్కృతిని ప్రతిబింబించే చిహ్నంగా మారడం చెప్పుకోవాల్సిన అంశం.

సోయాగింజలతో చేసిన 'నట్టు' మాత్రమే కాక, సోయా కేకులు కూడా వీరు ఇష్టంగా తింటారట. "రొయ్యలను మిరపకాయ బజ్జీలా పిండితో నూనెలో ఉడికించి చేసిన వంటకం చాలా రుచిగా వుంటుంది. ఒకరకమయిన చేపను మాత్రం పచ్చిగానే తినాలి. ఉడికిస్తే అది పనికిరాదు. ఇక నూడిల్స్‌లో కొన్ని వందల రకాలున్నాయి.... సాంప్రదాయిక జపాన్ ఆహారం అంత రుచిగా లేకపోయినా ఇతరత్రా చక్కటి ఆహారం దొరుకుతుందం"టూ జపాన్ వారి ఆహారంలో గల భిన్నతను పరిచయం చేశారు రచయిత (జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర, పుట-34&35).

ఆహారాన్ని వండటంలోనే కాక, ఆహార స్వీకరణ విధానంలో కూడా జపనీయుల్లో భిన్నత్వం పై యాత్రాచరిత్రల ద్వారా తెలుసుకోవచ్చు. జపాన్ వారి ఆహార స్వీకరణ పద్ధతులను గురించి రచయిత ఈ విధంగా పేర్కొన్నారు. "భారతీయులు చేతివేళ్ళను ఉపయోగించి ఆహారాన్ని తీసుకుంటే పశ్చిమ దేశీయులు స్పూను, ఫోర్క్‌తో తీసుకుంటారని మనకు తెలుసు. జపనీయులు మాత్రం రెండు పుల్లలను వేళ్ళ మధ్య నైపుణ్యంగా పట్టుకుని ఎటువంటి పదార్థాన్నయినా అవలీలగా తింటుంటారు. జపాన్‌ను సందర్శించే వారికి ఆహారం తీసుకునే సమయంలో ఇదే కొంత ఇబ్బంది కలిగించే అంశం. భోజనం కోసం ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్ళినా మొదటగా శుభ్రంగా వున్న మన బల్లపై చిన్న, అందమైన

పింగాణీ బొమ్మలనుంచుతారు. ఇవి పిల్లిబొమ్మనో, పులిబొమ్మనో అయి వుండవచ్చు. తురవాత 'హషి' అనే ఆహారపు పుల్లలను ఆ బొమ్మలపై ఒక చివర నుంచి పెడతారు. ఆహారాన్ని తాకే పుల్లకొసలు బల్లపై తగలకుండా చిన్న బొమ్మలు ఆధారం అన్నమాట. తరువాతనే ఆహార పదార్థాల సేవన" (జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర, పుట-32). జపనీయుల ఆహార సంస్కృతిలో ప్రాధాన్యం కలగిన వస్తువు చాప్‌స్టిక్స్. దీనిని వీరు 'హషి' అని పిలుస్తారు. సాధారణంగా ఇవి వెదురుతో చేయబడతాయి. కానీ నేడు వెదురు, ప్లాస్టిక్, స్టీల్, చెక్కతో కూడా చేస్తున్నారు. ఈ పుల్లల ఉపయోగం మొదట చైనీయుల సంస్కృతిలో ప్రారంభమయింది. ఆ తర్వాత జపాన్, కొరియా, తైవాన్, మలేషియా, సింగపూర్ వంటి మిగిలిన ఆసియా దేశాలకు వ్యాపించింది.

వంట చెఱుకుతో వంట చేయడం ఆదిమ మానవుని నుండి వస్తున్నదే. అధునాతన సౌకర్యాలు, సాంకేతిక ప్రగతి వచ్చాక గ్యాసు, విద్యుత్తు పొయ్యిలు వినియోగంలోకి వచ్చాయి. అలా వంట చెఱుకుతో వంట చేసే క్రమంలో ఆ నిప్పు కణికలను కదిలించటానికి, వంటను కలపటానికి ఈ హుషి తోడ్పడి ఉండవచ్చు. తరువాత కాలక్రమేణా దానికి ప్రాముఖ్యత పెరిగి, ఆహార స్వీకరణకు ఒక సాధనంగా ఉపయోగపడుతుందని చెప్పవచ్చు. అయితే ఈ పుల్లల వాడకం వెనుక గల చరిత్రను గురించి 'జపాన్-ఒక నాగరక జైత్రయాత్ర' అనే యాత్రాచరిత్రలో రచయిత ఈ విధంగా వివరించారు. "పూర్వం జపనీయులు ఎక్కువగా రైతులుగా పొలాల్లో పనిచేస్తున్నప్పుడు వారు సహజంగానే కష్టపడి పనిచేసే మనస్తత్వం కలవారు. కాబట్టి ఆహారం తీసుకోవటానికి చేతులు కడుక్కోవటం, ఆహారం తీసుకున్న తరువాత మరలా చేయి కడుక్కొని పనిలో దిగటం సమయం వృధా అనిపించి, అక్కడే పొలాల్లో చెట్టు పుల్లలు విరుచుకుని ఆహారం తీసుకునే అలవాటు మొదలైంది. తర్వాతి కాలంలో ఇదే సంస్కృతిలో భాగమయింది" (జపాన్-ఒక నాగరక జైత్రయాత్ర, పుట-32&33).

జపాన్ కూడా భారత్‌లాగే వ్యవసాయక దేశం. అందులోనూ ప్రపంచంలో అతికష్టించి పనిచేసే వారిగా 'జపనీయులకు' పేరుంది. అందుకేనేమో రచయిత

చెప్పినట్లుగా వ్యవసాయం చేసేటప్పుడు సమయం వృథా కాకుండా వుండేందుకు వీరు ఈ పుల్లల సంస్కృతికి అంకురార్పణ చేసి వుంటారు. అయితే ఈ చాప్‌స్టిక్స్‌తో జపనీయులు తిన్నంత వేగంగా, సక్రమంగా విదేశీయులు తినలేరు. వీటితో ఆహారాన్ని స్వీకరించడమే కాదు, వాటిని ఉపయోగించే విధానాన్ని బట్టి తినేవారి వ్యక్తిత్వం మరియు వారి భావాలు వ్యక్తం అవుతాయి. వీటిని ఉపయోగించే క్రమంలో కొన్ని నియమాలున్నాయి. బల్లపైన వీటిని అడ్డంగా అమర్చకూడదు. వీటికి గల స్థానంలోనే అమర్చాలి. అన్నంలో నిలువుగా వుంచరాదు. అది పితృదేవతలకు తర్పణంలాగా, శవసంస్కార సమయంలో మాత్రమే ఇలా చేస్తారు. దీనిని బట్టి ఈ చాప్‌స్టిక్స్ వీరి ఆహార విధానాల్లోనే కాక, ఆచార-సాంప్రదాయాల్లోనూ, అలవాట్లలోనూ తనదైన ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని తెలుస్తుంది.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల ప్రపంచవ్యాప్తంగా గల ఆహార సంస్కృతుల్లో ఆదాన-ప్రదానాలు జరిగాయి, జరుగుతున్నాయి. ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ట్రాపికల్ అగ్రికల్చర్ (CIAT) అనే సంస్థ పరిశోధన ప్రకారం ఆహార సంస్కృతుల్లో ఆదాన ప్రదానాలు కొన్ని శతాబ్దాల ముందు నుండే జరుగుతున్నాయట. ఒక ప్రాంతానికి చెందిన ఆహార పదార్థాల వాడకమే కాదు, పంటలను పండించే విధానం, పంటల రకాలు కూడా ఇతర ప్రాంతాలకు కొన్ని సంవత్సరాల క్రితమే పరిచయమయ్యాయి. ఉదాహరణకు సన్‌ఫ్లవర్ ఉత్తర అమెరికాలో పుట్టినా, యూరోప్ దేశాలు వీటిని ఎక్కువగా సాగు చేస్తున్నాయి. అలాగే జామచెట్ల మాతృస్థలం అమెరికా అయినా భారత్ వంటి దక్షిణాసియా దేశాలు వాటిని పండించడంలో ముందున్నాయి. కాబట్టి ఎన్నో భిన్నతలున్న ఆహార సంస్కృతులన్నీ కలిసి, నేడు విశ్వ మానవ ఆహార సంస్కృతిగా పరిణామం చెందుతున్నాయని చెప్పడంలో సందేహం లేదు. ఈ పరిణామాలను అక్షరీకరించడంలో, పాఠకులకు చేరవేయడంలో యాత్రాచరిత్రలు తమ వంతు కృషిని నిర్వహిస్తున్నాయన్నది అక్షరసత్యం.

## 4.5. నమ్మకాలు

సమాజంలోని ఒక వర్గానికి చెందిన కొద్దిమంది వ్యక్తుల ఆలోచనల, ప్రవర్తనల సమాహారమే నమ్మకాలు. ఇవి వ్యక్తుల యొక్క ఆలోచనా విధానాలు, వారు పాటించే విలువలు, మానసిక భావనలు, జీవన రీతులను ప్రతిఫలిస్తుంటాయి. నమ్మకాలు కట్టుకథలు, సామెతలు, పురాణగాథలు, ఆచార సాంప్రదాయాలు మొదలైన వాటి రూపంలో సమాజంలో ఉనికిలో ఉంటాయి. అనాదిగా వస్తున్న పూర్వీకుల అనుభవాలు కొన్ని ఆచార సాంప్రదాయాలుగా మారితే, మరికొన్ని నమ్మకాలుగా రూపాన్ని సంతరించుకున్నాయి. ఈ నమ్మకాలే నిరతంరం ప్రజల చేత ఆచరింపబడితే ఆచారాలుగా, ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమింప చేస్తే సాంప్రదాయాలుగా రూపాంతరం చెందుతాయి.

“కార్యకారణ వివక్ష లేకుండా ఒక విషయాన్ని విశ్వసిస్తే అది నమ్మకం. నమ్మకానికి సమానార్థక పదాలుగా నమ్మిక, విశ్వాసం అనే పదాలున్నాయి” (4వ ప్రపంచమహాసభల ప్రత్యేక సంచిక, రచయిత డా॥ గెంజి అరుణ, పుట-800) అంటే ఒక అంశం వాస్తవమయినా, అవాస్తవమయినా మనుగడలో ఉందని ఎటువంటి ఆధారాలు లేకుండా అంగీకరించినట్లయితే దాన్నీ నమ్మకం అనవచ్చు. నమ్మకం ఊహాత్మకమైన అంశం. నమ్మకానికి కొన్నిసార్లు శాస్త్రీయత పునాది కావచ్చు, కాకపోవచ్చు. నమ్మకానికి రూపం ఉండదు. దానికి రూపం క్రియనే. కొన్ని నమ్మకాల వల్ల కూడా మానవ జీవితం ఒక పద్ధతిలో నడుస్తుందని చెప్పటంలో సందేహం లేదు. మానవ జీవితానికి పునాది నమ్మకమే. మనిషి యొక్క వ్యక్తిత్వం నమ్మకాల వల్ల కూడా తీర్చిదిద్దబడుతుంది. నమ్మకాలు అనుభవాల నుండి పుట్టినవి. అనుభవాలు మారుతున్న కొద్దీ నమ్మకాలు కూడా మారుతుంటాయి. మనిషి జీవితాని కంటే నమ్మకానికే ఆయుః ప్రమాణం ఎక్కువ. ఎందుకంటే ఇవి ఒకరి నుండి మరొకరికి తరతరాలుగా వ్యాపిస్తూ, సృష్టి అంతం వరకూ మనుగడలో ఉంటాయి.

సమాజంలో ప్రతి మనిషికి కొన్ని నమ్మకాలు ఉండటం అవసరం. ఒక మనిషిని గొప్పవ్యక్తిగా, వ్యక్తిత్వం గల వారిగా తీర్చిదిద్దడానికి నమ్మకాలు అత్యంత ఆవశ్యకం. ఇవి

మనిషికి తన మీద, తను చేసే పని మీద, చుట్టూ ఉన్నవారి పట్ల ఒక అవగాహనను కలిగిస్తాయి. జ్ఞానాన్ని, జీవితం పట్ల ఆశావాహం దృక్పథాన్ని కలిగించి మానవ సంబంధాలను పెంపొందించుకునేందుకు ఉపయోగపడతాయి.

మనిషి సంఘజీవి. కాబట్టి సంఘంలో నివసించే ప్రతీ వ్యక్తికీ కొన్ని నమ్మకాలుంటాయి. ఇవి వ్యక్తిని సరైన దిశలోకి నడిపించేందుకు ప్రయత్నిస్తాయనేది నిస్సందేహం. ప్రపంచంలోని ఏ మానవ సమాజానికైనా వారి వారి అనుభవాలను ఆధారంగా చేసుకుని కొన్ని నమ్మకాలు ఏర్పడతాయి. ఆ నమ్మకాలు ఒక సమాజానికి, మరొక సమాజానికి వేరుగా ఉండవచ్చు, వింతగానూ ఉండవచ్చు. లేదా ఆశ్చర్యపరచనూ వచ్చు. కాబట్టి ఇదిమిద్దంగా ఒకే అంశాన్ని ఆధారంగా చేసుకొని నమ్మకాలు ఏర్పడతాయని చెప్పలేము. ప్రపంచంలోని ఏ సమూహానికి చెందిన వ్యక్తులు పాటించే నమ్మకాలను గమనించినా, వాటి వెనకాల ఒక అంతరార్థం, పరమార్థం ఖచ్చితంగా ఉంటుంది.

అటువంటి ఎన్నో నమ్మకాలను యాత్రాచరిత్రల ద్వారా మనం తెలుసుకోవచ్చు. యాత్రాచరిత్రలు ప్రపంచంలోని వివిధ సమూహాలకు చెందిన వ్యక్తుల యొక్క నమ్మకాలను గుదిగుచ్చి ఒక్కచోట పాఠకులకు అందిస్తాయి. అవి పాఠకుల్ని ఆనందపరుస్తాయి. ఆశ్చర్యపరుస్తాయి. పాఠకుడు, రచయిత వివరించే నమ్మకాలను తనకు తెలిసిన నమ్మకాలతో పోల్చుకుని, వాటిలోని వైవిధ్యాన్ని తెలుసుకుని ఆనందిస్తాడు. ఉదాహరణకు చైనీయులు నమ్మే ఫెంగ్‌షుయ్ అనే వాస్తు విధానాన్ని భారత్‌లో సహా ప్రపంచంలోని ఎన్నో దేశాల ప్రజలు నమ్ముతున్నారు కదా! కాబట్టి ఒక సంస్కృతిలో భాగమైన నమ్మకాలు మరొక సంస్కృతిని కూడా ప్రభావితం చేయగలవు.

ప్రపంచంలో అతివేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దేశం చైనా. చైనీయులకు ఎన్నో రకాల నమ్మకాలున్నాయి. 'ఫెంగ్‌షుయ్' (Feng Shui) చైనీయుల వాస్తుకళ. ఈ ఫెంగ్‌షుయ్‌ను పాటిస్తే ఆరోగ్యంగా, ఆర్థికంగా బాగుంటారని, ఎటువంటి దుష్టశక్తులు ఇంట్లోకి ప్రవేశించవని చైనీయుల నమ్మకం. "చైనాలో మతం అంతగా ఆచరణలో లేకున్నా ఫెంగ్‌షుయ్‌ను బాగా నమ్ముతారు. లాఫింగు బుద్ధను ఇంట్లో

పెట్టుకుంటే సంతోషాన్ని తెస్తుందంటారు. కిటికీలకు ద్వార బంధనానికి గంటలు, చిరుగంటలు వేలాడదీసుకుంటారు. ఈ గంటల మీద బుద్ధుని బొమ్మలు కూడా ఉంటాయి" (అద్భుత చైనాయాత్ర, పుట-37). ముదిగంటి సుజాతారెడ్డిగారు చెప్పిన విషయాల్ని కురుగంటి శ్రీలక్ష్మిగారు తన షంఘై నింగిలో అనే యాత్రాగ్రంథంలో వివరిస్తూ ఇలా పేర్కొన్నారు. వాస్తు (ఫెంగ్‌షుయ్) నమ్మకాలు వీళ్ళకెక్కువ. ఇళ్ళ స్థలంలో మనలాగే దిక్కులు, వాటి ప్రాధాన్యం చూస్తారు. ఇంకా ప్రకృతిని పూజిస్తారు. తలుపులు ద్వారబంధాల మీద వేసే బొమ్మలు, ద్వారపాలకులలాగా చెడును తొలగిస్తాయని నమ్ముతారు. తలుపుకి గంటల్ని కట్టడం పూర్వకాలపు ఆచారంగా జేడ్ బుద్ధుడి గుడి తలుపుల మీద నేటికీ నిలిచి ఉన్నాయి (షంఘై నింగిలో, పుట-74).

పై మాటల్ని గమనించినట్లయితే భారతీయుల్లాగే చైనీయులకు వాస్తు విషయంలో నమ్మకాలెక్కువ అని తెలుస్తుంది. చైనీయులు కిటికీలకి, ద్వారాలకు గంటల్ని వేలాడదీస్తారు. అదే నమ్మకం మన భారతీయుల్లో కూడా చూడవచ్చు. దాదాపు చాలామంది దేవుని గదికి చిరుగంటలతో కూడి వున్న తలుపుల్నే ఏర్పాటు చేస్తుంటారు. భారతీయులు ఇంట్లో దేవుని విగ్రహాలను ఆరాధించినట్లుగానే లాఫింగు బుద్ధ ప్రతిమ ఇంట్లో ఉంటే, ముఖ్యంగా ప్రధాన ద్వార బంధానికి ఎదురుగా వుంటే ఇంటికి మంచి జరుగుతుందని చైనీయుల విశ్వాసం. అలాగే నవ్వుతూ భుజం మీద సంచీ తగిలించుకున్న లాఫింగ్ బుద్ధ కూడా ఇంట్లో వుంటే సంపదను, ఐశ్వర్యాన్ని తెస్తుందని నమ్మతారు. లాఫింగ్ బుద్ధ భుజంపైన వుండే సంచి సంపదకు చిహ్నమని వారి విశ్వాసం.

వీరికి వాస్తు పట్లే కాకుండా రంగుల పట్ల కూడా నమ్మకాలున్నాయి. ఎరుపు రంగును వీరు శుభప్రదంగా భావిస్తారు. "చైనాలో గోడలకు ఎరుపు, ఆకుపచ్చ రంగులు ఎక్కువ వేసుకుంటారు. ఎరుపు ఆనందాన్ని, ఆకుపచ్చ సంపదలనిస్తుందని వాళ్ళ నమ్మకం" (అద్భుత చైనా యానం, పుట-38). చైనాలోనే కాక, బౌద్ధమతం వ్యాపించి ఉన్న అనేక దేశాల వారికి ఈ గంటలు కట్టడం, ఎరుపు రంగును శుభప్రదంగా భావించటం సాధారణం. ఎర్రదారాలను, ఎరుపుతో జేడ్‌లతో చేసిన ఆభరణాలను ధరిస్తే దురదృష్టం

తొలగిపోతుందని వీరి నమ్మకం. జేడ్‌లను ధరించడం వీరి సంస్కృతిలో ప్రధాన భాగం. ఇవి ధరిస్తే దుష్టశక్తులు దరి చేరవని, అందం, ఆరోగ్యం కలుగుతాయని చైనీయులు విశ్వసిస్తారు. ఈ రంగు రాళ్ళను ప్రతి శుభ, అశుభ సమయాల్లో ధరించడం అనివార్యమని వీరు భావిస్తారు. అందుకే చనిపోయిన వారికి కర్మకాండలు చేసేటప్పుడు కూడా వారిని జేడ్‌లతో అలంకరిస్తారు. ఇలా చేస్తే చనిపోయిన వ్యక్తి కూడా ఆత్మ బ్రతికున్న తన వాళ్ళను కాపాడుతుంటుందని వీరి విశ్వాసం.

చైనీయులు ఇళ్ళకు ఎరుపు రంగును వేయించటంతో పాటు ఎరుపు రంగు వస్తువులతో కూడా ఇంటిని అలంకరిస్తారు. "ఇంట్లో తగిలించుకునే గంటలు, డ్రాగన్ బొమ్మలు, ఏనుగు బొమ్మలతో, కోడి బొమ్మలతో రకరకాలుగా ఎర్ర దారాలతో కట్టినవి కనిపించాయి. ఎరుపు రంగు వీళ్ళకి శుభప్రదం. ఈ గంటల్ని ఇంట్లో పెడితే గాలీ ధూళి రావని, భయాలుండవని వీళ్ళ నమ్మకం. వీటిని మనిషి పుట్టిన సంవత్సరాన్ని బట్టి ఆ జంతువు బొమ్మ కొని ఇంట్లో పెట్టుకుంటారు. ఈ గంటలు కుటుంబంలో సంపదకీ, సంతోషానికీ, ఆరోగ్యానికీ, వాస్తుని బట్టి ఇంటికి కట్టడం ఎక్కువ" (షంఘై నింగిలో, పుట-74).

ఈ ఎరుపు రంగు పట్ల నమ్మకం గ్రీసు ప్రజలకు కూడా వుంది. వీరు ఎరుపు రంగును 'సఖ్యత'కు చిహ్నంగా భావిస్తారు. మనకి, వారికి అనేక నమ్మకాలు కూడా కలుస్తాయి. ఇద్దరు ఒకేసారి ఒకే మాటని మాట్లాడితే ఇంటికి ఎవరో వస్తారనే మన నమ్మకం వారికి కూడా ఉంది. అలా మాట్లాడితే వెంటనే 'పైసే కిక్నోనో' అంటారు. దానర్థం 'ఎరుపు ముట్టుకో' ఎర్రరంగుని ముట్టుకోకపోతే వారి మధ్య పోట్లాట వస్తుందనే నమ్మకం గ్రీస్ ప్రజల్లో ఉంది. నీలం రంగు మీద చిత్రించిన కన్ను దయ్యాన్ని పారద్రోలుతుందని గ్రీస్ ప్రజల నమ్మకం.

దీనిని బట్టి గ్రీసువారికి ఎరుపు, నీలం రంగుల పట్ల ఉండే నమ్మకాలు అర్థమవుతున్నాయి. భారతీయులు కూడా ఎరుపు, పసుపు, ఆకుపచ్చ రంగులను పవిత్రమైనవిగా, శుభప్రదంగా భావిస్తారు. అందుకే వివాహాది శుభకార్యాలప్పుడు,

పండుగలప్పుడు పసుపు పూలను, పచ్చటి మామిడాకులను గుమ్మాలకు అలంకరిస్తారు. అలాగే ఎర్రనీళ్ళతో దిష్టి తీస్తే అన్నీ పీడలు తొలగుతాయని దుష్టశక్తులు దరి చేరవని భారతీయుల విశ్వాసం. నలుపును అశుభానికి చిహ్నంగా భావిస్తారు. గ్రీసువారి లాగే భారతీయులకు కూడా ఒకే మాటను ఇద్దరూ ఒకేసారి మాట్లాడితే బంగారాన్ని తాకాలని అంటారు. అలా చేస్తే అనుకున్న మంచిపని తప్పక జరుగుతుందని భారతీయుల నమ్మకం. అయితే గ్రీసువారు భారతీయుల్లా బంగారాన్ని కాకుండా ఎరుపు రంగును ముట్టుకోవాలి. లేదంటే గొడవలు వస్తాయనేది వీరి నమ్మకం. చాకును లేదా కత్తిని చేతితో మరొక వ్యక్తి చేతికి ఇవ్వటం లేదా ఉప్పును చేతికి అందివ్వటం వల్ల ఇచ్చి పుచ్చుకున్న వ్యక్తుల మధ్య గొడవలు వస్తాయనేది తెలుగు వారి నమ్మకం.

గ్రీకులే కాక చైనీయులకు కూడా 'సంఖ్య'ల పట్ల కొన్ని నమ్మకాలు ఉన్నాయి. వీరికి 'నాలుగు' సంఖ్య దురదృష్టాన్ని తెస్తుందని నమ్ముతారు. కారణం చైనీయుల భాషలో నాలుగు అనే సంఖ్య ఉచ్చారణకి, 'చావు' అనే మరొక అర్థం కూడా ఉంది. అందుకనే చైనాలో నాలుగు సంఖ్యను ఉచ్చరించటం కానీ, ఉపయోగించటం కానీ నిషేధం. "నాలుగో అంతస్తు నాలుగో గది ఎక్కడా హోటళ్ళలో బహుళ అంతస్తుల భవనాల్లో వుండవు. ఒకసారి బీజింగులో ఒక పెద్ద హోటల్లో పెద్ద అగ్ని ప్రమాదమైంది. చాలా మంది చనిపోయారని మనమిక్కడ పత్రికల్లో కూడా చదివాం. కొత్త సంవత్సరం వేడుకలు కొత్తగా కట్టిన ఇంకా ఓపెన్ చేయని హోటల్ బిల్డింగ్ లో 42వ అంతస్తులో జరుగుతుండగా సంబరంలో భాగంగా కాలుస్తున్న ఫటాకులు పేలి ఆ అగ్ని ప్రమాదం జరిగిందని మా గైడు చెప్పాడు. నలభై రెండులోని 'నాలుగు' వల్లే ఆ అగ్నిప్రమాదం జరిగిందని ఆ కాలిపోయిన హోటల్‌ను మాకు చూపించాడు" (అద్భుత చైనాయాత్ర, పుట–38). అంతేగాక వీరు '49'వ సంఖ్యను అసలే వాడరు. ఎందుకంటే '49'వ సంఖ్యకు వీరిభాషలో మరణించేవరకు బాధ అని అర్థం వస్తుంది. అందుకే నాలుగు సంఖ్యను వాడాల్సిన ప్రతీచోట ఆ సంఖ్య స్థానంలో '5'ను వాడుతారు. ఈ నమ్మకం చైనాను దర్శించే ఇతర దేశీయులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుందనడంలో సందేహం లేదు.

చైనీయులకు కొన్ని జంతువుల గురించి కూడా నమ్మకాలున్నాయి. భారతీయులకు అరవై సంవత్సరాలు ఉన్నట్లుగా వీరికి కాలెండర్ ప్రకారం 12 సంవత్సరాలున్నాయి. ఒక్కో సంవత్సరానికి చిహ్నంగా ఒక్కో జంతువు ఉంటుంది. చైనీయులు వారు పుట్టే సంవత్సరాన్ని అనుసరించి ఆ సంవత్సరాన్ని సూచించే జంతువు బొమ్మను ఇంట్లో పెట్టుకుంటే మంచిదని వీరు విశ్వసిస్తారు. “చైనీయుల సంస్కృతిలో 2004 కోతి సంవత్సరం. ఇది వివాహాది శుభకార్యాలకు మంచిదని చెబుతారు. మాకు పాఠం నేర్పే క్రిస్ చేతికి జేడ్‌తో ఎర్రదారం కట్టుకుంది. ఒకరోజు అది చూసి ఏమిటని అడిగితే ఈ సంవత్సరంలో కొన్ని నక్షత్రాల్లో పుట్టిన వాళ్ళకు మంచిది కాదని, ఆ రకంగా ఎర్రదారంతో ఎడమ చేతికి కట్టుకుంటే దురదృష్టం తొలగిపోతుందని చెప్పింది” (షంఘై నింగిలో, పుట-43).

భారతీయులలాగే చైనీయులు కూడా నక్షత్రాలను, జాతకాలను నమ్ముతారనే విషయం స్పష్టంగా అర్థమౌతుంది. భారతీయులు చెడును నివారించేందుకు చేతికి కాశితాడును కట్టుకున్నట్లుగా చైనీయులు కూడా ఎర్రదారాన్ని కట్టకోవడం గమనార్హం. 2004వ సంవత్సరం తర్వాత మళ్ళీ 2016వ సంవత్సరం కూడా వీరికి మర్కటనామ సంవత్సరం. ప్రతీ పన్నెండు సంవత్సరాలకు ఒకసారి మళ్ళీ అవే జంతువులను సూచించే సంవత్సరాలే పునరావృతం అవుతుంటాయి.

కేవలం ‘కోతి’ని మాత్రమే కాక, వీరు తమ సంస్కృతిలో భాగంగా తాబేళ్ళను, మొసళ్ళను కూడా పూజిస్తారు. “నీటిలోని తాబేళ్ళకి, మొసళ్ళకి, ప్రతిచోట పైసలు వేయటం వీళ్ళ ఆనవాయితీ. ఇవి ఉన్న చోట అంతా నాణాలతో నిండి వున్నాయి. చైనీయులకున్న నమ్మకాలకివి ప్రతీకలు. తాబేళ్ళలాగా ఎక్కువ ఏళ్ళు బతకాలనీ, దానిలా నిలకడైన మనసుతో జీవించాలనే కోరికే దీనికి కారణం” (షంఘై నింగిలో,పుట-42). చైనీయుల లాగే కిర్గిజ్‌స్థాన్ ప్రజలు కూడా కప్పలకు నాణేలను వేస్తారట. “పచ్చికలో ఒకచోట నిలువెత్తు కప్ప రాతి విగ్రహం కనిపించింది. దాని చుట్టూ చల్లిన పువ్వులు, నాణేలు కుప్పలు కుప్పలుగా ఉన్నాయి. కప్ప వాళ్ళకు అదృష్ట దేవతట. లక్ష్మీదేవికి సమానురాలట. ఇళ్ళల్లో కూడా కప్ప విగ్రహాలు ఉంటాయి” (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర, పుట-106).

అలాగే గ్రీకులకు కూడా ఈ నాణేల పట్ల నమ్మకాలున్నాయి. వీరు తమకు సంతానం కలగటం కోసం ఆఫ్రోడైట్ అనే దేవునికి బంగారు నాణేలని సమర్పించేవారని, ఆఫ్రోడైట్‌నే మనం మన్మధునిగా భావిస్తామని మల్లాది వెంకటకృష్ణమూర్తి గారు పేర్కొన్నారు (ట్రావెలాగ్, దుబాయ్, టర్కీ, గ్రీస్, పుట-106).

భారతీయులకి, ముఖ్యంగా తెలుగు వారికి నీటిలో నాణెం వేసి మొక్కుకోవటం ఆనవాయితి. పూర్వం నాణేలను రాగితో చేసేవారు. నీటిలో రాగి కలిస్తే ఆరోగ్యం అనేది దీనికి వెనుక గల ఉద్దేశ్యం. కానీ నేడు భారత సమాజంలో రాగి లేకపోయినా, నీటిలో నాణేలు వేసే నమ్మకం మాత్రం వీరిలో ఇంకా మిగిలివుంది. “నదులు దగ్గర, జలపాతాల దగ్గర భారతీయులకు లాగే చిల్లర నాణేలు నీటిలోకి వేయటం జపాన్ వారికి కూడా అలవాటు” (జపాన్- ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-72). తాబేళ్ళను, మొసళ్ళను, కప్పను మొదలైన జంతువులను పూజించటం, నీటిలో నాణేలు వేసి, నీటిని పూజించటం అనేవి ప్రకృతి ఆరాధనలో భాగం. ప్రపంచంలో ఎన్నో మతాలు మనుగడలో ఉన్నా, మానవులు ప్రకృతి ఆరాధనను మరిచిపోలేదని చెప్పేందుకు ఇవి గుర్తులు.

చైనీయులు కోతి, తాబేళ్ళు, మొసళ్ళను పూజించినట్లుగా డ్రాగన్‌ను కూడా విశేషంగా కొలుస్తారు. డ్రాగన్ వీరి జాతీయ జంతువు. చైనాలో సాహిత్యానికి, కళలకు ప్రధాన వస్తువు. డ్రాగన్‌ను కొలవటం వీరి ఆచారంగా మారింది. ఆదిమ దశలో ప్రతీ జాతికి ఒక జంతువుని కొలవటం ఆనవాయితీగా వుండేది. అందులో భాగంగానే చైనీయులు డ్రాగన్‌ను పూజిస్తారు. “ఇది ఒంటెలాంటి తలతో, దెయ్యంలాంటి కళ్ళతో, పాము మెడతో, ఎద్దు చెవులతో, పులి పంజాలతో, ముళ్ళ చాపలాగా, గరుడపక్షిలా భయంకరంగా వుంటుంది.... చైనాలోని పుస్తకాల్లో, బొమ్మల్లో, ఇళ్ళల్లో, పెయింటింగుల్లో కళాత్మకంగా దీన్ని తీర్చిదిద్దిన వైనం చూసినా, అది ఏ జంతువో అర్థం కాకుండా ఉండటం దీని ప్రత్యేకత. అంటే ఇది అన్ని జంతువుల అంగాలను కలిగి సర్వశక్తి సంపన్నంగా, మంచికి ప్రతీకగా విరాజిల్లుతుంది” (షంఘై నింగిలో, పుట-52).

డ్రాగన్‌ను వర్షానిచ్చే దేవతగా చైనీయులు నమ్ముతారు. ప్రతీ పండుగనాడు ఎగరవేసే గాలిపటాల్లో కూడా డ్రాగన్ బొమ్మలనే ప్రధానంగా చిత్రించటం లేదా డ్రాగన్ రూపంలోనే వాటిని తయారు చేయటం మనం గమనించవచ్చు. అంతేగాక డ్రాగన్ వీరి మత సంస్కృతిలో కూడా ఒక ప్రధాన భాగం. చైనీయులు తాబేలు, మొసలి, డ్రాగన్ మొదలైన జంతువులను పూజించినా, 'పంది'ని మాత్రం ఇష్టంగా తింటారు. "వీళ్ళకి పంది మాత్రం అతిపవిత్రమైంది. పెళ్ళైయ్యాక దాని గుండెను భార్యాభర్తలు తింటే జీవితాంతం ఆనందంగా ఉంటారని వీళ్ళ నమ్మకం. ఆనందంగా, సంతానంతో, సౌభాగ్యంతో ఉండటానికి విధిగా దాన్ని తినాలంటారు. పంది చైనీయుల పెరటి జంతువు. దీనికి సంతానం 10,12కి తక్కువ ఉండదు గనుక, సంతానానికి, వ్యవసాయదేశం గనుక పైరుకి ఎరువుగా దాని పెంట వాడటం ఎక్కువ. పంది అందుకే వీళ్ళకింత సన్నిహితమైన జంతువు. ఇంకా చేపల్ని పెంచుతారు. ఇవి కూడా మనవాళ్ళ నమ్మకాల లాగా సంతానానికి ప్రతీకగా పెంచుతారు" (షంఘై నింగిలో, పుట-74 మరియు 75).

చైనీయులు దాదాపుగా అన్ని జంతువుల, పక్షుల మాంసాన్ని భుజిస్తారని చెప్పవచ్చు. ఈ జీవుల్లోని ఏ భాగాన్ని బాగా భుజిస్తారో, మనిషిలో ఆ శరీర భాగం ఆరోగ్యంగా వుంటుందని వీరు నమ్ముతారు. ఉదాహరణకు కోతి మెదడును తింటే జ్ఞానం వస్తుందని, పులి వృషణాలు తింటే లైంగిక సామర్థ్యం పెరుగుతుందని వీరి విశ్వాసం.

పుట్టుక నుండి చావు వరకూ మనుషుల్లో అడుగడుగునా కొన్ని నమ్మకాలు నాటుకుని వుంటాయి. మనిషి మరణానంతరం కూడా జీవితం ఉంటుందని, ప్రపంచంలోని చాలా దేశాల ప్రజలు నమ్ముతారు. అందుకే చనిపోయిన తర్వాత వారికి ఇష్టమయిన దుస్తులు, ఆహార పదార్థాలు మొదలయిన వాటిని వీరి సమాధుల్లో పూడ్చటం భారతీయుల సాంప్రదాయం అంతేగాక ప్రతీ సంవత్సరం పితృదేవతలకు కర్మకాండల పేరుతో పిండం పెట్టడం కూడా భారతీయుల సాంప్రదాయం.

ఇటువంటి నమ్మకాలే ప్రపంచంలోని ఏడు వింతల్లో ఒకటైన పిరమిడ్ల నిర్మాణానికి ప్రాతిపదికలు అయ్యాయి. ఈజిప్టు రాజులయిన ఫెరోలు తమ మరణం తరువాత కూడా

జీవితం వుంటుందని నమ్మేవారు. అందుకే తాము జీవించి ఉన్న కాలంలోనే కొండల్లో సమాధులను నిర్మించుకునేవారు. వీటినే పిరమిడ్లు అని వ్యవహరిస్తున్నాము. “రాజు మరణించిన తర్వాత శరీరాన్ని ‘ప్రిజర్వ్’ చేయటానికి శరీరం లోపలి భాగాలను, ఒక గుండెను తప్ప అన్నింటినీ తీసేసేవాళ్ళు. తర్వాత శరీరాన్ని కెమికల్స్‌తో ‘డీహైడ్రేట్’ అంటే నీరు భాగం లేకుండా చేసేవాళ్ళు. అప్పుడు శరీరానికి మరిన్ని కెమికల్స్‌ను పూసి, అతి సన్నని బట్టలను చుట్టేవారు. అట్లా గుడ్డలతో చుట్టిన శవాన్ని శవపేటికలో పెట్టి పిరమిడుల్లో కర్మకాండలతో వుంచేవాళ్ళు. ఇట్లా శవాన్ని తయారు చేయటాన్ని ‘మమ్మీఫికేషన్’ అని, శవాలను ‘మమ్మీ’లని అంటారు” (నైలునదీ నాగరికత, పుట-16).

ఈ మమ్మిఫికేషన్ ప్రక్రియ పూర్తి కావటానికి దాదాపుగా నలభైరోజులు పట్టేదట. మరణం తర్వాత కూడా జీవితం కొనసాగుతుందనే నమ్మకమే శవాలను మమ్మీలుగా మార్చటానికి, పిరముదుల నిర్మాణానికి కారణమయింది. “ఈ మమ్మీలను పిరమిడ్‌ల అట్టడుగు భాగంలో ఒక రహస్య మందిరంలో భద్రపరిచేవారు. మనిషి చనిపోయినా ఆత్మ జీవిస్తుందని, ఆ ఆత్మ మళ్ళీ చనిపోయిన దేహంలోకి ప్రవేశిస్తుందని వీరి గట్టి నమ్మకం. మహారాజులకు పెద్ద పిరమిడ్, ఆ పక్కనే మహారాణికి చిన్న పిరమిడ్ కట్టడం ఒక సంప్రదాయం” (రాష్ట్రపతి ప్రధానులతో నా విదేశీ పర్యటనలు, పుట-49).

రాజులు నిర్మించుకున్న సమాధులను పిరమిడ్లని, రాజు కాకుండా అతని ఉద్యోగులు, బంధువులు, స్థోమతలేని వారు నిర్మించుకున్న ‘మస్తాబా’లు అంటారు. ఇవి పిరమిడ్లంత ఎత్తు కాకుండా, చిన్నవిగా, దీర్ఘచతురస్రాకారంగా ఉంటాయి. ఈ పిరమిడ్‌లలో రాజుల శరీరాలతో పాటుగా వారికి అవసరమయిన ఆహారాన్ని, ధనాన్ని, వజ్రవైఢూర్యాలను, సేవకులను, వారికి ప్రియమయిన వారిని కూడా సజీవంగా పిరమిడ్లలో వుంచి, వాటిని మూసేసేవాళ్ళు. వీటి నిర్మాణం అత్యంత రహస్యంగా జరిగేదట. ఇప్పటికీ కూడా పురాతత్వ శాస్త్రవేత్తలు వీటి నిర్మాణంలోని రహస్యాలను కనుక్కోలేకపోతున్నారు. ఈజిప్టులో పిరమిడ్ల నిర్మాణానికి పునాదులు దాదాపు 4000 సంవత్సరాల క్రిందటే ఉన్నాయని చరిత్రకారుల అభిప్రాయం. “చారిత్రక యుగానికి పూర్వం కూడా ఈజిప్టియన్లు

శవాలను మట్టిలో పూడ్చి, మీద దీర్ఘచతురస్రాకారంలో పైకి మొనదేలే విధంగా మట్టిదిబ్బను చేసేవారట..... పిరమిడులను ఇప్పుడున్న ఆకారంలో ఎందుకు నిర్మించారో, వాళ్ళను అట్లా నిర్మించటానికి ఏమి ప్రోత్సహించిందో చెప్పటం కష్టం. అయినా కొంతవరకు ఊహ చేయవచ్చును. చతురస్రాకారంలో కింద ఉన్న పిరమిదు సూచి ఆకారంగా పైకి లేస్తుంది. ఇది మృతుడు లేదా మృతుని ఆత్మ ఈజిప్టియన్ల ఆకాశదేవత అయిన హోరస్‌ను చేరుకోవటానికి చిహ్నంగా సూచి ఆకారంలో పైకి ఆకాశంవైపు లేచినట్లుగా కట్టారని అంటారు" (నైలునదీ నాగరికత, పుట-18&19).

అంతేకాక ప్రాచీన ఈజిప్టియన్లు పిరమిడుల ప్రధాన ద్వారాన్ని ఉత్తరం వైపుకు ఏర్పాటు చేశారు. ఆత్మ ఉత్తరం వైపున ధృవ నక్షత్రాన్ని చేరుకుంటుందని మీరు విశ్వసించడమే దీనికి కారణం. భారతీయులు కూడా చనిపోయిన వారి ఆత్మ ఆకాశంలో కలుస్తుందని, నక్షత్రాల్లో ఐక్యమై వెలుగులు పంచుతుందని విశ్వసిస్తారు. అటువంటి నమ్మకాలే ఈజిప్టియన్లలో కూడా వుండటం గమనార్హం. చైనీయులు కూడా మరణం తర్వాత జీవితం ఉంటుందని విశ్వసిస్తారు. "చనిపోయిన వాళ్ళ ఆత్మలు తమను ఆశీర్వదిస్తాయనీ, వాళ్ళ ముందు తలలు వంచి నమస్కారం చేయటంతో పాటూ, 'టీ'ని పోయిన వాళ్ళ శవంతో కలిపి పూడుస్తారు. అలా చేయటం వల్ల వాళ్ళు మంచి చేస్తారన్న నమ్మకం వీళ్ళకుంది. సాధారణంగా చైనీయుల కథల్లో చనిపోయిన వాళ్ళ ఆత్మలు వచ్చి, సాయం చేస్తాయని భావిస్తారు. వాళ్ళని దేవుళ్ళుగా ఆత్మలు వచ్చి, సాయం చేస్తాయని భావిస్తారు. వాళ్ళని దేవుళ్ళుగా పూజిస్తారు. ఇది మనకీ ఉన్ని నమ్మకమైనా 'టీ'ని సమర్పించటంతో వాళ్ళ ఆత్మలు శాంతిస్తాయని చైనీయులు భావిస్తారు" (షంఘై నింగిలో, పుట-72) అంతేకాకుండా భారతీయులు చనిపోయిన 12, 13 రోజు నాడు కర్మకాండల్ని నిర్వహించి, భోజనాలు పెట్టినట్లుగా, చైనీయులు భోజనాలతో పాటు 'టీ'ని కూడా అందిస్తారు. లేకుంటే చనిపోయిన వారి ఆత్మలు శాంతించకుండా తన వాళ్ళకి కీడును కలిగిస్తాయని వీరి నమ్మకం. చైనీయుల ఆచార-సాంప్రదాయల్లో, నమ్మకాల్లో 'టీ' ప్రాధాన్యం అధికం. వీరు

'టీ'ని మరియు తేయాకు చెట్టును భగవంతుని రూపంగా నమ్ముతారు. భారతీయులు తులసి చెట్టును పవిత్రంగా భావించినట్లుగా, వీరు 'తేయాకు' చెట్టును భావిస్తారు.

నమ్మకాలు అనేక రకాలు. వాటిలో మతానికి సంబంధించిన నమ్మకాలు కూడా ఒకటి. సాధారణంగా చాలమంది నమ్మకాలంటే మత నమ్మకాలనే అనుకుంటుంటారు. ప్రపంచంలోని చాలా దేశాల్లో మతనమ్మకాలు అనేకం ఉన్నాయి. అయితే మతనమ్మకాలు దాదాపుగా అశాస్త్రీయమయినవే అని చెప్పవచ్చు. భారతదేశంలో జంతువులను బలులు ఇవ్వటం, నిప్పులపై నడటం, నాలుకను శూలాలు గుచ్చుకోవటం లాంటి నమ్మకాలున్నట్లుగానే ప్రపంచంలోని అనేక దేశాల వారికి కూడా ఇటువంటి నమ్మకాలున్నాయి. ముఖ్యంగా గ్రీసు దేశం గురించి చెప్పుకున్నట్లయితే వీరు కూడా భారతీయుల లాగ ముడుపులు కట్టడం, తమ కోరికలు నెరవేరిన తర్వాత వాటిని చెల్లించుకోవటం వారికి ఆనవాయితి. గ్రీసువారు 'హైజియా' అనే దేవతకు ఈ ముడుపులు చెల్లించుకుంటారు. "శుభ్రతకి కూడా వీరికి ఒక దేవత ఉంది. ఆ పేరు గాడ్ ఆఫ్ హైజియా. ఈ దేవత పేరులోంచే హైజినిక్ (శుభ్రత) అనే ఆంగ్లపదం వచ్చింది. అనేక మానవ అవయవాల చెక్క బొమ్మలు అక్కడ కనిపించాయి. తమకి వచ్చిన జబ్బు నయమవడానికి పూర్వం వీటిని ప్రజలు దేవతలకి సమర్పించేవారు. గ్రీసు చర్చిల్లో ఈ అవయవ భాగాల బొమ్మలు సమర్పించటం నేటికీ ఆచారంగా కొనసాగుతోంది. ఇది మనకీ  ఇప్పటికీ తిరుమలలో మరికొన్ని చోట్ల ఉంది." (టావెలాగ్-దుబాయ్-టర్కీ-గ్రీస్, పుట-106).

హైజీనియా అనే ఈ దేవతల గ్రీకు పురాణాల్లోనూ, రోమన్ పురాణాల్లోనూ ప్రసిద్ధి చెందిన దేవత. హైజీనియా తండ్రి అస్క్లెపియస్‌ను ఆరోగ్యదేవతగా వీరు కొలుస్తారు. తండ్రిని రోగాలను మాయం చేసేవాడిగా, కూతురయిన హైజియా అసలు రోగాలే రాకుండా నివారించే దేవతగా గ్రీకు ప్రజలు కొలుస్తారు. ఏ మతంలోనైనా కొన్ని అశాస్త్రీయ నమ్మకాలుంటాయని దీనిని బట్టి మనకు అర్థమవుతుంది.

శారీరక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా మానసిక రుగ్మతలను కూడా దేవుళ్ళు నయం చేస్తారనే విశ్వాసం కొన్ని ప్రాంతాల ప్రజల్లో నెలకొని వుంది. కేరళలోని

'ఛోటానిక్కర భగవతి' అనే ఆలయం ఇందుకు నిదర్శనం. ఇక్కడ కొలువై వున్న భగవతి అమ్మవారిని పూజిస్తే మానసిక రుగ్మతలు, దుష్టశక్తుల పీడ తొలుగుతుందని స్థానికుల నమ్మకం. "ఇక్కడ స్వస్థత పొందడం కోసం కేవలం కేరళీయులే కాక, పొరుగు రాష్ట్రాల నుంచి కూడా మానసిక రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. అక్కడికి తెచ్చిన మానసిక రోగిని, ఆ రోగి వెంట వచ్చి వారు అక్కడి ఒక పురోహితునికి అప్పగిస్తారు. అతడు ఆ రోగిని మాటలలో పెట్టి, ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆ రోగి తల నుంచి కొన్ని వెంట్రుకలను పీకుతాడు. ఆ తరువాత ఆ వెంట్రుకల్ని ఒక మేకుతో అక్కడి ఒక పెద్ద వృక్షం మొదలుకు కొడతాడు. అలా అంతకాలంగా ఆ మానసిక రోగికి పట్టి పీడిస్తున్న రుగ్మత/భూత, ప్రేత, పిశాచాదుల పీడ ఆ వృక్షానికి మేకుతో కొట్టిన వెంట్రుకల ద్వారా విరగడ అయినట్లు భావిస్తారు. అక్కడి నుంచి తిరిగివెళ్ళే రోగికి కొన్ని మంత్రించిన వేపాకులు, నిమ్మకాయలు, మిరపకాయలు ఇచ్చి పంపుతాడు ఆ పురోహితుడు. వాటిని రోగి తన దగ్గరే ఉంచుకుంటే అతడికి మానసిక రుగ్మతలు గానీ, భూత, ప్రేత, పిశాచుల నుంచి ఎలాంటి హాని గానీ ఉండబోదని నమ్మజెపుతాడు" (మా కేరళయాత్ర, పుట-252).

ఒకప్పుడు నాగరికత గొప్పగా వర్ధిల్లిన గ్రీసు దేశంలోను, అక్షరాస్యత సంపూర్ణంగా ఉన్న కేరళలో కూడా ఇటువంటి అశాస్త్రీయ నమ్మకాలు ఇప్పటికీ పాటింపబడుతుండటం గమనార్హం. నమ్మకాల పట్ల నమ్మకం ఉండటానికి చదువుతో, ప్రాంతంతో, భాషతో నిమిత్తం లేదని పై అంశాల వల్ల తెలుస్తుంది.

పైన చర్చించిన నమ్మకాలే కాక, ఆధునిక కాలంలో ఎన్నో చిత్రమైన నమ్మకాలు కూడా ప్రజలలో వ్యాపించి ఉన్నాయి. ఉదాహరణకు జర్మనీలోని హ్యాంబర్గ్‌లోని ఎల్బా నదిపైన వుండే వంతెనకి ఒక ప్రత్యేకత ఉంది. ఆ వంతెనకు గల ప్రత్యేకతను డా॥ఎన్.గోపీగారు ఇలా వివరించారు. "ఎల్బా నదిపై ఓ వంతెన దాటాల్సి వచ్చింది. దాని మీదికి వెళ్ళగానే ఇరువైపులా దాని రెయిలింగ్‌కు వేలాది తాళాలు వేలాడుతున్నాయి..... ప్రేమికుల జరలుగానీ, కొత్తగా పెళ్ళయిన భార్యాభర్తలు గానీ ఈ వారధి మీద తమ జ్ఞాపకాలను ఇక్కడి తాళాల్లో బంధిస్తారు. తాళపు చెవిని కింద నదిలో విసిరేస్తారు. మళ్ళీ

తాళాన్ని విప్పాల్సిన అవసరం లేకుండా తమ జ్ఞాపకాలు తాళంలో నిక్షిప్తమై ఉంటాయని ఒక నమ్మకం. మళ్ళీ వచ్చినప్పుడు తాళంపైన ఆ రోజు తేదీని చెక్కుతారు. దీన్ని ప్రేమతాళం (love lock) అంటారు ..... ఇలా తాళం వెయ్యడం మనం ముడుపులు కట్టడంలాంటిదే. ఈ మూడి, తాళం వెయ్యడం రెండూ ఒక్కటే" (జర్మనీలో కవితాయాత్ర, పుట-22&23).

జర్మనీలో మాత్రమే కాక, ఫ్రాన్సు రాజధాని పారిస్‌లోనూ, దక్షిణ కొరియాలోని సియోల్, సెర్బియా, స్లోవేనియా, అమెరికా, అటలీ, చైనా మొదలైన దేశాల్లో కూడా నదుల వంతెనలకు, చెట్లకు, పర్వతాలకుండే కంచెలకు ఇటువంటి ప్రేమ తాళాలు వేయటం అనే విశ్వాసాలు ప్రజలలో నెలకొని వున్నాయి.

ఏ దేశానికి చెందిన వారైనా మనుషులంతా ఒకటే వారిలోని ప్రేమానురాగాలు, బంధాలు-బాంధవ్యాలు సార్వజనీనాలనేది ఈ అంశం నిరూపిస్తుంది. పాశ్చాత్యులకు వారి బంధాల పట్ల నమ్మకం లేదని, వారి బంధాలు తాత్కాలికం అనే భావన ప్రపంచంలో, ముఖ్యంగా భారతదేశంలో వ్యాప్తిలో ఉంది. కానీ వారికి, మనలాగే బంధాలను శాశ్వతం చేసుకోవాలని వుంటుందని, మనిషి ఏ ప్రాంతం వాడయినా ఒక బంధాన్ని వదులుకోవాలనుకోడనే విషయం పైన పేర్కొన్న నమ్మకాలను బట్టి అర్థంచేసుకోవచ్చు.

యాత్రాచరిత్రల్లో రచయితలు పొందుపరచిన భిన్న సమాజాల నమ్మకాలను పరిశీలించాక, జగమంతా ఒకే కుటుంబమని, మనుషులంతా సంబంధీకులనే విషయం తేటతెల్లమవుతుంది. మనిషి సహజ గుణాలైన భావోద్వేగాలు, ఆలోచనా విధానాలు, ప్రవర్తనలు అన్నీ కూడా ప్రపంచంలోని ఏ మనిషికైనా ఒకేలా వుంటాయని పై అంశాల్ని బట్టి తెలుసుకోవచ్చు. ఏ జాతికి లేదా ప్రాంతానికి చెందిన నమ్మకాలైనా, మనుషుల్లో జీవితం పట్ల ఆశావాహ దృక్పథాన్ని కలిగించేవే.

## 4.6. మతం

అనాదిగా ప్రకృతితో మనిషికి విడదీయరాని సంబంధం ఉంది. కష్టసుఖాలన్నీ ప్రకృతితోనే ముడి పడ్డాయనేది మానవుల విశ్వాసం. ఒక మానవాతీత శక్తి ప్రకతిలో

కొలువై వుందని, అది కన్నెర్ర చేసినప్పుడు శాంతపరిచేందుకు, లేదా ఆ ప్రకృతి కరుణించినప్పుడు కృతజ్ఞతలు తెలిపేందుకు మానవుడు ప్రకృతిని ఆరాధించటం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలో ప్రకృతిలో భాగాలైన నీరు, నిప్పు, చెట్టు, పుట్ట, నింగీ, నేల మొదలైన వాటిని ఆరాధించసాగాడు. ఈ ఆరాధనకు కొన్ని ఆచారాలు, విశ్వాసాలు, సాంప్రదాయాలు, కలగలిసి అది ఒక మతంగా రూపుదాల్చిందని చెప్పవచ్చు. ఆరాధనల్లో, ఆచారాల్లో, విశ్వాసాల్లో, పాటించే సాంప్రదాయాల్లో గల వ్యత్యాసాలే భిన్న మతాల ఆవిర్భావానికి కారణమయ్యాయి.

మానవుని జీవన విధానాన్ని ప్రభావితం చేసే అనేక అంశాలలో ప్రధానమైంది మతం. మతం అంటే నైఘంటికార్థం అభిప్రాయమని. ప్రకృతిలో జరిగే చర్యలకు భయపడిన మానవుడు ధైర్యం కోసం సృష్టించుకున్న మార్గమే మతం. అంటే మతం ఆవిర్భావానికి పునాది మానవునిలో కలిగిన భయమే. "మతం మానవుని నైతిక స్థాయిని పెంచి, వారి ప్రవర్తనను సరిదిద్ది, సంఘానికి ఒక కట్టుబాటును, వికాసాన్ని కల్గించేది అనేకానేకాలైన సాంఘీక, ఆచారాలు, నమ్మకాలు వెలుగు చూసేది" (జానపద సంస్కృతి, 2010, పుట-62) మతం ఒక సమూహానికి చెందిన వ్యక్తుల మధ్య సత్సంబంధాలను పెంపొందిస్తుంది. వ్యక్తులలో సత్ప్రవర్తనను కలిగించే ప్రయత్నం చేస్తుంది.

ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. వాటి మధ్య అంతః మరియు బాహ్య ఘర్షణలు కూడా ఉన్నాయి. ఏ మతమయినా మానవ శ్రేయస్సునే కోరుకుంటుంది. మానవుల మధ్య సత్సంబంధాలను కల్పించడమే మతం యొక్క ముఖ్య ఉద్దేశం. అందుకే "మతాలు ఒకే పరిధి నుండి కేంద్రానికి చేరుకునే వ్యాసార్ధాల వంటివి. అన్ని మతాలదీ ఒకే లక్ష్యమయినప్పుడు మార్గం ఏదైతేనేం?" అన్న గాంధీగారి మాటలు శ్లాఘనీయాలు.

ప్రజలలో మత సంబంధమైన విశ్వాసాలున్నప్పుడు సాహిత్యంలో ప్రతిఫలించటం సహజం. యాత్రాచరిత్రలు ఇందుకు మినహాయింపు కాదు. భారతదేశంలో పుట్టిపెరిగిన మతాలే కాకుండా ఇతర దేశాల్లోని మతాలకు సంబంధించిన అంశాలనేకం యాత్రాచరిత్రల ద్వారా తెలుస్తున్నాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో ఏఏ

మతాలున్నాయో, వాటి మనుగడ ఎలా వుందో యాత్రాచరిత్రలు తెలియచేస్తున్నాయి. మనకు తెలియని ఎన్నో మత సంబంధమైన విషయాలను, నమ్మకాలను, పూజా విధానాన్ని, ప్రార్థనా రీతుల్ని మొదలైనవెన్నింటినో వీటి ద్వారా తెలుసుకోవచ్చు. భిన్న ప్రాంతాల్లో గల భిన్న మతాలను తెలుసుకోవడం ద్వారా ప్రజల జీవన విధానాన్ని వారి విశ్వాసాల్ని, ధార్మిక జీవన విధానాల వెనుక గల కారణాలను గమనించవచ్చు.

శాస్త్ర, సాంకేతిక రంగాలలో ప్రగతి పథంలో దూసుకెళ్తున్న అనేక దేశాలు కూడా మతాలను అనుసరిస్తున్నాయి. ఏ దేశం కూడా పూర్తిగా ఆస్తికత్వంతో కానీ, పూర్తి నాస్తికత్వంతో కానీ ఉండదు. అందుకు ముందుగా 'జపాన్' ను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. జపనీయులు షింటో మతాన్ని ఆచరిస్తారు. జీవించి ఉన్నప్పుడు ఆచరించాల్సిన మతం షింటో అని, మరణించిన తర్వాత ఆచరించాల్సిన మతం బౌద్ధం అని జపనీయుల విశ్వాసం. అందుకే మరణించాక కర్మకాండను బౌద్ధమతాచారం ప్రకారమే జరిపిస్తారు. జపనీయులు పుట్టుకతో షింటోలుగా పుట్టి, బౌద్ధులుగా మరణిస్తారనే నానుడి జపాన్ లో వ్యాప్తిలో ఉంది. ప్రకృతి ఆరాధన షింటో మత లక్ష్యం. "హిందూమతంలో లాగే రాళ్ళల్లో, చెట్లల్లో, నదుల్లో ప్రతీ వస్తువులో దేవుణ్ణి చూసే 'షింటో' నమ్మకాలు జపాన్ ప్రజల జీవిత విధానాన్ని వందలాది సంవత్సరాలుగా తీర్చిదిద్దాయి" (జపాన్ ఒక నాగరిక జైత్రయాత్ర, పుట-70) హిందూమత ప్రకారం ప్రకృతిలో దేవుణ్ణి చూసినట్లే జపాన్‌లో కూడా ప్రకృతి ఆరాధన మూల సూత్రంగా గల 'షింటో' మతం వ్యాప్తిలో వుంది. ఇది ప్రాచీనకాలం నుండి జపాన్ ప్రజల జీవన విధానాన్ని తీర్చిదిద్దినట్లు తెలుస్తున్నది. జపాన్‌లో షింటో మతంతోపాటు క్రైస్తవ, బౌద్ధ మతాలు కూడా మనుగడలో ఉన్నాయి.

బౌద్ధమతానికి పుట్టినిల్లు భారతదేశం. భారతదేశం నుండే ఆసియా దేశాలైన చైనా, జపాన్ మొదలైన దేశాలలోకి బౌద్ధం వ్యాపించింది. "మన దేశాన్ని ఒకటవ శతాబ్దంలో పరిపాలించిన కనిష్కుడు..... గాంధారాన్ని (కాందహార్) రాజధానిగా చేసుకుని ఉత్తర భారతదేశాన్ని పరిపాలించాడు. స్వయంగా ఇతడు బౌద్ధమతాన్ని ఆరాధించాడు. ఇతని కృషి

వలన నేటి ఆఫ్ఘనిస్తాన్‌లో, మధ్య ఆసియాలోనే కాక చైనా వరకూ బౌద్ధ మతవ్యాప్తికి దారి ఏర్పడింది" (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర, పుట-42). దీనిని బట్టి ఆసియా దేశాలయిన చైనా, జపాన్, కొరియా మొదలైన దేశాలలో బౌద్ధమతం భారతదేశం నుండి ఎగుమతయ్యిందనే విషయం తేటతెల్లమవుతుంది.

"జపాన్‌లోకి బౌద్ధమతం క్రీ.శ.538లో ప్రవేశించింది. కొరియా నుంచి బౌద్ధమతం జపాన్‌లో ప్రవేశించినా షాతోకు అనే రాజు చైనీయుల నాగరికతను జపాన్‌లో ప్రోత్సహించినట్లుగానే బౌద్ధమతాన్ని కూడా ఆదరించి, వ్యాపింపచేశాడు. అట్లా ప్రాచీన కాలంలో బౌద్ధానికి జపాన్‌లో ఆదరణ, ఆచరణలు పెరిగాయి. క్రీ.శ.17వ శతాబ్దంలో పోర్చుగీసు వ్యాపారులతో పాటూ, మిషనరీలు ప్రవేశించి, జపాన్‌లో క్రిస్టియన్ మతాన్ని ప్రచారం చేశాయి. జపాన్‌లో ప్రాచీన 'షింటో', బౌద్ధం, క్రిష్టియన్ మతాలు మూడూ వున్నాయి. జపాన్‌లో ఇప్పటికీ చాలామంది బౌద్ధానుయాయులున్నారు. తర్వాత ఏ మతం వాళ్ళు అవలంబించినా బౌద్ధం, క్రమశిక్షణ, ఆధ్యాత్మికతలు మాసిపోలేదు" (అద్భుత చైనాయాత్ర, పుట-13).

అయితే జపాన్‌లోని ప్రధానమతాల్లో ఒకటైన 'షింటో' మంత బౌద్ధం ప్రవేశించక ముందు నుండే వ్యాప్తిలో వుంది. ప్రస్తుత జపాన్ సమాజంలో ఈ రెండు మతాలు ప్రధాన మతాలుగా పరస్పరం ఒకదానితో ఒకటి కలిసే వాడుకలో ఉన్నాయి. దాదాపుగా జపనీయులంతా షింటో మరియు బౌద్ధమతాలను రెండింటినీ పాటిస్తారు. అందుకే ముదిగంటి సుజాతారెడ్డిగారు తన యాత్రా గ్రంథంలో "జపనీయులు ఏ ఒక్క మతాన్ని కాక, కనీసం రెండు లేదా మూడు మతాలను అనుసరిస్తూ ఉంటారని" (అద్భుత చైనా యాత్ర, పుట-17) పేర్కొన్నారు. వీరు పాటించే బౌద్ధం కూడా ఇక్కడ రెండు, మూడు రూపాలలో వ్యాప్తిలో వుంది. వాటిలో 'జెన్' బౌద్ధం ప్రధానమయినది. "జెన్ బౌద్ధంలో క్రమశిక్షణను యోధులు కూడా అభ్యసించే వాళ్ళట 'జెన్' బౌద్ధ సాధనతో శక్తులు వస్తాయని జపనీయులు విశ్వసించారు. మానసికమైన, శారీరకమైన క్రమశిక్షణ జెన్ బౌద్ధం వల్ల సాధింపబడేది. ధ్యానంతో కలిగిన శక్తి, జ్ఞానాలతో ఏ సమస్యనైనా సాధించవచ్చునని

జపనీయులు విశ్వసించారు. పల్లెలకు, నగరాలకు దూరంగా ప్రకృతి ఒడిలో పర్ణశాల వంటి ఇండ్లను నిర్మించుకొని 'జెన్' బౌద్ధ సాధన చేసే వాళ్ళట. ఇప్పటికీ 'జెన్' బౌద్ధ ప్రభావం జపనీయుల మీద చాలా వుంది" (అద్భుత చైనాయాత్ర, పుట-16).

అయితే బుద్ధుని సూత్రాలకు వ్యతిరేకంగా జపాన్‌లో ఎక్కువ చూసిన బౌద్ధారామాలు బుద్ధుని విగ్రహారాధన కన్పిస్తుంటుంది. కానీ నేడు జపాన్ వారి ఆలోచనా దృక్పథంలో మార్పుల వల్ల మతం పట్ల వారికి విశ్వాసాలు సన్నగిల్లుతున్నాయి. "ఒక సర్వేలో 27% మంది జపనీయులు తాము బౌద్ధులమని, 37% మంది షింటో మతాన్ని అనుసరిస్తున్నామని, ఒకశాతం మంది క్రైస్తవాన్ని స్వీకరించామని, 65% మంది తాము ఏ మతాన్నీ పెద్దగా ఆచరించమని చెప్పారు... ఏది ఏమైనా ఎక్కువ శాతం మంది జపాన్ వారు ఇష్టపడేది బౌద్ధాన్నే అని తెలుస్తుంది" (జపాన్ ఒక నాగరిక క్షేత్రయాత్ర, పుట-70). భారతదేశంలో మాదిరిగా జపనీయుల నిత్యజీవితంలో మతం ప్రముఖ పాత్ర వహించదు. వీరు అన్నిమతాల పట్ల గౌరవాన్ని కలిగి వుంటారు. జపనీయులు మతచింతన కంటే తాత్త్విక, ఆధ్యాత్మిక చింతనతో జీవిస్తారని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

ప్రపంచంలో బుద్ధిజాన్ని ఎక్కువగా పాటించే మరొక దేశం చైనా. అయితే ఇక్కడ బుద్ధిజం కంటే ముందు టోయిజమ్, కన్ఫ్యూజియనిజమ్‌లు ప్రాచీన మతాలుగా వ్యాప్తిలో ఉన్నాయి. కన్ఫ్యూజియనిజమ్ చైనాలో అతి ప్రాచీన మతం. దీనికి కోంగ్‌చ్యు (kong ziu) అనే మరొక పేరు కూడా వుంది. ప్రసిద్ధ తత్వవేత్త కన్ఫ్యూజియస్ ఈ మత స్థాపకుడు. టోయిజమ్ 'లావ్‌ట్జూ' (laotzu) అనే తత్త్వవేత్త ద్వారా ఆవిర్భవించింది. ఇక మూడవది బౌద్ధం. భారతదేశం నుండి ఇక్కడికి దిగుమతి అయింది. విదేశీయుల వల్ల ఇస్లాం, క్రిస్టియానిటీ మతాలు కూడా ప్రస్తుతం చైనాలో వ్యాప్తిలో వున్నాయి. అయితే చైనాలో ఎన్ని మతాలున్నా ఎక్కువమంది చైనీయుల్ని ప్రభావితం చేసింది మాత్రం బుద్ధిజమే.

"చైనాలో మొదట్నుంచి వున్న కన్ఫ్యూషియన్ ధర్మం, నీతిధర్మాలను బోధించే తావోమతం, ఆ తర్వాత మావోయిజం 1966లో మావో తెచ్చిన సాంస్కృతిక విప్లవం, ఇవన్నీ చైనీయుల్లో ఒక క్రమశిక్షణను తెచ్చాయి. యూరోపులో క్రిష్టియన్ మతం వ్యాపిస్తున్న

కాలంలో క్రీ.శ.2-4 శతాబ్దాల్లో చైనాలో బౌద్ధమతం ప్రవేశించి, వ్యాపించింది. మావో పాలనలో చైనీయులు మతాన్ని విశ్వసించకున్నా, వాళ్ళల్లో మతసూత్రాలు నేర్పిన క్రమశిక్షణ చెరిగిపోలేదు" (అద్భుత చైనా యాత్ర, పుట-21).

ప్రాచీనకాలంలో చైనా సిల్క్ ఎగుమతులకు ప్రసిద్ధి చెందింది. అరబ్బు, పర్షియా, భారత దేశాలకు చైనా వస్తువులు ఎగుమతి అయ్యేవి. ముఖ్యంగా మిగిలిన ఆసియా దేశాలు, అరబ్బు దేశాలు పట్టును చైనా నుండే దిగుమతి చేసుకునేవి. ఈ క్రమంలో ఆయా వర్తకం జరిపే దేశాల యొక్క సంస్కృతి, చైనా సంస్కృతిని ప్రభావితం చేసింది. అందుకే భారదేశంలో మొదలైన బౌద్ధం సిల్క్‌రూట్ గుండా ప్రయాణించి చైనాలో ప్రవేశించి, ప్రముఖ మతంగా విరాజిల్లుతుంది. అదే సిల్క్‌రూట్‌లో ప్రముఖ దేశమయిన కజకిస్థాన్, కిర్గిజ్, ఉజ్బెకిస్తాన్‌లో మాత్రం పర్షియా, అరబ్బు వారి వర్తకం ఫలితంగా ఇస్లాం మతం ఉనికిలోకి వచ్చింది. చైనాలో కూడా ఇస్లాం మతం ఉన్నప్పటికీ, అక్కడ పైచేయి మాత్రం బుద్ధిజానిదే.

చైనీయులు కూడా భారతీయుల్లాగే దేవుణ్ణి పూజించటం చెప్పుకోదగ్గ అంశం. బుద్ధుడు విగ్రహారాధనను, పూజా, హోమాది తంతులను వ్యతిరేకించాడు. కానీ ఇప్పటికీ చాలా బౌద్ధారామాల్లో ఆయన బోధనలకు అతీతంగా పుజాది కార్యక్రమాలు జరుగుతుంటాయి. "జైన బుద్ధ గుడి చూశాం. అందులో జైన తీర్థంకరులు, వాళ్ళతో పాటు బుద్ధుడికి పూజలు నిర్వహిస్తున్నారు. హారతివ్వడం, గంటలు మోగించటం దాంతో మంత్రాలు చదవటం చేశారు. మనదేశంలో లాగానే ఈ గుడిలో పెద్ద తంతే జరుగుతుంది. పెద్ద ఎత్తున ప్రజలు తలలు వంచి తమ భక్తి భావనను ప్రదర్శించారు. దేవుని ముందు క్షమాపణగా గుంజీలు తీశారు" (షంఘై నింగిలో, పుట-63). అయితే చైనీయులు బుద్ధున్ని స్త్రీ రూపంలో దయాదేవతగా, అవలోకితేశ్వర దేవతగా ఆరాధిస్తూ వుంటారు. బౌద్ధమతంలో చేరిన సన్యాసినులకు బుద్ధుడు స్త్రీ రూపంలో దర్శనమిచ్చాడని, ఈ దేవతను కొలిస్తే సంతానం లేని వారికి సంతానాన్ని ఇస్తుందని చైనీయుల నమ్మకం అంతేకాక ఈ దేవత సంపదలను కూడా ప్రసాదిస్తుందని వ్యాపారస్థుల విశ్వాసం.

"బుద్ధుడు చైనీయుల అభిమతాలకనుగుణంగా వ్యక్తిగా, శక్తిగా, తండ్రిగా, మాతృదేవతగా, తన రూపాన్ని మార్చుకుని వేయికళ్ళతో వీళ్ళని కనిబెడుతూ, వేయి చేతులతో ఏం కావాలో వాటిని తక్షణం అందిస్తూ, రక్షకుడిగా స్థిరపడ్డాడు. షంఘైలోని మూడు ప్రసిద్ధమయిన బుద్ధుడి గుడులకున్న ప్రాముఖ్యత, అక్కడ మేము చూసిన ఆచార–వ్యవహారాలు, వాళ్ళ భక్తి ప్రపత్తులు, చైనాలో బౌద్ధమతానికున్న విలువలకు తార్కాణాలు" (షంఘై నింగిలో, పుట–65). చైనాలో బుద్ధిజం టాయిజమ్, కన్ఫూజనిజమ్‌లను అధిగమించి, చైనీయుల జీవితాల్లో ప్రబలమయిన స్థానాన్ని ఆక్రమించింది.

నేడు ప్రపంచీకరణ ప్రభావం వల్లనేమో క్రిస్టియన్ మతాచారాలను, సాంప్రదాయాలను చైనీయులు పాటిస్తున్నారు. అందుకు నేడు చైనాలో జరుగుతున్న క్రైస్తవ వివాహాలే నిదర్శనం. నేడు చైనీయులు చర్చిల్లో వివాహం చేసుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఏ సంప్రదాయాలు ఏ తంతూ లేకుండా ముగిసిపోవడం, తద్వారా అనుకూలం వుండటం కారణాలు కావచ్చు. "నేడు అధికారికమైన లెక్కల్లో చైనాలో 20 మిలియన్లు ముస్లింలు వున్నారు. పోర్చుగీసు వ్యాపారులతో పాటు మిషనరీలు ప్రవేశించి, చైనాలో క్రిస్టియన్ మతాన్ని బోధించారు. ఇప్పుడు క్రమంగా క్రిస్టియన్ మతాచరణ పెరుగుతున్నదట. 60 మిలియన్ల వరకు క్రిస్టియన్లు ఉన్నారు. ఇక ఎక్కువ మంది విశ్వసించి, ఆచరించే బౌద్ధ ధర్మం గురించి జనగణన లేదు కానీ అధికారికంగా 100 మిలియన్ల బౌద్ధులున్నారు. అయితే మత సంబంధమైన కర్మకాండలను చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం నిషేధించింది. వయస్సు మళ్ళిన వాళ్ళు మసీదుల్లో, బౌద్ధదేవాలయాల్లో,చర్చిల్లో కన్పిస్తారు. కానీ యువకులెవరూ కన్పించరు. కొన్ని రహస్యమయమైన చర్చిలున్నాయన్నారు. ఉద్యోగాల ప్రకటనలో ప్రభుత్వం మత విశ్వాసం లేని వాళ్ళే దరఖాస్తులు పెట్టుకోవాలనే నిబంధనను కూడా పెడ్తారట. లేని ప్రభుత్వం ఉన్నత పదవుల్లో మత విశ్వాసం లేనివాళ్ళే వుంటారట. మత సంబంధ సంస్థతో సంబంధమున్నదంటే ఉద్యోగానికి ముప్పే. ప్రభుత్వం స్కూళ్ళలో గానీ మతాన్ని బోధించరు. నీతిని, క్రమశిక్షణను

స్కూళ్ళల్లో బోధించటం మంచిదే కాని, మతవిశ్వాసాలను పిల్లలకు నేర్పటం వేరు. అది చైనాలో నిషేధం” (అద్భుత చైనాయాత్ర, పుట–21 మరియు 22).

కురుగంటి శ్రీలక్ష్మి గారు తన యాత్రాగ్రంథమైన ‘షంఘై నింగిలో’ చైనా గురించి చెప్పిన మత విషయాలకు, ముదిగంటి సుజాతారెడ్డి గారు తన ‘అద్భుత చైనాయాత్ర’ గ్రంథంలోని మతవిషయాలకు కొంత వ్యత్యాసం కన్పిస్తుంది. ఈ రెండు యాత్రల మధ్య దాదాపు ఏడు సంవత్సరాల వ్యవధి ఉంది. శ్రీలక్ష్మిగారు 2004లో చైనాయాత్ర చేస్తే, సుజాతారెడ్డిగారు 2011లో చేశారు. ఈ ఏడు సంవత్సరాల వ్యవధిలో మతం గురించి చైనీయుల ఆలోచనల్లో మార్పు వచ్చినట్లు తెలుస్తుంది. “టోయిజమ్, కన్ఫూజనిజమ్ పరిధుల్ని దాటి, బుద్ధుడి జీవన విధానాలనే ప్రధాన ఆలంబనగా చేసుకున్నారు చైనీయులని” శ్రీలక్ష్మిగారు పేర్కొన్నారు. అయితే నేడు బౌద్ధమతం మాత్రమే కాక, క్రైస్తవ మతం కూడా ప్రధాన మతం స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు సుజాతారెడ్డి గారు. అంటే ఈ ఏడు సంవత్సరాల వ్యవధిలో క్రైస్తవ మతానుయాయుల సంఖ్య పెరుగుతూ వుండటం ఇక్కడ గమనించదగ్గ అంశం. నేడు అన్ని దేశాలు ప్రపంచీకరణ ప్రభావానికి గురౌతున్నవే. అందుకు చైనా మినహాయింపు కాదు. ఈ ప్రపంచీకరణ దృక్పథం క్రైస్తవ రాజ్యాల ఆలోచనే కాబట్టి ప్రపంచీకరణ వస్తువినిమయ సంస్కృతి, ఆర్థిక శక్తులనే కాక, మతాలను కూడా ప్రభావితం చేస్తుందనటానికి ప్రస్తుత చైనానే ఒక నిదర్శనం.

ఏదేశమనప్పటికీ చైనా కూడా భారత్‌లా మతసామరస్యం కలిగిన లౌకిక దేశమన్న విషయం స్పష్టమవుతుంది.

బౌద్ధమతం చైనా, జపాన్‌లతో పాటూ మరొక మధ్య ఆసియా దేశమయిన కిర్గిజ్‌స్థాన్‌లో కూడా ఒకప్పుడు వ్యాప్తిలో వుండేది. “కిర్గిజ్ ప్రజలు గిరిజనులు కావున ఆదిలో ‘షామానిజాన్ని’ పాటించేవారు ఆ తర్వాత బౌద్ధమతాన్ని అవలింభించారు. మధ్య యుగాలలో ఇస్లాం మత ప్రభావానికి గురైనారు” (సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర, పుట–41). ప్రస్తుతం కిర్గిజ్‌లో ఎక్కువశాతం మంది అవలంబించే మతం ఇస్లాం. అయినప్పటికీ ఇతర మతాలను ఆదరించటం కూడా అక్కడ చూడవచ్చు. కిర్గిజ్ ముందు సోవియట్

రిపబ్లిక్‌లో భాగంగా వుండి, 1991లో స్వతంత్రాన్ని పొందింది. కిర్గిజ్‌కి సరిహద్దు దేశాలుగా కజికిస్తాన్, చైనా, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లు ఉన్నాయి. కిర్గిస్థాన్ మాదిరిగానే దీని సరిహద్దు దేశాలయిన కజక్, తజక్, ఉజ్బెకిస్థాన్‌ల్లో కూడా 98% మందికి పైగా ఇస్లాం మతానుయాయులే వున్నారు.

మరొక ఆసియా దేశమయిన పాకిస్తాన్‌లో కూడా ఇస్లాం మతమే వ్యాప్తిలో వుంది. అయితే స్వాతంత్ర్యానంతరం దేశ విభజన తర్వాత భారతదేశం నుండి కొన్నివేల మంది ముస్లింలు పాకిస్థాన్‌కి, ముఖ్యంగా హైదరాబాద్‌కి వలస రావడం జరిగింది. వీరినే మొహజర్లు అంటారు. ఆనాడు మొహజర్లకి, స్థానిక హిందువులకి మధ్య మతఘర్షణలు చెలరేగాయి. ఆ సమయంలో పాకిస్థాన్‌లో వీరి జనాభానే అధికం.

"ప్రస్తుతం పాకిస్థాన్‌లో భాగంగా వున్న సింధ్ రాష్ట్రంలో ఈ మొహజర్లు ఎక్కువగా నివసిస్తున్నారు. స్థానిక సింధీల కంటే వీరి జనాభానే ప్రస్తుతం ఇక్కడ అధికం. ఈ సింధ్ ప్రాంతంలో మొత్తం 68 లక్షల మంది హిందువులు వుండగా, హైదరాబాద్‌లో పదిలక్షలమంది హిందువులు ఉన్నారు. తమకు పెద్దగా ప్రమాదం లేదని, ఇక్కడ మతసామరస్యం బాగా వున్నదని స్థానిక హిందువులు" పలికారంటూ పేర్కొన్నారు రచయిత. (పాకిస్థాన్లో పదిరోజులు, పుట-37). అయితే హైదరాబాద్‌లో హిందువులు, ముస్లిములే కాక, క్రైస్తవులు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. "పాకిస్థాన్‌లోని ప్రముఖ పట్టణమయిన హైదరాబాద్ వివిధ మతాలకు, జాతులకు కేంద్రంగా వర్ధిల్లుతూ, బహుళ సంస్కృతితో అలరారుతుంది. ఇక్కడ ముస్లింలతో పాటుగా హిందువులు, క్రైస్తవులు గూడా సామరస్యంగా జీవిస్తున్నారని చెప్పవచ్చు" (పాకిస్థాన్‌లో పదిరోజులు, పుట-41).

ఇతర మతాలు, జాతుల పట్ల సహనశీలతతో, విశాల హృదయంతో వ్యవహరించటం ఇక్కడ స్థానికల సంస్కృతని, పాకిస్థాన్ మతరాజ్యమయినా, పాకిస్థాన్ ప్రజలు మాత్రం మతోన్మాదులు కారని యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు తన యాత్రాగ్రంథంలో పేర్కొన్నారు. మనలో చాలా మందికి అక్కడ ఉన్న వారందరూ మతోన్మాదులని, ఆధునిక భావాలకు అతీతులైనవారనే అభిప్రాయం అంతర్లీనంగా నెలకొని వుంది. కానీ వారు కూడా

నిజానికి మతసామరస్యాన్నే కోరుకుంటున్నారనే విషయం పై రచయిత మాటల్ని బట్టి తేటతెల్లం అవుతుంది. ఇది శుభ పరిణామమని చెప్పవచ్చు.

దక్షిణ భారతదేశంలోని ప్రధాన రాష్ట్రమయిన కేరళలో కూడా క్రీ.శ.1వ శతాబ్దం నుండే ఇస్లాం మతం వ్యాప్తిలోకి వచ్చింది. అయితే మహ్మద్ ప్రవక్త కాలం నుండే ఇస్లాం మతం కేరళలో వుందనేది చరిత్రకారుల అభిప్రాయం. అరబ్బు వ్యాపారుల ద్వారా ఇస్లాం కేరళలోకి ప్రవేశించింది. ఈ సమయంలో ఎంతోమంది కేరళ రాజులు ఇస్లాంను ఆదరించటమే కాక, స్వయంగా ఆ మతాన్ని స్వీకరించారు. "1498లో భారతదేశంలో కాలుమోపిన పోర్చుగీసువారు అరబ్ వ్యక్తులను, ఇస్లాం మతాన్ని కొంతమేరకు కట్టడి చేశారు. అయితే హిందువుల్లోని అంటరాని వారిని చేరదీసి, వారిని తమ మతంలో చేర్చుకోవడం ద్వారా ఇస్లాం ఆ ప్రాంతంలో విస్తరించింది. మైసూర్ ప్రభువు టిప్పు సుల్తాన్ భారత పశ్చిమ తీరంపై జరిపిన దాడి సందర్భంగా 4 లక్షల మందికి పైగా హిందువులను బలవంతంగా ఇస్లాం మతంలోకి మార్చాడు. ఈ విషయం తన సేనానులలో ఒకరికి రాసిన లేఖలో ఆయనే స్వయంగా పేర్కొన్నాడు." (మా కేరళయాత్ర, పుట-248).

కేరళలో ఇస్లాం మతానికి బీజాలు పడ్డప్పుడే క్రైస్తవ మతానికి కూడా పునాదులు ఏర్పడ్డాయనేది చరిత్రకారుల మాట. కేరళలో దాదాపుగా 1వ శతాబ్దం నాటికే క్రైస్తవం ప్రచారంలో వుంది. సెయింట్ థామస్ రాకతో కేరళలో క్రైస్తవ మత ప్రవేశం జరిగి, ఇక్కడ ఆయన ఏడు చర్చిలను నిర్మించడంతో, ఆ మత స్థాపనకు బలనయిన పునాదులు ఏర్పడ్డాయి. కేరళలో క్రైస్తవమతం వ్యాప్తి వెనుక ఎంతో చరిత్ర దాగి వుంది. ఏసుక్రీస్తు పన్నెండు మంది శిష్యులలో ఒకడైన సెయింట్ థామస్ కేరళ సముద్రతీరంలో గల ముజిరస్ ప్రాంతానికి క్రీ.శ.52వ సంవత్సరంలో రావడం జరిగింది. కేరళలోని అగ్రవర్ణాల్లో ఒకరైన నంబూద్రి (నంబూతిరి) బ్రాహ్మణులను తన మతబోధల ద్వారా ఆకర్షించి, ఈయన క్రైస్తవ మతంలోకి మార్చాడట. ఆ నంబూద్రి బ్రాహ్మణులే సెయింట్ థామస్ క్రిస్టియన్స్ అని నేటికీ పిలబడుతున్నారు.

"క్రైస్తవం స్వీకరించిన తరువాత కూడా వారు నంబూదిరి బ్రాహ్మణుల వలెనే నేటికీ జందెం ధరించడం, కుదుయ లేక శిఖ (పిలక) కలిగి వుండడం కూడా వారి మూల పురుషుల మతం స్వీకరించిన నంబూదిరిలే ననే దానికి వారు ఉదాహరణగా పేర్కొంటారు. పైపెచ్చు సిరియన్ కాథలిక్కులు కూడా బ్రాహ్మణుల తరహాలోనే నిమ్నకులాల పట్ల అంటరానితనం పాటించడం మరో విశేషం. నాడు సెయింట్ థామస్‌చే మతాంతరీకరణ చేయబడ్డ బ్రాహ్మణుల తమ మూల పురుషులు కావడమే దీనికి కారణమని భావిస్తారు. 'కేరళోపతి' అనే పేరు గల నంబూదిరి బ్రాహ్మణుల గ్రంథంలోనూ, వారి జానపద గాథల్లోనూ 'తోమన్' పేరిట ప్రస్తావించబడింది సెయింట్ థామస్ తప్ప వేరకొకరు కాదని సిరియన్ కాథలిక్కుల విశ్వాసం. క్రీ.శ.9వ శతాబ్దం తర్వాత కేరళలో బౌద్ధ, జైన వ్యాపారులకు వ్యతిరేకంగా స్థానిక రాజులు 'సెయింట్ థామస్' క్రిస్టియన్లనూ, పర్షియన్ క్రిస్టియన్లనూ ప్రోత్సహించేవారట" (మా కేరళయాత్ర, పుట-228).

ప్రస్తుతం భారతదేశంలోని అన్ని రాష్ట్రాల కంటే కేరళలో క్రైస్తవ మతం ఎక్కువగా ప్రచారంలో వుంది. "కేరళలో ఉన్న అన్ని శాఖల క్రైస్తవులు కలిపి, రాష్ట్ర జనాభాలో 18శాతం ఉంటారు. ఈ రాష్ట్రంలో హిందూ, ఇస్లాం మతాల తరువాత క్రైస్తవం మూడవ పెద్దమతం" (మా కేరళయాత్ర, పుట-228). 2015లో జరిగిన ఒక సర్వే ప్రకారం 54.73% హిందువులు, 26.76% ముస్లింలు, 18.38% క్రైస్తవులు, 0.32% మంది ఇతర మతస్థులున్నట్లు వెల్లడయ్యింది. 0.32% కు చెందిన మతాలే జైన, బౌద్ధాలు. కేరళలో ప్రసిద్ధి చెందిన జైన దేవాలయాలు ఇప్పటికీ చెక్కు చెదరకుండా నిలిచి వున్నాయి. ఎర్నాకుళం, పాలక్కాడ్, కాసరగోడ్ జిల్లాల్లో ఉన్న జైన దేవాలయాలు ప్రఖ్యాతి చెందాయి. కేరళలో శ్రీధర్మనాధ ప్రభు అనే దేవాలయం ప్రస్తుతం స్థానిక జైన మతస్థులకు ఒక మతకేంద్రంగా విరాజిల్లుతుంది. కేరళలో జైనమతం ప్రవేశం వెనుక కూడా కొంత చరిత్ర దాగి వుంది. "చంద్రగుప్త మౌర్యుడు (క్రీ.పూ.321-297) ఒకప్పుడు జైనం స్వీకరించి, పాటలీపుత్రాన్ని వదిల దక్షిణ దేశానికి వలస వెళ్ళినట్లు ... ఆ సమయంలోనే మొట్టమొదటిగా జైనమతం దక్షిణ భారతదేశంలోకి ప్రవేశించింది. ఆ తరువాత అది మరింత దక్షిణ దిశగా నేటి

తమిళనాడు, కేరళ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. ఇరిం జాలకుడులోని కూడల మాణిక్యం జైన ఆలయం కేరళలోకెల్లా అతి ప్రాచీనమైనది. శ్రావణ బెలగొళలో పూజలందుకునే భగవాన్ బహుబలినే అక్కడ భరతీశ్వరుడనే పేరుతో వ్యవహరిస్తారు. క్రీ.శ.8వశతాబ్దిలో దక్షిణ భారతదేశంలో శైవ, వైష్ణవ ఉద్యమాలు ఊపందుకోవడంతో క్రమంగా జైనం క్షీణించింది. దాంతో జైన ఆలయాలన్నీ శైవ, వైష్ణవ ఆలయాలుగా మార్చబడ్డాయి" (మా కేరళయాత్ర, పుట-246).

కేరళలో వ్యాప్తిలో ఉన్న అన్ని మతాలు సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్నాయని చెప్పటంలో సందేహం లేదు. ముఖ్యంగా క్రైస్తవం. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే క్రైస్తవ మతం కేరళలో విద్య, వైద్యం, సేవారంగాలతో ముడిపడి విస్తరిస్తూ వుంది. కేవలం చర్చిల నిర్మాణానికి, మత ప్రచారానికి మాత్రమే పాటుపడకుండా, కేరళ సమాజ ఉన్నతికి, తద్వారా దేశోన్నతికి ఇతోధికంగా తోడ్పడుతుంది. పర్షియా, సిరియా కాథలిక్కులు, సెయింట్ థామస్ క్రిస్టియన్లు, ముస్లింలు, హిందువులు, అందరూ కేరళ సమాజంలో కలిసిపోయి, ఒకరి మత ప్రభావం మరొక మతం పైన పడి, అన్ని మతాల సంస్కృతుల మధ్య సామరస్యం నెలకొన్నది. ఈ విషయం వీరి పేర్ల ద్వారా కూడా వెల్లడవటమే ఇందుకు నిదర్శనం. ఉదాహరణకు అరుణ్ కురియన్, వివేక్ పాల్, కుంజుమన్ థోమస్. ఇలా హిందూ, క్రిస్టియన్, మొదలైన మతాలకు చిహ్నాలుగా పేర్లు కలగలిసిపోయిన సంస్కృతి నేటి కేరళ సమాజంలో ఇప్పటికీ కన్పిస్తుంది.

ఏదేమైనప్పటికీ కేరళలో ఎన్నో మతాలు మనుగడలో ఉన్నా ఆయా మతాలన్నిటి పట్ల సకృత, పరస్పర గౌరవం ఉన్నాయని చెప్పవచ్చు. రాష్ట్రం మొత్తంలో అక్షరాస్యులే వుండటం, తద్వారా సంస్కారం, వ్యక్తిత్వం కలిగిన వ్యక్తులుగా వారు తీర్దిదిద్దబడి, ఇతర మతాల పట్ల, వర్ణాల వారి పట్ల పరస్పర గౌరవాన్ని కలిగి వున్నారని చెప్పవచ్చు. అందుకే కేరళ రాష్ట్రంలో పచ్చదనంతో పాటు పరమత సహనం కూడా వెల్లివిరుస్తుందని చెప్పటంలో సందేహం లేదు.

ప్రాచీన కాలంలో నాగరికత ఉద్భవించిన దేశాలలో ఒకటైన ఈజిప్ట్‌ను కూడా మత సామరస్యం కలిగిన దేశంగా అభివర్ణించవచ్చు. ఈజిప్ట్‌లో ముస్లింలు, హిందు, క్రైస్తవ, జైన, బౌద్ధులతో పాటూ మరికొన్ని ప్రాచీన మతాలు కూడా వ్యాప్తిలో వున్నాయి. ప్రాచీనకాలంలో నాగరికత విలసిల్లిన దేశాల్లో ఒక మతం అంటూ ఆవిర్భవించి, ప్రజలను బాధ్యత గల పౌరులుగా నియంత్రిస్తూ ఉంటుంది. అటువంటి దేశాల్లో ఈజిప్టు కూడా ఒకటి. భారతదేశంలో హిందూమతంలా, ప్రాచీన ఈజిప్టులో 'పగన్' అనే మతం వ్యాప్తిలో ఉండేది. ఈ 'పగన్' మతం ప్రకృతి ఆరాధనకు సంబంధించింది. సర్వం దైవమయం అనే భావనే 'పగన్' మతానికి పునాది. ప్రాచీన ఈజిప్టియన్లకు ఒక ఆధ్యాత్మిక బాటను చూపించిన మతం పగన్. 'పగన్' అనేటి లాటిన్ పదం. దీనికి అర్థం దేశస్థుడు లేదా దేశ నివాసి. పగన్ మతం ఒకరి కంటే ఎక్కువ మంది దేవుళ్ళను నమ్ముతుంది. దేవుడు సృష్టిలో కొలువై ఉన్నాడనేది వీరి నమ్మకం. అన్నింటికీ జీవ ముంటుందనేది వీరి అభిప్రాయం. ప్రతీ జీవి భూమిపైనే జన్మించింది కాబట్టి సృష్టిలోని జీవులంతా ఒకరికొకరు సంబంధీకులే అనేది దీని అభిమతం. స్త్రీ-పురుషుల ఇద్దరిలోనూ దైవత్వాన్ని దర్శించాలనేది ఈ మతం అభిమతం. ఈ చరాచర సృష్టిలో భౌతికంగా కన్పించే వాటికి, కన్పించని వాటికి కూడా సత్యం శివం సుందరాన్ని కలిగి వుంటాయని 'పగన్' మత విశ్వాసం.

పగన్ మతాన్ని పాటించే ఈజిప్టులు జంతువులను, వృక్షాలను మొదలైన సృష్టినే ఆరాధించేవారు. కాబట్టి వీరు దేవతలను కూడా పశుపక్ష్యాదుల రూపంలో ఊహించుకుని వారికి రూపమిచ్చి కొలిచారు. పగన్ అనేక నమ్మకాలకు, సాంప్రదాయాలకు నెలవు. భారతీయులు ఇంద్రుణ్ణి స్వర్గాధిపతిగా, మన్మథుణ్ణి కామానికి అధిపతిగా ప్రేమకు అధిపతిగా వీరు భావించినట్లే ప్రాచీన ఈజిప్టియన్లు 'ఓసరిస్' అనే దేవుణ్ణి స్వర్గాధిపతిగా, ఇతని భార్య 'ఈసిరస్' ను ప్రేమకు దేవతగా వీరు కొలిచేవారు. ఈజిప్టియన్లు విగ్రహారాధనను ఇష్టపడేవారు. అందుకే అనేక దేవాలయాలను నిర్మించి, అందులో అనేక దేవతా విగ్రహాలను ప్రతిష్ఠింప చేశారు. వాటిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గది 'కర్నక్' అనే దేవాలయం. "ఇప్పుడున్న దేవాలయాల్లో కర్నక్ దేవాలయం అతి పెద్దది. దానిలోని ప్రధాన

దేవత అమోన్‌రో .... 'ఎడ్‌ఫూ' అనే చోట వున్న దేవాలయంలో ఈజిప్టియన్ల ప్రధాన దేవతలలో ఒకటైన 'హోరన్' ప్రతిష్టింపబడినాడు. ఈ దేవత మన గరుత్మంతుడు లాంటి ముఖం వున్న దేవత. ప్రాచీన ఈజిప్టియన్ల దేవతలలో ప్రముఖమైనవాడు. ఈజిప్టు ప్రాచీన దేవతలు చాలామంది పశుపక్షుల ముఖం, మిగతా అంతా మానవాకారం గల దేవతలు (మన విఘ్నేశ్వరుని లాగ అన్నమాట) మనలాగే వాళ్ళకు చాలా మంది దేవతలున్నారు" (నైలునదీ నాగరికత, పుట-33).

ప్రాచీన ఈజిప్టు మతంలో అనేక మంది దేవతలను పూజించేవారు. అయితే న్యూకింగ్‌డమ్ రోజుల్లో 'అఖెనాతన్' అనే రాజు సూర్యుణ్ణి మాత్రమే ఏకైక దేవతగా పేర్కొని, అనేక దేవతలను పూజించే విధానాన్ని తొలగించి, 'ఏకేశ్వరోపాసనను ప్రవేశపెట్టాడు. "అఖెనాతన్ పూజించిన సూర్యదేవుణ్ణి ఈజిప్టు భాషలో 'రే' అని 'రా' అని కూడా పిలుస్తారు. అఖెనాతన్ తల్లి బాబిలోనియా ప్రాంతాన్ని పాలించిన 'మితాన్ని' లేదా హిట్టైట్ రాజకుమారి. తల్లి వంశం చేత ప్రభావితుడైన అఖెనాతన్ సూర్యారాధనను అంగీకరించాడని తెలుస్తుంది. అఖెనాతన్ సూర్యుని మీద చెప్పిన స్తుతి పదాలు వేదాల్లోని 'మిత్ర సావిత్రి సూర్యారాధన' సూక్తాల్లోని భావాలను తలపింపచేస్తున్నాయని సర్‌బడ్జి, వింటర్ నిట్చ్ వంటి చారిత్రకులు, సంస్కృత పండితులు అభిప్రాయ పడినారు కూడా" (నైలునదీ నాగరికత, పుట-25,26).

ప్రాచీన ఈజిప్టియన్లు 'రా' అనే సూర్యదేవుణ్ణి దేవాధిదేవునిగా పరిగణించేవాళ్ళు. ఫారో(రాజు)లు ప్రజలను పాలించినట్లే 'రా' దేవతలను పాలిస్తాడని వారి విశ్వాసం. "పగలు తర్వాత రాత్రి, రాత్రి తర్వాత పగలు ఎందుకు వస్తాయో తెలియని ఈజిప్టియన్లు, సూర్య భగవానుడు తన బంగారు పడవలో ప్రతిరోజూ ఆకాశంలో ప్రయాణం చేస్తాడనీ, సాయంత్రం ఎడారికి వెళ్ళిపోతాడనీ నమ్మేవాళ్ళు. సూర్యభగవానుడికి డేగముఖం వుంది. ప్రతీ ప్రకృతి శక్తికీ ఒక అధిష్టాన దేవత ఉంటుంది. సింహపు శిరస్సు కలిగిన భయంకర యుద్ధ దేవత అంటే ఈజిప్టియన్లు విశేషంగా భయపడేవాళ్ళు.... ఈజిప్టియన్లకు నైలునది జన్మస్థానం తెలియదు. నైలు దేవుడు కుండలతో నీళ్ళు కుమ్మరిస్తాడనీ, వరదలకి అతడు

ఎక్కువ నీళ్ళు కుమ్మరించడమే కారణమని వారు విశ్వసించేవాళ్ళు" (ప్రాచీన ప్రపంచ చరిత్ర, పుట-54,55).

గ్రీకులు, రోమన్ల కాలక్రమంలో ఈజిప్టు పైకి దండెత్తి ఈజిప్టును ఆక్రమించుకున్నారు. ముందుగా క్రీ.పూ.332లో అలెగ్జాండర్ ఈజిప్టును స్వాధీనం చేసుకున్నాడు. అప్పటి నుండి ఆ దేశం గ్రీకుల పాలనలోకి వచ్చింది. "ఈజిప్టు గ్రీకుల పాలనలోకి వచ్చిన తర్వాత గ్రీకు రాజులు తమ దేవతలను తాము ఆరాధించినా ఈజిప్టియన్ల దేవతలను ఆదరించారు. వాళ్ళ కోసం ఎడ్ఫూ, ఫిలే, కొంబోఓంబో మొదలైన గొప్ప దేవాలయాలను నిర్మించారు. ఫెరోల భవ్య నిర్మాణ పద్ధతులననుసరించే ఈ దేవాలయాలను నిర్మించారు" (నైలునదీ నాగరికత, పుట-49).

అయితే క్రీ.పూ.30లో క్లియోపాత్ర మరణం తరువాత ఈజిప్టులో గ్రీకుల పాలన నశించి రోమన్ల పాలన ప్రారంభమైంది. వీరు కూడా గ్రీకుల మాదిరే ఈజిప్టువారి దేవతలను పూజించారు. రోమన్లు కూడా ఈజిప్టియన్ దేవతలను ఆదరించారు. గ్రీకులు కట్టించిన దేవాలయాలను కొన్నింటిని పూర్తి చేశారు. ఈజిప్టియన్ల ఈసరిస్, ఆమె కొడుకు హోరస్‌ను గ్రీకులు, రోమన్లు కూడా పూజించారు. ఈ దేవతలు వాళ్ళ మతంలో, మైథాలజీలో భాగం అయ్యారు కూడా".

గ్రీకులు, రోమన్లు ఈజిప్టును ఆక్రమించుకున్నా, అక్కడి ప్రజల మతాచారాలను గౌరవించడమే కాక, ఆ మతాల ఉద్ధరణకు కృషిచేశారు. ప్రాచీన ఈజిప్టు మతాన్ని సంరక్షించే ఉద్దేశ్యంతో ఈజిప్టు దేవతలకు దేవాలయాలను నిర్మింపచేశారు. పూజాపురస్కారాది క్రతువుల్ని చేయించారు. అంటే గ్రీకు, రోమన్ల పాలన వల్ల ఈజిప్టు యొక్క సాంస్కృతిక వారసత్వానికి భంగం వాటిల్లలేదని చెప్పవచ్చు. "అయితే 7వ శతాబ్దిలో అరబ్బుల, టర్కీల దండయాత్రలతో ఈజిప్టు తన అస్థిత్వాన్ని పూర్తిగా కోల్పోయింది. మతం మారింది. పాత 'పగన్' మతం పూర్తిగా నశించింది" (నైలునదీ నాగరికత, పుట-57).

భారతదేశం పైన ఎంతోమంది విదేశీయులు దండయాత్ర చేసినట్లుగానే ఈజిప్టు దేశం పైకి కూడా ఎంతోమంది విదేశీయులు దండయాత్ర చేశారు. దాంతో ఈజిప్టులోకి ఇస్లాం, క్రైస్తవ మతాలు ప్రవేశించాయి. "క్రీస్తు బోధనల తర్వాత క్రీస్తు శకారంభంలోనే ఈజిప్టులో క్రైస్తవమతం ప్రవేశించింది. ప్రాచీన ఈజిప్టియన్లను 'కోప్త్‌లని' పిలుస్తారు. ప్రాచీన ఈజిప్టు నాగరికతకు వారసులైన కోప్త్‌లు చాలా మంది క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. ఆనాటి నుంచే ప్రాచీన ఈజిప్టు దేవతలు గల 'పగన్' మతం నశించింది. ఇక క్రీ.శ.7వ శతాబ్దంలో ఇస్లాం ప్రవేశంతో ఈజిప్టు పూర్తిగా ఇస్లామీకరణం చెందింది" (నైలునదీ నాగరికత, పుట-52).

ప్రాచీన చరిత్రకు వారసులైన కోప్తులు ఇప్పటికీ కూడా ఈజిప్టులో ఉన్నారు. అయితే నేడు వీరు క్రైస్తవ మతాన్ని స్వీకరించినప్పటికీ తమ ప్రాచీన భాష అయిన 'కోప్త్' ను మాత్రం ఇంకా సంరక్షించుకుంటూనే వున్నారు. మొత్తం మీద ప్రస్తుతం ఈజిప్టులో 80 మిలియన్ల జనాభా వుంటే వారిలో 90 శాతం మంది ముస్లింలు, 7శాతం మంది క్రిస్టియన్లు, 3 శాతం మంది యూదులు, కోప్త్‌లు ఉన్నారు. ఎన్ని మతాలున్నా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించారు ఈజిప్టియన్లు.

ఈజిప్టులాగే ప్రాచీన గ్రీసులో కూడా హెలనిజమ్ వంటి అనేక మతాలు, అనేక మంది దేవతల ఆరాధన ఉండేది. ముఖ్యంగా వీరు 12 మంది దేవీదేవతలను పూజించేవారు. దేవతారాధన చేసే సమయంలో కాళ్ళపైన నిలబడి, చేతుల్ని ఆకాశం వైపుకి చాపి ప్రార్థించేవారు. బలులను కూడా ఇచ్చేవారు. భారతీయులు పంచభూతాలను ఆరాధించినట్లుగానే వీరు నాలుగు భూతాలనే ఆరాధించేవారు. "మనలాగే గ్రీస్ దేశస్థులకి కూడా ఆ కాలంలో దేవుళ్ళు ఎక్కువగా ఉండేవారు. వారిలో ప్రధాన దేవుళ్ళు పన్నెండుమంది. అగ్ని, నీరు, భూమి, వాయువులకి ఒక్కో దేవుడున్నాడు. కాని మనంలా వీరికి ఆకాశం ఐదో భూతం కాదు. కేవలం నాలుగు భూతాలే ఉన్నాయని నమ్ముతారు" (ట్రావెలాగ్, దుబాయ్, టర్కీ&గ్రీస్, పుట-103) అంటే గ్రీకులు కూడా ప్రకృతిని ఆరాధించేవారని దీనిని బట్టి స్పష్టమవుతుంది. విగ్రహారాధన, దేవాలయాల నిర్మాణం, ఆ

దేవాలయాల్లో పూజారులను నియమించడం వంటివన్నింటినీ ప్రాచీన గ్రీకులు పాటించేవారు.

పైన పేర్కొన్న యాత్రాచరిత్రల్లోని వివిధ మత సంబంధ అంశాలను గమనించినప్పుడు ప్రపంచం అంతా ఒకే కుటుంబమని, పాటించే మతాలు వేరైనా అవి చాటే విలువలు మాత్రం ఒకటేననే విషయం స్పష్టమవుతుంది. మానవాతీతశక్తులను ఆరాధించడం, ప్రకృతిని ఆరాధించడం, ప్రార్ధనల ద్వారా దేవుడికి దగ్గరగా ఉన్నామనే భావన, మనుషుల మధ్య దగ్గరితనాన్ని పెంచడం ప్రతీ మత లక్ష్యం. వివిధ దేశాల/ప్రాంతాలలోని మతాంశాలను తెలుసుకోవడం విజ్ఞానదాయకం. ఇటువంటి విజ్ఞానాన్ని, అవగాహనను కల్పించడంలో యాత్రాచరిత్రల కృషి అపారం.

## 4.7. కళలు

కళ అంటే నేర్పు. నేర్పుతే చేసే ఏ పనైనా కళే అవుతుంది. ఆ నేర్పు కల్గిన వ్యక్తినే కళాకారుడంటారు. కళ పుట్టుకతో కొంతమందికి అబ్బుతుందని మనం వింటున్నా, నిరంతర కృషి వల్లే అది మెరుగుపడుతుందనేది అంగీకరించాల్సిన అంశం. మానవ మనోరంజనం కళ యొక్క పరమ ప్రయోజనం. ప్రాచీనులు కళలను చతుష్షష్టిగా పేర్కొన్నారు. ఈ అభిప్రాయాన్ని నేడు మనం మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక యుగంలోకి అడుగు పెట్టిన మానవుడు అతని సౌలభ్యం కోసం, సౌందర్యం కోసం, సౌఖ్యం కోసం తన చుట్టూ ఒక అద్భుత వస్తు ప్రపంచాన్ని సృష్టించాడు, సృష్టిస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి అనేక నూతన కళలు పరిచయం అయ్యాయి. ఉదాహరణకు ఫోటోలు తీయడం, చిత్రనిర్మాణం (సినిమాలు), వాహనాలు నడపడం, కంప్యూటర్‌ల వాడకం వంటివి ఆధునిక కళలు. ఇవన్నీ చతుష్షష్టి కళల్లో లేనివే.

### 4.7.1. కళ-నిర్వచనాలు

1. "కళ అంటే ఏ పనినైనా చేయటంలో ప్రత్యక్షమయ్యే కౌశలం. మానవుని ద్వారా సృజించపడని సృష్టిలోని కౌశలాన్ని ప్రకృతి అంటాం. మానవుని ద్వారా సృజించబడే కౌశలాన్ని కళ అంటాం"

– సంజీవ్‌దేవ్

2. "కళ తొలుత మానవ మనోరంజనం కోసం సృష్టించబడినా తరువాత కాలంలో అది సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగపడే ఒక సాధనంగా మారింది. అందుకే సామాజికంగా పరివర్తన రావాలంటే సాహిత్యం, కళలు ముఖ్యమైన ఆయుధాలుగా ఉండాలి. ప్రజలందరికీ సంబంధించి ఉండాలి. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయగలిగి ఉండాలి".

– ఆర్వీయార్

కేవలం మానవునికి ఆనందాన్ని కల్గించడమే ప్రధాన లక్ష్యంతో రూపుదిద్దుకున్న కళ మానవుని అభివృద్ధి క్రమంతో పాటూ వృద్ధి చెంది విస్తృత అర్థాన్ని పొందింది. ఒక వైపు మనిషికి ఆనందాన్ని కలిగిస్తూనే, మరోవైపు మానవుని జీవనానికి కూడా ఉపయోగపడనారంభించింది. తత్ఫలితంగానే కళలు లలిత కళలు, ఔపయోగిక కళలని రెండు రకాలుగా వర్గీకరించబడ్డాయి. ఏ సంస్కృతిని గమనించినా ఔపయోగిక కళలు, లలిత కళలు రెండూ గోచరమవుతాయి. మానవుని నిత్యజీవనానికి ఉపయోగపడేవి ఔపయోగిక కళలు అయితే, అతనికి మానసిక ఆనందాన్ని కల్గించేవి లలితకళలు. ఆధునిక కాలంలో కళలు మానవుని జీవన విధానానికి తగినట్లుగా తమ రూపాన్ని మార్చుకునే క్రమంలో సూక్ష్మ భేదాలతో శాఖోపశాఖలుగా మారి సొంత అస్థిత్వాన్ని పొంది నూతన కళలుగా ఏర్పడ్డాయి. ఉదాహరణకు మూకాభినయం (Mime) నాటకాభినయంలో భాగం. కానీ నేడు అదొక ప్రత్యేక కళగా పేరొందింది. అలాగే జుంబా, సల్సా, బెల్లీ డాన్స్‌లు నృత్యంలో శాఖలు. కానీ నేడవి తమకంటూ స్వతంత్రప్రతిపత్తిని కలిగించుకుని వ్యాప్తిలో

వున్నాయి. అలాగే ఒక కళతో మరోకళ సమ్మేళనం ద్వారా నూతన కళలు ఏర్పడి వ్యాప్తిలో ఉన్నాయి.

కళాకారుడు కళను తన స్వీయ ఆనందం కోసం సృష్టిస్తాడు. అయితే కళాకారుడైన వ్యక్తి సమాజంలో అంతర్భాగం కాబట్టి ఆ కళాఖండం కూడా సమాజానికి సంబంధించినదే అవుతుంది.

"Society vitalizes art while art enchants the society. Art reveals what society conceals. Both reveiation and concealment are equally for the fufilment of life" అని కళా ప్రయోజనాన్ని పేర్కొన్నాడు సంజీవ్‌దేవ్. అంటే సమాజం కళను సజీవపరుస్తుంది. కళ సమాజాన్ని ఆనంద పరుస్తుంది. సమాజం గుప్త పరిచేదాన్ని కళ వ్యక్తపరుస్తుంది. గుప్తతా, వ్యక్తతా రెండూ కూడా జీవన సాఫల్యానికి సమానావసరాలేనని అర్థం. నేడు కళ సమాజాన్ని ఆనందపరచడంతో పాటుగా మార్గనిర్దేశాన్ని చేస్తూ ఉందని చెప్పవచ్చు. ఏదైనా ఒక ఉద్యమాన్ని ప్రభావంతంగా ముందుకు తీసుకెళ్ళడానికి కళ ఒక ప్రేరకంగా తోడ్పడుతుంది. ఆధునిక కాలంలో వచ్చిన అన్ని ఉద్యమాలకు కళలు ప్రేరణగా నిలిచాయని చెప్పవచ్చు.

కళాకారుడు సృజించిన కళాకృతి ఒకటే అయినప్పటికీ దాన్ని ఆస్వాదించడంలో, అనుభూతి చెందడంలో వ్యక్తుల మధ్య తేడాలు ఉంటాయి. అంతేగాక ఒక కళను ఆస్వాదించే వ్యక్తి వేరొక కళను కూడా అంతేస్థాయిలో ఆస్వాదించవచ్చు లేదా ఆస్వాదించలేకనూపోవచ్చు. ఆ కళా ప్రయోజనం మరియు ఆ కళారూపం యొక్క విలువ వ్యక్తి యొక్క సహృదయతపై ఆధారపడి వుంటుంది. కాబట్టి కళా ప్రయోజనం ఇది అని ఇదమిద్దంగా నిర్ణయించటం కష్టం. కాని కళ యొక్క ప్రాథమిక ప్రయోజనం మాత్రం ప్రేక్షకుల్ని, వీక్షకుల్ని ఆనందింపచేయటమే.

ఒకే వర్గానికి చెందిన ప్రజల జీవన విధానం, సృజనాత్మకత, సాంస్కృతిక వారసత్వం, విశిష్టతలను తెలుసుకోవాలంటే ఆ ప్రాంతంలోని కళలను గమనిస్తే చాలు. కళలు జీవన మాధుర్యాన్ని అందించటడంతో పాటు మానవ విలువల్ని, సంస్కృతిని,

సామాజిక సంబంధాలను పెంపొందించడంలో ముందుంటాయి. కాబట్టి కళాపరిరక్షణ అంటే సంస్కృతీ పరిరక్షణే. ఒక సంస్కృతి గురించి తెలియజేయటానికి కళలు వేదికవులతాయనటంలో సందేహం లేదు. ప్రపంచంలో ఎన్నో భిన్న సంస్కృతులు ఉన్నాయి. ఆ భిన్న సంస్కృతులకు ప్రతిరూపాలుగా ఎన్నో కళలు ఉనికిలో ఉన్నాయి. వాటన్నింటినీ యాత్రాచరిత్రలు ప్రపంచానికి పరిచయం చేస్తున్నాయి. భిన్నభిన్న ప్రాంతాలలో గల కళలకు, కళాకారులకు గుర్తింపు యాత్రాచరిత్రల ద్వారా వస్తుందని చెప్పటం నిస్సందేహం. యాత్రా రచయిత సహృదయుడయితే ఆ స్థానిక కళలోని మార్మిక సౌందర్యాన్ని పట్టుకుని, పరవశించి, అనుభూతి చెందుతాడు. ఆ అనుభూతిని తన అక్షరాల్లో బంధింప ప్రయత్నిస్తాడు. ఆ అనుభూతిని చదివిన పాఠకునికి ఆ కళారూపం యొక్క ఆత్మ తప్పక గోచరమవుతుంది.

మానవుడు నైపుణ్యంతో చేసే ఏపనినైనా కళ అని చెప్పుకున్నాం. కానీ ప్రపంచీకరణ ప్రభావం వల్ల మానవ నైపుణ్యంతో చేసే వస్తువులకు ప్రాముఖ్యం తగ్గి, యంత్ర పరికరాల ద్వారా తయారయ్యే వస్తువులకు డిమాండ్ పెరగడం వల్ల చాలా సంస్కృతుల్లో హస్తకళలు మనుగడను కోల్పోవడం విచారకరం. ఈ తరుణంలో ఇప్పటికీ కొన్ని దేశాలు తమ సాంప్రదాయక కళల్ని నిలుపుకోవడం అభినందనీయం. ఇందుకు ముదిగంటి సుజాతారెడ్డిగారు చైనాను ఉదహరిస్తూ చెప్పిన మాటలు గమనించదగ్గవి.

“చైనాలో మనదేశంలో లాగానే ఇంకా ప్రాచీనకళలు, హస్తకళలు నిలిచి వున్నాయి. చైనాలో కాంస్యం చెక్కతో చేసిన బొమ్మలు, జేడ్‌తో చెక్కిన బొమ్మలు, చేతితో తయారుచేసిన గుడ్డబొమ్మలు, పర్సులు ఇంకా ఎన్నో హస్తకళలు కన్పిస్తాయి”.... మనం పాశ్చాత్య దేశాలకు పోతే అక్కడంతా మెషీన్లతో తయారయ్యే వస్తుజాలమే కన్పిస్తుంది. వాటిల్లో కళాత్మకత ఏ వస్తువుకావస్తువు ఒక ప్రత్యేకత ఉండటం ఉండదు. చేతితో వస్తువులు తయారు చేసే కళయే మాయమైందక్కడ” (అద్భుత చైనాయాత్ర, పుట–) ఇటువంటి సమయంలో కూడా చైనా హస్తకళలకి ప్రాముఖ్యతనివ్వడం హర్షించదగ్గ విషయమని రచయిత్రి అభిప్రాయం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో, శాస్త్రసాంకేతికత రంగాలలో శరవేగంగా దూసుకెళ్తున్న చైనీయులు సాంప్రదాయ కళల్ని కాపాడుకోవడంలో ముందంజలో ఉన్నారనే విషయం పై మాటల్ని బట్టి అర్థమవుతుంది. చైనా అనగానే గుర్తుకు వచ్చేది డ్రాగన్ బొమ్మ, డ్రాగన్ వీరికి ఆరాధ్య జంతువు. డ్రాగన్ బొమ్మలు దుష్టశక్తుల్ని తరిమి కొడతాయని, పవిత్రమైనవని చైనీయుల నమ్మకం. అందుకే డ్రాగన్లను తయారు చేయడం కూడా ఇక్కడ ఒక కళగా రూపుదిద్దుకుంది.

"చైనాలోని పుస్తకాల్లో, బొమ్మల్లో, ఇళ్ళల్లో, పెయింటింగుల్లో కళాత్మకంగా దీన్ని తీర్చిదిద్దిన వైనం చూసినా, అది ఏ జంతువు అర్థం కాకుండా ఉండటం దీని ప్రత్యేకత. అంటే అది అన్ని జంతువుల అంగాలను కలిగి సర్వశక్తి సంపన్నంగా, మంచికి ప్రతీకగా విరాజిల్లుతుంది" (షంఘై నింగిలో, పుట-52) అంటూ చైనీయుల జీవితాల్లో డ్రాగన్‌కి గల స్థానాన్ని నిరూపించారు శ్రీలక్ష్మిగారు.

అంతేకాక ప్రతీ పండుగకూ గాలిపటాన్ని ఎగురవేయటం వీరి అలవాటు. ఆ గాలిపటం ఎంత ఎత్తుకు ఎగిరితే వారి జీవితం అంత సుఖమయంగా, ఉన్నతంగా సాగుతుందని వీరి విశ్వాసం. చైనాలో వీధి వీధిలో రంగురంగుల అందమైన గాలిపటాల్ని అమ్ముతారంటూ "బిలబిలమంటూ పతంగులను అమ్మేవాళ్ళు సైకిళ్ళ మీద వచ్చారు, ఎన్నో రంగుల్లో, ఎన్నో ఆకారాల్లో పతంగులున్నాయి. మాలగా ఎగిరే పతంగులు, కొంగలుగా, సీతాకోక చిలకలుగా, డ్రాగన్‌లుగా, ఎన్నో ఆకారాల్లో, రంగుల్లో పతంగులు. అన్నీ చేతితే చేసినవే" (అద్భుత చైనా యాత్ర, పుట-29&30) పతంగుల నిర్మాణం కూడా చైనాలో ఒక కళగా వృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఇవేగాక చైనాలో ప్రకృతిపరంగా దొరికే ఒక విలువయిన రాయి జేడ్‌తో ఆభరణాలను రూపొందించడం కూడా చైనాలో పేరు మోసిన కళ. "షాపుల్లో 'జేడ్'తో తయారు చేసిన రకరకాల బొమ్మలు, ఛత్రీలు, సిల్క్ పర్సులు, సిల్క్ మీద చేసిన పెయింటింగ్‌లు ఇంకా ఎన్నో చైనా వస్తువులు అమ్ముతున్నారు. చైనా 'జేడ్' రాయికి ప్రసిద్ధి చెందింది. అది సెమీ ప్రెషియస్ రాయి. అయితే దానిలో కొంత తక్కువ రకం క్వాలిటీ మెత్తగా ఉండే రాళ్ళతో డ్రాగన్, పెన్‌హోల్డర్లు, రకరకాల ఫోజుల్లో కూర్చుని, నిలబడి

వున్న లాఫింగు బుద్ధ వంటి ఎన్నో బొమ్మలను చెక్కి అమ్ముతుంటారు" (అద్భుత చైనాయాత్ర, పుట-29&32).

పై రచయిత్రి మాటల్ని గమనించినట్టయితే కళలు అరవై నాలుగు మాత్రమే అని అనుకోవటం కళల్ని పరిమతం చేయడమవుతుంది. నేటి కాలంలో మానవ అవసరాలకు తగ్గట్టుగా ఎన్నో వస్తువుల తయారీ కళగా మారింది. చైనాలో గొడుగులను ఎక్కువగా వాడతారు. అందుకని అక్కడ గొడుగుల తయారీ ఒక కళగా మారింది. చైనా సిల్క్ బట్టలకు ప్రసిద్ధి. ప్రాచీనకాలంలో భారతదేశానికి సిల్కును చైనా దేశమే అందించేదన్న విషయం అందరికీ తెలిసిందే. పట్టును ముందుగా ప్రపంచానికి పరిచయం చేసింది కూడా చైనీయులే. అందుకే ఇక్కడ పట్టుతో చేసే రకరకాల నిత్యావసర వస్తువుల తయారీ కూడా ఒక కళగా అవతరించింది.

చైనీయుల జీవితాలతో టీ కి ప్రత్యేక స్థానం ఉంది. పుట్టుక నుండి మరణం దాకా వీరి జీవితాల్లో 'టీ'తో అవినాభావ సంబంధాన్ని కల్గి వుంది. ఎన్నో ఆచారాలు, సాంప్రదాయాలు, పండుగలు, ఉత్సవాలు, నమ్మకాలు 'టీ'తో అల్లుకొని ఉన్నాయి. అందుకే 'టీ' తయారు చేయటాన్ని, ఆ 'టీ' పాత్రల తయారీని ఒక కళగా ఎంతోమంది రాజులు ప్రోత్సహించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా 'టీ'తో ఒక జనజీవన స్రవంతి ముడిపడి ఉండటం విశేషమైన అంశం. అంతేకాక ఎన్నో జానపద కథలు గేయాలు మొదలైన సాహిత్యం 'టీ'ని ఆధారంగా చేసుకుని సృష్టించబడింది. భారతీయులకు తులసి మొక్కలా, పారిజాత వృక్షంలా చైనీయులకు తేయాకు మొక్క పరమ పవిత్రమైనది. కేవలం సాహిత్యం మాత్రమేకాక, కాలీగ్రఫీ అనే ఒక కళ కూడా 'టీ'ని ఆధారంగా చేసుకుని సృష్టించబడింది. చిత్రకళలో కూడా ఈ 'టీ' సంస్కృతి ప్రవేశించి, ఆ చిత్రకళలో నూతనమైన మార్పులను తీసుకువచ్చింది. ముఖ్యంగా చైనాలో 'టీ'కప్పుల తయారి ఒక కళగా రూపుదిద్దుకుంది. అందంగా, ఆకర్షణీయంగా 'టీ'కప్పులను తయారుచేయడంలో అందెవేసిన చేయిగా చైనా ప్రసిద్ధిని పొందింది. టెర్రకోట, జేడ్, బంగారం, వెండి, పింగాణీలతో టీ కప్పులను, టీ సామగ్రిని తయారుచేయటం ఒక కళగా రూపుదిద్దుకుంది.

అందుకే చైనీయుల బోన్‌చైనా 'టీ'కప్పులు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 'టీ' తయారుచేయటం, అందించటం, దాన్ని ఆస్వాదిస్తూ ప్రదర్శన కళల్ని చూస్తూ వినోదించటంతో జానపదుల ప్రదర్శనా కళలకి 'టీ'కి గల అవినాభావ సంబంధాన్ని పెంచింది. ఏ పని చేసినా ఆ సమయానికి, ఆ సందర్భానికి 'టీ' ప్రాధాన్యం ఎక్కువనేది రుజువైంది. జన సామాన్యానికిది కళగా, ఉపాధి మార్గమైంది. ఫలితంగా చింగ్‌ల పాలనలో జానపదుల కళలు ఖ్యాతిగాంచాయి. కళలకి ఈ 'టీ' ప్రాతినిధ్యం వహించింది" (షంఘై నింగిలో, పుట-71).

ఔపయోగిక కళల్లోనే కాక, లలిత కళల్లో కూడా చైనా ప్రసిద్ధి చెందింది. కుంగ్‌ఫూ, జూడో, మార్షలాట్స్, కరాటేల మేళవింపుతో చేసే ఒక నృత్యరూపకం చైనాలో ఉందనీ, దాన్నే అక్రోబ్యాటిక్ డ్యాన్స్ షో అంటారని అద్భుత చైనాయాత్ర అనే యాత్రాగ్రంథం ద్వారా తెలుస్తుంది. దీనిని బట్టి ఒక కళ స్వతంత్రంగానే గాక మరొక కళతో కూడా మిళితం కాగలదని, అంతే అనుభూతిని వ్యక్తికి ఇవ్వగలదని స్పష్టమవుతుంది. యుద్ధవిద్యల వంటి కళతో, నృత్యాన్ని మేళవించి చేసే ఈ కళ ఎంతో ప్రత్యేకమైంది. ఎందుకంటే ఒక కళ మరొక కళతో కలవాలంటే కొన్ని దశల్ని, అడ్డంకుల్ని దాటుకుని తీరాల్సిందే. అప్పుడే అదొక నూతన కళగా ఆవిర్భవిస్తుంది. ఇటువంటి కళలు మానవులకు అత్యంత ఆనందాన్ని ఇస్తాయనడంలో సందేహం లేదు. చైనీయులు ఒక కళలో పరిపూర్ణ ఆనందాన్ని అనుభవించాక నాగరికతా స్థాయి, ఆలోచనా పరంపరలు పెరిగాక, ఒక కళను మరొక కళతో మేళవించి, మరింత అద్భుత సౌందర్యాన్ని, ఆనందాన్ని ఆ కళతో కూర్చి ఆ కళ ద్వారా అద్భుతమైన అనుభూతిని రాబట్టాలనుకుని ఉంటారు. అందుకే వారి సాంప్రదాయ కళైన నృత్యాన్ని నూతన కళలైన మార్షలాట్స్ మొదలైన యుద్ధకళలలో మేళవించాలనే ఆలోచన వారికి వచ్చింది. దీని ఫలితమే 'అక్రోబ్యాటిక్ డాన్స్'.

ముందుగా ప్రస్తావించిన విధంగా చైనా కళలకు కాణాచి. యుద్ధ కళలకు ప్రసిద్ధి చెందింది. చైనాలో యుద్ధకళల ఆవిర్భావానికి వారి మతానికి అవినాభావ సంబంధం వుంది. బౌద్ధ సన్యాసులు తమ స్వీయ రక్షణార్థం 'షావోలిన్' అనే యుద్ధకళను

రూపొందించుకున్నారు. ఇది శారీరక దృఢత్వాన్ని ఇవ్వడంతో పాటూ మానసిక ఉత్తేజాన్నికూడా కలుగజేస్తుందని వారి భావన. షావోలిన్ బౌద్ధ మత సిద్ధాంతాల ప్రాతిపదికగా ఏర్పడింది. ఇది కేవలం పిడికిలితో, పాదాలతో చేసే యుద్ధం. ఈ షావోలిన్ యుద్ధ విద్యేగాక, 'తైఛీ' అనే మరొక యుద్ధకళ కూడా చైనాలో సుప్రసిద్ధమయినది. ఇది టావోయిజం స్ఫూర్తితో అవతరించిన కళ. ఇవేకాక, జూడో, మార్షల్ ఆర్ట్స్ వంటి అనేక యుద్ధ విద్యలకి కేంద్రంగా మారింది చైనా. బ్రూస్‌లీ, జాకీచాన్ వంటి గొప్ప యుద్ధ కళాకారులతో ఈ కళలు ప్రపంచ ప్రసిద్ధి పొందాయి. వీరు ఈ కళల్ని సమాజగతం చేసి తద్వారా విశ్వవ్యాప్తం చేశారు.

ప్రపంచంలో తనకంటూ ఒక గుర్తింపును కేవలం కళల ద్వారానే పొందిన దేశం చైనా. ఏ దేశమైనా స్థానిక ఉత్పత్తుల్ని, కుటీర పరిశ్రమల్నీ ప్రోత్సహిస్తే ఆ దేశం ఆర్ధిక బాటలో ప్రయాణిస్తుందని చెప్పేందుకు చైనా ఒక నిదర్శనం. ఎంత ఆర్ధిక శక్తిగా ఎదిగినా, ప్రపంచ ఆర్ధిక వ్యవస్థను శాసిస్తున్నా, వారు తమ మూలాలను మరిచిపోకపోవటం అభినందించదగ్గ అంశం. నేడు వెర్రితలలు వేస్తున్న ప్రపంచీకరణ సంస్కృతిని త్రోసిరాజని, తమ దేశీయ కళాకృతుల్ని, దేశీయతను కాపాడుకుంటున్న చైనీయులు సదా అభినందనీయులు.

చైనాలో తైచి, షావోలిన్, కుంగ్‌ఫూ వంటి యుద్ధకళలు ఏవిధంగా ప్రపంచ ప్రసిద్ధి చెందాయో భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో కూడా ప్రసిద్ధి చెందిన యుద్ధ విద్యలున్నాయి. క్రీ.పూ.2వ శతాబ్దం నుంచి భారతదేశంలో ఈ యుద్ధ విద్యలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ముఖ్యంగా కేరళలో 'కళరి పయట్టు' అనే యుద్ధకళ ప్రఖ్యాతి చెందింది. "దీని ప్రస్తావన అత్యంత ప్రాచీన తమిళ సంగం సాహిత్యంలో కూడా ఉంది. ఉత్తర మరియు మధ్య కేరళలోనూ, సమీప తమిళ ప్రాంతాలలోనూ, పశ్చిమ కర్ణాటకలోని తుళునాడు లోనూ ప్రజలు ఇప్పటికీ ఈ యుద్ధకళను విశేషంగా ఆదరిస్తున్నారు. ఎందరో యువకులు శ్రద్ధగా అభ్యసిస్తున్నారు. వెన్మారు (గొడ్డలి), అంబు, విల్లు, పొంటి (చిన్నఖడ్గం), తొట్టి (అంకుశం), త్రిశులం, కడుతిల, ఛురిక అనే ప్రత్యేకమైన కత్తులు,

ఆత్మరక్షణకు వాడే డాళ్ళు మొదలైనవి చేబూనిన యువకులు భీకరమైన ద్వంద్వ మరియు సామూహిక యుద్ధాలకు తలపడుతారు” (మా కేరళ యాత్ర, పుట–38).

‘కళరి పయట్టు’ యుద్ధ కళతో పాటు స్థానికంగా ‘కొట్టాయం’ పరిసర ప్రాంతాలలో 'పరిచయ ముత్తుకళి' అనే యుద్ధ విద్యకూడా ప్రసిద్ధి పొందింది. ఈ కళను స్థానిక సిరియన్ క్యాథలిక్కులు రూపొందించి ప్రదర్శిస్తూ ఉండటం విశేషమని ముత్తేవి రవీంద్రనాథ్‌గారు పేర్కొన్నారు. కొట్టాయం పరిసర ప్రాంతాల్లో ఈ యుద్ధకళ మాత్రమేకాక మార్గంకళి, అర్జున నృత్యం అనే రీతులు కూడా పరిఢవిల్లుతున్నాయి. అంతేకాక కేరళలో ప్రసిద్ధి చెందిన మరొక నృత్యరీతైన కథకళికి ఈ కొట్టాయం అనే ఊరికి అవినాభావ సంబంధం ఉంది. కొట్టాయంకి సమీపంలోని కుడుమలూర్ అనే గ్రామంలో పుట్టి పెరిగిన ఎందరో గొప్ప కళాకారులు కథకళి రీతియొక్క సాహిత్య, సంగీత, నటనా విధానాలలో నిష్ణాతులై అంతర్జాతీయ గుర్తింపును పొందారు (మా కేరళయాత్ర, పుట–187). 17వ శతాబ్దంలో స్థానిక కొట్టారక్కర యువరాజు రూపొందించిన నృత్యరీతికి, మరికొన్ని నృత్యరీతుల్ని జోడించడం వల్ల కథకళి ఏర్పడింది. అయితే ఈ కథకళి ప్రదర్శనలు దేవాలయాల లోపల మాత్రమే జరిగేవి. దాంతో అవి కేవలం అగ్రవర్ణాలకే అవి పరిమితమైన కళారూపం అనే భావన నాటి ప్రజల్లో వుండేది. ఆనాడు ఎక్కడా కళా ప్రదర్శనలకు తగ్గ కళామంటపాలు లేనందువల్ల కథకళి నృత్యాన్ని దేవాలయాలకే పరిమితం చేయడమే దీనికి కారణం. అయితే కేరళ కథకళి నృత్యానికి పేరు తెచ్చినవాడయిన వల్లత్తోల్ నారాయణ మీనన్ మొట్టమొదటి సారిగా దేవాలయాల బయట, చేరుతురతి అనే ఊర్లో కళా మండపాన్ని స్థాపించి, నటులకు, సంగీత కళాకారులకు కథకళిలో శిక్షణనివ్వటం ప్రారంభించారు. అప్పటి వరకూ ఒక మతరూపంగా భావిస్తున్న కథకళి ఆ పరదాను తొలగించుకుని సర్వనాదరణీయమైంది. అప్పటికే అవసాన దశలో ఉన్న ఈ కళ నారయణమీనన్ కృషితో ఉత్తాన పథానికి ఎగిసింది.

కేరళలో మోహినీ అట్టం అనే మరొక నృత్యకళ కూడా ప్రఖ్యాతి చెందింది. ఈ కళకు ప్రాచుర్యాన్ని తేవడంలో ముగ్గురు మూల స్థంభాలుగా నిలిచినవారున్నారు. వారే ట్రావెన్

కోర్ సంస్థానాధీశులు మహరాజ స్వాతి తిరునాళ్, తంజావూరుకు చెందిన అధికారి వడివేలు, కళామండపం స్థాపకులు శ్రీ వల్లత్తోళ్ నారాయణ మీనన్ గారు ఈ కళా వ్యాప్తికి ఎంతో కృషి చేశారు. ఈ కథకళి, మోహినీ అట్టం, కళరిపయట్టు వంటి కళలే గాక, ఔపయోగిక కళలెన్నో కేరళలో మనుగడలో ఉన్నాయి. తిరువనంతపురానికి దగ్గరలోని 'ఆరన్ముళ' అనే గ్రామం హస్త కళలకు పుట్టినిల్లుగా విరాజిల్లుతున్నది. ఇక్కడ వేరే ఏ ప్రదేశంలోనూ దొరకని లోహముకురాలు (metal mirrors) లభిస్తాయి. ఈ అద్దాలను వెండి, కంచు, రాగి, సీసంలను కలబోసి మిశ్రలోహంతో తయారుచేస్తారు. పలుచటి ఈ మిశ్ర లోహపు రేకును అతి నున్నగా మన ప్రతి బింబాలు కనిపించేటట్లు అద్దం లాగా తయారు చేస్తారు. అది గాజు అద్దం కాదని ఎవరైనా చెపితేనే కానీ తెలియదు. ఈ అద్దాలను మలయాళీలు తమ నూతన సంవత్సరం 'విషు' సందర్భంగా కొలువుంచే వివిధ పవిత్ర వస్తువులలో ఒకటిగా ఉపయోగిస్తారు. మలయాళీలు కొత్త సంవత్సరం తొలిరోజు వేకువ జామునే నిద్ర లేవగానే కొన్ని శుభప్రదమైన వస్తువులను చూస్తే ఆ సంవత్సరమంతా సుఖసంతోషాలు లభిస్తాయని నమ్ముతారు. అలాంటి శుభప్రదమైన వస్తువులలో ఈ లోహపు ముకురము ఒకటి. లోహపు అద్దాలు తయారు చేయడంలో నైపుణ్యం కల్గిన శ్రామికులు పెద్ద సంఖ్యలో ఈ గ్రామంలో స్థిరపడ్డారు" (మా కేరళ యాత్ర, పుట-56&57).

దాదాపుగా ఐదు తరాల క్రిందట కొద్దిమంది హస్త కళాకారులు తమిళనాడులోని తిరునెల్వేలి నుండి ఆరన్ముళ ప్రాంతానికి వచ్చి స్థిరపడ్డారు. ఆ సమయంలో ఆరన్ముళ రాజైన 'పదళం' ఆరుణ్ముళలో పార్ధసారధి దేవాలయాన్ని నిర్మించ తలపెట్టాడు. ఆ దేవాలయ నిర్ణాణంలో ఆభరణాల నిర్మాణంలో ఈ కుటుంబాలు ప్రతిభ కనబరిచాయి. అంతేకాక ఈ పనిలో భాగంగానే వారు లోహపుముకురాల తయారీని కనుగొన్నారు. ఇది ఒక ప్రత్యేకమైన కళ. ప్రపంచంలో మరెక్కడా కూడా ఈ కళ కనిపించదు. వీటి తయారీ విధానం ఇప్పటికీ కూడా అత్యంత రహస్యం. ఆ రహస్యం ఆరన్ముళలోని కొన్ని కుటుంబాలకు తప్ప మరెవ్వరికీ తెలియదు. ఈ లోహ ముకురాలకు ఎంతో విలువ ఉంది.

ప్రధానంగా కేరళీయుల పండగల్లో, ఉత్సవాల్లో వీటికి అధిక ప్రాధాన్యం ఉందని చెప్పవచ్చు. ఈ లోహ ముకురాలు గృహంలో ఉన్నట్లైతే అవి అదృష్టాన్ని, సంపదను, సమృద్ధిని తీసుకువస్తాయని వీరి నమ్మకం. కేరళ బలరామపురం చేనేత వస్త్రాలకు ప్రసిద్ధి గాంచింది. ఇక్కడ నేసే జరీ చీరలకు దేశవ్యాప్తంగా మంచి గిరాకీ ఉంది. బంగారు, వెండి జరీ వాడుతూ చీరల్ని నేయడం వీరి ప్రత్యేకత. ఈ కసవు జరీ చీరల తయారీ విధానం ఒక కళగా రూపాన్ని పొందింది. "ఇక్కడి వేలాది కుటుంబాల నేతగాళ్ళు సంప్రదాయ నేత పద్ధతుల్లో పురాతన పరికరాలు మాత్రమే ఉపయోగించి అద్భుతమైన నేత చీరలు నేయడం విశేషం. సాధారణంగా మిగిలిన నేత పనివారు ఉపయోగించే జకార్డ్ వంటి ఆధునిక పరికరాలను వీరు వాడరు" (మా కేరళ యాత్ర, పుట-138). ఈ బలరామపురం చీరలకు దాదాపుగా 200 సంవత్సరాల చరిత్ర ఉంది. క్రీ.శ.18వ శతాబ్దానికి చెందిన బలరామపురం రాజా బలరామవర్మ కాలంలో ఈ కళ పురుడుబోసుకుంది. ఇతని కాలంలోనే బలరామవర్మ ప్రధాని రాజకుటుంబీకులకు వస్త్రాల తయారీ కొరకు తమిళనాడు నుండి ప్రసిద్ధ నేత కళాకారులను ఈ ప్రాంతానికి రప్పించి వారి ప్రత్యేకంగా బలరామపురంలో ఒక ప్రాంతాన్ని, వారికి నివాసంగా ధారాదత్తం చేశారు. ఆ ప్రాంతం 'షాలియార్ స్ట్రీట్' పేరుతో ఇప్పటికీ నిలిచి ఉంది.

ఇదే రీతిలో టర్కీలో తివాచీల తయారి ఒక కళగా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. మల్లాది కృష్ణమూర్తి గారు టర్కీని సందర్శించిన క్రమంలో అక్కడ ప్రసిద్ధి చెందిన టర్కీ కార్పెట్లను గురించి తెలుపుతూ "కాటన్, ఊల్, సిల్క్ దారాలతో కార్పెట్లని తయారు చేస్తారు. టర్కిష్ ఎంబ్రాయిడరీ టెక్నిక్ పూర్తిగా విభిన్నమైనది. టర్కిష్ కార్పెట్ ఎంబ్రాయిడరీ రెండు ముళ్ళతో నేస్తారు. దీన్ని డబుల్ నాట్ లేదా టర్కిష్ నాట్ అని పిలుస్తారు. దీనికి బలం ఎక్కువ. ప్రపంచంలోని మిగిలిన అన్ని చోట్లా కార్పెట్లను ఒక్క ముడితోనే నేస్తారు. వాటిలో కొన్ని కాటన్, సిల్క్‌లు కలిపి, సిల్క్ ఊలు కలిపి, ఊలు, కాటన్ కలిపి, కాటన్, కాటన్ కలిపి, ఇలా రకరకాలుగా కలిపి, లేదా కేవలం కాటన్స్, ఊల్, సిల్క్‌లతో చేసిన కార్పెట్లున్నాయి. సింగిల్ నాట్‌తో రెండు వారాలలో తయారయ్యే కార్పెట్, డబుల్ నాట్‌తో

తయారుచేయడానికి నాలుగున్నర నెలలు దాకా పడుతుంది" (ట్రావెలాగ్ దుబయ్-టర్కీ-గ్రీస్, పుట-86).

టర్కీలో ఇస్లాం సంస్కృతి వ్యాప్తిలో ఉందన్న విషయం అందరికీ విదితమే. ప్రార్థనా సమయంలో, భోజన సమయంలో నేలపై ఒక వస్త్రాన్ని పరచుకోవడం, దానిపైనే నమాజ్ చేయడం, భోజనం చేయడం వీరి అలవాటు. బహుశా ఈ వస్త్రమే కాలక్రమంలో తివాచిగా రూపొంది ఉంటుంది. తమ మత సాంప్రదాయంలో ఈ తివాచీల వాడకానికి ప్రాధాన్యం ఉండటం వల్ల టర్కీలో వీటి తయారీ ఒక ప్రముఖ కళగా రూపుదాల్చి ఉంటుంది. తివాచీ తయారీ విధానాన్ని గమనించినట్లయితే వారి పురాతన ఇస్లాం సాంప్రదాయం, సంస్కృతి బోధపడుతున్నాయి.

ఇటువంటి ఇస్లాం సంప్రదాయం గలిగిన మరికొన్ని దేశాల్లో కళలు వ్యాప్తిలో ఉన్నాయి. వాటిలో ఈజిప్టు ఒకటి. "ప్రాచీన కాలంలో ఈజిప్టులో 'సెంటు'లను తయారు చేయడం భారీ ఎత్తున జరిగేదట. అది ఒక కళగా వికసించింది. ఇప్పటిలాగా ఆల్కహాల్‌ను వాడుతూ వాళ్లు సెంట్‌లను తయారుచేయకుండా, ప్రకృతిసిద్ధమయిన వస్తువుల నుంచి, నూనెల నుంచీ సెంట్‌లను తయారు చేసేవారు, ఇప్పటికీ తయారు చేస్తున్నారు. ఈ సెంట్‌ల తయారీ కళ ఫ్రాన్స్‌లోకి చేరుకొని, అక్కడ ప్రసిద్ధి చెందిందేమో. ఇప్పుడు మనం సెంట్ లేదా పెర్‌ఫ్యూమ్‌లకు ప్యారిస్ ప్రసిద్ధమైనదిగా భావిస్తాం" (నైలునదీ నాగరికత, పుట-27).

ప్రాచీన ఈజిప్టియన్లు క్రీ.పూ.1000 శతబ్దానికి ముందు నుండే సెంట్‌లను వాడేవారని చరిత్రకారుల అంచనా. వీరు దేవతను పూజించే సమయంలో, శవాలను మమ్మీలుగా మార్చేక్రమంలో మరణించిన శరీరం తాజాగా ఉండాలని సెంట్‌లను అధికంగా వినియోగించేవారు. ప్రాచీన ఈజిప్టియన్లు, పూలు, సుగంధద్రవ్యాలు, గొరింటపొడి, సహజ నూనెలు, గంధంతో ఆలయ ప్రాంగణాల్లో వీటిని తయారు చేసేవారు. అయితే నేడు వినియోగిస్తున్నట్లుగా సెంట్‌ల తయారీలో ఆల్కహాల్ వాడకుండా సహజసిద్ధంగా తయారుచేసేవారు. క్రీ.పూ.4వ శతాబ్దం వరకూ సెంట్‌ల తయారీలో వీరికి ఆల్కహాల్ వినియోగం తెలియదు. నెఫిర్తుమ్‌ను వీరు సుగంధ ద్రవ్యాలకు, పెర్‌ఫ్యూమ్‌లకు

అధిదేవతగా భావిస్తారు. ఇతడే ప్రపంచంలో మొట్టమొదటి ఆరోమాథెరపిస్ట్ అని వీరి భావన.

అయితే చాలా కాలం వరకూ ఈజిప్టు వారి సెంట్ తయారీ కళ గూర్చి ప్రపంచానికి తెలియదు. రోమ్ చక్రవర్తి జూలియస్ సీజర్ ఎప్పుడైతే ఈజిప్టును వశం చేసుకున్నాడో అప్పుడే ఇక్కడ తయారయ్యే సెంట్‌ల సువాసనలకు ముగ్ధుడై, ఈ కళను రోమ్ వారికి పరిచయం చేశాడు. తర్వాతి కాలంలో ఇది యూరోప్ వారికి కూడా పరిచయమైంది. ఫ్రాన్స్ రాజయిన 16వ లూయిస్ ఈ పెర్‌ఫ్యూమ్‌లను ఎంతో ఇష్టపడేవాడట. అంతేకాక వీటిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఇతన్ని 'perfume king' అనే పేరుతో కూడా పిలిచేవారట. ఈజిప్టియన్లు తాము తయారు చేసిన పెర్‌ఫ్యూమ్‌లను భద్రపరిచేందుకు క్రీ.పూ.1000కి ముందే గాజుల సీసాలను తయారు చేశారు. ఆ గాజు సీసాలపై జంతువుల, పక్షుల బొమ్మలను చిత్రించేవారు. ఇది కూడా ఒక కళగా ఆవిర్భవించి, 18వ శతాబ్దం నాటికి యూరోప్ దేశాల వారిని ఆకర్షించింది. నేడు మనం వాడుతున్న పెర్‌ఫ్యూమ్‌లకు, వాటిని భద్రపరిచే అందమైన పెర్‌ఫ్యూమ్ బాటిళ్ళ తయారీకి బీజాలు కొన్ని వేల ఏళ్ళ క్రిందటే ఉన్నాయంటే ఆశ్చర్యకరం.

సెంట్ తయారీతో పాటూ సౌందర్య సాధన ఒక కళగా వికసించింది. "భవన నిర్మాణ కళ, సౌందర్య సాధనాలను, ఇంకా ఎన్నో జీవన సంస్కృతికి సంబంధించిన వాటిని గ్రీకులు, రోమన్లు ప్రాచీన ఈజిప్టియన్ల నుంచి నేర్చుకున్నారు" (నైలునదీ నాగరికత, పుట–32). ఔపయోగిక కళలే కాక, లలిత కళలెన్నో ఈజిప్టులో వర్ధిల్లాయి, వర్ధిల్లుతున్నాయి. వీటిలో ముందుగా చెప్పుకోవాల్సింది శిల్పకళ. "ఈజిప్టులో పిరమిడ్‌లే ఆశ్చర్యం గొలిపే కట్టడాలనుకుంటే ఈ స్తంభాలు ఎత్తైన గోడలు వాటి మీద శిల్పాలు, వర్ణచిత్రాలు, చిత్రలిపి ఇప్పటికీ నిత్య నూతనంగా కన్పించటం ఆశ్చర్యాద్భుతాలను కల్గిస్తాయి. శిలలపై చెక్కిన ఇక్కడి శిల్పాల్లో మన శిల్పాల్లో లాగా డెప్త్ (లోతు) ఉండదు. క్యూబ్క్ ఆర్ట్ మాదిరిగా ఉంటాయి. అసలు పాశ్చాత్య దేశాలలో చిత్రకలలో 'క్యూబిజం' ఈజిప్టు శిల్పాల ప్రభావంతో పుట్టిందంటారు. ఈజిప్టు రాళ్ళ మీద చెక్కిన శిల్పాలలో ఆకారం మనకెదురుగా నిలబడినట్లు

కాక, పక్క నుంచి తీసిన రేఖాచిత్రాల్లాగ ఉంటాయి. కానీ ప్రతీ ఆకారం సౌష్టవంతో చాలా సహజంగా ఉంటాయి. పిరమిడ్‌ల లోపల చిత్రించబడిన చిత్రాలు వేల సంవత్సరాలు గడిచినా రంగు మాసిపోకుండా ఉన్నాయి" (నైలునదీ నాగరికత, పుట-36).

శిల్పకళే కాక ఈజిప్టియన్ చిత్రకళ కూడా ప్రపంచఖ్యాతిని పొందింది. స్థానిక ఈజిప్టియన్లు పాపిరస్ కాగితాల మీద ప్రాచీన దేవాలయాలోని శిల్పభంగిమలను, దృశ్యాలను వర్ణచిత్రాలుగా చిత్రించి పర్యాటకులకు అమ్ముతారు. ఇది వారికి ఆదాయాన్ని కలిగించే కళ.

ఇవేకాక కుర్చీలు, బల్లలు, మంచాలు చేసే వడ్రంగి కళ, వస్త్రాలను రకరకాలుగా నేసే కళ కూడా ఇక్కడ బాగా వికసించింది. అంతేకాక ఆస్ట్రానమి, జ్యోతిషశాస్త్రం, గణితం, సంగీతం, వైద్యం, శస్త్రచికిత్స, మందులు, నగల తయారీ వంటి ఎన్నో కళలు ఈజిప్టులో ప్రసిద్ధి చెందాయి.

కళలను కాపాడుకోవడం, కళాకారులను ఆదరించడం ప్రభుత్వ కర్తవ్యం. ఏ కళైనా ప్రోత్సాహం వుంటేనే రాణిస్తుంది. మండలి బుద్ధప్రసాద్ గారు జర్మనీ ప్రభుత్వం కళపరిరక్షణకు అదిక ప్రాముఖ్యం ఇస్తుందని చెప్తూ జర్మనీ ప్రభుత్వం తీసుకునే చర్యలను గురించి వివరించారు. "సాంస్కృతిక వ్యవహారాలకు, వార్తా మాధ్యమాలకు జాతీయ విధానాన్ని రూపొందించి దేశపరిపాలనా వ్యవహారాలలో సాంస్కృతిక విధానానికి పెద్ద పీట వేసింది జర్మనీ ప్రభుత్వం. జీవన మాధుర్యాన్ని సంపూర్ణంగా పొందాలంటే కళాపోషణ, సంస్కృతీ పరిరక్షణ తప్పనిసరి అని జర్మనీ దేశస్థుల భావన. తమ సంస్కృతి విశిష్టమైన సంస్కృతి అని జర్మనీ భావిస్తూ, సజాతీయ కళలను, సంస్కృతిని పోషించుకోవడానికి ఎంతో ప్రాముఖ్యం ఇస్తున్నది. వాటి విలువలను దేశ ప్రజలంతా గ్రహించి, అభిమానించేటట్టు చేస్తున్నది" (నా జర్మనీయానం, పుట-64).

జర్మనీలో సాంస్కృతిక వ్యవహారాల మంత్రిపై కళల పరిరక్షణ విషయంలో అధిక బాధ్యత ఉటుంది. అతడు తనను తాను కళాకారులకు ప్రతినిధిగా భావించుకుని, వారి

కళలను ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభాపాటవాలకు తగిన గుర్తింపు వచ్చేలా కృషి చేస్తాడు. కాబట్టే జర్మనీ తన ప్రాచీన కళలను, కట్టడాలను కాపాడుకోవడంలో ముందంజలో ఉంది.

జర్మనీ పాటించే కళాపరిరక్షణ పద్ధతులు శ్లాఘనీయం, ఇతర దేశాలకు మార్గదర్శకం. ఏ ప్రాంతానికి చెందిన వారైనా తమ కళలను పరిరక్షించుకోవడం అత్యంత ఆవశ్యకం. కళా పరిరక్షణ అంటే సంస్కృతి పరిరక్షణే. ఇటువంటి భిన్న సంస్కృతులను తెలుసుకునేందుకు యాత్రాచరిత్రలు కూడా ఒక సాధనం అవుతుండడం హర్షించదగ్గ విషయం.

ఆధునిక కాలంలో ప్రపంచీకరణ ఫలితంగా ఏ ప్రాంతానికైనా, దేశానికైనా రాకపోకలు సులభమయ్యాయి. అంతేగాక ఆర్థికపుష్టి కూడా చేకూరడంతో తీర్థ, విజ్ఞాన, విహార, వినోద యాత్రలు చేసే వారు విరివిగా కన్పిస్తున్నారు. ఇవేగాక వర్తక, వాణిజ్య, విద్యా, ఉద్యోగ యాత్రలు నేడు సర్వసాధారణమయ్యాయి. ఈ విధంగా యాత్రలు పరస్పరం తప్పక ప్రభావమవుతాయి. ఫలితంగా వారి భాషలో, సాహిత్యంలో, సంస్కృతుల సంపర్కం వల్ల ఒక మిశ్రమ సంస్కృతి ఏర్పడుతుంది. అదే కాలక్రమంలో విశ్వ సంస్కృతిగా స్థిరపడే అవకాశం ఉంది.

# ఐదవ అధ్యాయం

# యాత్రా చరిత్రలు –సామాజికాంశాలు

# 5.0. యాత్రా చరిత్రలు – సామాజికాంశాలు

మానవుని జీవనాభివృద్ధికి కుటుంబం తర్వాత అంతగా తోడ్పడేది సమాజం. అరిస్టాటిల్ చెప్పినట్లుగా మానవుడు సంఘజీవి. సాధారణంగా ఇతరుల తోడులేనిదే భద్రతగా జీవించలేడు. అందుకే అరిస్టాటిల్ ఒంటరిగా బ్రతికే మనిషి జంతువైనా అయ్యిండాలి లేదా దేవుడైనా అయ్యుండాలని పేర్కొన్నాడు. సంఘ జీవనం మానవుని విజ్ఞానపరమైన, వ్యక్తిత్వ పరమైన అభివృద్ధికి బాటలు వేస్తుంది. సమాజంలోని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది ప్రజల పరస్పర భావ వినిమయం ద్వారా ఏర్పడేవే సామాజిక సంబంధాలు. ఒక సమాజంలోని చర్యలతో క్రియాశీలకంగా భాగస్వామి కాగలిగినప్పుడే సమాజంలోని వ్యక్తుల మధ్య సామాజిక సంబంధాలు బాగుంటాయి.

సమాజంలోని మనుషుల జీవన విధానాలు, జనాభా, విద్య, మాట్లాడే భాష, పరిపాలనాంశాలు, వారి బంధుత్వాలు, ఇలా మనిషి జీవితంతో ముడిపడిన ప్రతీ అంశం సామాజికాంశమే అవుతుంది. అందుకే "ఒక సమాజం ఆచార వ్యవహారాల పరంగా కానీ, కుల, మత, వర్గ, స్నేహ, వైషమ్యాది విషయకంగా సమష్టిగా సమాజ జీవితానికి, సంస్కృతికి సంబంధించిన అంశాలన్నింటినీ సామాజిక విషయాలుగా పేర్కొనవచ్చు అని (మట్నూరి కృష్ణారావు సంపాదకీయాలు, పుట-52) ఎం.దత్తాత్రేయశర్మగారు పేర్కొన్నారు."

యాత్రికులు కూడా సమాజంలో భాగం. కాబట్టి వారు దర్శించిన భిన్న సమాజాల స్వరూపాలను, తాను జీవించే సమాజానికి, తాను దర్శించిన భిన్న సమాజాల మధ్యగల వైవిధ్యాలను, సారూప్యతలను ఇతరులకు తెలియచేయాలనుకోవడం సహజం. అందుకే యాత్రాచరిత్రల్లో అనేక సమాజాలకు చెందిన సామాజికాంశాలెన్నో ఆసక్తికరంగా పొందుపరచబడ్డాయి. ముఖ్యంగా ఎక్కువమంది రచయితలు అక్కడి వారి జీవన విధానాన్ని, కుటుంబం, భాష, పరిపాలనాంశాలు వంటి అంశాలపై ఎక్కువ ఆసక్తి చూపించి, ఆయా అంశాల్ని తమ యాత్రాగ్రంథాల్లో పొందుపరిచారు.

## 5.1. జీవన విధానం

వ్యక్తుల ఆలోచనారీతికి, ప్రవర్తనలకు భౌతికరూపమే జీవనవిధానం. బ్రతుకును బాగు చేసుకోవడానికి, మరింత మెరుగు పరుచుకోవడానికి మానవుడు నిరంతరం తపిస్తూ వుంటాడు. తన మనుగడ సజావుగా సాగేందుకు కొన్ని ప్రమాణాలను, కొంత పరిధిని ఏర్పరుచుకుంటాడు. వాటినే జీవన విధానమనవచ్చు. భౌతిక, మానసిక, సామాజిక, ఆర్థిక వాతావరణాన్ని తమకు తామేగానీ లేదా సామూహికంగా గానీ నిర్ణయించుకుని, దానికి తగ్గట్టుగా ప్రవర్తించే రీతే జీవన విధానం. ఒక వ్యక్తి తన జీవన రీతిని ఏర్పాటు చేసుకుని, అభివృద్ధి చేసుకోవటానికి ఎంత సమయం పడుతుందో, ఆ జీవన రీతిని ఇతరులు ఆమోదించేందుకు కూడా అంతే సమయం పడుతుంది. ప్రపంచం భిన్న సమాజాల కలయిక. ఈ భిన్న సమాజాల ప్రవర్తనా రీతులు, జీవన విధానాలను తెలిపే అనేకాంశాల్లో యాత్రాచరిత్రలు కూడా ఒకటి.

'జపాన్ వారి జీవనశైలి గురించి అందరికీ తెలిసిందే. ఎప్పుడూ కష్టించి పనిచేసే స్వభావం గల మనుషులుగా పేరున్న జపనీయులు శుభ్రతకి కూడా ప్రాధాన్యమిస్తారు. జపాన్ పర్యాటక రంగంలో కూడా ముందంజలో వుంది. కాబట్టి అక్కడ ఎల్లప్పుడూ శుభ్రత, స్వచ్ఛత కనిపిస్తుంటాయి. అంతేకాదు వీరికి క్రమశిక్షణ కూడా ఎక్కువే. రోడ్డు దాటాలంటే రోడ్డుపై వేసిన జీబ్రా చారల మార్కింగ్ వద్దే దాటాలి. అదే పచ్చబల్బు వెలిగినప్పుడే దాటాలి. లేదా ప్రమాదం ఖాయం. అంత వేగంతో వాహనాలు వెళ్తుంటాయి. ఒకసారి గ్రీన్ లైట్ వెలిగిందా ఇక నిర్భయంగా వెళ్ళిపోవచ్చు. ఎంత వేగంతో వచ్చిన వాహనమైనా ఎర్రలైటు పడగానే కీచుమంటూ ఆగిపోతుంది. గ్రీన్ లైట్ వెలిగినపుడు రోడ్డు దాటేందుకు గుడ్డివారి కోసం సంకేత 'శబ్దం' కూడా వినిపిస్తుంది. ఎర్రలైటు పడితే ఆ శబ్దం (పాదచారుల కోసం) ఆగిపోతుంది అంటూ జపాన్ వారి క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని వివరించారు రంగనాయకులుగారు. "మన దేశంలో అరుదైనవి, జపాన్ సమాజంలో ప్రస్ఫుటంగా కనిపించేవి, పౌరుల ప్రవర్తనలో అణుకువ, క్రమశిక్షణ, విధేయత, సమష్టి కృషి. ఈ

లక్షణాలే ఆ దేశాన్ని విజయపథంలోకి మళ్ళించాయి" (జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర, పుట–27).

జపనీయులకు లాగా పరిశుభ్రత, క్రమశిక్షణ అమెరికన్ల జీవితంలో ప్రధానంగా కన్పించే అంశాలు. అమెరికాని సందర్శించిన క్రమంలో వారి ఆలోచనా విధానాన్ని ఈ విధంగా వివరించారు గోపీగారు. "మన ప్రతీ కదలిక అందరికీ తెలుస్తుంది. ఉదాహరణకు కార్లను రాత్రిపూట ఒక టైము దాటిన తర్వాత ఇంటిముందు పార్కు చేసి ఉంచరాదు. వెంటనే మున్సిపాలిటీ వాళ్ళకు తెలిసిపోతుంది. ఇక్కడ కమ్యూనిటీ లైఫ్ బలమైనదే. మనం ఇంటిముందు పచ్చిక బయలును రెగ్యులర్‌గా ట్రిమ్ చేయలేదనుకోండి ఇరుగు పొరుగు వాళ్ళు చేస్తున్నారు. వాళ్ళ పక్కన మన ఆవరణ అందవిహీనంగా కన్పిస్తుంది. వెంటనే ఎవరో ఒకరు ఫోనుచేసి మున్సిపాలిటీ వాళ్ళకు చెప్తారు. వాళ్ళు వచ్చి హెచ్చరించి పోతారు. చెవిన పెట్టకపోతే జరిమానా విధిస్తారు. అప్పటికీ ఖాతరు చేయకపోతే నీటి కనెక్షన్ తీసేస్తారు" ఇంతటి ఖచ్చితత్వం గలవారు కాబట్టే ప్రపంచ దేశాల్ని శాసించే స్థాయికి చేరగలిగారు అమెరికన్లు.

అయితే పెరూలోని ప్రజల వ్యక్తిత్వం అమెరికన్ల వ్యక్తిత్వానికి వ్యతిరేకంగా కన్పిస్తుంది. వారు అమెరికన్లలా, జపనీయుల్లా ఎప్పుడూ శ్రమించడమే గాక శ్రమతో పాటూ ఆనందాన్ని పొందాలనుకునే మనస్తత్వం కలవారు.

పెరూ ప్రజల జీవన విధానాన్ని గురించి "అక్కడి ప్రజలకి హాయిగా బ్రతకటం, మంచి ఆహారం తీసుకోవటం, అలాగే సరదాగా కాలక్షేపం చేయటమన్నా, తమ సంస్కృతి అన్నా ఇష్టం. ఈ లక్షణాలకి తోడు వారు ఆతిథ్యమివ్వటంలో ప్రసిద్ధులు. అలాగే స్నేహంగా మెలిగే గుణముంది" అని 'రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు' అనే యాత్రా గ్రంథంలో పేర్కొన్నారు వేమూరి బలరామ్ గారు.

ఇదే పుస్తకంలో మలేషియన్ల జీవన శైలిని ఈవిధంగా వివరించారు. "మలేషియాలో ఎవరింటికైనా వెళ్ళాలంటే ముందుగా ఫోన్ చేసి ఆ విషయం తెలియచేయటం అక్కడి వారి మర్యాదని తెలిసి అది నాకెంతో గొప్పగా అనిపించింది. ఇంటిలో ప్రవేశించే ముందు

పాదరక్షల్ని తీసేయాలి. సాధారణంగా అతిథులకి పానీయాలు ఆఫర్ చేస్తారు. కాదనకుండా తీసుకోవాలి. ఆహారాన్ని స్పూన్, ఫోర్క్ లాంటి వాటితో కాకుండా చేతుల్తో తినేటప్పుడు కుడి చేతినే ఉపయోగించాలి. అలాగే ఏదైనా ఇస్తున్నప్పుడూ, తీసుకునేటప్పుడూ కుడిచేతినే వాడాలి. మలేషియాలో ప్రదేశాల్ని, వస్తువుల్ని, వ్యక్తుల్ని చూపించటానికి సాధారణంగా కుడిచేతి చూపుడు వేలిని వాడరు. దానికి బదులు మిగతా నాలుగు వేళ్లూ ముడిచేసి, కుడిచేతి బొటనవేలుతో చూపటం అక్కడి పద్ధతి" (రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు, పుట-87), అసవ్యస్తత లేని జీవనాన్ని సాగించటం, పద్ధతితో పనులను చేసుకోవడం కూడా వీరి లక్షణాలుగా ప్రాచుర్యం పొందాయి. వాస్తవానికి ఒక సమాజం వారు పాటించే జీవన విధానం ఒక రీతిలో ఉంటే, బాహ్య ప్రపంచానికి మాత్రం మరోలా వ్యాపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. పాకిస్తాన్ ప్రజలు మతోన్మాదులని, ఎవరితోనూ కలవరని మిగతా దేశస్థుల భావన కానీ ఆ సమాజాన్ని ప్రత్యక్షంగా దర్శించిన వారికి అందుకు విరుద్ధమైన అభిప్రాయాలు కలుగుతాయంటూ తన యాత్రాగ్రంథంలో పేర్కొన్నారు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు. "నిజానికి పాకిస్తాన్ సమాజమే విభిన్నంగా ఉన్నది. పాకిస్తాన్ అంటే మనలో చాలా మందికి అక్కడ ప్రతిచోటా గడ్డాలు, బురఖాలు కనపడతాయని, ప్రతివారూ భారత విద్వేష భావాలు వ్యక్తం చేస్తారనే అభిప్రాయం ఉంటుంది. కానీ నాకు అక్కడ అడుగడుగునా విభిన్న వాతావరణం కనిపించింది. ముఖ్యంగా పాక్ మేధావుల్లో, విద్యావంతుల్లో, యువతీ యువకుల్లో కనబడుతున్న ఆధునిక భావాలు, ప్రగతి శీల దృక్పథం, భారతీయుల పట్ల ప్రకటించే ఆదరణ నన్నెంతో ఆశ్చర్యపరిచింది" (పాకిస్థాన్‌లో పదిరోజులు, పుట-83).

ఏ సమాజానికి చెందిన వ్యక్తుల జీవన రీతి, ప్రవర్తనా రీతి, జీవన విధానమయినా మెరుగ్గా ఉండాలంటే విద్య అత్యంత ఆవశ్యకం. పైన పేర్కొన్న సమాజాలన్నీ అక్షరాస్యతతో ముందున్నవే. విద్య వ్యక్తిని, కుటుంబాన్ని, సమాజాన్ని తద్వారా దేశాన్ని కూడా అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తుంది.

## 5.2. భాష

మానవ సమాజ పరిణామ క్రమంలో మొదట భాష సంజ్ఞల రూపంలో, శబ్దాల రూపంలోనే కన్పిస్తుంది. ఎప్పుడైతే సంచార జీవితాన్ని వదిలి, సంఘజీవితాన్ని ప్రారంభించి, ఆలోచించగలిగిన జీవిగా మానవుడు మారినప్పుడు అది వాగ్రూపంలోకి పరిణామం చెందింది. భాష ద్వారానే సంస్కృతికి అలవాటైన సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం, విజ్ఞానం, కళలు వెల్లడయ్యాయి. అందుకే ఏదైనా ఒక జాతిని నాశనం చేయాలనుకుంటే ముందు వారి భాషను నాశనం చేయాలనే మాట వాడుకలో ఉంది. కాబట్టి ఒక జాతికి లేదా ఒక సమాజానికి సంబంధించిన చరిత్ర, సంస్కృతి, మానవ జీవనం అంతా కూడా భాషతోనే ముడిపడి ఉంటుంది. భిన్న సమాజాలు మాట్లాడే భాషను గురించి, వాటి వెనుక గల నేపథ్యాలను గురించి తెలుసుకోవాలంటే యాత్రాచరిత్రలు సరైన సాధనమని చెప్పవచ్చు.

అన్ని దేశాలకూ అధికార భాష ఉన్నట్లుగానే పాకిస్తాన్ దేశ భాషగా గుర్తింపు పొందింది ఉర్దూ. నిజానికి ఈ భాషను పాకిస్తాన్‌లోని ఏడు శాతం మంది మాత్రమే మాట్లాడతారని, ఆ విశేషాలను ఈ విధంగా వివరించారు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు. “పాకిస్తాన్ అధికార భాషగా స్వీకరించిన ఉర్దూ కూడా నిజానికి అక్కడ స్థానికులు మాట్లాడే భాష కాదు. ఉర్దూ అంటే టర్కీ-పర్షియన్ పరిభాషలో సైనిక క్యాంపు అని అర్థం. మధ్యయుగాల్లో భారతదేశానికి చెందిన ముస్లిం సైనికులు మాట్లాడే భాష అది. ఇందులో పర్షియన్, టర్కీ పదాలతో కూడిన స్థానిక హిందుస్థానీ మిశ్రమం కన్పిస్తుంది. బెంగాల్‌లో ముస్లింలు ఈ భాషలో ఎప్పుడూ మాట్లాడలేదు. పాకిస్తాన్ లో కూడా అత్యధికులు ఈ భాషలో మాట్లాడేవారు కూడా కాదు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న ఢిల్లీ, ఆగ్రా, లక్నో, భోపాల్, హైదరాబాద్ నగరాల్లో అంటే పాత మొఘల్ సామ్రాజ్యంలో ముస్లింలు మాట్లాడే భాష ఇది” (పాకిస్తాన్‌లో పదిరోజులు, పుట-9).

ప్రస్తుతం ఈ భాషే పాకిస్తాన్ దేశపు అధికార భాష. విద్యావ్యవస్థ పత్రికా వ్యవస్థ, సినిమాల్లో మాట్లాడే భాష కూడా ఉర్దూనే. పాకిస్తాన్ అంటే ఉర్దూ, ఉర్దూ అంటే పాకిస్తాన్ అనేంతగా భాష వలన కూడా పేరును సంపాదించుకున్న దేశం పాకిస్తాన్.

పాకిస్తాన్ వారికి ఉర్దూలా, చైనీయులకు ప్రామాణిక భాష మాండరిన్. ముఖ్యంగా బీజింగ్ లో మాట్లాడే భాషనే వీరు అధికార భాషగా పరిగణిస్తారు. అందరూ చైనీస్‌కు ఒక భాషగా వ్యవహరిస్తున్నా, నిజానికి అది ఒక భాష కాదు. ఎనిమిది భాషా విభాగాల సముదాయం. ఇందులోని మొదటిదే మాండరిన్, మన తెలుగువారికి గ్రాంధిక భాషలా అనమాట. ఈ భాషలో ధ్వనులన్నీ ఒకే విధంగా ఉండి అక్షరాల్ని గుర్తుపట్టడం కష్టం. భారతదేశంలో వివిధ రకాల జాతులవారు మాట్లాడే భాషలు ఎంత భిన్నమో చైనీయులు మాట్లాడే భాష కూడా అంతే భిన్నమని, షంఘై నింగిలో అనే యాత్రాచరిత్రలో కురుగంటి శ్రీలక్ష్మిగారు పేర్కొన్నారు.

తెలుగు భాషతో పోలిస్తే చైనీయుల భాషకు కొన్ని సామ్యాలు కనిపిస్తాయని, ఇవి సంస్కృతంలో త్వరగా నేర్చుకోవడానిక వీలు కాని భాషగా పేర్కొన్నారు. “పదాలు సందర్భానికనుగుణంగా అర్థాలనివ్వటం భాషా లక్షణమైనా, ఇక్కడ స్వరస్థాయి వల్ల పదాల అర్థాలు మారటం మరో కొత్త అంశం. దీనివల్ల పొట్టి అక్షరాన్ని సాగదీసి, దీర్ఘంతోగానీ, ఒత్తుతో గానీ, ఇక్కడి భాషా సంస్కృతిని తెలియని వాళ్ళు ఆ విధంగా లఘువును గురువుగా మార్చి పలికితే, అది విపరీతార్థాలనివ్వటమే కాదు, ఎదుటి వ్యక్తి మనని తారాస్థాయిలో తిట్టేందుకు అవకాశం కల్పిస్తుంది” (షంఘై నింగిలో, పుట–30).

వీరి ఇంగ్లీష్ ఉచ్ఛారణలో పదాల వాడుకలో కూడా తేడా కన్పిస్తుందని, ఆకలిగా ఉందనటానికి I am hungry బదులుగా I hungry అని, He come, you no come లాగా పొడి పొడి ఇంగ్లీషుని మాట్లాడతారని చైనీయుల భాషా విశేషాలను వివరించారు.

చైనీయులలాగే జపనీయులు ఆంగ్ల భాషా వ్యవహారంలో వెనుకంజలో ఉన్నారు. వీరు కొన్ని సంవత్సరాల నుండి తమ విద్యాభ్యాసంలో ఆంగ్లాన్ని చదువుతున్న అందులో స్పష్టంగా సంభాషించలేదు, రాయలేదు. అందుకే “జపాన్‌లో ఇంగ్లీషుతో సహా విదేశీ భాషల ప్రాబల్యం తక్కువ. కేవలం జపనీస్ భాష ద్వారానే శాస్త్ర సాంకేతిక రంగాలలో, కళా సాహిత్య రంగాలలో ఎంతో పురోగతి సాధించారు. జపాన్ సర్వం జపనీస్ మయమే” అని తన యాత్రాగ్రంథంలో పేర్కొన్నారు రంగనాయకులు గారు.

ఏ భాష వారైనా సులభంగా నేర్చుకోగల భాష జపనీస్ అంటూ ఆ భాషకు గల ప్రత్యేక లక్షణాలను ఈ విధంగా వివరించారు. “జపాన్ వారు ‘ల’ అక్షరాన్ని పలకటానికి చాలా ఇబ్బంది పడతారు. ఎక్కడ ‘ల’ వస్తే అక్కడ ‘ర’ అక్షరాన్ని పలుకుతారు. ఇంగ్లీషు నుంచి వచ్చిన పదాలను కూడా వారి ఉచ్చారణ ప్రకారం పూర్తిగా మార్చివేసి, అసలు అది ఇంగ్లీషు పదమా అన్పించేలా వాడుతుంటారు. ఉదాహరణకు ‘ఆల్కహాల్’ను ‘ఆరకొౌరు’ అంటారు. రెండు హల్లులను కలిసిన సంయుక్తాక్షరాలను పలకలేరు. “లైఫ్‌లైన్” అనే పదాన్ని “రైఫురైను” అంటారు. తెలుగు వారు coffeeని కాఫీ అంటారు. ఇంగ్లీషులో Fanలో ఫా అక్షరం తెలుగులో లేనట్టే జపనీస్ లోనూ లేదు. అందుకే వారు coffee ‘కొహి’ అంటారు” (జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర, పుట-36).

అయితే అన్ని భాషలు తమ తమ భాషల్ని వ్యాపింప చేయటానికి ప్రాధాన్యం ఇవ్వగా జపాన్ వారు ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తారు. ఏ విదేశీయుడైనా అనర్గళంగా జపనీస్‌ను మాట్లాడితే జపాన్ వారు ఆనందించరంటూ వారి భాషాభిమానాన్ని గురించి తన జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర అనే యాత్రాగ్రంథంలో పేర్కొన్నారు రచయిత.

వేమూరి బలరామ్ గారు రష్యాను పర్యటించిన సందర్భంలో వీరి భాషాంశాలను గురించి వివరిస్తూ కజక్ రష్యన్ల అధికార భాష అయినా, ఎక్కువ శాతం మంది రష్యన్ మాట్లాడతారని, చాలా మందికి కజక్ భాష రాదని పేర్కొన్నారు. కారణం కజక్ లిపి అరబ్బీ, టర్కీ భాషల లిపులకు దగ్గరగా ఉండటమే. ప్రాచీన్ సిల్క్ రోడ్డులోని ప్రాంతమైన కిర్గిజిస్థాన్‌లో రష్యన్, కిర్గిజ్ భాషలను రెండింటినీ మాట్లాడతారని, అందుకే ఆ రెండు భాషల్లోనూ కిర్గిజ్‌లో విద్యాబోధన జరుగుతుందని సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర గ్రంథంలో పరవస్తు లోకేశ్వర్ గారు తెలిపారు.

## 5.3. రాజకీయ మరియు పరిపాలనాంశాలు

యాత్రాచరిత్రల్లో అనేక సమాజాలకు చెందిన చారిత్రక, సాంస్కృతికాంశాలు నిక్షిప్తమైనట్లుగానే అనేక  రాజకీయాంశాలు కూడా కన్పిస్తాయి. స్థానిక రాజకీయాల పట్ల,

పరిపాలనాంశాల పట్ల జిజ్ఞాస కలిగిన అతికొద్ది మంది యాత్రాకారుల యాత్రాచరిత్రల్లో మాత్రమే ఆయా ప్రాంతాల పరిశోధనాంశాలు కన్పిస్తాయి. తాము సందర్శించే ప్రాంతపు చరిత్ర, రాజకీయాల పట్ల అవగాహన, ఆసక్తి ఉన్నవారు మాత్రమే తాము దర్శించిన ప్రాంతాల పరిపాలనాంశాలను తెలుసుకొని, వాటిని తమ యాత్రా గ్రంథాల్లో నిక్షిప్తం చేయగలరు. తెలుగులో కూడా అతికొద్దిమంది యాత్రాకారులు మాత్రమే తాము దర్శించిన ప్రాంతాల పరిపాలనాంశాలను లిపిబద్ధం చేశారు. అందులో ముందుగా చెప్పుకోవల్సిన వారు వేమూరి బలరాం గారు. వీరు రాష్ట్రపతి, ప్రధానులతో చేసిన రాజకీయ యాత్రల ఫలితంగా వీరి యాత్రాచరిత్రలో వివిధ దేశాలకు సంబంధించిన రాజకీయాంశాలెన్నో విరివిగా కన్పిస్తాయి.

ఇటలీలోని రాజకీయాలు ఎలా ఉన్నాయో చెప్తూ ఈవిధంగా వివరించారు. "పారిశ్రామికంగా ఉన్నతంగా వున్న ఏడు ప్రపంచ దేశాలలో ఇటలీ ఒకటి. అంతర్జాతీయంగా ఇటలీకి పలుకుబడి అంతగా లేకపోవడానికి కారణం అక్కడి రాజకీయ అనిశ్చిత వాతావరణమే. మాఫియా ముఠాలకు, రాజకీయ అవినీతికి నిలయం ఇటలీ. ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలలో రాజకీయ నాయకుల అవినీతి భాగోతం ఇటలీలో బయట పడినట్టుగా మరెక్కడా బయటపడలేదు" (రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు, పుట-59).

క్రీస్తు పూర్వం నుండే చరిత్రలో నిలిచిన ఈ దేశం రాజకీయాలకు నిలయం. రోమన్ సామ్రాజ్య పాలన నుండే ఇటలీ రాజకీయాలకు ప్రసిద్ధి గాంచింది. మజినీ, గారిబాల్డీల నాయకత్వంలో ఈ రాజకీయాల పరంపర కొనసాగింది. అయితే రెండవ ప్రపంచ యుద్ధానంతరం మస్సోలినీ నియంతృత్వ పరిపాలనకు తెరపడి, 1946లో ఇటలీ రిపబ్లిక్ గా అవతరించాకే ఇటలీ రాజకీయాలు కొత్త ఊపిర్లు పోసుకున్నాయి.

అలాగే సోవియట్ యూనియన్ నుండి విడిపోయిన ఉజ్బెకిస్తాన్ దేశాన్ని గురించి వివరిస్తూ, ఉజ్బెకిస్తాన్ స్వతంత్ర దేశంగా మనుగడ సాగించేందుకు ఎన్నో సమకూర్చుకోవాలని, స్థానిక పోలీసు వ్యవస్థ నుంచి, దేశ రక్షణ దళాల వరకూ ఎన్నో

ఏర్పాట్లు చేసుకోవాలని పేర్కొన్నారు. సోవియట్ యూనియన్ పతనానంతరం విడిపోయి స్వతంత్ర దేశాలుగా ప్రకటించుకున్న దేశాల పరిస్థితి అంతా ఉజ్బెకిస్తాన్ దేశం మాదిరే ఉందంటూ విచారం వ్యక్తం చేశారు. అయితే 1991లో కజక్ కూడా స్వాతంత్ర్యాన్ని పొందాక కజక్, ఉజ్బెకిస్తాన్ దేశాలు కమ్యూనిజానికి తిలోదకాలిచ్చాయంటూ తన పర్యటన కాలంలోని విషయాలను తన యాత్రాగ్రంథంలో వేమూరి బలరామ్ గారు వివరించారు.

ప్రపంచంలో అనేక దేశాల రాజకీయాల్లో జపాన్ వారి రాజకీయ విధానానికి ఒక ప్రత్యేక స్థానముంది. నేడు ఒకవైపు రాచరికాన్ని, మరోవైపు ప్రజాస్వామ్యాన్ని అవలంభించే జపనీయులు ఒకప్పుడు ఫ్యూడల్ రాజకీయాలకు బద్ధులు. జపాన్ దేశ పాలనా వ్యవస్థలో అస్థిరత కన్పించిందని, అందుకే ప్రపంచ రాజకీయ పటంలో క్రియాశీలక పాత్రను పోషిస్తున్నారని రంగనాయకులు గారు 'జపాన్–ఒక నాగరక జైత్రయాత్ర' గ్రంథంలో పేర్కొన్నారు. "నేడు జపాన్ పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభలో రెండు వ్యవస్థలున్నాయి. ప్రజలెన్నుకునే పార్లమెంట్ సభ్యులు 486 మంది ఉంటారు. వీర సమావేశాన్ని 'జైబుత్సు' అంటారు. ఉచ్చసభలో 250 మంది సభ్యులుంటారు. వీరిలో సగం మంది చొప్పున ప్రతీ మూడు సంవత్సరాలకొకసారి ఎన్నికవుతారు. ఇరవై సంవత్సరాల వయస్సు నిండిన వారందరికీ ఓటు హక్కు లభిస్తుంది. బౌద్ధంలోని నిచిరెన్ శాఖ సోకాగక్కాయ్ పేరుతో రాజకీయాలలో పాల్గొంటుంది. జపనీస్ సోషలిస్ట్ పార్టీ కమ్యూనిస్టు వామపక్ష భావాలతో అటువంటి రాజకీయాలకే వత్తాసు పలుకుతుంటారు. ఏదేమైనా ప్రజల భాగస్వామ్యం ప్రభుత్వంలో గణనీయంగా పెరిగింది" (జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర, పుట–25). తాను దర్శించిన కాలంనాటి జపాన్ వారి పరిపాలనా విశేషాలను పేర్కొన్నారు రచయిత. అంతేగాక జపాన్ వారివి పరిణితినొందిన రాజకీయాలంటూ కితాబిచ్చారు.

నేషనల్ డైట్ గా పిలిచే జపాన్ వారి పార్లమెంటులో ప్రస్తుతం 242 మంది ఎగువసభలోనూ, ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడిన 475 మంది దిగువ సభలో ఉన్నారు.

భారత్, జపాన్, బ్రిటన్‌ల మాదిరిగానే పాక్ పార్లమెంట్ కూడా రెండుగా విభజితమై ఉందని పాకిస్తాన్‌లో భారత శాంతి ప్రతినిధి వర్గంలో ఒక సభ్యునిగా పర్యటించిన

యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు పేర్కొన్నారు. "మన లోక్‌సభను పాక్‌లో జాతీయ అసెంబ్లీ అని, రాజ్యసభను సెనేట్ అని ఉభయ సభలను పార్లమెంట్ అనీ వారు పిలుస్తారు. జాతీయ అసెంబ్లీలో 342మంది సభ్యులు, సెనేట్ లో 100 మంది ఉంటారు. ఈ 442 మంది సభ్యులను ఉద్దేశించి పాకిస్తాన్ అధ్యక్షుడు జర్దారీ చేసే ప్రసంగాన్ని మేము తిలికించాం. మన వద్ద ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి చేసే ప్రసంగం సరిగ్గా అనుకున్న సమయానికి ప్రారంభమవుతుంది కానీ పాకిస్తాన్‌లో ఈ సమయాన్ని ఖచ్చితంగా పాటించరు" (పాకిస్తాన్‌లో పదిరోజులు, పుట-51).

పాక్‌లో స్త్రీలకు రాజకీయాల్లో జోక్యం తక్కువని ప్రపంచం భావిస్తుంది. కానీ అన్ని దేశాల్లాగే పాకిస్తాన్‌లో కూడా మహిళలు రాజకీయాలతో సహా అన్ని రంగాల్లో ముందున్నారని సోదాహరణంగా వివరించారు రచయిత. పాక్ జాతీయ అసెంబ్లీలో 342 మంది సభ్యుల్లో 70 మంది మహిళలున్నారని, పాక్ చట్టసభల్లో 17 శాతం స్త్రీలకు రిజర్వేషన్ ఉందని పేర్కొన్నారు. మతఛాందస భావజాలం ఉన్న పాకిస్తాన్‌లో పాక్ మహిళలు రాజకీయ రంగాన్ని శాసించే స్థాయికి చేరటం శ్లాఘనీయం.

### 5.4. కుటుంబం

కుటుంబం మనుషులను ఒకటిగా చేసే ప్రాథమిక సంబంధం. సమాజంలో ఒక వ్యక్తికి గుర్తింపును, సుస్థితిని ఏర్పాటు చేసే వారధి కుటుంబం. వ్యక్తుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్ది సమాజంలో ఉత్తమ పౌరులుగా వారిని నిలబెట్టేది కుటుంబమే. పసితనం నుంచి కుటుంబాలు నేర్పించే విలువలు వల్లే చక్కటి సమాజం తయారుకాగలదు. ఒక స్త్రీ పురుషుని యొక్క కలయికతో ఏర్పడిన కొన్ని కుటుంబాల కలయికే సమాజం. కుటుంబ వ్యవస్థ భారతదేశంలోనే గాక అనేక దేశాలలో కూడా బలంగా ఉన్నదనే విషయం యాత్రాచరిత్రల ద్వారా స్పష్టమవుతుంది.

ముఖ్యంగా భారత్ లాగే ఎక్కువ జనసాంద్రత కలిగిన దేశమైన చైనాలో కూడా కుటుంబ వ్యవస్థ అతి బలమైనదిగా చెప్పవచ్చు. భారతదేశం లాగా వ్యవసాయిక

దేశమేగాక, ఉమ్మడి కుటుంబాలకు నిలయంగా కూడా చైనా ముందుండటం చెప్పుకోదగ్గ విషయం. చైనీయుల కుటుంబ వ్యవస్థను గురించి కురుగంటి శ్రీలక్ష్మీగారు తన యాత్రాగ్రంథంలో ఈ విధంగా పేర్కొన్నారు.

"చైనీయుల్లో ఉమ్మడి కుటుంబాలు మనలాగే ఎక్కువగా ఉండేవనేది బంధుత్వానికి సంబంధించిన భాషా పదాల్ని పరిశీలిస్తే (వీళ్ళ భాషలో దగ్గర దగ్గర 25 పదాలున్నాయి) తెలిసింది. అమ్మా, నాన్న, అత్తా, మామ, తాత, మామ్మ, అమ్మమ్మ, తల్లివైపు తాత, అక్కా తమ్ముడు, చెల్లి, అన్నా, ఇలా వీటన్నింటికీ భిన్న పదాలు కనిపిస్తాయి. ఇంగ్లీషులో ఆంటీ, అంకుల్, గ్రాండ్ మదర్, గ్రాండ్ ఫాదర్ లా కాకుండా ఉదాహరణకి తండ్రివైపు నాయనమ్మను నాయ్‌నాయ్ అని, తాతను యెయ్యే అనీ, అత్తను కుమా అనీ అంటారు. తల్లివైపు అమ్మమ్మని వైపో అని, తాతని వైగాంగ్ అని, పిన్నిని యీమా అని అంటారు. కుటుంబ వ్యవస్థలోని వ్యక్తులందరికి ఎవరికి తగిన స్థానం వాళ్ళకివ్వడం తద్వారా మమతానుబంధాల్ని పెంచుకుని, కష్టాల్లో సుఖాల్లో వాళ్ళ ఆసరాతో అవలీలగా జీవన యానం సాగించే విధానంలోని ఐక్యత ఆసియా ఖండంలోని వీళ్ళ జీవన విధానానికి వర్తిస్తుంది" (షంఘై నింగిలో, పుట-30). భారతదేశంలోని అన్ని భాషల్లో బంధుత్వ బోధక పదాలు ప్రత్యేకంగా ఉన్నట్లే చైనీయులకు కూడా ఉండటం గమనించదగ్గ విషయం. దీనిని బట్టి ఈ రెండు దేశాలు భాషలో, సంస్కృతిలో సామ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పవచ్చు. ఇవేగాక చైనీయుల జానపద కథలు, పండుగలన్నీ కూడా కుటుంబ సంస్కృతి ప్రాధాన్యాన్ని తెలియపరిచేవే.

ప్రపంచంలోని అనేక దేశాల్లో రాచరికం అంతరించి ప్రజాస్వామ్యం ఏర్పడినా, రాజకీయాలు మాత్రం కుటుంబాల పరంగా, వారసత్వ పరంగా రావడం మానలేదు. భారతదేశంలో లాగే పాకిస్తాన్‌లో కూడా కుటుంబ వారసత్వం తరతరాలుగా పాక్ రాజకీయాలను నడిపిస్తుందంటూ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ గారు పేర్కొన్నారు. "మెజార్టీ పాకిస్తాన్ రాజకీయ పార్టీలు వారసత్వం ఆధారంగా కొనసాగుతున్నాయి. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీని భుట్టో కుటుంబం నిర్వహిస్తే, పాకిస్తాన్ ముస్లిం లీగ్ (ఎన్) పార్టీని నవాజ్ షరీఫ్

కుటుంబం నిర్వహిస్తుంది. ఇక సరిహద్దు ప్రాంతాల్లో బలం ఉన్న ఆవామీ జాతీయ పార్టీ కూడా వలీఖాన్ కుటుంబానికి చెందినదే. ఈ కారణాల వల్లనే బెనజీర్ భుట్టో పాకిస్తాన్‌లో పురుషాధిక్య సమాజం ఉన్నప్పటికీ, సంప్రదాయం, సమాజం కొనసాగుతున్నప్పటికీ రాజకీయ వ్యవస్థలో ఉన్నత స్థానానికి ఎదగగలిగారు. అది వారసత్వ బలమే కానీ, మహిళల చైతన్యం వల్ల వచ్చిన అధికారం కాదు ... కుటుంబ విధేయత మూలంగా పాకిస్తాన్ సమాజం ఇస్లామిక్ విప్లవం ద్వారా తీవ్ర మార్పులు చేసే ప్రయత్నాలను ఎప్పటికప్పుడు ఎదుర్కొంటూ వచ్చింది. గ్రామాల్లోనూ, పట్టణాల్లోనూ, వ్యాపార, రాజకీయ, నేర ముఠాలు పరస్పర సంబంధాల ద్వారా, వివాహాల ద్వారా బలపడి పాక్ సమాజంలో ఒక విస్తృత కుటుంబ ఆధిపత్యాన్ని కొనసాగించాయి" (పాకిస్తాన్‌లో పదిరోజులు, పుట-79).

కుటుంబాన్నే గాక, వాటికి సంబంధించిన బంధుత్వాలు కూడా అక్కడి రాజకీయాలను శాసించే శక్తులుగా ఉన్నాయి. ఇక్కడ డబ్బు కంటే కుటుంబానికి, బంధుత్వాలకే ప్రాధాన్యం. అందుకే పాక్ లోని రాజకీయ వ్యవస్థలో కుటుంబం మరియు బంధుత్వం పాత్ర అధికం.

ఇలా భిన్న సమాజాలకు సంబంధించిన విశేషాలను తమ యాత్రాచరిత్రల్లో యాత్రాకారులు ఆసక్తిగానూ, ఆలోచనాత్మకంగానూ అక్షరీకరించారు యాత్రాకారులు. వీటిని చదివిన పాఠకులకు ఇవి విషయ జ్ఞానాన్ని అందివ్వడమేకాక, తాను చదివిన సమాజం ఎలా ఉండాలో ఆలోచించుకునే పరిణితిని యాత్రాచరిత్రలు పాఠకునికి కల్పిస్తున్నాయి.

# ముగింపు

మానవుని మనో వికాసానికి, మేధో వికాసానికి కారణమైన తన మనుగడను సుఖవంతం చేసుకోవడానికి జీవన పరిణామ క్రమంలో దినదినాభివృద్ధి సాధించడానికి ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి ప్రయాణం చేస్తూ సంచార జీవితాన్ని గడిపేవాడు. స్థిరనివాసం ఏర్పరచుకుని, సంఘజీవనం మొదలైన తరువాత ఆహార అన్వేషణకై, అవసరాల నిమిత్తమై వివిధ ప్రాంతాలకు వెళ్ళటం అనే రూపంలో వారి సంచారతత్వం గోచరిస్తుంది. ఈ విధంగా మనిషి పరిణామ క్రమంలో దశలవారీగా కనిపించిన ఈ సంచార లక్షణమే ఆధునిక కాలంలో ఆహ్లాదం కోసం, వినోదం కోసం వివిధ ప్రాంతాలను సందర్శించడమనేదిగా కన్పిస్తోంది. దీనినే 'యాత్ర' గా పరిగణిస్తూ, ఆ 'యాత్ర'లో యాత్రికుడికి తారసపడిన అనేక అంశాలను అక్షరబద్ధం చేసే ఒక సాహిత్యరూపంగా 'యాత్రా చరిత్ర' కనిపిస్తోంది.

యాత్రాచరిత్ర రచనకు అనుభవం, అనుభూతి ప్రధానం. ఏ యాత్రికుడైతే తన యాత్రను సంపూర్ణంగా అనుభవిస్తాడో, అతడు రాసిన యాత్రాచరిత్రలు పాఠకుల హృదయాలను స్పందింప చేస్తూ పాఠకునిలో ఆ స్పందనలు కలుగ చేసేదే సాహిత్యం. యాత్రాచరిత్ర అనుభూతి పూర్వకమైన సాహిత్య ప్రక్రియ. నవల, కథానిక, వ్యాసం, స్వీయ చరిత్ర మరియు జీవిత చరిత్రల వంటి ప్రక్రియల్లాగే ఇది కూడా పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది.

యాత్రాచరిత్ర ఆధునిక సాహిత్య ప్రక్రియ. ప్రధానంగా వచన ప్రక్రియ. అయితే పద్యాల్లోనూ, కవిత్వంలోనూ, నవలా రూపంలోనూ, యాత్రానుభవాల్ని పొందుపరచడం కూడా కన్పిస్తుంది. యాత్రాచరిత్రల రచన ద్వారా రచయిత తన యాత్రానుభూతిని అక్షరాల్లో బంధించి, ఆ అక్షరాలతో పాటూ పాఠకుడు కూడా యాత్ర చేస్తున్నట్లుగా ఊహాలోకానికి తీసుకెళ్తాడు. కథానిక, నవల వంటి సృజనాత్మక సాహిత్య ప్రక్రియల లక్షణం కూడా అదే. నవల, కథానికల్లోని ఇతివృత్తంతో పాటూ పాఠకుడు మమేకం అయినట్లే, యాత్రాకారుని అనుభూతితో కూడా పాఠకుడు మమేకం అయి సాగిపోతాడు.

అయితే సృజనాత్మక ప్రక్రియల్లో రచయిత వర్ణించే వస్తువు కల్పితం. ఆ కల్పితంతోనే పాఠకుడు ప్రయాణించి, ఆనందాన్ని పొందుతాడు. కానీ యాత్రాచరిత్రలో రచయిత వర్ణించే సంఘటనలు వాస్తవం. ఆ వాస్తవిక ప్రపంచంలోకి రచయితతో పాఠకుడు కూడా ప్రత్యక్షంగా యాత్ర చేస్తున్నట్లుగా అనుభూతి చెందడం ఈ ప్రక్రియ విశిష్టత. తన ప్రయాణంలో కలిగిన అనుభవాలను, అనుభూతులను వర్ణనాత్మకంగా, కళాత్మకంగా, కవితాత్మకంగా మరియు కథనాత్మకంగా వ్యక్తీకరించగల సాహిత్య ప్రక్రియగా గుర్తించదగిన లక్షణాలు అడుగడుగునా కనిపిస్తూనే వుంటాయి. యాత్రా విశేషాల్ని నిబద్ధం చేసే క్రమంలో ప్రతీ యాత్రాచరిత్రలో సాహిత్యం పాత్ర ఎంతో కొంత ఉండనే ఉంటుంది. పదాల వాడకంలోనూ, వ్యక్తీకరణలోనూ, నివేదనా పద్ధతిలోనూ ఇది కన్పిస్తుంది.

అయితే యాత్రాచరిత్ర బహుళ జనాదరణ పొందిన సాహిత్య ప్రక్రియే అయినప్పటికీ ఇందులో చారిత్రక, సాంస్కృతికాంశాల ప్రతిఫలనం కూడా ఎక్కువే. గతకాలపు సంఘటనలను, స్మృతులను, చారత్రక జ్ఞానాన్ని పాఠకులకు చేరవేయడంలో ఇవి ముందంజలో ఉన్నాయి. చరిత్రను అర్థం చేసుకోవడానికి అన్వేషించటానికి తెలుగు యాత్రాచరిత్రలు ఇతోధికంగా ఉపయోగపడుతున్నాయి. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన సంఘటనలను, వాటి వెనుక గల నేపథ్యాలను, చీకటి కోణాలను తెలుగు యాత్రాచరిత్రలు చర్చించాయి. అయితే చాలా మటుకు యాత్రాకారులు చారిత్రక కట్టడాల ఆధారంగా మాత్రమే ఒక ప్రాంతపు చరిత్రను వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఆయా ప్రాంతాల చరిత్రను బహిర్గత పరిచే నాణేలు, శాసనాలు, శిల్పాలు, పనిముట్లు వంటి చారిత్రక ఆధారాల పట్ల ఆసక్తి చూపించలేదు. అందుకనే వీటిని గుర్తించిన వివరణలు వారి యాత్రాచరిత్రల్లో మృగ్యమయ్యాయి. వాటిని కూడా రచయితలు వివరించినట్లయితే ఆయా ప్రాంతాల విశిష్టతను చాటే మరింత విలువైన సమాచారం మనకు లభ్యమయ్యేది.

చారిత్రకాంశాలనే గాక ఒక ప్రాంతానికి చెందిన సంస్కృతిని కూడా గ్రంథస్థం చేయడంలో తెలుగు యాత్రా చరిత్రలు సఫలీకృతమయ్యాయని చెప్పవచ్చు. ఇవి విభిన్న సమాజాలకు చెందిన సంస్కృతుల విశిష్టతను, వైవిధ్యాన్ని తెలియచేయడమే కాక, ఆయా సంస్కృతులకు గౌరవాన్ని, విలువను పెంచుతున్నాయి.

అయితే కొన్ని యాత్రా చరిత్రలు చరిత్ర పట్ల రచయితకు గల అవగాహనా రాహిత్యాన్ని తెలియ చేస్తున్నాయి. ముఖ్యంగా సంవత్సరాల్ని ఉటంకించే సందర్భాల్లో, ఆయా కట్టడాల వెనుకగల చారిత్రక నేపథ్యాన్ని వివరించే క్రమంలో ఈ విషయాన్ని గమనించవచ్చు. ఒక ప్రాంతానకి సంబంధించి తన పూర్వపు రచయిత ఏమి రాశారో, దానినే యథాతథంగా గ్రహించి తమ యాత్రాగ్రంథాల్లో పొందుపరిచినటువంటి యాత్రాగ్రంథాలు కూడా ఉన్నాయి. యాత్రాసాహితీ రంగంలో లబ్ధప్రతిష్టులుగా ప్రసిద్ధి చెందిన కొద్దిమంది యాత్రారచనల్లో పరిపక్వత కనిపించకపోవడం గమనార్హం. అంటే వీరు దర్శించిన ప్రాంతాన్ని గురించి కాకుండా, తాము కలుసుకున్న వ్యక్తుల గురించి, వారి పూర్వ రచనల గురించి సోత్కర్ష చెప్పుకున్నారు. ఇది హర్షించదగ్గ అంశం కాదు. రచయిత అనుభవాల ద్వారా యాత్రానందాన్ని పొందాలనుకునే పాఠకునికి ఇటువంటి రచయితల తీరు అసంతృప్తిని కలిగిస్తుందని చెప్పవచ్చు.

మరికొద్ది మంది సాహితీవేత్తల యాత్రాచరిత్రల్లో యాత్రా విశేషాల కంటే సాహిత్య ఉటంకింపులు ఎక్కువగా కన్పించాయి. ఇవి పాఠకునికి పంటి కింద రాయిలా అనిపిస్తాయి. మరికొంత మంది రచనలో, భాషా నివేదనలో సమస్య కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది. ముఖ్యంగా సృజనాత్మక ప్రక్రియలో ఆరితేరిన కొద్దిమంది రచయితల యాత్రారచనలు యాత్రా మార్గదర్శకాలుగా అనిపించడం చెప్పుకోదగ్గ విషయం. అంటే అనుభూతి స్పర్శ వీరి యాత్రా చరిత్రల్లో లోపించడమే దానికి కారణం. ఏదేమైనప్పటికీ మనసును రంజింపచేసే విషయ జ్ఞానాన్ని పెంపొందించే యాత్రాచరిత్రలు కూడా ఎన్నో తెలుగులో వెలువడ్డాయి.

రెండువేల సంవత్సరాల చరిత్ర కలిగినటువంటి తెలుగు సాహిత్య పరిణామంలో ఎన్నో ప్రక్రియలు వెలువడ్డాయి. వీటన్నింటిలో ఒక కాలంనాటి సామాజిక, సాంస్కృతిక, చారిత్రక అంశాలను ఆధారంగా చేసుకుని వివిధ ప్రక్రియల్లో రచనలు వచ్చాయి. కానీ చారిత్రక, సాంస్కృతికాంశాలను ఆధారాలతో సహా విశ్లేషించిన ఒకే ఒక్క సాహిత్య ప్రక్రియ యాత్రాచరిత్ర.

# ఆధార గ్రంథాలు


1. ప్రభావతి, గుడివాడ. రవికృష్ణ. 2011. అదిగో భద్రాద్రి (విద్యార్థుల యాత్రా స్మృతుల సంకలనం). గుంటూరు: స్వీయప్రచురణలు.
2. సుజాతారెడ్డి, ముదిగంటి. 2011. అద్భుత చైనాయాత్ర. హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.
3. గోపీనాథ్, అమళ్ళదిన్నె. 2006. అనంతపురం జిల్లా విజ్ఞాన, విహార దర్శిని, సంలకనం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. వెంకట కృష్ణమూర్తి, మల్లాది. 1992. అమెరికా (30 రోజుల అమెరికా పర్యటన, అనుభవాలు). హైదరాబాద్: మల్లాది లిపి ప్రచురణలు.
5. గోపీ, ఎన్. 2006. అమెరికాలో తెలుగు యాత్ర. హైదరాబాదు: చైతన్య ప్రచురణలు.
6. వెంకట కృష్ణమూర్తి, మల్లాది. 2008. అమెరికాలో మరోసారి. లిపి పబ్లికేషన్స్.
7. సుధాకర్, ఎండ్లూరి. 2006. 'ఆట' జనికాంచె (అమెరికా యాత్రా కవితలు). రాజమండ్రి: మానస మనోజ్ఞ ప్రచురణలు.
8. వేంకటరావు, నిడదవోలు. 1962.ఆంధ్ర కర్నాట సారస్వతములు – పరస్పర ప్రభావము.
9. శ్రీనివాసరావు, కొమ్మినేని. 2000. ఆంధ్ర టు అమెరికా. హైదరాబాద్: స్వీయప్రచరుణ.
10. చెన్నారెడ్డి, పెదారపు. 2012. ఆంధ్రప్రదేశ్ లో పర్యాటకం. హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
11. రామకృష్ణ, నటరాజ. 2012. ఆంధ్రుల నాట్యకళ. హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
12. సుజాతారెడ్డి, ముదిగంటి. 2007. ఆంధ్రుల సంస్కృతి–సాహిత్య చరిత్ర. హైదరాబాద్: తెలుగు అకాడెమి.

13. ప్రతాపరెడ్డి, సురవరం. 2013. ఆంధ్రుల సాంఘిక చరిత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
14. రామారావు, ఆడిదం. 1995. ఆడిదం సూరకవి-జీవితం, చైన్నై: వావిళ్ళ రామస్వామి &సన్స్.
15. నరేంద్ర, మధురాంతకం. 2013. ఆమ్‌స్టర్‌డాంలో అద్భుతం. తిరుపతి: కథాకోకిల ప్రచురణలు.
16. వెంకటేశ్వరరావు. ఆర్. 2010. ఆర్వియార్ సాహిత్య వ్యాసాలు, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
17. జనార్ధనరావు, తంగెడ. 2012. ఆస్ట్రేలియా. వరంగల్: ప్రజాహిత ప్రచురణలు.
18. చలం, కె..ఎస్. 2015. ఇండియాలో సామాజిక పరిణామం. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
19. రాహుల్ సాంకృత్యాయన్, తులసి చాగంటి (తెలుగు సేత). 2013. ఓల్గా నుంచి గంగకు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
20. కుసుమారెడ్డి, కె. 2008. కన్యాకుమారి దీపకళిక (దక్షిణదేశ యాత్రా విశేషాలు), హైదరాబాద్: స్వీయ ప్రచురణలు.
21. లోకేశ్వర్, పరవస్తు. 2014. కలల దారులలో యూరపు యాత్ర. హైదరాబాద్: గాంధి ప్రచురణలు.
22. సతీష్ కుమార్, రాధాకృష్ణ, వేమూరి(అనువాదకులు). 1968. కానీ లేకుండా కాలి నడకన ప్రపంచయాత్ర. హైదరాబాద్: శ్రీనివాస ప్రకాశన సమితి.
23. వీరస్వామయ్య, ఏనుగుల. 2015. కాశి యాత్ర చరిత్ర. న్యూఢిల్లీ: రీమ్ పబ్లికేషన్స్.
24. కృష్ణకుమారి, నాయని. 1978. కాశ్మీర దీపకళిక హైదరాబాద్: స్వీయ ప్రచురణ.
25. రఘు, ఎస్(సంపాదకులు). 2010. గోపి సాహిత్య వివేచన. హైదరాబాద్: అభవ్ ప్రచురణలు.

26. కార, ఇ.హెచ్. (మూలం), వెంకట సుబ్బయ్య వల్లంపాటి (అనువాదం). 1984. చరిత్ర అంటే ఏమిటి. హైదరాబద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

27. 2000. చరిత్ర – చరిత్ర రచనా పద్ధతి. హైదరాబాద్: అంబేద్కర్ బి.ఆర్. సార్వత్రిక విశ్వవిద్యాలయం.

28. చేగువేరా. 2010. చేగువేరా మోటార్ సైకిల్ డైరీ, హైదరాబాద్: ప్రజాశక్తి బుక్ హౌస్.

29. లోకేశ్వర్, పరవస్తు. 2011. ఛత్తీస్ ఘడ్ స్కూటర్ యాత్ర. హైదరాబాద్: గాంధీ ప్రచురణలు.

30. రంగనాయకులు, పి.వి. 2002. జపాన్ ఒక నాగరక జైత్రయాత్ర. తిరుపతి: స్వీయ ప్రచురణలు.

31. గోపి, ఎన్. 2015. జర్మనీలో కవితాయాత్ర. హైదరాబాద్: అభవ్ ప్రచురణలు.

32. వెంకట కృష్ణమూర్తి, మల్లాది. 2011. ట్రావెలాగ్–దుబాయ్, టర్కీ, గ్రీస్. హైదరాబాద్: లిపి పబ్లికేషన్స్.

33. సుధారాణి, సగిలి. 2012. తమిళనాట తెలుగు ప్రజలు – జానపదవిజ్ఞానం. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

34. గోపీకృష్ణ. 2012. తిరుమల తిరుపతి క్షేత్రములు, హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

35. సుధాకర్. ఎండ్లూరి. 2017. తెలివెన్నెల [సాహిత్య వ్యాసాలు], రాజమండ్రి: మానస మనోజ్ఞ ప్రచురణలు.

36. రామచంద్రరావు, సి.వి., భాస్కర చౌదరి, బి., కేతు విశ్వనాథరెడ్డి (సంపాదకులు). 2008. తెలుగు చరిత్ర సంస్కృతి (ఆంధ్రప్రదేశ్ అవతరణ దశ వరకు). హైదరాబాద్: తెలుగు అకాడమి.

37. శ్రీనివాస్, శిష్ట్లా. 2012. తెలుగు చిత్రకళ, హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

38. వెంకటేశ్వరరెడ్డి, అన్నపరెడ్డి. 2012. తెలుగు నేల నేలిన బౌద్ధం. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

39. 2008. తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర, హైదరాబాద్: అంబేద్కర్ బి.ఆర్. సార్వత్రిక విశ్వవిద్యాలయం.

40. సుబ్రమణ్యం, పల్లెబోయిన., శివానాగిరెడ్డి, ఈమని. 2012. తెలుగు వారి దేవాలయాలు. హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

41. ఆదినారాయణ, ఎమ్. 2016. తెలుగు వారి ప్రయాణాలు. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్ ప్రచురణలు.

42. సుబ్రహ్మణ్యం బండారు. 2012. తెలుగునేలపై పురావస్తు పరిశోధనలు. హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

43. హరిదాసు, మచ్చ. 1992. తెలుగులో యాత్రాచరిత్రలు. కరీంనగర్: ఇందు ప్రచురణలు.

44. 1992. తెలుగువాణి, ఉగాది ప్రత్యేక సంచిక. హైదరాబాద్: తెలుగు అకాడమీ ప్రచురణ.

45. అనంతలక్ష్మి. 2012. తెలుగువారి నోములు-వ్రతాలు. హైదరాబాద్: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

46. భుజంగరావు, ఆచారి(అనువాదం). 2015. దివోదాసు – లోక సంచారి, విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

47. అశ్వినికుమార్, వి. 2003. దూరతీరాలలో. విజయవాడ: స్వీయ ప్రచురణలు.

48. క్రిష్ణయ్య, కేకలతూరి. 2008. దేశవిదేశీ యాత్రా విశేషాలు. హైదరాబాద్: అక్యురేట్ ప్రింటర్స్.

49. ఇందిరా కామేశ్వరి, గుడిపాటి. 2008. ద్వాదశ జ్యోతిర్లింగాలు – సంకలనం.విజయవాడ: శ్రీ గణేష్ బుక్ హౌస్.

50. వెంకట కృష్ణమూర్తి, మల్లాది. 2009. నర్మదపరిక్రమ. హైదరాబాద్: లిపి పబ్లికేషన్స్.

51. గోపాల కృష్ణమూర్తి, ఆవుల. 2014. నా అమెరికా పర్యటన. హైదరాబాద్: తెలుగు ప్రింట్ పబ్లికేషన్స్.

52. సుబ్బమ్మ, మల్లాది. 1995. నా అమెరికా పర్యటనానుభవాలు – తానా సభల విశేషాలు. హైదరాబాద్: మహిళాభ్యుదయ సంస్థ.

53. వెంకటపతిరాయలు పాటిబండ్ల. 2005. నా ఉత్తరభారత యాత్రా విశేషాలు. హైదరాబాద్: పాటిబండ్ల ప్రచురణలు.

54. 2013. నా ఐరోపాయాత్ర. హైదరాబాద్: స్వామి వివేకానంద, రామకృష్ణ మఠం.

55. రాజేష్, వేమూరి. 2016. నా ఐరోపాయాత్ర. ఘంటసాల: మన ఘంటసాల ప్రచురణలు.

56. బుద్ధప్రసాద్, మండలి. 2006. నా జర్మనీయానం. విజయవాడ: ఎమెస్కో బుక్స్.

57. వెంకటపతిరాయలు, పాటిబండ్ల. 2005. నా దక్షిణ భారత యాత్రా విశేషాలు. హైదరాబాద్: పాటిబండ్ల ప్రచురణలు.

58. వెంకటపతిరాయలు, పాటిబండ్ల. 2005. నా దక్షిణ భారతయాత్రా విశేషాలు. హైదరాబాద్: పాటిబండ్ల ప్రచురణలు.

59. మంచికంటి. 2014. నా సైకిల్ యాత్రాదర్శనం, ప్రకాశం: శాంతివనం ప్రచురణలు.

60. గోపి, ఎన్. 2001. నాసైప్రస్ యాత్ర. హైదరాబాద్: చైతన్య ప్రచురణలు.

61. గోపి, ఎన్. 1996. నేను చూసిన మారిషస్. హైదరాబాద్: రచన ప్రచురణలు.

62. చినవీరభద్రుడు, వాడ్రేవు. 2011. నేను తిరగిన దారులు, హైదరాబాద్: శ్రీ ప్రచురణ.

63. సుజాతారెడ్డి, ముదిగంటి. 2006. నైలునదీ నాగరికత (ఈజిప్టుయాత్రా కథనం). హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్.

64. లక్ష్మీప్రసాద్, యార్లగడ్డ. 2011. పాకిస్తాన్ లో పదిరోజులు. విశాఖపట్నం: లోక్ నాయక్ ఫౌండేషన్.

65. వెంకట కామేశ్వరరావు, బులుసు. 2004. ప్రమిద సాహిత్య ద్వైమాసిక పత్రిక, సంపాదకుడు. విజయవాడ: వెంకటసత్య ప్రింటర్స్.

66. నవీన్, అంపశయ్య. 2009. ప్రయాణంలో ప్రమదలు. వరంగల్: ప్రత్యూష ప్రచురణలు.

67. అజిత్, హరిసింఘాని., సోమశంకర్ కొల్లూరి (అనువాదం). 2014. ప్రయాణానికే జీవితం (పూనె నుంచి జమ్మూకి మోటార్ సైకిల్ యాత్ర). హైదరాబాద్: స్వీయ ప్రచురణలు.

68. ఉమామహేశ్వరరావు, నిడమర్తి., రామచంద్రారెడ్డి, రాచమల్లు. 2013. ప్రాచీన ప్రపంచ చరిత్ర (అనువాద రచన). హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

69. నాగేశ్వరరావు ఈడ్పుగంటి, బలరామమూర్తి ఏటుకూరు, పట్టాభిరామారావు పరకాల (సంపాదకులు). భారతదేశంలో మతం. హైదరాబాద్: విశాలాంధ్ర విజ్ఞాన సమితి..

70. కొండలరావు, వెలిచాల. 1990. భాష-పరిభాష సాహిత్యం-సంస్కృతి, హైదరాబాద్: తెలుగు అకాడెమీ.

71. ఆదినారాయణ, ఎమ్. 2006. భ్రమణకాంక్ష. విశాఖపట్నం: విశాలాంధ్ర బుక్ హౌస్.

72. వసుంధర. మనదేశపు మహోన్నతలు – నా అనుభవాల ఓనమాలు.

73. విశాలాక్షి, ద్వివేదుల. 1981. మలేసియా నాడు-నేడు. హైదరాబాద్: అంతర్జాతీయ తెలుగు సంస్థ.

74. ఓబుల్ రెడ్డి, బండ్లపల్లె. 2011. మహోన్నత మానవుడు రాహుల్ సాంకృత్యాయన్. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

75. కమలాదేవి, ముళ్ళపూడి. 1972. మా ఉత్తర భారత యాత్ర. తణుకు: శ్రీ నరేంద్రనాథ సాహిత్య మండలి.

76. అన్నపూర్ణ కొమరిగిరి. 1993. మా కాశీ యాత్ర. హైదరాబాద్: స్వీయప్రచురణ.

77. రవీంద్రనాధ్, ముత్తేవి. మా కేరళయాత్ర. తెనాలి: విజ్ఞాన వేదిక పబ్లికేషన్స్.

78. కృష్ణమూర్తి, దేవులపల్లి. 2012. మా యాత్ర. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.

79. ప్రసాద్. ఎమ్.బి.ఎస్. 2006. వెంకటరమణ ముళ్ళపూడి సాహితీ సర్వస్వం (అనువాద రమణీయం) 8వ సంపుటం. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

80. సత్యనారాయణశర్మ పెండ్యాల. 2008. యాత్రా కమలాకరం, విజయవాడ: ఋషి బుక్ హౌస్.
81. హరిదాసు, మచ్చ. 2012. యాత్రాచరిత్రలు. హైదరాబాద్: శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
82. రంగాచార్య, దాశరథి. 2007. యాత్రాజీవనం (ఆలయాలు–అనుభూతులు). హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
83. దక్షిణామూర్తి, పాటిబండ్ల. 2007. యాత్రానందం. హైదరాబాద్: క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్.
84. వెంకట కృష్ణమూర్తి. మల్లాది. 1990. యూరోప్. విజయవాడ: స్రవంతి పబ్లికేషన్స్.
85. బలరాం, వేమూరి. 2006. రాష్ట్రపతి, ప్రధానులతో నా విదేశీ పర్యటనలు. విజయవాడ: ఋషి బుక్ హౌస్.
86. బొమ్మారెడ్డి, వి.ఆర్.రాహుల్ సాంకృత్యాయన్, 1993. విజయవాడ: ప్రజాశక్తి బుక్ హౌస్.
87. రాణీ ప్రసాద్ కందేపి. 2009. విహారం. హైదరాబాద్: స్వాప్నిక్ పబ్లికేషన్స్.
88. వెంకటరెడ్డి, కసిరెడ్డి. 2008. శివమెత్తిన చికాగో (2004లో నా అమెరికా యాత్ర). హైదరాబాద్: జాతీయ సాహిత్య పరిషత్ ప్రచురణలు.
89. వేంకట నారాయణరావు కల్లూరి. 1928. శ్రీ ఆంధ్ర వాఙ్మయ చరిత్రము.
90. సూర్యం, గిడుతూరి. 1976. శ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ప్రపంచ పర్యటన, మైసూరు: శ్రీ గణపతి సచ్చిదానంద ట్రస్ట్ ప్రచురణ.
91. శ్రీలక్ష్మి, కురుగంటి. 2005. షంఘై నింగిలో (అనుభవాల హరివిల్లు). హైదరాబాద్: నవోదయ బుక్ హౌస్.
92. సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశము, 8వ సంపుటం. హైదరాబాద్: ఆంధ్ర రచయితల సహకార సంఘ ముద్రణాలయము.

93. కొండలరావు, వెలిచాల. వీరభద్రయ్య, ముదిగొండ. 1995. సంజీవ్‌దేవ్ వ్యాసాలు – 2. హైదరాబాద్: తెలుగు అకాడెమీ.

94. లావణ్య, సంకలనం. 2005. సంపూర్ణ భారతదేశ యాత్రా దర్శిని, విజయవాడ: జానహిత ప్రచురణలు.

95. వెంకటేశ్వరరావు, దార్ల. 2006. సాహితీ సులోచనం, హైదరాబాద్: తెలుగుసాహిత్య వేదిక ప్రచురణ.

96. ప్రసాద్, ఎ.బి.కె. 2008. సాహిత్యకీయాలు నిబద్ధాక్షరి – 3. విజయవాడ: ఎమెస్కో ప్రచురణలు.

97. లోకేశ్వర్, పరవస్తు. 2013. సిల్క్‌రూట్‌లో సాహసయాత్ర. హైదరాబాద్: గాంధీ ప్రచురణలు.

98. అమరేంద్ర, దాసరి. 1997. స్కూటర్లపై రోహ తాంగ్ యాత్ర. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

99. ఆదినారాయణ, ఎమ్. 2005. స్త్రీ యాత్రికులు. విశాఖపట్నం: శ్రీ సాయికృష్ణ గ్రాఫిక్స్.

100. వెంకటేశ్వరరావు, మైథిలి. 2007. హరిద్వార్, ఋషికేష్, కేదరీనాథ్, బదరీనాథ్ క్షేత్రాల యాత్రాదర్శిని. రాజమండ్రి: జి.వి.ఎస్. సన్స్ ప్రచురణలు.

## తెలుగు నిఘంటువులు

1. రెడ్డి. జి.ఎన్. 2000. ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువు. హైదరాబాద్: తెలుగు అకాడమి.

2. రామకోటయ్య చౌదరి, వెలగా.1996. జ్యోతి హిందీ టూ తెలుగు కోష్. విజయవాడ: వి.జి.యస్. పబ్లికేషన్స్.

3. రెడ్డి, జి.ఎన్. 1990. తెలుగు పర్యాయపద నిఘంటువు. తిరుపతి: సత్యశ్రీ ప్రచురణలు.

4. చక్రధరరావు, లంకసాని. 1989. తెలుగు వ్యుత్పత్తి పదకోశం, సప్తమ సంపుటం.

విశాఖపట్నం: ఆంధ్ర విశ్వకళా పరిషన్ముద్రణం.

5. బ్రౌన్, సి.పి. 1979. నిఘంటు తెలుగు – ఇంగ్లీష్, రెండవ సంపుటం, న్యూఢిల్లీ: ఏసియన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్.

6. 2001. బ్రౌన్య ఇంగ్లీష్ – తెలుగు నిఘంటువు. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

7. విశ్వనాథరెడ్డి, కేతు. 2007. వాడుక తెలుగు పదకోశం, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

8. శంకరనారాయణ, పి. 2006. శంకర నారాయణ తెలుగు – ఇంగ్లీష్ నిఘంటువు, విజయవాడ: విక్టరీ పబ్లిషర్స్.

9. సీతారామాచార్యులు, బహుజన పల్లి. 1988. శబ్దరత్నాకరము. న్యూఢిల్లీ: ఏసియన్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్.

10. సుబ్బరాయ, మహాకాళి. లక్ష్మీనారాయణ శాస్త్రి, వేదం. శబ్దార్థ చంద్రిక. **మద్రాస్**: బాలసరస్వతి బుక్ డిపో.

11. 2006. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు, ఆరవ సంపుటం. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.

12. వెంకట శేషయ్య, వెత్స. 1995. సంస్కృతాంధ్ర నిఘంటువు. హైదరాబాద్: ప్రాచీ పబ్లికేషన్స్.

## ఆంగ్లగ్రంథాలు

1. Merewether. 1985. A Tour through the Famine Districts of India. New Delhi: F.H.S, Usha publications.

2. Heber, Reginald. 1985. Narrative of A Journey Through the upper provinces of India from Calcutta to Bombay (1824–1825),

Volume – II. New Delhi: D.D. B.R. Publishing Coorporation.

3. Dilip Kumar Ray & Indira Devi. 1974. Piligrims of the stars New York: Dell Publishing Co.Inc.
4. Anne Frank. The Diary of a young girl. MG Books [Manu Graphics]
5. Kaul (Chosen and Edited). 1997. Traveller's India AnAnthologyh. Delhi: H.K. Oxford University Press.
6. Captain Leopold Von Orlich, Translated from the German by Evans Lloyd.Travels in India inclusingSinde and the Punjab by H, Volume-II. 1985. New Delhi: Usha Publications.
7. Lockman. 1995. Travels of the Jesuits Volume-II. New Delhi: Asian Educational Services.

## వెబ్‌సైట్స్

1. kinige.com
2. telugubhavitha.org
3. vrdarla.blogspot.in
4. rajachandraphotos.blogspot.com
5. wikipedia

# అనుబంధం



**Basilique Saint-Pierre: Rome**




**Buddhist  Temple - Sarnath**




**Tower of London viewed from the River Thames**



**Acropolis of Athens Greece**



**Eiffel Tower – Paris**



**Udaipur Chittorgarh Fort**



**Leshan Giant Buddha - Chaina**



**Great Wall of China**



**Blue Mosque - Turkey**



**British-Graveyard**





**Heidi sandstorm**




**Berlin Wall -Berlin**



**Egypt Pyramid**




**Dutch Cemetery, Cochin - Kerala**



**Gladiator Colosseum - Rome**




**Circus-Maximus - Rome**



**Chattisgarh**



**Terracotta Army – China**



**Leaning Tower of Pisa - Italy**



**Brihadeshwara Temple - Tanjavur**



**Padmanabhapuram palace – Tamil Nadu**



**‘Sadya’ Onam Festive Food of Kerala**



**Yuan Xiao Jie, Festival of Chinese**



**Chinese Acrobatic Dance**



**Weaving Turkish Carpet**

# వ్యాస రత్నాలు

## (సాహిత్య వ్యాసాలు)


### ప్రధాన సంపాదకులు

**డా. రత్న శేఖర్ కట్టెపోగు,**

**ప్రిన్సిపాల్, యస్.వి.కె.పి. కళాశాల, పాదిలి.**

### సంపాదక వర్గం

**డా. కాకాని సుధాకర్,**

తెలుగు శాఖ, యస్. యస్. యన్. కళాశాల, నరసరావుపేట.

**కె. వి. పద్మావతి,**

తెలుగు శాఖ, వి.యస్.ఆర్. & యన్.వి.ఆర్. కళాశాల, తెనాలి.

**పి. ఉషారాణి,**

తెలుగు శాఖ, యస్.జి.వి. ఓ. కళాశాల, తిమ్మసముద్రం.

**డా. విజయ కుమార్ బండారు,**

పోస్ట్ డాక్టోరల్ ఫెలో, హెచ్.సి.యు., హైదరాబాద్.

**డా. శ్రీనివాసరావు గుండెమెడ,**

తెలుగు శాఖ, ఏ.యమ్. కళాశాల, గుంటూరు.

# **VYASA RATNALU** (Telugu Essays)

| | | |
|---|---|---|
| First Edition | : | @ 2017 |
| Copy Right | : | Editors |
| Copies | : | 500 |
| Price | : | 350/- |

**Books Available at :**
All Leading Book Shops,
*www. vyasasudha2017.org,*
*www. kinige.org*

**ISBN : 978 - 93-87540 - 03 - 3**

**For Communications :**
**Dr. Kattepogu Ratna Sekhar,**
Principal I/C
# S.V.K.P. Degree College
Podili, Prakasam (Dt).
Phone : 8008933204, 9866703130.

Published by : ROSHAN PUBLICATIONS,
Visakhapatanam.

Cover Design : Narasimha, Navya Sai Graphics, Chirala.

Printed at : SRI SRI PRINTERS, VZA.

# విషయ సూచిక


1. పండరంగని అద్దంకి శాసనం – తరువోజ — పి. ఉషారాణి
2. గుర్రం జాషువా, శ్రీ.శ్రీ.ల కవిత్వం – తులనాత్మకత — డా॥ కాకాని సుధాకర్
3. పిరదౌసి కావ్యం – జాషువా కవిత్వం — డా॥ మానమ మునిరత్నం
4. సతీష్ చందర్ దళిత కవిత్వం – వస్తు వైవిధ్యం — డా॥ డి. విజయకుమారి
5. అన్నమయ్య సాహిత్యం – సామాజిక స్పృహ — శ్రీమతి కె.వి. పద్మావతి
6. వచన కవితాభిలాషి – కుందుర్తి ఆంజనేయులు — డా॥ బూసి వెంకటస్వామి
7. ఆధునిక బాలల గేయ సాహిత్యం – విమర్శనాత్మకపరిశీలన — డా॥ రత్నశేఖర్ కట్టెపోగు
8. బి.సి. కవిత్వం – మానవతావాదం — డా॥ గుండిమెడ శ్రీనివాసరావు
9. తెలుగు భాషా సాహిత్య సంస్కృతులపై పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలో జరిగిన పరిశోధన — డా॥వెంకట రామయ్య గంపా
10. జ్ఞానానందకవి – నన్నయ, తిక్కనల ప్రశంస — డా॥ ఆర్. రామమోహనరావు
11. శ్రామిక జీవన పరిణామ క్రమానికి ప్రతీక – గొంగళి పురుగు నాటకం — డి. సుజాత
12. ఆంధ్రుల పుణ్యామృతఫలము – అష్టావధానము — డా॥ ఆశావాది సుధామ వంశీ
13. “జానపద కళారూపాలు – ప్రదర్శన విధానం” — డా॥ ఎన్. ఓబిరెడ్డి
14. కందుకూరి వీరేశలింగంగారు – స్త్రీ విద్య — డా॥యం.భానుప్రసాద్ కుమార్ బాబు
15. సినారె మట్టి మనిషీ ఆకాశం ప్రతీకాత్మక కావ్యం — డా॥ సిహెచ్. కిశోర్
16. పలనాటి పులి. పులుపుల వెంకట శివయ్య వ్యక్తిత్వం – పలనాడు వెలలేని మాగాణిరా – పాట విశ్లేషణ — డా॥ కె. సురేశ్ కుమార్
17. జ్ఞానానందకవి – పర్వదిన ప్రశంస — డా॥ కె.వి.యన్.డి. వరప్రసాద్
18. ఖాకీ బతుకులు నవల – దళిత జీవితం — పి. ఏడుకొండలు
19. గురజాడ శిష్యత్వం – గురుత్వం — డా॥ టి. జాన్ కిరణ్ బాబు
20. జాషువా “గబ్బిలం” – తాత్విక చింతనకు నిదర్శనం — డా॥ కె. పుష్పమ్మ
21. శ్రీపాద కథల్లో సామాజిక సమస్యలు – పరిష్కారాలు — డా॥ చామర్తి అన్నపూర్ణ

22. సినారె కవిత్వానుబంధం - క్షేత్రబంధం — నరసింహ
23. సామాజిక చైతన్యానికి ప్రతీకలు-ప్రేమ్‌చంద్ కవితలు — ఎం.టి.జ్యోత్స్న
24. అత్తగారి కథలు - హాస్యచిత్రణ — డా॥ గుడిపెల్లి అనిత
25. ఎరుకల పంచాయితీలు — డా॥ జి. హరిబాబు,
26. ప్రజల మనిషి వట్టికోట ఆళ్వార్ స్వామి — డా॥ మల్లెగోడ గంగాప్రసాద్
27. ఖడ్గలక్షణ శిరోమణి శాస్త్రకావ్యం -ఛందస్సు — కె. రమేశ్
28. దళిత కవిత్వంలో - ముస్లిం నేపథ్యం — డా॥ గంధం అరుణ
29. వేమన పద్యం వివేక ప్రయోగ వినియోగాలు — డా॥ జె. సీతాపతి రావు
30. విశ్వనాథ "ఆంధ్రప్రశస్తి" -ఆంధ్రాభిమానం — ఎం. రమాదేవి
31. నానీ కవిత-తెలంగాణ మాండలికం — బి. బాలకృష్ణ
32. సమకాలీన ప్రాంతీయ కవిత్వం - సమాలోచన — అసిరెడ్డి లక్ష్మీ
33. దాశరథి రంగాచార్య చదువు కథానిక - బానిస కాంక్ష — డా॥ దాలిబాని సుశీల
34. అమెరికా తెలుగు కథానిక -ఆంతరంగిక సమస్యలు — డా॥ పి. చిరంజీవి రావు
35. పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి సాహితీ వ్యక్తిత్వం — డా॥ సంగీతరావు మెడతోటి
36. పిట్ట లేని లోకం (దీర్ఘ కవిత) జీవరాశి పరిరక్షణా ప్రబోధం — డా॥ మోకా పత్రాప్
37. సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా భీమన్న 'ప్రగతి' — డా॥ ఈశ్వర్
38. భాషానువాదంలో శాస్త్రానువాదం — డా॥ గుంటి రేవతి
39. చల్లా 'శ్రమలో స్వర్గం' - కవితా నేపథ్యం — డా॥ కోదండ లక్ష్మణ
40. ప్రపంచీకరణ - పాట — డా॥ యం. నాగరాజు
41. కొలకలూరి ఇనాక్ "ఆది ఆంధ్రుడు" కావ్యం-రస పోషణ — డా॥ గిన్నారపు ఆదినారాయణ
42. ఆముక్తమాల్యద వర్ణనలు - కర్షక జీవనం — డా॥ యరగ్రంగు స్వరూపరాణి
43. సంప్రదాయ తెలుగువ్యాకరణాలు - వైభక్తిక వైవిధ్యం — గంగిశెట్టి లక్ష్మీనారాయణ
44. పెద్దింటి అశోక్ కుమార్ 'ఎడారి మంటలు' నవల - వస్తు వివేచన — డి. ఉదయ్ భాను
45. ఆధునిక తెలుగు నాటకం - గిరిజనుల సామాజిక జీవన విధానం — ముడావత్ వెంకటేష్
46. ఉత్తరాంధ్ర కథ - మాండలిక స్వరూపం — ఎమ్.కె.రావు, కిలపర్తి
47. మాడభూషి వారి 'మూడో మనిషి' — కె. శాంతయ్య
48. సలీం 'కాలుతున్న పూలతోట' నవలలో మానవతావాదం — మోహన్ బానోత్
49. చారిత్రక నవలలు తెలంగాణ చరిత్రకు అక్షరదర్పణాలు — తాడూరి స్రవంతి
50. శ్రీశివభారతము-శివాజీ ధర్మతత్పరత — సత్యగాయత్రి జనమంచి
51. తెలుగులో యాత్రా చరిత్రలు - వైవిధ్యం — ఉద్యా రమ్యజ్యోతి

# తెలుగులో యాత్రా చరిత్రలు – వైవిధ్యం

**ఉద్యా రమ్యజ్యోతి**
**తెలుగు అధ్యాపకులు,**
**గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల,**
**కడప**

ఆది మానవుని కాలం నుండే మనిషిలో సంచారతత్వం, చలనత్వం సహజ గుణాలుగా కన్పిస్తాయి. తన చుట్టూ ఉండే లోకాన్ని చూడాలని, కొత్త కొత్త ప్రదేశాలను దర్శించాలని, అక్కడ నివసించేవారి జీవన విధానాలను తెలుసుకోవాలనే కుతూహలం మనిషికి స్వభావసిద్ధం. ఈ కుతూహలమే మానవుణ్ణి యాత్రలు చేయడానికి ప్రోత్సహిస్తోంది. నాగరికత నేర్చిన మానవులు కేవలం భ్రమణానికే పరిమితమవ్వక, తన యాత్రానుభవాలను అక్షరీకరించే ప్రయత్నం చేశరు. తద్వారా ఒక కొత్త ప్రక్రియ ప్రారంభానికి పునాదులు పడ్డాయి. ఆ ప్రక్రియే యాత్రాచరిత్ర. యాత్రల వల్ల తాము పొందిన అనుభూతిని అక్షరాల్లో బంధించాలనే తపన మరియు యాత్రల వల్ల తాము తెలుసుకున్న విషయాలను ఇతరులకు కూడా తెలియచేయాలనే ఉత్సాహమే యాత్రాచరిత్ర ప్రకియ ఆవిర్భావానికి కారణాలని చెప్పవచ్చు.

**యాత్రాచరిత్రల వైవిధ్యం :**

ఏ రంగంలోనైనా, ఏ విషయంలోనైనా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపించాలనుకునే వ్యక్తులు కొందరుంటారు. అదేవిధంగా యాత్రా వాఙ్మయాన్ని రచించడంలో తమదైన ప్రత్యేకతను చూపించినవారున్నారు. కొందరు పద్యంలోనూ, గద్యంలోనూ, చంపూలోనూ, వచనంలోనూ యాత్రాచరిత్రలు రాసి, కొత్తదనాన్ని చాటారు.




యాత్రా చరిత్రల్ని స్థూలంగా ఈ క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

| | |
|---|---|
| ప్రక్రియను బట్టి | 1) పద్య యాత్రా చరిత్రలు |
| | 2) గద్య యాత్రా చరిత్రలు |
| దేశాన్నిబట్టి | 3) స్వదేశీయులు, విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు |
| | 4) విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు |
| వ్యక్తులను బట్టి | 5) పురుషులు రాసిన యాత్రాచరిత్రలు |
| | 6) స్త్రీలు రాసిన యాత్రాచరిత్రలు |

**పద్య యాత్రాచరిత్రలు:**

సాహిత్య చరిత్రలు రాసినవారు యాత్రాచరిత్రలు వచన వాఙ్మయ వికాసానికి తోడ్పడిన తొలినాటి వచన ప్రక్రియగా పేర్కొన్నారు. యాత్రాచరిత్రలు చాలా వరకు వచనంలో రాయబడ్డాయి. అయితే పద్యంలో వున్న యాత్రాచరిత్రలు కూడా లేకపోలేదు.

**ఆదిభట్ల నారాయణదాసు : కాశీయాత్ర:**

హరికథా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన ఆదిభట్ల నారాయణదాసు గారు 1914వ సంతవత్సరంలో కాశీ యాత్ర చేసి తన అనుభూతులను సంస్కృత శ్లోకంలో, శతక రూపంలో రాశారు. అదే కాశీ శతకమ్. ఈ శతకంలో శ్లోకాలున్నాయి. అనుష్టుప్ ఛందస్సులో రాయబడింది.

నారాయణదాసు గారు తెలుగువాడే అయినా, ఆయన యాత్రాచరిత్రను సంస్కృతంలో రాయడం గమనార్హం.

**కోలా శేషాచల కవి: నీలగిరి యాత్రాచరిత్ర:**

19వ శతాబ్ది ప్రథమార్థంలో యాత్రాగ్రంథం ఇది. శేషాచల కవి ఈ గ్రంథాన్ని మూడు ప్రకరణాలుగా రాసారు. అవతారికలో “నీలగిరికి నేగిన చరిత్రమెల్ల ‘వచన రచన’ నెరుకపరుతు” అంటూనే కృతిపతి ప్రశంసలో “నిఖిలజన సుఖబోధనంబగు వచన కావ్యంబుగా నియ్యాత్ర రచియించి” అని వచన కావ్యంగా చెప్పుకున్నాడు. ఇందులో షష్ఠ్యంతాలు, గర్భగత కందాలు, ద్వర్థి పద్యాలు, సీసమాలికలను చేర్చారు. మొత్తం మీద శేషాచల కవి ఒకే పుస్తకంలో గద్యరచనతో పాటూ పద్య రచన కూడా చేశాడు.

**రామసుబ్బారాయుడి: కాశీయాత్ర:**

బ్రహ్మశ్రీ వాజపాయయాజుల రామసుబ్బారాయుడుగారు తన యాత్రానుభవాలను కాశీయాత్ర అనే పేరుతో 1934వ సంవత్సరంలో కావ్యంగా రాశాడు. తన భావాలను ఛందోబద్ధమయిన పద్యభాగంలో ఇమిడ్చి రాశాడు. అయితే ఇది యాత్రా సమయంలో రాసింది కాదు, స్మృతి రూపకమయిన యాత్రారచన.

**చివుకుల పెద వేంకటాచలపతి: నా శ్రీశైలయాత్ర:**

1950లో ఈ కావ్యం మొదటి ముద్రణను పొందింది. ఇందులో మొత్తం 170 పద్యాలున్నాయి. తన కుమారుడు మరణించినందువల్ల మరల సంతానం కోసం ఈ తీర్థయాత్ర చేసినట్లుగా చెప్పుకున్నారు.

**ఆవంత్స సోమసుందర్: ఆంగ్ల సీమలో ఆమని వీణలు:**

ఆవంత్స సోమసుందర్ గారు 1983లో ఇంగ్లాండుకు యాత్ర చేశారు. ఈ యాత్రలో తాను పొందిన అనుభూతులను కవిత్వంలో పొందుపరిచారు. 'ఆంగ్లసీమలో ఆమని వీణలు' అనే ఈ యాత్రాచరిత్ర 26 కవితల సంపుటి. అదేవిధంగా ఎండ్లూరి సుధాకర్ గారు కూడా తన అమెరికా యాత్రా విశేషాలను 'ఆటజని కాంచె' అనే పేరుతో కవిత్వంలో రాశారు.

**గద్య యాత్రాచరిత్రలు:**

యాత్రాచరిత్రలు ఎక్కువగా గద్యంలోనే రాయబడ్డాయి. ఆధునిక కాలంలో గద్యానికి వచనానికి భేదం లేదు. తెలుగులో మొట్టమొదటి యాత్రాచరిత్ర అయిన ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్రాచరిత్ర గద్యంలోనే రాయబడింది. రచయిత అనుభవాలకు అనుభూతులకు శ్రమ ఉండదు. పైగా సులభంగా అర్థమవుతుంది.

సినారె 'సోవియట్ రష్యాలో పదిరోజులు', భరద్వాజ 'ఇనుపతెర వెనుక' ......, శ్రీశ్రీ రష్యాయాత్ర, చైనాయానం, అక్కినేని వారి నేను చూసిన అమెరికా, దాశరథి అమెరికా సందర్శనం, ఆరుద్ర 'అమెరికా పర్యటన అనుభవాలు', ఉప్పల వారి బతుకు పుస్తకం, ఎ.బి.కె. గారి 'పశ్చిమ జర్మనీ యాత్రా విశేషాలు' మొదలైనవన్నీ కూడా వచనంలో రాయబద్ద యాత్రాచరిత్రలే. దాదాపుగా యాత్రా చరిత్రలన్నీ వచనంలోనే రాయబడ్డాయి.

**స్వదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు:**

భారతీయులలో ఎంతోమంది యాత్రలు చేసి, అనేక యాత్రా గ్రంథాలను రాశారు. వారిలో ముఖ్యంగా చెప్పుకోదగ్గ అద్భుత యాత్రికుడు రాహుల్ సాంకృత్యాయన్. ఇతడు "మేరీ టిబెట్ యాత్ర, మేరి లద్దాక్ యాత్ర, టిబెట్ మే సవావర్షే, చైనామే కమ్యూన్, చైనా మే క్యా దేఖా, యాత్రా కె ఫన్నె, కిన్నెర దేశ్‌మే అనే యాత్రా గ్రంథాల్ని రాసి, హిందీలో యాత్రా సాహిత్యాన్ని పోషించాడు."

ఇంకా శివప్రసాద్ గుప్త "పృథ్వీ ప్రదక్షిణ", భగవతశరణ్ ఉపాధ్యాయ "కలకత్తా సే పెకింగ్, సాగర్ కి లహరోం పర్, వహ దియా మే, రామధారి సింహ దినకర్ దేశ-విదేశ, మేరి

యాత్రామే, ప్రభాకర్ మాచవే "గోరి నజరోం మే హమ్", బ్రజ్‌కిషోర్ నారాయణ "నందన్ సే లండన్", అమృతా ప్రీతమ్ "ఇక్కీస్ పత్తియోం కా గులాబ్" శ్రీకాంత్ వర్మ "అపోలో కా రథ్", శివాని, "యాత్రిక" ఇవన్నీ హిందీ సాహిత్యంలో వచ్చిన ప్రసిద్ధ యాత్రా గ్రంథాలు.

తెలుగు సాహిత్యంలో యాత్రాచరిత్ర అనగానే గుర్తుకువచ్చే పేరు ఏనుగుల వీరాస్వామి గారి కాశీయాత్రాచరిత్ర, కోలా శేషాచలకవి నీలగిరి యాత్ర, నాయని కృష్ణకుమారి గారి కాశ్మీర దీపకళిక. తెలుగు సాహిత్యంలో ఎన్నో యాత్రాచరిత్రలు వచ్చినా, వాటన్నింటికీ కూడా రానంత పేరు ప్రఖ్యాతులు పై మూడు యాత్రా చరిత్రలకు వచ్చాయి.

భారతీయుడైనప్పటికీ డా॥ సచ్చిదానంద మొహంతి గారు ఇంగ్లీష్‌లో "Travel writing and colonialism" అనే యాత్రాచరిత్ర రాశారు.

**విదేశీయులు రాసిన యాత్రాచరిత్రలు:**

సృజనాత్మక సాహిత్య ప్రక్రియలైన నవల, నాటకం, కథానిక, వ్యాసం, స్వీయ జీవిత చరిత్రలవంటి ప్రక్రియల్లాగే యాత్రా చరిత్ర ప్రభావం వలన తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించింది. ప్రపంచాన్ని చుట్టి వచ్చిన యాత్రికుల్లో ఎక్కువమంది పాశ్చాత్యులే. పాశ్చాత్యులలో యాత్రలు చేయడమేకాక, యాత్రానంతరం తమ అనుభవాలను యాత్రాచరిత్రలుగా రాసి, యాత్రా సాహిత్యాన్ని ప్రోత్సహించి, పోషించారు కూడా.

ప్రాచీనకాలం నుండి మన దేశానికి ఎంతోమంది రాయబారులుగా, మత గురువులుగా, యాత్రికులుగా, పరిపాలకులుగా, భాషా శాస్త్రజ్ఞులుగా, చరిత్రకారులుగా అనేకమంది పాశ్చాత్యులు భారతదేశానికి వస్తూనే ఉన్నారు. వారు రాసిన యాత్రా చరిత్రలు ఆ కాలంనాడు మనదేశంలో ఉన్న పరిస్థితులను తెలియజేస్తున్నాయి. భారతదేశం యొక్క ప్రాచీన చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. భారతదేశాన్ని సందర్శించిన మొదటి విదేశీ యాత్రికునిగా 'మెగస్తనీసు'ను చెప్పుకుంటారు. అతడు 'ఇండా' అనే గ్రంథాన్ని రాశాడు. ఇంకా:

1. ఫాహియాన్ – A Record of Buddhist kingdoms

2. వర్తిమా – Forgotten Empire

3. టవెర్నియర్ – Travel in India

4. మార్క్‌ట్వైన్ – Following the Equator

5. కెప్టెన్ బేసిల్ హాల్ – Travels to India, Cylone, Borneo

6. స్టీవెన్సర్ – Travels with a Donkey in the Cevennes

7. J. లాక్‌మెన్ – Travels of the Jesuits

8. Judith Okely – Traveler – Gypsies

9. Alberto Grando – Traveling with Che-Guevara: The making of Revolutionary

10. Jane Rabinson – Unsuitable for Ladies

పాశ్చాత్యుల్లో పురుషులే గాక, స్త్రీలు కూడా యాత్రా చరిత్రలు రాసి, యాత్రా సాహిత్యాన్ని పెంపొందించారు. భారతీయ స్త్రీల 19వ శతాబ్దం నుండి యాత్రాచరిత్రలు రాయడం ప్రారంభిస్తే, విదేశీ స్త్రీలు 18వ శతాబ్దం నుండి యాత్రాచరిత్రలు ఈ ప్రక్రియాభివృధిలో ముందంజలో ఉన్నారు. ఈ కింద విదేశీ స్త్రీలు రాసిన కొన్ని యాత్రాచరిత్రల్ని పేర్కొనడం జరిగింది.

1. మేరీ వోర్‌ట్‌లీ మారటింగ్ – Embassy to constantople

2. నీనా మజూషెల్లీ – The Indian Alps and how we Crossed them

3. అన్నీ టేలర్ – Diary of Miss Talor's Journey Through Tibet

4. మూడ్ పారిష్ – Nine pounds of Luggage

పాశ్చాత్యులలో పురుషులతో సమానంగా స్త్రీలు కూడా యాత్రలు చేయడం, యాత్రాచరిత్రలు రాయడం కన్పిస్తుంది. ఈ ధోరణి భారతదేశంలో కూడా రావల్సి ఉంది. భారతీయ స్త్రీలు యాత్రాభ్రమణంలో రావల్సి ఉంది. భారతీయ స్త్రీలు యాత్రాభ్రమణంలో ముందడుగు వేసి, యాత్రా సాహిత్యాన్ని వృద్ధి చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. ఏదేమైనప్పటికీ యాత్రాచరిత్ర ఒక ప్రక్రియగా నిలబడటంలో పాశ్చాత్యుల కృషి ఎంతగానో ఉంది.

**పురుషులు రాసిన యాత్రా చరిత్రలు :**

తెలుగులో యాత్రా వాఙ్మయాన్ని అభివృద్ధి పథంలో నడిపే విషయంలో స్త్రీలకంటే పురుషులే ముందంజలో ఉన్నారు. యాత్రాచరిత్రల రచన ప్రారంభమయిన నాటినుండి తెలుగు సాహిత్యంలో ఎక్కువగా పురుషులు రాసిన గ్రంథాలే కన్పిస్తాయి. మొట్టమొదట యాత్రాచరిత్రల రచనకు ఆద్యుడు కూడా పురుషులే. 1831లో ఏనుగుల వీరాస్వామి గారు కాశీయాత్రా చరిత్రని రచించి తెలుగులో యాత్రా వాఙ్మయ శాఖను ప్రారంభించారు.

1. కోలా శేషాచలకవి – నీలగిరి యాత్రాచరిత్ర
2. బులుసు వేంకట రమణయ్య – నా దక్షిణ దేశయాత్రలు, నా ఉత్తర దేశ యాత్రలు
3. సూరాబత్తుల సుబ్రహ్మణ్యంగారి – కళ – ప్రకృతి
4. ముమ్మనేని లక్ష్మీ నారాయణ – హంపీ విహారయాత్ర
5. మల్లంపల్లి సోమశేఖర శర్మ – నెల్లూరు మండల యాత్ర
6. జొన్నలగడ్డ సత్యనారాయణ – నా మహారాష్ట్ర యాత్ర
7. కొడాలి వెంకటేశ్వరరావు – అంతా కలిస్తే అమెరికా
8. దాశరథి గారి – విపులాచ పృథ్వీ
9. పాటిబండ్ల వేంకటపతిరాయలు – మా ఉత్తర భారత యాత్రలు
   మా దక్షిణ భారత యాత్రలు
10. నా జర్మనీయానం – మండలి బుద్ధ ప్రసాద్
11. రాష్ట్రపతి, ప్రధానులతో – నా విదేశీ పర్యటనలు – వేమూరి బలరామ్
12. నా అమెరికా యాత్ర – ఎన్.గోపి.

పైన పేర్కొన్నవన్నీ కూడా పురుషులు రాసిన యాత్రా చరిత్రల్లో ప్రసిద్ధి చెందినవి. ఇవేకాక ఇంకా ఎన్నో యాత్రాచరిత్రలు తెలుగులో ఉన్నాయి. మచ్చుకు కొన్నింటిని మాత్రమే ఇక్కడ పేర్కొనడం జరిగింది.

**స్త్రీలు రాసిన యాత్రాచరిత్రలు:**

భారతీయ స్త్రీలు 19వ శతాబ్ది చివరిభాగం నుండి యాత్రా సాహిత్యాన్ని రాయడం ప్రారంభించారు. అయితే 19వ శతాబ్దం కంటే 20వ శతాబ్దంలో కొంచెం ఎక్కువగా స్త్రీల యాత్రాచరిత్రలు వెలువడ్డాయి. కృష్ణకుమారి గారు అచ్చమైన తెలుగులో సరళంగా, అందంగా, తన యాత్రానుభవాలను, కాశ్మీర దీపకళికలో పొందుపరిచారు. ఆవిడ కాశ్మీర్‌లోని ప్రకృతిని వర్ణిస్తూ వుంటే, ఆ ప్రదేశాన్నంతా మనమే స్వయంగా చూస్తున్నామన్న భ్రమ కలుగుతుంది. సాహిత్యకారుల స్పందలన, వారి వర్ణన అంత అందంగా వుంటాయి, హృదయాన్ని హత్తుకుంటాయి. 19వ శతాబ్ధిలో వచ్చిన కొన్ని స్త్రీయాత్రా చరిత్రలను ఈ క్రింద పేర్కొనటం జరిగింది

1. తాదూరి రమణబాయమ్మ – సింహళ ద్వీపయాత్ర
2. ముళ్ళపూడి కమలాదేవి – మా ఉత్తరభారత యాత్ర
3. పి. రుక్మిణమ్మ – నా అమెరికా యాత్ర
4. మాలతీ చందూర్ – నవ భారతి
5. వాసా ప్రభావతి – రష్యాకు స్నేహచరిత్ర
6. డి. కామేశ్వరి – నా విదేశీయాత్రానుభవాలు
7. ముదిగంటి సుజాతరెడ్డి – నైలునదీ నాగరికత
8. కె.కుసుమారెడ్డి – కన్యాకుమారి దీపకళిక
9. కూరగంటి శ్రీలక్ష్మి – షంఘై నింగిలో

మొట్టమొదటి విదేశీయాత్రలు చేసిన తొలి మహిళగా పోతం జనకమ్మగారిని పేర్కొంటారు. ఈవిడ 1860లో ఇంగ్లండ్‌కు యాత్ర చేసింది. అయితే ఆవిడ తన యాత్రా వివరాలను “Pictures of England” అనే గ్రంథంలో ఆంగ్లంలో పొందుపరిచింది. మొట్టమొదట తెలుగులో స్త్రీలు యాత్రాచరిత్రలు రాయడం ఈమెతోనే మొదలైందని చెప్పవచ్చు.

ఆధునిక కాలంలో ఎంతోమంది స్త్రీలు యాత్రలు చేసి, యాత్రాచరిత్రలు రాశారు. నేడు యాత్రలు చేసే స్త్రీల సంఖ్య కూడా పెరిగింది. యాత్రలు చేసొచ్చిన స్త్రీలు కొందరు తమ యాత్రా

విశేషాలను యాత్రాచరిత్రలుగా, యాత్రా వ్యాసాలుగా రాసి, పత్రికల ద్వారా ప్రజలకి అందజేయటం హర్షించదగ్గ విషయం.

ఒక యాత్రా చరిత్రను చదివినప్పుడు అది ఆ కాలంలో యాత్రికుడు చూసిన ప్రాంతానికి సంబంధించిన చారిత్రక, రాజకీయ, ఆర్థిక, మత, సాంస్కృతిక పరిస్థితులను గురించి క్లుప్తంగా అయినా వివరించే ప్రయత్నం చేయాలి. ఆయా యాత్రాచరిత్రలు చదివని పాఠకులకు విషయ జ్ఞానాన్ని పెంపొందించి వారికి కూడా యాత్రలు చేయాలనే సంకల్పాన్ని కలిగించాలి. ఇదే యాత్రాచరిత్ర యొక్క పరమ ప్రయోజనం. ఈ ప్రయోజనాన్ని నెరవేర్చడంలో తెలుగు యాత్రాచరిత్రలన్నీ సఫలీకృతమయ్యాయని చెప్పవచ్చు.

# ఆధునిక తెలుగు నాటకం - సాహిత్యం - ప్రయోగం

సంపాదకులు

ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి

తెలుగుశాఖ

హైదరాబాదు విశ్వవిద్యాలయం

**ADHUNIKA TELUGU NATAKAM - SAHITHYAM - PRAYOGAM** (Essays on Telugu Drama)

Compiled & Edited by : Prof. **S. Sarath Jyothsna Rani**
Head, Department of Telugu,
Co-Ordinator, Classical Telugu Centre,
School of Humanities,
University of Hyderabad,
Hyderabad - 500 046 (AP) India

Edition : October, 2013
Copies : 500
Price : Rs.120/-
ISBN - 978-81-9216580-6

The Book has been published with the Financial Assistance under the UGC - Unassigned Grants given by the university of Hyderabad.

**Books Available at :**
Department of Telugu
School of Humanities
University of Hyderabad
Gachibowli, Hyderabad - 500 046
Andhra Pradesh, India.
Ph : 040-23133550

DTP & Title Cover by : Smt. Chandravathi

Printed at :
**Om Sai Graphics**
Narayanaguda, Hyderabad.
Ph : 040-27564141, 27560003

# విషయసూచిక


1. తెలుగు నాటక రచన - ప్రయోగం ఒక విహంగ వీక్షణం - డా. చాట్ల శ్రీరాములు 1-6
2. విశ్వనాథ 'నర్తనశాల' - పాత్ర చిత్రణ - ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నా రాణి 7-12
3. 'కన్యాశుల్కం'లో 'గిరీశం' ఓ అద్భుత సృష్టి - ఆచార్య తుమ్మల రామకృష్ణ 13-15
4. 'మా భూమి' నాటకం - వస్తు, శిల్పాలు - డా. పిల్లలమర్రి రాములు 16-18
5. తెలుగు నాటక రంగం : విహంగ వీక్షణం - డా. పమ్మి పవన్‌కుమార్ 19-25
6. 'రాగవాశిష్ఠం' నాటకం- వస్తు, శిల్ప వివేచన - డా. దార్ల వెంకటేశ్వరరావు 26-39
7. అవిభక్త మద్రాసు రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా నాటక రంగ చరిత్ర - వైవిధ్యం - డా. డి. విజయలక్ష్మి 40-45
8. వేదం వెంకటరాయశాస్త్రి - 'ప్రతాప రుద్రీయం'- భాషా వైశిష్ట్యం - డా. బాణాల భుజంగరెడ్డి 46-53
9. రైతు విజయం' వీధి నాటకం - పరిశీలన- డా. డి. విజయకుమారి 54-57
10. 'కొమురం భీం' నాటకం- గిరిజన చైతన్యం - డా. సూర్యా ధనంజయ్ 58-65
11. చారిత్రక నాటకాలు - ప్రయోగ వైచిత్రి - డా.వి. త్రివేణి 66-81
12. తెలుగు నాటక రంగం -బళ్ళారి రాఘవ స్థానం - డా. గుమ్మన్న గారి బాల శ్రీనివాసమూర్తి 82
13. ప్రపంచీకరణ నేపథ్యంలో 'పడమటి గాలి' నాటక వివేచన - సుధాకర్ అరూరి 83-108
14. 'భూమి బాగోతం' నాటకం - డా॥ జర్రా అప్పారావు 109-113
15. 'పాలేరు' నాటకం - వస్తు వివేచన - డా. చదలవాడ విజయకుమార్ 114-118
16. సామాజిక నాటకం 'బర్బరీకుడు'- విచారణ - డా. జిలకర శ్రీనివాస్ 119-124
17. 'పురూరవ' - మనోవిశ్లేషణ - బి. విజయ్‌కుమార్ 125-131
18. పానుగంటి 'కంఠాభరణము' నాటకం - సామాజిక దృక్పథం - ఎల్. మంగమ్మ 132-137
19. చలం 'జయదేవ' నాటకం - మనోవిశ్లేషణ - ఒబిన్ని శ్రీహరి 138-143
20. నిత్య నూతనం 'ఎన్.జీ.ఓ' నాటకం - పులివర్తి రమేష్ 144-148
21. ప్రయోగాత్మక నాటకం - 'మరో మొహెంజొదారో' - సత్య గాయత్రి జనమంచి 149-154
22. 'ఆంధ్రాభిజ్ఞాన శాకుంతలం' - అనువాద నైపుణ్యం - బాశెట్టి లత 155-160
23. ఉన్నవ 'నాయకురాలు' నాటకం - సామాజికాంశాల విశ్లేషణ - రాజీవ్ బాబు లక్కినేని 161-169
24. 'కట్టు బానిస' నాటిక - విశ్లేషణాత్మక పరిశీలన -నూనావత్ రాంబాబు 170-178
25. 'కన్యాశుల్కం' నాటకం - భాషా విశ్లేషణ - గుండ్లూరు వెంకట రమణ 179-188
26. రావి కొండలరావు నాటక రచనా ప్రయోగం - జాడ సీతాపతిరావు 189-191
27. ఆత్రేయ నాటకాలు - వస్తు వైవిధ్యం - రమ్యజ్యోతి ఉద్యా 192-200
28. రేడియో నాటకాలు - ఆవిర్భావ వికాసాలు - డా. కె. భాను నాయక్ 201-206
29. వంగూరి చిట్టెన్ రాజు నాటికలు - హాస్యం - పి. చిరంజీవిరావు. 207-212

# ఆత్రేయ నాటకాలు - వస్తు వైవిధ్యం

- రమ్యజ్యోతి. ఉద్యా

తెలుగు నాటక రంగ చరిత్ర వికాసదశలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిన గొప్ప వ్యక్తి ఆచార్య ఆత్రేయ. ఆత్రేయ ఆధునిక ఆంధ్ర నాటక రచయితల్లో చెప్పుకోదగ్గవాడు. ఆత్రేయ కేవలం నాటక రచయిత మాత్రమే కాదు, నటుడు, దర్శకుడు, ప్రయోక్త కూడా. ఆత్రేయ అసలు పేరు కిళాంబి వెంకట నరసింహాచార్యులు. జమీన్‌రైతు పత్రికలో సహాయ సంపాదకునిగా పనిచేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని కారాగారవాసం కూడా అనుభవించారు.

"ఆచార్య ఆత్రేయ మొదట కవి, తరువాత దర్శకుడు, నటుడు, పిమ్మట నాటికా నాటక రచయిత, అటు పిమ్మట సినీగేయకవి, సినీ రచయిత" అని ఆచార్య పోణంగి శ్రీరామ అప్పారావుగారు రాసిన ఒక వ్యాసంలోని మొదటి వాక్యమిది. "ఆత్రేయ గారి జీవితంలోని వివిధ దశలను దృష్టిలో పెట్టుకొని, అప్పారావుగారు కవి, దర్శకుడు తదాది క్రమాన్ని నిర్ణయించి వుండవచ్చు. అంతేగాక అది ఆత్రేయగారి బహుప్రజ్ఞల క్రమాన్ని కూడా అర్థవంతంగా సూచిస్తున్నది"[1] అని పొత్తూరి వేంకటేశ్వర రావు గారు పేర్కొన్నారు.

**ఆత్రేయ నాటక రంగ ప్రవేశం :-**

1943-44వ సంవత్సరంలో తన 15వ ఏట ఆత్రేయగారు నాటక రంగంలోకి ప్రవేశించారు. ఇతడు నాటక రంగంలోకి ప్రవేశించే నాటికి తెలుగు నాటకరంగం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుంది. అప్పటికే తెలుగు నాటక రంగంలో పద్య నాటకాలు, గద్య సమస్యా నాటకాలు, పద్య సమస్యా నాటకాలని మూడు రకాల నాటకాలు ప్రాచుర్యంలో ఉండేవి. అయితే ఈ నాటకాలేవీ కూడా ఆశించిన ప్రజా ప్రాచుర్యాన్ని పొందలేదు. ఇటువంటి పరిస్థితుల్లో నాటకరంగంలోకి ప్రవేశించిన ఆత్రేయ, కేవలం ప్రజా సమస్యలకు సంబంధించిన సాంఘిక నాటకాలనే ఎక్కువగా రాశారు. అంతేగాక అచ్చమయిన వ్యవహార శైలిలో నాటకాలను రాశారు. వీరి నాటకాలు ఆంధ్రదేశంలోని నాటక సమాజాలకు, నటులకు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. వెంకటగిరి అమెచ్యూర్సు అసోసియేషన్, ఆంధ్ర నాటక కళాపరిషత్, ప్రజానాట్య మండలి వంటి నాటక సమాజాలు ఆత్రేయ నాటకాలకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చాయి.

చిన్ననాటి నుండి నాటకంలోని పద్యాలను రాగయుక్తంగా చదివేవాడు ఆత్రేయ. కొండముది గోపాలరాయశర్మ రాసిన 'ఎదురీత' నాటకంలో నటించి, ఉత్తమ నటుడిగా బహుమతిని అందుకున్నాడు. నటుడే రచయిత కావడం వల్ల నాటకాలకు కావల్సిన అలంకారాలన్నింటినీ సమకూర్చి పెట్టాడు. మన సమాజంలోని మధ్యతరగతి కుటుంబ

1. *చిరస్మరణీయులు (మనసు కవి ఆత్రేయ) పొత్తూరి వెంకటేశ్వరరావు, 57వ పుట*

సమస్యలను తీసుకుని, మనోహరమైన నాటకాలుగా మలిచారు. అనేక నాటక పోటీల్లో ఆత్రేయ నాటకాలు ప్రదర్శింపబడి, ఉత్తమ నాటకాలుగా బహుమానాలను అందుకున్నాయి.

మధ్యతరగతి ప్రజల మనస్తత్వం, వారి కష్టాలు, పరిస్థితులకు లోబడే తత్త్వం ఇవన్నీ కూడా ఆత్రేయ గారికి తెలుసు. అందుకే ఆయన నాటకాల నిండా అవే కన్పిస్తాయి. అందుకే "ఆత్రేయ నాటకాలు మధ్యతరగతిని పీడిత ప్రజగా గుర్తించి, వారు చేసే ఆక్రందనలు కూర్చిన అక్షర తూణీరాలని" మొదలి నాగభూషణ శర్మ గారు పేర్కొన్నారు.

ఆత్రేయ మొత్తం పది నాటకాలను, పదిహేను నాటికలు రాశారు. గౌతమబుద్ధ, అశోక్ సామ్రాట్, పరివర్తన, వాస్తవం, ఈనాడు, ఎన్.జీ.వో., విశ్వశాంతి, కప్పలు, భయం, మనసు-వయసు (తరుపతి) అనే నాటకాలను రాశారు. నాలుగు వందల సినిమా పాటల్ని రాశారు. మనసు కవి అనేది వీరికున్న బిరుదు.

**ఆత్రేయ నాటకాలు - వస్తువైవిధ్యం :-**

ఆత్రేయ రాసిన తొలి నాటకం 'శాంతి', కానీ ఇది అంతగా ప్రజాదరణ పొందలేదు. ఆత్రేయ రాసిన నాటకాల్లోని వస్తువును బట్టి ఇతని నాటకాలను చారిత్రక నాటకాలు, సాంఘిక నాటకాలని రెండు రకాలుగా విభజించవచ్చు. గౌతమ బుద్ధ, అశోక్ సామ్రాట్ నాటకాలు చారిత్రకాలు. పరివర్తన, ఈనాడు, ఎన్.జీ.వో., విశ్వశాంతి, కప్పలు, భయం, మనసు-వయసు నాటకాలు సాంఘిక నాటకాలు.

**1. గౌతమబుద్ధ :-** ఆత్రేయ గౌతమబుద్ధ నాటకాన్ని 1943లో రాశారు. సంభాషణలకు ముందు పాత్రల పేర్లు లేకపోవడం ఈ నాటకంలో రచయిత చేసిన ప్రయోగం. ఈ నాటకంలోని పాత్రలను రచయిత నాటకం మొదట్లో పరిచయం చేయలేదు. పాత్రలను ఆయా దృశ్యాలకు ముందు మాత్రమే పేర్కొన్నారు. బెర్నార్డ్‌షా రాసిన 'ది బ్లూన్ గర్ల్ ఇన్‌సెర్చ్ ఆఫ్ గాడ్" అని కథ ఈ నాటకానికి ప్రేరణ.

ఈ నాటకం మొత్తంలో పది రంగాలున్నాయి. శుద్ధోదనుని కుమారుడయిన సిద్ధార్థుడు ప్రపంచంలోని కష్టాలను చూసి, చలించి, వైరాగ్య భావాన్ని అలవరుచు కుంటాడు. సిద్ధార్థుని వైరాగ్యాన్ని శుద్ధోదనుడు తట్టుకోలేడు. ఎలాంటి వైరాగ్యం ఉన్నవాడైనా స్త్రీకి కట్టుబడిపోతాడని తలచి, యశోధరతో అతని వివాహం జరిపిస్తాడు. కానీ సిద్ధార్థుడు భార్యాబిడ్డల్ని వదిలి, సన్యాసాన్ని స్వీకరిస్తాడు. ఇది ఇందులోని ఇతివృత్తం.

గౌతమబుద్ధ నాటకంలో ఒక సత్యాన్వేషణ, ఆధ్యాత్మిక చింతన కన్పిస్తుంది. ప్రేమతత్వం, అహింసాతత్వం, విశ్వశాంతి వంటి బౌద్ధధర్మాలను ఈ నాటకంలో ప్రకటించాడు ఆత్రేయ. జీవిత సారాన్ని చిన్న పదాల్లో ఆవిష్కరింపచేశాడు. మనిషే దేవుడని, సర్వశక్తిమంతుడని, మనిషిని మనిషి సంతోషపరచకుండా, కనిపించని దేవున్ని సంతోషపెట్టడం భ్రమ అని, సాటివారిని ఆదరించాలనే సత్యాన్ని బోధించాడు.

**2. అశోక్ సామ్రాట్ :-** ఆత్రేయ నెల్లూరు గ్రంథాలయంలో చదివిన ఒక చారిత్రక గ్రంథం ఈ నాటకానికి ఆధారం. ఆత్రేయ అశోక్ సామ్రాట్ నాటకాన్ని 1944లో రాశారు. శాంతి ప్రబోధక వస్తువును నాటక ఇతివృత్తంగా స్వీకరించి, తన సామాజిక స్పృహను చాటుకున్నాడు. అశోకుడు మంత్రుల మాట వినక, కళింగదేశంపై యుద్ధానికి సంసిద్ధుడవుతాడు. దాని కారణంగా అశోకుని భార్య అయిన తిష్య అశోకున్ని వదిలి వెళ్ళిపోతుంది. ప్రజలందరూ యుద్ధాన్ని వ్యతిరేకిస్తారు. యుద్ధం వల్ల మౌర్య రాజ్య సైనికులు చనిపోయి, వారి భార్యా పిల్లలు పోషణ లేక కరువుతో ఎండిపోతారు. యుద్ధం వల్ల హింస దారిద్ర్యం పెరుగుతుంటుంది.

దేశంలో అహింసను బోధిస్తున్నారనే నెపంతో బౌద్ధ భిక్షువులకు కారాగార శిక్షను విధిస్తాడు అశోకుడు. మహావీరుడనే సైనికుని భార్య అయిన శాంతి, ప్రేమానందుడనే బౌద్ధ విహారాధిపతి అశోకునికి అహింసాతత్త్వాన్ని, ధర్మాన్ని బోధించి, అశోకున్ని మారుస్తారు. ఇది ఈ నాటకంలోని ఇతివృత్తం.

ఈ నాటకంలో అశోకుని వ్యక్తిత్వ చిత్రణలో వైవిధ్యం కన్పిస్తుంది. ఆత్రేయ అశోకున్ని దుష్ట అశోకుడుగా చిత్రించి, నాటకం చివర్లో అతనిలో మార్పును చూపిస్తాడు. అంతేగాక అశోకుని పాలనా కాలంనాడు బౌద్ధమతం ఎంతగా ప్రజాదరణను పొందిందో తెలుస్తుంది. ఈ నాటకంలో సద్దు (నిశ్శబ్దం), అవసరపడుతున్నావు (తొందరపడుతున్నావు), మంచిసెబ్బరం (మంచిచెడ్డలు) అనే నెల్లూరు మాండలికాల్ని ప్రయోగించాడు ఆత్రేయ. తన మాతామహులైన శ్రీ ఈయుణ్ణి కృష్ణమాచార్యులకు ఈ నాటకాన్ని ఆత్రేయ అంకితమిచ్చారు. కానీ ఈ నాటకం ప్రేక్షకుల అవగాహనా స్థాయికి మించి ఉండటం వల్ల ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందలేదు.

**3. పరివర్తన :-** ఆత్రేయను ప్రప్రథమంగా వెలుగులోకి తెచ్చిన నాటకం పరివర్తన. "ఈ నాటకం నా తొలి రచన కాకపోయినా వెలుగులోకి వచ్చింది మాత్రం ఇదే"[2] అని ఆత్రేయ పేర్కొన్నారు. ఈ నాటకాన్ని 1945లో రాశాడు ఆత్రేయ. 'హమ్‌రాహీ' అనే చిత్రం పరివర్తన నాటకానికి ఆధారం. ఈ నాటకం కన్నడంలోకి 'కలిపుంగవ' పేరుతో అనువదించబడింది. ఆత్రేయ ఈ నాటకాన్ని బళ్ళారి రాఘవకు అంకితమిచ్చారు.

పెట్టుబడిదారుని పంచకుచేరి యజమానికి ఉపన్యాసాలు, స్టేట్‌మెంట్లు రాసి ఇవ్వడానికి తన మేధాశక్తిని ఉపయోగిస్తున్న ఒక కవిని గురించి ఈ నాటకంలో చిత్రించాడు ఆత్రేయ. ప్రజల పక్షాన నిలబడి, వాళ్ళ కోసం తన కవితాశక్తిని ధారపోసేవాడే కవి అని ఈ నాటకం ఉపదేశిస్తుంది. ఈ నాటకంలో ధనికవర్గ దోపిడి, పేదవారి కష్టాలను, కడగండ్లను, పెట్టుబడీవర్గ ఆధిపత్యం ఏ విధంగా ఉంటుందో చూపించారు ఆత్రేయ.

---

*2. ఆత్రేయ సాహితి - కొంగర జగ్గయ్య, (నాటకాలు-1), 122వ పుట*

పరివర్తన నాటకంలో మధ్యతరగతి ఇతివృత్తం, వర్గపోరాట స్ఫూర్తి, అంతర్లీనంగా కన్పిస్తుంది. ఇందులోని సంభాషణలు, సన్నివేశాలు చాలా ప్రభావమంతంగా ఉంటాయి. ఈ నాటకం నాలుగవ ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభ సందర్భంగా ప్రదర్శింపబడింది. అంతేగాక ఆంధ్రనాటక కళాపరిషత్ అవార్డులను గెలుచుకుంది. ఈ నాటకాన్ని రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో ప్రదర్శనలిచ్చారు.

**4. వాస్తవం :-** ఆత్రేయకు కాంగ్రెస్ సంస్థతో గల పరిచయం ఈ రచనకు స్ఫూర్తి. పూర్తిగా రాజకీయపరమైన ఇతివృత్తంతో ఈ నాటకాన్ని రాశారు ఆత్రేయ. 1946లో వాస్తవం నాటకం రాయబడింది. ఈ నాటకం మొత్తంలో నాలుగు రంగాలున్నాయి.

వర్తమాన రాజకీయాలకు సంబంధించిన ఇతివృత్తం ఈ నాటకంలో ఉంది. అధికార దర్పం గల నాయకుల చర్యలను, పేదవారిపై నాయకుల దౌర్జన్యాలను చూపించాడు. కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీ నాయకులకు భావ సంఘర్షణ ఇందులో చిత్రించబడింది.

**5. ఈనాడు :-** కుల, మత విద్వేషాలతో ప్రజలు అతలాకుతలమైపోతున్నారనే భావంతో ప్రజలకు సమరస భావాన్ని చాటిచెప్పేందుకు ఆత్రేయ ఈ నాటకాన్ని రాశారు. "8-6-47 తేదీ వెలువడిన పీపుల్స్ ఏజ్ పత్రికలో హజ్రాబేగం రాసిన "The Bone Fire" అనే చిన్న కథ ఈ నాటక రచనకు ప్రోత్సాహం కలుగ చేసింది"[3] అని ఆత్రేయగారు పేర్కొన్నారు.

ఈ నాటకంలో పురుషోత్తం, అక్బర్‌లు చిన్ననాటి స్నేహితులు. వారి కొడుకులైన రామ్, రహీమ్‌లు కూడా స్నేహితులు. ఈ రెండు కుటుంబాల మధ్య ఒక డాక్టరు అపార్థాలను సృష్టిస్తాడు. అక్బర్ ఒక హిందూ పిల్ల తల్లికి తన ఇంట్లో ఆశ్రయమిస్తాడు. పురుషోత్తం ఒక ముస్లింకు నీడనిస్తాడు. మత విద్వేషాలతో ఉన్న ఆ గ్రామస్థులకు ఇది నచ్చక రామ్, రహీమ్‌లను రెచ్చగొడతారు. వారి విద్వేషాగ్నికి ఆ రెండు కుటుంబాలు బలి అయిపోతాయి.

హిందూ ముస్లింల మతకలహాలను శక్తివంతంగా చిత్రించారు ఆత్రేయ. ఈ నాటకంలో ప్రజలంతా ఒక్కటే అని నినదించారు. ఆంధ్ర నాట్య కళాపరిషత్తులో 'ఈనాడు' నాటకానికి ప్రథమ బహుమతి వచ్చింది. ఈ నాటకంలోని కొన్ని సన్నివేశాలు గాంధీజీ హత్యా ఘటనను పోలివుంటాయి. గాంధీజీ మరణించే కొన్ని నెలల ముందు ఈ నాటకం రాయబడింది. గాంధీగారికి ఆత్రేయ ఈ నాటకాన్ని అంకితం ఇచ్చారు.

**6. ఎన్.జీ.వో.:-** ఆత్రేయకు గొప్ప నాటక రచయితగా పేరు తెచ్చిన నాటకం ఎన్.జీ.వో. 1948వ సంవత్సరంలో ఈ నాటకం రాయబడింది. మొదట ఈ నాటకానికి 'అద్దెకొంప' అనే పేరు పెట్టారు ఆత్రేయ. ఎన్.జీ.వో. పేరుతో ఏలూరులో జరిగిన 15వ ఆంధ్ర నాటక కళా పరిషత్ పోటీల్లో ప్రదర్శింపబడి, ప్రథమ బహుమతులను అందుకుంది.

---

3. *ఆత్రేయ సాహితి - కొంగర జగ్గయ్య (నాటకాలు-2), 224వ పుట*

ఒక కారు షెడ్డులో రంగనాథం కుటుంబం నివసిస్తూ వుంటారు. రంగనాథం ఇంట్లో పేదరికం తాండవిస్తూ వుంటుంది. పెళ్లికి ఎదిగిన చెల్లెలి పెళ్లి చేయలేక, మేనమామ ఇంట్లో వదిలి గుంభనంగా సంసారం గడుపుతుంటారు. ఆర్థిక సమస్యలను భరిస్తూ, నీతిని వీడకపోవడంతో ఒక విధమైన ఆత్మగౌరవంతో బతుకుతుంటారు రంగనాథం కుటుంబం. భార్యబిడ్డల ఆరోగ్యం, చెల్లెలి పెళ్లి వంటి సమస్యలతో సతమతమవుతూ, విధిలేని పరిస్థితుల్లో లంచం తీసుకుని, జైలుపాలవుతాడు. అదే సమయంలో అతని తమ్ముడు గోపీపై ఇంటి యజమాని దౌర్జన్యం కేసు బనాయిస్తాడు ఈ విధంగా నాటకం విషాదాంతంగా ముగుస్తుంది.

ఉన్నత విలువలతో, ఆత్మగౌరవంతో బ్రతికే ఒక వ్యక్తిని కుటుంబ సమస్యలు, ఆర్థిక సమస్యలు ఏ విధంగా దిగజారుస్తాయో చూపించాడు ఆత్రేయ. మధ్యతరగతి మనిషిని వరకట్న సమస్య ఏ విధంగా పతానావస్థలకు చేర్చిందో ఈ నాటకంలో చూపారు. మధ్యతరగతి జీవితంలోని మంచి-చెడుల మధ్య జరిగే పోరాటం, వర్గ సంఘర్షణ, దోపిడీ స్వభావం వంటి అంశాలను ఇందులో చూపించారు. ఎన్.జీ.వో. నాటకంపై ఇబ్సెన్ ప్రభావం కన్పిస్తుంది. వాస్తవికవాద ప్రాతిపదికపై ఈ నాటకాన్ని రాశారు ఆత్రేయ.

**7. విశ్వశాంతి :-** ప్రతీకవాద ధోరణి ప్రతిబింబించే నాటకం విశ్వశాంతి. సంకేతాల్ని పాత్రలుగా తీసుకున్న ప్రయోగాత్మక నాటకం ఇది. విశ్వశాంతిని కాంక్షించే, ఆత్రేయ ఈ నాటకాన్ని రాశారు. విశ్వశాంతి నాటకాన్ని 1951లో రాశారు ఆత్రేయ. ఈ నాటకం మొదట జనవాణి అనే పత్రికలో సీరియల్‌గా ప్రచురితమైంది.

భూదేవికి పెద్దాడు, చిన్నాడు అని ఇద్దరు కొడుకులు. పెద్దాడు ప్రజలను హింసించి, రక్తం తాగే నరమాంస భక్షకుల ప్రతినిథి. ధన మదంతో, సంఘం తనకిచ్చిన అవకాశాలను మంచికి ఉపయోగించకుండా, విజ్ఞానాన్ని మనిషిని చంపే సాధనంగా మార్చాలనుకుంటాడు. చిన్నాడు పీడింపబడుతున్న మనుషుల ప్రతిబింబం. ఈ రెండు భావాల సంఘర్షణలో తల్లైన భూదేవి స్వేచ్ఛా, శాంతుల కోసం పోరాడుతున్న తన చిన్నబిడ్డవైపు వుంటుంది. చివరికి ప్రజాబలం పశుబలాన్ని జయించడంతో నాటకం ముగుస్తుంది.

ప్రపంచానికి మానవత్వంతో ఒక గొప్ప సందేశాన్ని విశ్వశాంతి రూపంలో అందించారు ఆత్రేయ. విజ్ఞానం ఎంత పెరుగుతుందో, అపాయం అంతగా వుందని, మన సమాజ వ్యవస్థా క్రమాన్ని మార్చాలని పేర్కొన్నాడు. "ఇంగ్లీషులో ఈ తెగకు చెందిన నాటకాలను Morality Plays అంటారు. అత్యున్నతమైన ఒక ఆధ్యాత్మిక స్థాయిని అందుకుంటేనే తప్ప ఏ రచయితా ఇటువంటి నాటకాలకి ప్రయత్నించి, కృతకృత్యుడు కాలేడు. ప్రధమ ప్రయత్నంలోనే ఈ కృతార్థత సాధించిన ఆచార్య ఆత్రేయ

---

*4. ఆత్రేయ సాహితి – కొంగర జగ్గయ్య, (నాటకాలు-2), 76వ పుట*

అభినందనీయుడు"[4] అని శ్రీశ్రీ గారు పేర్కొన్నారు. జి.వి. సుబ్రహ్మణ్యంగారు విశ్వశాంతి నాటకంలో వీరరసం పోషింపబడిందని "వీరరసము (ఆంధ్రసారస్వతము)" అనే గ్రంథంలో రాశారు.

రెండవ ప్రపంచ యుద్ధ ఫలితంగా ప్రజల్లో శాంతి భావం పెరిగింది. అందువల్లే ఈ కాలంలోని రచయితలందరూ కూడా దాదాపుగా ఈ స్ఫూర్తితోనే సాహిత్యాన్ని రాశారు. ఈ ప్రభావం నుండి వచ్చిందే ఆత్రేయగారి విశ్వశాంతి నాటకం. అయినా ఈ నాటకం ఎక్కువ ప్రాచుర్యాన్ని పొందలేదు.

**8. కప్పలు :-** ఈ నాటక రచనా కాలం 1953. ఆత్రేయ తాను ఇంతకుముందు రాసిన నాటకాలకు భిన్నమయిన ఇతివృత్తాన్ని ఈ నాటకానికి ఎన్నుకున్నారు. సున్నితమైన వ్యంగ్యంతో కూడిన హాస్యం ఈ నాటకంలోని ప్రత్యేకత. "రాజకీయ నినాదాలతో నాటకాన్ని రక్తి కట్టించుకుంటాడన్న వాదనను కాదనిపించుకోవాలని ఈ నాటకం వ్రాశాను"[5] అని ఆత్రేయగారు ఈ నాటక ప్రారంభంలో చెప్పుకున్నారు. సుమతీ శతకంలోని "తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు" అనే పద్యం ఈ నాటక రచనకు స్ఫూర్తి.

శ్రీపతి ధనవంతుడైన వ్యక్తి. ఆయన కూతురు కమల. శ్రీపతి ధనంపైన వ్యామోహంతో, అతని బంధువులందరూ అతని ఇంట్లో తిష్టవేస్తారు. ముఖస్తుతులతో కాలం గడుపుతుంటారు. బంధువుల మనస్తత్వం తన కూతురుకు తెలియచేయాలని, తన దగ్గరున్న డబ్బు దొంగనోట్లని, పోలీసులు అరెస్టు చేయడానికి వస్తారని నాటకం ఆడతాడు శ్రీపతి. శ్రీపతి దగ్గర డబ్బు లేదని తెలిసింది కాబట్టి, బంధువులు అతన్ని వదిలి వెళ్ళిపోతారు. మనుషుల మనస్తత్వం ఎలా వుంటుందో తన కూతురు కమలకు ప్రాక్టికల్‌గా చూపిస్తాడు శ్రీపతి. ఇది ఇందులోని కథ.

ప్రపంచంలోని మనిషికి డబ్బే ప్రధానమైనదని, డబ్బుంటే మనుష్యులొస్తారు, గౌరవిస్తారు, డబ్బుంటే ఏ పనైనా చేయొచ్చు అనే సత్యాన్ని పేర్కొన్నాడు ఆత్రేయ. ఒక వ్యక్తికి డబ్బు వున్నప్పుడు బంధువులిచ్చే గౌరవానికి, లేనప్పుడు వారు చూపించే గౌరవానికి మధ్య భేదం చూపి, లోకంలో డబ్బు కంటే ప్రేమే ముఖ్యమని తన అభిప్రాయాన్ని ఈ నాటకం ద్వారా తెలియజేశారు. కప్పలు నాటకం అనేకసార్లు ప్రదర్శనలివ్వబడింది. ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది.

**9. భయం :-** మనో విశ్లేషణ ప్రధానంగా సాగిన నాటకం భయం. అత్తెసరు జీతాలతో, సమస్యలతో చావలేక, బ్రతకలేక, అనుక్షణం బ్రతుకంటే భయంతో అల్లాడే దిగువ మధ్యతరగతి జీవితాన్ని ఈ నాటకంలో స్పృశించాడు ఆత్రేయ.

ధనాహంకారం గల ఒక ప్రొప్రైయిటర్ దగ్గర ఒక మేనేజర్, అకౌంటెంట్, క్యాషియర్, టైపిస్టులు పని చేస్తుంటారు. వీరంతా చాలీచాలని జీతంతో గంపెడు

5. *ఆత్రేయ సాహితి – కొంగర జగ్గయ్య, (నాటకాలు-2), 158వ పుట*

సంసారాల్ని మోస్తూ, ఉద్యోగం నిలబడటానికి ప్రొప్రైయిటర్ చెప్పిన అన్ని పనులు చేస్తుంటారు. ప్రొప్రైయిటర్ తన క్రింది ఉద్యోగులపైన దౌర్జన్యాలు చేస్తుంటాడు. ఇటువంటి పరిస్థితుల్లో శంకర్ అనే వ్యక్తి అక్కడ ఉద్యోగంలో చేరుతాడు. ప్రొప్రైయిటర్ చేసే అన్యాయాలను చూసి, అక్కడి ఉద్యోగులలో చైతన్యాన్ని కలిగించి, ప్రొప్రైయిటర్‌కు ఎదురుతిరిగేట్లుగా చేస్తాడు. ప్రొప్రైయిటర్ చర్యలకు పిచ్చిదానిలా మారిన మేనేజర్ భార్య చివరికి ఆ ప్రొప్రైయిటర్‌ను చంపడంతో ఈ నాటకం ముగుస్తుంది.

ఈ నాటకంలోని పాత్రలకు పేర్లు ఉండవు. పాత్రలు చేసే ఉద్యోగాల పేర్లే వారి పేర్లుగా ఉపయోగించారు ఆత్రేయ. ఉదాహరణకు టైపిస్ట్, ప్రొప్రైయిటర్, క్యాషియర్, అధర్మం, అన్యాయాలు తాత్కాలికంగా గెలిచినట్లు కన్పించినా, చివరకు ధర్మమే గెలుస్తుందని, తన క్రింది ఉద్యోగులని చిన్నచూపు చూస్తే, వారంతా ఏకమైతే డబ్బుగలవాని ఉనికే కష్టమనే తన అభిప్రాయాన్ని ప్రకటించాడు ఆత్రేయ.

ఇల్లు గడవక ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళపై లైంగిక వేధింపులు ఎలా వుంటాయో భయం నాటకంలో చిత్రించాడు. పేదవారి బలహీనతలతో ఆడుకునే డబ్బు గలవారి అహంకారాన్ని చూపించాడు. భయంతో బతకలేమని, భయాన్ని ఏనాటికైనా జయించాలనే సందేశాన్ని ఇచ్చాడు.

**10. మనసూ - వయసు :-** ఈ నాటకానికి మరోపేరు తిరుపతి. 1968లో ఈ నాటకం రాయబడింది. ప్రతిభ సచిత్ర వారపత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడింది. ఈ నాటకానికి 'సిడ్నీ హోవర్డ్' రాసిన 'దే న్యూ వాట్ దే వాంటెడ్' అనే నాటకం మూలం. మనసూ-వయసు నాటకం ఆత్రేయ రాసిన నాటకాల్లో చివరిది.

ఈ నాటకంలో శివయ్య, తిరుపతి ఇద్దరూ స్నేహితులు. ఒకసారి శివయ్య వ్యాపార నిమిత్తం బాంబే వెళ్ళినప్పుడు లిల్లీని చూస్తాడు. తన మిత్రుడయిన తిరుపతి చేత లిల్లీకి ఉత్తరాలు రాయిస్తూ వుంటాడు. లిల్లీ ఒకసారి శివయ్య ఫోటో పంపమని ఉత్తరం రాస్తుంది. కానీ శివయ్య తాను అందంగా వుండడు కాబట్టి, తనను లిల్లీ ఎక్కడ కాదంటుందో అని తిరుపతి ఫోటో పంపుతాడు. శివయ్య, లిల్లీ పెళ్లి నిర్ణయమవుతుంది. అప్పుడు పెళ్లి చేసుకోవడానికి శివయ్య ఊరికి వచ్చిన లిల్లీకి ఈ నిజం తెలుస్తుంది. దాంతో శివయ్యపైన ప్రేమను, తిరుపతిపైన కోపాన్ని పెంచుకుంటుంది. కానీ తిరుపతి వల్ల తల్లి అవుతుంది. ఈ విషయాలన్నీ తెలిసిన శివయ్య ఆత్మహత్య చేసుకోవడంతో కథ ముగుస్తుంది.

నిలువ నీడలేని ఒక ఆడది తన మనసును చంపుకోలేక వేరే వ్యక్తిపై ఇష్టాన్ని పెంచుకోలేక, పరిస్థితులకు ఏ విధంగా తలవంచిందో ఈ నాటకంలో చూపించాడు ఆత్రేయ. ఈ నాటకాన్ని చదివినపుడు ఒక కమర్షియల్ సినిమా చూసినట్లు అనిపిస్తుంది. "కులం మాటెత్తకండి! ఇది 20వ శతాబ్దం రెండవ భాగం. ఇంకా కులం ఏమిటండీ" అంటూ కులవ్యవస్థపైన తనకున్న వ్యతిరేక భావాన్ని ఒక పాత్ర రూపంలో పేర్కొన్నారు

ఆత్రేయ. ఈ ఆధునిక కాలంలో కులం ప్రాధాన్యత తగ్గి, దాని స్థానాన్ని ధనం ఆక్రమించిందనే సత్యాన్ని తెల్పాడు. ఆడవాళ్ళు మగవారి పొరబాట్లను, మోసాలను సులభంగా క్షమిస్తారని, క్షమ వాళ్ళ స్వభావమని, ఆడవారిని గురించి తనకు గల ఉదాత్త భావాలను ప్రకటించాడు ఆత్రేయ.

ఈ విధంగా ఆత్రేయ నాటకాలన్నింటిలోనూ సామాజిక దృక్పథం కన్పిస్తుంది. అందుకే జి. నాగయ్యగారు "ఆచార్య ఆత్రేయగారు వ్రాసిన ఎన్.జీ.వో., కప్పలు, భయం అను నాటకాలలో భయానుమానముల తోడును, అథఃపతనముల తోడును సంఘర్షణము సాగించు సామాన్యుని మనస్తత్వములు చక్కగా చిత్రింపబడినవి" అని పేర్కొన్నారు. ఆత్రేయ నాటకాల్లో ఎంత శక్తివంతమైన ఇతివృత్తం ఉన్నా, సుదీర్ఘమయిన సంభాషణలు, ఉపన్యాసాలు లేకపోవడం ఆత్రేయ నాటకాల ప్రత్యేకత. వాస్తవ ఇతివృత్తాలతో, మంచి సంభాషణా చాతుర్యంతో నాటకాలను రాశారు. తరువాత తరం నాటక రచయితలకు మార్గదర్శకులైయ్యారు. అంతేగాక వాస్తవ కథనాలతో నాటకాలు రాసి, ఒక కొత్త తరహా ఆధునిక నాటక రచనలకు నాంది పలికారు.

ఎప్పుడో ఒక కాలానికి చెందిన సాహిత్యం ఇంక ప్రజలను రంజింపచేస్తుంటే, ఇంకా మన సాహిత్యం, సమాజం అభివృద్ధి చెందలేదని పెద్దలు చెప్తుంటారు. అలాగే ఆత్రేయ నాటకాల్లోని సమస్యలు ఇంకా మన సమాజంలో ఉన్నాయి. కాబట్టి ఆత్రేయ గారు ఇంకా తన నాటకాల ద్వారా బ్రతికే ఉన్నారు.

**ఆధార గ్రంథాలు:**


1. గంగప్ప, ఎస్. – 'తెలుగు నాటకం' 1985, శశీ ప్రచురణలు, గుంటూరు.
2. జగ్గయ్య, కొంగర – 'ఆత్రేయ సాహితి' (నాటకాలు 1,2 సంపుటాలు) 1990, మనస్విని పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్, మద్రాస్.
3. నాగభూషణ శర్మ, మొదలి – 'నాటక శిల్పం', 2008, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
4. నాగయ్య, జి. – 'తెలుగు సాహిత్య సమీక్ష' (రెండవ సంపుటం), 2004, నవ్య పరిశోధక ప్రచరణలు, తిరుపతి.
5. మల్లికార్జునరావు, కప్పగంతుల – 'వ్యాస మాలిక' (ఆధునిక తెలుగు నాటకరంగం, తెలుగు సాహిత్యంపై వ్యాసాలు), 1998, క.గా.కా.కే. ప్రచురణలు, రాజమండ్రి.
6. రాధాకృష్ణమూర్తి, మిక్కిలినేని – 'ఆంధ్ర నాటక రంగ చరిత్ర', 1969, రేణుకా గ్రంధమాల, మద్రాస్

7. రామానుజరావు, దేవులపల్లి, అప్పారావు పి.ఎస్.ఆర్., సుబ్రహ్మణ్యం జి.వి., కృష్ణమూర్తి ఇరివెంటి (సంపాదకులు) – 'తెలుగులో పరిశోధన' (రజతోత్సవ సంచిక), 1983, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాద్.

8. వెంకటేశ్వరరావు, పొత్తూరి – 'చిరస్మరణీయులు', 2001, మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాద్.

9. సుబ్రహ్మణ్యం, జి.వి. – 'సివిల్ సర్వీసెస్ మెయిన్', (తెలుగు సాహిత్యం పేపర్)
మృణాళిని సి., రమేష్ టి. (కూర్పు)
హైదరాబాద్ స్టడీ సర్కిల్, హైదరాబాద్.

10. విజేత కాంపిటీషన్స్ – 'తెలుగు సాహిత్యం', 2006, బండ్ల పబ్లికేషన్స్, హైదరాబాద్.

# తెలుగుశాఖ-ఆంధ్రవిశ్వకళాపరిషత్

# DEPARTMENT OF TELUGU - ANDHRA UNIVERSITY

## యు.జి.సి జాతీయ సదస్సు

## "తెలుగు భాష, సాహిత్యం, పత్రికారచన"

## U.G.C. NATIONAL SEMINAR

## TELUGU LANGUAGE, LITERATURE & JOURNALISM

**తేదీలు : 9, 10 ఫిబ్రవరి, 2011**

డా॥ / ఆచార్య ..........................................................

.......................... విశ్వవిద్యాలయం / కళాశాల ..........................

ఆంధ్రవిశ్వకళాపరిషత్ తెలుగుశాఖ, విశాఖపట్నం - 530 003 నిర్వహించిన రెండు రోజుల జాతీయ

సదస్సులో పాల్గొని .......................................... అనే అంశం మీద

పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

*This is to certify that Dr. / Prof.* Ms. Ramya Jyothi

Hyderabad University *has participated*

*and presented a paper entitled* Kavyanaika Nayakula Sahaya patralu - Telugu kavyala Samanvayam *in the U.G.C. National Seminar held in the Department of Telugu, Andhra University, Visakhapatnam - 530 003, during 9th, 10th, February, 2011.*

కార్యదర్శి / Secretary
ఆచార్య యం. దత్తాత్రేయ శాస్త్రి
**Prof. M. DATTATREYA SASTRY**

సంచాలకులు / Director
ఆచార్య జి. యోహాన్‌బాబు,
**Prof. G. YOHAN BABU**
Head of the Dept. of Telugu
Andhra University, Visakhapatnam

Scanned by CamScanner

# కావ్య నాయికా నాయకులు సహాయ పాత్రలు
# తెలుగు కావ్యాల సమన్వయం

**రమ్య జ్యోతి. ఉద్యా**
పిహెచ్.డి పరిశోధక విద్యార్థి
తెలుగుశాఖ
హైదరాబాద్ విశ్వవిద్యాలయం

వేదమంత్రాలను దర్శించిన మహర్షులు ఋషులు. ఋషి అయినవాడు మాత్రమే కావ్యాన్ని రాయగలడు. అందుకే "నానృషిః కురుతేకావ్యం", "కవయః క్రాంతదర్శనః" అనే లోకోక్తులు వెలువడ్డాయి. కవి యొక్క కర్మ కావ్యము. "దోష రహితములు, గుణ సహితాలు, అలంకారాలు, రసము, వర్ణనలు మొదలయిన గుణాలతో కూడి ఉన్న శబ్దార్థాల సముదాయాన్ని కావ్యమని" చెప్పవచ్చు.

కావ్యం కాంతా సంహితం. అంటే మనకు ప్రియమైన మాటలనే కావ్యం చెబుతుంది. ఇలాంటి కావ్యం మహనీయుడయిన నాయకున్ని బట్టి విరాజిల్లుతుంది. ఇతివృత్తాన్ని నడిపిస్తూ, దాని ఫలితాన్ని అనుభవించేవాడు నాయకుడు. నాయకుడు అనగా రసభావాలను నడిపించేవాడు. శరీరానికి ప్రాణం ఎలాంటిదో కావ్యానికి నాయకుడు అలాంటి వాడు. రామాయణాది కావ్యాలు నాయకుని వలనే ప్రాచుర్యాన్ని పొందాయి.

ప్రతీ కావ్యంలోనూ నాయకానాయికలు ఉంటారు. కావ్యంలో నాయకానాయకుల మధ్యన అనురాగాన్ని పెంచడానికి కానీ, వారి సమాగమానికి కానీ కొన్ని సహాయ పాత్రలు ఉంటాయి. అంతేగాక నాయకుని యొక్క కార్యసాఫల్యానికి సహాయపడే పాత్రలు కూడా ఉంటాయి. కొన్ని సందర్భాలలో పక్షులు కూడా నాయికా నాయకుల ప్రేమకు సహాయం చేస్తాయి. కావ్యంలో నాయకునికి నాయికతో పొత్తు గూర్చుటకు విట, పీఠమర్ద, చేట, విదూషకులు అనే నలుగురు సహాయులు ఉంటారు. నాయకకు సఖురాలు, నటి, దాసి, యోగిని, చాకలి, తాంబూలిక స్త్రీ, గాంధిక స్త్రీ, పాచక స్త్రీ, గాయక స్త్రీ మొదలయిన వారుకూడా నాయికకు దూతలుగా ఉంటుంటారు. కొన్ని సమయాలలో నాయికే స్వయంగా దూతికగా నాయకుని దగ్గరికి వెళ్తుంది. కొన్ని సందర్భాలలో నాయకుడు కూడా నాయిక ప్రేమను పొందడానికి కొన్ని కపట వేషాలు వేస్తాడు.

## *నాయక సహాయ పాత్రలు*

తెలుగు కావ్యాలలో నాయికా నాయకుల మధ్య అనురాగం వృద్ధి చెందడానికి సహాయం చేసే పాత్రలు చాలా ఉన్నాయి. వాటిలో మొదటగా వసుచరిత్రను తీసుకోవచ్చు. ఇందులో గిరికపైన వసురాజు ఇష్టం పెంచుకుంటాడు. అప్పుడు వసురాజు మిత్రుడయిన నర్మసచివుడు గిరికా–వసురాజులను కలుపుటకు మాయాయతి వేషం వేసుకుంటాడు. గిరిక యొక్క జన్మవృత్తాంతాన్ని గిరిక చెలికత్తె అయిన మంజువాణి ద్వారా తెలుసుకొని, కొన్ని నిమిషాలు కళ్ళు మూసుకొని, ధ్యానం చేస్తున్నట్లు నటించి, ఈ కన్యను వసురాజు వివాహం చేసుకుంటాడు, అని దివ్యదృష్టితో చూసినట్లు నటిస్తాడు. అంతేగాక, వసురాజు గుణగణాలను వర్ణిస్తాడు. అప్పుడు ఆ మంజువాణి, నీకు మహిమ ఉంటే ఆ వసురాజును ఇక్కడికి రప్పించమని అడుగుతుంది. అప్పుడు వసురాజు

Scanned by CamScanner

ఇది సంధింపగ వేళయంచు వసురాజేంద్రుడు నీరంధ్ర నీ
రదవారప్రతిసీర వెల్వడిన తారాభర్తలీలన్ లతా
చ్ఛద సంఘాదిక బాసి నిల్చె నెదుటన్ సారంగరాగభ్రమ
న్మద భృంగీరుతి వందిమాగధ కథా మాధుర్యముం దెల్పగన్ !

మేఘసమూహాల తెరల నుండి బయటకు వచ్చిన చంద్రుడి లాగా అక్కడ చెట్ల మధ్యన దాచుకున్న వసురాజు ఒక్కసారిగా వారి ఎదుటకి వచ్చాడు. ఈవిధంగా గిరికను, వసురాజును కలుపుతాడు నర్మసచివుడు. అప్పుడు వసురాజు[1] "ఈ యనఘుటితండు మాకు పర మాపుడు గాక మునీంద్రమాత్రుడే"[1] అని ఇతడు కేవలం యతి మాత్రమే కాదు. మా ఇద్దరినీ కలిపినందుకు నాకు పరమ ఆప్తుడని ఒక అర్థంలోనూ, ఇతడు నా స్నేహితుడని శ్లేషార్థంలోనూ మంజువాణితో పేర్కొంటాడు. ఇక్కడ నాయకునికి స్నేహితుడు సహాయం చేశాడు.

### 2. నాయకునికి యోగిని సహాయం చేయుట

సుముఖ వేంకట కృష్ణప్ప నాయకుడు రచించిన అహల్యాసంక్రందనంలో గౌతమి ముని భార్య అహల్య. ఇంద్రుడు అహల్యను మోహిస్తాడు. ఇంద్రుడు తన విరహబాధను ఒక యోగినికి చెప్పుకొని, ఆమెను తన దూతగా అహల్య వద్దకు పంపిస్తాడు. ఆ యోగిని ఇంద్రుడు ఆమెను కోరుతున్నట్లు అహల్యతో చెప్తుంది[2]. అహల్య కోపాన్ని నటిస్తుంది. కానీ యోగిని ఇంద్రుని యొక్క విరహ బాధను చెప్పే సరికి తాను కూడా ఆ యోగిని ప్రోత్సాహంతో ఇంద్రునిపై ఇష్టాన్ని పెంచుకుంటుంది. ఆ ఇంద్రుడు గౌతమ ముని రూపంలో ఆమెతో కూడతాడు. ఈ విధంగా యోగిని ఇంద్రుని యొక్క విరహబాధను తీర్చి, అతనికి సహాయం చేసింది.

### 3. నాయకునికి మంత్రి సహాయం చేయుట

తెలుగు కావ్యాల్లో మరొక ఉత్తమమయిన కావ్యం గౌరన రచించిన నవనాథ చరిత్రం. ఇందులో సారంగధరుడు

---

1. అన జనభర్త పల్కుముది తా విదితాతను మంత్రజాలుని
మ్ముని గొనియాడ శక్యమె సముజ్జ్వల రూపకలాపయైన మీ
యనుగువయస్య గాంచు సుకృతాతిశయం బవలీల గూర్చె నీ
మనఘుడితండు మాకుబర మాప్తుడు గాక మునీంద్ర మాత్రుడే
– వసుచరిత్ర, రామరాజభూషణుడు, తృతీయాశ్వాసం, 61వ పద్యం 325 వ పుట

2. కరుణ యెల్లంబు మాకృతి గాంచినట్లు
విరహ తాపంబు మూర్తీభవించినట్లు
తలచి పలుకంగ రాని దుర్దశల బ్రొందు
మఘువు నేనందు గనుగొంటి మచ్చెకంటి ! అని ఇంద్రుని విరహబాధను చెప్తుంది.
– అహల్యా సంక్రందనం, సుముఖ వేంకటకృష్ణప్ప నాయకుడు, తృతీయాశ్వాసం, 9వ పద్యం, 99వ పుట

Scanned by CamScanner

నాయకుడు. చిత్రాంగి వేశ్య. అంతేగాక ఆమె సారంగధరునికి పినతల్లి అవుతుంది. అయినప్పటికీ వావి, వరుసలు లేకుండా సారంగధరున్ని మోహిస్తుంది. సారంగధరుడు ఇది తప్పు అని ఆమెకు చెప్పి, ఆమెను తిరస్కరిస్తాడు. చిత్రాంగి అతనిపై పగ సాధించడానికి సారంగధరుడే ఆమెను బలాత్కారం చేశాడని రాజుకు చెబుతుంది. మంత్రి అయిన మతిమంత్రుని కొడుకు సుబుద్ధి ఈ విషయాలన్నీ తన తండ్రికి చెప్పి, సారంగధరుడు నిర్దోషి అనీ, చిత్రాంగే కావాలని ఇలా అతనిపై నేరాన్ని మోపిందని తన తండ్రితో చెబుతాడు. రాజు తెలియక అతనికి శిక్ష విధిస్తాడు. అయితే మతిమంత్రుడు రాజుతో "ఇంతుల మనోగతి కానరాదు" తరుణులు తాము చేసే తప్పులను పురుషులపై మోపుతారని రాజుతో చెప్పి, వాస్తవ విషయాలను వెల్లడిస్తాడు. అప్పుడు రాజు విచారణ జరిపించి, సారంగధరుడు నిర్దోషి అని తెలుసుకొని, చిత్రాంగిని నూతిలోకి తీసివేస్తాడు. ఇక్కడ నాయకునికి మతిమంతుడు, అతని కుమారుడు సుబుద్ధి పునర్జీవితాన్ని ఇచ్చి సహాయం చేశారు.

### 3. నాయకునికి మహర్షులు సహాయం చేయుట

వరాహ పురాణంలో పద్మావతీ – శ్రీనివాసుల కళ్యాణగాథ ఉంది. అందులో పద్మావతీ–శ్రీనివాసులకు ఒకరంటే ఒకరికి ఇష్టం. అప్పుడు లోక కళ్యాణం కోసం శుకమహర్షి, అగస్త్య మహర్షి, భృగు, వశిష్ట, మరీచ మహర్షులు ఆకాశరాజు దగ్గరికి రాయబారులుగా వెళ్ళి, శ్రీనివాసుని గుణగణాలను వివరిస్తూ, అతడు అన్నివిధాలా పద్మావతికి తగినవాడని తెలివిగా రాయబారం నడిపి, ఆకాశరాజును వారి వివాహానికి ఒప్పిస్తారు. ఇక్కడ లోకకళ్యాణం కోసం మహర్షులు శ్రీనివాసుని వివాహానికి తమవంతు సహాయాన్ని అందించారు.

### 4. నాయకునికి చంద్రుడు దూతగా సహాయం చేయుట

విశ్వనాథ సత్యనారాయణ రాసిన "శశిదూతం" లో ప్రాణానికి ప్రాణమయిన దంపతులు ఒక రోజు రాత్రి వెన్నెలలో ఏకాంతంలో వుంటారు. అయితే ఆ ఆనందకరమయిన వాతావరణంలో అతని భార్య కోపంతో ఉంటుంది. అతడు ఆమె కోపాన్ని తగ్గించడానికి ఎంతో ప్రయత్నిస్తాడు. కానీ విరహాన్ని సహించలేక ఆకాశంలో వుండే చంద్రునితో "రమణి యొకింత కోపనవరాజ్ముఖియైనది. నాకు చెప్పుకో నమరిన దూత యిప్పుడెవరందువు నీవు వినాని శాపతి" అని నువ్వే మా మధ్యన అనురాగం పెంచడానికి దూతవు అని, తనకీ తన ప్రియురాలికి మధ్యన దూత్యాన్ని నిర్వహించమని కోరతాడు. తన భర్త ఆ చంద్రునికి చెప్పే విషయాలను వింటూ, ఆమె విరహాన్ని తట్టుకోలేక, కోపాన్ని పక్కన పెట్టి, తన భర్తతో కలుస్తుంది. ఇదే చంద్రుని సహాయం.

### 5. నాయకుడే కపటయతి వేషం వేయడం

చేమకూర వెంకటకవి రచించిన "విజయవిలాసము"లో అర్జునుడు నాయకుడు. ఇతడు సుభద్రను ప్రేమిస్తాడు. సుభద్ర కూడా అర్జునున్ని ఇష్టపడుతుంది. అయితే సుభద్రను కలువడానికి అర్జునుడు మాయాయతి వేషం వేసి, బలరాముని దగ్గరికి వస్తాడు. బలరాముడు సుభద్రను ఆ సన్యాసికి సేవలు చేయడానికి నియమిస్తాడు. సుభద్ర ఒకరోజు ఆ సన్యాసితో అర్జునున్ని గురించి చెప్పి, వారి వివాహం అవుతుందో కాదో అని బాధపడుతుంది. అప్పుడు అర్జునుడు

"యుండెబో శాంతరసమెల్ల నుట్టిపడగ
నంగనల పొందు రోసి సన్యాసియగుట

Scanned by CamScanner

కడ యుచితమందు, నా నవ మదనమూర్తి

యంగనామణి గ్రోరి సన్యాసినయ్యె"[1] నీప్రేమ పొందుట కొరకే నేను ఈ సన్యాసి వేషం ధరించానని ఆమెతో చెప్తాడు. తరువాత ఆమెను వివాహం చేసుకుంటాడు.

## నాయికకు సహాయం చేసిన పాత్రలు

### 1. చెలికత్తె సహాయం

నాచన సోమన రచించిన ఉత్తర హరివంశంలో అనిరుద్ధుడు నాయకుడు, ఉష నాయిక. ఉష చెలికత్తె చిత్రరేఖ. పార్వతీదేవి ఒకరోజు ఉషకు కలలో కన్పించి, ఆమెకు కలలో కన్పించేవాడే ఆమె భర్త అవుతాడని ఆశీర్వదిస్తుంది. ఉషకు కలలో శ్రీకృష్ణుని మనుమడయిన అనిరుద్ధుడు కన్పిస్తాడు. అప్పటి నుండి ఆమె అనిరుద్ధున్ని తలచుకొని, విరహవేదన చెందుతుంది. ఈమె వేదనను చూడలేక ఉష చెలికత్తె అయిన చిత్రరేఖ తన యోగశక్తితో అనిరుద్ధున్ని ఉష అంతఃపురానికి తీసుకువస్తుంది.[2] చిత్రరేఖ అనిరుద్ధున్ని ఆకాశంలో పొదివి పట్టుకొని పువ్వులాగా నలగకుండా ఉష అంతఃపురంలో చేర్చింది. అప్పటినుండి వారిద్దరు రహస్యంగా ఏకాంతంగా వున్నారు. ఇక్కడ ఉష విరహ బాధను తట్టుకోలేక బాధపడుతుందని తెలిసి, ఆమె బాధను తీర్చుటకు చిత్రరేఖ అనిరుద్ధున్ని తీసుకువచ్చి నాయికకు సహాయం చేసింది.

### 2. నాయికకు బ్రాహ్మణుడు సహాయం చేయుట

ఆంధ్ర మహాభారతంలో రుక్మిణీ కళ్యాణం అనే కథ ఉంది. అందులో రుక్మిణీదేవి శ్రీకృష్ణున్ని ప్రేమిస్తుంది. అయితే రుక్మిణికి ఆమె తండ్రి శిశుపాలునితో వివాహాన్ని నిశ్చయం చేసివుంటాడు. అప్పుడు రుక్మిణి తన కులబ్రాహ్మణుడయిన అగ్నిద్యోతనున్ని రాయబారిగా కృష్ణుని దగ్గరికి పంపిస్తుంది. ఆ బ్రాహ్మణుడు కృష్ణునితో రుక్మిణీదేవి సందేశాన్ని చెప్పి, ఆమె అందచందాలను వర్ణించి, ఆమెను వివాహం చేసుకోమని కోరుతాడు. శ్రీకృష్ణుడు ఆమెను తప్పక వివాహం చేసుకుంటానంటాడు. కానీ విదర్భ దేశంలో రుక్మిణీదేవి ఇంకా బ్రాహ్మణుడు రాకపోయేసరికి బాధపడుతుంది.

"ఘనుడా భూసురుడేగెనో నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో
విని కృష్ణుండని తప్పుగా దలచెనో విచ్చేసెనో యీశ్వరుం
డను కూలింపః దలంచునో తలపడో యార్యామహాదేవియున్
నను రక్షింప నెఱుంగునో యెఱుంగడో నాభాగ్యమెట్లున్నదో"[2]

---

1. చేమకూర వెంకట కవి, విజయవిలాసం – సుభద్రార్జునులు (155వ పుట)

2. పొదివి నభోవిహారమున బువ్వును బోలె నలంగకుండ న
మ్మదన సమానుబట్టి కొని మానవ దానవ దేవకోటికిం
గదలెఱుగంగ నీక చని కాంచెనుషాసతి చిత్రరేఖ యా
ముదితకు రాకపోకలొక మూడు ముహూర్తములయ్యె నయ్యెడెన్
– ఉత్తర హరివంశం, పంచమాశ్వాసము (190వ పద్యం)

Scanned by CamScanner

అని బ్రాహ్మణుడు దారిలో ఏమయినా విశ్రాంతి తీసుకుంటున్నాడేమో, తన సందేశాన్ని చెప్పాడో లేదో ! అది విని కృష్ణుడు తప్పుగా అనుకున్నాడేమో ? అని ఆమె అనేక విధాలుగా ఆలోచిస్తుంది. కానీ శ్రీకృష్ణుడు వచ్చి, రుక్మిణిని రాక్షస వివాహం చేసుకుంటాడు. అప్పుడు రుక్మిణీదేవి నాప్రాణములు నిలిపిన దేవుడవు నీవు, నీకు చేతులు జోడించి నమస్కరించుచున్నానని తన కృతజ్ఞతను తెలియజేస్తుంది.

**చిలుక సహాయం** అయితే ఈ రుక్మిణీ కళ్యాణ ఘట్టంలో బ్రాహ్మణునితోపాటు మూలాపేరన్నశాస్త్రి గారు తన "సందేశ కావ్య రచన" లో ఒక చిలుక పాత్రను కల్పించి, శుక సందేశాన్ని కూడా పంపించాడు. కృష్ణుని దగ్గరికి వెళ్ళిన బ్రాహ్మణుడు ఇంకా రాకపోయేసరికి రుక్మిణీదేవి చిలుకను దూతగా కృష్ణుని దగ్గరకు పంపిస్తుంది. కృష్ణునికి తనను వివాహం చేసుకోమని చెప్పమని కోరుతుంది. చిలుక ద్వారకకు పోయి కృష్ణునికి రుక్మిణి స్థితి చెబుతుంది. అంతేగాక కృష్ణునితో మాట్లాడుతున్న బ్రాహ్మణున్ని చూస్తుంది. రుక్మిణీదేవిని కృష్ణుడు వివాహం చేసుకుంటానన్నాడని, బ్రాహ్మణుడు కూడా అక్కడే వున్నాడని చెబుతుంది. రుక్మిణీదేవి అందుకు సంతోషిస్తుంది. ఇది శుకసందేశము.

సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారి "కీరసందేశం" అనే కావ్యంలో కూడా ఈ కథే ఉంది. నాయికకు మనుషులే కాక, పక్షులు కూడా సహాయ పాత్రలుగా ఉన్న కావ్యాలున్నాయి.

### 3. నాయికా నాయకుల మధ్య హంస రాయబారం

పింగళి సూరన రచించిన "ప్రభావతీ ప్రద్యుమ్నం"లో ప్రద్యుమ్నుడు నాయకుడు. ప్రభావతి నాయిక. ప్రభావతికి కలలో పార్వతీదేవి కన్పించి, నీకు కలలో కన్పించినవాడే నీకు భర్త అవుతాడని చెప్పి, అతని చిత్రపటాన్ని ప్రభావతికి ఇస్తుంది. ప్రభావతి అతని బొమ్మను చూస్తు విరహవేదన పొందుతుంది. ఈ కథ అంతా శుచిముఖి అనే హంస ఇంద్రునికి వివరిస్తుంది. అప్పుడు ఇంద్రుడు ప్రభావతికి, ప్రద్యుమ్నునికి మధ్య అనురాగాన్ని పెంచమని శుచిముఖితో చెప్తాడు. శుచిముఖి ప్రద్యుమ్నునితో ప్రభావతి అందచందాలను గురించి, ఆమె విరహవేదన గురించి తెలుపుతుంది. ఈ విషయాలన్నింటినీ తెలుసుకొని ప్రద్యుమ్నుడు ఆమెను ప్రేమిస్తాడు. ఈ విధంగా హంస ప్రద్యుమ్నుని గురించి ప్రభావతి దగ్గర, ప్రభావతిని గురించి ప్రద్యుమ్నుని దగ్గర ఒకరి విషయాలు ఒకరికి చెప్పి, వారి మధ్యన గాఢానుబంధాన్ని ఏర్పరుస్తుంది. ప్రద్యుమ్నుడు కూడా ఆమె గురించి తెలుసుకోవాలనే తపనతో ఒక ఉత్తరాన్ని రాసి చిలుక చేత తన ప్రణయలేఖను పంపిస్తాడు. అప్పుడు శుచిముఖి ప్రద్యుమ్నుని గురించి ప్రభావతికి చెప్తూ ఉంటుంది. అక్కడ చిలుక చెట్టుమీద వాలి, తన రెక్కలు విదిల్చింది. ఆ రెక్కల నుండి అతడు పంపించిన ఉత్తరం కన్పిస్తుంది. ఈ విధంగా ప్రభావతీ ప్రద్యుమ్నుల ప్రేమకు హంస, చిలుకకు సహాయం చేశాయి. తరువాత ప్రద్యుమ్నుడు ఆమెను వివాహం చేసుకుంటాడు.

**4.** శ్రీనాధుడు రచించిన శృంగార నైషధంలో కూడా హంసదే సహాయపాత్ర. నిషిధ దేశాధిపతి అయిన నలుడు ఇందులో నాయకుడు. దమయంతి కావ్య నాయిక. నలుని పరాక్రమాన్ని, వైభవాన్ని గురించి, అతని దాతృత్వాన్ని గురించి విని దమయంతి అతని పట్ల ప్రేమను పెంచుకుంటుంది. ఒకరోజు నలుడు తన ఉద్యానవనంలో విహరిస్తూ ఉండగా ఒక హంసను చూస్తాడు. దానిని పట్టుకుంటాడు. అప్పుడు ఆ రాయంచ మానవభాషలో తనని విడిచిపెట్టమని కోరుతుంది. తనని వదిలిపెడితే అతనికి ఒక ఉపకారం చేస్తానంటుంది. అంతేగాక నేను ముసలిదానిని అయ్యాను విడిచిపెట్టమని ప్రార్థిస్తుంది.[1] నలుడు ఆ హంసను విడిచిపెట్టగానే కృతజ్ఞతతో దమయంతి యొక్క సౌందర్యాన్ని నలునికి

---

"తల్లి మదేక పుత్త్రక, పెద్ద కన్నులు
గాన దిప్పుడు మూడు కాళ్ళ ముసలి" అంటూ తనని విడిచి పెట్టమని ప్రార్థిస్తుంది.
– శృంగార నైషధం, శ్రీనాధుడు, ప్రధమాశ్వాసం, 109వ పద్యం, 66వ పుట

Scanned by CamScanner

వివరిస్తుంది. అప్పుడు నలుడు ఆమెపట్ల అనురక్తుడై హంసను దమయంతి దగ్గరకు దూతగా పంపిస్తాడు. అక్కడ ఆ హంస దమయంతికి నలుని ప్రేమను తెలియచేస్తుంది. ఈ విధంగా హంస నలదమయంతుల మధ్య అనురాగాన్ని పెంచి వారి వివాహానికి కారకురాలవుతుంది.

### *5. నాయకునికి చిలుక సహాయం చేయుట :-*

ముద్దుపళని రచించిన రాధికాసాంత్వనము లో కృష్ణుడు నాయకుడు. రాధ నాయిక రాధాకృష్ణులకు ఒకరంటే ఒకరికి ప్రాణం కృష్ణునికి ఇళాదేవి తో వివాహం అవుతుంది. ఆ తరువాత ఇళదేవి తో కలిసి కృష్ణుడు ఆమె పుట్టింటికి వెళ్తాడు. అయితే అక్కడ ద్వారకలో రాధ తన విరహవేదనను భరించలేక ఒకరోజు తన చిలుకను పిలిపించి, తొందరగా వస్తానన్న కృష్ణుడు ఇంకా రాలేదు, అతనికి నా బాధను చెప్పి తొందరగా తీసుకురమ్మని కోరుతుంది. ఆ చిలుక నిమిషం లో తీసుకొస్తా నీ కృష్ణున్ని అంటూ ఇళ పుట్టింటికి వెళ్తుంది. అయితే ఆ రోజు ఏకాంత సమయంలో ఉన్న ఇళ, కృష్ణునితో మీరు రాధను మర్చిపోండని కోరుతుంది. అందుకు కృష్ణుడు సరేనంటాడు. ఆ మాట విన్న చిలుక తాను రాయబారం చేయాల్సిన అవసరం లేదని వెనుదిరిగి వెళ్ళిపోతుంది అక్కడికి వెళ్ళి ఈ విషయాలన్నీ రాధకు చెబుతుంది. రాధ కృష్ణుని పై అలుగుతుంది అప్పుడు కృష్ణుడు ఆ చిలుకతో

"బలు పక్షపాత ముదుగుము
ఫలభంగము లిడగ బోకు ప్రాణముగాన
గల వేళ దెల్పినా నో
చిలుకా! దయచేసి కూర్పు చిలుకలకొలికిన్" అంటూ (రాధికా సాంత్వనము, చతుర్ధా శ్వాసం, 40వ పద్యం.)

కృష్ణుడు నువ్వే వెళ్ళి రాధ కోపాన్ని తగ్గించి, ఆమె అలక తీర్చి, నాతో కూర్పమని చిలుకను వేడుకంటాడు. చిలుక వెళ్ళి కృష్ణుని బాధ గురించి రాధకు చెప్పి, ఆమె అలక తీర్చి కృష్ణునితో కలుపుతుంది. అప్పడు ఆమె కోపాన్ని తగ్గించి ఆమెను సంతోషపెడతాడు. ఈ విధంగా చిలుక రాధా - కృష్ణుల మధ్యన ఉన్న అవాంతరాలను తొలగించి, వారు మళ్ళీ కలుసుకోవడానికి ఒక వారధి అయింది.

### *6. నాయికా నాయకులసమాగమానికి ఋషి సహాయం చేయడం :-*

మహా భారతంలోని ఆదిపర్వం నాలుగో ఆశ్వాసంలో ఉన్న శకుంతలాదుష్యంతుల కథను గ్రహించి పిల్లలమర్రి పినవీరభద్రుడు "శృంగార శాకుంతలం" అనే పేరుతో ఒక కావ్యాన్ని రచించాడు.

ఇందులో దుష్యంతుడు నాయకుడు శకుంతల నాయిక దుష్యంతుడు ఒకరోజు వేటకు వెళ్ళి అక్కడ ఉన్న కణ్వమహర్షి ఆశ్రమంలోకి ప్రవేశిస్తాడు. అక్కడ ఉన్న శకుంతల దుష్యంతునితో "మా నాన్న గారు పళ్ళు తీసుకురావటానికి అడవికి వెళ్ళారు. మీరు వచ్చినట్లు తెలిస్తే వెంటనే తిరిగి వస్తారు" అని అంటుంది. కానీ కణ్వమహర్షి ఈ రోజు వీరిద్దరు కలవాలని రాసివుందని అతనికి తెలుసు అందుకే వారి మధ్య అడ్డంకిగా ఉండకుండా తాను అడవికి వెళ్తాడు. అంతేగాక

Scanned by CamScanner

అడవి నుంచి వచ్చిన తరువాత ఆ విషయాలన్నీ తన దివ్యదృష్టితో చూసి, ఆమెకు ధైర్యంచెబుతాడు.

భరతుడు పుట్టిన తరువాత,

> పెద్దకాలంబు చనియె నీ ప్రియుడు వాసి
> తెఱవ యేలొకొ పిలువ బుత్తేక తడసె?
> వెఱచెనో మన్మనః ప్రీతి విధ మెఱుగక?
> మఱచెనో రాజ్యసుఖ కేళి మగ్నమతిని?"[1]

మహారాజు నిన్ను వదిలి చాలా కాలం అయింది. పెళ్లయిన తర్వాత స్త్రీ పుట్టింట్లో ఇంతకాలం ఉండటం మంచిది కాదు. నీభర్త రాజ్యవిధులలో మునిగిపోయి నిన్ను మరచి ఉంటాడు. నీవు అతని దగ్గరికి వెళ్లమని, అత్త వారింట్లో ఎలా మసులుకోవాలో శకుంతలకు హితోపదేశాలు చేస్తాడు. వారిద్దరి కలయిక ఆసన్నమయిందనే ఉద్దేశంతో వారిని కలపడానికే శకుంతలను దుష్యంతుని దగ్గరికి పంపిస్తాడు. అంతగాక శకుంతలను దుష్యంతుడు నిరాకరించినప్పుడు ఆకాశవాణి ఈమె నీ భార్య ఈమెను ఏలుకో అని పలుకుతుంది.

ఈ విధంగా శకుంతలా దుష్యంతుల కలయికలకు కణ్వమహర్షి, వారి పునః కలయికకు అశరీరవాణి సహాయపడతారు.

ఇంతేగాక రామాయణంలో సుగ్రీవుడు హనుమంతుడు సీతజాడను కనుక్కొనేందుకు రామునికి సహాయం చేస్తారు. మహాభారతంలో శ్రీకృష్ణుడు ధర్మరాజు అతని సోదరులు రాజ్యాన్ని సంపాదించేందుకు సహాయం చేస్తాడు. అంతేగాక భగవద్గీతోపదేశం చేసి, దుష్టులను శిక్షించడానికి సహాయం చేస్తాడు.

ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతీ తెలుగు కావ్యంలోనూ సహాయపాత్రలు కన్పింస్తాయి. అయితే ప్రబంధ కాలం నాటి నర్మసచివుడు, మంజువాణి, శుచిముఖిలు ప్రధానమయిన సహాయ పాత్రలుగా ప్రాచుర్యాన్ని పొందాయి.

---

1. శృంగార శాకుంతలం - పిల్లలకు పినవీరభద్రుడు, చతుర్థా శ్వాసము, 72వ పద్యం, 161వ పుట

Scanned by CamScanner

## REFERENCE :-


1. వసుచరిత్ర, రామరాజభూషణుడు
2. నవనాథ చరిత్ర - కావ్యానుశీలనము (పిహెచ్.డి సిద్ధాంత వ్యాసం).
   బాబిరెడ్డి. కె, 1991, శారద ప్రింటింగ్ ప్రెస్
3. శ్రీ వేంకటేశ్వర వైభవం (పిహెచ్.డి సిద్ధాంత వ్యాసం)
   వేదవ్యాస, 1997, వేద విశ్వవిద్యాలయం, జూబ్లీహిల్స్, హైదరాబాద్.
4. అహల్యా సంక్రందనము
   వేంకటకృష్ణప్ప నాయకుడు. సుముఖ - 2005, డిసెంబర్, ఎమెస్కో బుక్స్, విజయవాడ.
5. తెలుగు సందేశ కావ్య సమాలోచనం (పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం)
   రాజగోపాల శర్మ, బాపట్ల - సాహిత్యనికేతన్, విజయవాడ
6. ఉత్తర హరివంశం నాచన సోమన
   వ్యాఖ్యాతలు - జయరామశాస్త్రి. చదలవాడ
   వెంకట సుబ్రహ్మణ్య శర్మ. వజ్జల
   పరిష్కర్త - మృత్యుంజయరావు. జొన్నలగడ్డ
   1997, సెప్టెంబర్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.
7. ఆంధ్ర మహాభారతం, కవిత్రయం
8. ఆంధ్ర వాఙ్మయము - కృష్ణ కథ (పిహెచ్.డి సిద్ధాంత వ్యాసం)
   రామనాథ శాస్త్రి. ధారా
9. వచన భాగవతం
   వెంకటరమణయ్య. బులుసు, 1977, మార్చి, టాగూర్ పబ్లిషింగ్ హౌస్
10. ఆంధ్ర మహాభాగవతం (దశమ స్కంధం), పోతన
11. ప్రభావతీ ప్రద్యుమ్నము
    సూరన. పింగళి, 1997, నవంబర్, ఎమెస్కో బుక్స్, విజయవాడ.
12. శృంగార నైషధం
    శ్రీనాథుడు, 2006, జనవరి, ఎమెస్కో బుక్స్, విజయవాడ.
13. తెలుగు కావ్యమాల
    సంకలనం, వేంకటేశ్వరరావు. కాటూరి
14. విజయవిలాసం (సుభద్రార్జునులు)
    వేంకట కవి. చేమకూర
15. రాధికా సాంత్వనము (ఇళాదేవీయము)
    ముద్దుపళని, 1997, నవంబర్, ఎమెస్కో బుక్స్, విజయవాడ.


Scanned by CamScanner

16. శంగార శాకుంతలం

పినవీరభద్రుడు. పిల్లలమర్రి, 1997, నవంబర్, ఎమెస్కో బుక్స్, విజయవాడ.

17. కావ్యాలంకార సంగ్రహం, రామరాజభూషణుడు

వివరణ కర్త - సూర్యనారాయణ శాస్త్రి. సన్నిధానం

1976, జూలై, ఎమ్. శేషాచలం & కంపెనీ, మద్రాసు, సికింద్రాబాద్.

18. సాహిత్య సోపానములు

వేంకటావధాని. దివాకర్ల, 1966, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్.

19. భారతీయ సాహిత్య శాస్త్రం - భిన్న సాంప్రదాయాలు, దృక్పథాలు

రామకోటి శాస్త్రి. కేతవరపు

Scanned by CamScanner

ज्ञान - विज्ञानं विमुक्तये

తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీ వేంకటేశ్వర ఆర్ట్సు కళాశాల, తిరుపతి

(Accredited with "A" Grade by NAAC)

తెలుగు విభాగము

## రాసాని రచనలు - సమాలోచన. యు.జి.సి. జాతీయ సదస్సు

10, 11 తేదీలు నవంబరు - 2014

## ధ్రువ పత్రం

ఆచార్య / డా॥/ ~~శ్రీ~~ /శ్రీమతి/కుమారి ...ఎమ్. రమ్య జ్యోతి...

గారు రెండు రోజుల జాతీయ సదస్సులో పాల్గొని ...రాసాని కథల్లో గిరిజన జీవిత...

...చిత్రణ... అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించారు.

10/11/14

డా॥ ఎన్. భీమన్న
సదస్సు సంచాలకులు

డా॥ ఎం.డి. క్రిస్టోఫర్
కళాశాల అధ్యక్షులు

Scanned by CamScanner

# రాసాని కథలు – గిరిజన జీవిత చిత్రణ

యు. రమ్యజ్యోతి
తెలుగు అధ్యాపకులు
ఎస్.జి. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల
పీలేరు.

రాయలసీమ కరువు నేపథ్యాన్ని ప్రధాన ఇతివృత్తంగా స్వీకరించి, అద్భుతమయిన రచనలు చేసిన కవి, రచయిత, నటుడు, ప్రయోక్త డా॥ వి.ఆర్. రాసానిగారు. చిత్తూరు మాండలికంలో రచనలు చేసి, పల్లెపదాలకు వ్యాప్తిని కలిగించారు. తన రచనల ద్వారా వివిధ కులాల, తెగల జీవితాన్ని స్పృశించి, వారి జీవితాలను సమాజానికి పరిచయం చేశారు. ముఖ్యంగా సంచార జాతుల అలవాట్లను, ఆహార్యాన్ని, వృత్తులను, భాషను, వారి దయనీయమయిన బ్రతుకుల్ని సజీవంగా తన రచనల్లో చిత్రించారు రాసాని గారు. నేటి తరం ప్రాంతీయ రచయితల్లో ముందుగా చెప్పుకోవాల్సిన పేరు వి.ఆర్. రాసాని.

ప్రపంచీకరణ ప్రభావంతో అతలాకుతలమవుతున్న పేదవారి బ్రతుకు పోరాటమే రాసాని గారి రచనల్లోని ముఖ్యవస్తువు. ఆధునిక నాగరిక పద్ధతులను అందుకోలేక, కులవృత్తులను వదులుకోలేక బడుగువారు పడే ఆవేదనే ఇతని రచనల్లోని ప్రధానాంశం. రాసాని గారి కథల్లో దాదాపుగా పేదవాడే నాయకుడు. ప్రపంచీకరణ ప్రభావం వల్ల, అటవీ సంరక్షణ చట్టాల వల్ల అంతరించిపోతున్న కులవృత్తుల గురించి, పేదవారి ఆకలి పోరాటాన్ని గురించి తన రచనల్లో ప్రధానంగా చిత్రించారు. అందుకే మునిపల్లె రాజుగారు "పేదరిక జీవితాలను Badge గా చొక్కాకు తగిలించుకొన్నవాడు"[1] అని రాసాని గారి గురించి పేర్కొన్నారు.

"సంచార జాతుల సంక్షుభిత జీవగతుల్ని, యాచక జాతుల యాతనామయ దైనందిన బతుకుల్ని చిత్రించటం, అత్యంత వేగంగా తారుమారు అవుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ జీవన పద్ధతుల నేపథ్యంలో రాసాని నిర్వహిస్తున్న పాత్ర ఒక చారిత్రక బాధ్యతగా భావిస్తారని"[2] రాసాని రచనల్ని, రచనా విధానాన్ని విశ్లేషించారు మునిపల్లె రాజుగారు. అందుకే పయనం, మెరవాణి మొ॥న కథా సంపుటాల్లో గల కథల్లో రాసానిగారు చిత్రించిన గిరిజన జీవితాల్ని ఈ వ్యాసంలో విశ్లేషించదలచాను.

---

1. ఈ పయనం జీవితం నుండి సాహిత్యానికి – ప్రస్థానం కథల సంపుటి (ముందుమాట) పుట సంఖ్య - VI
2. ఈ పయనం జీవితం నుండి సాహిత్యానికి – ప్రస్థానం కథల సంపుటి (ముందుమాట) పుట సంఖ్య - V



Scanned by CamScanner

**రాసాని కథల్లో గిరిజన జీవిత చిత్రణః**

తెలుగు కథల్లో గిరిజన జీవితాన్ని చిత్రించిన మొదటి కథ చింతా దీక్షితులు గారి 'సుగాలీ కుటుంబం' అనే మాట వ్యాప్తిలో ఉంది. కానీ ఆయన కంటే ముందే 1932, భారతి సంచికలో గూడూరు రాజేంద్రరావు అనే రచయిత రాసిన 'చెంచి' అనే కథ ముద్రింపబడింది. ఇదే మొదటి గిరిజన కథ అని జయధీర్ తిరుమలరావు గారు పేర్కొన్నారు. తెలుగు సాహిత్యంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలోని సంచార జీవులపై వచ్చిన కథలు చాలా తక్కువ. వి.ఆర్.రాసాని వంటి రచయితలు ఆ లోటును భర్తీ చేస్తున్నారని చెప్పవచ్చు.

**1. వేట :** వేట కథలో వెంకటస్వామి, పెద్దగంగి, కిట్టప్ప ప్రధాన పాత్రలు. వీరు యానాది కులానికి చెందినవారు. కరువు వల్ల, అటవీ సంరక్షణా చట్టాల వల్ల వీరి కులవృత్తి అయిన వేట నిషేధింపబడుతుంది. తిండిలేక వెంకటస్వామి కుటుంబం పేదరికంలో అలమటిస్తూ వుంటుంది. వెంకటస్వామి కూతురు శాంతమ్మ భాకారాపేటలోని ఒక స్కూలు టీచరు ఇంట్లో పనిమనిషిగా చేసేది. కానీ యానాది వారు అనే కారణంగా ఆ పని కూడా పోతుంది. ఒకనాడు రోడ్డు వెడల్పు చేయడంలో భాగంగా వారి గుడిసె నేలమట్టం అవుతుంది, దీంతో కూడు, గూడు లేక వీరు నిరాశ్రయిలవటం ఈ కథలోని ఇతివృత్తం.

ఆధునిక నాగరికత, అటవీ సంరక్షణ చట్టాల వల్ల యానాది వారి కులవృత్తి అయిన వేట నిషేధమవ్వడం, ఉసుళ్ళనే పంచభక్ష పరమాన్నాలుగా భావించే గిరిజనుల ఆకలి ఆక్రందన ఈ కథలో మనకు కన్పిస్తుంది. చిన్న, చిన్న పుట్టల్లో వుండే పురుగులు ఉసుళ్ళుగా మారే విధానం, ఆ పురుగులను ఉసుళ్ళుగా మార్చే యానాది వారి నైపుణ్యాన్ని ఈ కథలో చిత్రించారు రచయిత. అంతేకాకుండా ఊడతల్ని పట్టే పద్ధతిని పిచ్చుకుంట్లోళ్ళు కాకులను వేటాడే పద్ధతిని వర్ణించారు. పట్టణీకరణ ప్రభావం వల్ల వారి జీవితాలు ఎలా అతలాకుతలమయ్యాయో వివరించే కథ వేట. ఆర్థికంగానే కాకుండా, కులం వల్ల కూడా బాధపడే గిరిజనుల ఆవేదనకు ప్రతిబింబమే 'వేట' కథ.

**2. పయనంః** 'పయనం' నామసార్థక్యం గల కథ. ఈ కథ నక్కలోళ్ళను ప్రధానంగా చేసుకుని రాయబడింది. ప్రధాన పాత్రలయిన అజ్జప్ప, గంగజ్జల సంభాషణల ద్వారా పాఠకుడికి కథ అర్థమవుతుంది. అడువుల్లో ఎక్కడ నీళ్ళుంటే అక్కడ గుడారాలేసుకుని, జంతువుల్ని వేటాడి తింటూ, ఆ చుట్టుపక్కల పల్లెల్లో పిన్నీసులు, పూసల దండలు అమ్మి, ఆ సంపాదనతో బ్రతికీడ్చే వాళ్ళు నక్కలోళ్లు. కానీ కరువు వల్ల ఎక్కడా నీటి జాడ



Scanned by CamScanner

తెలియక, జంతువుల్ని వేటాడలేక ఫారెస్టు ఆఫీసర్ల ఆధిపత్యం వల్ల వీరు జీవితాలను ఎలా గడుపుతున్నారో తెలిపే కథ పయనం.

నక్కల్ని, తోడేళ్ళను వేటాడే విధానాన్ని రచయిత వర్ణించిన తీరు అద్భుతం. అడవిలో ఏ పక్షి ఎలా, ఎందుకు, ఎప్పుడు అరుస్తుందో, ఏ పొదల, తుప్పల చాటున ఏముందో వీరికి తెలుసునని, నక్కలోళ్ళ వృత్తి నైపుణ్యాన్ని వర్ణించారు. ఫారెస్టు అధికారులు నక్కలోళ్ళ దగ్గర వుండే తుపాకీకి లైసెన్సు లేదనే కారణంతో వారిపై నక్సలైట్లనే ముద్ర వేసే తీరును, గిరిజన స్త్రీలను లైంగికంగా హింసించే తీరును ఈ కథలో ఎండగట్టారు. "అడవిలో జంతువులు నాశనమైపోతున్నాయని తరిమేస్తున్నారే గానీ, అడవులపైన బడి బతికే మా బతుకులు ఏమైపోతాయోనన్న యోచన ఒగనికీ లే. జంతువుల కంటే కనా కష్టమై పోయుండాది మా బతుకులు"[3] అంటూ గిరిజనుల ఆవేదనను, వారి ప్రతినిధేమో అన్నట్లుగా మన ముందుంచారు రాసానిగారు. అంతేగాక సుంకిపాత్ర ద్వారా గిరిజన స్త్రీలలో వుండే చైతన్యాన్ని చూపించారు.

**3. నేరం:** నేరం కథలో చంద్రానాయక్ పాత్ర ద్వారా సమాజంలో గిరిజనులు ఆర్థికంగా ఎంత అట్టడుగున్న ఉన్నారో, పేదరికాన్ని జయించటానికి ఎంత పోరాటం చేస్తున్నారో తెలుస్తుంది. చంద్రానాయక్ అక్క కొడుకు జువైనల్ హోంలో ఉంటాడు. దానికి కారణం ఆకలి. తన అల్లుడికయినా మూడు పూటలా తిండిదొరుకుతుందని, ఏ నేరం చేయకున్నా సి.ఐ.ని ప్రార్థించి, అతన్ని జువైనల్ హోంలో ఉంచుతాడు చంద్రానాయక్. ప్రతీ మనిషీ శిక్షగా భావించే జైలే వారికి రక్షణశాల అని భావిస్తున్నారంటే గిరిజనుల దయనీయ స్థితిని ఈ కథ ద్వారా అర్థం చేసుకోవచ్చు. గిరిజనులు సామాజికంగా కాకుండా, ఆర్థికంగా కూడా ఎలా బాధింపబడుతున్నారో తెలిపే కథ 'నేరం'.

**4. ఎన్‌కౌంటర్ :** కుల వృత్తులు నశించటంతో ప్రభుత్వం ఇచ్చే భూమిని సాగుచేసుకొని బ్రతకాలనుకునే నక్కలోళ్ళను, వారి నిరక్షరాస్యత కారణంగా ఆ భూమిని, భూమిపై ఇచ్చే సబ్సిడీ రుణాలను సంఘంలో పేరు ప్రతిష్టలున్న వ్యక్తులు ఏవిధంగా దోచుకున్నారో తెలిపే కథ ఎన్‌కౌంటర్. అగ్ర కులాల వారు పదవిగలవారు చేసే దురాక్రమాలను, అన్యాయాను ప్రతిఘటించే గిరిజనులను నక్సలైట్ల పేరుతో చంపే పోలీసుల నియంతృత్వ ధోరణిని ఈ కథ ఎండగడుతుంది. తమపై జరిగే అన్యాయాలను నిస్సహాయం తెలియచేయడం తప్ప ఏమి చేయలేని గిరిజనుల పట్ల ఎంతో సానుభూతిని పాఠకుడిలో నింపుతుంది. గిరిజనులపై జరిగే అన్యాయాలకు ఎన్ని బంద్‌లు, రాస్తారోకోలు జరిగినా, ప్రభుత్వం సహాయం చేస్తామన్నా,



Scanned by CamScanner

అవన్నీ నీటి మీద రాతలే తప్ప, పేదవారికి జరిగే మంచి ఏమీ వుండదని, వారు జీవన పోరాటం చేయాల్సిందేనని సూచనా ప్రాయంగా తెలియచేశారు రచయిత.

**5. కుబుసాలు:** 'కుబుసాలు' అనే కథలో ఇర్లోడిది ప్రధానపాత్ర. ఇతడు ఇర్లోళ్ళ కులానికి చెందినవాడు. వారి కులవృత్తి పాములు పట్టడం. అధునిక కాలంలో జంతువులను, పాములను పట్టడం చట్టరీత్యా నేరం. కాబట్టి ఇర్లోళ్ళు కులవృత్తి లేక, కరువు వల్ల పనులు దొరకక, వేషాలేసుకుని అడుక్కోవడం, ఈ పని ద్వారా కూడా సరిగ్గా కడుపునిండకపోవడం ఇందులోని ఇతివృత్తం.

ఎలుకల్ని తినటం, కల్లు తాగడం గిరిజన సంస్కృతిలో ఒక భాగమని ఈ కథ ద్వారా తెలుస్తుంది. పాతకాలంలో ఇర్లోళ్ళ కుల వృత్తి అయిన పాములు పట్టడం, వాటిని ఆడించడం ఎంత బాగా జరిగేదో, అధునికకాలంలో ఆ కులవృత్తి ఎలా అంతమవుతుందో వివరించారు. పాములు పట్టేందుకు వారు ఉపయోగించే పనిముట్లను కూడా వర్ణించారు. వీరికి పాములు ఏఏ సమయాల్లో, ఎక్కడ, ఎలా దాగి వుంటాయో బాగా తెలుసని ఇర్లోళ్ల వృత్తి నైపుణ్యాన్ని ప్రశంసించారు రచయిత. పాములు పట్టేటప్పుడు పాము కరిచినా, ఒంట్లోకి విషం ఎక్కకుండా పామేరు ముక్కను నములుతారని, దానికి సంబంధించిన కథను కూడా పేర్కొన్నారు. పాముల్ని పట్టే విధానం, వాటిని చంపిన తరువాత చర్మాన్ని వేరు చేసే విధానాన్ని అద్భుతంగా వర్ణించారు. ఈ వర్ణనలు చదివేటప్పుడు జుగుప్స కలిగించినా, అది వారి బ్రతుకు తెరువని గుర్తొచ్చినప్పుడు చదివే పాఠకుడికి ఇర్లోళ్ళ పట్ల సానుభూతి కలుగుతుంది. వారి కుల వృత్తిని నిషేధించిన వారిపై కించిత్ కోపం వస్తుంది.

**6. నల్లపూసలు:** ఈ కథలో నాంచారిది ప్రధాన పాత్ర. ఆమెకు మొదట యాదన్నతో వివాహం జరుగుతుంది. కానీ పిల్లలు పుట్టలేదని అజ్జప్పతో, అతని ద్వారా కూడా సంతానం కలగకపోవడంతో ఇంకో వ్యక్తిని మూడవ పెళ్ళి చేసుకుని, అతని ద్వారా పిల్లవాన్ని కంటుంది నాంచారి. కానీ మూడవ భర్త తన సొంతూరి స్త్రీతో సంబంధం పెట్టుకుని నాంచిరిని వదిలివేస్తాడు. వీరంతా మళ్ళీ వచ్చి నాంచారితో సంసారం సాగిస్తామంటారు. కానీ ఏ మగవాడి మనస్తత్వమయినా చంచలమయినదేనని ఎవరినీ దగ్గరికి రానీయదు నాంచారి. ఈ కథలో నాంచారిది గువ్వళోల్ల కులంగా చిత్రించారు రచయిత. వీరిది సంచార జీవితం. కుంజుపిట్లల్ని, కుందేళ్ళను, ఉడతల్ని పట్టడం, కల్లు తాగటం వీరి సంస్కృతిలో భాగమని ఈ కథ ద్వారా తెలుస్తుంది. మన ఇంటికి వచ్చే చుట్టాలకు కాఫీ, టీలు ఇచ్చినట్లుగా వీరు కల్లును ఇస్తారట. గువలోళ్ళ



Scanned by CamScanner

కులంలో మగపెళ్ళి వారు, ఆడపెళ్ళి వారికి కట్నమిచ్చే 'ఓలి' అనే ఆచారం వుందని ఈ కథ ద్వారా అర్థమవుతుంది. అయితే ఆ కట్నం డబ్బు రూపంలో కాక, వస్తువుల రూపంలో, పశువుల రూపంలో కూడా వుంటుందని తెలిపారు.

ఈ కథలో నాంచారిని బలమయిన వ్యక్తిత్వం కలిగిన గిరిజన స్త్రీగా చిత్రించారు రచయిత. సంతానం కోసం మూడు పెళ్ళిళ్ళు చేసుకుందే తప్ప, చంచలమైన స్వభావం కలిగినది కాదనీ, అందుకే తనపైన అత్యాచారం చేయబోయిన సర్పంచి గెంగినాయున్ని శారీరకంగా హింసిస్తుంది. నాంచారిపై అత్యాచారం చేసేటప్పుడు అడ్డురాని కులం, ఆమె ఊర్లో అందరి మధ్యన బ్రతుకుతుందని అడ్డొచ్చింది. అందుకే ఆమె కులం పేరు చెప్పి, వారి జీవనానికి ఇబ్బంది కలిగించే గెంగినాయుడు వంటి వారి దుర్మార్గాలను, అణగారిన కులాలపై అగ్రకులాల ఆధిపత్యాన్ని, అఘాయిత్యాలను ఒక గిరిజన స్త్రీ ఎంత ధైర్యంగా ఎదుర్కుందో ఈ కథలో చూపించారు రచయిత.

గిరిజన జాతుల మగవారి వేషధారణ, వారి మూఢనమ్మకాలు, ఎలా వుంటాయో కూడా ఈ కథ ద్వారా తెలుసుకోవచ్చు. అంతేగాక గువ్వళోల్లలో మగవారికి ఆడవారి పట్ల వుండే చులకన భావాన్ని ఆవేదనతో తెలిపారు రచయిత.

**7. నాలుగో నాటకం:** ప్రపంచీకరణ ప్రభావాన్ని నిలువనా ఎండకట్టిన కథ నాలుగో నాటకం. నాలుగో నాటకం అనే పేరు ధ్వని గర్భితమయింది. ఈ కథలో ఎలుగొడ్డోడు, ముడ్డిగంటోడు పాత్రల ద్వారా గిరిజన కళాకారులయిన భిక్షుక వృత్తివారి జీవితం ఎంత బుద్బుదప్రాయంగా వుంటుందో చూపించారు. సంచార జీవులు పొట్ట పోషించుకోవటానికి, తమ కుటుంబాలను నెలల తరబడి వదలివెళ్ళి, తిరికి వచ్చే సరికి వారి కుటుంబాలు అక్కడే వుంటాయో? వుండవో తెలియని పరిస్థితుల్లో వారి మనోవేదన ఎలా వుంటుందో కళ్ళకు కట్టినట్టుగా చూపిస్తుంది ఈ కథ. ఆధునిక యాంత్రికత ఫలితంగా బడుగుల జీవితం దిగజారుతున్న వైనాన్ని ప్రజలకు డప్పుకొట్టి చాటుతుంది. ప్రపంచీకరణ ముద్దుబిడ్డలయిన టీ.వీ.లు, సినిమాల రాకతో ప్రాచీన కళారూపాలు ఎలా అంతరించిపోతున్నాయో, వాటినే నమ్ముకుని జీవనం సాగించే కళాకారుల జీవితాలు ఎలా చిద్రమవుతున్నాయో ఈ కథ తెల్పుతుంది. బసివి పద్ధతిలా పెళ్ళికాని మగవారు మల్లేశు కుక్కలుగా మారే ఆచారం అనేది ఒకటుందని ఈ కథ ద్వారా తెలుస్తుంది. ఎలుగుబంటిని ఆడించడం కులవృత్తి ఎలా అయిందో తెలుస్తుంది. ఎలుగుబంటిని ఆడించటం కులవృత్తి ఎలా అయిందో వివరించే కథ ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. మొత్తం మీద హృదయవిదారక విషాదాంత కథ



Scanned by CamScanner

నాలుగో నాటకం అని చెప్పవచ్చు. మూడు నాటకాలు ఎలుగొడ్డొడివి, ముడ్డిగంటోడివి, గురువయ్యవి అయితే ఆ నాలుగో నాటకం వీరి జీవితాలపై పెనుముద్ర వేసిన ప్రపంచీకరణదని చెప్పవచ్చు.

**8. నిప్పు :** ప్రపంచీకరణ ప్రభావం వల్ల కరువు రక్కసి వల్ల, అటవీ సంరక్షణ చట్టాల వల్ల గిరిజనుల కులవృత్తులు అంతరించడంతో ఉదరపోషణార్థం డబ్బు సంపాందిచడానికి ఒక్కోసారి గిరిజనులు వేసే తప్పటడుగులు వారి జీవితాలను ఎలా ఛిన్నాభిన్నం చేస్తాయో వివరించే కథ నిప్పు. మసలామణి ఇర్లోళ్ళ కులానికి చెందినవాడు. తిరుమల కొండపై పూసలు, దారాలు అమ్ముకుంటూ చాలీ, చాలని ఆర్జనతో కుటుంబాన్ని నెట్టుకొస్తున్న మసలామణి తన బంధువయిన సత్యవేలు చేసే గంధపు చెక్కల స్మగ్లింగ్ ముఠాలో చేరుతాడు. కానీ ఆ ముఠాకు వేరే కొత్త ముఠా పోటీ రావడంతో ఓర్చుకోలేని సత్యవేలు ఎర్రచందనం తన శత్రుముఠా పాలు అవటం, ఇష్టం లేక తిరుమల కొండకు నాలుగువైపులా నిప్పంటిస్తాడు. ఈ క్రమంలో కొండమీద వుండే తన భార్య, బిడ్డలు అతనికి దూరమయిపోతారు.

దురాశ దుఃఖానికి చేటు అనే సూక్తి ఈ కథ ద్వారా మరొకసారి ఋజువయింది. వ్యక్తులు తమ స్వార్థప్రయోజనాలకోసం చేసే పనుల వల్ల ప్రకృతికి, సమాజానికి ఎంత చేటు తెస్తుందో తెలిపే కథ నిప్పు.

**9. అదృశ్య విధ్వంసం:** ప్రపంచీకరణ సంతానమయిన టీవీలు, సినిమాల ప్రభావం వల్ల కులవృత్తులు ఎలా అంతరించిపోతున్నాయో, వాటినే నమ్ముకున్న వారి బ్రతుకులను ఎంతగా ఛిద్రం చేస్తున్నాయో వివరించే కథ అదృశ్యవిధ్వంసం. పేదవారి జీవితాల్లో పెనుచీకటిని సృష్టించే ప్రపంచీకరణే ఈ కథలో రచయిత తెలిపిన అదృశ్య విధ్వంసం. పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటంలా దొమ్మరివాళ్ల విన్యాసాలు చూసేవారికి వినోదానిస్తాయికానీ వారి ప్రాణాలకు అవి ఎంత ప్రమాదకరమయినవో తెలిపే కథ అదృశ్య విధ్వంసం కులవృత్తుల్ని నమ్ముకుంటే కడుపునిండదని తెలిసినా, అది తప్ప వేరే పని తెలియని అమాయక సంచారజీవులయిన దొమ్మరోళ్ళ జీవితమే ఈ కథలోని వస్తువు. దొమ్మరి వాళ్ళ ఆటలు, విన్యాసాలు ఎంత కఠినంగా, ఒళ్ళు గగుర్పొడిచే విధంగా వుంటాయో, ఆ విన్యాసాలు చేయడం వెనుక ఎంత దయనీయమయిన, దుర్భరమయిన, ఆకలి వుంటుందో తెలిపే కథ ఇది. సంచార జీవుల బాధమయమయిన జీవితాన్ని ఈ కథలో చిత్రించారు రచయిత. ఆకలిని జయించటానికి వీరు చేసే సాహస విన్యాసాలు చూసే ప్రేక్షకుడికి సానుభూతిని కలిగిస్తాయో లేదో కానీ, వారి విన్యాసాలను రచయిత వర్ణించిన తీరుకు మాత్రం పాఠకుడికి దొమ్మరి వాళ్ళపట్ల సానుభూతి కలుగుతుంది. మనసు ఆర్ద్రమవుతుంది. రచయితే దొమ్మరివాళ్ళ జీవితాల్లోకి పరకాయ ప్రవేశం చేసినట్లుగా పాఠకుడు అనుభూతి చెందుతాడు.



Scanned by CamScanner

పై కథల్లో రాసానిగారు చిత్రించిన గిరిజన తెగలను, వృత్తులను ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

**గిరిజన తెగలు**

1. యానాది
2. గువ్వలోళ్ళు
3. ఇర్లోళ్ళు
4. పిచ్చకుంట్లోళ్ళు
5. నక్కలోళ్ళు
6. దొమ్మరోళ్ళు
7. భిక్షుక తెగవారు

**వృత్తులు**

1. తోడేళ్ళను, నక్కలను పట్టటం
2. కంజుపిట్టల్ని, కుందేళ్ళను వేటాడి, అమ్మటం.
3. తాటిబుట్టలు, ఈతాకుబొమ్మలు, పూసలు, దారాలు అమ్మటం.
4. ఉడుతల్ని పట్టడం, ఎలుకల్ని పట్టటం.
5. కాకుల్ని వేటాడటం
6. భిక్షమెత్తుకోవటం
7. పాముల్ని పట్టడం
8. ఇసుళ్లను పట్టుకొని, వేయించి అమ్ముకోవటం
9. దొమ్మరాట
10. వ్యవసాయం
11. భిక్షుక వేషాలేయటం.

మాండలిక భాష రాసానిగారి కథలకు అదనపు ఆకర్షణ. రాయలసీమలోని జీవించే గిరిజనుల వేష భాషలను గురించి, వారి వృత్తులను గురించి, వివిధ రకాల చెట్ల పేర్లను గురించి, చిత్తూరు జిల్లాలోని చిన్న, చిన్న గ్రామీణ ఊర్లపేర్లను గురించి, చిత్తూరు మాండలిక భాషను గురించిన విస్తృతమైన సమాచారం వీరి కథల ద్వారా లభిస్తుంది. రాసానిగారి కథల్ని చదివేటప్పుడు పాఠకుడే కథలలో చిత్రించిన పాత్రల కష్టాలను పడుతున్నాడేమో అనే అనుభూతి చెందేలా వీరి కథలు ఉంటాయి.

సాధారణంగా కథలు సుఖాంతం అవటం భారతీయ నాటక/ కావ్య లక్షణం. కానీ రాసానిగారి కథలు దాదాపుగా దుఃఖాంతాలని చెప్పవచ్చు. కారణం రచయిత చూసిన వాస్తవిక జీవితం, దుఃఖమయమయిన వస్తువును కూడా ఏది ఏమైనా సుఖాంతం చేయాలనే భావన దగ్గరికి రానీయలేదు. గిరిజనుల జీవితాలను ఉన్నది ఉన్నట్లుగా మన ముందుంచాలనుకోవటం దానికి కారణమయి వుంటుంది. అందుకే రాసాని గారి కథలు అభూత కల్పనలకు అతీతంగా వుంటాయని ధృడంగా చెప్పవచ్చు.



Scanned by CamScanner

భారతీయ ఆలంకారికులు

"రమ్యం జుగుప్సితం ముదారమదాపినీచం

ఉగ్రం ప్రసాది గహనం వికృతంచ వస్తు

యద్వాప వస్తు కవి భావయంః భావ్యమానం" అని పేర్కొన్నారు.

అంటే అందమైనదైన, జుగుప్సితమైనదైన, నీచమైనదైన, ఉగ్రమైనదైన, ప్రసన్నమైనదైన, వికృతమైనదైన అసలు వస్తువైనా, కాకపోయినా కవి దేనినీ స్పృశించినా సరే అది రసస్ఫూర్తితో ప్రకాశిస్తుందని ఆలంకారికుల అభిప్రాయం. రాసాని గారు కూడా అలాంటి కవే. అందుకే సంచార జీవుల జీవితాన్ని కూడా రస పోషణతో చిత్రించారు. నక్కల్ని, తోడేళ్ళను, కుందేళ్ళను, కంజు పిట్టలను, గుడ్లగూబలను, కాకులను, పాములను మొదలైన వాటిని వేటాడటాన్ని కూడా రసస్ఫూర్తితో వర్ణించారు. అట్టడుగు వారు జీవితాల్లో శోభ లేశమాత్రమైనా రావాలని తపించిన పీడిత వర్గాల రచయిత రాసాని.

Scanned by CamScanner

## ఆధార గ్రంథాలు


1. మల్లయ్య కాలువ, "నూట పదేళ్ళ తెలుగు కథ – విభిన్న ధోరణులు", తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2012.
2. రాంబాబు వేదగిరి, "తెలుగు కథానిక", పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణలు, హైదరాబాద్, 2012.
3. వెంకట రామయ్య రాసాని, "పయనం" కథల సంపుటి, విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్, 2007.
4. వెంకటరామయ్య రాసాని, "మెరవణి" కథల సంపుటి, స్వీయ ప్రచురణ, హైదరాబాద్, 2005
5. వెంకట రామయ్య రాసాని (సంపాదకుడు) "తెలుగు కథ – దళిత, మైనారిటీ, గిరిజన, బహుజన జీవితం "(వ్యాస సంకలనం), 2012.
6. వెంకట రామయ్య రాసాని, "నాలుగో నాటకం", ఆంధ్రజ్యోతి నవ్య వీక్లీ, మే, 2008.
7. వెంకట రామయ్య రాసాని, "నిప్పు", వార్త దినపత్రిక, అక్టోబర్, 2014.
8. వెంకట రామయ్య రాసాని, "అదృశ్య విధ్వంసం", గోదావరి త్రైమాసిక పత్రిక, నవంబర్–జనవరి, 2014.
9. వెంకట సుబ్బయ్య వల్లంపాటి, "కథా శిల్పం", విశాలాంధ్ర ప్రచురణ, హైదరాబాద్, 2008.
10. శశిశ్రీ, "రాయలసీమ సాహిత్యం", తెలుగు అకాడమీ ప్రచురణ, హైదరాబాద్, 2012.
11. శేఖర్ కోలా, "వి.ఆర్. రాసాని కథల్లో జీవవైవిధ్యం" (సాహిత్య ప్రస్థానం సంచిక), జూలై 2014.




Scanned by CamScanner